UNIVERSAL
LIBRARY
OU_206236
UNIVERSAL
LIBRARY

)UP—901—26-3-70—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. 923.2 Accession No. T4428

Author V69V

Title వి శ్వ రూ ప ము

This book should be returned on or before the date last marked below.

గీతా ప్రవచనములు

*

గ్రంథకర్త :
ఆచార్య వినోబా భావే

అనువాదకర్త :
డాక్టరు వెంపటి సూర్యనారాయణ

*

ప్రచురణకర్తలు
గ్రామసేనామండలి,
వార్ధా

1944

మూల్యము
రు. 0-4-0
క్యాలికో 0-8-0

प्रस्तावना

गीता-प्रवचन के तेलुगू अनुवाद की दूसरी आवृत्ती प्रकाशित हो रही है, यह खुशी की बात है। वास्तव में यह नया ही अनुवाद है। मेरे सूचनानुसार भाई सूर्यनारायण ने यह परिश्रम किया। इस अनुवाद में केवल हिंदी अनुवाद पर आधार नहीं रखा है। बल्कि मूल मराठी से भी मिला लिया है। सूर्यनारायण केलिये यह केवल एक प्रेम-कार्य था।

इधर हिंदी प्रदेश में भूदान-यज्ञ का बीज लोक हृदय में बोने का काम गीता प्रवचन ने किया और उसकी हजारों प्रतियाँ गाँव गाँव पहुंचीं। मुझे उम्मीद है कि आंध्र देश में भी यही अनुभव आयेगा और इससे व्यक्तिगत, और सामाजिक चित्त-शुध्धीमें मदद मिलेगी। मैं चाहता हूँ कि विशाल आंध्र के हर गाँव में इसका श्रवण, पठन, चिंतन चले। जहाँ यह चलेगा —.

"तत्र श्रीर् विजयो भूतिर् ध्रुवा नीतिर् मतिर् मम"

ప్రస్తావన

'గీతా ప్రవచనము' యొక్క అనుగ్రానువాదము మీకు చెండవహాగ్ను జగుగుచున్నది. ఇది సంతోషకర మైనవిషయము. వాస్తవమున కీది సంతానానువాద మే! నా సూచన ననుసరించి పోదగుము సూర్యనారాయణ యీ పరిశ్రమ చేసెను.

ఈ యనువాదమునట్లు కేవలము హిందీ యనువాద ముపై ఆధారపడక మనరాష్ట్ర మూలముతో సరి పోల్చి సవరణలు జరిగినది. ఇది సూర్యనారాయణ కొక ప్రయోజనమైన పని.

ఇటీవల హిందీ ప్రాంతమునందలి ప్రజల హృదయ ములలో భూదాన యజ్ఞవిజయము నాపుటకు "గీతా ప్రవచనము" సాయపడెను. దీని ప్రతులు వేలకు వేలు గ్రామగ్రామములను ప్రవేశించినవి. ఆంధ్రదేశము నందును ఈ యనువాదమే కలుగునని నేను నమ్మి చున్నాను. వ్యక్తిగత జీవితమునందును, సాంఘికజీవితమునందును చిత్తశుద్ధి యేర్పడుట కీ గ్రంథము తోడ్పడగలదని నా విశ్వాసము. విశాలాంధ్రలోని ప్రతి గ్రామమునందును దీని శ్రవణము, పఠనము, చింతనము జరుగుగాక యని నే నభిలషించుచున్నాను.

ఎచట నిది జరుగునో

"తత్ర శ్రీర్విజయోభూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ."

వీహారులోని చివనమజిలి,
30-03-48

విజ్ఞప్తి

౧౯౩౩ వ సంవత్సరమున సత్యాగ్రహ సమరములో పాల్గొనుట కారణముగా ఆచార్య వినోబా భావేగారు ధూళియా (ఖాందేష్‌జిల్లా–మహారాష్ట్ర ప్రాంతము) జైలులో బంధింపబడిరి. ఆ రోజులలో వారు భగవద్గీతయందలి పదునెనిమిది అధ్యాయములనుగూర్చి వారమున కొక యుపన్యాసము కావించిరి.

ఆ యుపన్యాసములను సుప్రసిద్ధ దేశభక్తుడు, గ్రంథకర్త అయిన సానేగురూజీ ఎప్పటికప్పుడు మహారాష్ట్రభాషలో వ్రాసి శ్రీ వినోబాకు చూపుచుండెను. శ్రీ వినోబాభావే ఆమోదముతో ఆ యుపన్యాస పరంపర మొట్టమొదట మహారాష్ట్రభాషలో 'గీతా ప్రవచనము' అనుపేర గ్రంథరూపమున ప్రచురితమై అఖండగౌరవమును సంపాదించుకొనెను. ఈ గ్రంథము అమూల్యములైన విషయములతో సరసములైన ఉదాహరణములతో అలరారుచున్నది. శ్రీ వినోబాగారి జ్ఞానభాండారము, తపస్సు, కర్మాచరణ త్రివేణీసంగమమువలె ఇందు గోచరించును.

ఈ గ్రంథరాజము ఇప్పటికి మహారాష్ట్రభాషలోనే కాక గుజరాతి, హిందీ, అఱవము, మళయాళము, సింధి మొదలగు భాషలలో సైతము తర్జుమా చేయబడినది. దీని ప్రతులు బహుభాషలలో నేలకునేలు ఖర్చుగుచు, లక్షలకొలది ప్రజలకు జ్ఞానభిక్ష పెట్టి శాంతి సుఖములను చేకూర్చుచున్నవి.

నేను పూజ్య వినోబాజీని ౧౯౩౬ వ సంవత్సరమున ప్రప్రథమమున దర్శించితిని. వారి ఆశీర్వాదబలముతో నా

జీవితయాత్ర సాగుచున్నది. ఉనాటి కానాసువారి యెడలనాభక్తి ప్రపత్తులు వృద్ధిచెందుచున్నవి. వారి సలహాపై నేను హిందీ "గీతా ప్రవచనము"ను చదివి అపరిమితానందమును పొందితిని. తరువాత ప్రతిదినము సాయంసంధ్యా సమయమున నియతముగా "గీతా ప్రవచనము" గ్రంథము చదివి దాని భావమును తోటి ప్రజలకు వినిపించితిని. ఇట్లు పరమోత్సాహముతో గ్రంథము తియు అయిదాగు పర్యాయములు పఠించి వివరించితిని.

ఇంతలో పూజ్యవినోబాజీ హిందీ గీతా ప్రవచనమును యథాతథముగా ఆంధ్రీకరించు బాధ్యత నాపైనిజిది. ఈ బాధ్యతను నిర్వహించుటలో ఉత్సాహపరిచిన శ్రీ తల్లా ప్రగడ ప్రకాశరాయుడుగారు నా యంతో సహకరించిరి. వీరి సాయమును నేను ముందుమాటలలో వర్ణించియున్నాను. నేను అనుదిన ప్రార్థనలో తెలిగించి వినిపించు భాగమును వీరు శ్రద్ధతో వినుచు వ్రాయుచుండిరి. ఈ విధముగా వ్రాసిన భాగమును మే మిరువురము హిందీపుస్తకముయొక్క ఆధారముతో సరిచూచుచుంటిమి. అక్కడక్కడ మహారాష్ట్ర మూలముయొక్క సాహాయ్యముకూడ తీసికొంటిమి. ఈ విధముగా గ్రంథమును తయారుచేయుటలో హృదయపూర్వకముగా తోడ్పడిన సోదరులు శ్రీ ప్రకాశరాయుడుగారికి నాకృతజ్ఞతాపూర్వక వందనములు సమర్పించుచున్నాను.

ఈ గ్రంథమును ముద్రింపబూనినపుడు దీనిని శాస్త్రీయ దృష్టితో పరిశీలింపుడని మా మిత్రులు శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారిని కోరితిని. వారు అత్యంతానురాగ

ముతో నా కోరికను పాటించి యీ కార్యమును సమగ్రముగా నిర్వహించిరి.

లాక్షణికములగు ప్రమాదములను తొలగించుటకే కాక, భావసారళ్యమునకును వీరెంతో శ్రమించి యీ రచనకు వన్నె పెట్టిరి. మఱియు ప్రూఫులుదిద్దుటకు సైతము వీరు తమ సమయమును వెచ్చించి యింకు ముద్రణదోషములు వాటిల్ల కుండునట్లు తోడ్పడిరి. వీరికిని నా కృతజ్ఞతాపూర్వక వంద నములు సమర్పించుచున్నాను.

మఱియు స్వల్పలాభముతో కాగితమును పంపిన శ్రీ శ్రీ సాద రామయ్య కంపెనీ (కాకినాడ) వారికిని, మొదటి నుండి చివరవరకు ప్రత్యేక శ్రద్ధ చూపి యీ గ్రంథమును సుందరముగా ముద్రించిన భారతీ ముద్రణాలయము వారికిని, ఈ కృతి ఈ రూపములో వెలువడుటకు సర్వవిధముల సహాయపడిన మిత్రులందరకును నా వందనములు.

హిందీకృతిలో విషయక్రమము గ్రంథము మొదటను, ప్రకరణ విషయానుక్రమణిక చివరను కలవు. గ్రంథములో ప్రకరణ సంఖ్యామాత్రము ఈయబడినది. ఈ "గీతా ప్రవచనములు"లో విషయక్రమము, ప్రకరణ విషయానుక్రమణిక మొదటనే ముద్రింపబడినవి. ప్రతి-అధ్యాయము క్రిందను ప్రకరణ విషయానుక్రమణిక యున్నచో అది చదువరులకు చాల నుపకరించునని ఇట్లు చేసితిని. గ్రంథములో ప్రతి ప్రకరణము మొదటను సంఖ్యతోపాటు విషయానుక్రమణిక పేరుగూడ చేర్చితిని. ఈ గ్రంథములో అమూల్యములయిన చర్చలు, ఉదాహరణములు అనేకములు గలవు. అవసర

మయినప్పుడు పాఠకులు వానిని సుకరముగా చూచుకొని
నాసిన ప్రయోజనము పొందుటకు వాని అనుక్రమణిక తయారు
చేసి గ్రంథమునివరి అచ్చువేయించితిని.

సర్వోదయ ప్రచారమునకు ఈ గ్రంథము మిక్కిలి
తోడ్పడగలదు. సర్వోదయ ప్రచారమునకును, నేడు భూదాన
వినోబాజీ నిర్వహించుచున్న భూదాన సంపత్తిదాన శ్రమ
దాన యజ్ఞములకును సన్నిహిత సంబంధము కలదు.

ఈ గ్రంథమును భూదాన వినోబాజీ ౧౯-౧౦-౫౧ న ఆంధ్ర
దేశ భూదానయజ్ఞ పర్యటనకు నచ్చిన సమయమునకు వెలువ
రించితిని. ఇది మన తెలుగు సాహిత్యమున ఉండవలసిన
ఉత్తమ గ్రంథము. ఆంధ్ర మహాజనులెల్లరు ఈ గ్రంథమును
భక్తిశ్రద్ధలతో చదివి, చింతనచేసి దాని సుగ్రహ ప్రయోజన
మును పొందుదురుగాక యని ఆశించుచున్నాను.

తేదీ
౧౯-౧౦-౫౧

చెంపటి సూర్యనారాయణ

రెండవ కూర్పు

'గీతా ప్రవచనములు' నే సంపాదించిన కీర్తిని భూదాన
వినోబాజీ ఒకేసారి ప్రాంతమును వదలి ఆంధ్రదేశములో
ప్రవేశించినవాడు (౧-౧౦-౧౯౫౧) వానికి సమర్పించు
భాగ్యము నాకు సంప్రాప్తించినందులకు ధన్యుడను. ఈశ్వ
రానుగ్రహమువలన మొదటికూర్పు ౫౦౦౦ ప్రతులును
అయిదు వారములలోనే ఖర్చుపడినది. ఆంధ్ర మహాజనులు
ఈ గ్రంథము నెడల చూపిన ఆదరమునకు నే నెంతయు

కృతజ్ఞుడను. పూజ్య వినోబాజీ పదయాత్రలో వారివెంట ఈ పుస్తకములు లేకుండగనే పదిరోజులు గడవవలసివచ్చుట అనివార్యమైనది.

౩౫-౧౧-౫౫ నాటికి ఈ ద్వితీయ సంస్కరణము వెలువడగలందులకై తీవ్ర ప్రయత్నము చేయుచున్నాను. 'చర్చలు -ఉదాహరణములు' అను శీర్షికతో ప్రథమ సంస్కరణములో నిచ్చిన విషయములను ఈ సంస్కరణములో మఱికొంత విపులీకరించుట జరిగినది. ఇది చదువరులకు మిక్కిలి తోడ్పడునని నా యాశ. తెలుగు పెద్దలు, పిన్నలు ఈ గ్రంథము యొక్క ప్రథమ సంస్కరణము నెడల చూపిన ఆదరాభిమానములనే యీ సంస్కరణముపట్ల సైతము వెలువరింపగలరని విశ్వసింతును.

ఈ సంస్కరణమునందును మా మిత్రులు శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారు దీనికి మెఱుగులుదిద్ది నా కృషి కెంతయో ప్రోత్సాహమును కలిగించిరి. వారికి నా కృతజ్ఞతా పూర్వక వందనములు.

వెనుకటివలెనే శ్రీ శ్రీపాద రామయ్య అండు కంపెనీ వారు కోరినంతనే స్వల్ప లాభమునకు తగినంత కాగితము నిచ్చి నా కృతజ్ఞతకు పాత్రులయిరి. మఱియు వ్యవధి తక్కువ యైనను ఈ గ్రంథమున కింత సుందరముగా మరల పదివేల ప్రతులు ముద్రించి ప్రత్యేక శ్రద్ధచూపిన భారతీ ముద్రణాలయము వారికిని నా హృదయపూర్వక వందనములు.

తెనాలి
౧౯-౧౧-౫౫

ఇట్లు విన్నవించు
వెంపటి సూర్యనారాయణ

విషయసూచిక

పుట

1. ప్రస్తావరూపమైన కథ–అర్జున విషాదము

1. మహాభారతములో మధ్యభాగము ౧– ౪
2. అర్జునునికి గీతకుగల సంబంధము ౫–౧౦
3. గీతయొక్క ప్రయోజనము : స్వధర్మ విరోధియగు మోహమును నిరాకరించుట ౧౧–౧౫
4. బుజ్జిబుద్ధి గలవాడే యధికారి ౧౫–౧౬

2. ఉపదేశసారము – ఆత్మజ్ఞానము, సమత్వ బుద్ధి

5. గీతయొక్క పరిభాష ౧౭–౨౦
6. జీవన సిద్ధాంతము, దేహముతో స్వధర్మాచరణ ౨౦–౨౨
7. జీవన సిద్ధాంతము, దేహాతీతమైన ఆత్మజ్ఞానము ౨౩–౩౦
8. పై రెండు సిద్ధాంతములకును సామరస్యమును సాధించు యుక్తి : ఫలత్యాగము ౩౦–౩౫
9. ఫలత్యాగమునకు రెండుదాహరణములు ౩౬–౪౦
10 ఆదర్శ గురుమూర్తి ౪౦–౪౪

3. కర్మయోగము

11. ఫలత్యాగికి ఫలము లనంతముగ లభించును ౪౫–౫౩
12. కర్మయోగమువలని వివిధప్రయోజనములు ౫౩–౫౯
13. కర్మయోగ వ్రతమున కంతరాయములు ౫౯–౬౧

4. కర్మయోగమునకు సహకరించుసాధనము – వికర్మ

14. కర్మకు వికర్మయొక్క సహకారము కావలెను ౬౨–౬౫
15. కర్మవికర్మల సంయోగము వలన భగ్నన మండు జ్వాలయే అకర్మ ౬౬–౭౨
16. అకర్మయనుకళ్ళెమొట్టిదో మహాత్ముల నడుగ వలెను ౭౨– ౭౪

5. అకర్మావస్థ రెండువిధములు : యోగము, సంన్యాసము

17. బాహ్యకర్మ మనస్సునకు అడ్డము ౭౫– ౮౦

18. అకర్మదశయొక్క స్వరూపము ౪౦-౪౬
19. అకర్మయొక్క ఒకవైపు సంన్యాసము ౪౬-౪౯
20. అకర్మయొక్క రెండవవైపు యోగము ౪౯-౬౨
21. రెంటిని పోల్చుట భూమకతీతమైన పని ౬౩-౬౫
22. భూమితిశాస్త్రము - మీమాంసకు లిచ్చిన దృష్టాంతములు ౬౫-౬౮
23. శుకజనకులవలె సంన్యాసియు యోగియు ఒక్కడే ౬౮-౧౦౩
24. అయినను సంన్యాసముకంటె కర్మయోగమే శ్రేష్ఠమని తలంపబడుచున్నది ౧౦౩-౧౦౮

6. చిత్తవృత్తి నిరోధము
25. ఆత్మోద్ధరణకై ఆకాంక్ష ౧౦౯-౧౧౩
26. చిత్తైకాగ్రత ౧౧౪-౧౧౬
27. ఏకాగ్రత సాధించుట యెట్లు? ౧౧౭-౧౨౨
28. మిత జీవనము ౧౨౩-౧౨౪
29. శుభదృష్టి ౧౨౪-౧౩౦
30. బాలకుడు - గురువు ౧౩౦-౧౩౨
31. అభ్యాసము, వైరాగ్యము, శ్రద్ధ ౧౩౨-౧౩౪

7. ప్రపత్తియోగము - లేక - శరణాగతి
32. భక్తియొక్క భవ్యదర్శనము ౧౩౫-౧౪౦
33. భక్తినుండి విశుద్ధమైన ఆనందము లభించును ౧౪౦-౧౪౫
34. సకామభక్తియు విలువగలదే! ౧౪౫-౧౫౧
35. నిష్కామభక్తియొక్క రూపములు-పూర్ణత్వము ౧౫౨-౧౫౪

8. ప్రయాణ సాధన : సాతత్యయోగము
36. శుభసంస్కార సంచయము ౧౫౫-౧౫౯
37. మరణము స్మరణయందుండుగాక ౧౫౯-౧౬౭
38. మరణ స్మరణ మనలను సదా అంటి యుండునుగాక ! ౧౬౭-౧౭౧
39. సర్వదా యుద్ధప్రసంగము ౧౭౧-౧౭౩
40. శుక్ల కృష్ణ గతి ౧౭౩-౧౭౫

9. మానవ సేవారూపమైన రాజవిద్య : ఆత్మ సమర్పణయోగము

41. ప్రత్యక్షానుభవసిద్ధమైన విద్య ౧౭౬-౧౭౯
42. సరళ మార్గము ౧౭౯-౧౮౩
43. అధికారి యగునా కాడా యను తగవులేదు ౧౮౩-౧౮౬
44. కర్మఫలమును భగవంతుని కర్పింపుము ౧౮౬-౧౯౦
45 విశిష్ట క్రియలనే అర్పించవలెనను పట్టుదల వలదు ౧౯౧-౧౯౩
46. జీవితమంతయు హరిమయము కాగలదు ౧౯౩-౨౦౩
47. పాపభయము లేదు ౨౦౩-౨౦౫
48. కొంచెమైనను మధురమే ౨౦౫-౨౦౭

10. విభూతి చింతనము

49. గీతయొక్క పూర్వార్ధముపై దృష్టి ౨౦౮-౨౧౨
50. పరమేశ్వరుని ; దర్శనమునకు సులువగు మార్గము ౨౧౩-౨౧౫
51 మానవునిలోనున్న పరమేశ్వరుడు ౨౧౬-౨౧౯
52. సృష్టిలోని పరమేశ్వరుడు ౨౧౯-౨౨౯
53. సృష్టిలోని పరమేశ్వరుడు - మరికొన్ని యుదాహరణలు ౨౨౯-౨౩౫
54. దుర్జనులలోకూడ పరమాత్మను చూచుట ౨౩౬-౨౩౭

14. విశ్వరూపదర్శనము

55. విశ్వరూపదర్శనకారకై అర్జునుని ఆరాటము ౨౩౮-౨౪౧
56. సూక్ష్మరూపములో సైతము పూర్ణదర్శనము సిద్ధించును ౨౪౨-౨౪౮
57. విరాడ్విశ్వరూపదర్శనము సుకరము సైతముకాదు ౨౪౮-౨౫౩
58. సర్వార్థ సారము ౨౫౩-౨౫౫

12. సగుణ నిర్గుణ భక్తి

59. ఆరవఅధ్యాయమునుండి పదునొకండవ అధ్యాయము వరకు : ఏకాగ్రతనుండి సమగ్రతవరకు ౨౫౬-౨౫౯

60. సగుణోపాసకుడు, నిర్గుణోపాసకుడు – తల్లి, ఇద్దరు బిడ్డలు ౨౫౯-౨౬౩
61. సగుణము సులభము సురక్షితము ౨౬౩-౨౬౮
62. నిర్గుణము కలియనిచో సగుణము కూడ దోషయుతమే ! ౨౬౮-౨౭౧
63. సగుణ నిర్గుణములు పరస్పర పూరకములు. రాముని చరిత్రనుండి దృష్టాంతము ౨౭౧-౨౭౮
64. సగుణ నిర్గుణములు పరస్పర పూరకములు. కృష్ణుని చరిత్రనుండి దృష్టాంతము ౨౭౮-౨౮౧
65. సగుణమును నిర్గుణమును ఒకటేయను విషయమున స్వానుభవములోని ఒక కథ ౨౮౧-౨౮౩
66. సగుణ నిర్గుణములు కేవలము దృష్టిభేదములే ! కావున భక్తలక్షణముల నార్జింతము గాక ! సారాంశ మిదియే. ౨౮౩-౨౮౬

13. ఆత్మానాత్మ వివేకము

67. కర్మయోగమున కుపకరించు దేహాత్మల పృథక్కరణ ౨౮౭-౨౯౧
68. సంస్కరణకు మూలాధారము ౨౯౧-౨౯౬
69. దేహశక్తితో దేహము బంధింపబడినది ౨౯౭-౩౦౧
70. తత్త్వమసి ౩౦౧-౩౦౩
71. దుండగీండ్రశక్తి అంతరించినది ౩౦౪-౩౦౬
72. పరమాత్ముని శక్తిపై విశ్వాసము ౩౦౭-౩౦౮
73. పరమాత్ముని శక్తినిగూర్చి క్రమక్రమముగ పొందు అనుభవము ౩౦౮-౩౧౬
74. నమ్రత, దంభశూన్యత మొదలగు మూల భూత జ్ఞానసాధనలు ౩౧౬-౩౨౦

14. గుణముల విస్తరణ, వానినుండి విమోచన

75. ప్రకృతి పరిశీలన ౩౨౧-౩౨౩
76. తమోగుణము – దానిని జయించుట కుపాయము శరీర పరిశ్రమ ౩౨౩-౩౨౯

77. తమోగుణమును జయించుటకు మరియొక ఉపాయము ౩౨౯-౩౩౨
78 రజోగుణము-దానిని జయించుట కుపాయము స్వధర్మమునకు కట్టువడి యుండుటయే ! ౩౩౩-౩౩౪
79. స్వధర్మ మిదియని నిశ్చయించు టెట్లు? ౩౩౪-౩౪౩
80. సత్వగుణము : దానిని వశపరచు కొను ఉపాయము ౩౪౩-౩౫౦
81. చివరి విషయము: ఆత్మజ్ఞానము దాని కాధారమైన భక్తి ౩౫౦-౩౫౭
15. పూర్ణయోగము : సర్వత్ర పురుషోత్తమ దర్శనము
82. ప్రయత్నమార్గమునుండి భక్తి వేరుకాదు. ౩౫౩-౩౫౪
83. భక్తివలన ప్రయత్నము సులువగును ౩౫౪-౩౬౧
84. సేవాత్రిపుటి : సేవ్యుడు, సేవకుడు, సేవా సాధనములు ౩౬౧-౩౬౪
85. అహంకారములేని సేవయే భక్తి ౩౬౪-౩౭౦
86. జ్ఞానలక్షణము : నేను పురుషుడను, అతడు పురుషుడు, అదియు పురుషుడే ! ౩౭౧-౩౭౬
87. సర్వవేదసారము నా చేతిలోనే యున్నది ౩౭౬-౩౭౪
16. అనుబంధము ౧ : దైవాసుర వృత్తుల సంగ్రామము
88. పురుషోత్తమయోగమునొక్క పూర్వప్రభ దైవసంపద ౩౭౯-౩౪౩
89. హింసాహింసల సేనలు ౩౪౩-౩౪౭
90. అహింసయొక్క వికాసమునకు నాలుగంచెలు ౩౪౭-౩౯౩
91. అహింసలో నొక మహాప్రయోగము మాంసాహార పరిత్యాగము ౩౯౪-౩౯౭
92. అసుర సంపదయొక్క బలిష్ఠమైన మూడు కోరికలు : సత్త, సంస్కృతి, సంపద ౩౯౭-౪౦౧

93. కామక్రోధములనుండి విముక్తికై శాస్త్రీయ సంయమ మార్గము ౪౦౧-౪౦౫

17. అనుబంధము ౩ : సాధకుని కార్యక్రమము

94. కట్టుబాటుగల నడవడి ౪౦౬-౪౦౯
95. నియమబద్ధమైన వ్యవహారమువలన మనోవృత్తి నిర్మలమగును : ఇందులకై త్రివిధ క్రియాయోగము ౪౦౯-౪౧౫
96. సాధన సాత్వికము కావలెను ౪౧౫-౪౧౮
97. ఆహార శుద్ధి ౪౧౮-౪౨౩
98. నిర్వికారజీవనమునకు గీతయిచ్చుప్రణాళిక ౪౨౩-౪౩౦
99. సమర్పణ మంత్రము ౪౩౦-౪౩౪
100. పాపమును హరించునది హరినామము ౪౩౫-౪౩౬

18. ఉపసంహారము – ఫలత్యాగము యొక్క పరిపూర్తి – ఈశ్వర ప్రసాదము

101. అర్జునుని అంతిమ ప్రశ్న ౪౩౭-౪౩౯
102. ఫలత్యాగము ఉత్కృష్టమైన ఒరపిడిరాయి ౪౩౯-౪౪౩
103. క్రియలనుండి విముక్తికి సరియగు మార్గము ౪౪౩-౪౫౦
104. సాధకుని స్వధర్మమే పరిష్కార మార్గము ౪౫౦-౪౫౩
105. ఫలత్యాగమువలన గల్గు ఫలితార్థముల సముదాయము ౪౫౪-౪౫౫
106. సాధనయొక్క తుదిమెట్టే సిద్ధి ౪౫౬-౪౫౯
107. సిద్ధపురుషునియొక్క త్రివిధ భూమిక ౪౬౦-౪౬౫
108. తుహీ... తుహీ... తుహీ... తుహీ నీవే ... నీవే ... నీవే ... నీవే ౪౬౫-౪౬౬



సవరణలకు

"చర్చలు – ఉదాహరణము"ల చివర చూడుడు.

గీతా ప్రవచనములు

మొదటి అధ్యాయము

ప్రస్తావ రూపమైన కథ - అర్జున విషాదము

1

మహాభారతములో మధ్యభాగము

ప్రియ సోదరులారా !

నేటినుండి నేను భగవద్గీతనుగూర్చి చెప్పదను. గీతకును నాకును గల సంబంధము తర్కాతీతమైనది. తల్లిపాల వలన నా శరీర మెంతగా పోషింపబడినదో, అంతకు చాల రెట్లు నాహృదయము, బుద్ధి గీతామాతయొక్క పాలతో పోషింపబడుచున్నవి. హృదయ సంబంధమున్న చోట తర్కము నకు చోటులేదు. తర్కమును వదలి శ్రద్ధ, ప్రయోగము అను రెండు రెక్కలతో నేను గీతాగగనములో యథాశక్తి విహరించుచుందును. నేను సామాన్యముగ గీతయొక్క వాతావరణములోనే యుందును. గీతయన్న నా ప్రాణతత్త్వమే. గీతనుగూర్చి నే నెవరితోనైన మాటలాడునప్పుడు గీతాసాగరముమీద ఈదుచుందును; ఒంటరిగా నున్నప్పుడు ఆ యమృతసాగరమునందు లోతున మునిగి కూర్చుందును. గీతామాత చరిత్రమును ప్రతి-ఆదివారమును నేను మీకు

వినిపించుటకు ఏర్పాటు జరిగినది. గీత మహాభారతమునం దమర్పబడి యున్నది. అది మహాభారతముయొక్క మధ్య భాగములో ఎత్తైన దీపమువలె నిలిచియున్నది; దానివెలుగు మహాభారతమున కెల్ల సోకుచున్నది. ఒకవైపున ఆరు పర్వ ములు, మరియొక వైపున పండ్రెండు పర్వములు, ఒక పక్ష మున ఏడక్షౌహిణులు, రెండవపక్షమున పదునొకొండక్షౌహి ణులు – వీని మధ్యమున గీత యుపదేశింపబడినది.

మహాభారతము, రామాయణము మన రాష్ట్రీయ గ్రంథములు. వానియందు వర్ణింపబడిన వ్యక్తులు మన జీవితములో ఏకరూపమై పోయినారు. రాముడు, సీత, ధర్మరాజు, ద్రౌపది, భీష్ముడు, హనుమంతుడు మొదలైన రామాయణ మహాభారత పాత్రల చరిత్రలవలన భారతీయుల జీవితమంతయు వేలకొలదిసంవత్సరములనుండి అభిమంత్రితమై యున్నది. ప్రపంచమునం దితర మహాకావ్యములలోని పాత్ర లీ రీతిగా ప్రజా జీవితములో కలసిపోయినట్లు కనబడదు. అందువలన రామాయణ మహాభారతములు నిస్సందేహముగ అద్భుతమైన గ్రంథములు. రామాయణ మొక మధురమైన నీతికావ్యమైనచో, మహాభారత మొక వ్యాపకమైన సామా జిక శాస్త్రము. వ్యాసదేవుడొక లక్ష సంహితలను వ్రాసి, అసంఖ్యాకములైన చిత్రములను, చరిత్రలను, ప్రవర్తనము లను మిక్కిలి కౌశలముతో యథాతథముగ చిత్రించినాడు. పరమేశ్వరుడొక్కడు తప్ప కేవలము నిర్దోషియైనవాడు ఎవ్వడును ఉండడు; ఆ విధముగనే కేవలము దోష భూయి

ష్ముడు కూడ ఈ ప్రపంచమునం దెవ్వడును ఉండడు. ఈ విషయమును మహాభారతము బాగుగ స్పష్టపరుచుచున్నది. ఇందు భీష్ముడు, ధర్మరాజు మొదలగువారి దోషములు కనుపరుపబడినట్లే, కర్ణదుర్యోధనాదుల సద్గుణములుకూడచూపబడినవి. మానవజీవితము తెలుపు నలుపు దారములతో నేయబడిన యొక వస్త్రమని మహాభారతము నిరూపించుచున్నది. వ్యాసదేవుడు నిర్లిప్తతతో ఈ మహా ప్రపంచ జీవితమును చీకటి వెలుగులతో కూడిన చిత్రముగ ప్రదర్శించినాడు. మిక్కిలి నిర్లిప్తము, ఉదాత్తము అయిన వ్యాసదేవుని గ్రంథకౌశలము వలననే మహాభారత మొక పెద్ద బంగారు గనియైనది. దీనిని శోధించి, కావలసినంత బంగారమును మనము హస్తగతము చేసికొందము గాక!

వ్యాసదేవు డింతటి మహాభారతమును రచించెను, కాని యందు తానుగ చెప్పవలసినదేమైన నుండెనా లేదా? తానేదైన ప్రత్యేక సందేశమును ఆ గ్రంథములో నెక్కడనైన నిచ్చియుండెనా? తాను గ్రంథముతో నేకరూపమైన చోనెక్కడ? ఎక్కడికక్కడ తత్త్వజ్ఞానమును, ఉపదేశములును కుప్పలుతిప్పలుగ మహాభారతములో నిండియున్నవి. ఈ తత్త్వజ్ఞానమునకును, ఉపదేశమునకును, గ్రంథమున కంతకును సారభూతమైన రహస్యమునెక్కడనైన వ్రాసెనా? ఆ వ్రాసియున్నాడు. మహాభారతమునుండి నవనీతమును తీసి దానిని వ్యాసుడు భగవద్గీతారూపమున మన కందించినాడు. గీత వ్యాసదేవుడు మనకు నేర్పిన ముఖ్యమైన గుణ

పాఠము. అది యతని చింతనయొక్క సార సంగ్రహము. దీనిని బట్టియే 'మునులలో నేను వ్యాసుడను' అను విభూతి అక్షరశః సార్థకమగుచున్నది. ప్రాచీనకాలమునుండియు గీతకు ఉపనిషత్తను పదవి లభించియున్నది. గీత ఉపనిషత్తుల కుపనిషత్తు; ఎందువల్లననగా ఉపనిషత్తు లన్నిటినుండి పిదికిన గీతాతీరమును భగవంతుడు, అర్జునుని నిమిత్తముగ జేసికొని, ప్రపంచమున కందించినాడు. జీవిత వికాసమున కవసరమైన ముఖ్యభావము లన్నియు గీతలో వచ్చివేసినవి. కావున అనుభవజ్ఞులు గీతను ధర్మజ్ఞానమునకు నిఘంటువనుట యథార్థమే! చిన్నదైనను గీత హిందూ ధర్మమున కొక ముఖ్యగ్రంథము.

గీతను శ్రీకృష్ణుడు చెప్పినాడని అందరెరిగిన విషయమే. ఈ మహాబోధనమును వినిన భక్తుడైన అర్జునుడు దీనితో నేకరూపమైనాడు. అందుచేత అతనికిగూడ 'కృష్ణుడు' అను పేరు లభించెను. భగవంతునకును, భక్తునకును హృద్గతమైన భావములను ప్రకటించుచు వ్యాసదేవుడు వారితో ఏకరూపమైనాడు. అందువలన ప్రజ లతనినికూడ కృష్ణుడనియే పిలిచినారు. చెప్పువాడు కృష్ణుడు, వినువాడు కృష్ణుడు, రచించువాడు కృష్ణుడు – ఈ విధముగ ముగ్గురిలో అద్వైత మున్నమై వా రేకరూపమును పొందిరా యన్నట్లున్నది. గీత నభ్యసించుట కిట్టి యేకాగ్రతయే అవసరము.

2

అర్జునునికి గీతకుగల సంబంధము

గీత రెండవ యధ్యాయముతో ప్రారంభమైనట్లు భావింపవలెనని కొందర మతము. రెండవ యధ్యాయములోని పదునొకొండవ శ్లోకమునుండి ప్రత్యక్షముగ ఉపదేశము ప్రారంభమగుచున్నందువలన అక్కడనుండియే గీత ఆరంభమైనట్లు ఎందులకు భావింపరాదని కొందరందురు. ఒకరు నాతో "అక్షరములలో 'అ' కారమును ఈశ్వర విభూతిగ భగవంతుడే చెప్పినాడు కదా! "అశోచ్యా నన్వశోచస్త్వం" అను శ్లోకారంభములో అప్రయత్నముగ అకారమువచ్చినది. అందువలన అక్కడనుండియే గీత ప్రారంభమైనట్లుగ భావింపవలె" నన్నారు. ఈ వాదమును మనము వదలివేసినను, ఇదే గీతారంభమనుకొనుట అనేక విధముల ఉచితము. ఐనను దాని పూర్వమందున్న ప్రస్తావమునకు కూడ మహత్త్వము ఉండనే యున్నది. అర్జును డేభూమికపై నిలిచినాడో, ఏ సిద్ధాంతమును ప్రతిపాదించుటకు గీత పుట్టినదో – ఈ విషయములను ప్రస్తావ భాగము లేనిచో మనము బాగుగ గ్రహింప లేము.

అర్జునుని విరికితనమును పోగొట్టి అతనిని యుద్ధ ప్రవృత్తుని చేయుటకొరకే గీత చెప్పబడినదని కొందరందురు. గీత కేవలము కర్మయోగమునే కాకుండ యుద్ధయోగమును కూడ ప్రతిపాదించుచున్నదని వారి మతము. కాని కొంచెము విచారించినచో ఇందలి దోషము మన కవగతము కాగలదు.

పదునెనిమిది యక్షౌహిణుల సేన పోరాటమునకు సిద్ధమై యుండెను. కాగా ఆసేనకు తగిన నాయకునిగ చేయుట కేనా భగవంతుడు గీతను అర్జునునకు బోధించినది? భయ పడిన దర్జునుడుకాని సేనకాదు. అట్లని అర్జునుని యోగ్యత కంటె సేన యోగ్యత యెక్కువదా? ఎక్కువ దనుకొనుట ఊహాతీతము. అర్జునుడు పోరాటమునకు విముఖుడగుట భయమువలనకాదు. వందలకొలది యుద్ధములలో తన శౌర్య మును ప్రదర్శించిన మహావీరు డతడు. ఉత్తర గోగ్రహణ సందర్భమున అతడొకడే భీష్మ, ద్రోణ, కర్ణాదుల నందరిని ఓడించెను. సదా విజయుడు, నరులలోనెల్ల నిజమైన నరుడు అత డొక్కడే. వీరవృత్తి యతని రోమరోమమునుండియు ఉట్టిపడుచుండును. అర్జునునకు పౌరుషము తెప్పించుట కొర కును, అతనికి ఉత్తేజము కలిగించుట కొరకును కృష్ణుడు కూడ అతనిలో విరికితనము నారోపించుచూచినాడు. కాని కృష్ణుని యీ ప్రయోగము నిరుపయోగమయ్యెను. అందుచేత నితర హేతువాదములను ప్రయోగించి జ్ఞానవిజ్ఞాన సంబంధ మైన యుపదేశములను అర్జునునికి చేయవలసివచ్చెను. కనుక కేవలము అర్జునుని విరికితనమును పటాపంచలు చేయుట కొరకే గీత చెప్పబడలే దనుట సువిదితము.

అర్జునునిలోనున్న అహింసావృత్తిని తొలగించి అతనిని యుద్ధప్రవృత్తుని చేయుటకొరకు గీత చెప్పబడెనని మరికొంద రందురు. నా దృష్టిలో ఈ మాటకూడ సరికాదు. ఈవిషయ విచారణ చేయుటకు ముందు మన మర్జునుని భూమికను

తెలిసికొనవలె. ఇందు నిమిత్తము మొదటి యధ్యాయమును, రెండవ యధ్యాయములో దానికి సంబంధించిన మొదటి పది శ్లోకములును మనకు చాల సహాయపడును.

అర్జునుడు కృతనిశ్చయుడయి కర్తవ్యభావముతోనే సమరభూమికివచ్చి నిలబడినాడు. క్షాత్రవృత్తి యతని స్వభావమునందే యుండెను. యుద్ధములోనికి దిగకుండుటకు గాను పాండవులు చేయదగిన ప్రయత్నము చేసిచూచినారు. కాని యుద్ధము తప్పినదికాదు. కనీసపు కోరికల ప్రస్తావన, శ్రీకృష్ణునివంటివాని మధ్యవర్తిత్వము రెంటను విఫలమై పోయెను. ఇట్టి స్థితిలో అనేక దేశముల రాజులను ప్రోగుచేసి, తన సారథిగా నుండుటకు శ్రీకృష్ణుని ఒప్పించి, తాను రణ రంగమున నిలిచి వీరోచితమైన యుత్సాహముతో అర్జునుడు శ్రీకృష్ణునితో ఇట్లన్నాడు: "కృష్ణా, రెండుసేనల మధ్యను నా రథమును నిలుపుము. నాతో యుద్ధముచేయ సిద్ధమై వచ్చినవారి ముఖమైఖరి నొక్కసారి చూచెదగాక!" కృష్ణుడట్లే చేసెను. అర్జునుడు నలువైపులకును దృష్టి సారించెను. అప్పుడతనికి కనిపించినదేమి? ఇరుపక్షములందును ప్రచండమైన బంధుమిత్రుల సమూహములే కానిపించెను. చుట్టుకును, చంపుటకును అంతిమ నిశ్చయముతో వచ్చిచేరిన నాలుగు తరముల ఆప్తులను, స్వజనులను, తాతలను, తండ్రులను, కుమారులను, మనుమలను అతడక్కడ చూచెను. ఇంతకు పూర్వము అతడూహింపని స్థితి కాదది. కాని ప్రత్యక్ష దర్శనము వలన కలుగు పరిణామము ప్రత్యేకము

గనే యుండును. స్వజనుల సమూహమును చూచినమీదట అతని హృదయములో అశాంతి వ్యాపించెను. అతడు ఖిన్నుడయిపోయెను. నేటివర కతడనేక యుద్ధములలో అసంఖ్యాకులగు వీరులను సంహరించియే యుండెను. అప్పుడతడు ఖిన్నుడు కాలేదు; అతని గాండీవము చేతినుండి జారిపడలేదు; శరీరము కంపించియుండలేదు. నేత్రములు చెమ్మగిలి యుండలేదు. కాని ఇప్పుడల్లుండులకయినది? అశోకునివలె అతని మనస్సులో అహింసావృత్తి యుదయించెనా? లేదు. అది కేవలము స్వజనాసక్తి. ఈ సమయమునకూడ గురువులు, ఆప్తులు, బంధువులు ఎదుట లేకుండినచో అతడు శత్రువుల తలలను బంతులవలె ఎగురగొట్టి యుండెడువాడే. కాని ఆసక్తిజనితమైన యీ మోహము అతని కర్తవ్యనిష్ఠను మ్రింగివేసెను. అప్పుడతనికి తత్త్వజ్ఞానము జ్ఞప్తికివచ్చెను. కర్తవ్య నిష్ఠకలవాడు మోహగ్రస్తుడైనప్పుడుకూడ నగ్న రూపములో కర్తవ్య చ్యుతుడగుట సహింపలేడు. అప్పుడతడు ఆ పతనమున కేదో యొక ధర్మసూత్రపు బురఖా తొడుగును. ఇక్కడ అర్జునున కిదే స్థితి కలిగినది. అసలు యుద్ధమే పాపకార్యమని అత డొక కృత్రిమ ప్రతిపాదనను లేవదీసెను. యుద్ధమువలన కులక్షయ మగునని, ధర్మము నశించునని, స్వేచ్ఛాచారము ప్రబలునని, వ్యభిచారవృత్తి వ్యాపించునని, మోహము వచ్చిపడునని, రకరకములగు సంకటములు సమాజము నావరించునని, అనేక యుక్తి వాదములతో అర్జునుడు కృష్ణునికే నచ్చజెప్ప నారంభించెను.

ఇక్కడ నాకొక న్యాయాధికారిని గూర్చిన కథ జ్ఞప్తికి వచ్చుచున్నది. ఒక న్యాయాధీశు డుండెను. అతడు వందల కొలది నేరగాండ్రకు ఉరిశిక్ష విధించియుండెను. కాని యొక దినమున న్యాయమూర్తియొక్క కుమారుడే హత్యా దోషారోపణమొందఅతనియొద్దహాజరుపెట్టబడెను.కుట్టువానిపై మోపబడిన నేరము రుజువయ్యెను. న్యాయాధిపతి తన కుమారునికే తాను ఉరిశిక్ష విధింపవలసివచ్చెను. అప్పు డతడు ముందువెనుకలాడ జొచ్చెను. ఇక బుద్ధివాదమును లేనన్నెత్తి "ఉరిశిక్ష చాల అమానుష కృత్యము. ఇట్టి శిక్ష విధించుట మానవునికి శోభనీయము. దీనివలన అపరాధి సంస్కరింపబడు నను ఆశకు తావులేదు. హంత భావోద్రేకములో హత్యచేయును. కాని హత్యచేసినప్పటియుద్రేకము దిగిపోయినతరువాత వానిని యథావిధిగ ఉరిస్తంభమెక్కించి ప్రాణము తీయుట సభ్యతకల మానవునికి గొప్ప కళంకము, లజ్జాకరమైన పని" యని యీ విధముగ న్యాయాధిపతి యుక్తివాదముచేయ నారంభించెను. తన కుమారుడే నేరగాడుగ తన యెదుటికి తేబడకుండినచో న్యాయాధీశుడు జంకు గొంకులులేక ఉరిశిక్షలు విధించుచునే యుండువాడు. కాని న్యాయాధిపతి తనకు కుమారునియం దుండిన మమకారము వలన ఈ విధమైన మాటలు మొదలుపెట్టినాడు. ఇవి హృదయములోనుండి పుట్టినవికావు, ఆసక్తినుండి పుట్టినవి. 'వీడు నాకుమారుడు' అను మమకారమునుండి ఈ వాఙ్మయము వెలువడినది.

అర్జునుని స్థితికూడ ఈ న్యాయాధీశుని స్థితివంటిదే. అతడుచేసిన వాదము తప్పుకాదు. కడచిన మహాయుద్ధములో ప్రపంచమంతయు సరిగా నీపరిణామములనే కన్నారచూచెను. కాని అర్జునునికి పుట్టినది తత్త్వజ్ఞానము కాదని, కేవలము ప్రజ్ఞావాదమని మనము గమనింపవలసి యున్నది. కృష్ణునికిది తెలిసిన విషయమే. అందువలన నతడు అర్జునుని వాదము నించుకయు సరకుగొనక, మోహనాశకమగు ఉపాయమును సూటిగా బోధింప మొదలు పెట్టినాడు. అర్జునునిది నిజముగ అహింసావాదమే యయి యుండినచో అతని కెవ రెన్ని జ్ఞాన విజ్ఞానోపాయములు చెప్పినను, అసలు విషయమును గూర్చి సరియగు జవాబు లభింపనంతవరకు అతనికి తృప్తి కలిగి యుండెడిదికాదు. కాని గీత యంతటిలోను ఈ విషయమును గూర్చిన జవాబొక్కడను ఈయబడకపోయినను అర్జునుడు తృప్తిపడెను. అర్జునుని దహింసావృత్తి కాదనియు, అతనిది యుద్ధప్రవృత్తియే యనియు దీనిలోని భావార్థము. యుద్ధమతని దృష్టిలోస్వభావసిద్ధము, అనివార్యము అయిన నిశ్చిత కర్తవ్యము. మోహవశుడై దాని నతడు తప్పించుకొన జూచెను. గీతయొక్క గదాప్రహరణము ముఖ్యముగ నీ మోహము మీదనే.

3

గీతయొక్క ప్రయోజనము : స్వధర్మ విరోధియగు మోహమును నిరాకరించుట

అర్జును డొక అహింసాధోరణినేకాక సంన్యాసపు ధోరణినికూడ మాటలాడ నారంభించెను. రక్తపాతముతో గూడిన క్షాత్రధర్మముకంటె సంన్యాసమే మేలని యతడనెను. కాని యది అర్జునుని స్వధర్మమా ? అతని కా మనోవృత్తి కలదా ? అర్జునుడు సంన్యాసి పాత్రను మిక్కిలి సమర్థతతో ధరింపగలడేకాని ఆ మనోవృత్తి యతని కెట్లబ్బగలదు ? సంన్యాసముపేరిట అతడొకవేళ అరణ్యమునకు వెళ్లియున్నను అత డక్కడ మృగములను చంపియుండెడువాడే. అందువలన భగవంతు డతనితో "అర్జునా, యుద్ధముచేయనని నీవు చెప్పుట వట్టి భ్రమ. నేటివరకేది నీ స్వభావమైయుండెనో, అది నీచేత యుద్ధముచేయించకుండ నిన్ను విడిచిపెట్టదు" అని సృష్టముగ చెప్పివేసెను.

అర్జునునికి స్వధర్మము పరధర్మముగ గోచరించెను. కాని స్వధర్మ మెంత విగుణమై కనిపించినను, మానవుడు స్వధర్మమునందే నిలిచి తాను వికాసమును పొందవలెను. ఎందువల్లననగా స్వధర్మ నిర్వహణమునందే అతడు వికాసమును పొందగలడు. ఇందు దురభిమానమున కేమియు తావు లేదు. వికాసమున కిదే సూత్రము. గొప్పదని తలచి స్వీకరింపవలసినదియు కొద్దిదని చెప్పి విసర్జింపవలసినదియు కాదు స్వధర్మము. వస్తుతః అది గొప్పదియు కాదు. కొద్దిదియుగాదు.

అది మనకు సంప్రదాయసిద్ధముగ సంక్రమించునది. "శ్రేయాన్ స్వధర్మోవిగుణః"అను గీతావాక్యములోని 'ధర్మము'న కున్న అర్థము హిందూ, క్రైస్తవ, ఇస్లామ్ మొదలగు ధర్మముల అర్థమువంటిది కాదు. ప్రతివ్యక్తికిని తన ప్రత్యేక ధర్మ ముండును. ఇక్కడ నా యెదుటనున్న రెండువందలమందికి రెండునందల ధర్మము లున్నవి. పది సంవత్సరములకు పూర్వ మేది నా ధర్మమో ఈనాడు కాదు. నేటిది పదిసంవత్స రముల తరువాత ఉండబోదు. ఆత్మనిరీక్షణమువలన అనుభవమువలన మనోవృత్తులు మారుచుండుననే, మొదటి ధర్మము వదలిపోయి నూతనధర్మము ప్రాప్తించుచుండును. మొండిపట్టుతో దేనినిగూడ సాగింపరాదు.

మరియొకనిధర్మ మెంత శ్రేష్ఠముగ కనిపించినను, దానిని స్వీకరించుట నాకు శుభప్రదముకాదు. సూర్యుని ప్రకాశము నాకు ప్రియము. దానివలన నేను వృద్ధిచెందు చున్నాను. సూర్యుడు నాకు వందనీయుడుకూడ. కాని పై కారణములవలన నేను పృథ్విని వదలిపెట్టి సూర్యుని యొద్దకు పోవలెననుకొన్నచో కాలి భస్మమైపోదును. అట్లు గాక ఈ పృథ్విపై నివాసమెంత విగుణముగ తోచినను, సూర్యునియెదుట భూమి యెంత అల్పమైనదయినను, భూమి స్వయంప్రకాశము కాకున్నను, సూర్యుని తేజస్సును సహింప గలుగు సామర్థ్యము నాకు కలుగనంతవరకును సూర్యునికి దూరముగ ఇక్కడనేయుండి వికాసమును పొందవలసి యుందును. "నీటికంటె పాలు విలువగల వస్తువు, కనుక మీరు

పోయి పాలలో నివసింపుడు" అని యెవడైన చేపలతో అనినచో అవి యందులకు సమ్మతించునా ? చేపలు నీటిలోనే బ్రతుకగలవు, పాలలో చనిపోవును.

మరియొకని ధర్మము సులభమనిపించినను దానిని స్వీకరింపరాదు. తఱచుగా ఆ సరళత ఆభాస మాత్రమే. ఎవడైన గృహస్థు తన బిడ్డలను సరిగా పోషింపలేక విసుగు జెంది సంన్యాసమును తీసికొన్నచో ఆ సంన్యాస మతనికి బరువగుటయేగాక కపటనాటకముకూడ నగును. అవకాశము కలిగినంతనే వాని వాసన లతనిని గట్టిగా పట్టివేయును. కుటుంబభారము మోయలేక అడవిలోనికి పోవు మానవుడు మొదట నక్కడ నొక చిన్నకుటీరమును నిర్మించుకొనును. తరువాత దాని రక్షణకొఱకై చుట్టును నొక కంచెవేయును. తరువాత నక్కడ సంసారభారము మరింత పెంచుకొనవలసిన స్థితి యేర్పడును. మనసులో నిజముగ సంన్యాసవృత్తియే యున్నచో సంన్యాసము మాత్ర మేమి కష్టము ? సంన్యాసమును సులువుగ పాలించుటకు సాయపడు స్మృతి వచనములుండనే యున్నవి. కాని ముఖ్యమైనది మనోవృత్తి. ఎవనియందెట్టి నిజమైన వృత్తికలదో దాని ననుసరించియే వాని ధర్మముండును. గరిష్ఠము కనిష్ఠము, సరళము కఠినము అను ప్రశ్నయే లేదు. నిజమగు వికాసము కలుగవలె. నిజమైన పరిపక్వస్థితి కలుగవలెను.

కాని కొందరు ఆవేశపరులు ఇట్లందురు. "యుద్ధ ధర్మముకంటె నెప్పటికైనను సంన్యాసమే శ్రేష్ఠమైనచో,

భగవంతు డర్జునుని నిజమైన సంన్యాసిగ నేల చేసియుండ లేదు? ఆయన కది యసాధ్యమైన పనియా?" భగవంతుని కేదియు అసాధ్యముకాదు. కాని అందులో అర్జునునికి పురుషార్థ మేమున్నది? పరమేశ్వరుడు మానవుని స్వతంత్రుని జేసినాడు. కనుక ప్రతివానికిని స్వప్రయత్నములోనే రుచి యున్నది. చిన్నపిల్లలు తమంత దాము బొమ్మలు గీయుటలో ఆనందమును పొందుదురు. మరొకరు తన చేయి పట్టుకొని గీయించుట కుఱ్ఱవాని కిష్టముండదు. ఉపాధ్యాయుడు తన ప్రశ్నలకు తానేజవాబులు చెప్పుచుపోయినచో నిక విద్యార్థుల బుద్ధి వికసించు టెట్లు? కనుక తల్లిదండ్రులును గురువును చేయవలసిన పని విద్యార్థికి మార్గము చూపుట మాత్రమే. పరమేశ్వరుడు లోపలనుండి మనకు సూచనల నిచ్చుచుండును. ఇంతకు మించి అతడేమియు చేయడు. భగవంతుడు కుమ్మరి వలె మనలను తపతప కొట్టి అందఱను ఒకరకపు పోత బొమ్మలుగనే తయారుచేయుటలో సారమేమున్నది? మనము మృన్మయులము కాము, చిన్మయులము.

స్వధర్మమునకు ప్రతిబంధకమగు మోహమును నివారించుటకే గీత జన్మించినదని పై వివేచననుబట్టి మీరు గ్రహించియుందురు. అర్జునుడు స్వధర్మసమ్మూఢుడయి యుండెను. స్వధర్మ విషయమున నతని మనస్సున మోహ ముదయించి యుండెను. మొదట శ్రీకృష్ణు డతనియందు నిందారోపణ చేసిన తరువాత అర్జును డీ విషయమును తనంతట తానే ఒప్పుకొనెను. ఆ మోహమును, మమత్వమును, ఆసక్తిని

తొలగించుటయే గీతయొక్క ముఖ్యమైన పని. ఇందుచేతనే భగవంతుడు గీత నెల్లను వినిపించి, "అర్జునా, ఇప్పుడు నీ మోహమంతయు తొలగిపోయెనుకదా!" అని యడిగెను. "ఔను ప్రభూ, తొలగిపోయినది. స్వధర్మము నాకు బోధ పడినది" అని యర్జునుడు జవాబిచ్చెను. ఈ విధముగ గీత యొక్క యుపక్రమణమును, ఉపసంహారమును కలిపి చూచినచో మోహనిరసనమే గీతవలని ఫలితమని తేలును. గీతయే కాదు, మహాభారతమంతయు ఈ యుద్దేశమునే వెలిపుచ్చుచున్నది. మానవుని హృదయము నావరించియున్న మోహమును తొలగించుటకే ఈ యితిహాస దీపమును వెలిగించుచున్నానని వ్యాసుడుభారతప్రారంభమునందే చెప్పియున్నాడు.

4

ఋజుబుద్ధికలవాడే యధికారి

ముందున్న గీత నెల్లను అవగాహన చేసికొనుటకు అర్జునుని యీ భూమిక మనకు చాల ఉపకరించును. అందు చేతనే మన మతనికి కృతజ్ఞులము. ఈ భూమికవలన నిదికాక మరియొక ఉపకారముకూడ కలదు. అర్జునుని భూమికవలన అతని మనస్సు మిక్కిలి ఋజువృత్తికలదియని మనకు తెలియ గలదు. అసలు 'అర్జున' శబ్దమునకే 'ఋజువైనవాడు లేక సరళస్వభావుడు' అని యర్థము. తన మనస్సునం దుత్పన్న మైన వికారములను ఆలోచనలను అన్నిటిని అర్జునుడు హృద

యమును విప్పి భగవంతునియెదుట పెట్టెను. మనస్సునందు దేనిని అతడు దాచియుంచుకొనలేదు; చివరకతడు శ్రీకృష్ణుని శరణు జొచ్చెను. నిజమున కతడు మొదటినుండియు శ్రీకృష్ణుని శరణుజొచ్చియేయుండెను. అర్జునుడు శ్రీకృష్ణుని తన సారథిగా జేసికొని, రథాశ్వముల కళ్ళెపుత్రాళ్ళ నతని చేత బెట్టినప్పుడే తన మనోవృత్తుల కళ్ళెపుత్రాళ్ళనుగూడ కృష్ణునిచేత బెట్టుటకు సంసిద్ధుడై యుండెను. రండు, మన మును అట్లే చేయుదము. "అర్జునునికి కృష్ణుడు దొరకెను. కాని మనకు కృష్ణుడెక్కడ దొరకును?" అని మనము అనకుందుముగాక! కృష్ణుడను వ్యక్తి యొకడున్నాడను ఐతిహాసిక భ్రమలో మనము పడకుందుముగాక! కృష్ణుడంతర్యామిగ ప్రతి హృదయమునందును విరాజమానుడై యున్నాడు. అన్నిటికంటెను మనకు దగ్గరనున్నవాడతడే! కనుక మన హృదయ మాలిన్యమంతయు అయన యెదుట బెట్టి, "ప్రభూ, నీకు నేను శరణాగతుడను, నీవు నాకు అనన్యగురుడవు. నాకు మేలుచేయు మార్గమును చూపుము. నీవు చూపు మార్గమునే నేననుసరింతును" అని యతనితో అందముగాక! మన మిట్లు చేసినచో ఆ పార్థసారథి మనకు గూడ సారథ్యముచేయును. తన శ్రీముఖమునుండి మన కతడు గీతను వినిపించి, విజయలాభమును చేకూర్చును.

గీతా ప్రవచనములు

రెండవ అధ్యాయము

ఉపదేశసారము - ఆత్మజ్ఞానము, సమత్వబుద్ధి

5

గీతయొక్క పరిభాష

సోదరులారా!

వెనుకటి యధ్యాయములో మన మర్జున విషాదయోగమును చూచితిమి. అర్జునుని కున్న ఋజువర్తనమును, హరిపరాయణత్వమును ఉన్నచోట విషాదము కూడ యోగమే యగును. దీనినే హృదయమథన మందుము. ఈ భూమికకు కారకుడైన వ్యాసుడు దీని కిచ్చిన అర్జున విషాదయోగ మను ప్రత్యేక నామమును నే నీయలేదు. గీత కర్జునుడు నిమిత్తమాత్రుడు కనుక దీనికి విషాదయోగమను సాధారణ నామమును నే నిచ్చియుంటిని. పండరిపురమున పాండురంగడు కేవలము పుండలీకుని కొఱకే యవతరించినాడని మన మనుకొనరాదు. ఎందుల కనగా పుండలీకుని నిమిత్తమాత్రునిగా జేసికొని, మనవంటి జడజీవుల యుద్ధరణకొఱకు వేలాది సంవత్సరముల నుండి అతడు నిలిచియున్నట్లు మనమెఱుగుదుము. ఈ విధముగనే గీతామాత అర్జునుని నిమిత్తముగ జేసికొని మనయందఱమీదను

దయను ప్రసరింపజేయుచున్నది. కనుక గీతలోని మొదటి యధ్యాయమునకు విషాదయోగ మను సాధారణ నామమే బాగుగనుండును. గీత యను వృక్షము ఇక్కడనుండి పెరిగి పెరిగి చివరి యధ్యాయములో ప్రసాదయోగమను ఫలమును (ప్రసన్నత్వమును) మన కందించుచున్నది. ఈశ్వరేచ్ఛ యైనచో మనముకూడ ఈ కారాగార వాసపు గడువులోపల చివరకు చేరగలుగుదుము.

రెండవ అధ్యాయముతో గీతాశిక్షణ ప్రారంభమగును. దీనిమొదటనే భగవంతుడు జీవిత మహాసిద్ధాంతములను బోధించుచున్నాడు. జీవితసౌధమును నిర్మించుటకు ఆధార భూతములయిన యీ ముఖ్య సిద్ధాంతములు ప్రారంభములోనే హృద్దతమైనచో, ముందుమార్గము సరళమగునని భగవంతుని యాశయము. రెండవ యధ్యాయములో వాడబడిన 'సాంఖ్య బుద్ధి' యను శబ్దమున కర్థము జీవితము యొక్క మూల భూత సిద్ధాంతముల నెఱుంగుట యని నా భావము. ఈ మూలసిద్ధాంతములేవో మనమిప్పుడు చూడవలసియున్నాము. కాని దీనికిముందు సాంఖ్యమను మాటను పురస్కరించుకొని గీతలోని పారిభాషిక శబ్దార్థముల స్పష్టీకరణ కొంతచేసిన మంచిదని నా కనిపించుచున్నది.

పురాతన శాస్త్రీయ శబ్దములకు క్రొత్తయర్థములనిచ్చి వ్రాయుట గీతకు పరిపాటి. సనాతన శబ్దములకు క్రొత్తయర్థ ములను కల్పించుట భావ విప్లవమునకు అహింసాత్మక సాధ నము. ఈ ప్రక్రియలో వ్యాసదేవుడు సిద్ధహస్తుడు. ఇందు

వలన గీతలోని శబ్దములకు విశాలమగు అర్థములు మనకు లభించినవి. ఇట్లు గీత నిత్యనూతనత్వమును కాపాడుకొన గలిగినది. అనేకులగువ్యాఖ్యాతలు తమతమ ఆవశ్యకములను, అనుభవములనుబట్టి అనేకార్థములను చెప్పగలిగిరి. తమతమ భూమికల ననుసరించి యీ యర్థము లన్నియు నుచితములే కావచ్చును. మూలమునకు వైరుధ్యము కలుగకుండ, స్వతంత్రములగు అర్థములనుకూడమనము చెప్పుకొనవచ్చును.

ఈ సందర్భమున ఉపనిషత్తులోని సుందరమైన కథ యొకటి జ్ఞప్తికి వచ్చుచున్నది. ఒకప్పుడు దేవతలు, దానవులు, మానవులు ఉపదేశమును పొందునిమిత్తము ప్రజాపతి యొద్దకు వెళ్ళిరి. వారందరికిని ప్రజాపతి 'ద' అను ఒక యక్షరమునే ఉపదేశించెను. "మనము కామకులము, విషయ భోగముల వ్యసనము మనల నంటియున్నది. కనుక 'ద'అను అక్షరముద్వారా బ్రహ్మ మనకు దమనముయొక్క ఆవశ్యకమును బోధించెను." అని దేవత లనుకొనిరి. రాక్షసులు "దానవులమైన మనము తీవ్ర క్రోధాన్వితులమును, దయాహీనులము నైయున్నాము. 'ద' అను అక్షరముద్వారా ప్రజాపతి మనకు దయాగుణమును బోధించినాడు" అని యనుకొనిరి. ఇక మానవులు "మానవులమైన మనము అతి లోభులము, ధనసంచయాభిలాషవలన ఉన్మత్తులమైపోయితిమి. 'ద' అను అక్షరముద్వారా దానము చేయుడని ప్రజాపతి మనకుపదేశించె"ననుకొనిరి. ఈ ముగ్గురు చెప్పుకొనిన యర్థములును సరియైనవని బ్రహ్మ తలచెను. ఎందు

చేతననగా వారందరును తమతమ యనుభవములనుబట్టియే పై గుణపాఠములను తీసికొనిరి. గీతలోని పరిభాషకు అర్థము చెప్పుకొనునప్పుడు ఉపనిషత్తులోని యీ కథను మనము జ్ఞప్తియం దుంచుకొనవలెను.

6

జీవన సిద్ధాంతము, దేహముతో స్వధర్మాచరణ

రెండవ యధ్యాయములో జీవితమునకుగాను మూడు మహా సిద్ధాంతములు ప్రతిపాదింపబడినవి: (౧) ఆత్మయొక్క అమరత్వము, అఖండత్వము, (౨) శరీరముయొక్క క్షుద్ర త్వము, (3) స్వధర్మముయొక్క అనివార్యత. వీనిలో స్వధర్మ సిద్ధాంతము కర్తవ్యరూపమైనది. మఱి మిగిలిన రెండును జ్ఞానముచేత గ్రహింపవలసినవి. వెనుకటి యధ్యాయములో స్వధర్మ విషయమయి కొంత చెప్పియున్నాను. స్వధర్మము ప్రకృతిసిద్ధముగనే మనకు ప్రాప్తమగుచున్నది. స్వధర్మ మును వెదకి పట్టుకొనుటకు ఎక్కడికిని వెళ్ళనవసరములేదు. మన మేకాకులమై ఆకాశమునుండి ఊడిపడలేదు. మనము జన్మింపకముందే ఈ సమాజ మిక్కడ నుండెను; మన తల్లి దండ్రులు, ఇరుగుపొరుగువారలు ఉండిరి. ఈ ప్రవాహములో మనకు జన్మకలుగుచున్నది. కనుక నన్నుగన్న తల్లిదండ్రు లను సేవించు ధర్మము జన్మసిద్ధముగనే నాకు లభించినది. నేను జన్మించిన సమాజమును సేవించు ధర్మముకూడ

ఈ రీతినే తనకు తానుగ నాకు లభించినది. మన జన్మతోనే స్వధర్మముకూడ జన్మించినదనుట సత్యమే. అంతేకాదు, మనము పుట్టకముందే మనకుగాను స్వధర్మము తయారై యున్నదనికూడ చెప్పవచ్చును. ఎందులకనగా మన జన్మకు గల హేతువే యది; దాని పరిపూర్తికొఱకే యీ జన్మ. కొందరు స్వధర్మమును పత్నితో పోల్చుచుందురు; సతీపతుల సంబంధమెట్లు అవిచ్ఛిన్నముగ తలపబడినదో ఇదియు నట్లే. నాకుమాత్ర మీ యుపమానము గౌణముగ తోచుచున్నది. స్వధర్మమును నేను తల్లితో పోల్చెదను. నాతల్లి 'ఫలానా' యని నిర్ణయించుకొనుపని నాకులేదు. అది మొదటనే నిశ్చిత మయ్యెను. ఆమె స్వభావ మెట్టిదైనను నా తల్లి కాదనుటకు వీలులేదు. స్వధర్మముకూడ నిట్టిదే. ఈ జగతిలో స్వధర్మము వినా మనకు మఱే యే యితరాశ్రయమును లేదు. స్వధర్మమును తప్పించుకొని తిరుగుట తన్నుదాను గాదనుకొను ఆత్మఘాతుక కృత్యమువంటిది. స్వధర్మముయొక్క సాహాయ్యముతోనే మనము పురోగమించగలము. కాబట్టి ఎవరును ఎప్పుడును దాని యాశ్రయమును విడనాడజనదు. ఇదే మన జీవితమున కొక మూలభూతసిద్ధాంతముగ స్థిరమగుచున్నది.

సహజముగ తనంతట తాను ఆచరణలోనికి వచ్చునదే స్వధర్మము. కాని రకరకములైన మోహపుంజములు కారణముగ అట్లు జరుగుటలేదు. లేదా బహుకష్టముతో జరుగుచున్నది. జరిగినను అది విషకలితమై, అత్యంత దోషభూయిష్ఠమై యున్నది. స్వధర్మమార్గములో ముండ్లను వెదచల్లు ఈ మోహజాలము తొల్చి బాహ్యరూపములకు

లెక్కలేదు. అయినప్పటికిని మనము వానిని లోతుగా పరిశీలించినట్లయిన వానియన్నిటి యడుగున కానవచ్చునది ఒక వస్తువే; అది సంకుచితమును, క్షుద్రమును అయిన దేహబుద్ధి. నేను, మఱి నా రక్తసంబంధులు-అంతే. ఇంతవఱకే నా వ్యాప్తి, ఇంతే నా ప్రపంచము. ఈయావరణకు బయటనున్న వారందరును నాకు పరాయివారు, లేక శత్రువులు. దేహబుద్ధి భేదమనుగోడను నిర్మించును. 'నేను, నా వారు' అని యనుకొనుచోట కూడ ఈ దేహబుద్ధియే పనిచేయుచుండును. ఇదెంతహాస్యాస్పదము! దేహబుద్ధివలన కలిగిన 'నేను, నావారు' అను ద్వంద్వమున చిక్కుకొని, రకరకముల గూడులను మనము నిర్మించుకొనుచున్నాము. తఱుచుగ చాలమంది ఈ కార్యక్రమముననే పడియుందురు. ఇందులో ఒకని గూడు పెద్దదయిన మఱియొకనిది చిన్నది. ఏమైననేమి? ప్రతిదియు గూడే. చర్మసంబంధమునుబట్టి యీ గూండ్లలోతు ఏర్పడును. ఒకనిది కుటుంబాభిమానపు గూడైన, మఱియొకనిది దేశాభిమానపు గూడు. బ్రాహ్మణ-బ్రాహ్మణేతర కట్టడొకటి, హిందూ-ముసల్మాను కట్టడి మఱియొకటి - ఈ విధముగ నొకటికాదు, రెండుకాదు, లెక్కలేనన్ని గూడులు! ఎటుచూచినను గూడులే గూడులు!! ఇక్కడ మన జైలులోకూడ రాజకీయ-ఖైదీలని, మఱొకరకపు ఖైదీలని, గూండ్లు ఏర్పడినవి. ఇవిలేనిచో మనము జీవింపనే లేమన్నట్లున్నాము. కాని దీని పరిణామమేమి? ఒక్కటే పరిణామము - హీనవికారములను కలిగించు కీటాణువులవృద్ధి, స్వధర్మరూపమైన ఆరోగ్యము నశించుట.

7
జీవన సిద్ధాంతము, దేహాతీతమైన ఆత్మజ్ఞానము

ఇట్టిస్థితిలో ఒక్క స్వధర్మనిష్ఠయే చాలదు. అందులకు గాను మఱి రెండు సిద్ధాంతములను శ్రద్ధతో గమనింపవలసి యుండును. "మరణశీలమైన ఈ దేహమును నేనుకాను. ఇది కేవలము క్షుద్రమైన పైతొడుగు మాత్రమే" అను సిద్ధాంత మొకటి. "ఎప్పటికిని చావులేనిది, అఖండమును, వ్యాపక మును అయిన ఆత్మను నేను"అనునది రెండవది. ఈ రెండును కలిసిన పూర్ణతత్త్వజ్ఞానము లభించును.

ఈతత్త్వజ్ఞానము గీతదృష్టిలో అత్యంతము ఆవశ్యక మైనది. కాననే గీత ముందుగ దీనినే ఆవాహనచేయుచున్నది. తదుపరి స్వధర్మమును బోధించుచున్నది. తత్వజ్ఞాన సంబంధ మైన యీ శ్లోకములు ప్రారంభములోనే యెందులకని కొంద రడుగుదురు. గీతలో నెంతమాత్రమును స్థానము తప్పింపరాని శ్లోకము లేవైన నున్నచో అవి యివే యని నాకనిపించును.

ఈ మాత్రపు తత్త్వజ్ఞానము మనస్సునం దంకితమై యున్నచో స్వధర్మ మేమాత్రమును భారమనిపించదు. ఇంతే కాదు, స్వధర్మ విరుద్ధముగ నేమి చేయవలెనన్నను భారమని పించును. ఆత్మతత్త్వముయొక్క అఖండత్వము, దేహము యొక్క క్షుద్రత్వము-వీనిని గ్రహించుట యేమాత్రమును కష్టముకాదు. ఈ రెండును సత్యవస్తువులగుటయే దీనికి కారణము. కాని మనము వాని పరిశీలనమాత్రము చేయ వలసియుండును. తిరిగి తిరిగి మనస్సులో వానిని మథింపవలసి

యుండును. చర్మముయొక్క మహత్త్వమును తగ్గించి ఆత్మకు మహత్త్వము నిచ్చుట నేర్చుకొనవలసి యున్నాము.

ఈ శరీరము క్షణక్షణమును మార్పు చెందుచుండును. బాల్యము, యౌవనము, వార్ధక్యము-ఈ చక్ర మందఅయను భవములో నున్నదే. ప్రతి-యేడేండ్లకును శరీరము పూర్తిగ మాఱునని యు, ప్రాతరక్తము నందలి ఒక్క-బొట్టైనను మిగిలియుండదనియు ఆధునిక శాస్త్రజ్ఞు లనుచుందురు. పండ్రెండేండ్ల కొకసారి స్రాతశరీరము నశించిపోవునని మన పూర్వుల నమ్మకము. కావునవే వారు పండ్రెండేండ్ల కొకసారి ప్రాయశ్చిత్తము, తపశ్చర్య, అధ్యయనము మొదలయిన కర్మకాండలు నియమించియుండిరి. అనేక సంవత్సరముల వియోగముతర్వాత కుమారుడు తల్లిని కలిసికొన్నచో తల్లి వానిని గుర్తింపజాలదు. ఇట్టికథలను మనము వినుచుందుము. కాని ప్రతిక్షణమును మార్పుచెందుచు, ప్రతిక్షణమును నశించు ఈ శరీరమేనా నీరూపము? లేలుంబగళ్లు మలమూత్ర నాళికలు ప్రవహించు శరీరమానీవు? గట్టిగా తోమి కడుగు నీవంటి మొనగాడు దొరకినను అస్వచ్ఛతావ్రతమును వదలి పెట్టని యీ శరీరమేనా నీవు? అది మలినము, దానిని శుభ్ర పరుచువాడవు నీవు; అది రోగి, దానికి మందు మాకు లిచ్చు వాడవునీవు. మూడు మూళ్లన్నరలో ఇమిడిపోవునదది, నీవో త్రిభువనవిహారివి. నిత్యపరివర్తనయే స్వభావముగ కల దది, దాని మార్పులను గమనించు ద్రష్టవునీవు. అది మృతినొందు నది, మృత్యువును శాసించి నడుపువాడవు నీవు. నీకును

దానికిని మధ్య ఇంత స్పష్టమైన భేద మున్నప్పటికిని ఇంత సంకుచితత్వము నీ కెట్లబ్బినది? ఈ దేహముతో సంబంధ మున్నవారే నా వారని యనుట యేమి? దేహమునకు ప్రాప్తించు మృత్యువుకొఱ కింతశోకముమాత్ర మెందులకు? "ఓరీ, దేహపతన మెక్కడనైన శోకింపదగినదా?" యని భగవంతుడు ప్రశ్నించుచున్నాడు.

దేహము వస్త్రము వంటిది. స్రాతవస్త్రములు చినిగి పోవును. కనుకనే క్రొత్తవి ధరింతుము. ఒక్కశరీరమే శాశ్వత ముగ ఆత్మ నంటిపెట్టుకొని యున్నచో ఆత్మకు దుర్గతి కలుగును. వికాసమంతయు ఆగిపోవును. ఆనందము లోపిం చును. జ్ఞానప్రభ మందగించును. అందువలన దేహనాశము శోచనీయము కాజాలదు. నిజమే, ఆత్మ నశించునైనచో అది తప్పక శోచనీయమేయగును. కాని ఆత్మనాశరహితము. అదియొక అఖండ నదీప్రవాహము. దానిపైని అనేక దేహ ములు వచ్చుచు పోవుచునుండును. ఇందువలన దేహసంబంధ మును చక్రమున చిక్కుకొని శోకించుట, 'వీరు నావారు, వీరు పరాయివారు'అని యొక్కొకరిక్కడ వేరుచేయుట కేవల మనుచితము. ఈ బ్రహ్మాండమంతయు చక్కగా నేసిన యొక వస్త్రము. చిన్నకుఱ్ఱవాడు కత్తెరను తీసికొని దానిని ముక్క ముక్కలుగ కత్తిరించినట్లే దేహమనుకత్తెరతో విశ్వాత్మను తునుకలుచేయుట ఎంత కుఱ్ఱతనము, ఎంత హింస!

బ్రహ్మవిద్యను కని పెంచిన భారతభూమిలోనే చిన్న, పెద్ద భేదములు, వర్ణ, సంప్రదాయ, జాతిభేదములు నిండి

పోవుట నిజముగ నెంత దుఃఖకరమైన విషయము! దీనికి తోడు మఱి యేచోటను కనబడనంత మృత్యుభయము మన మనసులో పాదుకొనియున్నది. ఈ దురవస్థ దీర్ఘకాలిక పారతంత్ర్యమునకు ఫలమనుట నిస్సంశయము. ఇంతేకాక మన పరాధీనతకు ఇదొక కారణమనియు మనము మఱువరాదు.

మరణ మను మాటకూడ మనకు సరిపడదు. మృత్యువనగనే అమంగళముగ తోచును.

* "మరణశబ్ద నహీం హై సహాతే
మర్ జాతే హైం తో రోతే!"

అని జ్ఞానదేవు డెంతోదుఃఖముతో వ్రాయవలసి వచ్చెను. ఎవరైన మరణించినపుడు ఇది మనకొక కర్తవ్యము కాదా యన్నట్లు ఎంతెంత యేడ్పులు, పెడబొబ్బలు పెట్టుదుము! ఏడ్చుటకు కూలివాండ్రను పెట్టునంతవఱకు పోయిన దీ విషయము. మృత్యు వాసన్నమైనను రోగి కా సంగతి చెప్పరు. బ్రతుకడని వైద్య డన్ననుకూడ రోగి కా మాట చెప్పనే చెప్పరు. అసలు వైద్యుడుకూడ ఉన్నదున్నట్లు చెప్పడు. ప్రాణము పోవువఱకును రోగియొక్క పొట్టలో మందులు పోయుచునే యుండును. ఇట్లుగాక ఉన్నదున్నట్లుచెప్పి, రోగికి ధైర్యస్థైర్యములు గొల్పి, ఈశ్వరుని స్మరించుమనుట ఎంత యుపకారము! కాని ఉన్నదున్నట్లు చెప్పుటవలన, బెంగచేత

* మరణ మను శబ్దమును సహించము; ఎవరైన మరణించినచో విలపింతుము.

ముందెప్పుడో పగులనున్న కుండ ఇప్పుడే పగులునేమో యని అతనిభయము. కాని నిర్ణీత సమయమునకు ముందది పగులునా? అదియునుగాక రెండుగంటలలో బ్రద్దలుకానున్న భాండము కొంచెము ముందుగ పోయినమాత్రమున రాగల నష్టమేమి! ఇట్లనుటచే మనము ప్రేమవిహీనులము, కఠినహృదయులము కావలెనని నాతలంపు కాదు. కాని దేహాసక్తిని ప్రేమ యనలేము సరికదా ఆయాసక్తిని తొలగింపనంతవఱకు నిజమగు ప్రేమ యుదయింపదు.

దేహాసక్తి పోయినప్పుడు దేహము సేవ కొక సాధనమని, దేహమున కర్హమైన ప్రతిష్ఠకూడ ప్రాప్తించునని మనకు విదితమగుచున్నది. కాని యీనాడు మనము దేహపూజనే లక్ష్యముగ జేసికొని కూర్చున్నాము. స్వధర్మాచరణయే లక్ష్యమనుమాట మఱచితిమి. దేహమున కన్నపానీయములిచ్చి పోషింపవలసిన అవసర మున్నదనిన అది స్వధర్మాచరణకొఱకేకాని కేవలము జిహ్వాచాపల్యమును తీర్చుకొనుటకుగాదు. గరిటెతో హల్వా వడ్డించినను, లేక అన్నము, పప్పు వడ్డించినను ఒకటే; ఒక దానివలని సుఖముగాని రెండవ దానివలని దుఃఖముగాని దానికి లేదు. నాలుకకుగూడ ఈ స్థితియే రావలెను. దానికి రసజ్ఞాన ముండవలసినదే. కాని సుఖదుఃఖములు మాత్ర ముండరాదు. శరీరమున కీయవలసిన బాడుగ నిచ్చివేసితిమా మనపని తీరినట్లే. రాట్నముతో నూలువడుకవలె. అందులకని దానికి చమురువేయుట అవసరము. ఈ విధముగనే శరీరముతో పని చేయవలె. అందుల

కని ఈ యింజనునకు బొగ్గువేయుట అవసరము. ఈ రీతిని మనము దేహమును ఉపయోగపరచితిమేని, అది క్షుద్ర మయ్యు విలువగలది ప్రతిష్ఠ గలది యగును.

కాని మన మీశరీరమును సేవకై వినియోగింపకుండ, దానిలోనే మునిగి తేలుచు, ఆత్మను సంకుచితపరచుకొను చున్నాము. ఇందువలన వస్తుతః నికృష్టమైన యీ దేహము మరింత క్షుద్రమైపోవుచున్నది. ఇందుచేతనే దేహము, దేహసంబంధములు నింద్యములనియు, శునక సూక రాదులు వంద్యములనియు మహాత్ములు ఘంటాపథముగ చెప్పుచుం దురు. "ఓరీ, నీవీ దేహమును, దేహముతో సంబంధించిన వారిని రేపగళ్లు పూజింపకుము. ఇతరులనుగూడ నీవారని గుర్తించుట నేర్చుకొనుము. ఈ విధముగ విశాల హృదయు డవు కమ్ము" అని మహాత్ములు మనకు బోధించుచున్నారు. కాని మన కిష్టులైన ఆప్తులను తప్పించి, మరెవరికైనను మన హృదయములో తావిచ్చుచున్నామా? "ప్రాణముతో ప్రాణ మును ఆత్మతో ఆత్మను కలుపుము" అన్నట్లు మనము మెలగుచున్నామా? దేహపంజరమునకు వెలుపలనున్న గాలి నేమైన ఆత్మహింసకు సోకనిచ్చుచున్నామా? నీవు నిర్మించుకొన్న ఆవరణను ఛేదించుకొని, 'నిన్న నేను పది మందికొత్త మిత్రులను సంపాదించితిని. ఈ రోజున వారు పదు నైదుగురైనారు. రేపు ఏబదిమంది యగుదురు' అని యెప్పు డైన అనుకొన్నాడవా? 'ఈ విశ్వమంతయు నాది, నేను దానివాడను' అనెడియనుభవమును నీ వెన్నడైన పొందితివా?

మనము జైలునుండి మన దగ్గరబంధువులకు నుత్తరములు వ్రాయుదుము. ఇందు విశేషమేమున్నది? కాని, జైలునుండి విడుదలయైన రాజకీయ - ఖైదీకి కాక ఒక దొంగఖైదీకి వానిని మిత్రునిగా భావించి లేఖ వ్రాయుదుమా?

మనయాత్మ విశాలమగుటకు తహతహలాడుచుండును. యావజ్జగత్తును కౌగిలించుకొనగోరును. కాని మనము మాత్రము దానిని గోడలమధ్య బంధించుచుందుము. అత్మను మనము ఖైదీనివలె చేసి పడవేసితిమి. కాని ఇట్లు చేసితిమను స్ఫురణకూడ మనకులేదు. ఉదయము మొదలు సాయం కాలమువరకును మనము దేహసేవయందే పడియుండుదుము. ప్రపంచములో మఱి యే యానందమును లేదా యన్నట్లు. 'నా శరీర మెంత పెరిగినది, యెంత తరిగినది?' - అహర్నిశ మిదేచింత. భోగలాలసలో, జిహ్వాచాపల్యములో నుండు ఆనందమును పశువులుకూడ అనుభవించుచున్నవి. కాబట్టి త్యాగము, జిహ్వాను జయించుట - వీనిలోని యానందము కూడ చవిచూచెదవా చూడవా? నీవు ఆకలిబాధ పడుచునే నీకై వడ్డించినవిస్తరిని ఆకలిగొన్న మఱియొకనికి పెట్టుటలోగల ఆనందము ననుభవింపుము; అందులోని రుచిని చూడుము. బిడ్డకొఱకై కష్టము లనుభవించు తల్లికి దీని రుచి కొంత మట్టునకు లభించుచున్నది. తనదని చెప్పి మనుష్యుడు కట్టు కొను సంకుచితమైన ఆవరణలోకూడ ఆత్మవికాసముయొక్క రుచి ననుభవింపవలె నన్న యుద్దేశము తెలియకుండగనే పని చేయుచుండును. ఎందులకనగా దేహబద్ధమైన ఆత్మ

వ కొంచెముసేపె దేహమునుండి బయటికి వ్యాప్తమగును. కాని, యీ వ్యాపన 'ఱువంటిది? జైలుగదిలోని ఖైదీ జైలు-ఆవరణలోనికి వచ్చుటవంటిది. కాగాఇంతమాత్రమున ఆత్మకు తృప్తిలేదు. ఆత్మకు కావలసినది ముక్తానందము.

సారాంశమిది, (౧) సాధకుడు అధర్మ పరధర్మముల వక్రమార్గమును వదలి స్వధర్మముయొక్క సహజ సరళ మార్గమును పట్టుకొనవలె. స్వధర్మమను కామధేనువును అత డెన్నటికిని వదలరాదు. (౨) దేహము తృణభంగురమని యెఱిగి స్వధర్మముకొఱకే దాని నుపయోగింపవలె. అవసర మైనప్పుడు స్వధర్మముకొఱకే దాని నాహుతి చేయవలె. (3) ఆత్మయొక్క అఖండత్వమును, వ్యాపకత్వమును నిరంత రమును స్మరించుచు స్వ పర భేదములను మనస్సునుండి పెఱికి వేయవలె. భగవాను డీ ముఖ్య జీవిత సిద్ధాంతములను బోధించుచున్నాడు. ఈ విధానము ననుసరించి పోవు మాన వుడు నిస్సందేహముగ ఈ నర దేహముతోనే సచ్చిదానంద పదమును హస్తగతము చేసికొనును.

8

పై రెండు సిద్ధాంతములకును సామరస్యమును సాధించు యుక్తి : ఫలత్యాగము

భగవంతుడు జీవన సిద్ధాంతములను చెప్పినాడు సరే-కాని కేవలము సిద్ధాంతములను చెప్పినంతమాత్రమున పని

పూర్తికాజాలదు. గీతలో వర్ణింపబడిన సిద్ధాంతములు ఉపని షత్తులలోను, స్మృతులలోను అంతకుముందే యున్నవి. గీత వానినే తిరిగి ప్రతిపాదించినచో అందు గీతయొక్క ప్రత్యేకత యేమున్నది? ఈ సిద్ధాంతములను అనుష్ఠానములోని కెట్లు తేవలయునో తెలుపుటలోనే గీతయొక్క విశిష్టతయున్నది. ఈ మహాసమస్యను పరిష్కరించుటలోనే గీతా కౌశలమున్నది.

జీవన సిద్ధాంతముల నాచరణములోనికి దెచ్చు కళనే– లేక – యుక్తినే యోగమందురు. సాంఖ్యమనగా సిద్ధాంతము– లేక – శాస్త్రము. యోగమనగా కళ. యోగులు జీవనకళను సాధించినారని జ్ఞానదేవుడు సాక్ష్యమిచ్చుచున్నాడు. సాంఖ్యము, యోగము (అనగా శాస్త్రము, కళ)–ఈ రెంటితో గీత పరిపూర్ణత పొందినది. శాస్త్రము, కళ వీని సంయోగము వలన జీవనసౌందర్యము ప్రకటమగును. కేవల శాస్త్రము గాలిలోని మేడ. సంగీతశాస్త్రము నవగతము చేసికొన్నను, పాడి వినిపించగల కళ సిద్ధింపకుండ నాదబ్రహ్మకు శోభలేదు. ఇందువలన భగవంతుడు సిద్ధాంతములతోపాటు వాని వినియోగమును తెలుపు కళనుగూడ చెప్పినాడు. ఆ కళా స్వరూప మెట్టిది? దేహము తుచ్ఛమని తలచి, ఆత్మయొక్క అమరత్వమునెడ అఖండత్వము మీద దృష్టినిలిపి, స్వధర్మా చరణ గావించు ఆ కళ యెట్టిది?

కర్మ నాచరించువారి మనోవృత్తి రెండువిధములుగ నుండును. "కర్మ నాచరించువారము మనమే. దాని ఫలము ననుభవించువారమును మనమే. ఇందులకు మన కధికార

మున్నది." అనునది ఒక మనోవృత్తి. ఇంచుమించుకు విరుద్ధముగ 'ఫలానుభవము లభింపక పోయినచో అసలు కర్మలే చేయము' అనునది రెండవ మనోవృత్తి. గీత మఱియొక మూడవ మనోవృత్తిని చెప్పుచున్నది. "కర్మను మాత్రము తప్పక ఆచరింపుము. కాని ఫలము మీద అధికార ముంచుకొనవలదు" అని గీతయనును. కర్మ చేయువానికి ఫలముమీద అధికారము అవశ్యముగ నున్నది. కాని నీ వా యధికారమును ఇచ్ఛా పూర్వకముగ వదలిపెట్టుము. "కర్మలను స్వీకరించినచో ఫలసహితముగనే స్వీకరింపుము" అని రజోగుణ మనుము. "ఫలమును వదలిన, కర్మనుసైతము వదలవలెను" అని తమోగుణ మనును. ఈ రెండును అన్నదమ్ములే. కనుక నీవీ రెంటిని అధిగమించి, శుద్ధ సత్త్వగుణుడవు కమ్ము. అనగా కర్మ మాత్రము చేయుము, ఫలాసక్తిని విడిచిపెట్టుము. ఫలమును వదలి కర్మ నాచరింపుము. ఆదియందును, అంతమునందును, ఎక్కడనుగూడ ఫలాశ వలదు.

ఫలాశ వలదని చెప్పుచు కర్మను ఉత్తమరీతిని దక్షతతో చేయవలెనని గీతగట్టిగా హెచ్చరించుచున్నది. సకామపురుషుని కర్మకంటె నిష్కామ పురుషుని కర్మ యెక్కువ యోగ్యమైనదిగ నుండవలె. ఈ కోరిక సముచితమే! ఏలయన సకామ పురుషుడు ఫలాసక్తుడు కనుక ఫలసంబంధమయిన స్వప్నచింతలోనే కొంతమట్టునకు వాని సమయమును శక్తియు విధిగా ఖర్చుపడును. కాని ఫలేచ్ఛను వదలినవాని ప్రతిక్షణమును, యావచ్ఛక్తియు కర్మయందే లగ్నమై

యుండును. నదీ ప్రవాహమునకు విరామములేదు, వాయువు నకు విశ్రాంతిలేదు, సూర్యుడు నిరంతరమును వెలుగు చుండుటయే యెఱుగును. ఈ విధముగనే నిష్కామకర్త యెడతెగని సేవాకర్మనే యెఱుగును. ఇట్టి నిరంతరకర్మరతుని కర్మ ఉత్కృష్టమైనది కాకున్నచో మరి యెవరిది కాగలదు ? ఇదిగాక చిత్తసమత్వము నిస్సందేహముగ నొక గొప్ప కల్యాణగుణము. అది నిష్కామ పురుషుని స్వత్వము. చిత్తశుద్ధితో సంబంధములేని వట్టి కర్మకౌశలము కార్మికుని చేతియం దుండవచ్చును. ఆహస్తకౌశలముతోపాటు చిత్త సమత్వముకూడ కలిసిన, ఆ పని మఱింత సుందరమగుట సువిదితము. సరే, మఱియొకసంగతి : కర్మాచరణనుగూర్చి సకామ నిష్కామపురుషులదృష్టిలో భేదమున్నది. ఈ భేదము కూడ నిష్కామపురుషుని కర్మకు చాల అనుకూలము. సకామపురుషుడు కర్మను స్వార్థదృష్టితో చూచును. "కర్మ నాది, కర్మఫలమును నాదే" యను దృష్టికల్పనానికి పనిలో కలుగు కొలదిపాటి నిర్లక్ష్యము నైతికదోషముగ కనిపిం చదు. దోషమేయైన వ్యావహారికదోషమనుకొనును. కాని నిష్కామపురుషునికి తన కర్మవిషయమున నైతికకర్తవ్య బుద్ధి యుండును. కనుకనే తన పనులలో నేమాత్రపు లోటు పాటులుండరాదని అతడు చాల మెలకువతోనుండును. ఇందు వలనకూడ వానిపనులు మిక్కిలిదోషరహితముగ నుండును. ఏ విధమున చూచినను ఫలత్యాగ మత్యంత కల్యాణ దాయకము, యశస్కరము అయిన తత్త్వమని రుజువు

కాగలదు. కనుక ఫలత్యాగమును యోగమని - లేక - జీవిత కళ యని యనవచ్చు.

నిష్కామకర్మమాట యటుండనిచ్చినను, అసలు కర్మలోనున్న సహజానందము దాని ఫలములో లేదు. తన కర్తవ్యకర్మ నాచరించుచుండగా కలుగు తన్మయత్వము ఒక ఆనందప్రవాహమే. "చిత్రపటములను వ్రాయవలదు. నీకు కావలసినంత ధనమును నే నుచితముగ నిత్తును" అని చిత్రకారునితో చెప్పుడు. అతడు మీ మాట నంగీకరింపడు. పొలమునకు పోవలదు, ఆవులను మేపవలదు, మోట తోలుము, నీ వడిగినంత ధాన్య మిచ్చెదను" అని యొకరైతుతో అని చూడుడు. అతడసలైన రయితయినచో అతని కీ బేరము గిట్టదు. సేద్యగాడుదయమునసే పొలమునకు పోవును. సూర్యనారాయణుడు వానికి స్వాగతమిచ్చును. వానికొఱకు పక్షులును పాటలు పాడును. ఆవులును ఎద్దులును అతనిని చుట్టియుండును. అతడు వానిని ప్రేమతో నిమురును. తాను నాటి పెంచిన చెట్లుచేమలను కన్నార చూచుకొనుచుండును. ఈ పనులన్నిటిలో నొక సాత్త్వికానంద మున్నది. ఈ యానందమే ఆ కర్మలకు ముఖ్యమైన, నిజమైన ఫలము. దీనితో పోల్చి చూచినచో దాని బాహ్యఫలము కేవలము గౌణమే.

గీత మానవుని దృష్టిని కర్మఫలమునుండి తొలగించి, ఆ యుపాయముద్వారా వాని కర్మతన్మయత్వమును నూఱురెట్లు పెంచును. ఫలాపేక్ష లేనివాని కర్మతన్మయత సమాధిశ్రేణికి చెందును. ఇందుచేత వాని యానందము

తదితరుల ఆనందముకంటె నూఱురెట్లధికముగ నుండును. ఈ దృష్టితో చూచిన నిష్కామకర్మ స్వతః మహాఫలమే యని వెంటనే మనకు స్ఫురించును. "వృక్షమునకు ఫలము పండ్లు. మఱి పండ్ల కింకను ఫలమేమిటి?" యని జ్ఞానదేవుడు సరిగానే యడిగినాడు. దేహమను నీ వృక్షమునకు నిష్కామ స్వధర్మాచరణవంటి సుందరమైన పండ్లు ఫలించిన తరువాత ఇతర ఫలముల యాశ యించెందులకుండవలె? రైతులు పొల ములో గోదుమలు పండింతురు. వాని నమ్మికొని బొన్న రొట్టెతినుట యెందులకు? మధురమైన అరటిపండ్లను పండించి, వాని నమ్మి మిరెపకాయలెందులకు తినవలె? సోదరా, అరటి పండ్లనే తినరాదా? కాని ప్రజాభిప్రాయమున కిది సరిపడదు. అరటిపండ్లను తిను భాగ్యము కలిగియుండియుకూడ, మనుష్యులు మిరెపకాయలమీదికే యెగబడుచుందురు. "నీ వట్లు చేయవలదు. కర్మనే భుజింపుము, కర్మనే త్యాగము, కర్మనే జీర్ణించుకొను" మని గీత బోధియించున్నది. కర్మ నాచరించుటవలననే సర్వమును సమకూరగలదు. పిల్లవాడు ఆటలోని యానందముకొఱకే ఆడుకొనును. దీనివలన వానికి వ్యాయామఫలము అప్రయత్నముగనే కలుగును. కాని ఆ ఫలముమీద వానికి ధ్యానముండదు. వాని యానంద మంతయు ఆటమీదనే యుండును.

9

ఫలత్యాగమునకు రెండుదాహరణములు

మహాత్ములు తమ జీవితములద్వారా పై విషయమును రుజువుచేసినారు. తుకారాములోని భక్తి భావమునుచూచి శివాజీ మహారాజునకు అతడనిన నెంతయో ఆదరణకలిగెను. శివాజీ యొకసారి తుకారామునింటికి ఒక పాలకీని పంపించి, అతనికి స్వాగత మిచ్చుటకు ఏర్పాటులన్నియు చేసెను. కాని తన గౌరవార్థము చేయబడిన యేర్పాటులను చూచి తుకారామునకు చాల దుఃఖము కలిగెను. "నా భక్తికి ఫలమాయిది ? ఇందులకా నేను భక్తిమార్గమున నుంట ?" అని యతడనుకొనెను. భగవంతుడు గౌరవప్రతిష్ఠలను ఫలమునతనిచేతబెట్టి, అతనిని తననుండి దూరముచేసికొనుచున్నాడా? యని తుకారామునకు తోచెను.

"జాన్ తే హూయే అంతర్, టాలోగే మేరే ఝుంఝుట్?
యహ ఐబ్ తేరేహై, పాండురంగ్ బహుత్ ఖోటీ"

"ప్రభూ ! నీవద్దతి యేమియు బాగుగానుండలేదు. నాకు లంచమిచ్చి నన్ను త్రోసివేయదలచితివా ? ఈ పీడ నెప్పుడు వదల్చుకొనవలె ననుకొంటివేమో ! నే నంతపనికి మాలిన వాడనుగాను. నీ పాదములను గట్టిగా పట్టుకొని కూర్చుందును. భక్తియే భక్తుని స్వధర్మము. భక్తిమార్గములో మధ్య వచ్చు ఫలము లను ముండ్లపొదలు పుట్టకుండ చేయుటయే భక్తుని కళాకౌశలము" అని తుకారా మనెను.

ఫలత్యాగములో నింతకంటెను గంభీరమైన ఆదర్శమును పుండలీకుని చరిత్ర మనకు నిరూపించుచున్నది. పుండలీకుడు తన తల్లిదండ్రుల సేవచేయుచుండెడువాడు. అతని సేవవలన ప్రసన్నుడయి పాండురంగ డతని యొద్దకు పరుగెత్తుకొని వచ్చెను. కాని పుండలీకుడు పాండురంగని స్తుతించు వ్యసన మున జిక్కి చేతిలోనున్న సేవను వదలుట కిష్టపడలేదు. మాతాపితలసేవ యతనికి మధురమైన ఈశ్వరభక్తి యయ్యెను. కుట్టువాడెవడైన పరులసొత్తు నపహరించి తన తల్లిదండ్రులను సుఖపెట్టుచున్నా డన్నను, లేక దేశసేవకు డెవడైన మరియొక దేశమునకు ద్రోహముచేసి స్వదేశము నకు మేలుచేయుచున్నాడన్నను, దానిని భక్తియనుటకు వీలులేదు. అది యాసక్తి యగును. పుండలీకు డిట్టి ఆసక్తిలో చిక్కుకొనలేదు. "ఇప్పుడు నా యెదుటనున్న రూపమేనా పరమాత్మ స్వరూపము? పరమాత్ముడనగా ఇంతేనా? ఈ రూపమున నితడు కనబడకపూర్వము సృష్టి ప్రేతవలె పడి యుండెనా?" యని పుండలీకు డనుకొనెను. "హే భగవన్, నాకు దర్శన మిచ్చుటకు నీవు స్వయముగ దయచేసి యున్నావు. కాని నేను 'ఈ సిద్ధాంతము'లో నమ్మకము కలవాడను. నీ వొక్కడవే భగవంతుడవని నే ననుకొనుట లేదు. నీవును నాపాలిటి భగవంతుడవే, ఈ నా మాతా పితలును భగవంతులే. నేను వీరి సేవలో నిమగ్నుడనయితిని. కాన నీ సంగతి చూడలేను. ఇందులకు నన్ను క్షమింపుము" అని భగవంతునితో అతడనెను. ఇట్లనుచునే భగవంతుడు నిలబడుటకొరకు ఇటిక రాతిని ముందుకుత్రోసి, పుండలీకుడు

తిరిగి మాతాపితల సేవలోనే నిమగ్నుడయ్యెను. ఈ ప్రసంగమును పురస్కరించుకొని తుకారాము సంతోషముతో పరిహాసముగ ఇట్లనును.

*"కైసా తూ రే పాగల్ ప్రేమీ, ఖడా రఖా జో విట్టల్ కో। ఐసా కైసా డీఠ్ సాహసీ, ఈట్ బిఛాయీ విట్టల్ కో ?"

పుండలీకు డుపయోగపరచిన 'ఈ' సిద్ధాంతము ఫలత్యాగమును సాధించుట కొక పద్ధతి. ఫలత్యాగియొక్క కర్మ – సమాధి గంభీరమైనట్లే అతని మనోవృత్తి వ్యాపకము, సమదృష్టి కలదియు నైయుండును. ఈ కారణమువలన నది తత్త్వసంబంధమైన చర్చలలో చిక్కుకొనదు. తన సిద్ధాంతమునుకూడ వదలిపెట్టదు. "నాన్య దస్తీతి వాదినః" – ఇదే సరి, మఱొకటి కానేరదు అను వివాదలోనికి దిగదు. "ఇదియు సరే, అదియును సరే" అనియే దాని వినమ్ర పద్ధతి. ఒక నాడొక గృహస్థు డొక సాధువు నొద్దకు వెళ్ళి, మోక్ష ప్రాప్తికి ఇల్లు వాకిలి వదలిపెట్టుట అవసరమా ?" అని యడిగెను. "లేదే, చూడుము, జనకునివంటివారు రాజభవనములలో నుండుచునే మోక్షము పొందియుండగా ఇల్లు విడిచిపోవలసిన యగత్యము నీకేమివచ్చినది ?"అని సాధువు జవాబిచ్చెను. సాధువునొద్దకు మఱియొకడువచ్చి, "స్వామీ, ఇల్లు వాకిలి విడువకుండ మోక్షము లభించునా ? చెప్పుడు!"అని యడిగెను. "ఆ విధముగ ఎవరన్నారు ? ఇంటిలోనుండగనే శ్రమలేకుండ

* ఓరీ, నీవెంత వెఱ్ఱిభక్తుడవు! పాండురంగని సైతము యిటిక రాతిపై నిలువబెట్టితివి. ఎంత మొండి సాహసము!

మోక్షము ప్రాప్తించినచో, ఇల్లు వాకిలి వదలిపెట్టిన శుకుని వంటివారు వట్టిమూర్ఖులా?" అని సాధువనెను. తరువాత ఈ వ్యక్తు లిద్దరును ఒకరి నొకరు కలిసినప్పుడు ఇద్దరిమధ్యను పెద్ద జగడము బయలుదేరెను. సాధువు 'ఇల్లువాకిలి వదలు' మనెనని ఒకడనును. 'లేదు, వదలవలసిన యవసరము లే'దనె నని రెండవవా డనును. అప్పు డిరువురును తిరిగి సాధువు నొద్దకు వచ్చిరి. "ఇద్దరి మాటయు న్యాయ్యమే! ఎవని భావన యెట్లుండునో వాని మార్గమును అట్లే యుండును. ఎవని ప్రశ్న యెట్లుండునో దానికి సమాధానముకూడ అట్లే యుండును. ఇల్లువదలిపెట్టవలసిన అవసరమున్నదని చెప్పినది నిజమే. మరి వదలవలసిన యవసరము లేదన్నదికూడనిజమే." అని సాధువు వారిని సమాధానపరచెను. దీనినే 'ఈ' సిద్ధాంత మందురు.

ఫలత్యాగమెంత యెత్తునకు లేవగలదో పుండలీకుని యుదాహరణవలన మనకు తెలియగలదు. తుకారామునకు భగవంతుడు కల్పించిన ప్రలోభనముకంటె పుండలీకుని కతడు కల్పించిన పేరాస అత్యంత మోహజనకమైనది. కాని అతడు దానివలనకూడ విమోహితుడు కాలేదు. అయినచో పడిపోయి యుండువాడే. అందుచేత, ఒకసారి సాధనమార్గము నిశ్చితమైనమీదట చివరవరకును దాని ననుసరించుచునే యుండవలె. మధ్యలో భగవద్దర్శనమువంటి విఘ్నములు ప్రత్యక్షముగ అడ్డుతగిలినను, వానిమూలమున సాధన వదలవలసిన అవసరము కలుగరాదు. దేహముండుట

సాధనకొఱకే! భగవద్దర్శన మెప్పుడును హస్తగతమయియే యున్నది! అదెక్కడికి పోవును?

* "సర్వాత్మ – భావ్ మేరా, హోఁ కౌన్ ఛీన్ లే అబ్ ;
తేరీ హీ భక్తి మే మన్ మేరా రంగావువా జబ్ ?"

ఇట్టి భక్తిని లభింపజేసికొనుటకే మనకీ జన్మకలిగినది; 'మా తే సంగోఽస్త్వకర్మణి' నిష్కామ కర్మచేయుచు, అకర్మయొక్క అనగా అంతిమ కర్మముక్తియొక్క, అనగా మోక్షముయొక్క వాసనకూడ దరికి రానీయ వలదనునంత వరకు పై గీతావచనముయొక్క అర్థము చెప్పవచ్చును. వాసనావిమోచనయే మోక్షము. మోక్షమునకు వాసన లతో నేమిపని? ఫలత్యాగ మీ యంతస్తును చేరినపుడు జీవిత కళయొక్క పూర్ణిమ వచ్చినదని తెలిసికొనుము.

10

ఆదర్శ గురుమూర్తి

అర్జునునకు శాస్త్రము చెప్పబడినది, కళకూడ చెప్పబడినది. కాని యింతమాత్రమున తత్త్వమంతయు చిత్రపటమునలె స్పష్టముగా కనబడలేదు. శాస్త్రము నిర్గుణము, కళ సగుణము. అయినను సగుణమునకూడ సాకారమైనప్పుడు

* నీభక్తిలో నామనసు లీనమైయున్నప్పుడు ఇంక నా సర్వాత్మ భావమును ఎవరు నా నుండి వేరుచేయగలరు?

గాని వ్యక్తముకాదు. నిర్గుణము రూపరహితముగ కేవలము గాలిలో నున్నట్లే, సగుణముకూడ నిరాకారముగ నున్నంత వరకు ఈ స్థితిలోనే యుండును. మూర్తీభూత సద్గుణుడైన మహాత్ముని దర్శించుటయే దీని కుపాయము. ఇందులకనియే అర్జును డీ విధముగ అడుగుచున్నాడు:- "ఓ దేవా! జీవిత ముఖ్యసిద్ధాంతములను, వానిని సాగించుకళను చెప్పియుంటివి. అయినను దీని రూపము స్పష్టముగ కన్నులకు కట్టినట్లులేదు. కనుక ఇప్పు డుదాహరణ పూర్వకముగ దీని రూపమును నాకు చిత్రించి చూపుము. బుద్ధియందు సాంఖ్యనిష్ఠ సుస్థిరమై యున్నట్టి, ఫలత్యాగరూపమైన యోగము రోమరోమము నందును వ్యాప్తమై యున్నట్టి పురుషుల లక్షణము లెట్టివో చెప్పుము. ఫలత్యాగముయొక్క లోతుపాతులను పూర్తిగ చూపగలిగినవారు, కర్మసమాధిలో నిమగ్నులైనవారు, ఆత్మనిశ్చయములో మహామేరువులు, స్థితప్రజ్ఞులు అనబడు వారు ఎట్లు మాటలాడెదరో, ఎట్లు కూర్చుందురో, ఎట్లు సంచరింతురో-ఇదంతయు నాకు తెలియజెప్పుము, స్వామీ!"

ఇందులకనియే భగవానుడు రెండవఅధ్యాయముచివరి పదునెనిమిది శ్లోకములలోను స్థితప్రజ్ఞుని గంభీరమైన,ఉదాత్త మైన చరిత్రమును చిత్రించినాడు. ఈ పదునెనిమిది శ్లోకము లలో గీతయొక్క అష్టాదశాధ్యాయముల సారమంతయు ఇమిడ్చిపెట్టినట్లున్నది. స్థితప్రజ్ఞుడు గీతలోని ఆదర్శమూర్తి. ఈ శబ్దముకూడ గీతయొక్క స్వతంత్రకల్పన. ఈ విధముగనే అయిదవఅధ్యాయములో జీవన్ముక్తునియొక్కయు, పండ్రెండవ

దానిలో భక్తునియొక్కయు, పదునాల్గవదానిలో గుణాతీతుని యొక్కయు, పదునెనిమిదవదానిలో జ్ఞాననిష్ఠుని యొక్కయు వర్ణన చేయబడినది. కాని స్థితప్రజ్ఞుని వర్ణన వీని యన్నిటి కంటెను విస్తరముగ విప్పి చెప్పబడినది. ఇందు సిద్ధుని లక్షణములతోపాటు సాధకుని లక్షణములుకూడ చెప్పబడినవి. వేలకొలది స్త్రీపురుషసత్యాగ్రహులు సాయంకాల ప్రార్థనలో ఈ లక్షణములను పఠించుచుందురు. ఆ శ్లోకములను ప్రతి గ్రామమునకును ప్రతి గృహమునకును అందింపగలుగుట యెంత ఆనందదాయకము! అవి మొదట మన హృదయములలో నెలకొనినచో, తదుపరి తమంతట తామే బయటివారి హృదయములలో ప్రవేశింపగలవు. నిత్యము పఠించునది వట్టి చిలుకపలుకైనచో అది హృదయములో అంకితమగుటకు బదులు, ఉన్న భక్తిభావమునుకూడ తుడిచివేయును. ఇది నిత్యపఠనమువలన వచ్చుదోషము కాదు. మననము చేయకుండుటవలన వచ్చు కీడు. నిత్యపఠనముతోపాటు నిత్య మననమును, నిరంతరాత్మపరీక్షయు అవసరము.

స్థితప్రజ్ఞుడనగా స్థిరబుద్ధి కలవాడు. అన లాపేరులోనే యీ యర్థమున్నది. కాని సంయమము లేకుండ బుద్ధి యెట్లు స్థిరపడును? కనుకనే స్థితప్రజ్ఞుని సంయమమూర్తి యన్నది గీత. బుద్ధి ఆత్మనిష్ఠకలదయి యుండవలె. అంతర్బాహ్యేంద్రియములు బుద్ధికి అధీనములు కావలె. సంయమ మనగా ఇది. స్థితప్రజ్ఞుడు సమస్తేంద్రియములకును కళ్లెమువేసి కర్మయోగమను క్షేత్రమును దున్నును. ఇంద్రియములనెడి ఎద్దులతో


అతడు నిష్కామ స్వధర్మాచరణ మను సేద్యమును కట్టుదిట్టముగ చేయును. తన యుచ్ఛ్వాస నిశ్శ్వాసము లన్నియు పరమార్థమునకే వినియోగించుచుండును.

ఇంద్రియసంయమము సులువైనదికాదు. ఇంద్రియముల నసలేఉపయోగింపకుండుట ఒకవిధముగ సులువే కావచ్చును. మౌనము, నిరాహారము మొదలైనవి యంత కఠినమైనవి కావు. అట్లే యింద్రియములను యథేచ్ఛముగ వదలివేయుట కూడ అందరికిని సులువే. కాని తాబేలు ప్రమాదస్థితిలో తన యవయవముల నన్నిటిని ముడిచి దాచుకొనుచు, నిర్భయ స్థలములలో వాని నుపయోగించుకొనుచు ఉన్నట్లు ఇంద్రియములను విషయ భోగముల వైపునకు పోకుండ ముడుచుట, వానిని పారమార్థిక కార్యములలో ఉచిత రీతిని ఉపయోగించుట లెస్స. ఈ సంయమము కఠినమైనది. దీనికి అత్యంతమైన ప్రయత్న మవసరము. జ్ఞానముకూడ అవసరము. కాని ఇవన్నియు ఉన్నను అది యెల్లపుడును సుసాధముకాదు. అట్లని మనము నిరాశచెందవలసినదేనా? చెందరాదు. సాధకు డెన్నడును నిరాశచెందరాదు. సాధకుడు సమస్తోపాయములద్వారా ప్రయత్నించియు సంయమస్థితిని చేరలేకపోయినచో, అతడు భక్తియొక్క ఆశ్రయమును పొందవలె. అమూల్యమైన ఈ సూచనను భగవంతుడు స్థితప్రజ్ఞుని లక్షణములలో ఇచ్చియున్నాడు. దీనిని తూచినట్లు క్షిప్తముగ చెప్పినాడు. బండెడు వ్యాఖ్యానములకంటె దీని విలువ హెచ్చు. ఎందులకనగా, భక్తికి సరిగా అవసరమున్న

చోటనే దీనికి స్థానమియ్యబడినది. స్థితప్రజ్ఞని లక్షణములను సవిస్తరముగ ఇక్కడ మనము వర్ణింపనక్కరలేదు. కాని మనము ఈ సాధనలన్నిటిలోను భక్తియొక్క నిశ్చితస్థానమును మఱువకుండుటకు దీనిని జ్ఞప్తికి తేవలసి వచ్చినది. ఈ జగత్తులో కేవల స్థితప్రజ్ఞు డెవడయినా డను విషయము భగవంతునికే యెఱుక. కాని సేవాపరాయణుడైన స్థితప్రజ్ఞునికి ఉదాహరణగా పుండలీకునిమూర్తి యెల్లపుడును నాయెదుట కనబడుచునే యుండును. దానిని నేను మీ యెదుట పెట్టనే పెట్టితిని.

సరే, యిప్పుడు స్థితప్రజ్ఞని లక్షణములును, వానితో రెండవ అధ్యాయమునుకూడ సమాప్తి చెందినవి.

(నిర్గుణ) సాంఖ్యబుద్ధి + (సగుణ) యోగబుద్ధి + (సాకార) స్థితప్రజ్ఞ.



కలసి

సంపూర్ణ జీవితశాస్త్రము.

దీనిలోనుండి బ్రహ్మనిర్వాణము – లేక – మోక్షము గాక మరేమి ఫలము రాగలదు ?

గీతా ప్రవచనములు

మూడవ అధ్యాయము

కర్మయోగము

11

ఫలత్యాగికి ఫలము లనంతముగ లభించును.

సోదరులారా !

రెండవ యధ్యాయములో సంపూర్ణజీవితశాస్త్రమును మనము పరిశీలించినారము. మూడవ అధ్యాయములో ఈ జీవితశాస్త్రమే స్పష్టీకరింపబడినది. ఇంతకు పూర్వము తత్త్వమును తెలిసికొంటిమి. ఇక దానివివరణలను పరిశీలింప వలె. వెనుకటి యధ్యాయములో కర్మయోగమునుగూర్చి వివేచనచేసియున్నాము. కర్మయోగములోని ఉత్కృష్ట విషయము ఫలత్యాగము. కర్మయోగమునకు ఫలత్యాగ మవసరమే. అయినను కర్మయోగికి ఫల మేమైనలభించునాలేదా? కర్మఫలములను త్యజించుటవలననే కర్మయోగికి ఫలము పలురెట్లుగ లభించునని మూడవ యధ్యాయము చెప్పుచున్నది.

ఇక్కడ లక్ష్మీకథ నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆమె స్వయంవరము వచ్చెను. దేవదానవులందరును పెద్ద

ఆశతో వచ్చిరి. లక్ష్మి తన ప్రతిజ్ఞను ముందుగ ప్రకటింప లేదు. సభామంటపమునకువచ్చి, "నన్ను కోరుకొనినివానికి నేను వరమాల వేయుదును" అన్నది. వచ్చిన వారందరును పేరాస కలవారు! కనుక లక్ష్మి తన్ను కోరని వరుని వెదక నారంభించెను. శేషతల్పముపై శాంతచిత్తుడై పరుండియున్న విష్ణుమూర్తి యామెకు కనబడెను. ఆయనకంఠమున వరమాలవేసి ఆమె నాటినుండి నేటివరకును ఆయన పాదసేవ చేయుచునే యున్నది. "కోరనివారికే రమ దాసి యగును". ఇదే విశేషము.

సామాన్య మానవుడు తనకు లభించు ఫలముచుట్టును ముండ్లకంచెవేసి దానిని కాపాడుకొనును. కాని యిందువలన వలురెట్లుగ పొందవలసిన ఫలము నతడు కోల్పోవును. ప్రాపంచిక ధోరణిలోని మానవుడు కర్మల నపారముగ నాచరించి ఫలమును అల్పముగ పొందును. కాని కర్మయోగి కర్మలను కొలదిగ నాచరించినను ఫలము పెక్కు రెట్లుగ పొందును. తన భావన ననుసరించియే యీ భేదము కలుగుచుండును. ఒక చోట టాల్‌స్టాయి యిట్లన్నాడు: "లోకులు ఏసుక్రీస్తు బలిదానమును హెచ్చుగ స్తుతింతురు కాని ప్రాపంచిక మానవులు నిత్యమును ఎన్నియొడుదొడుకులతో అగచాట్లు పడుచుందురో చెప్పనలవికాదు. రెండుగాడిదలబరువు మోప వేసికొని మితిలేని ప్రయాసపడుచుండు ఈ ప్రాపంచిక జీవుల కష్టములును బాధలును ఏసుక్రీస్తు పడినవానికంటె ఎన్నో రెట్లు హెచ్చు! అయినను వీరెంత అధోగతిపాలగుచున్నారు!

క్రీస్తు త్రాము పడ్డ కష్టములో సగమైనను భగవంతునికొరకు పడినచో నిశ్చయముగ క్రీస్తుకంచెను గొప్పవా రగుదురు."

ప్రాపంచిక మానవుల తపస్సు గొప్పదే. కాని యదంతయు క్షుద్రఫలముల నిమిత్తమే. వాసనలనుబట్టియే ఫలము. మన వస్తువులకు మనము కట్టునట్టి విలువను మించిన విలువ ప్రపంచము ఈయదు. కుచేలుడు అటుకులు తీసికొని భగవంతునియొద్దకు వెళ్ళినాడు. ఆ పిడికెడటుకులు చమ్మిడీయైన చేయవు. కాని కుచేలుని కవి అమూల్యముగ కనబడెను. ఎందుచేతననగా వానిలో భక్తి మిళితమై యుండెను. అవి మంత్రింపబడిన యటుకులు. అందున్న ప్రతి గింజలోను భావన యుండెను. వస్తు వల్పమైనను మంత్ర బలముచేత దాని విలువయు, సామర్థ్యమును పెరుగును. కరెన్సీనోటు బరువెంత? దానితో మంటపెట్టిన గరిటెడు నీరుకూడ వెచ్చపడదు. కాని దానిమీద ఒక మొహరున్నది. ఆ మొహరునుబట్టియే దాని కా విలువ.

కర్మయోగములోనున్న విశేషముకూడ ఇదే. కర్మ యీ నోటువంటిది. విలువ భావన యను మొహరునకు గాని కర్మ యను కాగితపు ముక్కకు కాదు. ఒకవిధముగ మూర్తిపూజలోని రహస్యమునే ఇక్కడ చెప్పుచున్నాను. మూర్తిపూజయొక్క కల్పనలో గొప్ప సౌందర్యమున్నది. ఈ మూర్తి నెవరు విరిచి ముక్కలుచేయగలరు? ఈమూర్తి ఆదిలో నొక జాతిముక్కయే. నేను దానికి ప్రాణప్రతిష్ఠ చేసితిని. నా భావన నందు చొప్పించితిని. నా భావనను

ఎవరు తునియలుచేయగలరు? ఱాయి ముక్కలగును. భావన కాదు. మూర్తినుండి నాభావనను తొలగించిన తక్షణమే ఱాయి మిగులును. అప్పుడే అది ముక్కలుకాగలదు.

ఇప్పుడు ఱాయి-లేక-కాగితపుముక్కవంటిదే కర్మ యని తేలినది. తల్లి కాగితపుముక్కమీద మూడునాలుగు వంకరటింకర పంక్తులలేఖ యొకటివ్రాసి కుమారునికి పంపిన దనుకొనుడు. మఱియొక డేదో వ్రాసి యేబదిపుటలకట్ట పంపినాడనుకొందము. కాగా ఇప్పుడు వీనిలో దేని తూక మెక్కువ? తల్లి వ్రాసిన ఆ నాలుగు పంక్తులలోని భావము అమూల్యము, పవిత్రము. రెండవవ్యక్తి పంపిన ఆ పనికిరాని కట్ట దీనితో సాటికాదు. కర్మకు ఆర్ద్రిత కావలెను; భావన యుండవలెను. మనము కూలివానిపనికి విలువగట్టి మజూరీ నిచ్చివేయుదుము. కాని దక్షిణ విషయ మట్టిదికాదు. అది నీటితో తడిపి యీయబడును. దక్షిణ విషయమున ఎంత యిచ్చినారమనునది కాదు ప్రశ్న. అందులో ఆర్ద్రిత యున్నదా లేదా యనునదే ముఖ్యవిషయము. మనుస్మృతిలో మిక్కిలి మనోరంజకమైన ఘట్టమొకటున్నది. పశుతుల్యుడైన శిష్యు డొకడు పండ్రెండేండ్లు గురు గృహమున వసించి మనుష్యు డయ్యెను. అప్పు డతడు గురుదక్షిణ యేమియీయవలె? ప్రాచీన కాలమున ముందే జీతములు వసూలుచేయుకట్టడ లేదు. పండ్రెండేండ్ల చదువు పూర్తియైన తరువాత గురుకట్న మిచ్చి వేయు పద్ధతి యుండెను. "గురుదేవునికి పత్రమో పుష్పమో, విసనకఱ్ఱయో, పావకోళ్లో లేక నీరు నింపిన కలశమో

సమర్పించు"మని మనువు చెప్పను. ఇదేమియు పరిహాసము కాదు. ఇచ్చునది శ్రద్ధతో నీయవలె. పుష్పమునకు బరువు లేదు. కాని దానిలోని భక్తిభావమునకు బ్రహ్మాండమంత బరువున్నది.

* "రుక్మిణీనే ఏక్ హీ తులసీ – దళ్ నే
తోలా ప్రభు గిరిధర్ కో"

సత్యభామ పుట్టె డాభరణములను వేసికూడ పనిని సాధింపలేకపోయెను. కాని రుక్మిణీమాత భక్తిభరితమైన ఒక్క తులసీదళమును త్రాసులో వేసినంతనే పని పూర్తి యయ్యెను. ఇప్పుడది సామాన్యపు తులసియాకు కాదు; అభిమంత్రితమైన తులసిదళము. కర్మయోగి చేయు కర్మవిషయముకూడ ఇంతే.

ఇద్దరు వ్యక్తులు గంగాస్నానము నిమిత్తము వెళ్ళినారనుకొనుడు. అందొకడిట్లనును: "జనులు 'గంగ, గంగ' యందురు. అందులో ఏమున్నది? 'హైడ్రోజన్' అను గాలి రెండుభాగములు, 'ఆక్సిజన్' అను గాలి ఒకభాగము, ఈ రెండును కలసి గంగయైనది. ఇంతకుమించి అందులో నేమున్నది?" ఇక రెండవవాడనును: "కృష్ణభగవానుని పదకమలములనుండి ఇది బయలుదేరి శంకరుని జటాజూట మున వాసముచేసినది. వేలకొలది బ్రహ్మఋషులును, రాజఋషులును దాని యొడ్డున తపస్సు చేసిరి. అనేక పుణ్య

* రుక్మిణీదేవి ఒక్క తులసిదళముతోనే గోవర్ధనపర్వతము నెత్తిన కృష్ణపరమాత్మను తూచగలిగెను.

క్రతువులు అక్కడజరిగినవి. అట్టి పవిత్ర గంగామాతయిది." ఇట్టి పూర్ణభావముతో వాడు నదిలో స్నానముచేయును. హైడ్రోజన్ - ఆక్సిజన్ సిద్ధాంతికూడ స్నానముచేయును. ఇప్పుడు దీనివలన దేహపారిశుధ్య మను ఫలము మాత్రము ఇద్దరికిని రానేవచ్చినది. కాని ఆ భక్తునికి దేహపారిశుధ్య ముతోపాటే చిత్తశుద్ధి యను ఫలముకూడ లభించినది. వట్టి స్నానమేయైనచో, గంగలో ఎద్దులుకూడ స్నానముచేయును. వానికికూడ శరీరమాలిన్యము వదలిపోవును. కాని చిత్త మాలిన్యము వదలుఱెట్లు? ఒకనికి దేహశుద్ధి యను అల్ప ఫలము మాత్రము లభించినది. రెండవవానికి దానికితోడు చిత్తశుద్ధి యను అమూల్య ఫలము చేకూరినది.

స్నానముచేసి సూర్యనమస్కారములు చేయువానికి వ్యాయామఫలము కలిగితీరును. కాని వాడారోగ్యముకొఱకు ఆ పని చేయడు, ఉపాసనకొఱకు చేయును. దీనివలన శరీర మున కారోగ్యలాభము విధిగా కలుగును, బుద్ధియొక్క తేజస్సుకూడ పెరుగును. ఆరోగ్యముతోపాటే చురుకుదన మును, బుద్ధివికాసమునుగూడ సూర్యనారాయణుని వలన లభించును.

కర్మయొకటే; కాని భావనాభేదమువలన దాని రూపములు భేదించును. పారమార్థిక మానవునికర్మ ఆత్మ వికాసమును కలిగించును. ప్రాపంచిక మనుష్యునికర్మ ఆత్మను స్థిరముగ బంధించును. కర్మయోగి కర్షకుడైనచో స్వధర్మ భావనతో సేద్యము చేయును. దీనివలన అతని యుదరపోషణ

విధిగా జరిగిపోవును. కాని పొట్టకొఱకై అత డీపని చేయడు. నైవేద్యము చేయగలశక్తిని సంపాదించుటకే అతడు భుజించును. స్వధర్మము వానికి లక్ష్యము. భోజనము దానికి సాధనము. ఇక కర్మయోగికాని హేతునకు ఉదరపోషణ లక్ష్యము; నైవేద్యము దానికి సాధనము. ఇట్లీ స్థితులు పరస్పర విరుద్ధముగ నుండును.

రెండవ యధ్యాయము స్థితప్రజ్ఞుని లక్షణములను వర్ణించుచు, ఈ విషయమును బాగుగ చిత్రించినది. ఇతరులు మేల్కొనియున్నపుడు కర్మయోగి నిద్రపోవుచుండును. ఇతరులు నిద్రపోవుచున్నపుడు కర్మయోగి మెలకువతో నుండును. ఉదరపోషణకై మనము జాగ్రత్తపడుచుండగా కర్మయోగి కర్మరహితముగ నొక్కక్షణముకూడ పోకూడదను మెలకువలో నుండును. తస్పనిసరికనుక అతడు భుజించును. ఈ కడు పను హండీలో నింత పడవేయవలెను కనుకనే పడవేయును. ప్రాపంచిక మానవునికి భోజనములో ఆనంద మున్నది. యోగికి భోజన మనిన కష్టము కలుగును. కావున నతడు రుచు లెంచుకొనుచు భుజింపడు. సంయమముతో సంచరించును. ఒకనికేది రాత్రియో అది రెండవవానికి పగలు. ఒకనికేది పగలో అది రెండవవానికి రాత్రి. అనగా ఒకనికేది యానందమో అదే రెండవవానికి దుఃఖము. ఒకనికేది దుఃఖమో అది రెండవవాని కానందము. సంసారి, కర్మయోగి – ఈ యిరువురి పనులును ఒకరకముగనే కనిపించును. కాని ఫలాసక్తిని వదలి కర్మలోనే రమించుట

కర్మయోగియొక్క విశిష్టత. సంసారినలెనే యోగియు భుజించును, త్రాగును, నిద్రించును. కాని తత్సంబంధమైన భావనవానిలో భిన్నముగ నుండును. ఇంకుచేతనే మఱి పదునారధ్యాయములు ముందుండగనే ఆరంభములోనే స్థితప్రజ్ఞుని సంయమమూర్తి చిత్రింపబడెను.

ప్రాపంచిక మానవుడు, కర్మయోగి – ఈ యిరువురి కర్మలలోని సామ్యమును, వైరుధ్యమును ఎప్పటికప్పుడు కనిపించుచునే యుండును. కర్మయోగి గోసేవచేయుచున్నాడనుకొనుము. అత డేదృష్టితో పనిచేయును? గోసేవవలన సమాజమునకు సమృద్ధిగ పాలు లభింపవలెననియు, గోవు నెపమున మానవశ్రేణికి క్రిందనున్న సకలసృష్టితో ప్రేమసంబంధ మేర్పడవలెననియు అతని భావన. ఇంతేకాని వేతనము దొరకునని కాదు. వేతన మెక్కడికినిపోదు. కాని నిక్కమైన యానందము, నిజమైన సుఖము ఈ దివ్యభావనలో నున్నది.

కర్మయోగి చేయు కర్మ అతని నీవిశ్వముతో నేకరూపముచేయును. తులసికి నీరుపోయకయే భోజనము చేయరు. ఇట్లు వనస్పతిసృష్టితో మనము ప్రేమసంబంధము కలుపుకొన్నారము. తులసిని ఆకలితోనుంచి ముందు నేను తినగలుగుటెట్లు? ఈవిధముగ గోగణముతో నేకరూపము, వనస్పతులతో నేకరూపము పొందుచు సర్వవిశ్వముతో నేకరూపమును పొందవలసియున్నది. భారతయుద్ధములో సూర్యాస్తమయము కాగానే అందరును సంధ్యావందనమునకు పోయెడువారు. కాని కృష్ణభగవానుడు రథాశ్వములను విప్పి వానికి నీరు

పెట్టుట, దాణావేయుట, వాని శరీరములో గ్రుచ్చుకొన్న బాణములను తీసివేయుట- ఈ పనులలో నుండువాడు. ఆ సేవ అతని కెంతయు నానందదాయకమైయుండెను. ఈ వర్ణనతో శవి తృప్తినొందలేదు. తన పీతాంబరములో దాచివేసికొని వెళ్ళి గుఱ్ఱములకు పెట్టిన ఆ పార్థసారథి చిత్రపటమును మీ మనస్సులో దర్శింపుడు. అప్పుడు కర్మయోగి యొక్క ఆనందమును మీరూహించుకొనగలరు. ప్రతి పనిని అధ్యాత్మికము, ఉచ్చతరమునగు పారమార్థిక కర్మగా తలంపుడు. క్షుద్రపు విషయమును తీసికొనుము. ఖాదీమూట భుజముపై వేసికొని తిరిగి అమ్మువాడు విసుగుపొందునా ? పొందడు. ఎందులకనిన దేశములో అన్నవస్త్రములు లేని కోట్లకొలది సోదరీ సోదరుల కించుక అన్నము కల్పించు భారము తనదను భావనలో అతడు నిమగ్నుడైయుండును. ఆతడొక్క గజము ఖద్దరమ్మినను అది యతనిని సమస్త దరిద్రనారాయణులతో నేకరూపము చేయును.'

12

కర్మయోగమువలని వివిధ ప్రయోజనములు

నిష్కామకర్మయోగములో అద్భుతమైన సామర్థ్యమున్నది. ఇట్టి కర్మవలన వ్యక్తికిని సమాజమునకునుగూడ పరమ కల్యాణము చేకూరును. స్వధర్మము నాచరించు కర్మయోగికి శరీరయాత్ర జరుగుటయే యుండును. సర్వదా

శ్రమజీవియై యుండుటవలన అతనిశరీరము నీరోగముగను, స్వచ్ఛముగను ఉండును. ఇంతేకాక వాని కర్మద్వారా సమాజముకూడ సురక్షిత మగును. కర్మయోగియైన వైతు హెచ్చులాభము వచ్చునని నల్లమందును, పొగాకును ఉత్పత్తి చేయడు. ఎందులకనగా అతడు తన కర్తవ్యకర్మను సమాజ క్షేమముతో కలిపి చూచుకొనును. స్వధర్మమైన కర్మ సమాజమునకు హితకారిగనే యుండును. తాను సాగించు వ్యాపారము ప్రజాహితముకొఱకేయని విశ్వసించు వర్తకుడు విదేశవస్తువుల నెన్నటికిని విక్రయింపడు. అత డే వ్యాపారము చేసినను అది సమాజోపకారిగ నుండును. తన్ను దాను మఱచి, తన యిరుగుపొరుగులతో నేకరూపమగు కర్మయోగి పుట్టి పెరిగిన సమాజము సువ్యవస్థకును, సమృద్ధికిని, సామన స్యమునకును నిలయమై యుండును.

కర్మయోగియొక్క కర్మకుఫలముగ వాని శరీరయాత్ర జరుగును. దానితోపాటు వాని దేహమును బుద్ధియు తేజస్వంత ములగును. సమాజ కల్యాణముకూడ చేకూరును. ఈ రెండుఫల ములకునుతోడు చిత్తశుద్ధియను మహాఫలమువానికిలభించును. 'కర్మణాశుద్ధిః' అని యన్నారు. చిత్తశుద్ధికి సాధనము కర్మ. కాని అది అందరును చేయు సాధారణకర్మ కాదు. కర్మయోగి యాచరించు అభిమంత్రితకర్మనుండి చిత్తశుద్ధి కల్గును. మహాభారతములో తులాధరుడను వైశ్యునికథ యున్నది. జాజలియను బ్రాహ్మణు డొకడు జ్ఞానప్రాప్తికొఱకు తులా ధరునియొద్దకు పోయెను. తులాధరుడు, "సోదరా, ఈ తరాజు

దండెను నిరంతరమును సరిగా మొగ్గులేకుండ ఉంచుటయే నా పని" యనెను. ఈ బాహ్యకర్మ చేయుచుండగనే తులాధరుని మనస్సుకూడ నిష్కపటము, సరళము అయ్యెను. దుకాణమునకొక చిన్నకుఱ్ఱవాడువచ్చినను, లేక పెద్దవాడు వచ్చినను, ఆ తరాజుదండె యందఱకును ఒకరీతిగనే మొగ్గులేక ఉండును. పనియొక్క ప్రభావము మనస్సు మీదకూడ పనిచుండును. కరయోగిచేయుకర్మ ఒక రకముగ జపమే యని తెలిసికొనుడు. దానివలన వానికి చిత్తశుద్ధి కలుగును. అట్టి నిర్మల చిత్తమున జ్ఞానము ప్రతిబింబించును. తమతమ భిన్నభిన్న కర్మలద్వారా కర్మయోగులు చివరకు జ్ఞానమును పొందుదురు. తరాజుదండివలన తులాధరునికి సమబుద్ధి కలిగెను. సోనా యను మంగలి క్షురకర్మ చేయుచుండువాడు. అనేకులకు తలపనిచేసి మాలిన్యమును పోగొట్టుచుండగా అతనికి జ్ఞానోదయమయ్యెను. "నే నితరుల తలల మాలిన్యమును పోగొట్టుచున్నానేకాని, నా తలకును నా బుద్ధికిని పట్టినమైల నెన్నడైన వదలుగొట్టుకొంటినా ?" – ఇట్టి అధ్యాత్మికభాష యతనికి తన వృత్తినుండి స్ఫురించెను. పొలములో కలుపుతీయుచుండు కర్మయోగి తన హృదయమున కంటిన వాసనావికారరూపమైన మాలిన్యమును తీసివేసికొను బుద్ధిపుట్టును. మట్టిని మెత్తగా మర్దించి, బాగుగ కాలినకుండలను సమాజమున కందజేయు కుమ్మరి గోరా, జీవితము లను కుండలనుకూడ గట్టిగా తయారుచేయవలెనని మనస్సులో దృఢపరచుకొనెను. అప్పు డతడు చెక్క చేతబట్టుకొని 'క్కుండ పచ్చిదా కాలి

నదా ?' యని యనుచు మహాత్ముల తలలు తట్టి వారిని పరీక్షించు పరీక్షకు డయ్యెను. దీనినిబట్టి కర్మయోగి తన వృత్తికి సంబంధించిన పారిభాషిక శబ్దములను వాడుచు, ఆ వృత్తి నిర్వహణద్వారమునసే జ్ఞానమును పొందుచుండు నను విషయము స్థిరపడుచున్నది. ఇట్లతడు పనిచేయునది వట్టి కర్మాగారముగాక అధ్యాత్మిక శిక్షణాలయ మగు చున్నది. అత డాచరించు కర్మ ఉపాసనామయము, సేవామయము. బయటినుండి చూచిన నది కేవలము వ్యావహారికముగనే కనబడును. కాని, లోపలినుండి చూచిన నది అధ్యాత్మికము.

కర్మయోగియొక్క కర్మవలన మతీయొక ఉత్తమ ఫలముకూడ లభించును. సమాజమునకొక ఆదర్శము లభించుటయే ఆ ఫలము. ఒకడు ముందుపుట్టుట, మతీయొకడు తరువాతపుట్టుట-ఈ భేదము సమాజములో ఉండనేయున్నది. తన తరువాత పుట్టినవానికి తానొక యాదర్శముగ నిలువ వలసిన బాధ్యతముందుగా జన్మించినవాని కున్నది. ప్రత్యక్ష మైన అనుష్ఠానముద్వారా తానొక ఆదర్శమును చూపవలసిన బాధ్యత తమ్ముని యెడల అన్నకును, బిడ్డలయెడల తలిదండ్రుల కును, అనుచరులయెడల నాయకునికిని, శిష్యునియెడల గురువునకును ఉన్నది. ఇట్టి యుదాహరణను కర్మయోగులు గాక మరెవరు చూపగలరు?

కర్మలోనే ఆనందము ననుభవించుటవలన కర్మయోగి యెల్లపుడును కర్మ నాచరించుచునే యుండును. అందువలన

సమాజమున మోసము పెరుగదు. కర్మయోగి స్వయం తృప్తుడు. అయినను కర్మనాచరింపకుండ ఉండలేడు. "భజన వలన భగవంతుడు లభ్యమైనాడని నేను నేడు భజనను మానుదునా? భజన యిప్పుడు నాకు సహజధర్మమైనది" అన్నాడు తుకారాము.

పహలే జోడాసంత్ సంగ్ । తుకాహువా పాండురంగ్ ।
భజన్ కా ఠాంతా టూటేకో క్యా? మూలస్వభావ్ ఛూటేకో క్యా?

కర్మయోగి కర్మయను మెట్టునెక్కి శిఖరమును చేరుకొనును. అయినను శిఖరమును చేరికూడ కర్మయను మెట్టును వదలడు. అతడు దానినుండి విడివడనేలేడు. ఇట్లు కర్మనైపుణకు మొదటి సహజస్థితి వాని యింద్రియములను కలుగును. ఈ రీతిగ నలడు స్వధర్మకర్మరూపమైన సేవామహత్త్వమును సమాజమునకు నచ్చునట్లును, అనుకరణీయముగను చేయును.

సమాజములోని మోసమును నిర్మూలించుట యెంతో గొప్పవిషయము. కపటమువలన సమాజ మధోగతిపాలగుచున్నది. కాని జ్ఞాని యూరక కూర్చుండినచో అతనినిచూచి యితరులుకూడ చేతులుముడుచుకొని కూర్చుందురు. జ్ఞాని నిత్యతృప్తుడగుటవలన ఆత్మసుఖోన్మత్తుడును, శాంతుడునై యుండును. కాని యతనినిచూచి మతియొకడు లోలోన అసంతృప్తితో విలపించుచునే కర్మశూన్యుడగును. ఒకడు అంతస్తృప్తుడయి స్వస్థుడగును. మరియొకడు క్రోధముతో లోలోపల రగులుచుకూడ స్వస్థునివలె కానిపించును.

ఈ స్థితి భయంకరమైనది. దీనివలన దంభము అధికమగును. కాని సత్పురుషు లందరును శిఖరము నధిష్ఠించియు తమ సాధనయొక్క విశిష్టతవలన కర్మ నాశ్రయించియే యుందురు. మరణపర్యంతమును స్వకర్మ నాచరించుచునే యుందురు. పిల్లల బొమ్మలాటలలో తల్లికూడ భాగస్వామిని యగుచుం డును. అవి వట్టి పిల్లలయాటలని ఎరిగియు తల్లి పిల్లలతో కలిసి యాడుచు ఆ యాటలకొక రుచిని కల్పించును. తల్లి యా క్రీడలలో భాగస్వామిని కానిచో పిల్లల కంపు రుచియే యుండదు. కర్మయోగి 'నేను తృప్తుడనుకదా' యని కర్మను వదలిపెట్టినచో ఇతరులు అసంతృప్తితో నుండికూడ కర్మను వదలుదురు. కాని వారు వాంఛలు తీరక అనందరహితులై యుందురు.

అందువలన కర్మయోగి సామాన్యమానవునివలె కర్మ నాచరించు చుండును. 'నాలో నొక ప్రత్యేకతయున్నది' అని యత డనుకొనడు. ఇతరులకంటె చాలరెట్లతడు శరీర పరిశ్రమచేయును. 'ఇవి పారమార్థిక కర్మ'లని వేనికిని ముద్రవేయవలసిన పనిలేదు. తనపనినిగూర్చి బహిరంగ ప్రక టన చేయ నవసరములేదు. నీ వుత్కృష్టబ్రహ్మచారివైనచో ఇతరులకంటె నూరురెట్లుత్సాహమును నీపనిలోచూపుము. తగినంత ఆహారము దొరకకపోయినను పనిమాత్రము త్రిగుణీ కృతమగులాగున చూడుము. నీద్వారా సమాజసేవ అధిక మగునట్లు చూడుము. నీ బ్రహ్మచర్యమును నీయాచార వ్యవహారములలో చూపించుము. చందన సుగంధమును బయటికి వెదచల్లుము.

సారాంశమిది : కర్మయోగి ఫలాశను వదలుటవలన నిట్టి యనంతఫలములను పొందును. అతని శరీరయాత్ర నడచుచునే యుండును. దేహమును బుద్ధియు తేజస్వంతములై యుండును. తా నుండుసమాజము సుఖవంతమయియుండును. అతనికి చిత్తము పరిశుద్ధమయి, జ్ఞానముకూడ లభించును. ఇంతేకాదు, సమాజజీవితములో మోసమును కపటమును పోయి పవిత్రాదర్శము చేజిక్కును. కర్మయోగి కీ మహిమ అనుభవసిద్ధము.

13

కర్మయోగవ్రతమున కంతరాయములు

కర్మయోగి తన కార్యములను ఇతరులకంటె ఉత్కృష్ట రీతిని నిర్వహించును. అతనికి కర్మయే యుపాసన, కర్మయే పూజ. మనము భగవంతుని పూజించి అతనికి సమర్పించిన నైవేద్యమును తిరిగి ప్రసాదముగ తీసికొందుము. కాని ఈ ప్రసాదము ఆ పూజయొక్క ఫలమా ? ప్రసాదము నిమిత్తము పూజచేయువానికి అది వెంటనే లభించును. కాని కర్మయోగి పూజారూపమైన కర్మలద్వారా భగవద్దర్శన మను మహాఫలమును వాంఛించును. ప్రసాదము దొరకిననే చాలునన్నంత తక్కువ విలువను అతడు కర్మకీయడు. కర్మ యొక్కవిలువను తగ్గించుట కతడే మాత్రమును సమ్మతింపడు. స్థూలమైన కొలతబద్దతో దాని నత డెప్పుడును కొలువడు.

స్థూలదృష్టి కలవానికి లభించు ఫలముకూడ స్థూలముగనే యుండును. 'లోతుగా నాటుము, కాని తడిపి నాటుము' అని రైతులలో నొక సామెత యున్నది. లోతుగా దున్ని నంతమాత్రమున ప్రయోజనములేదు. అడుగున తడికూడ నుండవలె. లోతు, తడి రెండును ఉన్నచో మణికట్టులావున వెన్ను వేయును. కర్మ గభీరమై అనగా ఉత్కృష్టమై యుండవలె. దానికితోడు ఈశ్వరభక్తి, ఈశ్వరపరాయణత యను తడికూడ దానిలో నుండవలె. కర్మయోగి కర్మ నుత్కృష్టముగ నాచరించి ఈశ్వరార్పితము చేయును.

పరమార్థమునుగూర్చిన కొన్ని యపోహలు మనలో వ్యాపించియున్నవి. పరమార్థసాధకుడు కాలు, చేయి కదప నక్కరలేదని, సనిపాటలతో వానికి నిమిత్తములేదని లోకాభిప్రాయము. భూమిమన్నుట, ఖద్దరునేయుటకూడ పరమార్థమా యని లోకులు ప్రశ్నింతురు. కాని భోజనముచేయుటకూడ పరమార్థమా యని ఎవ్వరును ప్రశ్నింపరు. కర్మయోగులలో కర్మయోగియైన పరమేశ్వరుడు గుఱ్ఱములకు దాణాపెట్టినాడు. రాజసూయ యజ్ఞములో ఎంగిలివిస్తళ్లు ఎత్తివేసినాడు. అడవిలో ఆవులను మేపినాడు. ఆ ద్వారకానాథుడు మరల నెప్పుడైన ద్వారకకు వచ్చినచో పిల్లనాట్యములు చేయుచు వేణుగానముచు గోవులను కాచును. కనుక గుఱ్ఱములకు దాణాపెట్టువాడు, గోవులకాపరి, రథసారథి, ఎంగిలివిస్తళ్ళనెత్తివేయువాడు, నేల నలుకువాడు అయిన కర్మయోగిని మహాత్ములు పరమేశ్వరునిగ నిర్ణ

పించినారు. మహాత్ములుకూడ స్వయముగ కుట్టుపనియో, కుమ్మరిపనియో, లేక నేతపనియో, తోటమాలిపనియో, లేక ధాన్యమునుదంచుపనియో, పిండి విసరుటయో, వర్తకమో, లేక మంగలిపనియో, చెప్పులుకుట్టుపనియో చేయుచు ముక్తిని పొందినారు.

కాని మానవులిట్టి దివ్యమయిన కర్మయోగవ్రతము నుండి పడిపోవుచున్నారు. దీనికి కారణములు రెండు: ఇంద్రియముల విశిష్టస్వభావమును మనము జ్ఞప్తియం దుంచుకొనవలె. మన యింద్రియములు లెల్లప్పుడును 'ఇది కావలెను, అది అక్కరలేదు' అను ద్వంద్వములచేత చుట్టబడి యుండును. కావలసినదానియెడల అనురాగమ్ము, అక్కరలేనిదానియెడల ద్వేషమును మనస్సులో ఉత్పన్నమగును. ఇట్లీరాగద్వేషములును, కామక్రోధములును మనుష్యుని పీకుకొనితినుచుండును. కర్మయోగముస్వయముగా శ్రేష్ఠమును, రమణీయమును, అనంతఫలదాయకమును అయియున్నది. కాని యీ కామక్రోధములు 'ఇది తీసికొనుము, అది వదలి పెట్టుము' అను పోరాటమును మన గొంతుక కుచుట్టి మనలను విడువక బాధించును. కనుక ఈ యధ్యాయము చివర "వీని సంపర్కమును వదలుకొనుము, వీనినుండి బయటబడుము, అపాయము, జాగ్రత్త!" అని భగవానుడు హెచ్చరించుచున్నాడు. స్థితప్రజ్ఞుడు సంయమమూర్తియైనట్లే కర్మయోగి కూడ కావలె.

గీతా ప్రవచనములు

నాల్గవ అధ్యాయము

కర్మయోగమునకు సహకరించు సాధనము వికర్మ

14

కర్మకు వికర్మయొక్క సహకారము కావలెను

సోదరులారా !

కడచిన యధ్యాయములో నిష్కామకర్మయోగమునుగూర్చి వివేచనచేసితిమి. స్వధర్మమునకు స్వస్తిచెప్పి, మధ్యవచ్చిన ధర్మమును మనము స్వీకరించినచో నిష్కామరూపమైన ఫలము పొందనేలేమని తెలిసికొనవలయును. స్వదేశ వస్తువుల విక్రయము వర్తకునికి స్వధర్మము. కాని వర్తకుడీ స్వధర్మమును విడిచి, సప్తసముద్రముల కావలనున్న విదేశ వస్తువులను తెప్పించి విక్రయించును. దీనికి హేతువు అధిక లాభవాంఛయే. ఆ కర్మ నిష్కామకర్మ యెట్లుకాగలదు? అందువలననే కర్మకు నిష్కామరూపమిచ్చుటకు స్వధర్మ పాలనము అత్యంతావశ్యకము. కాని స్వధర్మాచరణకూడ సకామము కావచ్చును. అహింస విషయమును తీసికొందము. అహింసోపాసకునికి హింస వర్జనీయమేకదా! కాని బయటికి అహింసావాదిగ నుండియు వాస్తవమున కతడు హింసామయుడు కావచ్చును. ఏలయనగా హింస బయటి కగప

డని యొక మానసిక ప్రవృత్తిగదా! బహిరంగముగ హింసా కార్యములు చేయనంతమాత్రమున మనస్సు అహింసామయ మయినదని చెప్పలేము. చేతిలో కత్తినుంచుకొన్నవానిలో హింస బాహాటముగా ప్రకటమగును. కాని కత్తివదలివేసి నంతమాత్రమున మానవుడు అహింసామయుడయినాడని చెప్ప లేము. స్వధర్మాచరణవిషయముకూడ సరిగా ఇంతే. నిష్కామప్రాప్తికొరకు పరధర్మమునుండి విముక్తుల మయి తీరవలె. ఐనను ఇది నిష్కామసాధనకు ప్రారంభము మాత్రమే. దీనివలన మనము లక్ష్యము నందుకొన్నట్లుకాదు.

నిష్కామత్వ మొక మానసికవృత్తి. ఈ వృత్తి కలుగుటకు స్వధర్మాచరణరూపమైన సాధన యొక్కటే చాలదు. ఇతర సాధనల సహకారముకూడ తీసికొనవలె. ఒక్క చమురువత్తితోనే దీపము వెలుగదు. దాని కొక జ్యోతికూడ ఉండవలె. జ్యోతి యుండిననే అంధకారము తొలగిపోవును. ఈ జ్యోతిని వెలిగించుట యెట్లు? దీనికి మానసిక సంశోధన అవసరము. ఆత్మపరీక్షణద్వారా చిత్త మాలిన్యమును కడిగిపారవేయవలె. మూడవ అధ్యాయము చివర ఈ ముఖ్యవిషయమునే భగవంతుడు చెప్పినాడు. దానినుండియే నాల్గవ అధ్యాయము పుట్టినది.

గీతయందు 'కర్మ' శబ్దము స్వధర్మము అనుఅర్థముతో వ్యవహరింపబడినది. మనము తిందుము, త్రాగుదుము, నిద్రింతుము – ఇవియు కర్మలే; కాని గీతలోని కర్మశబ్దము వలన ఈపనులేవియు సూచింపబడవు. కర్మయనగా స్వధర్మా

చరణ యనియే అక్కడి యర్థము. కాని ఈ స్వధర్మము నాచరించుచు నిష్కామత్వమును పొందుటకు మరియొక వస్తువుకూడ అవసరము. కామక్రోధములను జయించుటయే అది. మనస్సు గంగాజలమువలె నిర్మలమును ప్రశాంతమును కానంతవరకు నిష్కామత్వము సిద్ధింపనేరదు. ఈ విధముగ చిత్తసంశోధననిమిత్తము చేయు కర్మలనే గీత వికర్మ యనును. కర్మ, వికర్మ, అకర్మ - ఈ మూడుశబ్దములును నాల్గవ అధ్యాయములో చాల మహత్త్వము గలవి. కర్మ యనగా స్వధర్మాచరణయొక్క స్థూలరూపము. ఈ బాహ్య కర్మలలో చిత్తమును లగ్నము చేయుటయే వికర్మ. మన మెవరికైనను నమస్కరించినపుడు శిరస్సును వంచు బాహ్య క్రియతోపాటు లోపలి మనస్సునుకూడ వినయముతో నంచక పోయినచో ఆ బాహ్యక్రియ నర్థము. అంతర్బాహ్యములు రెండును ఒకటి కావలె. తెంపులేని జలధారలతో శివలింగ మునకు అభిషేకము చేయవచ్చును. కాని ఆ ధారతోపాటు మానసికచింతనమను ధారకూడ అఖండముగ ప్రవహింపక పోయినచో ఆ యభిషేకమునకు విలువ యేమున్నది ? ఇట్టి స్థితిలో ఆ శివలింగమును తాయియే. నేనును తాయినే. తాతి కెమరుగ తాయి కూర్చున్నదనియే దీని యర్థము. మన బాహ్యకర్మలతో లోపలినుండి చిత్తశుద్ధియను కర్మ కూడ కలిసినప్పుడే నిష్కామకర్మ సిద్ధించును.

నిష్కామకర్మయను శబ్దప్రయోగములో 'కర్మ' శబ్దముకంటె 'నిష్కామ' శబ్దములోనే ఎక్కువ మహత్త్వ

మున్నది. 'అహింసాత్మకమైన అసహాయోగము' అను దానిలో 'అసహాయోగ' శబ్దముకంటె 'అహింసాత్మక' అను విశేషణములోనే అధిక మహత్త్వమున్నది. అహింసను దూరమునబెట్టి కేవల సహాయ నిరాకరణ క్రియకు ప్రాను కొన్నచో అదొక భయంకరవస్తువు కాగలదు. ఈ విధముగనే స్వధర్మము నాచరించుచు, మానసిక వికర్మను దానితో జోడించక పోయినచో, అట్టిస్వధర్మాచరణ వట్టి మోసమగును.

నేడు సార్వజనిక సేవ చేయువారు స్వధర్మమే ఆచరించుచున్నారు. దుఃఖములలోను కష్టములలోను పడియున్న బీదలకు సేవచేసి, వారిని సుఖపెట్టుట సహజప్రాప్తమైన ధర్మము. కాని యింతమాత్రమున సార్వజనిక సేవ చేయు వారందరును కర్మయోగులైనారని యూహింపరాదు. లోక సేవచేయుచు, మనస్సులో పరిశుద్ధమైనభావన లేకపోయినచో అట్టిసేవ భయానకమగుట కవకాశమున్నది. స్వకుటుంబసేవ చేయుచుండగా పుట్టు అహంకారము, ద్వేషము, మాత్సర్యము, స్వార్థప్రీతి మొదలుగాగల వికారములన్నియు లోకసేవలోకూడ పుట్టుచునేయుండును. నేటి లోకసేవా సమాజములలో దీనికి ప్రత్యక్షనిదర్శనము కనబడుచునే యున్నది.

15

కర్మ వికర్మల సంయోగమువలన భగ్నమండు జ్వాలయే అకర్మ

కర్మతో మనస్సు ఏకరూపముపొందవలెను. ఈ యేకీ భావమునే గీత వికర్మయనును. ఒకటి బాహ్యకర్మ, అనగా స్వధర్మరూపమైన సామాన్యకర్మ; రెండవది అంతరిక కర్మ, అనగా విశేషకర్మ-లేక-వికర్మ. విశేషకర్మ మానసి కావస రములనుబట్టి వేరువేరుగ నుండును. వికర్మయొక్క వివిధ రీతులు ఉదాహరణపూర్వకముగ ఈ యధ్యాయములో చెప్పబడినవి. ఈ విషయమే ఆరవ యధ్యాయములో విపులీకరింపబడినది. కర్మతో ఈ విశేషకర్మ కలిసినంతనే, అనగా ఈ మానసికానుసంధానముద్వారానే నిష్కామత్వ మనెడుజ్యోతి వెలుగును. కర్మతో వికర్మ కలిసినప్పుడు నెమ్మదినెమ్మదిగ నిష్కామత్వము మనలో నెలకొనును. శరీరము, మనస్సు వేరువేరు వస్తువులైనయెడల, తన్నిమిత్త మైన సాధనలుకూడ వేరువేరుగనే యుండును. ఈ రెంటికిని సంయోగము కుదిరినప్పుడు లక్ష్యము మనకు చాల సులభ మగును. మన స్వాకవైపునను, శరీరము మరొకవైపునను విడివడియుండకుండ శాస్త్రకారులు ద్విముఖమార్గమును సూచించినారు. భక్తియోగములో బయటినుండి తపస్సును, లోపలినుండి జపమును సూచింపబడినవి. ఉపవాసాది బాహ్యతపస్సు జగుగుచున్నను అంతరమునుండి మానసిక జపము లేకపోయినచో ఆతపస్సంతయు వ్యర్థము. తపస్సం

బంధమైన భావన నిరంతరమును రగులుచుండవలె. ఉపవాస మునివ భగవంతుని స్వరూపమున కూర్చుండుట. పరమాత్మ సన్నిధానములో చిత్తము ఉండవలెనని, బాహ్యభోగముల కవాటమును మూసివేయుట అవసరము. కాని విషయభోగ ములను బాహ్యముగ త్యజించినను, మనస్సునందు భగవ చ్చింతన లేకపోయిన ఈ బాహ్యోపవాసమునకు విలువ యేమున్నది? భగవచ్చింతన చేయవలసిన సమయమున భోజనపదార్థముల చింతన చేయుచున్నచో అది మహా భయంకర భోజన మగును. ఈ మానసిక భోజనమును, ఈ విషయచింతనను మించిన భయంకరవస్తువు మరియొకటి ఉండదు. తంత్రముతోపాటు మంత్రముకూడ నుండవలె. కేవలము బాహ్యతంత్రమునకు మహత్వమేమియును లేదు. కర్మహీనమైన మంత్రమునకుగూడ ఏమియు విలువలేదు. చేతిలోను సేవ యుండవలె; హృదయమునందును సేవ యుండవలె. అప్పుడే మనము నిజమైన సేవ చేయగలుగుదుము.

బాహ్యకర్మలో హృదయమార్దవము లోపించిన యెడల ఆ స్వధర్మాచరణము రసవిహీనమై యెండిపోవును. నిష్కామత్వ మను పుష్పములును, ఫలములును దానినుండి యుద్భవింపవు. మన మొక రోగికి సేవ యొనరించుచున్నా మనుకొనుడు. ఆ సేవాకర్మతోపాటు మనస్సులో కోమల మైన దయాభావము లేకున్నచో, ఆ సేవ రసవిహీనమై విసుగుపుట్టించును. అట్టిసేవ చేయువానికిని రోగికినిగూడ బరువే యనిపించును. సేవలో మానసికసహకారము

లేకున్నచో, ధానినుండి యహంకారము పుట్టును. "నే నీ రోజున వానికి పనిచేసిపెట్టితిని. అవసరమైనపుడు తిరిగి వాడు నాకు సాయము చేయవలె, నన్ను స్తుతింపవలె, గౌరవింపవలె" – ఇత్యాది వాంఛలు వానిలో ఉత్పన్న మగును. లేదా, వాడు విసుగుజెంది, "ఇంతసేవ నేను చేయుచున్నాను. అయినను ఈ రోగి చిరచిరలాడుచునే యున్నాడు" అని యైన యనుకొనును. చిరచిరలాడుట రోగికి సహజమే. ఇంపువలన నిజమైన సేవాభావము లేని సేవకుడు మరింత విసుగు జెందును.

కర్మతో అంతరికభావము మిళితమైనపుడు ఆ కర్మ యొక్క రూపమే మారిపోవును. నూనె, వత్తి – ఈ రెంటికిని జ్యోతి తోడయినపుడు ప్రకాశము కలుగును. కర్మతో వికర్మ కలిసినప్పుడు నిష్కామత్వము సిద్ధించును. తుపాకి మందునకు నిప్పు ముట్టించినప్పుడు, అందొకశక్తి యున్నన్న మయి ఆ మందు దడాలున పేలును. కర్మ తుపాకిమందు వంటిది. దానిలో వికర్మయను అగ్ని పడుటతో కార్యము సిద్ధించును. వికర్మ కలియునంతవరకు ఆ కర్మ జడస్వరూపమే. దానిలో చైతన్యముండదు. వికర్మయను నిప్పురవ్వ ఒక్క సారి అందులో పడినంతనే ఆ కర్మనుండి యుద్భవించు సామర్థ్యము వర్ణింప నలవికానిది. చిటికెడు తుపాకిమందు జేబులో నున్నను, చేతిలో నున్నను దానిని మనము లెక్క చేయము. కాని నిప్పురవ్వ పడినవెంటనే శరీరమంతయు కాలి, పేలిపోవును. స్వధర్మాచరణయొక్క అనంతసామర్థ్యము ఈ విధ

ముగ మరుగుపడి యుండును. దానితో వికర్మను జోడించి చూడుము. అపుడు ఎంతెంత నిర్మాణము, వినాశము జరుగ గలదో తెలియును. ఆ వికర్మయొక్క ప్రేలుపువలన అహం కార, కామ, క్రోధాదులలోని శక్తి పటాపంచలగును. దాని నుండి యుత్కృష్టమైన జ్ఞానము సిద్ధించును.

కర్మ యనగా జ్ఞానమునకు నిష్పంటించువత్తి. ఒక పెద్ద కొయ్యమొగ యున్నది. దానిని కాల్చిన కణకణలాడు బొగ్గగును. ఇప్పు డా కట్టెకును బొగ్గులకును ఎంత యంతర మున్నది! అయినను బొగ్గయినది ఆ కట్టెయే. కర్మలో వికర్మను చొప్పించినంపునలన కర్మ దివ్యరూపమును దాల్చును. పిల్ల వీపుమీద తల్లి చేతితో నిమురును. వెలుపలినుండి చూచినచో వీపుమీద చేయి అటునిటు తిరుగుటయే కనబడును కాని ఈ సామాన్యకర్మద్వారా ఆ తల్లిబిడ్డల మనస్సులో ఉత్పన్నమగు భావనల నెవరు వర్ణింప గలరు? ఇంతనైశాల్యముగల వీపుమీద, ఇంతబరువైన మృదుహస్తముతో నిమిరినచో, ఇంత యానందము కలుగు నని లెక్కకట్టినచో, అది హాస్యాస్పదమే యగును. చేతితో నిమురుట యను క్రియ అతిసామాన్యమైనది. కాని అందులో తల్లిహృదయము చొప్పింపబడినది. అనగా వికర్మ చొప్పింప బడినది. ఇందుచేతనే అట్టి యపూర్వమైన ఆనందము సంప్రాప్త మైనది. తులసీరామాయణములో నొకఘట్ట మున్నది. రాక్షసులతో పోరాడి వానరులు తిరిగివత్తురు. వారి శరీరములు గాయపడి రక్తము స్రవించుచుండును. కాని యొక్కసారి

రామచంద్రప్రభునిప్రేమవీక్షణము వారిపైబడినంతనే వానరుల వేదనయంతయు అదృశ్యమయ్యెను. ఎవడైనను శ్రీరాముని ఆ కన్నులు, ఆ చూపు 'ఫోటో' తీసి, తానును సరిగ నదే విధముగ మఱెవరివంకనైనను చూచినచో, అ ప్రభావము కలుగునా ? అట్లనుకరింపవలె నన్నప్రయత్నముకూడ హాస్యాస్పదమగును.

కర్మతో వికర్మ కలిసినప్పుడు, శక్తి యుద్భవించి, దానినుండి అకర్మ వెలువడును. కట్టు కాలి బూడిదయగును. మొదట నెంతో పెద్దదయియుండిన దుంగ చివరకు, పాపము చిటికెడు బూడిదమైపోవును. ఇప్పుడు దానిని సులువుగ చేత దీసికొని, శరీరమం దంతటను పూసికొనవచ్చును. ఈ విధముగ కర్మకు వికర్మయను జ్యోతిని అంటించుటవలన చివర కది యకర్మగా మారును. ఆ కట్టు యెక్కడ, ఈ బూడిద యెక్కడ? కః కేన సంబంధః ! ఇప్పుడా రెంటి గుణధర్మములకును పోలిక యేమియు లేదు. కాని ఆ బూడిద ఆ కొయ్యద్రుంగదే యనుటలో నేమియు సందేహము లేదు.

కర్మలో వికర్మను చొప్పించుటవలన అకర్మయగును. దీని యర్థమేమి ? కర్మ యేమియు చేసినట్లే అనిపించదని దీని భావము. అదొక భారమే యనిపించదు. కర్మచేసికూడ తాను అకర్తయగును. 'నీవు చంపినను చంపినవాడవుకావు' అని గీతావాక్యము. తల్లి బిడ్డను కొట్టునని నీవును ఆ బిడ్డను కొట్టిచూడుము. నీవు కొట్టినచో ఆ బిడ్డ సహింపదు. తల్లి కొట్టినను, బిడ్డ తల్లిపైటకొంగులోనే తల దాచుకొనును.

ఎందుచేత ననగా తల్లియొక్క బాహ్యకర్మలో చిత్తశుద్ధి కలిసియున్నది. తల్లి కొట్టులో నిష్కామభావ మున్నది. అందులో ఆమెస్వార్థమేమియును లేదు. ఖికర్మవులన, మనశ్శుద్ధి వలన, కర్మలోని కర్మభావము ఎగిరిపోవును. శ్రీరాముని ఆ దృష్టి ఆంతరిక వికర్మ వలన కేవలము ప్రేమసుధా సాగరమై పోయెను. కాని రాముని కాపనిలో శ్రమ యేమియు కలుగలేదు. చిత్తశుద్ధితో చేసిన కర్మ కర్మ నంటదు. అందువలన పాపపుణ్యము లేమియుమిగులవు. అట్లు కాకపోయినచో ఆ కర్మ బుద్ధికిని హృదయమునకును ఎంత బరువు! ఎంత యొత్తిడి! రాజకీయ – ఖైదీలందరికిని రేపే విడుదల యనువార్త ఈ మధ్యాహ్నము తెలియవచ్చిన యెడల నలువైపులనుండియు ఎంతజనసమూహము జైలు బయట చేరునో చూడుడు! నలుదిక్కులను ఎంతసంచలనము, ఎంత గడబిడ! మనము కర్మయొక్క మంచి చెడ్డ పరిణామ ముల వలన కలత జెందుచుందుము. కర్మ నలువైపుల నుండియు వచ్చి గొంతు నొక్కునా యన్నట్లు మనలను ముట్టడించును. బాధించును. సముద్రపుపోటు భూమిలోనికి జొచ్చి అఖాతములను కల్పించినట్లే, కర్మయను జంజాటము మదిలో ప్రవేశించి క్షోభ కలిగించును. అపుడు సుఖదుఃఖము లను ద్వంద్వములు నిర్మాణమగును. శాంతియంతయు నష్టమై పోవును. కర్మ నాచరించుట, అది సమాప్తమగుట జరిగినను దానివేగము మిగిలియే యుండును. కర్మ చిత్తమును వశ పరచుకొనును. చివరకు నిద్రనుగూడ హరించును.

కాని ఇట్టి 'కర్మతో వికర్మను జోడించి తరువాత నెన్నికర్మ లాచరించినను శ్రమ యనిపించదు. మనస్సు ధ్రువ నక్షత్రమువలె శాంతము, స్థిరము, తేజోమయము నగును. కర్మలో వికర్మను చొప్పించుటచేత అది యకర్మయగును. అపుడు మానవుడు కర్మ నాచరించియు ఆచరింపనట్లే యుండును.

16

అకర్మ యనుకళ యెట్టిదో మహాత్ముల నడుగవలెను

కర్మ అకర్మ యెట్లగును? ఈ కళ యెవరియొద్ద లభింపగలదు? మహాత్ములయొద్ద. "మహాత్ములయొద్దకు వెళ్లి కూర్చుండి వారియొద్ద శిక్షణపొందుము" అని భగవాను డీ యధ్యాయముచివర చెప్పుచున్నాడు. కర్మ అకర్మ యెట్లగు నదియు వర్ణించుటకు భాష చాలదు. దాని సరియైనభావన రావలెనన్న మహాత్ములయొద్దకు వెళ్ళవలె. పరమేశ్వరుని వర్ణనకూడ ఇట్లేయున్నది.

"శాంతాకారం భుజగశయనం"

వేయిపడగల శేషునిపై పరుండికూడ పరమేశ్వరుడు శాంతుడే! ఈ విధముననే మహాత్ములు వేలకొలది కర్మలాచ రించుచుకూడ తమ మానస సరోవరములో క్షోభతరంగము లను కొంచెమయినను లేవనీయరు. ఈ విశిష్టత మహాత్ముల సన్నిధికి వెళ్లకయే అవగతము కాజాలదు.

ప్రకృతకాలమున పుస్తకములు చాల చౌకయై పోయినవి. ఒకటి రెండణాలకు గీత, 'మనాచే శ్లోకములు'* మొదలైనవి దొరకుచున్నవి. గురువులకుగూడ కొరతలేదు. శిక్షణ ధారాళముగను, చౌకగను లభ్యమగుచున్నది. విద్యాపీఠములు జ్ఞానదానము చేయుచున్నట్లు కనబడును. కాని జ్ఞానామృతభోజనమువలన కలుగు తృప్తిపు ఒక్కనికిని వచ్చుటలేదు. గుట్టలుగా పెరిగిన ఈ పుస్తకరాశిని చూడగా, మహాత్ములను సేవింపవలసిన ఆవశ్యకము ఆరోజున కారోజు అధికముగ కనిపించుచున్నది. పుస్తకములమీది గట్టిగుడ్డబైండును దాటి జ్ఞానము బయటికి వచ్చుటలేదు. ఇట్టి సందర్భములలో నొక యభంగము నాకెప్పుడును జ్ఞప్తికి వచ్చుచుండును.

"కామ క్రోధకే ఖడ్డేహై సహాబ్
రహాహై అసంత పల్లేపార్"

కామక్రోధములను సర్వతములకు ఆవలివైపున నారాయణు డున్నాడు. ఆ విధముగనే ఈ పుస్తకరాసులకు వెనుకనే జ్ఞానరాజు దాగియున్నాడు. గ్రంథాలయములు నలుదిశలను వ్యాపించియున్నను, మానవుడు నేటివరకును సంస్కారము, జ్ఞానము లేని కేవలవానరునివలె సర్వత్ర కనబడుచున్నాడు. బరోడాలో చాలపెద్ద గ్రంథాలయమున్నది. ఒకసారి యొక పెద్దమనుష్యుడు ఒక పెద్దగ్రంథమును పట్టుకొని వెళ్లుచుండెను. దానిలో బొమ్మలుండెను.

* జ్ఞానేశ్వరుడు రచించిన భక్తిగీతములు.

అది యింగ్లీషు పుస్తకమనుకొని ఆయన తీసికొని వెళ్లుచుండెను. 'అదేమి పుస్తక'మని నే నడిగితిని. ఆయన పుస్తకమును నా చేతికందించెను. "ఇది క్రైంచి గ్రంథమే!" అని నేనంటిని. "బాగుగానున్నది! క్రైంచిపుస్తకము వచ్చినదా!!" అని ఆయన యనెను. పరమ పవిత్రమైన రోమనులిపి, చక్కని బొమ్మలు, అందమైన బైండు. ఇంక జ్ఞానమునకు లోటేమి?

ఆంగ్లమున ప్రతివత్సరము ఏ పదివేల పుస్తకములో తయారగుచుండును. తదితరభాషలలోగూడ ఇంతే. ఇంతగా జ్ఞానప్రసారము జరుగుచున్నను మనుష్యునిబుద్ధి యింతవరకును డొల్లగానే యెట్లున్నది? జ్ఞాపకశక్తి తగ్గినదని యొకడనును. ఏకాగ్రత యుండుటలేదని ఒకడనును. చదివిన దంతయు సత్యముగనే కనబడుచున్నదని యొకడును, ఆలోచనకు సమయమే దొరకుటలేదని మరియొకడును అనును. శ్రీకృష్ణుడన్నాడు: "అర్జునా, వినివిని నీ బుద్ధి తబ్బిబ్బయినది. అది స్థిరపడనంతవరకు నీకు యోగప్రాప్తి కలుగనేరదు. వినుటయు, చదువుటయు ఇక కట్టిపెట్టి మహాత్ముల శరణు పొందుము. వారి జీవితగ్రంథమే నీవు పఠింపదగినది. దాని 'మానవ్యాఖ్యానము'ను విని నీవు 'ఛిన్నసంశయుడ'వగుము." తెంపులేని సేవాకర్మ నాచరించునపుడును మనస్సు ఎట్లత్యంత శాంతితో నుండగలదో, బయట నెంతవేగముతో కర్మ జరుగుచున్నను హృదయమున నెట్టి యఖండ వీణాగానము వినబడగలదో మహాత్ముల యొద్దకు వెళ్ళిన తెలియగలదు.

గీతా ప్రవచనములు

ఐదవ అధ్యాయము

అకర్మావస్థ రెండువిధములు : యోగము, సంన్యాసము

17

బాహ్యకర్మ మనస్సునకు అద్దము

సోదరులారా !

ప్రపంచము మిక్కిలి భయానక వస్తువు. తరచుగా దీనిని సముద్రముతో పోల్చుచుందురు. సముద్ర మెక్కడ చూచినను అంతులేని జలరాశిగా కనబడును. ప్రపంచమును అంతే. ప్రపంచ మెటుచూచినను మోహముతో నిండి యున్నది. ఒక డిల్లు వాకిలి విడిచి సార్వజనిక సేవలో నిమగ్నుడయి యున్నను, అక్కడకూడ అతని మనస్సులో సంసారము వీథిమేర్పరచుకొనియుండును. ఒకడు గుహలోనికి వెళ్ళి కూర్చున్నను వాని బెత్తెడు లంగోటీలో సంసారము ఓతప్రోతమయి నిండియుండును. ఆ లంగోటీ వాని మమకార మునకు సర్వస్వమయి కూర్చుండును. ఒక కరెన్సీనోటులో వేయిరూపాయ లిమిడియున్నట్లే, ఆ చిన్న లంగోటీలోకూడ అపారమైన ఆసక్తి నిండియుండును. ఇంటి జంజాటము వదలినను, బహువ్యాపకత్వమును తగ్గించుకొన్నను, అంత

మాత్రమున సంసారము తగ్గిపోదు. $\frac{10}{25}, \frac{2}{5}$ ఈ రెంటికిని ఒకటే యర్థము. ఇంటిలోనున్నను అడవియందున్నను, ఆసక్తి మనల నంటియేయుండును. సంసారము లేశమాత్రమును తగ్గదు. ఇద్దరు యోగులు హిమాలయగుహలలోనికి పోయి కూర్చున్నారనుకొందము. కాని అక్కడకూడ ఒకనికీర్తి యొకనిచెవినిపడగానే శ్రోత మండిపడును. సార్వజనిక సేవలోకూడ ఈ రీతియే కనబడుచుండును.

ఈ విధముగ నీ సంసారము వదలకుండ మనవెంట బడుటచేత స్వధర్మాచరణకు కట్టుబడియున్నను దానినుండి విముక్తి కలుగదు. లౌకిక వ్యాపారములు, జంజాటములు తగ్గించినను, సంసారసంబంధములు తగ్గించినను సర్వదా మమత్వము వెన్నంటియేయుండును. రాక్షసు లొకప్పుడంగుష్ఠమాత్రులు, మరియొకప్పుడు మహాకాయులు అయినట్లే, ఈ సంసారముకూడ తన రూపములను మార్చుచుండును. ఆకారము చిన్నదైనను, లేక పెద్దదయినను, రాక్షసులు రాక్షసులే. అట్లే మేడలోనున్నను, గుడిసెలోనున్నను, ఈ సంసార మొకరీతినే అనివార్యముగ మనల నంటియుండును. స్వధర్మముయొక్క కట్టడలో నుండి, సంసారమును సమదృష్టితో చూచుచున్నను, అప్పుడుకూడ అనేక కలహాము లుత్పన్నమయి ప్రాణము విసిగిపోవు చుండును. అక్కడకూడ ననేక సంస్థలతోడను, వ్యక్తుల తోడను సంబంధమేర్పడి విసుగుచెందుదువు. 'ఎందులకీ యాపదలో చిక్కుకొంటినా' యని యనుకొందువు. కాని

నీ మనస్సున కదే గీటురాయి. కేవలము స్వధర్మాచరణను అలవరచుకొన్నంతమాత్రమున నిర్లిప్తతరాదు. మానవుడు కర్మయొక్క వ్యాప్తిని తగ్గించినంతమాత్రమున నిర్లిప్తుడు కాజాలడు.

మరి నిర్లిప్తత యెట్లు ప్రాప్తమగును? దానికి మానసిక ప్రయత్న మవసరము. మానసిక సహయోగము లేనంతవరకు ఏపనియు నెరవేరదు. తల్లిదండ్రులు తమ కుట్టువానిని ఒక సంస్థకు అప్పగించినారనుకొందము. వాడక్కడ వేకువజామున నిద్రలేచును, సూర్యనమస్కారములు చేయును, తేసీరు త్రాగడు. కాని తిరిగి యింటికి వచ్చిన రెండుమూడు దినములలో ఈ సదభ్యాసములన్నిటిని వదలివేయును. ఈ యనుభవము మనకున్నదే. మనుష్యుడనగా వట్టి మట్టి గడ్డకాడు. మన మతని మనస్సునకు కల్పింపదలచిన యాకారము అతనిమనస్సునందు ముందుగా అంకితమై యుండవలెగదా! మనస్సు ఆకారముతో లగ్నము కానిచో, బాహ్యముగ కనబడు శిక్షణ విధానమంతయు వ్యర్థమైనట్లే. ఇందు చేతనే సాధనలో మానసిక సహయోగము అత్యావశ్యకము.

సాధనకు బయటినుండి స్వధర్మాచరణ, లోపలినుండి వికర్మ, రెండును కావలె. బాహ్యకర్మకూడ అనవసరమే. కర్మ నాచరింపకయే మనస్సునకు పరీక్ష లేదు. ప్రశాంతమగు ప్రాతస్సమయములో మనస్సు అత్యంత ప్రసన్నముగ నుండును. కాని ఇంటిలో కుట్టువాడు కొంచెమేడ్చుసరికి మన మనశ్శాంతియొక్క నిజమైన విలువ తెలిసిపోవును. అందుచేత కర్మను

తప్పించుకొనుటవలన ప్రయోజనములేదు. బాహ్యకర్మలవలన మనస్సుయొక్క స్వరూపము ప్రకటమగును. నీరు బయటికి చదునుగా కనిపించును. కాని దానిలో నొకటాయి విసరుడు; వెంటనే అడుగుబురద పైకి వచ్చును. మనస్సుయొక్కస్థితి కూడ నింతే. మనస్సును అంతస్సరోవరముయొక్క అడుగున మోకాటిలోతుబురద పేరుకొని యుండును. బాహ్యవస్తు స్పర్శ దానికి కలుగగానే దాని స్వరూపము బహిర్గతమగును. ఫలానావానికికోపమువచ్చినదని యనుచుందుము. ఈకోపము బయట నెక్కడనుండియైన వచ్చినదా? అది లోపలనున్నదే. అది మనస్సులో నుండనిచో బయటికి కనబడి యుండదు.

"తెల్లనిఖాదీ మాసిపోవును కనుక అది మాకక్కర లేదు. రంగుఖాదీ మాయము" అని యనుచుందుము. కాని అదికూడ మాయును. కాని దానిమాపు కనబడదు. తెల్లఖాదీమాపు కనబడును. "నేను మాసియున్నాను, ఉతికి శుభ్రపరచు" మని యది యనును. ఉన్నదున్నట్లు చెప్పెడు ఈ తెల్లఖాదీ లోకమునకు ప్రియముకాదు. మన కర్మకూడ నిట్లే యనును. "నీవు క్రోధివి, స్వార్థప్రియుడవు. ఇం కేవేవో అవగుణములు కలవాడవు" అని కర్మ చెప్పుచుండును. కర్మ మనస్వరూపమును మనకు పట్టిచూపించు అద్దమువంటిది. కనుక మనము కర్మయెడల కృతజ్ఞులమై యుండవలె. ముఖమునకుపట్టిన మాలిన్యమును చూపించునని అద్దమును పగులగొట్టుదుమా? పగులగొట్టము సరికదా, దానికి కృతజ్ఞతను చూపుదుము. ముఖము బాగుగ కడుగు

కొని తిరిగి యద్దములో చూచుకొందుము. ఈ విధముగనే కర్మలద్వారా మనస్సులోనిదోషములు బయటబడునని తలచి కర్మలనే వదలుదుమా? అసలు కర్మయే వలదని కూర్చున్నంత మాత్రమున మన మనస్సు నిర్మలమగునా? కనుక కర్మల నాచరించుచునే చిత్తపరిశుద్ధ్యముకొఱకుకూడ ప్రయత్నింతుముగాక!

ఒకడు వెళ్ళి గుహలో కూర్చున్నాడనుకొనుడు. అక్కడ నతనికి ఎవ్వని సంపర్కమును ఉండదు. తానప్పుడు శాంతిపూర్ణమనస్కుడయినట్లు భావించును. కాని గుహను వదలి భిక్షకొఱ కతడు బయటికెక్కడికైనను వచ్చినప్పుడు చూడుడు. ఆడుకొను కుఱ్ఱవా డొకడు తలుపుగొళ్ళెమును గణగణలాడించుచు ఆ నాదబ్రహ్మలో లీనమగును. కాని ఆ యమాయకబాలుడు చేయుధ్వనిని ఈ యోగి సహింపలేడు. "ఏమిరా! యింత కఠోరధ్వని చేయుచున్నా డీ కుఱ్ఱవాడు!" అని యోగి యనును. అతడు గుహలోనుండి, చిన్నధ్వనిని సైతము సహింపలేనంతగ తన మనస్సును దుర్బలము చేసికొన్నాడు. కొంచెము కటకటధ్వని వినబడిన చాలును, వాని శాంతియంతయు తలక్రిందయిపోవును. ఇట్టి మనోదౌర్బల్యము మంచిదికాదు.

సారాంశమిది : మన మనస్సుయొక్క స్వరూపమును తెలిసికొనుటకు కర్మ చాల ఆవశ్యకము. కర్మలో దోషములు కనబడినప్పుడు, వానిని తొలగించుకొనవచ్చును. దోషములు తెలియనిచో ప్రగతి ఆగిపోవును. వికాసము

శూన్యమగును. కర్మచేసిననే దోషములు కనబడగలవు. వానిని దూరముచేయుటకు వికర్మను సాధనముగ జేసికొన వలె. ఇట్టి వికర్మతో అహర్నిశము ప్రయత్నము జరుగు చున్నచో, స్వధర్మము నాచరించుచునే నిర్లిప్తముగ నుండు కొట్లో, కామక్రోధాతీతుడు, లోభమోహాతీతుడు అగుట యెట్లో కాలక్రమమున బోధపడును. కర్మను నిష్కళంక ముగనుంచుటకై నిరంతరప్రయత్నము జరుగుచున్నచో, కాల క్రమమున నిర్మలకర్మలు సహజములగును. నిర్వికారకర్మలు ఒకదానివెంట నొకటి సహజముగ జరుగుచున్నచో ఏ కర్మ యెప్పుడు జరిగినదో ఆగుర్తే యుండదు. కర్మ సహజమయి పోయినప్పుడు అది అకర్మయగును. సహజకర్మనే అకర్మ యందురు. దీనిని మనము నాల్గవ అధ్యాయములో చూచి నారము. కర్మ అకర్మ యెట్లగునో మహాపురుషుల పాదముల యొద్ద కూర్చుండుటవలన తెలియగలదను విషయమునుగూడ భగవానుడు నాల్గవఅధ్యాయముచివర చెప్పియున్నాడు. ఈ యకర్మస్థితిని వర్ణించుటకు భాష చాలదు.

18

అకర్మదశయొక్క స్వరూపము

కర్మయొక్క సహజత్వమును గ్రహించుటకు తెలిసిన యుదాహరణ యొకటి తీసికొందము. చంటిబిడ్డ మొదట నడచుట నేర్చుకొనునప్పుడు ఎంతోకష్టపడును. కాని వాని

ఈ బాల్యక్రీడలో మనకు ఆనందమున్నది. "చూడుడు, మా పాపాయి నడక ప్రారంభించినాడు" అందుము. కాని తరువాత అదే సహజమయిపోవును. వాడు నడచుచుండును, మాటలాడుచుండును; కాని నడక మీద దృష్టి యే యుండదు. తిండివిషయముకూడ నిట్టిదే. తినుటయే యొక ఘనకార్యమన్నట్లు పిల్లవానికి అన్నప్రాశనచేయుదుము. కాని కాలక్రమమున ఆతినుట సహజమైపోవును. ఈత నేర్చుకొనుట మొదట నెంతకష్టమనిపించును! మొదట ఆయాసము వచ్చును. కాని తరువాత మతియొక పనివలన అలసినపుడు, దానికి విరుగుడుగ "రా, కొంచెము ఈతకొట్టి వత్తము, అలసటతీరును." అని యందుము. అప్పుడు ఈదుట కష్టమనిపించదు. శరీర మూరకయే సహజముగ నీటిపై తేలుచుండును. అలసట యనున దొక మానసికస్థితి. కర్మలవలనమనస్సునకు వ్యధకలిగినప్పుడు శ్రమయనిపించును. కాని వికర్మతో నాచరించుటవలన కర్మలు సహజమై బరువే యనిపించవు. అప్పుడు మనము కర్మలు చేసియుకూడ చేయనట్లేయుండి అకర్మదశను పొందుదుము. ఈ స్థితిలో కర్మలు ఆనందమయము లగును.

కర్మను అకర్మగ చేయుట జీవితలక్ష్యము. ఈ లక్ష్య సిద్ధికొఱకు స్వధర్మాచరణరూపమైన కర్మల నాచరింపవలె. వానిని చేయుచున్నచో మన దోషములను గ్రహింపగలుగుదుము. ఆ దోషములను తొలగించుటకు వికర్మయొక్క ఆశ్రయమును పొందవలె. అట్లభ్యాసము చేయుచుండుటవలన

కర్మలలో నే మాత్రపు శ్రమగాని కష్టముగాని లేని మనస్థితి యేర్పడును. వేలకొలది పనులు చేయుచున్నను మనస్సు నిర్మలముగను శాంతముగను ఉండును. "ఓ ఆకాశమా, ఎండవలన నీవు మాడిపోవా ? వర్షమువలన తడిసిపోవా ? చలివలన వణకిపోవా ?" అని యాకాశము నడిగిచూడుడు. ఆకాశ మేమనును ? "నే నేమగుచున్నానో మీరే నిర్ణయము చేయవలెను. నా కేమియు తెలియదు" అనును.

"పాగల్ నంగా హై యా కపడా పహనే।
ఇస్ కో లోగ్ దేఖ్‌కర్ జానే॥"

పిచ్చివాని యొడలిమీద గుడ్డ యున్నదోలేదో యను నిర్ణయము ప్రజలు చేయవలెగాని పిచ్చివాని కా విషయ మేమియును తెలియదు.

దీని భావార్థమిది : స్వధర్మాచరణరూపమైన కర్మలు వికర్మయొక్క సాయమువలన వికారరహితముగ ఆచరింప బడినచో నవి స్వాభావికములై పోవును. పెద్దపెద్ద వికట పరిస్థితులు కూడ కష్టమనిపించవు. కర్మయోగమున కిది తాళముచెవి. తాళముచెవిలేక, తాళమును పగులగొట్టవలెనని ప్రయత్నించినచో చేతులు పుండ్లు పడును. కాని తాళము చెవి చేజిక్కినప్పుడు క్షణములో తాళము తెఱవబడును. కర్మయోగ మను ఈ తాళముచెవివలన కర్మలన్నియు నిరుప ద్రవముగ నెరవేరును. ఈ తాళముచెవి మనోజయముద్వారా లభ్యమగును. అందువలన మనోజయమునకు విరామములేని

ప్రయత్నము జరుగవలె. కర్మ నాచరించుచుండగా కనబడు మనోమాలిన్యమును కడిగివేయుటకు ప్రయత్నము చేయవలెను. అప్పుడు బాహ్యకర్మల జంజాటము కనిపింపదు. కర్మచేయుచున్నానను అహంకారము నశించును. కామక్రోధముల యుద్వేగము నశించును. క్లేశముయొక్క స్పృహయే యుండదు. కర్మ చేయుచున్నా ననుస్ఫురణకూడ మిగులదు.

ఒకసారి నాకొక పెద్దమనుష్యుడు ఇట్లు జాబు వ్రాసెను :— "ఇన్నిపర్యాయములు రామనామజపము చేయవలసియున్నది. మీరుకూడ ఇందులో పాల్గొనుచు దినమునకెన్నిసార్లు జపముచేయుదురో తెలుపుడు." ఆయన తనబుద్ధికితోచినట్లు పనిచేయుచున్నాడు. ఆయనను విమర్శించుటకు నే నిదిచెప్పుటలేదు. కాని రామనామము లెక్కపెట్టునది, కొలుచునది కాదు. తల్లి బిడ్డకు సేవచేయుచు, దానినిగూర్చిన నివేదిక యేమైనను వ్రాసి అచ్చువేయించునా? వేయించుచో ఒక్క 'థాన్‌క్యూ' (Thank you) తో బిడ్డ ఋణవిముక్తుడు కాగలడు. కాని తల్లి యట్టిపనిచేయదు. ఆమె యేమనును? "నేనేమిచేసితిని? నేనుచేసిన ఘన కార్యమేమియులేదే! నా బిడ్డకు నేను చేసికొనుట యొక బరువా?" అని యనును. వికర్మయొక్క సహాయతతో ఏకాగ్రచిత్తుడయి, హృదయమును పనియందు చొప్పించి, మానవుడు చేయు కర్మ కర్మయే కాకుండబోవును. అది యకర్మయగును. అక్కడ క్లేశము, కష్టము, తొట్రుపాటు మొదలైన వేవియు ఉండవు.

ఈస్థితి వర్ణనాతీతము. వర్ణనచేసినను అది యస్పష్టముగనే యుండును. సూర్యుడుదయించుచున్నాడు. కాని "నేను చీకటిని పోగొట్టుచున్నాను. పక్షులకు ఎగురవలెనన్న కోరిక కల్గించుచున్నాను. మానవులను కర్మప్రవృత్తులను జేయుచున్నాను" అని సూర్యుని కెప్పుడయిన అనిపించునా? అతడుదయించినచోటనే కదలకయుండును. అతని యునికియే విశ్వమును నడుపుచున్నది. కాని సూర్యుని కీస్పృహ లేదు. "సూర్యభగవానుడా, నీ యుపకారము లనంతములు. నీవెంత అంధకారమును పోగొట్టుచున్నావు!" అని మీరతనితో అనినచో అతడు తెల్లబోవును "ఏదీ, కొంచెము చీకటిని దెచ్చి నాకు చూపగలరా? నేను చీకటిని పోగొట్టుచున్నాననిన అది నా కర్తవ్యము" అని యతడనును. అసలు అంధకారమును సూర్యునియొద్దకు తీసికొనివెళ్లుట సాధ్యమైన పనియా? సూర్యుని యునికివలననే అంధకారము లేకుండ బోవును. ఆవెలుగులో ఒకడొక సద్గ్రంథమును పఠింపవచ్చును, మఱియొకడు చెడ్డపుస్తకమును చదువవచ్చును. ఒక డుపకారమును చేయవచ్చును, మరియొక డుపకారమును చేయవచ్చును. కాని ఈ పాపపుణ్యములకు సూర్యుడు బాధ్యుడుకాడు. సూర్యు డిట్లనును:- "ప్రకాశము నా సహజధర్మము. నాయొద్ద ప్రకాశము కాకున్న మరేమి యుండును? నేను ప్రకాశము నిచ్చుచున్నానను సంగతియే నాకు తెలియదు. నా యునికియే ప్రకాశము. ఈ పనిలో నుండుట కష్టమేమో నాకు తెలియదు. నే నేదో చేయుచున్నాననుట నాకు తెలియని విషయము."

సూర్యుని ప్రకాశదాన మెట్లు స్వాభావిక మో మహాత్ముల విషయమును అట్లే. వారు బ్రతికియున్నారనిన వెలుగు నిచ్చుచున్నారనియే భావము. "మీరు మహాత్ములు, సత్యవాదులు" అని ఒక జ్ఞానితో అని చూడుడు. "నేను సత్యపథమున నడువక పోయినచో నిక చేయున దేమున్నది ? నేను చేయుదానిలో విశేష మేమున్నది?" అని యతడనును. జ్ఞానిలో అసత్యప్రవర్తన ఉండదే ఉండదను.

అకర్మయొక్క భూమిక యిట్లుండును: సాధన లింత నైసర్గికములును, స్వాభావికములును అయిపోయి, అవి జరుగుచున్నవను స్ఫురణయేయుండదు. ఈ సాధనలకు ఇంద్రియములు సహజముగ అలవాటు పడును. అతడు సహజముగ పలికిన పలుకెల్ల హితోపదేశమగును. ఇట్టి స్థితి ప్రాప్తించినప్పుడు కర్మ అకర్మయగును. జ్ఞానికి సత్కర్మలు సహజములగును. కిలకిలారావము పక్షుల సహజధర్మము. మాతృ స్మరణ బిడ్డలకు సహజధర్మము. ఈ విధముగనే ఈశ్వర స్మరణ మహాత్ములకు సహజధర్మమగును. తెల్లవారునపుడు "కొక్కొరోకో" యనుట కోడికి సహజధర్మము. భగవాను డగు పాణిని స్వరములను తెలియజెప్పుచు కోడికూతను ఉదాహరణగ నిచ్చెను. పాణిని కాలముముండి నేటివరకును కోడి ఉదయమున కూయుచునే యున్నది. కాని దీనికై కోడి కెవరైనను సన్మానపత్రములు సమర్పించిరా ? అది కోడికి సహజధర్మము. ఆ విధముగనే సత్యము పలుకుట, భూతదయ, పరులదోషములను గమనింపకుండుట, అందరకును సేవా

శుశ్రూషలు చేయుట మొదలగు కర్మలు సత్పురుషులకు సహజము. అవి చేయకుండ వారు జీవింపలేరు. భోజనము చేసినందులకు మన మెవరినైనను గౌరవింతుమా? తినుట, త్రాగుట, నిద్రించుట, ప్రాపంచికమానవులకు సహజకర్మ లైనట్లే, సేవాకర్మలు జ్ఞానులకు సహజకర్మలు. ఉపకారము చేయుట వారి స్వభావము. ఉపకారము చేయకుండుట వారి పట్ల అసంభవము. అట్టి జ్ఞాని చేయుకర్మ అకర్మదశను పొంది నట్లు ఎంచుకొనవలె. ఈ దశకు సంన్యాసమను అతి పవిత్ర మగు పదవి యీయబడినది. సంన్యాసమనగా పరమోత్కృష్టమైన ఈ యకర్మదశయే. దీనినే కర్మయోగమనికూడ అనవలెను. మానవుడు కర్మ చేయుచునేయుండును. కనుక అది 'యోగ' మయినది. కాని కర్మచేయుచుగూడ, చేయు చున్నానను స్ఫురణ లేకపోవుటచేత, అదే సంన్యాసమయినది. కర్మవాసన తన కంటకుండ, యుక్తితో కర్మ నాచరించుట వలన అది యోగమయినది; చేయుచునే చేయని వాడగుట చేత నది 'సంన్యాస' మయినది.

19

అకర్మయొక్క ఒకవైపు సంన్యాసము

ఇంతకు సంన్యాస మనగానేమి? కొన్ని కర్మలను వదలి వేయుట, కొన్నిటిని చేయుట – ఇదియా సంన్యాసము? అదికాదు. "అన్నికర్మలను వదలుట" యనునదే సంన్యాసము

యొక్క నిర్వచనము. సర్వకర్మలనుండియు విముక్తుడగుట, కొంచెముకూడ కర్మ నాచరింపకపోవుట – ఇది సంన్యాసము. కాని కర్మ చేయకపోవుట యనిన అర్థమేమి? కర్మ అతి విచిత్రవస్తువు. సర్వకర్మలను సంన్యసించుటయెట్లు? కర్మ ముందును వెనుకను, ఇటు అటు, అన్నిదిశలను వ్యాపించి యున్నది. కూర్చుండుటకూడ క్రియయేకదా! 'కూర్చుండుట' యనునది క్రియాపదము. ఇది క్రియయగుట వ్యాకరణశాస్త్రములో మాత్రమేకాదు; సృష్టిశాస్త్రములోకూడ సహాయక్రియవలెగాక, 'కూర్చుండుట' క్రియయే. కూర్చుండగా కూర్చుండగా కాళ్లు నొప్పులువుట్టును. కూర్చుండుటలోగూడ శ్రమయేయున్నది. ఏమియు చేయకుండుటకూడ కర్మయే యయినపుడు, ఇక కర్మ సంన్యాసమెట్లు సంభవమగును? భగవంతుడర్జునునకు విశ్వరూపమును జూపెను. అంతటను వ్యాపించిన ఆ విశ్వరూపమును చూచి అర్జునుడు భయపడి కన్నులు మూసికొన్నాడు. కన్నులు మూసికొన్నను ఆ దృశ్యము లోపలకూడ కనిపించుచునే యుండెను. కన్నులు మూసికొన్నను కనబడుదానినుండి తప్పించుకొనుట యెట్లు? మనము చేయకపోయినను జరుగుచున్నదానినుండి తప్పుకొనుట యెట్లు?

ఒకనియొద్ద అమూల్యమైన అనేక సువర్ణాభరణములుండెను. వాని నన్నిటిని ఒక పెద్దపెట్టెలో దాచిపెట్టవలెననుకొన్నాడు. సేవకుడు అందులకు తగిన పెద్ద యినుపపెట్టెను చేయించి తీసికొనివచ్చెను. దానినిచూచి యజ

మానుడు ఇట్లన్నాడు:– "ఎంత మూర్ఖుడవురా నీవు! ఓరి పల్లెటూరివాడా! సౌందర్యమన్న నేమో నీకు తెలియ నట్లున్నదే! ఇట్టియమూల్యాభరణములను అసహ్యమయిన, ఈ పనికిమాలిన పెట్టెలోనా పెట్టవలసినది? పో, చక్కని బంగారపుపెట్టె యొకటి చేయించి తీసికొనిరా!" సేవకుడు పోయి బంగారుపెట్టెను చేయించి తెచ్చినాడు. "దీనికొక బంగారు తాళమునుగూడ చేయించి తీసికొనిరమ్ము. బంగారపు పెట్టెకు బంగారుతాళమే శోభించును" అన్నాడు యజమానుడు. నగలను మరుగున దాచియుంచవలెనని ఆయన యుద్దేశము. కాని అత డా వస్తువులన్నిటిని మరుగుపరచినట్లా, బయలుపరచినట్లా? చోరుల కా నగలను వెదకుకొన వలసిన అవసరమే కలుగలేదు. వా రా చందుగు పెట్టెను కాజేసిరి. దానితో పనితీరిపోయినది. దీని భావమేమనగా, కర్మ నాచరింపకపోవుటకూడ ఆచరించు విధానమే యగుచున్నది. కర్మ యింత వ్యాపకమైయున్నపుడు దానిని వదలుట యెట్లు?

ప్రపంచములోనున్న కర్మలన్నిటిని ఆచరించుచున్నను, అవి యన్నియు కరగి అదృశ్యమగు ఉపాయమును సాధించుటయే కర్మ సంన్యాసమును పొందుటకు మార్గము. ఇట్లు కాగలిగినప్పుడు "సంన్యాసప్రాప్తి" యయినదని చెప్పగలము. కర్మల నాచరించుచుండగనే అవి యన్నియు కరగిపోవుట యెట్లు? సూర్యు డాచరించుపనులు కరగినట్లుగనే. సూర్యుడు నిరంతరమును కర్మరతుడై యుండును. రాత్రివేళకూడ

నతడు కర్మ నాచరించుచునేయున్నాడు. అప్పు డతని ప్రకా శము ద్వితీయ గోళార్ధములో పనిచేయుచుండును. కాని యిన్నిపనులు చేయుచున్నను, అతడేమియును చేయుటలేద నియే యనుచుందుము. ఇందుచేతనే నాల్గవ అధ్యాయ ములో "నేనీ యోగమును మొదట సూర్యుని కుపదేశించి యుంటిని. తిరిగి సూర్యునినుండి వివేచనపరుడును, మనన శీలుడు నయిన మనువు దీనిని నేర్చుకొన్నాడు" అని భగ వానుడు చెప్పుచున్నాడు. ఇరువదినాల్గుగంటలును కర్మల నాచరించుచున్నప్పటికిని సూర్యుడు లేశమాత్రమును కర్మ నాచరించుటలేదు. నిజమున కీస్థితి అద్భుతమైనది. ఇందు సందేహమేమియు లేదు.

20

అకర్మయొక్క రెండవవైపు యోగము

కాని యిది సంన్యాసమున కొకరూపము మాత్రమే. కర్మనాచరించుచుగూడ ఆచరింపనట్లుండుట సంన్యాసములో నొక భాగము. తా నేమాత్రమును కర్మ నాచరింపకుండ, ప్రపంచములోనివారినెల్ల కర్మప్రవృత్తులనుచేయుట రెండవ భాగము. దీనియం దపారమైన ప్రేరకశక్తి యిమిడియున్నది. అకర్మలోని విశేషమంకూడ నిదే. అకర్మయందు కర్మాచరణ కవసరమైన శక్తి నిండియున్నది. ఆవిరిశక్తికూడ నిదేకదా! బంధించియుంచబడిన యావిరి యెంత ప్రచండకార్యములను చేయదు? అది పెద్ద పెద్ద యోడలను, రైలుబండ్లను తోణ మాత్రములో లాగుకొనిపోవును. సూర్యునివిషయముకూడ

నింతే. అతడు లేశమాత్రమును కర్మ నాచరింపడు. కాని యిరువదినాలుగు గంటలును తెంపులేని కర్మ నాచరించుచునే యుండును. మన మతనిని ప్రశ్నించినచో, "నే నేమియు చేయుటలేదే!" అని యనును. రేలుంబగళ్లు కర్మచేయుచునే, చేయనట్లుండుట, ఏమియు చేయకుండ అహోరాత్రము అనంతకర్మ లాచరించుచుండుట – ఈ రెండును సూర్యుని రెండురూపములు. సంన్యాస మీ రెండురూపములతో అలంకృతమై యున్నది.

రెండును అసాధారణములే. ఒక విధానములో కర్మ ప్రకటమయియుండును; అకర్మావస్థ గుప్తముగ నుండును. రెండవ విధానములో అకర్మస్థితి ప్రకటమై యుండును; కాని దాని ద్వారా అనంతకర్మలు జరుగుచునేయుండును. ఈ స్థితి యందు అకర్మలోకర్మ పూర్ణముగ నిండియుండును. కనుక దానివలన ప్రచండమైన కార్యాచరణ జరుగును. ఇట్టి స్థితిని పొందిన వ్యక్తికిని సోమరికిని చాల వ్యత్యాసమున్నది. సోమరి అలసిపోవును. విసుగుజెందును. కాని ఈ యకర్మ స్థితిని పొందిన సంన్యాసి కర్మశక్తిని బంధించియుంచును. కర్మ లేశమాత్రమును జేయడు. కాలుసేతులతోగాని, మరే యవయవముతోగాని ఎట్టిపనిని చేయడు. కాని ఏ పనిని చేయకయే అత డనంతకర్మలను చేసినవా డగును.

ఒకనికి కోపము వచ్చినదనుకొందము. ఏదైన మన లోపమువలననే అతడు కోపగించి యుండినచో మన మతని యొద్దకు పోదుముకదా! అప్పు డతడు మౌనమువహించును.

మాటలాడడు. ఆ మౌనమువలన, ఆ కర్మత్యాగమువలన ఎంత ప్రచండ పరిణామము కలుగును! మరియొకడైనచో బడబడ మాటలు కురియించును. అగుట కిద్దరిదియు కోపమే; కాని యొకడు మౌనము వహించును, రెండవవాడు బడబడ వాగును. ఇద్దరును కోపమునకు మచ్చుముక్కలే. ఏమియు మాటలాడకపోవుటకూడ క్రోధమయొక్క ఒకరూపమే. దానివలనగూడ పనులు నెరవేరుచుండును. తల్లిగాని, తండ్రిగాని బిడ్డతో మాటాడుట మానివేసినచో దాని పరిణామమెంత ప్రచండముగ నుండును! మాటలాడుట కట్టిపెట్టుటవలన మాటలాడినందువలన కలుగు ఫలముకంటెను ఎక్కువ ఫలము కలుగును. మౌనమువలన కలుగు ప్రభావము మాటలాడుటవలన కలుగనేరదు. జ్ఞానులయొక్క స్థితి ఇట్లేయుండును. వారి యకర్మయే, మౌనముగ కూర్చుండుటయే ప్రచండమైన కార్యములను నెరవేర్చును; ప్రచండమైన సామర్థ్యమునుత్పన్నము చేయును. క్రియలద్వారా ప్రకటితము కాజాలని పనులన్నియు ఒక డకర్మపడుగానుండి చేయగలుగును. సంన్యాసమయొక్క రెండవరూప మిట్లుండును.

ఇట్టి సంన్యాసియొక్క సమస్త కార్యములును, సమస్త ప్రయత్నములును ఒక్కచోట కలసి ఒకరూపమునేపొందును.

*"ఉద్యోగ్‌కీ దాడ్ బైఠీహై సుస్థిర్।
ప్రభుపంఖ్‌మే పడా గతరీ జైసా॥

---

*ఎడతెగకుండ నేనుచేయు ప్రయత్నములన్నియు నిలచిపోయినవి- భగవంతుని రెండు రెక్కలపై మూటవలె పడియున్నాను.

* చింతాగయీసారీ, హుఆహై భరోసా ।
అబ్ గర్భవాస్ ఛూటా మేరా ॥
అపనీ సత్తాసే హుఁ నహీఁ జీతా ।
యోఁ అభిమాన్ ఛీనా ప్రభునే ॥
తుకాకహే జీతా ఏక్ కీ సత్తాసే ।
హుఁ మై ఖోఖలా ఖోఖా జైసే ॥"

తుకారామిట్లన్నాడు:-"నే నిష్ప్రపంచాళీయైపోయితిని; ముద్దకట్టుకొని పడియున్నాను. ఇక నా ప్రయత్నములేమియు లేవు." తుకారాము ఖాళీయైపోయినాడు. కాని ఆ ఖాళీ సంచిలో ప్రచండమైన ప్రేరకశక్తి యున్నది. సూర్యుడు స్వయముగా భేరి మ్రోగించుకొనడు. కాని అతని దర్శన మాత్రమునసే పక్షు లెగురుట మొదలిడును, మేకపిల్లలు గంతులువేయును, ఆవులు వనమునకు మేతకు బయలు దేరును, వ్యాపారస్థులు దుకాణములను తెరచెదరు, రైతులు పొలములకు పోదురు. ఇట్లు ప్రాపంచిక వ్యవహారములన్నియు ప్రారంభమగును. సూర్యుని యునికి మాత్రమునసే అనంత కోటి కార్యములు జరుగును. ఈ యకర్మావస్థలో అనంత మైన కర్మలకు కావలసిన ప్రేరణయు సామర్థ్యమును పూర్ణ ముగ నిండియుండును. సంన్యాసముయొక్క రెండవరూపము ఇట్లద్భుతముగ నుండును.

---

* చింతలన్నియు తొలగిపోయినవి. ఆశ్రయము చిక్కినది. శరీర సంబంధమయిన వికారములన్నియు అంతరించినవి ఇపుడు నేను నాబల ముపై ఆధారపడి లేను. ప్రభువు నా అహంకారమును పటాపంచలు చేసెను. పసిబిడ్డవలె నిర్మలుడనయితిని.

21

రెంటిని పోల్చుట భాష కతీతమైన పని

ఈ యైదవ అధ్యాయములో సంన్యాసముయొక్క రెండురూపములను పోల్చి చెప్పుకొన్నారము. ఒక డిరువది నాల్గుగంటలు కర్మ నాచరించుచుగూడ ఏమియు చేయని వాడగును. రెండవవాడు క్షణముకూడ నేమియు చేయకుండ సర్వమును చేయుచుండును. మాటలాడుచునే మాటలాడని రీతి యొకటి, మాటలాడకయే మాటలాడు రీతి యొకటి. ఈ రెండు విధానములును ఇక్కడ పోల్చి చెప్పబడ్డవి. ఈ రెండు దివ్య విధానములను అవలోకించుటలో, విచారణ చేయుటలో, మననముచేయుటలో అపూర్వమైన ఆనంద మున్నది.

అస లీవిషయమే అపూర్వము, ఉత్కృష్టము. నిజమునకు సంన్యాసముగూర్చిన ఈ భావనయే అతి పవిత్ర మైనది, యోగ్యమైనది. ఈ భావమును మొట్టమొదట శోధించి కనిపెట్టినవానికి మనమెంతగా ధన్యవాదము లర్పింప వలెనో! ఇది మిక్కిలి ఉజ్జ్వలమైన కల్పన. నేటివరకును మానవుని బుద్ధియు, భావనాశక్తియు ఎగిరి యందుకొన్న మహోన్నతశిఖరము ఈ సంన్యాసకల్పనయే. దీనితరువాత నేటివరకును మరెవ్వరును ఈ యెత్తున కెగురలేకపోయిరి. ఎగురు ప్రయత్నములు మాత్రము జరుగుచునేయున్నవి. కాని భావనలోను, అనుభవములోను ఎవరును ఇంత యెత్తు నకు పోయినారని చెప్పలేము. ఈ రెండురీతులతో గూడిన

సంన్యాసముయొక్క భావన దృష్టికి తగిలినంతనే అపూర్వమైన ఆనందము కలుగును. కాని ఇందుండి తిరిగి భాషలోనికి, ప్రాపంచిక వ్యవహారములలోనికి దిగునప్పటికి ఈ యానందము తగ్గి మనము దిగజారుచున్నామా అని యనిపించును. నే నీ విషయమయి మిత్రులతో నెల్లపుడును చెప్పుచుందును. నే నెన్నో సంవత్సరములుగ ఈ దీవ్యభావములను మననము చేయుచున్నాను. దీనిని భాష వర్ణింపలేదు. ఇది మాటల కందునదికాదు.

ఏమియు చేయకయే సమస్తమును చేసివేయుట, అన్నియు చేయుచునే లేశమాత్రమును చేయనట్లుండుట – ఈ కల్పన యెంత యుదాత్తము, రసమయము, కావ్యమయము! ఇక కావ్యములలో నేమున్నది? ఈ కావ్యము ముందు తక్కిన కావ్యములన్నియు వెలవెలబోవును. ఈ కల్పనలో గల ఆనందము, ఉత్సాహము, స్ఫూర్తి, దివ్యత్వము మరి యే కావ్యమునందును లేదు. ఈ విధముగ నీ యైదవ అధ్యాయము మహోన్నతమైన భూమికపై ప్రతిష్ఠింపబడినది. గీత నాల్గవ అధ్యాయము వరకును కర్మ, వికర్మలనుగూర్చి చెప్పి, ఇక్కడ మహోన్నతస్థితికి వెళ్లినది. ఈ యధ్యాయములో అకర్మదశయొక్క రెండు రూపములును ప్రత్యక్షముగ పోల్పబడినవి. ఇట్లు పోల్చుప్రయత్నములో భాష తబ్బిబ్బగును. కర్మయోగి శ్రేష్ఠుడా? లేక కర్మ సంన్యాసి శ్రేష్ఠుడా? ఇందు ఎవరెక్కువగ కర్మ నాచరింతురో చెప్పలేము. అన్నియు చేయుచునే ఏమియు

చేయకపోవుట, ఒకటియు చేయకే సమస్తమును చేయుట ఈ రెండును యోగములే కాని పోల్చిచెప్పుటకొరకు మొదటిది యోగమని రెండవది సంన్యాసమని యందుము.

22

భూమితిశాస్త్రము – మీమాంసకు లిచ్చిన దృష్టాంతములు

ఇట్టిచో వీనిని పోల్చి సమన్వయించుట యెట్లు? ఉదాహరణతోనే ఈ పని కావలె. ఉదాహరణ మియ్య బోయినచో భూమ చాలక దిగజారుచున్నామా యని అనిపించును. కాని దిగజారవలసియే యుండును. నిజమునకు పూర్ణకర్మసంన్యాసముగాని పూర్ణకర్మయోగముగాని శరీరధారికి అనుభవములోనికి రాజాలని భావనలు. ఆ కల్పనల యెదుట దేహమే నిలువజాలదు. కాని ఈ కల్పనల దరిదాపునకు వెళ్ళిన మహాపురుషుల యుదాహరణలే మనకు శరణ్యము. ఉదాహరణ లెప్పటికిని అసంపూర్ణములుగనే యుండును. అయిననేమి? అవి పూర్ణములనియే మనము భావించి సాధన ప్రారంభింపవలె.

రేఖాగణితము "అ, ఆ, ఇ ఒక త్రిభుజమని యనుకొమ్ము" అని చెప్పును. కాని అట్లెందులకనుకోవలె? ఎందులకనిన ఈ త్రిభుజముయొక్క రేఖలు నిజమునకు రేఖలే కావు. రేఖయనగా 'పొడుగుమాత్రముండి వెడల్పులేనిది' అని నిర్వచనము. బోర్డుమీద వెడల్పురాకుండ పొడుగు

మాత్రము కనబరచుట ఎట్లు సంభవము? పొడుగు గీయుటలో వెడల్పుకూడ రానేవచ్చును. మన మే రేఖను గీచినను, దానిలో ఏ కొంచెమో వెడల్పుండియే తీరును. కనుక భూమితిశాస్త్రములో "ఇది రేఖయనుకో" మ్మని యనకుండ పనియే జరుగదు. భక్తిశాస్త్రములోకూడ ఇంతే. "ఈ చిన్న సాలగ్రామములో అఖిలబ్రహ్మాండనాయకు డున్నాడనుకో" అని భక్తుడుకూడ అనును. "ఇదేమిపిచ్చి?" యని ఎవరైన అనినచో "మీ రేఖాగణితము వట్టి పిచ్చియేనా? ఇంత స్పష్టముగ మొద్దురేఖ కనబడుచున్నను, దీనికి వెడల్పు లేదనుకొమ్మంటిరే! ఇది పిచ్చికాదా?" అని నీవడుగుము. భూతద్దములో చూచినచో గీత అరంగుళము వెడల్పున కనిపించును. మీరు మీ రేఖాగణితములో అనుకొన్నట్లే ఈ సాలగ్రామములో పరమేశ్వరు డున్నాడని భావనచేయుడు' అని భక్తిశాస్త్ర మనును. పరమేశ్వరుడు ఛిన్నభిన్నములయి నశింపడు. కాని నీ సాలగ్రామము విరిగి ముక్కలగునుకదా! ఒక్క దెబ్బతీసి చూడనా?' అని యనుట వివేకముతో కూడినమాట కాదు. ఎందువల్లనని న భూమితిశాస్త్రములో 'అనుకో' అనునది చెల్లుబడియైనచో, భక్తిశాస్త్రములో మాత్ర మెందులకు కాదు? బిందువును 'అనుకో' అని బోర్డుమీద కనబడునట్లుగ చుక్క పెట్టుదుము. బిందు వెక్కడనైనను స్పష్టమైన సున్నవలె నుండునా? బిందువు నిర్వచనము బ్రహ్మయొక్క నిర్వచనమే. బిందువునకు పొడవు, గాని, వెడల్పుగాని, మందముగాని – ఏమియు లేదు. నిర్వచన మన్నంతే యిట్లే చేయుదుము. కాని బోర్డుమీద

కనబడనట్లు వ్రాయుదుము. కాని బిందువనునది నిజమునకు అస్తిత్వప్రతీతము, త్రిపరిమాణరహితము. సారాంశమేమనగా : నిజమైన త్రికోణము, నిజమైన బిందువు సిద్ధాంత మాత్రముగనే యుండును. కాని వాని యస్తిత్వమును గుర్తించి వ్యవహరింపవలసియుండును. భక్తిశాస్త్రమునందు కూడ సాలగ్రామములో అవిచ్ఛిన్నుడు, అవినాశి, సర్వ వ్యాపి యయిన పరమేశ్వరుడున్నాడని ఒప్పుకొనవలసి యుండును. ఇక్కడ మనముకూడ ఇటువంటి కాల్పనిక దృష్టాంతములనే తీసికొని, కర్మయోగ కర్మసంన్యాసములను సరిపోల్చి చూతము.

మీమాంసకు లోక ప్రశంసనీయమైన విషయమును వివరించిరి. పరమేశ్వరుడెక్కడున్నాడను మీమాంస చేయుచు వారొక సుందరమైన వివరణ చేసినారు. వేదములలో ఇంద్రుడు, అగ్ని, వరుణుడు మొదలగు దేవతలను గురించి స్తవనగలదు. మీమాంసలో నీ దేవతల విషయమును విచారించుచు "ఇంద్రు డెట్లుండును? అతనిరూప మెట్టిది? అతడెక్కడ నుండును?" అను ప్రశ్నలను బయలు దేరదీసిరి. మీమాంసకులే దీనికి జవాబిచ్చినారు: ఇంద్ర శబ్దమే ఇంద్రుని రూపము. ఇంద్రశబ్దములోనే ఆతనియునికి. 'ఇ'కి పూర్ణానుస్వారము. దానికి 'ద్ర' చేర్చిన - అదే యతని స్వరూపమగును. అదే యతని మూర్తియు, అతని పరిమాణమును. ఇక వరుణదేవత విషయమో! అదియు నంతే. మొదట 'వ', తరువాత 'రు' ఆపైని 'ణ' — వరుణ

యగును. ఇదే వరుణుని రూపము. ఈ విధముగనే అగ్ని మొదలైన దేవతల విషయమునను భావింపుము. ఈ దేవత లందరును అక్షరరూపధారులు. దేవతలందరు అక్షర మూర్తులు. ఈ కల్పనలో, ఈ విచారణలో చాల మాధుర్య మున్నది. దేవతా విషయికమగు కల్పన – దైవవస్తువు – ఏ యాకారమునందును ఇముడునదికాదు. ఆ భావమును ప్రకటించుటకు ఒక యక్షరమే చాలును. ఈశ్వరుని రూప మెట్టిది? మొదట 'ఈ' తరువాత 'శ్వ' దానితరువాత 'ర' చివరకు 'ఓం'తో పూర్ణత్వము వచ్చినది. 'ఓం' అక్షరమే ఈశ్వరుడయినది. ఈశ్వరుని కదియొక సంజ్ఞావాచకమైనది. ఇట్టి సంజ్ఞలను మనము కల్పించుకొనవలసియున్నది. ఎందు చేతననగా: మూర్తిలో – ఆకారములో – ఈ విశాల కల్ప నలు బొత్తిగా ఇముడనేరవు. కాని మనుష్యుని యిచ్ఛ చాల పట్టుదల కలది. అత డీ కల్పనలను మూర్తిలో ప్రవేశ పెట్టు ప్రయత్నము చేయకుండ నుండలేడు.

23

ఋక జనకులవలె సంన్యాసియు యోగియు ఒక్కడే!

సంన్యాసము, యోగము – ఈ రెండుమహోన్నత విషయములు. పూర్ణసంన్యాసము, పూర్ణయోగము అను కల్ప నలు ఈ భౌతిక దేహములో ఇముడనేరవు. ఈ ధ్యేయములు దేహములో ఇముడకపోయినను భావనలో తప్పక యిముడ

వచ్చును. పూర్ణయోగి, పూర్ణసంన్యాసి – వీరి యస్తిత్వము కేవలము నిర్వచనములోనే యుండును. అందనియాదర్శముగనే యేర్పడును. కాని ఈ యాదర్శములను హెచ్చుగా అందుకొన్నవారిని ఉదాహరణగ మనము తీసికొనవలసియుండును. అప్పుడు భూమితిశాస్త్రములో వలెనే 'ఇతనిని పూర్ణయోగి యని, ఇతనిని పూర్ణసంన్యాసియని అనుకో' అని చెప్పుకొనవలె. సంన్యాసముయొక్క ఉదాహరణలుగ శుకుని, యాజ్ఞవల్క్యుని చెప్పుకొందుము. ఇక కర్మయోగమున కుదాహరణలుగ జనక శ్రీకృష్ణుల పేర్లను భగవద్గీతయే తీసికొన్నది. లోక మాన్య తిలకు 'గీతా రహస్యము'లో జనక శ్రీకృష్ణాదులు కర్మయోగులు, శుక యాజ్ఞవల్క్యాదులు సంన్యాసులు అని యొక పట్టిక నిచ్చినారు. కాని కొంచెము విచారించినచో ఆపట్టిక తడిచేతితో తుడిచివేయబడినట్లు తుడిచిపెట్టుకొనిపోవును. యాజ్ఞవల్క్యుడు సంన్యాసి. జనకుడు కర్మయోగి, ఆయనకు శిష్యుడు. అనగా సంన్యాసియైన యాజ్ఞవల్క్యునికి కర్మయోగియైన జనకుడు శిష్యుడైనాడు. కాని ఆ జనకునకు శిష్యుడైన శుకదేవుడు సంన్యాసి. యాజ్ఞవల్క్యుని శిష్యుడు జనకుడు, ఆ జనకుని శిష్యుడు శుకుడు. సంన్యాసి, మరల కర్మయోగి, మరల సంన్యాసి–ఈ విధముగనున్నది ఈ మాలిక. ఈ విధముగ యోగము, సంన్యాసము ఒక పరంపరలోనే వచ్చును.

శుకదేవునితో వ్యాసుడన్నాడు– "నాయనా శుకా, నీవు జ్ఞానివేకాని గురువుయొక్కముద్ర యింకను నీమీద

పడలేదు. అందుచేత నీవు జనకునియొద్దకు వెళ్లుము." శుకుడల్లే యని వెళ్లినాడు. జనకుడప్పుడు తన విశాలభవనమున మూడవఅంతస్తుపై కూర్చుండెను. శుకుడు వనవాసి. నగరమును చూచుకొనుచు పోయినాడు. ఎందులకు వచ్చితివని జనకుడు శుకుని అడిగినాడు. జ్ఞానమును పొందుట కన్నాడు శుకుడు. "నిన్ను పంపిన దెవరు?" అన్నాడు జనకుడు.

శుకుడు: వ్యాసదేవుడు.

జన : నీ రాక యెక్కడినుండి?

శుక : ఆశ్రమమునుండి.

జన : వచ్చునప్పు డిక్కడి బజారులో ఏమేమి చూచితివి?

శుక : నలువైపుల నెక్కడచూచినను అమర్పబడియున్న పంచదార మిఠాయీలు కనబడినవి.

జన : ఇంకేమి చూచితివి?

శుక : నడిచెడి, మాటలాడెడి పంచదారబొమ్మలను చూచితిని.

జన : మరేమి చూచితివి?

శుక : ఇక్కడికి వచ్చుచుండగా పంచదారమెట్లు కాలికి తగిలినవి.

జన : తరువాత నేమికనబడెను?

శుక : ఇక్కడకూడ పంచదారబొమ్మలనే సర్వత్ర చూచుచున్నాను.

జన : ఇప్పుడేమి కనబడుచున్నది?

శుకు : ఒక పంచదారబొమ్మ మఱియొక పంచదార బొమ్మతో మాట్లాడుచున్నది.

అప్పుడు జనకుడన్నాడు:- "ఇక నీవు వెళ్ళిపోవచ్చును. జ్ఞానమంతయు నీకు లభించినది." జనకుని చేన్రాలుతో శుకుని కనసరమైన ప్రమాణపత్రము లభించెను. కర్మయోగి యైన జనకుడు సంన్యాసియైన శుకదేవుని శిష్యునిగా కృతార్థుని జేసినాడని దీని యర్థము. శుకుడు సంన్యాసి; కాని ఈ ప్రసంగమెంత రమ్యముగనున్నది!

"ఏ ఱుదినములలో నీకు మృత్యువువచ్చు"నని పరీక్షిత్తునకు శాసమీయబడినది. తన మరణమునకు కావలసిన యేర్పాట్లు పరీక్షిత్తు చేసికొనవలసియుండెను. అంత్యసమయ మెట్లుండవలెనో బోధించగల గురువు కావలసివచ్చెను. పరీక్షిత్తు శుకాచార్యుని పిలిపించెను. శుకాచార్యుడు వచ్చి 24×7=168 గంటలు పద్మాసనములో కూర్చుండి భాగవతమును వినిపించుచునే యుండెను. కూర్చుండిన ఆసనమును మార్చనేలేదు. తెఱపులేకుండ కథను వినిపించుచునేయుండెను. ఇందు విశేషమేమి? ఇదేవిశేషము: వరుసగా ఏడుదినములు చాల శ్రమచేయవలసివచ్చినను అతనికేమాత్రమును శ్రమ యనిపించలేదు. ఎడతెగని కర్మచేయుచుగూడ అసలేమియు చేయనట్లే కూర్చుండెను. శ్రమయొక్క భావనయే అక్కడ లేదు. "సంన్యాసము, కర్మయోగము - మూలములో నివి భిన్నవస్తువులు కానేకావు" అని దీని సారాంశము.

ఇందువలననే భగవంతుడు —

"ఏకం సాంఖ్యంచ యోగంచ, యఃపశ్యతి స పశ్యతి"
అని యన్నాడు.

"సంన్యాసము, యోగము ఒకటే యని తెలిసికొన్న వాడే అసలు రహస్యము నెఱిగినవాడు." ఒకడు కర్మ చేయకుండ చేసినవాడగుచున్నాడు, రెండవవాడు కర్మచేయుచు గూడ చేయనివాడగుచున్నాడు. ఉత్తమ సంన్యాసియు, నిత్యసమాధిలో నున్నవాడును, నిర్వికారుడును అయిన పురుషుని మన మధ్యకువచ్చి పదిరోజులపాటు ఉండనిండు. ఎంతప్రకాశము, యెంతస్ఫూర్తి అతనినుండి మనకు లభింపగలదు! ఏండ్లతరబడి కుప్పతిప్పలుగ పేరుకొని పడియున్నపని అతని దర్శనమాత్రముననే, అతని యునికివలననే నెరవేరును. ఫోటోను చూచుటవలన చిత్తపరిశుద్ధ్యము కలుగుచుండగా, మృతులైనవారి ఛాయాపటమువలన హృదయమున భక్తి, ప్రేమ, పవిత్రత ఉత్పన్నమగుచుండగా, సజీవుడైన సంన్యాసి యొక్క దర్శనమువలన ఎంతప్రేరణ లభింపగలదు! సంన్యాసి, యోగి ఇరువురును లోకోద్ధరణ చేయుచుందురు. ఒకచోట బయటికి కర్మత్యాగము కనబడుచున్నను ఆ కర్మ త్యాగములో కర్మ పూర్తిగ నిండియుండును. ఆ కర్మ అంతులేని స్ఫూర్తితో కూడియుండును. జ్ఞానియైన సంన్యాసి, జ్ఞానియైన కర్మయోగి, యిరువురును ఒక సింహాసనమునే అధిష్ఠింతురు. మాటలలో భిన్నత్వమున్నను అర్థమొకటే. ఒకతత్త్వము యొక్క రెండు రూపము లవి. యంత్రము వేగముగ తిరుగు

నప్పుడు అది స్థిరముగా నున్నదా, అసలు తిరుగుటయేలేదా యన్నట్లుండును. సంన్యాసిస్థితికూడ నిట్టిదే. అతని శాంతి నుండి, స్థిరత్వమునుండి అనంతశక్తి, అపారమైన ప్రేరణ వెలువడును. మహావీరుడు, బుద్ధుడు, నివృత్తినాథుడు – ఇట్టి దివ్యపురుషులే. సంన్యాసియొక్క కర్మశక్తియంతయు ఒక చోట స్థిరముగ నున్నను, అది ప్రచండమైనకర్మ నాచరించు చునేయుండును. అనగా యోగియే సంన్యాసి, సంన్యాసియే యోగి. ఇద్దరికిని మూలమున నేమియు భేదములేదు. శబ్దములు మాత్రము వేరుకాని అర్థమొక్కటే. రాయి యనగా పాషాణము, పాషాణ మనగా రాయి యన్నట్లే కర్మయోగి యనిన సంన్యాసి, సంన్యాసి యనిన కర్మయోగి.

24

అయినను సంన్యాసముకంటె కర్మయోగమే
శ్రేష్ఠమని తలంపబడుచున్నది.

ఈ విషయమిట్లున్నను ఇందు భగవంతుడొక ప్రత్యేకత చూపించినాడు. సంన్యాసముకంటె కర్మయోగము శ్రేష్ఠమన్నాడు. రెండును ఒకటేయైనచో భగవంతుడిట్లందులకనవలె? ఇదేమైన పరిహాసమా? కర్మయోగమే శ్రేష్ఠమనుటలో భగవంతుడు సాధకుని దృష్టిలోనుంచుకొన్నాడు. బొత్తిగా కర్మ నాచరింపకుండ అన్నికర్మలను చేయగలుగుట ఒక్క సిద్ధునికే సాధ్యము, సాధకునికికాదు. కాని అన్ని కర్మలను ఆచరించుచుగూడ నేమియు ఆచరింప

నట్లుండుట కొంతవరకు అనుకరణీయము. సాధకునికి శక్యము కాక కేవలము సిద్ధునికే శక్యమగు విధానమొకటి. సాధకునికిగూడ కొంతవరకు శక్యమగునది వేఱొకటి. కర్మనసలే ముట్టకుండ కర్మ నాచరించుట యెట్లనునది సాధకుని కొక సమస్యగనే యుండును. అతని కది దురవగాహము. సాధకునికి కర్మయోగ మొక మార్గమును, మజిలీయును. కాని సంన్యాసముయొక్కయునికి చివరియంతస్తుమీదనే కాని మార్గములో లేదు. ఇందుచేతనే సాధకునిదృష్టిలో సంన్యాసముకంటె కర్మయోగము శ్రేష్ఠము.

ఈ న్యాయము ననుసరించియే భగవంతుడు పండ్రెండవ అధ్యాయములో నిర్గుణముకంటె సగుణమునకు అధిక్యము నిచ్చినాడు. సగుణములో అన్ని యింద్రియములకును పనియున్నది. నిర్గుణములో అట్లులేదు. నిర్గుణములో చేతులకు పని లేదు, పాదములకు పనిలేదు, నేత్రములకు పనిలేదు. ఇంద్రియము లన్నియు పనిలేకయే యుండును. సాధకుని కిది సరిపడదు. సగుణమునం దీ చిక్కులేదు. కనులతో మంచి రూపములను చూడవచ్చును. చెవులతో గానశ్రవణము చేయవచ్చును. హస్తములతో పూజయు, లోకసేవయు చేయవచ్చును. పాదములతో తీర్థయాత్రలు జరుపవచ్చును. ఈ విధముగ అన్ని యింద్రియములకును పనినిచ్చి చేయించుచు, నెమ్మది నెమ్మదిగ వానిని హరిమయము చేయుట సగుణములో సాధ్యము. కాని నిర్గుణములో నివి యన్నియు కట్టుపడిపోవును;— నాలుక, కన్ను, చెవి,

కాలు, చేయి అన్నియు మూలపడును. ఈ నిష్క్రియత్వమును చూచి సాధకుడు బెదరిపోవును. అతని మనస్సునకు నిర్గుణత్వమెట్లు నచ్చును? అతడు మౌనముతో గూర్చున్నచో మనసులో అసంగతభావములు బయలుదేరును. వలదన్నపని చేసితీరుటయే ఇంద్రియములస్వభావము. ప్రకటన పత్రికలలో నుండున దిదేకదా! "ఇది చదువవలదు!" అని పైని వ్రాయుదురు. అందుచేత పాఠకులకు ముందు అదే చదువవలె ననిపించును. 'చదువవలదు' అనుటలో పాఠకుడు దానిని తప్పక చదువవలెననియే యుద్దేశము. మనుష్యుడు దానినే నగ్రహముతో చదువును. నిర్గుణదశలో మనస్సు త్రోవ తప్పి తిరుగుచుండును. సగుణభక్తి ఇట్టిదికాదు. అక్కడ ఆరతియున్నది, పూజయున్నది, సేవయు భూతదయయు ఉన్నవి. ఇంద్రియములకు కానలసినంతపని యున్నది. ఇంద్రియములకు సరియైనపని యప్పగించి, "ఇప్పుడు నీ యిష్టము వచ్చినట్లు వెళ్లు"మని మనస్సుతో చెప్పము. అప్పుడు మనస్సు కదలలేదు. అది యందులోనే లీనమై అప్రయత్నముగ ఏకాగ్రతను పొందును. అట్లుగాక పనిగట్టుకొని దాని నొకచోట నిలుపవలెనన్నచో అది తప్పించుకొని పారిపోవును. ఆయా యింద్రియముల కనువైన మంచిపనుల నప్పగించి మనస్సును స్వేచ్ఛగా పొమ్మనుము. అప్పుడది అట్లుపోదు. స్వేచ్ఛగా తిరుగుమని సెలవిచ్చినచో "నేను తిరుగను, ఇక్కడినుండి కదలను" అని యది అనును. "మాట్లాడక ఇక్కడనే కూర్చుండు" మని ఆజ్ఞాపించినచో, "ఇదిగో, పోవుచున్నా"ననును.

దేహధారియైన మానవునికి సాధనసౌకర్యముకొఱకు నిర్గుణముకంటె సగుణము శ్రేష్ఠమైనది. కర్మ నాచరింపకుండ ఆచరించినట్లుండుటకంటె, కర్మనాచరించుచు అది లేదనిపించు యుక్తి శ్రేష్ఠమైనది. ఎందువల్లనన: ఇది తేలికయైన పని. కర్మయోగికి ప్రయత్నమునకు, అభ్యాసమునకు అవకాశములున్నవి. అన్ని యింద్రియములను స్వాధీనపరచుకొని నెమ్మదిగా అన్ని పనులనుండియు మనస్సును తప్పించు అభ్యాసము కర్మయోగములో సాధ్యమగును. ఈ యుపాయము ఇప్పుడే సాధ్యముకాకపోయినను సాధింపదగినదిమాత్ర మగును. కర్మయోగము వనుకరించుట సులభము. ఇదే సంన్యాసము మీద దానికుండు విశిష్టత. కాని పూర్ణకర్మయోగము, పూర్ణసంన్యాసము రెండును ఒకటే. పేర్లు రెండును చూచుటకు వేరువేరుగ కనిపించును. కాని అసలు రెండును ఒకటే. ఒక విధానములో కర్మ బహిరంగముగ నృత్యముచేయుచు కనబడును; కాని లోపల శాంతి. రెండవదానిలో ఏమియు చేయకయే త్రిభువనములను కదలింపగల శక్తి యున్నది. బయటికి కనబడునది యథార్థము కాదు. ఇది యీ రెంటి విషయమునకు తథ్యము. పూర్ణకర్మయోగము-సంన్యాసము, పూర్ణసంన్యాసము-కర్మయోగము వీనికి భేదమేమియులేదు. కాని సాధకునికి కర్మయోగము సులభము. పూర్ణావస్థలో రెండును ఒకటే.

జ్ఞానదేవునికి చాంగదేవు డొక లేఖపంపినాడు. అదివట్టి తెల్లకాగితము. చాంగదేవునికంటె జ్ఞానదేవుడు వయస్సులో చిన్నవాడు. చిరంజీవి యని వ్రాయుదమన్న జ్ఞానదేవుడు

జ్ఞానములో శ్రేష్ఠుడు. 'పూజ్యులు' అని వ్రాయవలెనని అతడు వయసునకు చిన్నవాడు. ఇక విషయములుమాత్రము చాంగదేవుడేమి వ్రాయును? కనుక నతడు వట్టి కాగితమే పంపించెను. అదిముందు నివృత్తినాథుని చేతికందెను. ఆయన దానిని చదివి జ్ఞానదేవుని కిచ్చెను. జ్ఞానదేవుడు చదివి ముక్తాబాయి కిచ్చెను. ముక్తాబాయి చూచి "చాంగదేవుడింత గొప్పవాడైనను ఇంతవరకు ఇతనికి పాండిత్యమే అబ్బలేదు" అనెను. నివృత్తినాథుడు మఱియొక అర్థము తీసి "చాంగదేవుడు నిరాడంబరుడు, శుద్ధుడు, నిర్మలుడు, ఉపదేశమొనయగల యోగ్యుడు" అని జాబునకు ప్రత్యుత్తర మిమ్మని జ్ఞానదేవునితో అనెను. జ్ఞానదేవుడు అరువదియైదు శ్లోకముల ప్రత్యుత్తరమువ్రాసి పంపెను. దానిని 'జ్ఞానదేవ పాసష్టీ' యందురు. ఈ లేఖనుగూర్చియింత మనోరంజకమైన కథయున్నది. వ్రాసినది చదువుట సులభముకాని వ్రాయనిది చదువుట కష్టము. దానిని చదువుట ఎప్పటికిని పూర్తియే కాదు. ఈ విధముగనే సంన్యాసి వట్టి శూన్యునివలె పయికి కనబడుచున్నను ఆ శూన్యతలో అపారమైన కర్మ నిండి యుండును.

సంన్యాసము, కర్మయోగము – పూర్ణరూపములో రెంటివిలువయు ఒక్కటే. కాని వ్యావహారిక దృష్టిలో కర్మ యోగముయొక్క విలువ చాల హెచ్చు. ఒక నోటు విలువయు, ఒక బంగారునాణెపు విలువయు అయిదురూపాయలనుకొనుడు. సర్కారు స్థిరముగ నున్నంతవరకు రెంటివిలువయు ఒక్కటే. కాని ఆ ప్రభుత్వము మారినచో వ్యావ

హారికముగ కాగితపునోటు ఒక్కపైసకుకూడ చెల్లదు. కాని ఎంతలేదన్నను నాణెముయొక్కవిలువ – అది బంగారుకనుక – ఏకొంతయో ఉండును. పూర్ణావస్థలో కర్మత్యాగము, కర్మయోగము, రెంటివిలువయు ఒక్కటే. ఎందులకనిన రెంటియందును జ్ఞానము సమానము. జ్ఞానువిలువ అనంతము. అనంతమున కేది కలిపినను దాని విలువ అనంతమే. ఇది గణితశాస్త్రసిద్ధాంతము. కర్మత్యాగము, కర్మయోగము పరిపూర్ణజ్ఞానముతో కలసినప్పుడు రెంటివిలువయుసమానము. కాని యిరువైపులనుండియు జ్ఞానమును తొలగించినచో కర్మత్యాగముకంటె కర్మయోగమే సాధకునకు శ్రేష్ఠమని రుజువగును. నిండైన శుద్ధజ్ఞానమును ఇరువైపులను కలిపినచో మరల రెంటివిలువయు ఒకటే. గమ్యము చేరినమీదట జ్ఞానము+కర్మ=జ్ఞానము+కర్మాభావము. కాని ఇరువైపులను జ్ఞానమును తొలగించినచో సాధకునిదృష్టిలో కర్మాభావము కంటె కర్మయే శ్రేష్ఠమని స్థిరపడును. కర్మ నాచరింపకుండ ఆచరించినవాడగుట యెట్లో సాధకునికి బోధపడదు. కర్మల నాచరించుచు ఆచరింపనివాడగుట యెట్లో అతనికర్థమగును. కర్మయోగము సాధకుని మార్గములోను గమ్యములోను కూడ ఉన్నది. కాని సంన్యాసము కేవలము గమ్యములోనే యుండును. మార్గములోలేదు. ఈ విషయమును శాస్త్ర పరిభాషలో చెప్పవలెనన్న కర్మయోగము సాధనయు, నిష్ఠయు నగును. సంన్యాసము కేవలము నిష్ఠయే. అంతి మావస్థను నిష్ఠయందురు.

గీతా ప్రవచనములు

ఆరవ అధ్యాయము

చిత్తవృత్తి నిరోధము

25

ఆత్మోద్ధరణకై ఆకాంక్ష

సోదరులారా!

మానవు డెంతఉన్నతోన్నతస్థానమునందుకొనగలడో భావనావివేచనలద్వారా ఐదవ అధ్యాయములో మనము తెలిసికొంటిమి. కర్మ, వికర్మ, అకర్మ కలిసి సాధనయంతయు పూర్తియగును. కర్మ స్థూలవస్తువు. మన మాచరించు స్వధర్మకర్మలలో మానసిక సహకార ముండవలెను. మానసిక శిక్షణకొఱకు చేయబడుకర్మను వికర్మ, విశేషకర్మ-లేక-సూక్ష్మకర్మఅని యందుము. కర్మ, వికర్మ-రెండును అవసరమే. ఈ రెంటి ప్రయోగముద్వారా అకర్మకు భూమిక తయారగును. ఈ భూమికలో కర్మ, సంన్యాసము - రెండును ఏకరూపమే యగునని వెనుకటి యధ్యాయములో చూచినారము. ఇక ఆరవ అధ్యాయము మొదట కర్మయోగము యొక్క- భూమిక సంన్యాసముయొక్క- భూమికనుండి వేఱుగ కనబడుచున్నను, అఱురశః అవి యేకరూపమే యని చెప్పబడినది. ఈ భేదము దృష్టిలోమాత్రమే. ఐదవ అధ్యాయ

ములో వివరించిన స్థితిని పొందించు సాధనలను అన్వేషించు టయే తరువాతి అధ్యాయములలోని విషయము. పారమార్థిక చింతయును, గీతవంటి గ్రంథములును సాధువులకొఱకే యను అపోహలో చాలమంది యుందురు. "నేను సాధువును కాను" అన్నాడొక గృహస్థుడు. "సాధువులొక ప్రత్యేక జాతి. నేను దానికిచెందను. గుఱ్ఱము, సింహము, భల్లూకము, గోవు, ఇత్యాది ప్రాణులవలెనే సాధువులుకూడ ఒక ప్రత్యేకజాతి. పారమార్థిక భావన లీ జాతికిమాత్రమే. వ్యావహారిక ప్రపంచమంతయు వేఱొకజాతి. దాని యాలోచనలువేఱు, ఆచారములువేఱు" అని గృహస్థుని యుద్దేశము. ఈ కల్పన సాధువులను, వ్యావహారిక మానవులను వేరువేరు జాతులుగ విభజించుచున్నది. తిలక్ మహారాజు తన 'గీతారహస్యము'నందు ఈ విషయమును చర్చించినాడు. గీతాగ్రంథము సర్వసాధారణముగ వ్యావహారికజను లందరికిని ఉపయోగపడునదే యని ఆయన వాదము. దీనిని అక్షరశః నేను ఆమోదింతును. భగవద్గీత సమస్త ప్రపంచమునకొఱకును చెప్పబడినది. పారమార్థికములైన సమస్త సాధనలును ప్రతి వ్యావహారిక వ్యక్తికిని అవసరమే. మన వ్యవహారములను శుద్ధముగను, నిర్మలముగను ఉంచుకొనుచు, మానసికతృప్తిని, శాంతిని మనము ఎట్లు పొందవలెనో దానిని నేర్చుటయే పరమార్థము. వ్యావహారికమును పరిశుద్ధ పరచుట యెట్లో చూపుటయే గీతపని. వ్యావహారిక విషయము లన్నిటిలోనికిని గీత వచ్చుచునే యుండును. కాని నిన్నక్కడనే యుంచుట దానికి సమ్మతముకాదు.

చేయిపట్టుకొని నిన్ను చివరిమెట్టువరకును తీసికొనిపోవును. "పర్వతము మొహమ్మదునొద్దకు రాకపోయినచో మొహమ్మదే పర్వతమునొద్దకు పోవును" అను ప్రసిద్ధమైన సామెత లేదా? జడమైన పర్వతమునకుగూడ తన సందేశము అందవలెనని మొహమ్మదునకు ఆసక్తి. పర్వతము జడము. కనుక మొహమ్మదు పర్వతముకాకకై యెదురుచూచుచు కూర్చుండడు. గీతపనియు నిదే. మానవుడు ఎంత దరిద్రుడు, దుర్బలుడు, మూర్ఖాతిమూర్ఖుడు అయినను వానియొద్దకు గీతామాత వెళ్లును. కాని ఈ వెళ్లుట ఉన్న వారి నున్నచోట నుండనిచ్చుటకుకాదు, చేయిపట్టుకొని ముందునకు నడుపుటకును పై కెత్తుటకును. మనుష్యుడు తన వ్యవహారములను పరిశుద్ధపరచుకొని పరమోచ్చస్థితిని పొందవలెననియే గీత కోరును. ఇందులకే గీత పుట్టినది.

కనుక "నేను జడుడను, లౌకికుడను, సాంసారిక జీవిని" అని చుట్టుగోడకట్టుకొని కూర్చుండకుము. "ఈ మూడున్నర మూరల శరీరమే నాసర్వస్వము. నావలన నేమగును?" అనవలదు. ఇటువంటి చుట్టుగోడలలో నిన్ను నీవు బంధించుకొని పశువువలె ప్రవర్తింపకుము. ముందునకు సాగి ఊర్ధ్వగతికి పోవు సాహసము చేయుము.

"ఉద్ధరే దాత్మనాత్మానం
నాత్మాన మవసాదయేత్"

నన్ను నేను తప్పక పైకి తీసికొనిపోవుదునను ధైర్యముతో నుండుము. నే నొక క్షుద్రసాంసారిక జీవిని అను

కొనుచు నీ మనశ్శక్తిని చంపివేసికొనకుము. 'సద్భావనలు' అను తెక్కలను విరిచివేసికొనకుము. నీ భావనావైశాల్యమును పెంచుకొనుము. చండులపక్షియుదాహరణమును ఎపుడు నుంచుకొనుము. చండులపక్షి ప్రాతఃకాలసూర్యుని చూచి అతనియొద్ద కెగిరిపోవలెననుకొనును. మనమును అట్లేకావలె. దుర్బలమైన రెక్కలతో ఆపక్షి పాపము ఎంత యెత్తున కెగిరినను సూర్యునియొద్ద కెట్లు పోగలదు? కాని తన భావనలో నది తప్పక సూర్యుని చేరగలదు. మన యాచరణ దీనికి విరుద్ధముగ నుంచును. మనము పోగలిగినంత యెత్తున కైనను పోకుండ, భావనల కంతరాయమును కల్పించుకొని మనలను మనమే మరింత దిగద్రోసికొనుచున్నాము. ఉన్న శక్తినికూడ సంకుచిత భావనలద్వారా నష్టపరచుకొనుచున్నాము. భావనయే కాళ్లువిరిగి కూర్చున్నచో అధఃపతనము కాక ఇంక నేమున్నది? కనుక భావన లెప్పుడును ఊర్ధ్వముఖముగ నుండవలెను. భావనయొక్క సహాయముచేత మానవుడు ముందునకు పోవును. అందువలన భావనను సంకుచితపరచుకొనకుము.

"స్థూల మార్గకో తజోనహీం।
వడేజగత్ మేర హూం, నఇత్ ఉత్ భటకోభయ్యావ్యర్థకహీం"

ఇటువంటి వ్యర్థప్రలాపములు కట్టిపెట్టుము. నీ యాత్మ నవమానపరచుకొనకుము. విశాలమగు భావనయు, ఆత్మ విశ్వాసమును ఉండిననే సాధకుడు నిలువగలడు. వీనివలననే ఆత్మోద్ధరణ కలుగును. అంతేకాని ధర్మము కేవలము

సాధువులకొఅకే యని చెప్పి "నీ పరిస్థితులనుబట్టి నీ కిది యుచితమే" యన్నట్లు సాధుపురుషులనుండికూడ అంగీకార పత్రమును పొందగోరు ఆలోచనను వదలివేయుము. భేదజనక మయిన యిట్టి యూహలతో నిన్ను నీవు బంధించుకొనకుము. ఉన్న తాకాంక్షను పెట్టుకొనకపోయినచో ఒక్కఅడుగుకూడ ముందునకు సాగదు.

ఈ దృష్టి, యీ యూకాంక్ష, యీ మహోన్నతభావన యున్నవానికే సాధనల సహకార మవసరము. అది లేనిచో సర్వమును సమాప్తము. బాహ్యకర్మకు సహాయముగ వికర్మయను మానసిక సాధన చెప్పబడినది. కర్మకు సహాయముగ వికర్మ ఎప్పుడును ఉండవలెను. ఈ రెంటికలయికవలన అకర్మయను దివ్యస్థితి లభించును. దానిని, దాని రీతులను అయిదవ అధ్యాయములో చూచియుంటిమి. ఆరవ అధ్యాయమునుండి వికర్మ యొక్కరీతులును మానసిక సాధనయు చెప్పబడును. ఈ మానసికసాధననుగూర్చి చెప్పుటకుముందు గీత యిట్లనుచున్నది: "ఓ సోదర జీవుడా! నీవు దేవుడవు కాగలవు. నీ వీ దివ్యమైన ఆకాంక్షను పెట్టుకొనుము. మనస్సును నిర్మలము చేసికొని దాని తెక్కలను దృఢపరచుకొనుము." సాధనకు, అనగా వికర్మకు భక్తియోగము, ధ్యానము, జ్ఞానవిజ్ఞానములు, గుణవికాసము, ఆత్మానాత్మ వివేకము మొదలైన రూపములున్నవి. ఆరవ అధ్యాయములో ధ్యానయోగ మను సాధనయొక్క మార్గము చెప్పబడినది

26

చిత్తైకాగ్రత

ధ్యానయోగములో మూడు విషయములు ముఖ్యమైనవి : (౧) చిత్తైకాగ్రత (౨) చిత్తైకాగ్రత కుపకరించు మితజీవనము (౩) సామ్యదశ – లేక – సమదృష్టి. ఈ మూడును లేనిచో నిజమైన సాధన యుండనేరదు. చిత్తైకాగ్రత యనగా చిత్తచాంచల్యముమీద అంకుశము పెట్టుట. మితజీవన మనగా అన్ని పనులును కొలతప్రకారముండుట. సమదృష్టి యనగా విశ్వమును ఉదారదృష్టితో చూచుట. ఈ మూడును కలిసి ధ్యానయోగమగును. ఈ మూటికినితోడు ఇంకను సాధనలున్నవి. అవి (౧) అభ్యాసము (౨) వైరాగ్యము. ఈ యిరువిషయములనుగూర్చి యిక్కడకొంత చర్చింతము.

మొదట చిత్తైకాగ్రతతీసికొందము. ప్రతిపనియందును చిత్తైకాగ్రత అవసరము. వ్యావహారిక విషయములలోకూడ ఇది యవసరమే. వ్యావహారికమునకును పారమార్థికమునకును కావలసిన సద్గుణములు వేరువేరనుకొనుట సరికాదు. వ్యావహారికమును పరిశుద్ధపరచుటయే పరమార్థము. వ్యవహార మేదైనను దాని యశోపయశములు, సఫలతా విఫలతలు ఏకాగ్రతమీదనే ఆధారపడియుండును. వ్యాపారము, వ్యవహారము, శాస్త్రపరిశోధన, రాజనీతి, రాజ్యతంత్రము – వీనిలో లభించు యశస్సు ఆయాకర్తల చిత్తైకాగ్రత ననుసరించియే యుండును. నెపోలియనును గూర్చి ఒకమాట చెప్పుచుందురు. అతడు యుద్ధపుటేర్పాటు

లన్నియుసరిగాచేసి తదుపరి ఆ యుద్ధభూమిలోనే గణితశాస్త్ర పరిశోధనలో నిమగ్నుడై యుండువాడట్ల. డేరాలపై తుపాకి గుండ్లు వర్షించుచున్నను, సైనికులు మరణించుచున్నను నెపోలియను మనస్సు తన గణితశాస్త్రమునందే లగ్నమై యుండెడిది. నెపోలియను ఏకాగ్రత చాలగొప్పదని నేననను. ఏకాగ్రతనుగూర్చి అంతకు మించిన యుదాహరణ లియ్య వచ్చును. కానిఅతనియందేకాగ్రతయెంతయుండెనోచూడుడు. ఖలీఫా ఉమర్‌నుగూర్చికూడ ఇటువంటి మాటయే చెప్పు చుందురు. యుద్ధ మధ్యమున నమాజువేళకాగానే అతడు అక్కడి కక్కడనే చిత్తైకాగ్రతతో మోకరించి నమాజు చేయువాడట. ఇరుపటములలో నెవరు చనిపోవుచున్నారను స్పృహకూడ లేనంతగ ఆయనమనస్సు ప్రార్థనలో నిమగ్న మయ్యెడిది. ఆదికాలపు ముసల్మానుల ఇట్టి ఈశ్వర నిష్ఠ వలననే, ఏకాగ్రతవలననే ఇస్లాముధర్మ మింతగ వ్యాప్తి చెందినది.

ఆ కాలపు కథ నే నొకటివింటిని. ఒక ఫకీరుండువాడు. శరీరములో బాణము గ్రుచ్చుకొని అత డపరిమితముగ బాధ పడుచుండెను. దానిని బయటికి లాగబోగా బాధ మరింత అధికమయ్యెను. అందుచేత లాగుటకు వీలుకాలేదు. క్లోరో ఫారమువంటి మత్తుమం దప్పుడేదియులేదు. కనుక అదొక పెద్దసమస్య యయ్యెను. ఫకీరు నెరిగినవారిలో కొందరు నుండమనకువచ్చి "బాణమిప్పుడు తీయవద్దు. ఇతడు నమాజు చేయునప్పుడు తీయుడము" అనిరి. సాయంకాలపు నమాజు వేళ యయ్యెను. ఫకీరు నమాజు మొదలుపెట్టెను. అంతలో

వతడు ఏకాగ్రచిత్తుడయ్యెను. వెంటనే బాణము తీసివేసిరి. తీయుటే అతనికి తెలియదు! ఇది ఎంత యేకాగ్రత!

సారాంశమిది : వ్యావహారికములో నైనను, పార మార్థికములోనైనను చిత్తైకాగ్రత వినా సఫలత దుర్లభము. ఏకాగ్రత యున్నచో శక్తిసామర్థ్యమున కెన్నడును కొఱత యుండదు. నీవు అరువదియైదేండ్ల ముదుసలివియైనను నీలో యువజనోత్సాహము, సామర్థ్యము కనబడుచునే యుండును. మానవునకు వార్ధక్యము వచ్చినకొలది అతని మానసికశక్తి వృద్ధిపొందుచుండవలె. పండును చూడుడు – మొదట ఆకు పచ్చగానుండి తరువాత పక్వమగును; క్రమముగ మాగి చివరకు క్రుళ్ళి నశించును. కాని దానిలోని గింజ మాత్రము అంతకంతకు గట్టిపడుచునేయుండును. పండుయొక్క బాహ్య శరీరము క్రుళ్ళి నశించును. ఈ బాహ్యశరీరము ఫలమునకు సార సర్వస్వముకాదు. దాని సారసర్వస్వము ఆత్మయే – అదే బీజము. మానవశరీర విషయముకూడ నింతే. శరీరము ముసలిదియగుచుండును. కాని స్మరణశక్తి వృద్ధిపొందుచునే యుండవలె; బుద్ధి తేజస్వంతము కావలె; కాని అట్లగుటలేదు. 'ఇటీవల నా జ్ఞాపకశక్తి తగ్గిపోయినదని ఒకడనును. ఏల యని యడుగగా 'వార్ధక్యము వచ్చుట వలన' అని యనును. నీ జ్ఞానము, నీ విద్య, నీ జ్ఞాపకశక్తి – ఇవి నీ బీజమని, నీ యాత్మయని యెఱుంగుము. శరీరము ముసలిదగుచున్న కొలది సడలిపోవును. కాని ఆత్మమాత్రము అంతకంతకు బలిష్ఠమగుచుండవలెను. ఏకాగ్రత వినా ఇది యసంభవము.

27

ఏకాగ్రత సాధించుట యెట్లు ?

ఏకాగ్రత అవసరమే. కాని అదెట్లువచ్చును ? దాని కొఱకు మనమేమిచేయవలె ? మనస్సును ఆత్మయందు లగ్నముచేసి, "నకించిద్రపి చింతయేత్" – "మరి దేనిని గూర్చియు చింతనచేయకు" అని భగవంతుడనుచున్నాడు.

కాని యిదెట్లు సిద్ధించును ? మనస్సును పూర్తిగ శాంతిపరచుట చాల గొప్పవిషయము. ఆలోచనాచక్రమును గట్టిగ నిరోధించనిచో ఏకాగ్రత యెట్లుకలుగును ? బాహ్య చక్రము నేదోవిధముగ నిరోధించినను ఆంతరిక చక్రము మాత్రము తిరుగుచునేయుండును. చిత్తైకాగ్రతకొఱకు ఈ బాహ్య సాధనలను ఉపయోగించుచున్నకొలది లోపలి చక్రము మరింత వేగముతో తిరుగుచుండును. నీవు పద్మాసనములో కూర్చుండి, దృష్టిని కేంద్రీకరింపుము. కాని యింత మాత్రమున మనస్సు ఏకాగ్రము కాజాలదు. మనశ్చక్రము యొక్క భ్రమణమును ఆపివేయగలస్థితిని సాధించుట ముఖ్యము.

మనస్సును కలవరపరుచు ఈ యపారమైన బాహ్య సంసారమును నిరోధించనిచో ఏకాగ్రత దుస్సాధము. ఆత్మ యొక్క అపారమైన జ్ఞానశక్తిని క్షుద్రములయిన బాహ్య విషయములలో ఖర్చుపెట్టుచున్నాము. ఇది జరుగరాని పని. పరులను పీడింపకుండ స్వప్రయత్నముచే ధనికుడగువాడు

అనవసరపు ఖర్చులు చేయడు. అట్లే ఆత్మ - జ్ఞాన - శక్తిని క్షుద్రవిషయచింతనలలో ఖర్చుపెట్టరాదు. ఈ జ్ఞానశక్తి మన యమూల్యమైన మూలధనము. కాని మనము దానిని స్థూలవిషయములకై ఖర్చుపెట్టుచుందుము. "ఈ కూర బాగుగాలేదు. దీనిలో ఉప్పు తక్కువ" అనుచుందుము. ఏమి నాయనా! గురివిందగింజయంత ఉప్పు తక్కువైనదా! పాపము! ఒక్క ఉప్పుగల్లు తక్కువయినదను దీర్ఘాలోచన లోనే మన జ్ఞానము ఖర్చుపడిపోవుచున్నది. బిడ్డల నింటిలో కూర్చుండబెట్టి చదువు చెప్పుదుము. చెట్లక్రిందనైనచో కాకులను, పిచ్చుకలనుచూచి పిల్లలు ఏకాగ్రత పొందలేరని ఇట్లు చేయుదుము. వారు పసిబిడ్డలగుటచేత అంతలో వారి కేకాగ్రత కుదురును. కాని మనము పశువులమైనారము. మనకు కొమ్ములు వచ్చినవి. మనలను సప్తప్రాకారముల మధ్య పెట్టినను ఏకాగ్రత రాదు. ఏల యనిన ప్రపంచము లోని ప్రతివిషయమునుగూర్చి చర్చకుదిగుచుండుట మన కలవాటైపోయినది. పరమేశ్వరునియొద్దకు చేర్చగల జ్ఞానమును మనము కూరలరుచులను చర్చించుటలో ఖర్చుపెట్టి అందే కృతార్థత యున్న దనుకొనుచున్నాము.

ఈ భయానకసంసారము అహర్నిశమునలోపలను, వెలుపలను, నలువైపుల హుంకారము చేయుచున్నది. ప్రార్థన, భజనకూడ మనము బాహ్యఫలములకొరకే చేయు చుందుము. పరమేశ్వరునియందు తన్మయులమై సంసారమును విస్మరించు క్షణ మొక్కటికూడ ఉండదు. ప్రార్థనకూడ

ఆడంబరముగలది. ఇట్టి మానసిక దుస్థితియందు పద్మాసన ములో కూర్చుండుట, కన్నులు మూసికొనుట అన్నియు వ్యర్థము. మనస్సు నిరంతరమును బయటనే పరుగెత్తు చున్నచో మానవుని శక్తియంతయు నష్టమైపోవును. మనుష్యు లలో నియమ నిగ్రహములు నశించినవి. ఈనాడు మన దేశములో అడుగడుగునను ఈ విషయము అనుభవమునకు వచ్చుచునేయున్నది. వాస్తవముగ భారతవర్షము పరమార్థ మునకు పుట్టినిల్లు. ఆదినుండియు భారతీయులు ఉన్నతాశయ ములు కలవారుగ పరిగణింపబడుచున్నారు. అట్టిదేశమున మనమిప్పు డే స్థితికి వచ్చితిమి? కేవలము నిరర్థక విషయ ములచర్చలో మనము ఆతురత చూపుచున్నాము. ఇది చాల శోచనీయము. క్షుద్రవిషయములలోనే మన మనస్సు మునిగియుండును.

కథా-పురాణ్ – శ్రవణ్ మే మీఠీనీంద్ సదా ఆజాతీహై।
పడతే హి బిస్తర్ పై కిన్తు చింతా మన్ కో ఖాతీ హై।
కర్మకీ గతి ఐసీ గహనా। ఉసే రోనేసే క్యా పానా?

హరికథలు, పురాణములు వినబోయిన నిద్ర నెత్తి కెక్కును. నిద్రపోవలెనని పండుకొన్నచో ఆలోచనలు పరంపరలుగవచ్చి తలలో తిరుగుచుండును. ఒకప్రక్క శూన్యాగ్రత, రెండవవైపున అనేకాగ్రత. ఏకాగ్రత పేరున కైనను ఉండదు. మనుష్యుడు ఇంద్రియముల కింతగ బానిస యైనాడు. నేత్రములను అర్థనిమీలితములుగ ఎందుల కుంచ వలెనని ఒక రొకసారి నన్నడిగిరి. నేను దీనికి సూటిగ

జవాబు చెప్పగలిగితిని. "పూర్తిగ కనులు మూసికొన్నచో నిద్రవచ్చును. కన్నులను తెరచియుంచిన దృష్టి నలువైపులకును పరుగెత్తి యేకాగ్రత కుదరదు. కనులు మూసికొన్నచో నిద్రవచ్చుట తమోగుణము. తెరచియుంచినచో దృష్టిచెదరి రజోగుణము ప్రవేశించును. ఇందువలన అర్ధనిమీలిత స్థితి మధ్యమార్గముగ చెప్పబడినది". మనస్సు స్థితిమారనిచో, పరిశుద్ధముకానిచో ఏకాగ్రత కలుగనేరదని దీని తాత్పర్యము. ఆసనము వేసికొని కూర్చున్నంతమాత్రమున అది సిద్ధింపదు. దానికొఱకు మన వ్యవహారములన్నియు పరిశుద్ధముగ నుండవలెను. వ్యవహారములు పరిశుద్ధములగుటకు లోపలి యుద్దేశము మారవలె. వ్యక్తిగత లాభము కొఱకుగాని వాసనల తృప్తికొఱకుగాని యే బాహ్యఫలితమునో అపేక్షించిగాని ఏ పనియు చేయరాదు.

మనము దినమంతయు పనులుచేయుచునే యుందుము. ఇట్లు దినమంతయు మనముపడు పాట్లలో ఉద్దేశమేమి ?

ఇసీహాతు మేరా సారా పరిశ్రమ్।
అంతకీ యే ఘడీ హూవే మీఠీ।

ఈ యట్టహాసము, ఈ యురుకులు, పరుగులు అన్నియు మన చరమదశ మధురముగ నుండవలెననియే కదా ! జీవితము పొడుగునను అష్టకష్టములు పడుచెందులకు ? తుదిగడియ, మరణసమయము పవిత్రమగుటకొఱకేకదా ! పగటియొక్క తుదిగడియ సాయంకాలమున వచ్చును. పగటి పనులన్నియు పవిత్రభావముతో చేసినచో రాత్రి ప్రార్థన

మధురముగ నుండును. కనుక సాయంసమయము మధుర ముగనున్నచో ఆనాటి పనులన్నియు సఫలమైనట్లే యెంచు కొనుము. అప్పుడు మనస్సు ఏకాగ్రతను పొందును.

ఏకాగ్రతకొఱ కిట్టి జీవితపరిశుధ్యము అవసరము. బాహ్యవస్తు చింతన వదలిపోవలె. మానవు డెక్కువకాలము జీవింపబోడు. ఈ స్వల్పమైన ఆయుఃప్రమాణములోనే దివ్యసుఖమును చవిచూడగల సామర్థ్యము వానికున్నది. ఇద్దరువ్యక్తులు కేవలము ఒకయచ్చులోనే తయారైనట్లుందురు. ఇద్దరిదియు ఒకటేముద్ర. రెండుకన్నులు వాని మధ్య ముక్కు, ముక్కునకు రెండు రంధ్రములు. ఇట్లు ఒకరూపముతోనే యుండియు ఒకడు దేవతుల్యుడుగ, ఒకడు పశుప్రాయుడుగ నుండును. దీనికి కారణమేమి ? ఇద్దరును పరమేశ్వరుని బిడ్డలేకదా ?

'సబ్ ఏక్‌హీ ఖానికే'

అయినను ఈ భేదమేలవచ్చినది ? ప్రవర్తనమునుబట్టి ఈ యిరువురును ఒక జాతివారేయని నమ్మలేము. ఒకడు నరుడుగా నున్న నారాయణుడు, రెండవవాడు నరుడుగా నున్న వానరుడు.

మానవుడెంత ఉచ్చస్థితికి పోగలడో, ఈ నరదేహ మునందెంతశక్తి యిమిడియున్నదో చూపగల మహాత్ములు నాడును నేడును కలరు. ఇది మన కనుభవసిద్ధము. ఈ దేహ ములోనుండి మనుష్య డిట్టి అద్భుతకార్యములను చేయగలిగి నప్పుడు నేనుమాత్రము అట్లేలచేయలేను ? నా కల్పనా

శక్తికి హద్దు లేలయుండవలెను? నావంటి దేహముకలవారే వీరపురుషులు కాగలిగినప్పుడు వాస్థితి ఇట్లొందులకుండవలె? నాలో నెక్కడనో దోషమున్నది. నా మనస్సెల్లప్పుడును బయటనే తిరుగుచున్నది. ఇతరులను విమర్శించుటలోనే అది చాల వ్యర్థమైపోవుచున్నది. కాని యితరుల దోషములను చూడవలసినపని నా కేమున్నది?

కహాఁ గుణదోష్ పరాయ్‌కే దేఖూఁ।
కమీ క్యా ముఝమే దోష్‌కీ హై?

నాలోమాత్రము దోషములు తక్కువగా నున్నవా? ఎల్లపుడును ఇతరుల చిన్నచిన్న లోపములను చూచుట లోనే నిమగ్నుడనై యున్నచో నాకు చిత్తైకాగ్రత యెట్లు కుదుగును? అట్లున్నప్పుడు నా స్థితి ౧ శూన్యావస్థ – అనగా నిద్ర – లేక – తమోగుణము; ౨ అనేకాగ్రత – అనగా – రజోగుణము – అను ఈ రెంటినడుమను చిక్కుకొనియుండును.

ఏకాగ్రతకొఱకు "ఇట్లు కూర్చుండుము; కన్నులను ఇట్లుంచుకొనుము. ఇట్లాసనమువేసికొనుము" – ఇత్యాది సూచనలు భగవంతు డీయకపోలేదు. కాని చిత్తైకాగ్రత అవసరమని గ్రహించినప్పుడే పైవన్నియు మన కుపకరించును. ఏకాగ్రత అవసరమని మనసులో ముందు నిర్ధారణ కావలెను. అప్పుడు మనకు మనమే ధ్యానికి కావలసిన సాధన మార్గములను అన్వేషింతుము.

28

మితజీవనము

చిత్తైకాగ్రతకు సాయపడు రెండవ విషయము మిత జీవనము. మనపనులన్నియు తూచినట్లుండవలెను. ఈ గణిత శాస్త్రరహస్యము మన సమస్తక్రియలలోను ఓతప్రోతముగా నుండవలె. ఔషధమువలెనే ఆహారనిద్రలుకూడ తూకము ప్రకార ముండవలెను. సమస్తక్రియలును ఇట్లే యుండవలె. ఇంద్రియము లన్నిటిమీదను కావలి ఉంచవలెను. నే నెక్కువగ తినుటలేదుకదా! హెచ్చుగ నిద్రపోవుటలేదుకదా! అనవసరమైనవానిమీదికి దృష్టి పోనిచ్చుటలేదుకదా! – అను సూక్ష్మదృష్టితో మానవుడు తన్ను తాను ఎల్లపుడును పరీక్షించుకొనుచుండవలెను.

ఒకానొక గృహస్థుడు తానెవరియింటికి వెళ్ళినను అందెక్కడ నేవస్తు వున్నదియు ఒకక్షణములో అవగాహనచేసికొనువాడని ఒకరు నాతోనన్నారు. "ఓ దేవా, నాకీమహిమ లభింపకుండునుగాక!" అని నాలో నేననుకొంటిని. ఆగదిలోని అయిదు – లేక – యేబది వస్తువుల పట్టికను జ్ఞప్తియం దుంచుకొనుటకు నేను ఆయనమంత్రినా? లేక నే నాయింటిలో నేదేని దొంగిలింపబోవుచున్నానా? సబ్బు ఎక్కడనున్ననేమి, గడియార మెక్కడనున్ననేమి? ఇవన్నియు నాకెందులకు? ఈ నిరర్థక విషయములకై నా మేధ నేల బాధింపవలె? నా నేత్రముల కీవృథాశ్రమ యేల? ఈ విధముగ చెవులపైగూడ కావలియుంచుము.

"కుక్క చెవులవంటి చెవులు మన కున్నచో ఎంతబాగుగా నుండును!" అని కొందరనుకొందురు. కుక్కలు ఎటుకావల సిన నటు చెవుల నంతలో త్రిప్పగలవు. పరమేశ్వరుడు మనుష్యుని కీశక్తి నీయలేదు. కాని ఇదొక లోటుకాదు. ఈ నిరర్థక శక్తితో మనకవసరములేదు. అసలు మన మనస్సే మిగుల నుద్రిక్తమయినది. ఎక్కడనేని కాసంత అలికిడి యయ్యెనా మనస్సు అటు పరుగిడును. కనుక నిగ్రహమును మితత్వమును జీవితమునందు ప్రవేశపెట్టుము. చెడ్డవస్తువులను చూడకు. చెడ్డపుస్తకములను చదువకు. నిందాస్తుతులు చెవినిబెట్టకు. నిర్దుష్ట వస్తువులే కదా యని మితిమీరి సేవింపకు. ఇక సదోషవస్తువుల విషయము చెప్పనేల? ఎట్టి ఇంద్రియచాపల్యమును ఉండరాదు. సారాయి, పకోడీ, రసగుల్లా అవసరమేలేదు. కమలాఫలము, అరటి పండు, బత్తాయి, నారింజకూడ ఎక్కువగా అక్కరలేదు. ఫలహారము శుద్ధమైన ఆహారమే. కాని అదికూడ మితి మీరి పనికిరాదు. స్వేచ్ఛాచారమునకు దిగినచో లోపలి యజమానుడు తప్పక దండించువను భయభక్తులు ఇంద్రియముల కుండవలె. నియతాచరణమే మితజీవనమందుము.

29

శుభదృష్టి

మూడవవిషయము సమదృష్టి కలిగియుండుట. సమదృష్టియే శుభదృష్టి. శుభదృష్టి కలుగనిచో ఏకాగ్రత

రానేరదు. సింహము ఎంత వనరాజైనను ముందునకు నాలు గడుగులువేసి వెనుకకుచూచుము క్రూరజంతువున కేకాగ్రత ఎట్లు వచ్చును? సింహము, కాకి, పిల్లి – వీని కన్నులు ఎప్పుడును నలువైపుల చూచుచుండును. వానిచూపు ఎప్పుడును బెదరుచు చెదరుచు నుండును. హింసావృత్తిగల ప్రాణియొక్కస్థితి ఇట్లేయుండును. మనలో సామ్యదృష్టి రావలెను. ఈ సృష్టియంతయు కల్యాణమయముగ తోచవలెను. నా మీద నాకు విశ్వాసమున్నట్లే సర్వసృష్టిమీదను ఉండవలెను. ఇందులో భయపడవలసిన దేమున్నది? అంతయు పరిశుద్ధమే, పవిత్రమే.

"విశ్వం తద్భద్రం యదవన్తి దేవాః"

ఈ విశ్వమును పరమేశ్వరుడు పాలించుచున్నాడు. కనుక ఇది మంగళమయము. ఆంగ్లకవి బ్రౌనింగుకూడ ఇట్లే యన్నాడు:

"ఈశ్వరు డాకాశమున ప్రకాశించుచున్నాడు,
ప్రపంచమంతయు సరిగా నడుచుచున్నది."

ప్రపంచమున చెడు గేమాత్రమును లేదు; చెడుగెక్కడ నేని ఉన్నచో అది మనదృష్టిలోనే. మనదృష్టినిబట్టియే సృష్టి ఉండును. ఎట్టని సులోచనములు పెట్టుకొన్నచో సృష్టియంతయు మండిపోవుచున్నట్లు ఒకటే యెరుపుగా కనిపించును.

సమర్థరామదాసు రామాయణము వ్రాయుచు శిష్యులకు చదివి వినిపించుచుండెను. అది వినుటకు హనుమం

తుడుకూడ వచ్చి కూర్చుండెను. "హనుమంతు డశోక వనమునకు వెళ్లెను. అక్కడ అతడు తెల్లని పువ్వులను చూచెను" అని రామదాసు చదువగా తత్క్షణమే హనుమంతుడు ప్రత్యక్షమై ముందునకువచ్చి "నేను చూచినవి తెల్లని పువ్వులు కావు, ఎఱ్ఱనివి. నీవు తప్పువ్రాసితివి. దానిని సవరింపుము"అనెను. "నేను సరిగానే వ్రాసితిని. నీవు చూచినవి తెల్లనిపువ్వులే" అని రామదాసు అనెను. "స్వయముగ అక్కడికి వెళ్ళినవాడను నేను. నాదే యబద్ధమా !" అని హనుమంతుడనెను. చివరకీ వివాదము శ్రీరామచంద్రునియొద్దకు వెళ్ళెను. ఆయన యిట్లు తీర్పుచెప్పెను : "పువ్వులు తెల్లనివే. కాని హనుమంతుని కన్నులు క్రోధము వలన ఎఱ్ఱపడుటచే తెల్లని పుష్పము లతనికి ఎఱ్ఱగా కనబడినవి." ఈ మధురగోష్ఠియొక్క సారాంశమిది : ప్రపంచమును మన మేదృష్టితో చూచుచుందుమో అది మనకట్లే కనిపించును.

ఈ సృష్టి శుభప్రదమని మనస్సులో నిశ్చయము కానిచో ఏకాగ్రతకలుగనేరదు. సృష్టి అక్రమముగ నడుచుచున్నదని యనుకొనుచున్నంతకాలము అన్నివైపులనుండియు అనుమానములు నన్ను పీడించుచునేయుండును. కవులు పక్షుల స్వాతంత్ర్యమునుగూర్చి గానము చేయుదురు. ఒక్కసారి నిన్ను నీవు పక్షిగా భావించుకొని చూడుము. దాని స్వాతంత్ర్యమేమో నీకు తెలిసిపోవును. పక్షి తన మెడను ముందునకు, వెనుకకు అదేపనిగ ఆడించుచుండును. పక్షు

లెప్పుడును ఎవరివలన నేమి కీడువచ్చునో అను భయముతో నుండును. పటినిదెచ్చి యొక ఆసనముమీద కూర్చుండ బెట్టుము. దాని కేకాగ్రత కుదురునా? ఎవరేని కొంచెము దగ్గరకు రాగానే అది తుళ్ళున ఎగిరిపోవును. 'ఇతడు వచ్చుట నన్ను చంపుటకు కాదుకదా?' అని అది సంశయపడును. ఈ ప్రపంచములోనివారందఱు తన్ను తినువారు, చంపువారు అని భయపడువానికి శాంతియెక్కడ? "నాకు రక్షకుడను నేనే; మిగిలినవారందరును నన్ను తినువారు" అని యను కొనుచున్నంతవరకు ఏకాగ్రత కలుగనేరదు. సమదృష్టి కలిగించుకొనుటయే దీనికి ఉత్తమమార్గము. సర్వత్ర మంగళమును దర్శించుటకు పూనుకొనుము. చిత్తము దాని కదే శాంతించును.

దుఃఖములోనున్నవాని నెవనినైనను జల జల ప్రవహించు నదియొద్దకు తీసికొనిపొండు. స్వచ్ఛమును శాంతమును అగు ఆ ప్రవాహమును చూడగనే వాని వ్యాకులత తగ్గిపోవును. అతడు తన దుఃఖమును మరచిపోవును. ఆ ప్రవాహమున కింతశక్తి యెక్కడిది. పరమేశ్వరుని శుభశక్తి దానిద్వారా ప్రకటమగును. వేదములలో నదు లత్యంత సుందరముగ వర్ణింపబడినవి.

"అతిష్ఠన్తీనాం అనివేశనానాం"

నదులిట్లుండును. నది యఖండముగ ప్రవహించుచుండును. దాని కిల్లు వాకిలి లేదు. అది సంన్యాసిని. కనుక నిట్టి పవిత్రప్రవాహము ఒక్కక్షణములో మనస్సునకు

ఏకాగ్రతనిచ్చును. ఇట్టి సుందరమైన నదినిచూచి మనస్సులో ప్రేమ జ్ఞాన ప్రవాహము లేల వెల్లివిరియవు ?

ఈ బాహ్యజడప్రవాహమే మనస్సున కింతటి శాంతిని ప్రసాదింపగలిగినచో హృదయమనెడు లోయలో భక్తిజ్ఞానములను చిన్మయఝరి ప్రవహించినప్పుడు నా కింకెంతశాంతి లభింపవలె ? వెనుక నా మిత్రుడొకడు హిమాలయ - కాశ్మీర ప్రాంతములలో పర్యటించుచు అక్కడి పవిత్రపర్వతముల సుందర జలప్రవాహముల వర్ణననువ్రాసి నాకు పంపుచుండెను. నే నిట్లు జవాబిచ్చితిని: "నీకు నిరుపమానందమును గూర్చుచున్న అక్కడి జలప్రవాహముల, పర్వతపంక్తుల, శుభ సమీరముల అనుభవమును నేనును నా హృదయమునందే పొందగలను. నా అంతస్సృష్టిలో ఆ రమణీయదృశ్యములన్నిటిని నిత్యమును నేనును చూచుచునే యున్నాను. అందువలన నీవు నన్నచటికి రమ్మన్నను నా హృదయములోని ఈ భవ్య దివ్య హిమాలయమును వదలి నేను రాను."

"స్థావరాణాం హిమాలయః"

స్థిరత్వమును సాధించుటకు స్థైర్యమూర్తియైన ఏ హిమాలయమును ఉపాసింపవలెనో ఆ హిమాలయము యొక్క వర్ణనను విన్నంతమాత్రముననే నేను నా కర్తవ్యమును వదలివేసినచో అది తలక్రిందు వ్యవహారమగును.

సారాంశము : చిత్తమును కొంచెము శాంతిపరచుకొనుము. దానిని మంగళదృష్టితో తిలకింపుము. అప్పుడు నీ హృదయములో భక్తిజ్ఞానఝరులు అనంతముగ ప్రవ

హించును. భావన లను దివ్యతారలు హృదయాకాశములో మెరయును. ఆతివి, మట్టివి యైన పవిత్రవస్తువులను చూచి చిత్తము శాంతిపడినపుడు అంతస్సృష్టిచిత్రములను చూచి యేల శాంతింపదు ? నే నొకప్పుడు తిరువాన్మూరువెళ్ళితిని; ఒకరోజున సముద్రపుటొడ్డున కూర్చుంటిని. అపారమైన ఆ సముద్రము, దాని మహాగర్జన, సాయంసమయము – స్తబ్ధుడనై, నిశ్చేష్టుడనై కూర్చుంటిని. ఒక మిత్రుడు పండ్లు మున్నగునవి నాకయి అక్కడికితెచ్చి యిచ్చెను. ఆ సమయమున ఆ సాత్త్వికాహారముకూడ నాకు విషప్రాయముగ తోచెను. సముద్రము ఓం, ఓం అని గర్జించుచు "మామనుస్మరయుధ్యచ" అను గీతావచనమును నా తలపునకు తెచ్చుచుండెను. సముద్రము సతతము నామస్మరణము చేయుచుండును, కర్మకూడ చేయుచుండును. ఒక అల వచ్చును, అది మరల పోవును. తిరిగి మరియొకటి వచ్చును. ఒక్కక్షణమైన విశ్రాంతిలేదు. ఈ దృశ్యమునుచూచి నా యాకలిదప్పు లెగిరిపోయెను. అస లా సముద్రములో నేమి విశేషమున్నది ? ఆ యుప్పునీటియలలు లేచుట చూచి నా హృదయము పొంగినదిగదా ! ఇక జ్ఞానప్రేమ లను అగాధ సముద్రపుటలలు హృదయమున లేచినపుడు నే నింకెంత హెచ్చుగా నృత్యము చేయగలుగుదునో! వైదికఋషుల హృదయములో ఇట్టి సముద్రపుటలలు లేచుచుండెడివి.

"అంతః సముద్రే హృది అంతరాయుషి
ఘృతస్యధారా అభిచాకశీమి
సముద్రాదూర్మి ర్మధుమానుదారత్"

ఈ దివ్యభాషకు భాష్యమున్రాయుటకు, పాపము, భాష్యకారులుకూడ నేమియు పాలుపోక చకితులైరి. ఆహా! ఎంతదొడ్డది ఆ ఘృతధార! ఆ మధుధార! నా అంతస్సము ద్రములో లేచునవి ఉప్పునీటి కెరటములా? కాదు, కాదు. నా హృదయములో ఘృత క్షీర మధువులు అలలుగా లేచి పొంగి పొరలుచున్నవి.

30

బాలకుడు - గురువు

హృదయములోని ఈ సముద్రముమీద దృష్టి నిలుపుట నేర్చుకొనుము. బయటనున్న నిరభ్ర నీలాకాశమును చూచి మనస్సునుకూడ నిర్మలముగను, నిర్లిప్తముగను చేసికొనుము. నిజమునకు చిత్తైకాగ్రత అటవలె సహజమైన విషయము. చిత్తకల్లోలమే అసహజము, ప్రకృతి విరుద్ధము. చిన్నబిడ్డకంటివంక రెప్పవాల్పక చూడుము. ఆ పసిబిడ్డ రెప్పవేయకుండ చూచును. మన మిూలోగా పదిసార్లు రెప్పవేయుదుము. పిల్లలమనస్సు అంతలో ఏకాగ్రమగును. నాలుగైదువేలల శిశువునకు పచ్చని ప్రకృతిశోభను చూపింపుము. శిశువు తదేకదృష్టితో చూచును. పచ్చని ప్రకృతిని చూచుచుంటచే పిల్లల విరేచనముకూడ పచ్చగానుండునని తల్లులనుకొందురు. పిల్లలు అన్నియింద్రియములను కన్నులుగా చేసికొని చూచుచున్నారా యని అనిపించును. ఏ విషయమైనను పసిబిడ్డల మనస్సుమీద గొప్ప ప్రభావమును కలిగించును. మొదటి మూడు నాలుగుసంవత్సరముల

లోపల లభించు శిక్షణయే, నిజమైన శిక్షణ యని శిక్షణ శాస్త్రజ్ఞులందురు. విద్యాపీఠములు, పాఠశాలలు, మరి యితరసంస్థలు ఎన్ని స్థాపించినను ప్రారంభదశలో అబ్బిన శిక్షణ తిరిగి యెన్నడును అబ్బనేరదు. శిక్షణవిధానముతో నాకు సంబంధ మున్నది. ఈ బాహ్యశిక్షణవలని ప్రయోజనము శూన్య మను అభిప్రాయము దినదినమును నాలో దృఢపడుచున్నది. ప్రారంభములో అబ్బిన సంస్కారము వజ్రతుల్యమగును. తరువాతిశిక్షణ పైమెరుగు, పైతొడుగు అని తెలసికొనుము. సబ్బు పట్టించుటవలన పైమరకలును మాలిన్యమును వదలిపోవునుకాని మేని నలుపు ఎట్లుపోవును? ఆ విధముగనే ఆదిసంస్కారములు వదలిపోవుట చాలకష్టము.

ఇట్లు మొదటనబ్బిన సంస్కారము బలవత్తరముగా, తరువాతిసంస్కారము బలహీనముగా నగుటకు గల కారణ మేమి ? చిన్నతనములో ఏకాగ్రత సహజమైయుండుటయే దీనికి కారణము. అందువలన అప్పటి సంస్కారములు ఎన్నటికిని నశింపవు. చిత్తైకాగ్రతయొక్కమహిమ యిట్టిది. ఈ యేకాగ్రత నార్జించుకొన్నవాడు చేయలేని దేమున్నది ?

నేడు మనజీవిత మంతయు కృత్రిమమైనది. మన బాల వృత్తి నశించినది. జీవితములో వాస్తవమైన సరసత్వము లేదు. అది శుష్కమైనది. మనము తల - తోక లేకుండ ప్రవర్తించుచున్నాము. 'డార్వీక్ చెప్పు నవసరములేకుండ మన కార్యములవలన మనది మర్కటజాతియే యని మనము రుజువుచేసికొనుచున్నాము.

చిన్నపిల్లవాడు విశ్వాసశీలుడయి యుండును. తల్లి చెప్పినదెల్ల వానికి ప్రమాణము. ఆమెనుండి తాను విన్న కథ లేవియు వానికి అసత్య మనిపించవు. కాకిచెప్పినది, పక్షి యన్నది – ఈ మాటలన్నియు వాడు సత్య మనుకొనును. పిల్లలలోని ఈ మంగళ మనోవృత్తివలన వారికి త్వరితముగ ఏకాగ్రత కుదురును.

31

అభ్యాసము, వైరాగ్యము, శ్రద్ధ

ఏకాగ్రతయొక్క తాత్పర్య మిది : ధ్యానయోగమునకు చిత్తైకాగ్రత, పరిమితజీవనము, శుభప్రదమైన సామ్య దృష్టి అవసరము. వీనికితోడు మరి రెండు సాధనములు చెప్పబడినవి : (౧) వైరాగ్యము (౨) అభ్యాసము. ఇందు మొదటిది విధ్వంసకారి. రెండవది నిర్మాణకారి. పొలములో కలుపుమొక్కలను పెరికివేయుట విధ్వంసక కార్యము. దీనినే వైరాగ్య మందురు. పొలములో విత్తనములునాటుట విధాయక కార్యము. సద్విషయములనుగూర్చి మరల మరల చింతనచేయుట అభ్యాసమందురు. వైరాగ్యము విధ్వంసక క్రియ, అభ్యాసము విధాయకక్రియ, కాగా వైరాగ్యమెట్లు లభించును? మామిడిపండు తియ్యగానున్నదందుము. కాని ఆ తీపి కేవలము మామిడిపండులోనే యున్నదా? లేదు, మామిడిపండులోనే లేదు. మన ఆత్మాభిరుచిని వస్తువులో చొప్పించినందువలన ఆ వస్తువు మధురమగును. కనుక

లోపలి మాధుర్యమును చవిచూచుట నేర్చుకొనుము. కేవలము బాహ్యవస్తువులోనే మాధుర్యములేదు. "రసానాం రసతమః" మాధుర్యసాగరమైన ఆత్మ మనదగ్గరనేయున్నది. దానివలననే తియ్యనివస్తువులకు తీపికలిగినది. ఇట్లు భావించుచుండుటవలన మనసులో వైరాగ్య సంచారము కలుగును. సీతామాత హనుమంతునికి ముత్యాలహారమును బహుమతిగా నిచ్చెను. హనుమంతు డా ముత్యములను కొరికి చూచి పారవేసెను. వానిలో అతనికెక్కడను రాముడు కనబడలేదు. రాముడున్నచోటు అతని హృదయమే. అధ్యాత్మికపు విలువలేని ముత్యములకొఱకే మూర్ఖులు లక్షలు ఖర్చుపెట్టుచుందురు.

ఈ ధ్యానయోగమును వర్ణించుచు ఒక గొప్ప విషయమును భగవంతుడు ఆరంభములోనే చెప్పియున్నాడు: "నన్ను నేనే ఉద్ధరించుకొనవలసియున్నాడను. నేను ముందునకు సాగిపోదును. నేను ఎత్తున కెగురుదును. ఈ నరదేహములో స్తబ్ధుడనై పడియుండను. పరమేశ్వరుని సమీపించు సాహసము చేయుదును. దానికి ప్రయత్నముకూడ చేయుదును" అను దృఢసంకల్పము మానవుడు చేసికొనవలెను.

ఇదంతయు విని అర్జునుడు, "భగవాన్, ఇప్పటికే నా వయస్సు చాల గడచిపోయినది; కొలదిరోజులలో చని పోదును. నాకిక ఈ సాధనవలన నేమిప్రయోజనము?" అను సంశయమును వెలువరించెను. "మత్యునంగా దీర్ఘనిద్ర" యని భగవంతుడు ధైర్యము చెప్పెను. మనము దినదినము పనిపాటలుచేసికొని ప్రొద్దెక్కిదిగటలు నిదపోదుము.

ఈ నిద్రకు ఎవడైనను భయపడునా? పైగా నిద్రపట్టక పోయిన చింతనొందును. నిద్ర అవసరమైనట్లే మృత్యువుకూడ అవసరము. మనము నిద్రలేచి తిరిగి పనులలో ప్రవేశింతుము. అట్లే మరణానంతరముకూడ వెనుకటిసాధనయంతయు సార్థకమగును. జ్ఞానదేవుడు జ్ఞానేశ్వరిలో ఈ ప్రసంగమునుగూర్చి వ్రాసిన పద్యములలో తన జీవిత చరిత్రనే వ్రాసెనా యన్నట్లుండును.

*"శైశవమే హీ సర్వజ్ఞతా । బరతీహైఁ ఉన్హేఁ ।
సకలశాస్త్ర స్వయంహీ । ముఖసే నికలేఁ ॥"

ఇత్యాది చరణములలో నిదియే కనబడును. పూర్వ జన్మలోని యలవాట్లు నిన్ను పట్టి యీడ్చుచుండును. ఒకొక్కని మనస్సు విషయములదెసకు పోనేపోదు. మోహమెట్లుండునో వానికి తెలియనే తెలియదు. ఏలయనగా వాని వెనుకటిజన్మలోనే దానికి వలసిన సాధన పూర్తియయ్యెను.

"శుభకాకీ కభీ కోయీ
పాతా కుగతీకో నహీఁ"

కల్యాణమార్గమున పోవువాని శ్రమ ఏమాత్రమును వ్యర్థముకాదు. ఈ విధమైన శ్రద్ధ చివర బోధింపబడినది. అపూర్ణముగనున్నది చివరకు పూర్ణమగును. భగవంతుని యీ యుపదేశసారమును గ్రహించి మీ జీవితమును సార్థక పరచుకొనుడు.

---

*వానికి శైశవములోనే సర్వజ్ఞత అబ్బినది. సకలశాస్త్రములు స్వయముగనే ముఖమునుండి వెలువడినవి.

గీతా ప్రవచనములు

ఏడవ అధ్యాయము

ప్రపత్తియోగము – లేక – శరణాగతి

32

భక్తియొక్క భవ్యదర్శనము

ఆత్మీయులారా!

అర్జునునకు స్వధర్మపాలనగూర్చి ప్రశ్నకలిగినప్పుడు అతని మనస్సులో స్వపరసంబంధమైన మోహ ముత్పన్న మయి, స్వధర్మాచరణనుండితప్పించుకొను ఉపాయము నతడు వెదక నారంభించెను. నిరర్థకమైన ఈ మోహము మొదటి యధ్యాయములో చూపబడినది. ఈ మోహమును తొలగించుటకే రెండవ అధ్యాయము ప్రారంభమయినది. అందు ఈ మూడు సిద్ధాంతములు చెప్పబడినవి : (1) అనశ్వరమైన ఆత్మ సర్వత్ర నిండియున్నది. (2) దేహము నశ్వరము. (3) స్వధర్మము నెన్నడును త్యజింపరాదు. వీనితోపాటు కర్మఫలత్యాగ మను ఉపాయముకూడ చెప్పబడినది. ఈ యుపాయమే పైసిద్ధాంతములను ఆచరణలోబెట్టు సాధనము. కర్మయోగవివరణనుండి కర్మ, వికర్మ, అకర్మ పుట్టినవి. కర్మ వికర్మల సంయోగమునుండి ఉత్పన్నమగు అకర్మ యొక్క రెండురూపములను అయిదవ అధ్యాయమున

మనము చూచితిమి. ఆరవ అధ్యాయమునుండి వికర్మ యొక్క భిన్నభిన్నరూపములు చెప్పుట ప్రారంభమయ్యెను. ఆ యధ్యాయములోనే సాధనకు సంబంధించిన ఏకాగ్రతయు చెప్పబడినది.

నేటిది ఏడవ అధ్యాయము. ఈ యధ్యాయములో వికర్మయొక్క విశాలము, సుందరము అయిన వేరొకగది తెఱువబడినది. సృష్టిదేవిమందిరములోను, విశాలవనము లోను నానావిధ మనోహరదృశ్యము లున్నట్లే గీతాగ్రంథము లోను ఉన్నవి. ఆరవ అధ్యాయములో ఏకాగ్రతయను గదిని దర్శించినారము. ఇప్పుడు మనము మరియొకగదిలో ప్రవేశింతము.

దాని ద్వారమును తెఱువకముందే భగవంతుడు మోహకారకమైన ఈ జగద్రచనయొక్క రహస్యమును తెలియజెప్పుచున్నాడు. ఒకరకపు కాగితముపైనే ఒక కుంచెతోనే చిత్రకారుడు రకరకములైన చిత్రములను గీయును. సితారువాయించువాడు ఏడుతీగలమీదనే అనేక రాగములను పలికించును. భాషలోని యేబదిరెండు అక్షర ములతో మనము పలురకములైన భావనలు, అభిప్రాయ ములు ప్రకటించుచుందుము. అట్లే ఈ సృష్టివిషయమున కూడ. సృష్టిలో అనంతవస్తువులును, అనంతవృత్తులును కనబడుచున్నవి. కాని ఈ యంతర్బాహ్యసృష్టియంతయు అఖండాత్మ, అష్టవిధ ప్రకృతి – అను ఈ రెంటిసంయోగము చేతనే ఏర్పడినది. క్రోధాన్వితుని క్రోధము, ప్రేమించువాని

ప్రేమ, దుఃఖితుని యాక్రందనము, సంతసిల్లువాని సంతోషము, సోమరికుండు నిద్రాసక్తి, పాటుపడువాని కర్మానురక్తి – ఇవన్నియు ఒక చైతన్యశక్తియొక్క లీలలే! ఈ పరస్పరవిరుద్ధభావముల మూలములో ఒక చైతన్యమే నిండియున్నది. లోపలి చైతన్యమొక్కటే యైనట్లు బాహ్యప్రకృతి స్వరూపముకూడ ఒక్కటే. చైతన్యమయమైన ఆత్మ, జడ ప్రకృతి – ఈ రెంటిసంయోగముచేతనే సృష్టియంతయు జన్మించినదని మొదటినుండియు భగవంతుడు చెప్పుచున్నాడు.

ఆత్మ, దేహము, పర, అపర ప్రకృతులు సర్వత్ర ఒక్కటే. అయినను మానవుడు మోహములో ఏలపడిపోవుచున్నాడు? భేదము లెందులకు కనబడుచున్నవి? ఒకని తోడి సంపర్కము మధురముగ నుండి మరొకనిని చూచుట అనిష్టముగనుండునేమి? ఒకని సాంగత్యము కావలెనని, మరొకనికి దూరముగ నుండవలెనని ఎందులకనిపించును? ఒక పెన్సిలే, ఒక కాగితమే, ఒక చిత్రకారుడే; కాని అతడు వ్రాయు అనేక చిత్రములద్వారా అనేక భావములు ప్రకటమగును. చిత్రకారుని హస్తకౌశలము ఇందే యున్నది. చిత్రకారునికంచె, వైణికుని వ్రేళ్లు మనలను ఏడ్పించగలవు. నవ్వింపగలవు. ఇదే వానిలోనున్న కౌశలము, ప్రాశస్త్యము.

వీడు దగ్గరగనుండవలెను, వాడు దూరముగ నుండవలెను; వీడు నావాడు, వాడు పరాయివాడు, అని యమకొనుటకు మోహమే కారణము. ఈ మోహమువలననే

మనుష్యుడు సమయమువచ్చినపుడు తన కర్తవ్యమునుకూడ వదలిపెట్టును. ఈ మోహమునుండి విముక్తులము కావలె నన్న సృష్టికర్తయొక్క హస్తకౌశల రహస్యమును గ్రహింప వలెను. బృహదారణ్యకోపనిషత్తులో 'నగారా' దృష్టాంత మీయబడినది. ఒక నగారానుండియే భిన్నభిన్న నాదములు వెలువడును. కొన్ని నాదములు విని భయపడుదుము; కొన్నింటికి ఆనందముతో నృత్యము చేయుదుము. ఈ భిన్నభావములను జయింపవలెనన్న నగారా వాయించువాని కౌశలమును పట్టుకొనవలెను. అతని కౌశలమును మనము గ్రహించినంతనే అతడు పలికించిన నాదము మన కవగతమగును. "మాయను తరింపదలచినవారు నా శరణుపొందుదురుగాక!" అని భగవానుడు ఒక వాక్యములోనే చెప్పివేసెను.

"యహాఁ వహీ లీలాసే తరే జో ఆయే శరణ్ మేరే
ఉన్హే సూఝ్‌గయా ఇసీ కినారే మాయా - జాల్"

కాని ఈ మాయ యనగేమి? పరమేశ్వరునిశక్తిని, అతని కళాకౌశలమును మాయ యందురు. ప్రకృతి, ఆత్మ-జైన పరిభాషలో జీవము, అజీవము-ఈ రెంటినికలిపి రంగు రంగుల సృష్టిని రచించినవాని శక్తియే లేక కళయే మాయ. జైలులో ఒకరకమునకేచెందిన రొట్టె, పప్పుపులుసు ఉన్నట్లే, ఒక అఖండాత్మయే, ఒక అష్టప్రకృతిమయ శరీరమే ఉన్నవి. వీనితో పరమేశ్వరుడు రకరకముల వస్తువులను తయారు చేయుచున్నాడు. మన మీ వస్తువులనుచూచి భిన్నభిన్నములు పరస్పరవిరుద్ధములైన మంచిచెడుగుల అనుభవమును

పొందుచుందుము. వీని నతిక్రమించి మనము నిజమైన శాంతిని పొందవలెనన్న ఈ వస్తునిర్మాతయొక్క తత్త్వమును పట్టుకొని అతని పరిచయము సంపాదింపవలె. అట్లు పరిచయము చేసికొన్నమీదటనే భేదజనకమును ఆసక్తిజనకమును అగు ఈ మోహమునుండి విమోచనపొందగలము.

ఆ పరమేశ్వరుని తెలిసికొనుటకు ఒక లోకోత్తర సాధన – ఒక లోకోత్తర విధర్మ ఉన్నది. దానిని తెలియజెప్పుటకు ఏడవ యధ్యాయములో భక్తి యను భవ్యమందిరమొకటి తెఱవబడినది. చిత్తశుద్ధికిగాను యజ్ఞము, దానము, జపము, తపము, ధ్యానము, ధారణ – మున్నగు అనేక విధర్మలు చెప్పబడుచుండును. ఈ సాధనలను నేను సోడా, సబ్బు, కుంకుడుకాయలతో పోల్తును. భక్తి నీరువంటిది. సోడా, సబ్బు, కుంకుడుకాయలు శుద్ధిచేయును. కాని నీరు లేనిచో అవేమియు పనిచేయవు. నీరు లేనిచో అవియుండియు లాభమేమి? అట్లుకాక సోడా, సబ్బు, కుంకుడుకాయలు లేకపోయినను ఒక్కనీటితోనే శుద్ధిచేయవచ్చును. నీటితోపాటు అవికూడ నున్నచో "అధికస్య అధికం ఫలం"అగును; పాలకు పంచదారచేర్చినట్లుండును. యజ్ఞము, యాగము, ధ్యానము, తపము – ఈ యన్నిటిలోను హృదయము లేకున్నచో ఇక చిత్తశుద్ధి యెట్లుకలుగును? హృదయమే భక్తి.

అన్నిసాధనలకును భక్తి యవవరము. భక్తి ఉపాయములలోనెల్ల మేటి. సేవాశాస్త్రమెరిగి ఉపచర్యలు బాగుగ

చేయనేర్చినవా డొకడు ఒకరోగిసేవకై వెళ్లుననుకొనుము. వాని హృదయములో సేవాభావము లేకపోయినచో అది యథార్థమైనసేవ యెట్లగును? ఎద్దు చాల బలిష్ఠముగనున్నను, బండిలాగు నిచ్ఛయే లేనిచో అది అడుగువేయకుండ ఆగిపోవును. లేదా, బండిని ఏ గోతిలోనికో లాగివేయును. హృదయములేని పనులవలన తుష్టియులేదు, పుష్టియులేదు.

33

భక్తినుండి విశుద్ధమైన ఆనందము లభించును

ఈ భక్తి యున్నచో ఆ మహోచిత్రకారుని కళను, అతని చేతనున్న కుంచెను మనము చూడగలుగుదుము. ఆ జలధారయొక్క మూలముగానున్న అపూర్వ మధుర రసమును ఒక్కసారి రుచిచూచితిమా, ఇక మిగిలిన రసములన్నియు తుచ్ఛములు, నీరసములు అనిపించును. అరటి పండ్లరుచి నెరిగినవాడు రంగువేసిన కొయ్యపండ్లను చూచి, చేతబట్టుకొని 'సరే బాగున్న'వనుచు అవతలబెట్టును. అసలు పండ్లరుచి తెలిసియున్నందువలన కొయ్యపండ్లమీద వానికి భ్రాంతియుండదు. ఈ విధముగనే ఆ యమృతధారయొక్క మాధుర్యమును గ్రహించినవానికి గులాబీమర్బతువంటి బాహ్యవస్తువులపై ఆసక్తియుండదు.

ఒక తత్త్వజ్ఞానితో ప్రజలన్నారు: "అయ్యా, ఈ రోజున పట్టణములో గొప్ప అలంకారముచేయుచున్నారు; పోవుదము రండు!" "సోదరులారా, ఈ యలంకారములలో

నేమున్నది? ఒక దీపము, తరువాత మరియొకటి, మరియొకటి– ఈ విధముగ ఒకలక్ష, పదిలక్షలు, కోటి, మీరు లెక్కింప గలిగినన్ని–ఈ యలంకారములు నే నెరిగినవే'' అని వేదాంతి జవాబు చెప్పినాడు. గణితములో క్రమవృద్ధిననుసరించి 1+2+3 ఈ ప్రకారము అనంతమువరకు నుండును. సంఖ్యకును సంఖ్యకును ఉండు అంతరము తెలిసినచో సంఖ్యలన్నియు వ్రాయవలసిన అవసరముండదు. అట్లే వారు ఒకటితరువాత నొకటిగా వెలిగించిన దీపములవరుసను చూచి ఇంతగా తన్మయులము కావలసినపని యేమున్నది? కాని మానవున కిట్టియానందము నందే ఆసక్తి మెండు. నిమ్మకాయలరసము తీసి దానిని, పంచదారను నీటిలో కలుపును. దానిని లొట్టలువేయుచు త్రాగి ''ఓహో, ఈ షర్బత్ ఎంతబాగుగానున్నది!'' అనును. జిహ్వకు రుచులుకల్పించుటతప్ప మరి పనియేలేదు. ''ఇది దీనిలో కలుపుము, అది దానిలో కలుపుము'' అనుచు రుచులుమరగుటలోనే యున్నది ఆనందమంతయు! చిన్నప్పుడు నే నొకసారి సినీమాచూచుటకు వెళ్ళితిని. నిద్రవచ్చిన పండుకొనవచ్చునని ఒక గోనెపట్టాను నా వెంట తీసికొని వెళ్ళితిని. కన్నులు మిరుమిట్లుగొల్పు నిప్పుబొమ్మలను తెరపై చూచుసరికి రెండుమూడు నిమిషములలో నా కన్నులు అలసిపోయినవి. ఆట అయినతరువాత లేపుడని ప్రక్కవారితో చెప్పి పట్టాపరచుకొని నిద్రపోయితిని. రాత్రి ఆరుబయట గాలియాడుచోట చంద్రుని నక్షత్రములను చూచుట మాని వేసి ప్రశాంతసృష్టిలోని పవిత్రానందమును వదలి ఆ యిరుకైన

సినీమాలోని నిప్పుబొమ్మల నాట్యమును చూచి చప్పట్లు కొట్టుచున్నాము. ఇది నాకేమియు అర్థమగుటలేదు.

మానవుడింత ఆనందరహితుడైట్లయినాడు? అయ్యో! అతడెంత దుస్థితికివచ్చెను! ప్రాణములేని బొమ్మలవలని తుణికా నందమునకై ప్రాకులాడుచున్నాడుగదా! జీవితములో ఆనందములేనప్పుడు ఇట్టి కృత్రిమానందము నన్వేషించును. ఒకసారి మా పొరుగున బాజావాయించుచుండిరి. ఈ బాజా యెందులకని నే నడిగితిని. పిల్లవాడు పుట్టినా డనిరి. తనకు కుఱ్ఱవాడు పుట్టినాడని ఆగృహస్థు మేళముచేయించి ప్రపంచ మునకు చాటుచున్నాడు! ప్రపంచములో వీనికొక్కనికేనా పిల్లవాడు పుట్టుట! పిల్లవాడు పుట్టినాడని నృత్యములు, గాన ములు, నాటకములు జరుపుదురు. ఇవన్నియు కుఱ్ఱతనపు చేష్టలుకాక మరేమి? ఇదియంతయు చూచిన ఆనందమునకు కఱవు వచ్చినట్లున్నది. కఱవు కాలములో రెండుమెతుకుల కొఱకు ప్రజలు విఱుచుకొనిపడినట్లే ఎక్కడనేని కుఱ్ఱవాడు పుట్టినను, ఎటకేని సర్కసు – లేక – సినీమా వచ్చినను ఆనందమునకు అంగలార్చు ప్రజలు పాపము! మిడుతలదండు వలె ఆ యా కార్యక్రమములలో పడిపోవుదురు.

ఇది నిజమైన ఆనందమా? గానముయొక్క అలలు చెవులద్వారాపోయి బుద్ధికి ఉత్తేజమును కలిగించును. ఇట్లే వస్తువులరూపములు నేత్రములద్వారా బుద్ధికి ఉత్తేజమును కలిగించును. ఈ విధముగా కలిగిన ఉత్తేజముతోనే పాపము! మానవుల ఆనందము నిండియుండును. ఇట్టి యింద్రియ

సుఖమే ఆనందమనుకొని ఒకడు పొగాకును చూర్ణముచేసి ముక్కులో కూరుకొనును. మరియొకడు దానిని బీడీగాచుట్టి నోటిలో పెట్టుకొనును. ఈ నశ్యమువలని, పొగవలని ఉద్రేకమువలన వారికి ఆనందరాశి చేజిక్కినట్లుండును. ఒక్క బీడీ ముక్క దొరకినంతనే వాని సంతోషమునకు మేరయుండదు. టాల్‌స్టాయి అన్నాడు – "ఆ సిగరెట్టునిషాలో వాడు ఖూనీ కూడ చేసివేయుననిన ఆశ్చర్యములేదు. ఇది యొకరకమైన మత్తు అనుకొనుము."

ఇట్టి యానందములో మానవుడెందులకు నిమగ్నుడై పోవును ? నిజమైన ఆనంద మెక్కడ దొరకునో తెలియకే. మానవుడు సీడనుచూచి మైమరచును. ఈనాడు పంచేంద్రియముల ఆనందమునే అనుభవించుచున్నాడు. ఒకవేళ కనులు లేకపోయినచో మిగిలిన నాలుగింద్రియములతోనే ప్రపంచములో సంతోషమును అనుభవించుచున్నాడు. మంగళ (అంగారక) గ్రహమునుండి రేపెవడైనను ఆరింద్రియములతో ందికి దిగివచ్చినచో అయిదింద్రియములవాడు ిన్నుడై "వీనిముందు మనమెంత దీనులము, హీనులము !" అని విలపించును.

సృష్టియొక్క అర్థమంతయు ఈ పంచేంద్రియముల కెట్లు తెలియగలదు ? ఒక్కొక్కడు ఈ ప్రపంచవిషయములలో కొన్నిటి నెన్నుకొని వానియందే లోలుడైయుండును. పాపము ! గాడిదయరపు వినిపించినచో అశుభము చెవిని బడినదనుకొనును. కాని వానిదర్శనమాత్రము గాడిద

కళుభముకాదా ? గాడిదవలన వానికి నష్టము కలిగినదనియే యనుము; వానిమూలమున ఇతరులకు నష్టముకలుగుటలేదా? నేను బరోడా కాలేజీలోనుండగా ఒకసారి ఐరోపాగాయకులు వచ్చిరి. వారు అగుటకు గొప్ప పాటగాండ్రే ; ఇతరులను ఓడించివచ్చినవారే. అయినను నా కటువంటిపాట వినుఅలవాటులేక ఎప్పుడులేచిపోదునా యనిపించెను. నా పరీక్షలో వారు తప్పిపోయిరి. మన గాయకులు ఆ దేశములకు పోయిన వారి పరీక్షలో వీరు తప్పిపోవచ్చును. సంగీతమువలన ఒకనికి ఆనందము కలిగిన మరియొకనికి కలుగదు. ఇట్టిది నిజమైన ఆనందముకాదు; అది కృత్రిమానందము. వాస్తవికానందమును దర్శింపనంతవరకు ఈ కృత్రిమానందములోనే ఊగులాడుచుందుము. పాలు దొరకనంతవరకు అశ్వత్థామపిండితో చేసిన పాలనే పాలనుకొని త్రాగినాడు. ఈ విధముగమీరు ఆనందమయొక్క నిజస్వరూపమును ఎంతగాగ్రహించి చవిచూడగలిగిన, అంతగా ఇతరవిషయములన్నియు వెలవెలబోవును.

ఈ యానందము నన్వేషించుటకు భక్తియే ఉత్కృష్టమార్గము. ఈ మార్గమున పోగాపోగా పరమేశ్వరుని కౌశలము బోధపడును. ఇది అవగతముకాగానే ఇతరభావనలన్నియు వానికవియే తొణించి రూపుమాసిపోవును. ఇక తుద్రమైన ఆకర్షణలేవియు నిలుపనేరవు. అప్పుడు ప్రపంచమున ఒక యానందమే నిండియున్నట్లు గోచరించును. మిఠాయిదుకాణము లెన్నియున్నను అన్నిటిలోని మిఠాయి

లొకటే. నికరమైన వస్తువు చేజిక్కనంతవరకు మనము చంచలమైన పక్షులవలె ఒకకణ మిక్కడను ఒకకణ మక్కడను తినుచుందుము. నేటి వేకువను తులసీరామాయణమును చదువుచుంటిని. దీపమునొద్ద పురుగులు చేరినవి. ఇంతలో నొకబల్లి వచ్చెను. నా రామాయణముతో దాని కేమిపని ? పురుగులను చూచుసరికి దాని కెంతఆనందము కలిగెనో ! అది పురుగులమీదికి వచ్చుచుండగా చేతితో కొంచెము అదలించితిని. అది పారిపోయెనేకాని దాని చూపంతయు పురుగులమీదనే యుండెను. "ఈ పురుగులను నీవు తిందువా ? నీ నోరు ఊరుచున్నదా ?" అని నన్ను నేను ప్రశ్నించుకొన్నాడను. నా నోరూరలేదు. నేను చూరగొను చున్న ఆనందము ఆ బల్లి కేమితెలియును ? రామాయణములోని రసమును అది చవిచూడలేదు. ఈ బల్లివలె నున్నది మనదశ. నానారసములలో మనము నిమగ్నులమైయున్నాము కాని నికరమైన రసము మనకు లభించినచో ఎంత ఆనందము కలుగును ! శ్రేష్ఠమైన ఆ రసమును చవిచూపగల భక్తియను సాధనను భగవంతుడు మనకు అందించుచున్నాడు.

34

సకామభక్తియు విలువకలదే !

భగవంతుడు భక్తులను మూడువిధముల విభజించినాడు – (౧) సకామభక్తుడు (౨) నిష్కాముడైన యేకాంగి

భక్తుడు (3) జ్ఞాని, అనగా పూర్ణభక్తుడు. నిష్కాములైన ఏకాంగిభక్తులలో మూడు తెగలవారు కలరు. (అ) ఆర్తుడు (ఆ) జిజ్ఞాసువు (ఇ) అర్థార్థి. భక్తివృక్షముయొక్క శాఖోపశాఖలివి.

సకామభక్తుడనగా నెవడు? ఒక కోరిక మనసులో పెట్టుకొని భగవంతుని చేరువాడు. ఇది నికృష్టమైన భక్తి యని చెప్పి నేను దానిని నిందింపను. గౌరవప్రతిష్ఠలు కలుగునని అనేకులు సార్వజనిక సేవకు పూనుకొందురు. ఇందు చెడు గేమున్నది? వారికి బాగుగ గౌరవప్రతిష్ఠలిండు. గౌరవించుటవలన రాగల చెడు గేమియును లేదు. గౌరవము లభించుచుండుటవలన పోనుపోను వారు సార్వజనిక సేవలో స్థిరపడుదురు. క్రమముగ వారి కట్టిసేవయే ఆనందదాయక మగును. గౌరవమును పొందవలెనను కాంక్షకు అర్థమేమి? ఈ గౌరవమువలన మనము చేయుచున్నపనులు ఉత్తమమైనవే యని మనకు నమ్మకము కలుగును. తాను చేయుసేవ మంచిదో చెడ్డదో తెలిసికొనగల ఆంతరిక సాధనము (ఆత్మజ్ఞానము) లేనివాడు ఈ బాహ్యసాధనపై ఆధారపడియుండును. చిడ్డపనిని తల్లి మెచ్చుకొనుటవలన తల్లికొఱకు హెచ్చుగా పనులు చేయవలెనని బిడ్డకు తోచును. సకామభక్తికూడ నిట్టిదే. సకామభక్తుడు పరమేశ్వరునిసన్నిధికి చేరి "ఇమ్ము" అని యడుగును. అన్నిటికిని సర్వేశ్వరుని యాచించు ప్రవృత్తి సామాన్యమైనదికాదు; ఇది అసామాన్యము. "మనము తీర్థయాత్రకు పోవుదమా?" అని యొకసారి జ్ఞానదేవుడు నామ

దేవుని అడిగెను. "ఎందులకు?" అని నామదేవుడనెను. "సాధు సమాగమము లభించు"నని జ్ఞానదేవుడు జవాబిచ్చెను. "అయినచో భగవంతుని అడిగివచ్చెదను" అనిచెప్పి నామదేవుడు దేవమందిరమునకువెళ్ళి దేవునికెదురుగ నిలబడినాడు. అతని కంటివెంట అశ్రుప్రవాహము బయలుదేరెను. భగవంతుని చరణములమీదనే దృష్టినిలిపి చూచుచుండెను. కన్నీరు కార్చుచు చివరకు "ప్రభూ, నేను వెళ్ళవచ్చునా?" అని యడిగెను. జ్ఞానదేవుడుకూడ ప్రక్కనేయుండెను. ఈ నామదేవుని పిచ్చివాడంచురా మీరు? భార్య యింటియొద్ద లేకపోయిన ఏడ్చుచు కూర్చుండువా రెందరో ఉన్నారు. దేవునియెడల కన్నీరుకార్చు భక్తులనుమాత్రము వారు సకామ భక్తులేయగుదురుగాక సామాన్యులని యనరాదు. కాని ముఖ్యముగా అడుగదగినదాని నిమ్మని వారు దేవుని అడుగకపోవుటయు కలదు. అది వారి అజ్ఞానమే. ఇంత మాత్రమున సకామభక్తి త్యాజ్యము కాదు.

స్త్రీలు ఉదయముననేలేచి వివిధ వ్రతముల నాచరింతురు. హారతినిత్తురు, అఖండమును వెలిగింతురు, తులసీ ప్రదక్షిణము చేయుదురు. ఎందుల కిదంతయు? పరలోకమున పరమేశ్వరానుగ్రహము కలుగవలెనని. ఇట్లనుకొనుట అమాయికమే కావచ్చును. అయినను మరణానంతరము పరమేశ్వరానుగ్రహము లభింపవలెనని స్త్రీలు జపములును, వ్రతములును, ఉపవాసములును మొదలైన అనుష్ఠానములను ఆచరింతురు. ఇట్టి వ్రతశీలుర నిష్ఠనుండి మహాపురుషులు

జన్మించుచుందురు. తులసీదాసుసంతతినుండి రామతీర్థస్వామి ఉద్భవించెను. రామతీర్థుడు క్రైస్తవిభాషలో ప్రవీణుడు. తులసీదాసువంశములో పుట్టిన మీకు సంస్కృతమేరాదా? అని యొక రని రట. రామతీర్థునిమీద దీని పరిణామము కనబడెను. కులస్మృతిలో నెంతసామర్థ్యమున్నది! తదుపరి ఆయన ఆ ప్రోత్సాహమువలన సంస్కృత మభ్యసించినాడు. స్త్రీలలోని ఈ భక్తిభావమును మనము అపహాస్యముచేయరాదు. ఇట్లు భక్తికణములు కూడుకొన్న తావులందు తేజస్వంతమగు సంతానము ఉత్పన్నమగును. కావుననే భగవంతుడనును – "నాభక్తుడు సకాముడైనను అతని భక్తిని నేను దృఢతరము చేయుదును. అతని మనస్సులో తీక్ష్ణకలుగనీయను. 'ఈ నారోగమును నివారింపుమని దీనుడైనన్నతడు అర్పించినను, అతని ఆరోగ్యవాంఛను బలపరచి అతనిని నీరోగినిగా చేయుదును. దేని కతడు నాయొద్దకు వచ్చినను నేనతనిమెన్ను చూరచి ప్రేమతో దగ్గరకుతీయుదును." ధ్రువుని యుదాహరణను తీసికొనుడు. ఇతనికి తండ్రి యొడిలో కూర్చుండుటకు స్థానము దొరకమిచే ఈశ్వరుని ప్రార్థింపుమని తల్లిచెప్పెను. అప్పుడు ధ్రువుడు భగవదుపాసనలో ప్రవేశించెను. భగవంతుడతనిని సుస్థిరమైన స్థానములో కూర్చుండబెట్టెను. మనస్సు నిష్కామము కాకపోయినంతమాత్రమున నేమైనది? మనుష్యుడు వెళ్లుట యెవరియొద్దకు? అర్థించుట యెవరిని? అనునదే ముఖ్యవిషయము. ప్రపంచముముందు చేయిచాపకుండ ఈశ్వరుని అర్థించువృత్తి గొప్పది.

నిమిత్త మేదైనను నీవొక్కసారి భక్తిమందిరమున ప్రవేశించి చూడుము. ప్రారంభములో కోరికతో ప్రవేశించినను పోనుపోను నిష్కామివగుదువు. వస్తుప్రదర్శనశాలలలో "అయ్యా, తమరొకసారి దయచేసి, ఎంత శ్రేష్ఠమైన రంగురంగుల ఖాదీ తయారగుచున్నదో కొంచెము చూడుడు." అని కార్యనిర్వాహకులు విజ్ఞప్తిచేయుదురు. గ్రాహకుడు లోపలికిప్రవేశించి చూచి ఆకర్షింపబడును. భక్తివిషయమునను ఇంతే. ఒక్కసారి భక్తిమందిరములో ప్రవేశింపుము; దాని సౌందర్యమును సామర్థ్యమును తెలియును. స్వర్గమునకు వెళ్లుచుండగా ధర్మరాజు వెంట చినవర కొక కుక్కయే మిగిలియుండెను. భీమార్జునాదులు దారిలోనే పడిపోయిరి. స్వర్గద్వారమునొద్దగల భటులు ధర్మరాజుతో "నీవు రావచ్చును. కాని ఈ కుక్క రాగూడదు." అనిరి. "నా కుక్క రాగూడనిచో నేనును రాజాలను"అని ధర్మరాజనెను. అన్యాసక్తిలేని సేవ చేయుశునకమైనను 'నేను, నే'ననుకొను దురభిమానుల కంటె శ్రేష్ఠము. భీమార్జునులకంటెనుగూడ అది శ్రేష్ఠమని రుజువైనది. ఈశ్వరాభిముఖమగు కీటకమైనను ఈశ్వర విముఖులైన పెద్దలలోని పెద్దకంటెను గొప్పది. దేవాలయములలో కూర్మము,నంది-విగ్రహములుండును.ఆనందికి అందరును నమస్కరింతురు. అది సామాన్యమైన యెద్దుకాదు. అది దేవుని యెదుటనేయుండును. వృషభమేయైనను అది భగవంతుని దని మనము మఱవరాదు. పెద్దపెద్ద మేధావులకంటె అది శ్రేష్ఠమైనది. భగవంతుని స్మరించు అమాయికుడుకూడ విశ్వవంద్యుడగును. ఒకసారి నేను రైలులో పోవుచుంటిని. రైలుబండి

యమునానది వంతెనమీదికి వచ్చెను. నాప్రక్కనున్న యొకడు పులకిత హృదయుడై ఒక కానిడబ్బు నదిలో పడవేసెను. అదిచూచి మరియొకడు "మనది అసలే దరిద్ర దేశము. దానికి తోడు ప్రజ లిట్లు వ్యర్థముగ డబ్బును పాఱవేయుచుందురు'' అని విమర్శింప మొదలుపెట్టెను. అప్పుడు నే నంటిని. "మీ రతని యుద్దేశమును గుర్తింపలేదు. ఆ యుద్దేశములో నున్న విలువ రెండుమూడుపైస లైనను ఉండు నందురా అనరా? మరేసత్కార్యమునకైనను ఆ పైసా లిచ్చియుండిన ఇంకను బాగుగా నుండును. అది తరువాత చూతము. కాని భావనాశీలుడైన ఆ వ్యక్తి "ఈ నది యననేమి? ఈశ్వర కారుణ్యమే యిట్లు ప్రవహించుచున్నది" అని ఈ త్యాగము చేసినాడు. మీ యర్థశాస్త్రములో ఈ భావనకేమైన స్థాన మున్నదా? దేశములోని ఒక జీవనదిని దర్శించి అతని యంతఃకరణము ద్రవించినది. ఈ భావనను మీరు గౌరవింప గలిగినచో మీకును దేశభక్తి యున్నదందును. దేశభక్తి యనిన భోజనమా? దేశములోని యొక మహానదినిచూచి 'నా సంపత్తినెల్లను ఇందు ముంచివేయుదును. సమస్తమును ఆ తల్లి పాదముల కర్పింతును''అను భావన మనస్సునం దుదయించిన అదెంత గొప్ప దేశభక్తి! పసుపు, ఎరుపు, నీలపు రాళ్లు, (మరకత మాణిక్యములు) కీటకముల మలమునుండి తయారైన ముత్యములు, పగడములు – ఇవన్నియు నీట ముంచివేయదగిన విలువకలవియే. పరమేశ్వరుని చరణముల ముందట ఇవియన్నియు ధూళివంటివని, తుచ్ఛములని తెలిసి కొనుడు. నదికిని పరమేశ్వరునిచరణములకును సంబంధమేమి

యని మీరనవచ్చును. మీ దృష్టిలో సృష్టికిని పరమేశ్వరు నకును సంబంధమెక్కడనేని ఉన్నదా! నదియనగా మీకు ఆక్సిజన్ హైడ్రోజనుల సంపుటియే. సూర్యు డనగా నొక పెద్దరకపు గ్యాసుదీపము. ఆ సూర్యునికి నమస్కారమేమిటి? ఇక నమస్కారము చేయవలసివచ్చినచో ఒక్క రొట్టెకే! ఆ రొట్టెలో మాత్రమేమున్నది? చివర కదియు ఒకరకమైన తెల్లని మట్టియే. దానికొఱ కింతగా నోరూరుట యెందు లకు? అంత గొప్పగా ఉదయించు సూర్యునిలోను, అంద ముగ ప్రవహించు నదిలోను పరమేశ్వరానుభవము కలుగక పోయిన ఇంక కలుగున దెక్కడ? ఆంగ్లకవి వర్డ్సువర్తు "పూర్వము ఇంద్రధనుస్సును చూచినపుడు నా హృదయము ఆనందముతో నృత్యముచేయుచుండెడిది. కాని యీనాడు నే నట్లు నృత్యముచేయలేకపోవుచున్నానే! వెనుకటి జీవిత మాధుర్యమును కోల్పోయి, నేను ఱాయినయిపోలేదుకదా!" అని దుఃఖముతో అనును.

సారాంశమిది: సకామభక్తియందును – అందేకాదు – అమాయికుని భావనయందుసైతము చాలమహత్త్వమున్నది. దీని పరిణామముగ గొప్పసామర్థ్యము లభించును. ఎవడైనను, వా డెట్టివాడైనను, ఒక్కసారి ఈశ్వర మందిరములో కాలు పెట్టినచో మాన్యు డగును. అగ్ని హోత్రములో ఎటువంటి కట్టెనేసినను కాలిపోవును. భగవద్భక్తి ఒక అపూర్వసాధన. సకామభక్తికికూడ భగవంతుడు సంతోషించును. పోనుపోను ఆ భక్తి నిష్కామమై పూర్ణత్వమువైపునకు వెళ్లును.

35

నిష్కామభక్తియొక్క రూపములు; పూర్ణత్వము.

సకామభక్తుని విషయమై తెలిసికొంటిమి. ఇక నిష్కామభక్తుల విషయమై చూతము. వీరు రెండువిధముల నుందురు. – (౧) ఏకాంగి (౨) పూర్ణుడు. ఏకాంగిభక్తులలో మూడురకములవారుకలరు. అందు మొదటిరకమువాడు ఆర్త భక్తుడు. ఆర్తుడనగా దయకొఱకు అర్థించువాడు; నామదేవుని వలె భగవంతునికొఱకు విలపించుచు విలవిల కొట్టుకొనువాడు. అతడు భగవంతుని ప్రేమరసము నెప్పుడు క్రోలుదునా యని, ఎప్పు డతని నాలింగనముచేసికొని కృతార్థుడ నగుదునా యని, అతని పాదములపైబడి ఎప్పుడు ధన్యుడనగుదునా యని వ్యాకులతతో ఆతురతతో తహతహపడుచుండును. తాను చేయు ప్రతికార్యము హృదయపూర్వకముగను ప్రేమాన్వితముగను ఉన్నదా లేదా యని చూచుకొనుచుండును. ఇక రెండవరకమువారు జిజ్ఞాసువులు. ప్రకృతము మనదేశములో ఇట్టిభక్తు లంతగాలేరు. వీరిలో కొందరు మాటిమాటికిని గౌరీశంకర (ఎవరెస్టు) శిఖరము నెక్కుటకు ప్రయత్నించి చనిపోవుచుందురు. మరికొందరు ఉత్తరధ్రువమున నన్వేషించుచు పోయి తమ యనుభవములను కాగితముపైవ్రాసి, సీసాలో సీలుచేసి, నీటిలోవదలి మరణింతురు. మరికొందరు అగ్ని పర్వతములోనికి దిగుదురు. కాని ఇప్పటి భారతీయులకు మృత్యువనిన ఒక పెనుభూతము. వారికి కుటుంబపోషణను మించిన పురుషార్థమే లేదు. జిజ్ఞాసుభక్తునిలో ప్రబలమైన

జిజ్ఞాస యుండును. అతడు ప్రతివస్తువుయొక్క గుణధర్మము లను పరిశీలించుచుండును. మానవుడు నదీముఖముద్వారా సముద్రమును చేరునట్లే ఈ జిజ్ఞాసువుకూడ చివరకు పరమేశ్వరునియొద్దకు చేరును. మూడవరకముభక్తుడు అర్థార్థి. అర్థార్థియనగా ప్రతివస్తువుయొక్క అర్థమునుపరిశీలించువాడు. ఇక్కడ అర్థమనగా లోకకల్యాణమేకాని రూపాయలు, అణాలు, పైసలుకాదు. ఇత డే విషయమును పరిశీలించినను తన్మూలమున లోకకల్యాణము అగునా కాదా యనునదే అతనికి ఒరపిడిఱాయి. నా మాటలు, వ్రాతలు, చేతలు భగవత్ప్రీతికరము లగునా కావా యని చూచుచుండును. నిరుపయోగము, అహితము అయినపని అతనికి సమ్మతము కాదు. ప్రపంచక్షేమమునుగూర్చి తపించువాడు ఎంతో మహాత్ముడు కదా! జగత్కల్యాణమే అతని కానందము. సమస్త కార్యములను సేవాదృష్టితో చేయువాడు ఆర్తుడు. సమస్త క్రియలందును జ్ఞానదృష్టి కలిగియుండువాడు జిజ్ఞాసువు. లోకకల్యాణమే దృష్టియందుంచుకొనువాడు అర్థార్థి.

పై ముగ్గురును నిష్కామభక్తులే కాని వీరిది ఏకాంగి భక్తి. వీరిలో ఒకడు కర్మద్వారమునను, ఒకడు హృదయ ద్వారమునను, ఒకడు బుద్ధిద్వారమునను ఈశ్వరుని సమీపించును. ఇక పూర్ణభక్తునిగూర్చి తెలిసికోవలసియున్నది. ఇతనినే జ్ఞానిభక్తుడందుము. ఇతనికి కనబడునదంతయు పరమేశ్వరుని రూపమే. కురూపుడు, సురూపుడు, రాజు, భిక్షుకుడు, స్త్రీ, పురుషుడు, పశువు, పక్షి - అన్నింటను పరమాత్మయొక్క పావనదర్శనమే.

"నరనారీ బచ్చే సబ్‌హీ నారాయణ్
ఐసా మేరామన్ బనావో ప్రభు"

అని భక్తతుకారాము ప్రార్థన. హిందూధర్మములో నాగపూజ, గజముఖునిపూజ, వృక్షపూజ మొదలైనవి పిచ్చి పద్ధతులైనచో జ్ఞానిభక్తునిలో ఈ పిచ్చి పరాకాష్ఠను పొందిన ట్లగపడును. చీమ మొదలు సూర్యచంద్రులవరకు సర్వత్ర అతని కగపడినదెల్ల పరమాత్మ స్వరూపమే. అతని హృదయము ఆనందముతో పొంగి పొరలును.

ఫిర్ వహా సుఖ అనంత - అపార్ ।
ఆనందసే సాగర్ హిలోర్ తా॥

ఇట్టి దివ్య భవ్యదర్శనమును మీరు భ్రమయని అందురుగాక! ఈ భ్రమ సౌఖ్యరాశి, ఆనందనిధి. జ్ఞాని గంభీరసాగరములో పరమేశ్వరవిలాసమును, గోమూత్రలో ఈశ్వరవాత్సల్యమును దర్శించును. పృథ్విలో ఈశ్వరుని తేజము, నిరభ్రాకాశములో అతని నిర్మలత్వము, రవి చంద్ర తారలలో శుభప్రదమైన అతని తేజస్సు, పువ్వులలో అతని కోమలత్వము చూచును. మటియు దుర్జనులలో తన్ను పరీక్షించు పరమేశ్వరుని వీక్షించును. ఈ విధముగ ఒక పరమాత్మయే సర్వత్రవ్యాపించి క్రీడించుచున్నట్లు చూచు అభ్యాసము జ్ఞానిభక్తుడు చేయుచుండును. ఇట్లు చేయుచు చివర కతడు ఈశ్వరునిలో లీనమైపోవును.

గీతా ప్రవచనములు

ఎనిమిదవ అధ్యాయము

ప్రయాణసాధన : సాతత్య యోగము.

36

శుభసంస్కార సంచయము

సోదరులారా !

మానవ జీవితము అనేక సంస్కారములతో నిండి యుండును. అనేక కార్యములు మనవలన జరుగుచుండును. దినములో ఇరువదినాలుగుగంటలును మనముచేయు పనులను లెక్కింపబోయిన ఆ లెక్కకు అంతేయుండదు. తినుట, త్రాగుట, కూర్చుండుట, నడుచుట, తిరుగుట, పనులు చేయుట, న్రాయుట, మాటలాడుట, చదువుట – ఇవేకాక నానావిధ స్వప్నములు, రాగద్వేషములు, మానావమానములు, సుఖమఃఖములు మొదలైనవి అంతులేకుండ మనలో కనబడుచుండును. ఈ యన్నిటి సంస్కారములును మన మనస్సు నంటియుండును. కనుక జీవితమనగా నేమని నన్నెవ్వైన అడిగిన సంస్కార సంచయమే జీవితమని నేనందును.

సంస్కారములు మంచివి చెడ్డవి యని రెండువిధములు. ఈ రెంటియొక్క పరిణామమును మానవుని జీవితముమీద

కనబడుచునేయుండును. బాల్యమున జరిగిన విషయములు మనకు జ్ఞప్తిలోనే యుండవు. పలకమీది వ్రాత చెరిగిపోయి నట్లు బాల్యావస్థయంతయు మరపునబడును. పూర్వజన్మసంస్కారములు అసలు పూర్వజన్మ ఒకటున్నదాయని శంకించునంతగా తుడిచిపెట్టుకొనిపోవును. ఈ జన్మలోని బాల్యావస్థయే మఱపునబడినప్పుడు ఇక పూర్వజన్మసంగతి చెప్పటకెందులకు? పూర్వజన్మవిషయమటుంచి ఈ జన్మనుగూర్చి విచారింతము. మన కెన్నివిషయములు జ్ఞప్తిలోనున్నవో అన్నియే జరిగినవని చెప్పలేము. జరిగిన క్రియలు, వానిచే కలిగిన జ్ఞానానుభవములు అనేకములుగ నుండును. కాని ఈ క్రియలు, వాని యనుభవములు హరించిపోయి చివరకు కొన్ని సంస్కారములుమాత్రమే నిలిచియుండును. రాత్రి నిద్రపోవుముందు పగటిపనులు జ్ఞప్తికితెచ్చుకొనవలెనని అన్నియు జ్ఞప్తికిరావు. బహుస్పష్టమైనవి, లోపల గట్టిగ నాటుకొన్నవి మాత్రమే స్ఫురణకువచ్చును. ఎవరితోనైన మనకు జరిగిన పెద్ద ఘర్షణలు, జగడములు తప్పక జ్ఞప్తికి వచ్చును. ఎందులకనిన ఆనాటికి ముఖ్యముగ మనము సంపాదించుకొన్న దదేకనుక. ముఖ్యమైనవి, స్పష్టమైనవియైన అనుభవములు మనస్సులో చాల గాఢముగ నాటుకొనును. ముఖ్యమైనవి జ్ఞప్తిలోనుండి మిగిలినవన్నియు అస్పష్టములై పోవును. మనము దినచర్య వ్రాయబోయి చాలవరకు మరచి ముఖ్యమైన ఏ మూడు నాలుగు విషయములో వ్రాయగలుగుదుము. ఒక వారములో కలిగిన అనుభవములను ఒక రోజుననే కూర్చుండి వ్రాయవలెనని ఇంకను మరచిపోయి

అతిముఖ్యమైన ఏ యొకటిరెండో వానిలోనుండి వ్రాసి కొందుము. ఒక నెలలోని యనుభవములు ఒకసారియె వ్రాయు వలెనన్నిన ఆ నెలలోని ముఖ్యాతిముఖ్యమైన అనుభవములే గుర్తుండును. ఈ విధముగనే ఆరునెలలకు, సంవత్సరమునకు, అయిదుసంవత్సరములకు ఒకసారి వ్రాయవలసి వచ్చినచో మహత్త్వపూర్ణమైన ఏ కొద్ది ఘటనలో స్ఫురణకువచ్చును. అవియే మనకు సంస్కారములగును. అనేక క్రియలుచేసి అనంతమైన జ్ఞానానుభవములు పొందినపిమ్మటకూడ చివరకు మనస్సులో మిగిలియుండు సంస్కారములు ఎన్నో యుండవు. భిన్నభిన్నములైన కర్మలు భిన్నభిన్నములైన అనుభవములను కలిగించిపోవును. దృఢమైన యే అయిదారు సంస్కారములో మిగిలియుండును. ఈ సంస్కారములే మన మూలధనము. మనము జీవితమను వ్యాపారమును నడుపుచు సంస్కారములను సంపదనుమాత్రము కూడ బెట్టుదుము. వ్యాపారస్థుడు రోజు, నెల, సంవత్సరము – వీనిననుసరించిన జమాఖర్చులు వ్రాసి చివరకు లాభమో నష్టమో ఒక్క అంకెలో తేల్చినట్లే జీవితవ్యాపారమునుకూడ తేల్చుకొనవలె. అనేక సంస్కారముల జమపట్టీ పెరిగిపెరిగి చివరకు మిగులు సారము బహు స్వల్పము. జీవితముయొక్క తుదిగడియలో ఆ స్వల్పమునే ఆత్మ జ్ఞప్తికిదెచ్చుకొనును. జన్మపొడుగునను చేసిన పనులను స్ఫురణకు తెచ్చుకొన్నప్పుడు ముఖ్యమైన ఏ రెండుమూడు విషయములో మనకు కనబడును. ఇదే మనజీవితమున కెల్లను ఆదాయము. కాని తా నాచరించిన కర్మలు, పొందిన జ్ఞానానుభవములు అన్నియు వ్యర్థముగ పోయినవని

దీని యర్థము కాదు. వానిపని పూర్తియైపోయినది. వేల కొలది రూపాయలను వ్యాపారములోపెట్టగా చివరకు వర్తకునికి అయిదువేలు నష్టమో, పదివేలు లాభమో తేలును. నష్టమువచ్చిన గుండె జారిపోవును. లాభమువచ్చిన హృదయము ఆనందముతో నృత్యముచేయును.

మనజీవితవిషయముకూడ ఇంతే. మరణసమయమున జిహ్వేంద్రియవాసన కలిగినచో జీవితమంతయు రుచులు కుడుచు అభ్యాసములోనే కడచినట్లు రుజువగును. జిహ్వేంద్రియ వాసనయే అతనిజీవితమున కెల్ల సంపాదన. మరణ మాసన్నమైన తల్లికి చిడ్డలు జ్ఞప్తికివచ్చిన పుత్రసంబంధమగు సంస్కారమే ఆమెలో బలిష్ఠముగ నుండెనని తలంపవలెను. తా నాచరించిన అసంఖ్యాకములైన ఇతర కర్మలన్నియు గౌణమైయున్నట్లు రుజువగును. అంకగణిత భిన్నముల సూక్ష్మీకరణలో ఎంతెంత పెద్దసంఖ్యలైనను సంక్షిప్తపరచుచు పోగా చివరకు ఒకటియో లేక సున్నయో జవాబురావచ్చును. ఈ విధముగనే జీవితములో అనేక సంస్కారములు అంతరించి చివరకు బలమైన ఏయొక సంస్కారమో నిలిచియుండును. జీవితమను ప్రశ్న కది సమాధానమగును. అంత్య సమయమున స్మరణకువచ్చునదే జీవితమున కెల్లనుఫలము.

జీవితముయొక్క ఈ యంతిమ సారము, ఈ యంతిమ తుణము మధురమగునట్లు మనపనులన్నియు ఉండవలెను. తుదిగడియ మధురమైనచో జీవితమంతయు మధురమే. ఈ లక్ష్యమును దృష్టిలోపెట్టికొని జీవిత సమస్యలన్నియు పరిష్క-

రించుకొనవలెను. జీవిత కార్యక్రమమంతయు ఈ దృష్టితోనే నియమించుకొనుము. ప్రశ్నకు సమాధానము చెప్పనప్పుడు అడుగబడిన ప్రశ్ననే దృష్టిలోపెట్టుకొని సమాధానము చెప్పుదుము. ఈ రీతిగనే మనపనులన్నిటిని చేయవలసి యుండును. కనుక చనిపోవువేళ ఎట్టి సంస్కారము దృఢముగ నుండవలె నను కోరికయుండునో దాని కనుగుణముగ జీవితప్రవాహమును త్రిప్పుకొనవలెను. అహోరాత్రము దానివైపునకే దృష్టియుండవలెను.

37

మరణము స్ఫురణయందుండుగాక!

మరణసమయమున ప్రబలముగ మనస్సులోనుండు భావనయే రానున్నజన్మలో బలిష్ఠముగ పనిచేయునని ఈ యెనిమిదవ అధ్యాయములో సిద్ధాంతముచేయబడినది. ఈ సత్యమును దారిబత్తెముగతీసికొని జీవుడు భావియాత్రకు బయలుదేరును. నేటి యనుభవముల నాధారముచేసికొని నిద్రనుండి లేచినతరువాత శేషటి జీవితయాత్రను ప్రారంభింతుము. ఆ విధముగనే ఈ జన్మలో పొందిన అనుభవజ్ఞాన మను మూలధనముతో మరణ మను నిద్రతరువాత తిరిగి మన యాత్ర ప్రారంభమగును. ఈ జన్మయొక్క అంతమే రానున్న జన్మకు ప్రారంభము. కనుక నిరంతరమును మరణమును జ్ఞప్తియందుంచుకొని జీవితయాత్రను సాగింపుము.

మరణస్మృతివలన మరియొక లాభముకూడ కలదు. దీనివలన మృత్యుభయమును జయించి, మృత్యువును సహజముగ సమీపింపగల శక్తి మనకు కలుగును. ఏకనాథ మహారాజునుగూర్చిన కథయొకటున్నది. ఒకగృహస్థు డతనితో – "మహారాజా, మీ రెంత పుణ్యజీవితము. మీ జీవితములు అల్లేలలేవు? మీ కెప్పుడును ఎవరిమీదను కోపమురాదే! ఎవరితోడను వివాదములు, కలహములు లేవే! మీలో నెంత శాంతియు, ప్రేమయు, పవిత్రతయుగలవు!" అనిఅన్నాడు. ఏకనాథు డిట్లు జవాబుచెప్పెను – "ప్రకృతము నా విషయ మట్లుంచుము. నిన్నుగూర్చి నాకొకవిషయము తెలియును. ఇక ఏడుదినములలో నీకు చావు రానున్నది." ఏకనాథు నంతటివానిమాట అబద్ధమని యెవరనగలరు? ఏడుదినములలో మృత్యువా! అరే, ఒక్క గంటలేనా ఇక గడువు! అని అతడు శీఘ్రముగ ఇల్లుచేరుకొన్నాడు. ఏమియు తోచక అవసానకాలమునకు సంబంధించిన వ్యవహారములు చక్కబెట్టుకొనుచుండెను. జబ్బుచేసినది; మంచమెక్కినాడు. ఆరుదినములు గడచినవి. ఏడవదినమున ఏకనాథు డతని యొద్దకువచ్చెను. రోగి యతనికి నమస్కారముచేసెను. ఎట్లున్నాడవని ఏకనాథు డడిగెను. "ఇకపోవుచున్నాను" అని అన్నాడతడు. "ఈ యారుదినములలో నెంతపాపము చేసితివి? చెడుతలంపు లెంతగా మనసులోనికి వచ్చినవి?" అని యేకనాథుడు ప్రశ్నించెను. ఆసన్నమరణు డిట్లనెను – "స్వామీ, పాపపుతలంపులు కలుగుటకు సమయమేలేదు. తెంపులేకుండ మృత్యువే నా యెదుట నిలిచియున్నది."

అప్పు డేకనాథు డిట్లనెను- "నా జీవితము పాపరహితముగా ఎందులకున్నదో ఇప్పుడు తెలిసినదా ? మరణ మను పులి యెల్లపుడును ఎదుట నిలిచియుండగా పాపమెట్లు స్ఫురించును? పాపము చేయుటకైనను నిశ్చింతముగ నుండవలె. మరణ మునుగూర్చిన నిరంతరస్మృతి పాపవిముక్తికి తరణోపాయము. మృత్యువు ఎట్టయెదుట కనబడుచుండగా మానవుడు దేని బలము చూచుకొని పాపము చేయును?"

కాని మానవుడు మరణము తలంపునకు రాకుండ తప్పించుకొని తిరుగును. ప్లాస్కల్ అను ఫ్రెంచి దార్శనికుడు కలడు. "ప్లాపే"అని యతడు వ్రాసిన గ్రంథమొకటియున్నది. 'భావనలు' అని దాని యర్థము. వివిధ విషయములమీద స్ఫుటమైన భావములను అత డీ గ్రంథములో వ్యక్తపరచెను. అందొకచోట నిట్లనును – "మృత్యు వెల్లపుడును మనలను వెన్నంటియేయుండును. కాని దాని నెట్లు మరచి బ్రతుకుదునా యని మానవుని నిరంతర ప్రయత్నము. మృత్యువును జ్ఞప్తియందుంచుకొని బ్రతుకవలెనను ఆలోచనమాత్రము చేయడు." మానవుడు మృత్యుశబ్దమునుకూడ వినసహింపడు. భోజనసమయమున నెవరైన మృత్యువుపేరెత్తిన "ఎట్టి అశుభవాక్కు అనుచున్నావు!" అని యనును. కాని ఎంత అశుభమనుకొన్నను మనము వేయు ప్రతి – అడుగును మృత్యువు వైపునకే పడుచున్నది. బొంబాయికి టిక్కెట్టుకొని రైలెక్కిన తరువాత నీవు కూర్చుండియే యున్నను బండి నిన్ను తీసికొని వెళ్ళి బొంబాయిలో పడవేయును. మునుము పుట్టుకతోనే

మృత్యువునకు టికెట్టుతీసుకొన్నారము. మీరు కూర్చున్నను, పరుగెత్తినను, ఏ స్థితిలోనున్నను మృత్యువు వచ్చితీరును. మృత్యువును తలచినను తలపకపోయినను అది రాక మానదు. మరేది నిశ్చయము కాకపోయినను మరణము మాత్రము నిశ్చయము. సూర్యుడస్తమించినపుడెల్ల మన ఆయువులో ఒక అంశమును తీసికొనిపోవుచున్నాడు. ఈ విధముగ ఆయుఃప్రమాణము అతిగిపోవును. గోటితో గిల్లివేసినట్లు కొంచెము కొంచెముగ తతిగిపోవును, అయినను మానవుడీ విషయమే తలంపడు. ''ఇది పరమాశ్చర్యకరము!'' అని జ్ఞానేశ్వరుడనును. మానవుడీ విషయమున ఇంత నిర్లక్ష్యముగ ఎట్లుండగలుగుచున్నాడని జ్ఞానదేవునికి ఆశ్చర్యము. మరణము యొక్క తలంపునుగూడ సహింపలేనంతగా మానవునికి మృత్యుభయముండును. ఈ తలంపునుండి తప్పించుకొనవలెనని కోరుచు కనులకు గంతలుకట్టుకొని కూర్చుండును. యుద్ధమునకుపోవు సైనికుడు మరణముమాట మరచిపోవుటకు గాను ఆటలు, పాటలు, నృత్యములు సాగించును, సిగరెట్లు త్రాగును. పాస్కలు ఇట్లన్నాడు – ''ప్రత్యక్షముగ సర్వత్ర మృత్యుదర్శనమగుచున్నను ఈ *'టామీ' దానిని మరచి బ్రతుకుటకు తినుచు, త్రాగుచు ఆటపాటలలో నిమగ్నుడై యుండును''.

మన మందరమును ఈ 'టామీ' వలెనే యున్నారము. ముఖమును తీర్చిదిద్దుకొని చిరునవ్వు నటించుట, ముఖము

*పాశ్చాత్య సైనికుడు.

వాడియున్నచో మెరుగులు, పొడర్లు పట్టించుట, వెండ్రుకలు తెల్లబడినచో నల్లరంగు పూయుట—ఈ మొదలైన ప్రయత్నములు మానవుడు చేయుచుండును. మృత్యువు వచ్చి గుండెలమీద నృత్యము చేయుచున్నను, మన మా 'టామీ'ల వలె దానిని మరచుటకే అత్యంప్రయత్నము చేసెదము. "ఇంకేమైనను చెప్పుడు, మృత్యువుమాట మాత్రము చెప్పవల"దందుము. మెట్రిక్ ప్యాసైన కుఱ్ఱవానిని "తరువాతనేమి చేయవలెనని నీ యుద్దేశము?" అని యడిగిన "ఈ ప్రశ్నఇప్పుడే వేయకుడు. ప్రకృతము 'ఇంటర్' మొదటిసంవత్సరము జరుగుచున్నది" అనును. మరుసటి సంవత్సరము మరల అడిగినచో "సరే, ఇంటరు కానిండు, తరువాత చూతము" అని యనును. ఈ రీతిని విషయము నడుచును. తరువాత రానున్న స్థితినిగూర్చి ముందే ఆలోచింపవలదా? ముందడుగునుగూర్చి మొదటనే ఆలోచించుకొనవలె. లేకున్నచో ఏ గోతిలోనో పడవచ్చును. కాని విద్యార్థి ఈ యాలోచనను త్రోసిపుచ్చును. పాప మతడుపొందగల శిక్షణలయొక్క ఆవలియొడ్డు వానికి కనబడక అంధకారమయముగ నుండును. కనుక ముందేమి చేయవలయునను ప్రశ్ననే ఎదుటికి రానీయడు. అయినను భవిష్యత్తు త్రోసివేయదగినది కాదు. అది మన తలకెక్కి స్వారిచేసితీరును.

కాలేజీలో అధ్యాపకుడు తర్కశాస్త్రముబోధించును—"మానవుడు మర్త్యుడు; సోక్రటీసు మానవుడు; కావున సోక్రటీసు మృతినొందును" అను అనుమానప్రమాణము

నతడు బోధించును. ఇందులకు సోక్రటీసును ఉదాహరణగ తీసికొనును. తన్నే యుదాహరణముగ నేల తీసికొనడు ? అధ్యాపకుడుకూడ మర్త్యుడేకదా ! "అందరు మనుష్యులును మర్త్యులు. కనుక అధ్యాపకుడనైన నేనును, శిష్యులైన మీరును, మర్త్యులమే" అని మాత్రము చెప్పడు. ఆ మరణమును సోక్రటీసుమీదికే త్రోసివేయును. ఎందులకనిన సోక్రటీసెప్పుడో చనిపోయి తగవాడుట కిప్పుడు మనయెదుట లేడుకాబట్టి. గురుశిష్యులిద్దరును మరణమును సోక్రటీసు మీదికిత్రోసి "నీవును మాటాడకుము! నేనును మాటాడను!" అన్నట్లుందురు. తమవఱకు తాము సురక్షితులన్నట్లు తీర్చుందురు.

ఈ విధముగ ఎరిగియుండియే మృత్యువును మరచి బ్రతుకు ప్రయత్నము ఎల్లపుడును జరుగుచుండును. కాని యీమాత్రమున ఎక్కడనైనను మృత్యువు తొలగిపోవునా? తల్లి మృతి జెందినపుడు బిడ్డకు మృత్యువు స్పష్టముగా గోచరించునుగదా! కాని మానవుడు నిర్భీతితో మృత్యువును జ్ఞప్తి యందుంచుకొని దానిని స్వీకరింప సిద్ధపడి జీవితమును సాగించుటకు సాహసముచేయడు. పెద్దపులి యొక లేడిని తరుముచున్న తనుకొనుము. వేగముగల ఆ లేడి కూడపరుగెత్తి అలసిపోవును. పులిరూపమున మృత్యువు వెన్నంటి వచ్చుచునేయున్నది. ఆసమయమున లేడిస్థితి యెట్లుండును ? అది యా పులివైపు చూచుటకైనను వెఱచును. కొమ్ములు, ముఖముమట్టిలోదూర్చి నిలబడిపోవును; నిరాధారమై "ఇదిగో రమ్మ! నన్నుబ్రింగి

వేయుము'' అని నిస్పృహతో అన్నట్లుండును. మనము మృత్యువును ముఖాముఖిని చూడజాలము. దానిని తప్పించుకొని బ్రతుకుటకు వేలకొలది యుపాయములను పన్నుచుందుము. అయినను చివరకది మనగొంతు పిసికితీగును.

మరణ మాసన్నమైనపుడు మనుష్యుడు తన జీవితపు నిలువను లెక్కచూచుకొనును. మందబుద్ధియైన సోమరి విద్యార్థి పరీక్షకువచ్చి సిరాబుడ్డిలో కలము ముంచుచు పైకి తీయుచు తెల్లకాగితమును నల్లబఱుచు ధైర్యములేకుండ కూర్చుండును. ''ఓ సోదరా! ఏ కొంచెమయినను వ్రాయుదువా? వ్రాయవా? సరస్వతివచ్చి వ్రాసిపెట్టునా? మూడు గంటలకాలమును ముగిసిపోవుచున్నది''. అనిన చివరకు వాడు వట్టి తెల్లకాగితమో లేక యే నాలుగక్షరములు గీకిన కాగితమో ఇచ్చిపోవును. ప్రశ్న నన్యాయము చేసికొని సమాధానము వ్రాయవలెనని తోచక వాడు ఇటునటు చూచును. మన స్థితికూడ నిట్టిదే. కాన జీవితము మృత్యువుదెసకు నడుచుచున్నదనుసంగతి లక్ష్యమునం దుంచుకొని, అంతిమఘట్టము పుణ్యమయము, అత్యంత పవిత్రము, మధురము కావలెనను ఆత్రముతో బ్రతికినన్నాళ్లు సాధన చేయవలె. అత్యుత్తమములైన సంస్కారములెట్లు కలుగునను విచారణ మన మిప్పటినుండియే చేయవలె. కాని మంచిసంస్కారములను అలవరచుకొనవలెనను చింతన యెవరికున్నది? అది లేకపోగా అహోరాత్రము కుసంస్కారముల అలవాటుమాత్రము జరుగుచుండును. జిహ్వకు, కంటికి, చెవికి మనము చపలత్వము

నేర్పుచున్నాము. దీనికి విరుద్ధమైన అభ్యాసమునందు చిత్తము లగ్నము చేయవలెను. మంచివిషయములవైపునకు మనసును మరల్పవలెను. వానియందది మునిగితేలవలెను. నీ దోషమును నీవు గుర్తించిన యంతనే దానిని దిద్దుకొన సమకట్టవలెను. తప్పును గుర్తించిన తరువాతకూడ తిరిగి అదే చేయుటయా? తప్పును తెలిసికొన్నవెంటనే మనకు పునర్జన్మ కలిగినట్లు. అది మన జీవితమునకు నూతన బాల్యావస్థ, నూతన ప్రభాతము అని నమ్ముము. ఇది నీకు నిజమైన మేలుకొల్పు. ఇక లేలుం బగళ్లు ఆత్మనిరీక్షణ చేసికొనుచు జాగరూకుడవగుము. ఇట్లు చేయవేని మరల జారిపోదువు. చెడ్డయలవాటులు మరల ప్రారంభింతువు.

చాలయేండ్లకుమున్ను నేనొకసారి మా నాయనమ్మను చూడబోయితిని. ఆమె చాల ముదుసలి. ఆమె నాతో "విన్యా, నాకిప్పుడు ధారణాశక్తి తగ్గుచున్నది. నేతిగిన్నె కొఱకుపోయి దానివిషయమే మరచి తిరిగివత్తును" అని యన్నది. ఈ మాట యనుచునే నగలకు సంబంధించిన పాతికేండ్లనాటి విషయమొక్కటిచెప్పినది. అయిదునిమిషములకు పూర్వము జరిగినది జ్ఞప్తిలోలేదు. కాని పాతికేండ్లనాటి బలిష్ఠ సంస్కార మింతవరకును చెక్కుచెదరకుండ నిలిచి యున్నది. దీనికి కారణమేమి? ఆ నగలమాట ఆమె నేటి వరకును ప్రతివానితోను, ఎల్లపుడును చెప్పుచుండును. అందు వలన నా సంస్కారము ఆమె జీవితమున కంటుకొనిపోయి, ఆమె దానితో ఏకరూపమయ్యెను. "మరణసమయమున

మా ముసలమ్మ కీ నగలసంగతి జ్ఞప్తికిరాకుండిన బాగుగా నుండు నో దేవా!"అని నాలో నే ననుకొంటిని.

38

మరణస్మరణ మనలను సదా అంటియుండునుగాక!

అహర్నిశము మన కలవాటైన విషయము మనల నంటియుండకేమగును? అజామిళుని కథ చదివి మనము భ్రమలోపడరాదు. బాహిరముగా చూచినచో అతడు పాపి. కాని యతని జీవితాంతరాళమున పుణ్యధార ప్రవహించు చుండెడిది. ఆ పుణ్యము అంతిమక్షణములో మేల్కొన్నది. కాని ఎల్లప్పుడును పాపముచేయుచు చివరగడియలో రామ నామము మనకు హఠాత్తుగ జ్ఞప్తికివచ్చునను భ్రమలో పడి యుండవలదు. బాల్యమునుండి ఏకాగ్రతతో మంచి సంస్కారములను అలవరచుకొనుము. నిరంతరమును ఇట్టి సంస్కారములనే సేకరింపవలెనను చింతలో నుండుము. దీనివలన నేమగునని, దానివలన నేమగునని యనకుము. నాలుగు గంటలకే ఎందులకు నిద్రలేవవలె? ఏడుగంటలకు లేచిన నష్టమేమి? ఇట్లనుటవలన ప్రయోజనములేదు. మనస్సునకు నిరంతరమును ఇట్టి స్వేచ్ఛనిచ్చుచు పోయినచో చివరకు వలలో చిక్కుకొందువు. ఇక నీకు మంచి సంస్కారములు కలుగనేరవు. ఒక్కొక్కపైస ప్రోగుచేసికొనుచు లక్ష్మిని కూడబెట్టవలె. ఇట్లే ఒక్కక్షణమైనను వ్యర్థముగ పోనీయక

విద్యోపార్జనకు పూనుకొనవలె. అనుక్షణమును కలుగు సంస్కారములు మంచి వైనా కావా యని పరిశీలించు కొనుము. కూడనిమాట ఒక్కటిపలికినను కుసంస్కారము వచ్చిపడినదన్నమాటే. మనముచేయు ప్రతిపనియు ఉలియై మన జీవితమను శిలకు ఆకృతిని దిద్దును. పగలు చక్కగా గడచిపోయినను రాత్రి స్వప్నములో చెడ్డ తలంపులు రావచ్చును. అయిదారు దినములలోపలిభావనలే స్వప్నము లోనికి వచ్చునని చెప్పలేము. అజాగ్రత్తవలన చెడ్డ సంస్కారములు అపరిమితముగ వచ్చిపడును. అవి యేవేళపైకివచ్చునో చెప్పలేము. అందువలన స్వల్పాతి స్వల్పవిషయములలో కూడ మెలకువతో సంచరింపవలెను. నీటమునిగిపోవువానికి కట్టె పుల్లకూడ ఆధారమగును. మనము సంసారసాగరములో మునిగియున్నాము. మనము ఏకొంచెము మంచిగ మాట్లాడినను అదే జీవితమున కాధారముకావచ్చును. చేసినమేలు వ్యర్థముగపోదు. అది నిన్ను తరింపజేయును. లేశమాత్రము కూడ చెడ్డసంస్కారము కలుగనీయకుము. కనులు పవిత్రములైయుండునట్లు, చెవులు నిందావాక్యములను వినకుండునట్లు, నోరు మంచిమాటలనే పలుకునట్లు సదా ప్రయత్నింపుము. ఇట్టి జాగరూకతతో నుంటివా చివరకు విజయము కలిగితీరును. జీవనమరణములు రెంటికిని అధికారివగుదువు.

పవిత్రసంస్కారములు కలుగవలెనన్నిన మనసులో ఉత్కృష్టభావనా సంచలనము తీవ్రముగా జరుగుచుండవలెను. చేతులు పవిత్రకర్మలయందు నియుక్తములు కావలెను.

లోపల ఈశ్వరస్మరణ, బయట స్వధర్మాచరణ; చేతిలో సేవాకర్మ మనసునందు వికర్మ - ఇది నిత్యకార్యక్రమము కావలెను. గాంధిగారిని చూడుడు, అనుదినమును వారు రాట్నమును త్రిప్పుచునేయుందురు. సూత్రయజ్ఞమును నిత్యమును జరుపవలెనని నొక్కి చెప్పుచుందురు. ప్రతిదినమును ఎందులకు వడుకవలె ? బట్టలకొఱకైనచో అప్పుడప్పుడు వడుకుట చాలదా ? కాని ఇది వ్యవహారదృష్టి. నిత్యమును వడుకుటలో అధ్యాత్మికమైన విలువ యున్నది. దేశముకొఱకేదో కొంతసేవ చేయవలసియున్నాడ నను చింతనకు నిత్యసూత్రయజ్ఞము చిహ్నము. ఈ దారము మనలను నిత్యమును దరిద్రనారాయణునితో కలుపుచు ఆ సంస్కారమును దృఢతరము చేయును.

వైద్యుడు ప్రతిదినమును త్రాగుమని చెప్పి మందీయగా మందంతయు ఒకరోజుననే త్రాగిన నేమగును? ఇట్లు చేయుట విచిత్రముగ నుండును. ఔషధముయొక్క ఉద్దేశమే సఫలము కాకుండబోవును. మందుయొక్క ప్రభావము ఆ రోజున కా రోజు శరీరముమీదపడి ప్రకృతికి ఆపాదిల్లిన వికృతిని తొలగించవలె. జీవిత విషయముకూడ నంతే. శివునికి మెల్ల మెల్లగ నభిషేకము చేయవలె. ఇది నాకు ప్రియమైన దృష్టాంతము. నా బాల్యములో అనుదినమును నే నీ యభిషేకమును చూచుచుండువాడను. ఇరువదినాలుగు గంటల అభిషేక జలమంతయు కలిసి రెండు బొక్కెనలగునేమో ! అయినప్పుడు రెండుబొక్కెనలనీరును ఒకసారియే శివునిమీద

ఏల క్రుమ్మరించరాదు? దీనికి సమాధానము బాల్యములోనే నాకు లభించెను. నీరంతయు నొక్కసారి క్రుమ్మరించుటవలన ఆ పని సఫలముకానేరదు. బొట్టు వెంటబొట్టుపడుటయేఉపాసన. ఒకరకమైన సంస్కారధార నిరంతరముగా పడుచుండవలెను. ఉదయపుసంస్కారమే మధ్యాహ్నమున, అదే సాయంకాలమున, అదే సగటిపూట, అదే రాత్రియందు, అదే నిన్న, అదే నేడు, ఈ నాడేదో రేపును అదే, ఈ యేడేదో రాబోవు నేడును అదే, ఈ జన్మమం దేదో రానున్న జన్మమందునుఅదే. జీవితము పొడుగునను ఏదో అంత్యసమయమునందును అదే – ఈ విధముగ సత్సంస్కారముల దివ్యధారలు జీవితముపొడుగునను ప్రవహించుచుండవలెను. ఇట్టియఖండ ప్రవాహము నడచుచున్ననే చివరకు మనము విజయము నొందగలము. అప్పుడే మనము గమ్యమునకుచేరి జెండాను ప్రతిష్ఠింపగలము. సంస్కారముల ప్రవాహము ఒకదిశలోనే పారుచుండవలెను. పర్వతముపై కురిసిన వర్షము అన్నిదిశలకును ప్రవహించినచో దానివలన నది యేర్పడదు. అట్లుగాక నీరంతయు ఒకదిశకే ప్రవహించినచో అది ముందు సెలయేరుగా, సెలయేరుధారగా, ధార ప్రవాహముగా, ప్రవాహము నదిగా, నది మహానదిగా విస్తరిల్లుచు వెళ్లి వెళ్లి సముద్రమును చేరును. ఒకదిశలోనే ప్రవహించిన నీరు వెళ్ళి సముద్రమున కలియును. కాని నలువైపులకును ప్రవహించు నీరు ఏకొంతదూరమో పోయి యింకిపోవును. సంస్కారముల విషయముకూడ ఇంతే. సంస్కారములు ఇటువచ్చుచు అటుపోవుచున్నచో ప్రయోజనమేమి? సంస్కారముల పవిత్రవాహిని జీవితములో నిరంతరమును

ప్రవహించుచున్నచో చివరకు మరణము మహానందమునకు నిలయమనిపించును. పర్వతయాత్రికుడు దారిలో ఎక్కువగ మజిలీలు చేయడు; దారిలో కలుగు మోహ, ప్రలోభములను జయించును. కాలు నిలద్రొక్కుకొని, శ్రమకోర్చి ఆరోహణచేయుచు పోయిపోయి శిఖరము చేరును. అక్కడ మూపుమీది బరువును, రొమ్ములకు కట్టుకొన్న త్రాళ్లను తొలగించుకొని ఆరుబయటిగాలిని హాయిగా అనుభవించును. వాని యానందమును ఇతరు లూహించగలరా? కాని దారిలోనే ఆగిపోవు యాత్రికునికొఱకు సూర్యుడు ఆగునా?

39

సర్వదా యుద్ధప్రసంగము

సారాంశమిది : బయటినుండి నిరంతర స్వధర్మాచరణ అనగా కర్మ, లోపలనుండి హరిస్మరణతోకూడిన చిత్తశుద్ధి అనగా వికర్మ - ఈ రెంటిప్రవాహము నడుచుచున్నప్పుడు మరణము ఆనందదాయక మగును. యిందుచేతనే భగవంతుడు

"తస్మాత్ సర్వేషుకాలేషు మామనుస్మర యుధ్యచ"

"నన్ను సదా స్మరించుచుండుము - యుద్ధము చేయుము" అనును. "అంటలోనేమునిగి తేలుచుండుము" సదా యీశ్వరునిలోలీనమైయుండుము. బహిరంతరములు ఈశ్వరప్రేమతో నిండి, ఆప్రేమ జీవితమంతెల్ల వ్యాపించినప్పుడే మనుష్యుడు

పవిత్ర కార్యాచరణయందు నిత్యానందమును పొందుచుండును. అప్పుడు చెడువృత్తులు మనయెడుటికి వచ్చి నిలువ లేవు. మనస్సునందు సుందరములైన మనోరథములు అంకురించును. ఉత్తమ కార్యములు అప్రయత్నముగా జరుగును.

ఈశ్వరస్మరణమువలన సత్కర్మలు సహజరీతిని జరుగుచుండుట సత్యము. కాని "నిరంతరమును పోరాటముజరుపు" మనునదికూడ భగవంతుని యాజ్ఞయే. తుకారాము మహారాజు

"దిన్ రాత్ హమే యుద్ధకీ హీ ధున్ ।
అంతర్బాహ్య జగ్ బొర్‌మన్॥" అని యనును.

లోపలను వెలుపలను అనంతసృష్టి వ్యాపించియున్నది. ఈ సృష్టితో మనస్సు నిరంతరమును పోరాటము సలుపుచుండును. ఈ పోరాటమున అన్నివేళల జయమే కలుగునని చెప్పలేము. ఎవడు గమ్యమును చేరునో వాడే నిజమైన విజేత. చివరితీర్పే సరియైనది. యశోపయశములు అనేక పర్యాయములు ప్రాప్తించుచుండును. అపయశము, విఫలత కలిగినప్పుడు నిరాశపొంద బనిలేదు. రాతిమీద పందొమ్మిది సుత్తిదెబ్బలు కొట్టినను అది పగులక, ఇరువదవదెబ్బకుపగిలినచో ఆపందొమ్మిదిదెబ్బలును నిరర్థకమైనట్లా? కాను. చివరిదెబ్బయొక్క సఫలతకు వెనుకటిదెబ్బలన్నియు తోడ్పడినవి.

నిరాశచెందుట యనగా నాస్తికుడగుటయే. పరమేశ్వరుడు మన రక్షకుడని నమ్ముము. బీడ్డలో ధైర్యమును పెంచుటకు తల్లి వానిని ఇటునటు తిరుగనిచ్చును. కాని వానిని క్రిందపడనీయదు. పడబోయినవెంటనే వచ్చి వానిని

మెల్లగా లేవదీయును. ఈశ్వరుడుకూడ నిరంతరమును నీమీద దృష్టిపెట్టుకొనియుండును. నీ జీవిత మను గాలిపడ గకు కట్టిన దారము వానిచేతిలోనున్నది. ఒకసారి అతడా దారమును లాగిపట్టును; ఒకప్పుడు సడలించును. దారము మాత్రము అతనిచేతిలోనే యున్న దనువిశ్వాస ముంచు కొనుము. గంగాఘట్టములో ఈతనేర్పుదురు. గట్టుననున్న చెట్టునకు గొలుసో త్రాడో కట్టబడియుండును. త్రాటియొక్క రెండవకొన ఈదువాని నడుమునకు కట్టి వానిని నీటిలో పడవేయుదురు. గురువు నీటిలోనే యుండును. నేర్చుకొను వాడు క్రొత్తపనియగుటచేత మొదట మూడునాలుగుసారులు మునుగుటయు తేలుటయు జరిగినను చివర కాకళను నేర్చు కొనును. ఈ విధముగనే పరమేశ్వరుడు మనకు జీవితకళను నేర్పుచున్నాడు.

40

భక్త కృష్ణ గతి

పరమేశ్వరునిమీద శ్రద్ధయుంచి మనోవాక్కర్మల ద్వారా లేలుంబగళ్లు పోరాటము సల్పుచున్నచో అంత్య సమయము మహోత్తమముగ పరిణమించును. అప్పుడు దేవతలందరును అనుకూలురగుదురు. ఈ విషయమే ఈ యధ్యాయముచివర ఒక రూపకాలంకారముద్వారా నిరూపింపబడినది. ఈ రూపకమును మీరు అవగాహనచేసి కొనుడు. ఎవని మరణసమయమున అగ్నిమండుచుండునో,

సూర్యుడు ప్రకాశించుచుండునో, శుక్లపక్ష చంద్రుడు వృద్ధిలో నుండునో, ఉత్తరాయణమువచ్చి ఆకాశమంతయు మేఘ రహితమై సుందరముగనుండునో అట్టివాడు బ్రహ్మయందు విలీనుడగును. ఎవని మృతిసమయమున పొగ వ్యాపించి యుండునో, బహిరంతరములు అంధకారమయము లై యుండునో, కృష్ణపక్ష చంద్రుడు క్షీణించుచుండునో, దక్షిణా యనమువచ్చి ఆకాశమంతయు నల్లని మేఘములతో కప్పబడి యుండునో అట్టివాడు తిరిగి జననమరణ చక్రములోపడును.

చాలమంది ఈ రూపకమునుచూచి తబ్బిబ్బగుదురు. పుణ్యమరణము కావలెనన్నచో అగ్ని, సూర్య, చంద్రాది దేవతల, ఆకాశాది భూతములకృప యుండవలెను. అగ్ని, కర్మకును యజ్ఞమునకును చిహ్నము. అంత్యసమయములో కూడ యజ్ఞజ్వాల మండుచుండవలె. న్యాయమూర్తి రానడే గారు ఇట్లనువారు:- "కర్తవ్యకర్మను నిరంతరమును పాలించుచు మరణించినవాని జన్మము ధన్యము. ఏదోయొక సద్గ్రంథమును పఠించుచునో, వ్రాయుచునో, ఒక సత్కార్యమును చేయుచునో నేను మరణించితినా ధన్యుడనే." అగ్ని మండుచున్నదనిన అర్థమిది. మరణసమయమునకూడ కర్మనాచరించుచుండుట అగ్నియొక్క కృప. సూర్యుని కృప యనగా బుద్ధియొక్క ప్రభ చివరవరకును ప్రకాశించుట. చంద్రునికృప యనగా అంత్యసమయములో పవిత్రభావనలు వృద్ధిచెందుట. చంద్రుడు మనస్సుయొక్క – భావనయొక్క అధిదేవత. శుక్లపక్ష చంద్రునివలె మనస్సులో ప్రేమ, భక్తి, ఉత్సాహము, పరోపకారము, దయ – ఇత్యాది శుద్ధభావనలు

పూర్ణవికాసమును పొందవలెను. ఆకాశముయొక్క కృపయనగా హృదయాకాశములో ఆసక్తియను మేఘపు సంచారము ఏమాత్రమును ఉండరాదని అభిప్రాయము. ఒకసారి గాంధిగారిట్లన్నారు – "నే నహర్నిశము చరఖా, చరఖా యని ఎలుగెత్తి కేకపెట్టుచున్నాను. చరఖాను నే నతిపవిత్ర వస్తువుగ భావింతును. కాని అంత్యసమయమున నాలో దాని వాసన యే మాత్రమును ఉండరాదు. నన్ను చరఖాదెసకు ప్రేరేపించిన భగవంతుడే దాని భవిష్యత్తునుగూర్చి ఆలోచించుటకు సర్వవిధముల సమర్థుడు. యోగ్యులైన యితరులు ఇప్పుడు రాట్నమును చేపట్టినారు. చరఖానుగూర్చిన ఆలోచనను వదలి నేను పరమాత్మునియందు లీనమగుటకు సిద్ధము కావలె." పైదానిసారాంశ మిది: ఉత్తరాయణమనగా ఆసక్తియను మేఘములు హృదయాకాశమును ఆవరింపకుండుటయే!

చేతిలో నేదోయొక సేవాకార్యము జరుగుచుండగా, భావన యను పూర్ణిమ ప్రకాశించుచుండగా, హృదయాకాశము బొత్తిగా ఆసక్తిలేనిదైయుండగా, బుద్ధి తేజస్వంతమయి యుండగా మరణించినవాడు పరమాత్మలో లీనమగును. ఇట్టి పరమమంగళమయమగు అంత్యదశను చేరుటకు నిరంతరమును జాగరూకతతోను, దక్షతతోను, పోరాటము సలుపుచుండవలెను. ఒక్కక్షణమైనను అశుభసంస్కారములకు మనస్సులో తావీయకుడు. ఇట్టి బలము చేకూరుటకు ఈశ్వరుని సంతతముగా ప్రార్థించుచుండవలెను. నామస్మరణము, తత్త్వస్మరణము మరలమరల చేయుచుండవలెను.

గీతా ప్రవచనములు

తొమ్మిదవ అధ్యాయము

మానవసేవారూపమైన రాజవిద్య : ఆత్మసమర్పణయోగము

41

ప్రత్యక్షానుభవసిద్ధమైన విద్య

సోదరులారా !

ఈ రోజున నాగొంతు నొప్పిగానున్నది. నా మాటలు మీకందరకు వినబడునో వినబడవో అని నా సందేహము. సాధుచరితుడు పెదమాధవరావుపేష్వాయొక్క అంత్యదశ ఈ సమయమున నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆ మహాపురుషుడు మరణశయ్యపై పడియుండెను. కఫము చాల అధికమయ్యెను. విరేచనములకు మందిచ్చి కఫమును తగ్గించవచ్చును. అందువలన మాధవరావు వైద్యునితో నిట్లనెను : "విరేచనములకు మందుపెట్టి కఫమును పోగొట్టు ఉపాయము చూడుడు. ఇందువలన గొంతు తెఱపినిబడి నేను రామనామ స్మరణము చేసికోగలుగుదును." అట్లే ఈ రోజున నేనుగూడ పరమేశ్వరుని ప్రార్థించితిని. "మాటలాడగలిగినట్లే మాటలాడు"మని భగవంతుడన్నాడు. నేనిక్కడ గీతనుగూర్చి మాటాడుట ఒకరికుపదేశముచేయుటకుకాదు. కాని

లాభము పొందగోరువారికి దాని వలన తప్పక లాభము కలుగును. అయినను నేను మాత్రము దీనిని నామజపముగ భావించి చెప్పుచున్నాను. గీతనుగూర్చి మాటాడుచున్నప్పుడు హరినామస్మరణ చేయుచున్నాననియే నా భావన.

నే నిప్పుడు చెప్పుచున్న మాటలకును ఈ తొమ్మిదవ అధ్యాయమునకును సంబంధమున్నది. ఈ యధ్యాయము హరినామముయొక్క అపూర్వమహిమనుగూర్చి చెప్పుచున్నది. ఇది గీతయొక్క మధ్యభాగములో నున్నది. మహాభారతమునకు మధ్యలో గీత; గీతకు మధ్యభాగమున ఈ తొమ్మిదవ అధ్యాయము. అనేక కారణములవలన ఈ యధ్యాయమునకు పవిత్రత వచ్చినది. జ్ఞానదేవుడు అంతిమసమాధిలోనికి వెళ్లినపుడు ఈ యధ్యాయమును జపించుచు ప్రాణమును వదలెనని యందురు. ఈ యధ్యాయమును స్మరించిన మాత్రమున నా హృదయము పొంగి కన్నీరు జలజలరాలును. ఈ యధ్యాయమును వ్రాసి వ్యాసదేవు డెంత ఉపకారము చేసినాడు! కేవలము భారతవర్షమునకేకాదు, సమస్త మానవజాతికిని చేసిన యుపకారమిది. భగవంతు డర్జునునకిచ్చిన ఈ యపూర్వసందేశము మాటలతో ప్రకటింప దగినదికాదు. కాని వ్యాసర్షిదయగలవాడగుటవలన ఈ విషయమును సంస్కృతభాషద్వారా ప్రకటించెను. గుహ్యవిషయమున కతడు వాగ్రూపము నొసంగెను. ఈ యధ్యాయ ప్రారంభమున భగవంతు డిట్లనును –

"రాజ-విద్యా మహాగుహ్యా ఉత్తమోత్తమ పావన"

ఈ రాజవిద్య, యీ యపూర్వ విషయము ప్రత్యక్షముగ అనుభవములోనికి తెచ్చుకొనవలసినది. భగవంతుడు దీనిని "ప్రత్యక్షావగమమ్" అన్నాడు. మాటలలో ఇమిడనిది, అనుభవమును ఒరపిడిరాతిపై పరీక్షింపబడినది అగు విషయమును ఈ యధ్యాయము చెప్పుచున్నది. ఇందువలన నిది అత్యంత మధురమైనది.

"కోజానే కోజైహే జమ-పుర్‌కో సుర్‌పుర్ పరంధామ్‌కో
తులసి హి బహుత్ భలోలాగత్ జగజీవన్ రామ్‌గులామ్‌కో"
అని యన్నాడు తులసీదాసు.

మరణానంతరము లభించు స్వర్గమువలనను దానిని గూర్చిన కథలవలనను మన కేమిప్రయోజనము? స్వర్గము నకు పోవువారెవరో, యమపురికి పోవువారెవరో ఎవరు చెప్పగలరు? బ్రతికియున్న నాలుగుదినములును రాముని దాసుడనైయుండుటలోనే నా కానందమున్నదన్నాడు తులసీ దాసు. రాముని దాసులై బ్రతుకుటలోనున్న మాధుర్యము ఈ యధ్యాయములో కనబడుచున్నది. ప్రత్యక్షముగ ఈ దేహములోనే కన్నులార చూడదగిన సత్ఫలములను, ఇప్పుడే, ఇక్కడనే అనుభవవేద్యమయిన విషయములను ఈ యధ్యాయము చెప్పుచున్నది. బెల్లము తిన్నప్పుడే దాని మాధుర్యము ప్రత్యక్షముగ తెలియును. ఆ విధముగనే రామునిదాసు డగుటలోనున్న రుచి యిక్కడ కనబడు చున్నది. ఈ మర్త్యలోకములో నుండగానే జీవిత మాధు ర్యమును ప్రత్యక్షముగ చూపగల రాజవిద్య ఈ యధ్యా

యములో చెప్పబడినది. ఇది చాల గూఢమైనదైనను భగవంతుడు ఎల్లరి సౌలభ్యముకొఱకు దీనిని కరతలామలకము చేసినాడు.

42

సరళ మార్గము

గీతను వైదికధర్మసార మందురు. వైదికధర్మ మనగా వేదములనుండి వెలువడిన ధర్మము. ప్రపంచములో వ్రాయబడిన ప్రాచీన గ్రంథములలోనెల్ల అతి ప్రాచీనములు వేదములు. ఇందువలననే విశ్వాసశీలురు వీనిని అనాది గ్రంథములని నమ్ముదురు. తత్ఫలముగ వేదములు పూజ్యతను పొందినవి. ఐతిహాసిక దృష్టితో చూచినప్పటికిని అవి మానవ సమూజముయొక్క ప్రాచీనభావములకు ప్రాచీనతమ చిహ్నములయి యున్నవి. రాగిరేకులు, శిలాశాసనములు, నాణెములు, పాత్రలు, ప్రాణుల యెముకలు మొదలైనవాని కంటెను ఈ లిఖితసాధనములు చాల మహత్త్వముగలవి కదా! ప్రపంచమున మొట్టమొదటి ఐతిహాసిక ప్రమాణము లేవైన నున్న వనిన అవి వేదములే. ఈ వేదములలో బీజరూపముగనుండిన ధర్మము వృక్షముగ పెరిగిపెరిగి చివరకు గీతయను దివ్య మధుర ఫలమునిచ్చినది. మనము ఫలములను తినుటకాని చెట్టును తినుటకా! వృక్షమున ఫలములు పండినప్పుడే తినుటకు యోగ్యమైన వస్తువు మన కందు లభించును. వేదధర్మసారముయొక్క సారమేకదా యీ గీత.

ప్రాచీనకాలమునుండి రూఢమైన ఈ వేదధర్మములో నానావిధ యజ్ఞతంత్రములు, క్రియాకలాపములు, వివిధ తపశ్చర్యలు, అనేక సాధనలు చెప్పబడినవి. ఈ కర్మకాండ యంతయు నిరుపయోగము కాకపోయినను దాని నాచరించుటకు అధికార ముండవలెను. ఆ కర్మకాండ అందరికిని సులభముకాదు. ఎత్తైన నారికేళమునెక్కి బొండము లెవరు కోయుదురు? పీచు నెవరు తీయుదురు? కాయ నెవరు కొట్టుదురు? నే నెంత ఆకటితోనున్నను అంత యెత్తుననున్న కొంకాయ నాకు లభించుటెట్లు? క్రిందినుండి నేను కొబ్బరి కాయవంక చూచుచో పైనుండి అది నా వంక చూచుచుండును. ఇందువలన నా యాకటిమంట ఎట్లు చల్లారును? నా చేతికి కొబ్బరి చిక్కనంతవరకు అంతయు వ్యర్థము. వేదోక్తములైన ఈ నానాకర్మకలాపములలోను మిక్కిలి సున్నితములైన భావము లున్నవి. జనసామాన్యమునకు వానిని గూర్చిన జ్ఞాన మెట్లు కలుగును? వేదమార్గము వినా మోక్షములేదు. దాని ననుసరించుటకు సామాన్యులకు అధికారము లేదు. ఇక వారి గతి యేమి కావలెను? అందుచేత కృపాసాగరులైన మహాత్ములు ముందునకువచ్చి-"రండు మనమీ వేదములనుండి నిగ్గు తీయుదము. వేదసారమునుతీసి ప్రపంచమున కందింతము" అని యన్నారు. కావుననే తుకారాము మహారాజు,

"వేద కహా హై అనంత అర్థయిత్నా హీ హై చింత్య!"

అని యన్నాడు.

ఆ యర్థమేమి? హరినామమే వేదముల సారము. రామనామమువలన మోక్షసిద్ధి నిశ్చయము. స్త్రీలు, బిడ్డలు, శూద్రులు, వైశ్యులు, గ్రామీణులు, దీనులు, దుర్బలులు, రోగులు, వికలాంగులు - అందరికిని మోక్షము సులభ సాధ్యమైనది. భగవంతుడు వేదము లనెడి అలమరలోనున్న మోక్షమును బయటికితీసి అందరికిని అందుబాటులోనికి తెచ్చెను. మోక్షప్రాప్తికి ఇదెంత సూటియైన సులభోపాయము! నిష్కపట జీవితమును గడుపువాడు స్వధర్మకర్మల కును, సేవాకర్మలకును యజ్ఞరూప మెందుల కీయరాదు? ఇట్లు చేసినచో ఇక ఇతర యజ్ఞములతోడి అవసర మేమున్నది? నీ నిత్య నిష్కపట సేవాకర్మలను యజ్ఞభావముతో చేయుము. ఇదే రాజమార్గము.

యానాస్థాయనరోరాజన్ న ప్రమాద్యేత కర్హిచిత్ ।
ధావన్నిమీల్యవానేత్రేన స్ఖలేన్నపతేదిహ ॥

ఈ రాజమార్గమున కన్నుమూసికొని పరుగెత్తినప్ప టికిని పడిపోదుమనిగాని లేక ఎదురుదెబ్బ తగులుననిగాని భయములేదు. ఇక రెండవదియగు వైదికమార్గము "క్షురస్య ధారా నిశితా దురత్యయా" వంటిది. కత్తివాయి యైనను కొంత బండపాటవచ్చును. కాని యీ వైదికమార్గము మిగుల నిశితమై దుర్గమమై యుండును. రాముని దాసుడై యుంట అధికసులభము. ఇంజనీరు రోడ్డుయొక్క యెత్తును కొలది కొలదిగ పెంచుచు మనలను తీసికొనివెళ్ళి ఎత్తైనశిఖరమునకు చేర్చును. అందువలన ఇంతయెత్తునకు ఎక్కుచున్నామనియే

అనిపించదు. ఇంజనీరుచూపు నేర్పరితనమువంటిదే ఈ రాజ మార్గముయొక్క ప్రాశస్త్యముకూడ. మనుష్యుడు తాను కర్మ నాచరించుచున్నచోటనే, ఆ సరళమైన కర్మద్వారానే పరమాత్మను పొందగలడు. ఈ మార్గమిట్టిది.

పరమేశ్వరు డెక్కడనైనను దాగి కూర్చున్నాడా ? ఏ గుహలోనో, ఏ సందులోనో, నదిలోనో, స్వర్గములోనో అతడు మరుగుపడి యున్నాడా ? రత్నములు, మణులు, వెండిబంగారములు భూగర్భములో దాగియుండును. ముత్యములు, పగడములు, రత్నములు సముద్రములో దాగియుండును. అట్లే పరమేశ్వరుడను పద్మరాగము ఎక్కడనైనను దాగియున్నదా ? భగవంతుని ఎక్కడినుండియో త్రవ్వి బయటికి తీయనక్కరలేదు. అత డెల్లప్పుడును అందఱి యెదుటను, అన్నితావులను వ్యాపించియున్నాడు. మానవులందరును పరమాత్మయొక్క మూర్తులే. "ఈ మానవ రూపములోప్రకటితమగు హరిమూర్తినిఅవమానింపకుము." అని భగవంతుడనును. ఈశ్వరుడే సమస్త చరాచరముల లోను వ్యక్తమగుచున్నాడు. ఇట్టి భగవంతుని అన్వేషించుటకు కృత్రిమోపాయములతో పనియేమి ? సరళమైన ఉపాయము ఉండనేయున్నది. నీవు చేయు సేవాకార్యములన్నిటికిని భగవంతునితో సంబంధము కూర్చితివా చాలు. నీవు రాముని బంటువైపొమ్ము ! ఆ కఠినమైన వేదమార్గము, ఆ యజ్ఞము, ఆ 'స్వాహా', ఆ 'స్వధా', ఆ శ్రాద్ధము, తర్పణము – ఇవన్నియు మనలను మోక్షమువైపునకు తీసికొని

పోవును. కాని యిందులో అధికారియూ, అనధికారియూ అను చిక్కు వచ్చును. మనకు దానితో పనియేలేదు. నీవు చేయునదంతయు ఈశ్వరార్పణముచేయుము. అంతే. నీ ప్రతి పనికిని ఈశ్వరునితో సంబంధము కలుపుము. ఇదే తొమ్మిదవ అధ్యాయమిచ్చు శిక్షణ. కావుననే ఇది భక్తులకు చాల ప్రియమైనది.

43

అధికారి యగునా, కాడా యను తగవు లేదు

కృష్ణుని జీవితమందెల్ల అతని బాల్యమే అతి మధుర మైనది. బాలకృష్ణునే అధికముగ ఉపాసించుచుందురు. అతడు యాదవ బాలురతోపాటు గోవులను మేపుచు, వారితోపాటు తినుచు, త్రాగుచు, ఆడుచు పాడుచు ఉండువాడు. యాదవబాలురు ఇంద్రుని పూజింపబోయినప్పుడు కృష్ణుడు వారితో నిట్లనెను :- "ఇంద్రుని ఎవరుచూచిరి ? అతడు మనకు చేసిన యుపకారము మాత్ర మేమున్నది ? కాని ఈ గోవర్ధనపర్వతము ప్రత్యక్షముగ మన కగపడుచున్నది. ఇక్కడ అవులు మేయుచున్నవి. ఇందుండి మంచి నీటి సెలయేళ్లు పుట్టుచున్నవి. కాన మీరీ పర్వతమును పూజింపుడు." ఇట్టి విషయముల నతడు వారికి బోధించువాడు. తనతోకలసి యాడుకొన్న గోపాలురకును, నవ్వుచు, పలుకుచు నుండిన గోపికలకును, తన కానందమునిచ్చిన

ఆవులకును దూడలకును - ఈ యందఱకును అతడు మోక్ష ద్వారమును తెరచివేసెను. కృష్ణపరమాత్మ స్వానుభవము ద్వారా ఈ సరళమార్గమును సూచించెను. బాల్యమం దతనికి ఆవులతోను దూడలతోను, పెద్దవాడయినతరువాత గుఱ్ఱ ములతోను సంబంధము కలిగెను. మురళీగానము వినబడ గనే అవి గద్గదములయ్యెడివి. అతడు చేతితో నిమిరినంతనే గుఱ్ఱములు సకిలించెడివి. ఆ యావులును దూడలును రథా శ్వములును కేవలము కృష్ణమయములైపోయెడివి. పాప యోనులనబడు ఆ పశుగణములకుకూడ మోక్షము లభించి నట్లే. మోక్షమున కధికారము ఒక్క మానవులకేకాక పశుపక్షులకుగూడ ఉన్నదని శ్రీకృష్ణుడు స్పష్టపరచెను. తన జీవితములో తా నీ యనుభవమునే పొందెను.

కృష్ణభగవానుని యనుభవమే వ్యాసునిదికూడ. ఇరువురును ఒకశ్రేణికే చెందినవారు. ఉభయుల జీవిత సారమును ఒకటే. మోక్షప్రాప్తి విద్వత్తపైగాని, కర్మకలా పముమీదగాని ఆధారపడి యుండదు. దానికి సరళమైన భక్తియే చాలును. "నేను-నేను" అని గర్వించు జ్ఞానులను వెనుకకునెట్టి భక్తిపూరితలైన అమాయిక స్త్రీలు ముందునకు పోవుదురు. మనస్సును, భావనయు పవిత్రములైనచో మోక్షము దుర్లభముకాదు. మహాభారతములో 'జనక సులభాసంవాద'మని ఒక ప్రకరణమున్నది. అందు జనక మహారాజు జ్ఞానప్రాప్తికొఱకు ఒక స్త్రీ యొద్దకు వెళ్లెను. స్త్రీలకు వేదాధికారమున్నదా లేదా యని మీరిక్కడ చర్చించుచు కూర్చుండగా సులభ అక్కడ జనకునికి ప్రత్య

తముగ బ్రహ్మవిద్య నేర్చుచున్నది! ఆమె వట్టి సామాన్య స్త్రీ. జనకుడెంత మహాసమ్రాట్టు! ఎంత విద్వాసంపన్నుడు! అయినను ఆ మహాజ్ఞానికి మోక్షము చేజిక్కలేదు. కాన వ్యాసదేవు డతనిని సులభ పాదములపై బడుమని చెప్పి పంపెను. వైశ్య తులాధరుని విషయమును ఇట్టిదే. జాజలి యను బ్రాహ్మణుడు జ్ఞానసంపాదనకొరకు ఈ వైశ్యునియొద్దకు పోయెను. తులాధరు డిట్లన్నాడు:- "ఎవరు వచ్చిననుసరే, ఈ తరాజుదండెను మ్రొగ్గలేకుండ సమముగ పట్టవలె. నాకు తెలిసినదంతయు నిదే." ఇట్టిదే ధర్మవ్యాధుని కథకూడ. వ్యాధుడు కసాయివాడు. మాంసవిక్రయముచేసి అతడు సమాజసేవ చేయువాడు. అహంకారపూరితుడైన ఒక బ్రాహ్మణతపస్విని అతని గురువు ధర్మవ్యాధునొద్దకు వెళ్లు మనెను. కసాయివాడు తనకేమి నేర్పగలడని బ్రాహ్మణు డాశ్చర్యపడుచునే వ్యాధునియొద్దకు వెళ్లెను. అప్పుడు వ్యాధు డేమిచేయుచుండెను? మాంసమునుకోసి, శుభ్రముగ కడిగి అమ్మకమునకై అమర్చుచుండెను. అతడు బ్రాహ్మణు నితో ఇట్లనెను:- "ఇదిగో చూడుము, నేనీ పనిని చేయగలిగి నంత ధర్మయుతముగ చేయుచున్నాను. చేతనైనంతగ నా యాత్మ నింపుచొప్పించి ఈ పని చేయుచు నా తల్లిదండ్రుల సేవ చేయుచున్నాను." ఇట్టి వ్యాధునిరూపములో వ్యాస దేవు డొక ఆదర్శమూర్తిని చిత్రించెను.

మోక్షద్వారము ఎల్లరకును తెఱవబడి యున్నదని లోకమున కెఱుక చేయుటయే మహాభారతములోని ఈ స్త్రీ,

వైశ్య, శూద్రాది కథల యుద్దేశము. ఆ కథలలోని తత్త్వ మునే ఈ తొమ్మిదవ యధ్యాయము చెప్పుచున్నది. ఈ యధ్యాయము ఆ కథలమీద ముద్రవేయుచున్నది. రాముని సేవకుడై యుండుటలోనున్న రుచియే వ్యాధుని జీవితములో కనబడుచున్నది. భక్తతుకారాము అహింసోపాసకుడైనను, సజ్జనుడైన ఈ కసాయి మాంసవిక్రయము చేయుచునే మోక్షము పొందినాడని గొప్పగ శ్లాఘించెను. తుకారాము ఒక సందర్భములో "ఓ యీశ్వరా, పశువధచేయు నారిగతి యేమికానున్నదో!" అని ప్రశ్నించెను. కాని అతడే మరి యొకచోట సజ్జనుడైన కసాయికి మాంస మమ్ముటలో సాయపడిన భగవంతుని కొనియాడెను. నరసీమెహతా హుండీకి ధనమిచ్చి, ఏకనాథునికై కావడిమోసి, దామాజీకి చెప్పులుకుట్టుటలో తోడ్పడి, పూజ్యురాలగు జనాబాయికి ధాన్యము దంపుటలో సహాయపడిన భగవంతుడే సజ్జనుడైన ఈ కసాయికిగూడ అట్టి ప్రేమతోనే తోడ్పడెనని తుకారామన్నాడు. నీ పనులన్నిటిని పరమేశ్వర ప్రీతికొఱకే చేయవలయుననుట దీని సారాంశము. కర్మ, పరిశుద్ధభావనతో నిండి సేవామయమైనచో అది యజ్ఞరూపము తాల్చును.

44

కర్మఫలమును భగవంతుని కర్పింపుము

తొమ్మిదవ అధ్యాయములో ఈ ప్రత్యేకవిషయమే చెప్పబడినది. దీనిలో కర్మభక్తియోగములయొక్క మధుర

సంయోగమున్నది. కర్మయోగమనగా కర్మ నాచరించుట, కర్మఫలమును త్యజించుట. ఫలవాసన చిత్తమునకు అంటనంత బాగుగ కర్మ నాచరింపుము. ఇది అక్రోట్ చెట్టును నాటుట వంటిది. అక్రోట్ చెట్టు ఇరువదియైదు సంవత్సరములు గడచిన మీదట ఫలించును. చెట్టునాటువానికి తన జీవితములో దాని ఫలమును అనుభవించు అవకాశమే లేకపోవచ్చును. అయినను చెట్టును నాటవలెను. దానికి భక్తిశ్రద్ధలతో నీరు పోయవలెను. కర్మయోగ మనగా చెట్టునాటుట, ఫలము నందు కోరిక పెట్టుకొనకుండుట. ఇక భక్తియోగమని దేనినందుము? నిండు హృదయముతో ఈశ్వరునితో కలసి పోవుటయే భక్తియోగము. రాజయోగములో కర్మయోగ భక్తియోగములు రెండును ఏకమగును. రాజయోగమునకు అనేకులు అనేక వ్యాఖ్యానములు చేసిరి. కాని రాజయోగ మనగా కర్మ భక్తియోగముల మధుర సంయోగమని నా సంక్షిప్త వ్యాఖ్యానము.

మనము కర్మ నాచరింతము; కాని కర్మఫలమును వదలివేయకుండ దానిని పరమాత్మకు అర్పింతము. ఫలమును వదలివేయుచో దానిని నిషేధించినట్లగును; కాని అర్పణలో నిషేధములేదు. ఇదెంత మంచి పద్ధతి! దీనిలో చాల మాధుర్యమున్నది. ఫలమును వదలిపెట్టుట యనగా మనుష్యుడు ఫలమును అనుభవింపడనికాదు. ఎవరో ఒకరు ఆ ఫలమును అవశ్యముగ పొందుదురు. ఎవరికో యొకరికి అది లభించియే తీరును. కాని ఈ ఫలము ననుభవించువాడు

అందుల కధికారి యగునా కాడా యను తర్జన భర్జనలు బయలు దెరవచ్చును. బిచ్చగాడు గుమ్మములోనికి రాగానే – "బలిసియున్నావు. బిచ్చమెత్తుట నీకు తగినపని కాదు. వెళ్లిపో!" అని నిర్దాక్షిణ్యముగా అందుము. అతడు బిచ్చమెత్తుట ఉచితమగునా కాదా యను తర్కమును లేవదీయుదుము. పాప మా భిక్షుకుడు సిగ్గుపడి వెళ్ళిపోవును. మన హృదయమునం దతనిపట్ల సహానుభూతి పూర్తిగ లోపించినప్పుడు బిచ్చమెత్తువాని యోగ్యతను మన మెట్లు నిర్ణయింప గలము! నా చిన్నతనములో ఒకసారి బిచ్చగాండ్రనుగూర్చి ఇట్టి సంశయమునే మా తల్లితో వెలిపుచ్చితిని. ఆమె యిచ్చిన జవా బిప్పటివరకును నా చెవులలో ప్రతిధ్వనించుచునేయున్నది. "ఈ బిచ్చగాడు బలిష్ఠుడుగ నున్నాడు. భిక్షము పెట్టినచో ఈ దురభ్యాసము, సోమరితనము మరింత పెరుగవా?"అని నే నామెను ప్రశ్నించితిని. "దేశే కాలే చ పాత్రేచ" అను గీతాశ్లోకమునుగూడ ఆమెకు వినిపించితిని. ఆమె యిట్లన్నది– "ఇంటికివచ్చిన బిచ్చగాడు పరమేశ్వరుడే. ఇప్పుడు చెప్పము, వాడు పాత్రుడో అపాత్రుడో! భగవంతునే అపాత్రుడందుమా? వీడు పాత్రుడు, వీడపాత్రుడు అనుటకు నీకును నాకును ఏమి యధికారమున్నది? అందువలన దీనిని గూర్చి తర్కించు అవసరమే నాకగపడదు. నాదృష్టిలో అతడు భగవంతుడే." మా తల్లి చెప్పినదానికి తగిన సమాధానమేదియు ఇంతవరకు నాకు స్ఫురించలేదు.

పరాయివానికి భోజనము పెట్టునప్పుడు పాత్రాపాత్ర

విచారణ చేయుచుందుము. కాని మనపొట్టకు తినునప్పుడు మాత్రము ఈ తిండికి మన కధికారమున్నదా యను ఆలోచనయే రాదు. గుమ్మునొద్దకువచ్చిన బిచ్చగానిని వట్టి దిక్కుమాలినవాడని ఎందులకనుకోవలె ? భిక్షుకుడు కేవలము భగవంతుడే యని ఎందుల కనుకొనరాదు ? రాజయోగము మిట్లనుచున్నది:- "కర్మఫలము ఎవనికో యొకనికి లభింపవలసినదేకదా ! కనుక దానిని భగవంతునికే యర్పింపుము." నీ యర్పణకు తగిన స్థానమును రాజయోగము నీకు చూపుచుండును. ఫలేచ్ఛను వదలుట యను నిషేధాత్మక క్రియకూడ ఇక్కడలేదు. సర్వమును భగవంతుని కర్పించుటయే కనుక పాత్రాపాత్రతలను గూర్చిన సమస్యకూడ తీరిపోవును. భగవంతుని కిచ్చిన దాన మెప్పుడును పరిశుద్ధమే. నీ కర్మలో దోషమున్నప్పటికిని ఆయనచేతులలో పడగానే అది పవిత్రమైపోవును. దోషములను దూరముచేయుటకు మనమెంత ప్రయత్నించినను కొంత దోషము ఉండనే యుండును. అయినప్పటికిని ఎంత పవిత్రహృదయముతో కర్మ చేయవలెనో అంత పవిత్ర హృదయముతో దానిని చేయుట అవసరమే ! బుద్ధి ఈశ్వరప్రసాదము. చేతనైనంత పరిశుద్ధరూపములో దానిని వినియోగించుకొనుట మనకవశ్యకర్తవ్యము. అట్లు చేయకపోవుట అపరాధమగును. కాన పాత్రాపాత్ర వివేచనకూడ చేయవలసినదే; కాని భగవద్భావముతో చేసిన అది సులువగును.

చిత్తశుద్ధికొఱకే ఫలమును మనము వినియోగింపవలె.

జరిగెడు పని జరుగుచునే. భగవదర్పితము కావలె. తన్మూలమున మానసికతృప్తి లభించుచుండవలె. ఫలమును వదలరాదు. దానిని భగవంతుని కర్పించవలె. అనగానేమి ? మనసులో పుట్టు వాసనలను, కామక్రోధాది వికారములను కూడ ఈశ్వరార్పణముచేసి బంధవిముక్తులము కావలె.

"కామక్రోధ్ మేరే అర్పణ్ ప్రభుకే"

ఇక్కడ ఎవ్వరును సంయమాగ్నిలో దగ్ధము కానక్కరలేదు; ఎప్పటిదప్పుడు అర్పణ చేసివేసి విముక్తిని పొందుటయే చాలును. ఏ యింద్రియమునేని ఒత్తిడిపెట్ట నక్కరలేదు, హింసింపనక్కరలేదు.

"జోగుడ్ దీన్-హేఁ తే మేరే మాహుర్ కాహేదేయ"

ఇంద్రియములు సాధనమాత్రములే. వానిని ఈశ్వరార్పణ చేయుము. చెవియున్నదనిన అసలు వినకుండ ఉండుటకా? కాదు. తప్పకుండ వినుము, కాని హరికథలు వినుము. అసలు వినకుండనుండుట కష్టము. కాని హరికథల వంటి సద్విషయములకు చెవుల నుపయోగించుట చాల సులభము, మధురము, హితకరము. నీ చెవులను రాముని కర్పింపుము. నోటితో రామనామమును స్మరించుచుండుము. ఇంద్రియములు శత్రువులుకావు. అవి చాల మంచివి. వాని శక్తి యపారము. కనుక ఈశ్వరార్పణ బుద్ధితో ప్రతీంద్రియమును ఉపయోగించుటయే రాజమార్గము. ఇదే రాజయోగము.

45

విశిష్ట క్రియలనే అర్పించవలెనను పట్టుదల వలదు

భగవంతునికి విశిష్టక్రియలనే అర్పించవలెనని తలంపకు. పనులనన్నిటిని అయన కర్పింపుము. శబరి తెచ్చిన సామాన్యఫలములను రాము డెంత ప్రేమతో స్వీకరించినాడు! పరమేశ్వరుని పూజించుటకు గుహలోనికి పోనక్కరలేదు. నీ వెక్కడ ఏ పనినిచేసినను దానిని దేవుని కర్పింపుము. తల్లి, భగవంతునే సాకుచున్నదా యన్నట్లు తన బిడ్డను జాగరూకతతో పెంచుచుండును. బిడ్డకు స్నానముచేయించుట యనగా దేవునికి రుద్రాభిషేకము చేయుచున్నట్లే! బిడ్డను పరమేశ్వరుని ప్రసాదముగ భావించి, వానిని దైవస్వరూపముగనెంచి తల్లి పోషింపవలె. కౌసల్య రాముని, యశోద కృష్ణుని ఎంత ప్రేమాతిశయముతో పోషించి పెంచిరి! దీనిని వర్ణించుచు శుకుడు, వాల్మీకి, తులసీదాసు తామె తరించినట్లు భావించిరి. ఆ వర్ణనలో వారు అపారమైన ఆనందమును పొందిరి. తల్లి, బిడ్డలకు చేయుసేవ చాల గొప్పది. భగవత్స్వరూపుడైన పిల్లవాని సేవకంటె మహాభాగ్యము మరేముండును? ఇతరులకు చేయుసేవ ఈ భావనతోనే చేసిన యెడల దానిరూప మెంతగా మారిపోవును! ఎవరి కేసేవ లభించినను దానినే ఈశ్వరసేవగా భావించుచుండవలెను.

హైతు ఎద్దునకు సేవచేయును. అట్టి యెద్దును తుచ్ఛముగ భావింపవచ్చునా? భావింపరాదు. వేదములలో

వామదేవుడు ఎద్దును శక్తిరూపముగ వర్ణించినాడు. విశ్వ వ్యాప్తమైన ఆ వృషభరూపమే యీ యెద్దుకూడ.

చత్వారి శృంగా త్రయో అస్య పాదా
ద్వేశీర్షే సప్తహస్తాసో అస్య
త్రిధా బద్ధో వృషభో రోరవీతి
మహో దేవో మర్త్యాం ఆవివేశ.

నాలుగు కొమ్ములు, మూడు పాదములు, రెండు తలలు, ఏడు చేతులును కలిగి, మూడు చోట్ల బంధింపబడి మహాతేజస్వియై మర్త్యలోకమంతయు వ్యాపించి గర్జించు ఆ విశ్వవ్యాప్త వృషభముయొక్క పూజయే నైతుచేయును. టీకాకారులు ఈ వేదమంత్రమునకు అయిదారు విధములుగ వ్యాఖ్యానము చేసినారు. ఈ యెద్దు బహు విచిత్రమైనది కూడ! ఆకాశములో గర్జించుచు వర్షమును కురియించు ఆ వృషభమునే మలమూత్రములతో పొలములో పంటలు పండించు తన యెద్దులో నైతు దర్శించుచున్నాడు. కృషికుడు తన పశుగణమునకు ఇట్టి యున్నతభావముతో సేవచేసినచో ఈ సామాన్యసేవకూడ ఈశ్వరార్పితమగును.

ఈ విధముగనే ఇంటిలోని గృహలక్ష్మి వంటయిల్లలికి, మ్రుగ్గుపెట్టి, ప్రొయ్యి వెలిగించి శుభ్రమైన సాత్త్వికాహారమును అమర్చి, అది యింటిలోని వారందరికిని పుష్టి, తుష్టి యీయ వలెనను కోరికతో చేయుపనియంతయు యజ్ఞరూపమే. ప్రొయ్యి వెలిగించుటయనగా ఇల్లాలు కొంచెములో యజ్ఞాగ్నిని వెలిగించినట్లే. ఈశ్వరప్రీత్యర్థము సిద్ధముచేయబడిన భోజన

పదార్థము ఎంతశుభ్రముగను పవిత్రముగను ఉండునో ఊహించుకొనుడు. ఆ గృహాలక్ష్మి హృదయములో నిట్టి సద్భావనయే యుండినచో ఆమెను భాగవతములోని ఋషి పత్నులతో పోల్చవచ్చును. ఇట్టి సేవచేసి ఎందరుతల్లులు తరించియుందురో! ఇక "నేను నేను" అని అహంకారపడు పండితులు, జ్ఞానులు ఎందరు మూలబడిపోయిరో!

46

జీవితమంతయు హరిమయము కాగలదు

మన ఋణఋణ జీవితము పైకి సాధారణముగ కనబడుచున్నను నిజమున కట్లుకాదు. అందులో గొప్ప అర్థమున్నది. జీవితమంతయు ఒక మహా యజ్ఞకర్మ. నీ నిద్రకూడ ఒక సమాధియే. భోగానుభవముల నన్నిటిని ఈశ్వరార్పణము చేసి పోవునిద్ర సమాధి కాక మరియేమి? పునర్దేశములో స్నానముచేయుచు పురుషసూక్తమును పఠించు ఆచారము కలదు. స్నానమునకును పురుషసూక్తమునకును సంబంధ మేమున్నది? వేయిచేతులు వేయికన్నులుగల ఆవిరాట్పురుషునకును నీ స్నానమునకును ఏమిసంబంధము? పరీక్షింపదలచినచో ఈ సంబంధము తెలియకపోదు. నీ తలమీద పోసికొను ప్రతి చెంబెడు నీటిలో వేయిబిందువులున్నవి. ఆ బిందువులు నీ శిరస్సును కడిగి నిన్ను నిష్పావుని చేయుచున్నవి. పరమేశ్వరుని సహస్రహస్తములనుండి సహస్రధారలు నీపై వర్షించి

నిన్నాశీర్వదించుచున్న వన్నమాట. ఈ బిందువులద్వారా పరమేశ్వరుడే నీ శిరస్సులోని మాలిన్యమును కడిగివేయుచున్నాడని భావింపుము. ఆ స్నానములో నిట్టి దివ్యభావనను చొప్పింపుము. అప్పు డాస్నానముయొక్క రూపమే మారిపోవును; దానికి అనంతశక్తి కలుగును.

ఎంత సామాన్యకర్మయైనను పరమేశ్వరునికే యన్న భావనతో చేసినచో అది పవిత్రకర్మయగును. ఇది అనుభవసిద్ధము. ఇంటికివచ్చిన అతిథి భగవత్స్వరూపుడని మనసా భావనచేసి చూడుము. సామాన్యముగ ఇంటి కెవరైనపెద్దలు వచ్చుచున్నారనిన మనము ఇల్లు వాకిలి ఎంతో శుభ్రము చేయుదుము. ఎంతో మంచిమంచి భోజనపదార్థములు తయారుచేయుదుము. ఇక వచ్చిన యతిథి పరమేశ్వరుడే యనుకొన్నచో ఆ భావనతో ఎంతమార్పువచ్చును! కబీరు బట్టలునేయువాడు. అతడు

"ఝీనీ ఝీనీ బీనీ చదరియా"

అనిపాడుకొనుచు నేతలో నిమగ్నుడై యుండువాడు. ఈశ్వరునికే ఈ వస్త్రము నేయుచున్నానని భావించువాడు. ఋగ్వేదఋషి

"వస్త్రేవ భద్రా సుకృతా సుపాణీ"

అని యన్నాడు. సుందరహస్తములతో నేయబడ్డ వస్త్రమును కట్టబెట్టినట్లు ఈ నా స్తోత్రమును భగవంతునికి అర్పించుచున్నాను. కవి వ్రాయు స్తోత్రములు ఈశ్వరునికే. అట్లే నేతగాడు వస్త్రములునేయుటకూడ ఈశ్వరుని

కొఱకే. ఎట్టి హృదయంగమమైన కల్పన యిది! చిత్తశుద్ధి కలుగజేసి హృదయము నెంతగా కదలించు భావన యిది! లోపల ఒక్కసారి యీభావన ప్రవేశించినచో జీవిత మెంత నిర్మలమగును! చీకటిలో మెఱుపు మెరసినప్పుడు అంధకార మొక్క క్షణములో ప్రకాశముగ మారును. అంధకార మెప్పుడైన మెల్లమెల్లగ వెలుగుగామారునా? మారదు. క్షణమాత్రములో దాని బహిరంతరములు పూర్తిగ పరివర్తనము చెందును. ఆ విధముగనే ప్రతికార్యమును ఈశ్వరునితో జోడించుటవలననే జీవితమున నొక్కసారిగ అమ్మృతమైన శక్తి, ఉత్సాహము ప్రవేశించును. ప్రతి కార్యమును పరిశుద్ధమగును. నేడు మన జీవితములో ఆ యుత్సాహ మేది? మనము మరణించలేకనుక బ్రతికియున్నట్లుభావించు కొనుచున్నారము. నేడు మన ఉత్సాహమునకు నలుదిశలను కటువు వచ్చినది. జీవితము కళారహితము శోకభూయిష్ఠము అయినది. కాని నీ సమస్త కార్యములను ఈశ్వరునితో జోడించవలెనని మనసార భావింపుము. అపుడు నీ జీవితమెంత రమణీయము పూజనీయము కాగలదో నీకే తెలియగలదు.

పరమేశ్వరుని స్మరించినంతనే పరివర్తనము కలుగును. ఇందు సందేహములేదు. "రామా, రామా" యన్నమాత్రమున నేమగునని యనకుము. ఒకసారి అని చూడుము. సంధ్యాసమయమున నైతు పనిముగించుకొని ఇంటికి వచ్చుచున్నాడనుకొనుము. దారిలో నొకబాటసారి యతని కంటబడును.

"అన్నా, ఓ నారాయణా, కొంచెము ఆగుము. రాత్రి వచ్చుచున్నది, హాయింటికి రా నాయనా!" అని వైతు అనును. ఈ మాట వినినతోడనే యాత్రికుని ముఖవైఖరి మారునో లేదో చూడుము. ఆ యాత్రికుడు దొంగయైనను, దోపిడిగాడైననుకూడ పవిత్రుడగును. ఈ మార్పు భావన వలననే కలుగును. భావనలో నెంతశక్తియైనను కలదు. జీవితమే భావనామయము. ఇరువదేండ్ల పరాయి కుఱ్ఱవాడు ఒక యింటికి వచ్చును. ఇంటి యజమానుడు తన కొమార్తనతని కిచ్చి వివాహముచేయును. కుఱ్ఱవాని కిరువదియేండ్లే. కాని యేబదియేండ్ల కన్యాదాత అతని పాదములు కడుగును. ఇదేమివింత! కన్యాదాన మెంత పవిత్రమైనది! వరుడు పరమేశ్వర స్వరూపుడనియే అతని భావన. జామాతయెడల చూపు ఈ భావననే మరింత పెంచుకొనుచు ముందునకు పొమ్ము.

ఇట్టి అసత్యభావనలవలన ప్రయోజనమేమని ఎవరైన అనవచ్చును. మొదటనే సత్యాసత్యముల తర్కములో దిగవలదు. ముందు అభ్యాసముచేసి అనుభవమును పొందుము. సత్యాసత్యములు అప్పుడు నీకు తెలియును. ఆ కన్యాదాన విషయములో జామాత నిశ్చయముగ పరమేశ్వరుడే యని మాటవగుసకుగాక నిజముగ భావింపుము. అప్పుడు ఎంత వ్యత్యాసము కనబడునో నీవే చూడగలవు. ఈ పవిత్ర భావనాప్రభావముచేత వస్తువుల పూర్వరూపమునకును ఉత్తర రూపమునకును భూమ్యాకాశముల మధ్యనున్నంత అంతర మేర్పడును. అపాత్రుడు పాత్రుడగును. దుష్టుడు శిష్టుడగును.

భిల్లుడైన వాల్మీకిజీవితమునందలిపరివర్తన యిట్టిదేకదా! నారదునివ్రేళ్లుపీణమీటుచునేయున్నవి. నోట నారాయణనామము జపింపబడుచునేయున్నది. ఆ స్థితిలో ఈభిల్లు డతనిని చంపుటకు సరుగెత్తును. కాని నారదుని శాంతికి భంగముకలుగలేదుసరికదా, అతడు ప్రేమపూర్ణమైనదృష్టితో భిల్లునివంక చూచును. వాల్మీకి యిట్టి దృశ్యమును ఇంతకుపూర్వ మెన్నడును చూచియుండలేదు. ఆక్షణమువరకును అతడు రెండు రకముల ప్రాణులనే చూచియుండెను – తన విల్లును అమ్ములను చూచి బెదరిపారిపోవురక మొకటి. ఎదురుతిరిగి డీకొను రక మొకటి. ఇప్పుడు నారదు డతనినిచూచి పారిపోలేదు, డీకొననులేదు. శాంతభావముతో అట్లే నిలబడెను. వాల్మీకి బాణము నిలిచిపోయెను. నారదుని కనుబొమలు కదలలేదు, రెప్ప వాలలేదు. మధురముగ భజన నడుచుచునే యున్నది. "నీ బాణమట్లు నిలిచిపోయినదేమి?" అని నారదు డడిగెను. "మీ శాంతభావముచూచి" అన్నాడు వాల్మీకి. నారదు డట్లు వాల్మీకిని మార్చినేసెను. ఈ పరివర్తనము అబద్ధమా? నిజమా?

ప్రపంచములో దుష్టుడు ఉన్నాడా లేడా యను నిర్ణయము నెవరుచేయగలరు? నిజముగ దుష్టుడే యెదుటికి వచ్చినను వానిని పరమాత్మస్వరూపునిగ భావింపుము. వాడు దుష్టుడేయైనను మహాత్ముడైపోవును. ఇది దుష్టభావనయా! వాడు దుష్టుడేయనిమాత్ర మెవరు చెప్పగలరు? "సజ్జనులు సహజముగ మంచివారు కనుక వారి కంతయు మంచిదిగనే

కనబడును. కాని వాస్తవమునకది నిజమా ?"అని నీ వన వచ్చును. నీ నిర్ణయము మాత్రము సమంజసమని నిర్ధారణ యేమి ? సృష్టిని సాంగోపాంగముగ చూడగల సాధనసామగ్రి కేవలము సజ్జనులుకానివారియొద్దనే యున్నట్లా ? "సృష్టి మంచిదే. నీవు దుష్టుడవు కనుక నీ కంతయు చెడ్డదిగా కన బడును." అని యెందులకనరాదు ? విషయమిది : సృష్టి యొక అద్దమువంటిది. నీ వెట్టివాడవో ఎదుటిసృష్టిలో నీ ప్రతిబింబము అట్లే కనబడుచుండును. మనదృష్టి యెట్టిదో సృష్టియొక్క రూపమును అట్టిదే. ఇందుచేత ఈ సృష్టి మంచి దని, పవిత్రమని భావింపుము. నీ నిత్యకృత్యములలోకూడ ఇట్టిభావనేప్రసరింపజేసి అందలి చమత్కారమును చూడుము.

భగవంతు డీ విషయమునే తెలియజెప్పుచున్నాడు –

"యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణం" —గీత.

నీవుచేయున దంతయు ఉన్నదున్నట్లు భగవంతుని కర్పింపుము.

నా బాల్యములో మాయమ్మ ఒకకథచెప్పుచుండెడిది. కథ చమత్కారముగనున్నను అందలి సారము అమూల్య మైనది. ఒక స్త్రీయుండెడిది. తాను చేయునదంతయు కృష్ణార్పణము చేయవలెనని ఆమె నిశ్చయము. వంటయిల్లు అలుకగా మిగిలినపేడను మట్టిని ముద్దచేసి బయట పార వేయుచు "కృష్ణార్పణమస్తు !" అనెడిది. వెంటనే ఆ పేడ ముద్దవెళ్ళి ఆలయములోని భగవంతుని మూర్తియొక్క

ముఖమున అంటుకొనెడిది. పూజారి నిత్యమును విగ్రహమును తోమి కడుగ లేక అలసిపోవువాడు. ఏమిచేయుటకును తోచలేదు. చివరకిది ఆ స్త్రీ మహిమయని తెలియవచ్చెను. ఆమె బ్రతికియున్నంతకాలమును ఆ విగ్రహము శుభ్రపడనేరదని పూజారి తెలిసికొన్నాడు. ఒకరోజున ఆమె జబ్బుపడెను. మరణ మాసన్నమాయెను. మృత్యువునుకూడ ఆమె కృష్ణార్పణముచేసినది. తత్క్షణమే ఆలయములోని మూర్తిముక్కలు ముక్కలై పడిపోయెను. ఆ స్త్రీని తీసికొనివెళ్లుటకు దివినుండి విమానము వచ్చినది. ఆమె విమానమునుకూడ కృష్ణార్పణముచేసెను. విమానముకూడ వెళ్ళి ఆలయమునకు తగులుకొని తుత్తునియలయ్యెను. కృష్ణధ్యానము ముందర స్వర్గముకూడ వట్టి పనికిమాలిన వస్తువయినది.

ఇందలి సారాంశ మిది: మనవలన జరుగు మంచిచెడ్డ కర్మలన్నిటిని ఈశ్వరార్పణ చేయుటచేత వానిలో మరింత సామర్థ్యము ఉత్పన్నమగును. జొన్నగింజ కొంత పచ్చగాను కొంత యెఱ్ఱగానుండును. కాని ఆ గింజలను మంగలములో వేగించినచో ఎంత చక్కని పేలాలు తయారగును! తెల్లగా అష్టకోణములు తీరిన పేలాలను, జొన్నగింజలను దగ్గరపెట్టి చూడుము – ఎంత వ్యత్యాసము కనబడునో! కాని, అవి యీ గింజలలోనుండి వచ్చినవే; సందేహములేదు. ఈ వ్యత్యాసము కేవలము అగ్నివలన కలిగినదే! ఈ విధముగనే గట్టివైన ఆ గింజలను తిరుగటిలోపోసి విసరిన మెత్తని పిండి యగును. అగ్ని సంపర్కమువలన పేలాలైనవి, తిరుగటిలో

విసురుటవలన మెత్తనిపిండి యైనది. ఇట్లే యెంత చిన్నపని యైనను హరిస్మరణసంస్కారమువలన నుత్తమోత్తమమగును. భావనవలన విలువ పెరుగును. జపాపుష్పములు, మాదేడు, తులసిదళములు, గరికపోచలు-వీనిని తేలికగా చూడకుము. "తుకాకహే స్వాద్‌పాయా-రామ్-మిశ్రతజోహూగయా"

ప్రతివిషయముతోను భగవంతుని జోడించి అనుభవమును పొందుచుండుము. రామునితోకూడిన ఈ సమ్మేళనతో తుల్యమైనది మరేమున్నది? ఈ దివ్యమైన మసాలాను మించినది మరెక్కడ దొరకును? దీనిని నీ ప్రతిపనిలోను చూడగల్గినచో సర్వమును సుందరము, రుచికరముకాగలదు.

రాత్రి ఎనిమిదిగంటలవేళ దేవాలయములో ధూప సుగంధము వ్యాపించినప్పుడు, జ్యోతులు వెలిగించినప్పుడు, హారతి యిచ్చినప్పుడు, దింపినప్పుడు మనము పరమేశ్వరునే దర్శించుచున్నామని నిజముగ భావింతుము. భగవంతుడు పగలంతయు మేల్కొన్నాడు. ఇప్పుడు నిద్రించు సమయము వచ్చినది.

"సుఖ్‌నిందియా ఆబ్‌సోవో గోపాల"

అని భక్తులు గానముచేయుదురు.

కాని శంకాశీలుడు, "ఇదేమివింత! భగవంతుడు కూడ నిద్రపోవునా?" అని ప్రశ్నించును.

అరే! భగవంతుడేమిచేయడు? బలేబాగుగానున్నది! భగవంతుడు కానిచో పాషాణమా నిద్రించునది, మేల్కొనునది? సోదరా, భగవంతుడే నిద్రపోవువాడు, అతడే మేలు

కొనువాడు, అతడే తినువాడు, త్రాగువాడు. తులసీదాసు ప్రాతఃకాలమున భగవంతుని నిద్ర లేపి

"జాగియే రఘునాథకువర్ పంఛీబన్ బోలే"

అని వినతిచేయును.

భక్తులు తమ సోదరీసోదరులను, ఆత్మీయులను రాముని మూర్తులుగ భావించి "నా రామచంద్రా, ఇక లెమ్ము!" అందురు. ఇదెంత సుందరమైన భావన! ఏదైన నొక విద్యార్థి గృహము (బోర్డింగు)ను చూడుడు. అక్కడి విద్యార్థులను, "అరే, లేచెదరా, లేవరా?" అని అదలించి లేపుదురు. ప్రాతఃకాలపు శుభసమయమున నిట్టి కర్ణకఠోర వాణి యేమిబాగుగానుండును? విశ్వామిత్రుని ఆశ్రమములో రామచంద్రుడు నిద్రించుచుండును. విశ్వామిత్రు డతనిని మేల్కొల్పును. వాల్మీకిరామాయణములో దానివర్ణన యిట్లున్నది—

"రామేతి మధురాం వాణిం విశ్వామిత్రోఽభ్యభాషత
ఉత్తిష్ఠ నరశార్దూల పూర్వా సంధ్యా ప్రవర్తతే ॥"

"నాయనా, రామా! ఇక లెమ్ము!" ఇట్టి మధుర స్వరముతో విశ్వామిత్రు డతనిని మేల్కొల్పును. ఎంత మధురమైన దీపని! ఆ బోర్డింగుపిల్లలను లేపుట యెంత కఠోరముగనుండును! ఏడుజన్మలనాటి శత్రువే వచ్చి లేపుచున్నాడనిపించును. కనుక పిల్లలను లేపునపుడు మొదట మెల్లగా పిలువుము. తరువాత కొంచెము బిగ్గరగా పిలువవచ్చును. కాని కాఠిన్యము, క్రూరత్వము ఏమాత్రమును

ఉండరాదు. ఒకవేళ పిల్లవాడు లేవకపోయినచో పదినిమిషములు ఆగి మరల లేపుము. ఈ రోజున వేళకు లేవకపోయినను రేపు లేచు నని ఆశింపుము. వానిని లేపుటకు ఇంపైన పాటలు, మేలుకొలుపులు మొదలైనవి పాడుము. నిద్ర లేపుటయను సామాన్యక్రియనుకూడ భగవంతుని మేల్కొల్పే యన్నట్లు ఎంతకావ్యమయముగా, ప్రేమమయముగా, సుందరముగా చేయవచ్చును! నిద్ర లేపుటకూడ ఒక శాస్త్రమే.

నీ సమస్త వ్యవహారములలోను ఈ భావనను ప్రవేశపెట్టుము. ముఖ్యముగ శిక్షణశాస్త్రములో ఈ భావనకెంతైన అవసరమున్నది. బిడ్డలనగా నెవరు? ప్రభువుయొక్క మూర్తులే. ఈ దేవతలను సేవించుచున్నానను భావము గురువున కుండవలె. ఇట్టి భావన కలవాడు బిడ్డలను "పో, యింటికి పో! ఒక గంటసేపు నిలబడు! చేయిచాపు! ఎంత మురికి బట్టలు, మురికిచేతులు, చీమిడిముక్కు!" అని గద్దింపడు. మీదుమిక్కిలి మెల్లగ తానే వానిముక్కుతుడుచును. చినిగినగుడ్డలను కుట్టి, మురికిగుడ్డలనుతికి శుభ్రపరచును. ఉపాధ్యాయుడిట్లు చేసినచో దీని పరిణామ మెంత బాగుగానుండును! బిడ్డలను తిట్టుట, కొట్టుటవలన ఏమైన మార్పు తేగలమా? విద్యార్థులుకూడ నిట్టి దివ్యభావనతోనే గురువును చూడవలె. శిష్యులు హరిమూర్తులని గురువనుకొనవలె. గురువు భగవత్స్వరూపుడేయని శిష్యులుకూడ భావింపవలె. పరస్పర మిట్టిభావన పనిచేసినచో విద్య యెంత తేజస్వంతము కాగలదు! బిడ్డలును భగవత్స్వరూపులే, గురువుకూడ భగవ

త్స్వరూపుడే. ''ఇతడు గురువుకాడు, శంకరుని మూర్తియే, ఇతని బోధామృతమును మనము క్రోలుచున్నాము. ఈతని సేవచేసి జ్ఞానోపలబ్ధిని పొందుచున్నాము'' అని బిడ్డ లనుకొన్నచో గురువుషట్లువారి ప్రవర్తన మెంత గొప్పగ నుండును!

47

పాపభయము లేదు

ప్రభువు సర్వత్రవిరాజమానుడైయున్నాడను భావన మనలో నాటుకొన్నచో మనము పరస్పర మెట్లు మెలగవలె నను నీతిశాస్త్రము దాని కదే మన అంతఃకరణమున స్ఫురించును. ఇందులకు శాస్త్రములు పఠింపవలసిన అగత్యమేలేదు. అప్పుడు సమస్త దోషములును దూరమైపోవును. పాపములు పలాయనమగును; దురితాంధకారము తొలగిపోవును.

తుకారాము ఇట్లన్నాడు—

''హొూలోస్వతంత్ర ఉద్దామ్, లేలోహరదమ్‌విఠల్‌హరినాం
నహీం హొూగాకోయీపాప్, నాంలేతే ఆతాపాస్''

మంచిది! పో! పాపముచేయుటకు నీకు స్వేచ్ఛయున్నది. పాపములు చేసిచేసి నీవే అలసిపోవుదువో, పాపములను దగ్ధము చేయుటలో హరినామమే అలసిపోవునో చూచెదను. ఎంత బలముగల పాపమైనను హరినామమునెదుట గర్వముతో నిలువగలదా ? ''కరో జిత్నే చాహే పాప్'' చేయగలిగినన్ని పాపములు చేయుము. నీకు పూర్ణమైన స్వేచ్ఛయున్నది.

హరినామమునకును నీ పాపములకును కుస్తీ జరుగనిమ్ము. ఈ జన్మలోని వేకాక అనంత జన్మల పాపములను క్షణములో భస్మపటలము చేయగల సామర్థ్యము ఈ హరినామములో నున్నదిసుమా ! అంధకారము గుహాంతరాళములో యుగ యుగములనుండి నిండియున్నను ఒకనిప్పుపుల్ల వెలిగించగానే పలాయనమైపోవును. చీకటి వెలుగుగామారును. పాపము లెంత పురాతనములో అంత త్వరలో నవి నాశమైపోవును. ఏలయనిన అట్లు నశించిపోవుటయే వాని నైజము. ప్రాతకొట్లు అప్పటికప్పుడే కాలి బూడిదయగును.

రామనామముదగ్గర పాపము నిలువలేదు. 'రామా' యనిన భూతములు పారిపోవునని పిల్లలందురుకదా ! మేము బాల్యములో రాత్రివేళ శ్మశానమునకు వెళ్ళివచ్చుచుండు వారము. దానికి గుర్తుగా అక్కడ మేకులుపాతి రావలె నను నియమము పెట్టుకొనువారము. ఎటుచూచినను అంధ కారము, పాములు, ముండ్లుకూడ నుండెడివి. అయినను వానిని మే మేమాత్రమును లెక్కచేయువారము కాము. భూతములు మా కెన్నడును కనబడనేలేదు. అనుకొను వారికే భూతములుకాని అనుకొననివారి కవి యెట్లుకన బడును ? పదేండ్ల కుఱ్ఱవానికి రాత్రులందు శ్మశానమునకు పోయిరాగల సామర్థ్యము ఎక్కడినుండి వచ్చినది ? రామ నామమునుండి. ఆ సామర్థ్యము సత్యస్వరూపుడైన పరమే శ్వరునిది. పరమాత్మ తనచెంతనే యున్నాడను భావన యున్నచో, ప్రపంచమంతయు తలక్రిందైనను, హరిభక్తుడు

భయపడడు. వానిని ఏ రాక్షసి మ్రింగగలదు? రాక్షసి వాని శరీరమును మ్రింగి జీర్ణించుకొన్నను సత్యమును మాత్రము జీర్ణముచేసికోలేదు. సత్యమును జీర్ణించుకోగల శక్తి ప్రపంచమునం దెక్కడను లేదు. ఈశ్వరనామము ముందర పాపమెంతమాత్రమును నిలువజాలదు. ఇందుచేత నీ హృదయము నీశ్వరునితో జోడించుము. ఆయన కృపను సంపాదింపుము. అన్నికర్మలను ఆయన కర్పించి నీ వాతని వాడవై పొమ్ము. నీ సమస్తకర్మలను నైవేద్యముగ ప్రభువున కర్పించవలెనను భావనను క్రమక్రమముగా దృఢపరచుకొన్నచో క్షుద్రమును మలినమును అయిన నీ జీవితము దివ్యమును సుందరమును అగును.

48

కొంచెమైనను మధురమే

పత్రం, పుష్పం, ఫలం, తోయం – ఇందేదైనను భక్తిభరితమైనచో చాలును. ఎంతగా పూజించినాడవు? ఎంత యిచ్చినాడవు? – అనునది కాదు ప్రశ్న. ఏ భావనతో ఇచ్చినాడవనునదే ముఖ్యము. ఒకసారి ఒక ప్రొఫెసరుతో శిక్షణశాస్త్ర సంబంధమైన చర్చ వచ్చెను. మా యిద్దరి అభిప్రాయములును కలియలేదు. చివరకు అతడు, "నేను పదునెనిమిదేండ్లనుండి ఈ పని చేయుచున్నాడను తెలియునా?" అన్నాడు. వాదనలో న న్నోడింపవలసిన వాడాయన. కాని అట్లుచేయక నే నిన్నిసంవత్సరములనుండి

అధ్యాపకత్వము నిర్వహించుచున్నాడ నని పలికినప్పుడు వినోదమునకు నే నిట్లంటిని – "ఎద్దు పదునెనిమిదేండ్లనుండి గానుగను త్రిప్పుచున్నంతమాత్రమున దానికి యంత్రశాస్త్ర జ్ఞాన మబ్బునా? శాస్త్రజ్ఞానము వేరు; గంతలు కట్టుకొని గానుగ త్రిప్పుట వేరు. అల్లే శిక్షణశాస్త్రజ్ఞుడు వేరు; శిక్షణ విధానమును గుడ్డిగ ప్రయోగించువాడు వేరు. జీతముకొఱకు పని చేయువానికి పదునెనిమిది సంవత్సరములలోకూడ బుద్ధికి పొడకట్టని విషయము శాస్త్రజ్ఞునికి ఆరుమాసములలోనే అనుభవసిద్ధమగును. ఇంతకాలము తానుపని చేసితినని చెప్పుట కొఱకు ఆ ప్రొఫెసరు తన నెరసిన గడ్డమును నాకు చూపి నందువలన ప్రయోజన మేమి? గడ్డమువలన సత్యము రుజువు కాగలదా? ఈ విధముగనే "పరమేశ్వరుని యెదుట మహా నైవేద్యమును ఎంత పెద్ద రాశిగా పోసితిని!" అనుదానిలో మహత్త్వము లేదు. పేరు, ఆకారము, పెట్టినడబ్బు కాదు లెక్కకు వచ్చునది; భావన ప్రధానము. ఏది, యెంత అర్పించితి ననునది కాదు ప్రశ్న. ఏ భావనతో చేసితి ననునదే ముఖ్యము. గీతలో మొత్తము ఏడువందల శ్లోకములున్నవి. కాని పదేసివేల శ్లోకములున్న గ్రంథములుకూడ ఉన్నవి. వస్తువుయొక్క ఆకారము పెద్దదైనంతమాత్రమున దాని యుపయోగముకూడ ఎక్కువగ నుండునని చెప్పలేము. వస్తువులోనున్న తేజస్సెంత, సామర్థ్యమెంత? అనియే చూడవలె. జీవితములో మొత్తమెన్నిపనులు చేసితి మనుటలో లేదు గొప్పతనము. ఈశ్వరార్పణబుద్ధితో ఒక్కపని చేసినను, అదొక్కటే మనకు కావలసినంత అనుభవమును

లాభమును ఇచ్చును. పండ్రెండేండ్లలోకూడ మనకు కలుగ జాలని అనుభవము ఒక్క పవిత్రక్షణములోకలుగుచుండును

సారాంశమేమనగా, నిత్యమునుచేయు సామాన్య కార్యములన్నిటిని ఈశ్వరార్పణము చేయుటవలన జీవితమునకు సామర్థ్యము కలుగును. మోక్షము చేజిక్కును. కర్మ చేయుచు ఫలమును త్యజింపక దాని నీశ్వరార్పణముచేయుట రాజయోగ మగును. ఇది కర్మయోగముకంటెనుగూడ ఒక అడుగు ముందునకు పోవును. "కర్మచేయుము, ఫలమును ఆశింపకుండ వదలిపెట్టుము" అని కర్మయోగ మనును. దీనితో కర్మయోగము ఆగిపోవును. ఇక రాజయోగము చెప్పిన దిది—"కర్మ ఫలమును వదలకుండ సమస్తకర్మలను ఈశ్వరార్పణముగా చేయుము. నిన్ను ముందునకు తీసికొని వెళ్లు సాధనసామగ్రియైన పుష్పము లివి. వానిని ఆ మూర్తికి సమర్పింపుము". ఒకవైపున కర్మ, రెండవవైపున భక్తి—ఈ రెంటిని కలిపి జీవితమును సుందరముగ చేసికొనుచు పొమ్ము. ఫలమును త్యజింపకుండ దానిని భగవంతునితో జోడింపుము. కర్మయోగములో వదలిపెట్టిన ఫలము రాజయోగములో జోడింపబడుచున్నది. విత్తనములు నాటుటలోను, విసరివేయుటలోను భేదమున్నది. నాటినవి కొంచెమైనను పెక్కురెట్లుగ ఫలించును. విసరి పారవేసినవి ఊరక నష్టమైపోవును. ఈశ్వరుని కర్పించిన పనులు నాటినగింజల వంటివి. వానివలన జీవితము ఆనందమయమగును. మిక్కిలి పవిత్రమగును.

గీతా ప్రవచనములు

పదియవ అధ్యాయము

విభూతి చింతనము

49

గీతయొక్క పూర్వార్ధముపై దృష్టి

మిత్రులారా!

గీతయొక్క పూర్వార్ధము పూర్తియైనది. ఉత్తరార్ధములో ప్రవేశించుటకుముందు పూర్తియైన అధ్యాయముల సారాంశము చూచుకొనుట మంచిది. మోహనాశనము, స్వధర్మ ప్రవృత్తి – ఇవి గీతయొక్క ప్రథమాధ్యాయములో చెప్పబడిన అంశములు. జీవితముయొక్క ముఖ్య సిద్ధాంతములగు కర్మయోగము, స్థితప్రజ్ఞ దర్శనము– రెండవ అధ్యాయములోని విషయములు. మూడవ, నాల్గవ, అయిదవ అధ్యాయములలో కర్మ, వికర్మ, అకర్మల సమస్య పరిష్కరింపబడినది. కర్మయనగా స్వధర్మాచరణ. బాహ్యముగ జరుగు స్వధర్మాచరణమును బలపరచు మానసిక కర్మయే వికర్మ. కర్మ వికర్మలు రెండును ఏకరూపమై చిత్తశుద్ధి కలిగినప్పుడు మాలిన్యమంతయు నిర్మూలమయిపోవును వాసనలు క్షీణించును, వికారములు శాంతించును, భేద

భావము నశించును. అప్పుడు అకర్మదశ కలుగును. ఈ యకర్మదశ రెండువిధములుగ చెప్పబడినది. ఒకవిధము: రేయుంబగలు కర్మనాచరించుచు సైతము లేశమాత్రమేని ఆచరింపనివానివలె నుండునట్టి స్థితి. దీనికి విరుద్ధమైనది రెండవవిధము: ఏకర్మనేని ఆచరింపకయే నిరంతరమును ఆచరించువానిస్థితియిది. ఈ రెండుమార్గములద్వారా అకర్మదశ పరిపక్వస్థితిని పొందును. ఈ రెండును వేరువేరుగ కనబడుచున్నను పూర్ణరూపములోనొకటే. అవి కర్మయోగము, సన్యాసము అని రెండుగ చెప్పబడినను ఆ రెంటి సారము మాత్ర మొకటే. అకర్మదశయనునది అంతిమలక్ష్యము, చివర మజిలీ. ఈ స్థితినే మోక్షమన్నారు. ఈ విధముగ మొదటి అయిదు అధ్యాయములలోను జీవితశాస్త్రార్థమంతయు పూర్తియైనది.

తరువాత అకర్మయను లక్ష్యమును చేరుటకుగాను అనేక వికర్మమార్గములు ఆరవ అధ్యాయములో చెప్పబడినవి. మానస్సును పరిశుద్ధమొనర్చుటకు అవలంబించు తపస్సాధనలలో ముఖ్యమైనవి కొన్ని ఇందు పొందుపరుపబడినవి. ఈ యధ్యాయములో చిత్తైకాగ్రతకొఱకు ధ్యానయోగ మవసరమనిచెప్పి దానికి అభ్యాస వైరాగ్యములు సహకారులుగ నిరూపింపబడినవి. ఏడవ అధ్యాయములో విశాలమైన భక్తి ఉత్కృష్టసాధనగ చెప్పబడినది. నీ విశ్వరునియొద్దకు ప్రేమభావముతో వెళ్లు, జిజ్ఞాసువుగా వెళ్లు, లేదా విశ్వకల్యాణము నిమిత్తము వ్యాకులుడవై వెళ్లు, లేక వ్యక్తిగత వాంఛ

లతో వెళ్లు—ఏ యుద్దేశముతోనైనను ఒక్కసారి ఆయన దర్బారులోనికి వెళ్ళితీరుము. ఈ విషయమును పురస్కరించుకొని ఈ యధ్యాయమునకు 'ప్రపత్తియోగము' అనగా ఈశ్వరుని శరణుచొచ్చుటకు ప్రేరేపించు యోగము' అని నేను పేరుపెట్టితిని. భగవానుడు ఏడవ అధ్యాయములో ప్రపత్తియోగముచెప్పి ఎనిమిదవ అధ్యాయములో 'సాతత్య యోగము'ను బోధించెను. నేను చెప్పుచున్న ఈ పేర్లుపుస్తకములో మీకు కనబడవు. నా సాధనకుపయోగపడిన పేర్లను నే నీ యధ్యాయములకు పెట్టితిని. సాతత్యయోగ మనగా సాధనను అంత్యకాలమువరకును అవిరామముగా నడపుచుండుట. నీవు నిశ్చయించుకొని త్రొక్కిన మార్గములోనే ఆగకుండ ముందునకు సాగిపోవలెను. సాధనను కొన్నిదినములిట్లు సాగించి కొన్నిదినములు వదలినచో గమ్యమును జేరవలెనను ఆశ ఎన్నటికిని నెరవేరదు. విసుగుచెంది నిరాశతో "ఇంకెన్నాళ్లీ సాధన?"అని మాత్రము ఎన్నడును తలపరాదు. ఫలము సిద్ధింపనంతవరకు సాధనను సాగించుచునే యుండవలె.

ఇట్లు సాతత్యయోగమును పరిచయముచేసి తరువాత తొమ్మిదవ అధ్యాయములో మిక్కిలిసరళమై, జీవిత స్వరూపమునే మార్చివేయు ఒక విషయమును భగవంతుడు చెప్పినాడు. అదే రాజయోగము. ఋణఋణమును చేయు కర్మలనన్నిటిని కృష్ణార్పణము చేయుమని తొమ్మిదవ అధ్యాయము చెప్పుచున్నది. ఈ యొక్కమాటతో శాస్త్ర సాధనలు, కర్మ వికర్మలు అన్నియు కొట్టుకొనిపోవును. కర్మ

సాధనలన్నియు ఈ సమర్పణయోగములో మునిగిపోవును. సమర్పణయోగమునే రాజయోగమందురు. ఇక్కడ సాధన లన్నియు సమాప్తమగును. విశాలమును శక్తిమంతమును అయిన ఈ యీశ్వరార్పణసాధన, చూచుటకు అతి సామాన్యముగనున్నను కఠినమైనదే. ఈసాధన ఒకవిధముగ సరళమనికూడ చెప్పవచ్చును. ఏలయన గ్రామీణుడు మొదలుకొని మహాపండితునివరకును విశేష శ్రమలేకుండ దీని నందరును ఇంటియొద్ద కూర్చుండియే చేయవచ్చును. ఇది యింత సులభమైనను దీనిని సాధించుటకు గొప్ప పుణ్యసంస్కారము ఉండవలె.

"అనేక సుకృతోంకాయోగ్-ఇసీసే విఠల్ మే ప్రేమ్"

అనేక జన్మముల పుణ్యసంచయముండిననే ఈశ్వరుని యందు రుచి యుత్పన్నమగును. ఏదైనను కొంచెము కష్టము కలిగినచో కంట నీరుపెట్టుదురు. కాని భగవంతుని నామ ముచ్చరించుచుండగా రెండు కన్నీటి బొట్లైన్నడును రాలవు. దీని కుపాయమేమి? ఒక విధముగ చూచినచో ఈసాధన అతి సుకరమని, మరొకవిధమున చూచిన నతి దుష్కరమని మహాత్ములందురు. నేడు ఈ సాధన చాల కష్టమైనది.

ఈ నాడు జడవాదమను పటలము మన నేత్రములను కప్పివేసినది. అసలు ఈశ్వరు డొకడున్నాడా? అను ప్రశ్నతోనే వాదము ప్రారంభమగును. అత డెక్కడను ఎవరికిని కనబడనే కనబడడు. జీవితమంతయు వికారమయము, విషయలోలము, విషపూరితము అయిపోయినది. ఇప్పుడు

అరితేరిన వేదాంతుల దృష్టికూడ "అందరికిని కడుపునిండ అన్నము దొరకుటెట్లు?" అను విషయమును దాటిపోవుట లేదు. ఇందు వారిదోషమేమియును లేదు. ఎందులకనగా ఈనాడు చాలమందికి తినుటకేమియు లేనిస్థితి యేర్పడినది. ఆహారమే ఈనాటి పెద్ద సమస్య అయినది. ఈ సమస్యా పరిష్కారములోనే, నేడు అందఱబుద్ధియు చిక్కుకొని యున్నది. సాయణాచార్యుడు రుద్రని వ్యాఖ్యాన మిట్లు చేసినాడు—

"బిభుఱ్ఱుమాణః రుద్రరూపేణ అవతిష్ఠతే"

ఆకలిగొన్నవారే రుద్రావతారములు. వారి క్షుద్బాధను శమింపజేయుటకొఱకు అనేక తత్త్వబోధలు, రాజశాసనములు ఏర్పడినవి. భిన్నభిన్నవాదములు ఈ తిండి సమస్యనుగూర్చియే బయలుదేరినవి. ఈ సమస్యలలో మునిగి తల పైకెత్తుటకు కూడ సమయము దొరకుటలేదు. పరస్పర కలహములులేకుండ, ప్రసన్నచిత్తముతో, శాంతిసుఖములతో అందరికిని అన్నమెట్లు దొరకునను మార్గములోనేమన భగీరథ ప్రయత్నములన్నియు జరుగుచున్నవి. ఇట్టి విచిత్రమయిన సమాజ మేర్పడుచున్న యుగమునందు ఈశ్వరార్పణవంటి సులువైన పనికూడ అతికష్టమైన దనిన ఆశ్చర్యమేమున్నది? దీనికేమి యుపాయము? ఈశ్వరార్పణయోగము నెట్లు సంపాదింపవలెను? సులువుగా ఎట్లు ప్రయోగింపవలెను? ఈ విషయమునే ఈ రోజున మనము పదియవ అధ్యాయములో చూడబోవుచున్నాము.

50

పరమేశ్వరుని దర్శనమునకు సులువగు మార్గము

బిడ్డలవిద్యాభ్యాసములోఅవలంబించుఉపాయమువంటి ఉపాయమే పరమాత్మను సర్వత్ర దర్శించుటకు ఈ యధ్యాయములో సూచింపబడినది. బిడ్డలకు అక్షరములు రెండు విధములుగ నేర్పుదుము. మొదట పెద్దపెద్ద అక్షరములువ్రాసి నేర్పుదుము. తరువాత ఈ యక్షరములనే చిన్నవిగవ్రాసి నేర్పుదుము. మొదట పెద్దవిగా వ్రాసిన క, గ లనే తరువాత చిన్నవిగా వ్రాయుదుము. ఇదియొకపద్ధతి. మరియొకపద్ధతి కూడ ఉన్నది. అది మొదట సరళాక్షరములను, తరువాత జటిలమైన సంయుక్తాక్షరములను నేర్పుట. సరిగా ఈ విధముగనే పరమేశ్వరుని దర్శించుట నేర్చుకొనవలెను. మొదట స్థూలముగా, స్పష్టముగా కన్పించు పరమేశ్వరుని చూచెదముగాక! సముద్రములు, పర్వతములు మొదలగు మహావిభూతులలో కన్పించు పరమేశ్వరుడు చూచుచుండగనే తేట తెల్లముగా మనకంటబడును. ఈ స్థూలపరమాత్మను మనము తెలిసికొన్నచో జలబిందువులోను రజఃకణములోను నిండియున్నది ఆ పరమాత్మయే యని క్రమశః విదితమగును. పెద్ద 'కా'లోను చిన్న 'కా'లోను భేదమేమియులేదు. స్థూలములోనున్నదే సూక్ష్మములోను ఉన్నది. ఇదియొక పద్ధతి. మరియొకపద్ధతి యేమనగా, పరమాత్మను ముందు సరళరూపములోను తరువాత జటిలరూపములోను చూడగలుగుట. శ్రీరామునిలో ప్రకటితమైన పరమాత్మ సులువుగ మన

స్సులో అంకితమగును. అట్లే ఏ వ్యక్తిలో శుద్ధమైన ఈశ్వర తత్త్వము సహజరూపమున ప్రకటమగునో అట్టివానిని ఈశ్వరాంశసంభూతునిగ మనము వెంటనే గ్రహింప గలుగుదుము. రాముడు సరళాక్షరమువంటివాడు. పరమేశ్వరుని ఈ రూపమును గ్రహించుటలో నేమియు కష్టములేదు. కాని రావణుడు సంయుక్తాక్షరమువంటివాడు. ఈ రూపములో కొంత కలగలుపున్నది. రావణుని తపస్సు, కర్మశక్తి గొప్పవి. కాని ఆ శక్తిలో క్రూరత్వము కలిసియున్నది. మొదట రాముడను సరళాక్షరమును నేర్చుకొనుము. దయ, వాత్సల్యము, ప్రేమభావము కల రాముడు సరళుడైన పరమేశ్వరుడు; ఆతనిని త్వరగా పట్టుకొనవచ్చును. కాని రావణుని యందున్న పరమేశ్వరుని తెలిసికొనుటకు కొంతకాలము పట్టును. మొదట సరళాక్షరములు తరువాత సంయుక్తాక్షరములు. ముందు సజ్జనులలోని పరమేశ్వరునిచూచి, చివరకు దుర్జనులలోని భగవంతుని చూచుట అలవరచుకొనవలె. సముద్రస్థితుడైన విశాల పరమేశ్వరుడే నీటిబిందువులోకూడ ఉన్నాడు. శ్రీరామునిలోని పరమేశ్వరుడే రావణునియందును ఉన్నాడు. స్థూలమందున్నవాడే సూక్ష్మమునందును ఉన్నాడు. సరళరూపములోనున్నవాడే పరుషరూపములోను ఉన్నాడు. ఈ రెండురీతులతో మనము ప్రపంచ మను గ్రంథమును చదువుట నేర్చుకొనవలెను.

ఈ యపారమైన సృష్టియంతయు ఈశ్వరుడు రచించిన కావ్యమువంటిది. మనకంటికి దట్టమైన తెర అడ్డుపడుటచేత

ఈ కావ్యము మనకు అజ్ఞాతమైనది. ఈ సృష్టియను గ్రంథ ములో పరమేశ్వరుడు సర్వత్ర సుందరాక్షరములతో వర్ణింప బడియున్నాడు. కాని అతడు మన కగపడుటలేదు. ఈశ్వర దర్శనమగుటకు ఒక గొప్ప విఘ్నముకలుగుచున్నది. అదే మనగా, సమీపములోనున్న సరళమైన ఈశ్వరరూపమును మనుష్యుడు గ్రహింపలేడు. దూరస్థమైన తీక్ష్ణరూపము వానికి గోచరించుటలేదు. 'నీ మాతయందు పరమేశ్వరుని చూడు' మనిన "ఈశ్వరరూప మింత సరళమా ? అని యందువు. కాని పరమాత్మ తీక్ష్ణరూపములో ప్రత్యక్షమైనచో అ తేజ స్సును నీవు సహింపగలవా ? దూరస్థుడైన సూర్యుడువచ్చి తనకు ప్రత్యక్షము కావలెనని కుంతి మనసార కోరుకొన్నది. కాని అతడు దగ్గరకు రాగానే ఆమెశరీరము కాలిపో నారంభించెను. ఆ తేజస్సు ఆమెకు దుస్సహమయ్యెను. ఈశ్వరుడు తన సర్వశక్తితో మన యెదుటికివచ్చి నిలిచినచో మన మతనిని దర్శించుటకు అసమర్థుల మగుదుము. మాత యొక్క సౌమ్యరూపములో అతడువచ్చినిలిచిన ఆ రూపము మనల నాకర్షింపదు. పేడా-బర్ఫీ జీర్ణముకావు; అచ్చమయిన పాలు రుచింపవు. మందభాగ్యత యొక్కయు, మృత్యువు యొక్కయు లక్షణము లివి. ఇట్టి రోగగ్రస్తమైన మానసిక స్థితి పరమేశ్వర దర్శనమునకు గొప్ప అంతరాయమగును. ఈ మానసికస్థితిని తొలగించుకొనవలసిన అవసర మొంతైనను కలదు. మన సమీపములోనున్న స్థూల, సరళ పరమాత్మను మొదట అవగాహన చేసికొని, తదుపరి సూక్ష్మ జటిల రూపములోనున్న పరమాత్మను గ్రహింతము గాక !

51

మానవునిలోనున్న పరమేశ్వరుడు

ప్రప్రథమమున మనకు కనిపించు పరమేశ్వరునిమూర్తి మనకు దగ్గరగానున్న మనతల్లి. 'మాతృదేవోభవ' అని శ్రుతివాక్యము. పుట్టగానే శిశువునకు ముందు కనిపించునది తల్లికాక మరెవరు ? వాత్సల్యరూపిణియై పరమాత్మయొక్క మూర్తిగనే ఆమె కనిపించును. ఈ మాతృభావమునేవ్యాపింప జేసికొనుచుపోయి, 'వందేమాతర'మని రాష్ట్రమాతను, తరువాత అఖిల భూమాతను పూజించుటగాక । కాని ప్రారంభములో బిడ్డయొక్క అందుబాటులోనికి వచ్చు సర్వోత్కృష్టమైన యీశ్వర ప్రతిమ తల్లియే. మాతృపూజవలన మోక్షము లభించుట అసంభవముకాదు. మాతృపూజయనగా వాత్సల్య స్వరూపుడైన పరమేశ్వరుని ఆరాధనయే. తల్లి నిమిత్తమాత్రమే. పరమేశ్వరుడామెలో తన వాత్సల్యమును చొప్పించి నటన చేయుచుండును. ఇంత మాయామమత లోపలినుండి యెందులకు పుట్టుకొనివచ్చునో ఆతల్లికే తెలియదు. తన వృద్ధత్వములో బిడ్డ తన సేవకు అక్కఱకు వచ్చునను మోహముతో ఆమె వానిని పోషించుచున్నదా ? కాదు, కాదు. ఆమె వానిని కన్నది; ప్రసవవేదన అనుభవించినది. ఆ వేదనయే బిడ్డయెడల ప్రేమోన్మత్తతను కలిగించి, ఆమె హృదయమును వాత్సల్యముతో నింపినది. ఆమె ప్రేమింపకుండ ఉండనేరదు; గత్యంతరములేదు. తల్లి యనగా అపార సేవామూర్తియే. పరమేశ్వరారాధనయొక్క

ఉత్కృష్టరూపము మాతృపూజ. ఈశ్వరుని 'అమ్మా' యనియే సంబోధించుము. 'అమ్మ'కంటె గొప్ప శబ్దము మరెచ్చటనున్నది? 'అమ్మ' స్థూలపదములలో మొదటిది. ఆమెలో ఈశ్వరుని చూచుట నేర్చుకొనుము. తరువాత తండ్రి, గురువు—వీరిలోకూడ దర్శింపుము. గురువు శిక్షణ నిచ్చును. పశువుగా వచ్చినవాని నతడు మానిసినిగ చేయును. ఇదెంత యుపకారము! మొదట తల్లి, తరువాత తండ్రి, తరువాత గురువు, తరువాత దయాళువులైన మహాత్ములు. అత్యంత స్థూలరూపములోనున్న ఈ పరమేశ్వర స్వరూపమును మొదట చూడుము. పరమేశ్వరుడు వీరిలో కనబడనిచో ఇక నెక్కడ కనబడును?

మాత, పిత, గురువు, మహాత్ములు – వీరిలో పరమాత్మను దర్శింపుము. ఆ విధముగనే చిన్నబిడ్డలలోకూడ మనము పరమాత్మను చూడగలిగినచో అందెంతో ఆనందమున్నది. ధ్రువుడు, ప్రహ్లాదుడు, నచికేతుడు, సనక, సనందన, సనత్కుమారులు–వీరందరును బాలురే కదా! కాని వీరికెంత ఉన్నతస్థాన మీయవలెనో పురాణకర్తలకును, వ్యాసాదులకును తెలియలేదు. శుకదేవుడు, శంకరాచార్యులు బాల్యమునుండియే విరాగులు. జ్ఞానదేవుడును అంతే. వీరందరును బాలురే. కాని పరమేశ్వరుడు వీరిలో కనబడినంత పరిశుద్ధరూపముతో మరెక్కడను కనిపించడు. ఏసుక్రీస్తు చిన్నబిడ్డల నెక్కువగ ప్రేమించువాడు. ఒకసారి శిష్యులాయన నిట్లడిగిరి: "మీ రెప్పుడును ఈశ్వరరాజ్యమును

గూర్చి చెప్పుచుందురు కదా! ఆ రాజ్యమున ప్రవేశింపుట కర్హులెవరు?" అప్పు డక్కడ ఒక కుఱ్ఱవాడుండెను. జీససు వానిని బల్లమీద నిలువబెట్టి "ఈ పిల్లవానివలె కాగలవారే ఈశ్వరరాజ్యమున కర్హులు" అన్నాడు. జీససు చెప్పిన ఈ మాట సత్యము. సమర్థ రామదాసు ఒకనాడు పిల్లవాని వలె ఆడుకొనుచుండెను. ఇది చూచి కొందరు పెద్దలకు ఆశ్చర్యము కలిగెను. అందొకడు "ఏమి, మీరీ రోజున ఇట్లు చేయుచున్నారు!" అనగా రామదాసిట్లు జవాబు చెప్పెను.

హుయే శ్రేష్ఠవే జో రహే హూఁ కనిష్ఠ।
రహే జ్యేష్ఠ జో హూఁ రహే చోర్ శ్రేష్ఠ॥

ఏండ్లు పైబడినకొలది మనుష్యునికి కొమ్ములు మొలచును. వికారములు, వాసనలు పెరుగును. ఇక ఈశ్వరస్మరణకూడ ఉండదు. చిన్నబిడ్డల మనస్సులో వికారము లేమియు ఉండవు. వారిబుద్ధి నిర్మలముగ నుండును. అబద్ధమాడరాదని మనము పిల్లలకు బోధింతుము. అబద్ధ మనగా నేమని పిల్లలు ప్రశ్నింతురు. ఉన్న దున్నట్లు చెప్పుటయే సత్యమని సిద్ధాంతము చేయుదుము. "ఉన్న దున్నట్లు చెప్పుట కాక మరొక పద్ధతికూడ ఉన్నదా యేమి?" అని బిడ్డలు సంశయములో పడుదురు. లేనిదానిని ఉన్నట్లుగా చెప్పుట యెట్లు? చతురస్రమును చతురస్రమే అనుము, వృత్త మనకుము అని అన్నచో యిది యుండును. ఇదంతయు చూడగా పిల్లల కాశ్చర్యము కలుగును. విశుద్ధ పరమాత్మ స్వరూప

ములే పిల్లలు. కాని పెద్దవారు వారికి తప్పుడు శిక్షణ నిత్తురు. ఇంతకును ముఖ్యవిషయ మేమనగా తల్లి, తండ్రి, గురువు, మహాత్ములు, బిడ్డలు - వీరిలో మనము పరమేశ్వరుని దర్శింపలేనిచో మరి యెందు దర్శింపగలము? ఈశ్వరాకృతులలో నుత్తమమగు ఆకృతిని వీరియందే చూడగలము. పరమేశ్వరుని ఈ సరళ సౌమ్యరూపములను ముందు తెలిసికొనుము. వీనియందు పరమేశ్వరుడు స్పష్టమైన పెద్ద అక్షరములతో వ్రాయబడియున్నాడు.

52

సృష్టిలోని పరమేశ్వరుడు

ఈ విధముగ మనము మొదట తల్లిదండ్రులవంటి సౌమ్య, పవిత్ర మూర్తులలో పరమేశ్వరుని దర్శింప నేర్చుకొందముగాక! ఇట్లే సృష్టిలోని విశాలములు, మనోహరములునైన రూపములలోకూడ మన మాతనిని దర్శింపవలె. ఆ యుషఃకాలమును, సూర్యోదయమునకు పూర్వము కనిపించు ఆ దివ్య ప్రభను చూడుడు. ఋషులీ యుషోదేవతను గానముచేయుచు పరవశులై నృత్యము చేయుదురు — "ఓ యుషస్సా! నీవు పరమేశ్వరుని సందేశమును తెచ్చు దివ్యదూతవు. మంచుబిందువులలో నీవు స్నానముచేసి వచ్చుచున్నావు. అమృతత్వమునకు నీవు పతాకవు." ఇట్టి భవ్యము, హృదయంగమము నైన వర్ణనను ఋషులుచేసిరి. వైదిక ఋషి యిట్లన్నాడు — "పరమేశ్వరుని సందేశమును

అందించు నీ ద్వారా అతనిరూపము నా కవగాహన కానిచో మరెవరిద్వారా కాగలదు ?" ఇంత సౌందర్యముతో అలంకృతమైన ఉషస్సు మనయెదుట నిలిచియున్నది. కాని మన దృష్టి అంతవరకు పోయినప్పటి మాటకదా !

అల్లో సూర్యుని చూడుడు ! అతని దర్శనము పరమాత్మ దర్శనము వంటిదే. అత డాకాశములో రంగు రంగుల చిత్రములను చిత్రించును. చిత్రకారుడు నెలల తరబడి రంగులకుంచె నాడించి సూర్యోదయ చిత్రమును తయారుచేయును. కాని నీవు ఉదయముననే లేచి పరమేశ్వరుని ఆ కళానైపుణ్యమును ఒక్కసారి దర్శించిచూడుము. ఆ దివ్యకళకును, అనన్య లభ్యమైన ఆ సౌందర్యమునకును సాటి యేమున్నదో చెప్పుము. అయినను దానిని చూచువా రెవరు ? అక్కడ సూర్యభగవానుడు సౌందర్యరాశియై వచ్చి నిలిచియుండగా, ఇక్కడ నీవు మొద్దుదుప్పటి ముఖమునకు కప్పుకొని గుట్టు పెట్టి నిద్రించుచుందువు. "ఓ సోమరీ ! నీ వింకను పండుకొనవలెనని యే కోరుచున్నావు. కాని నేను నిన్ను లేపుదును" అని యతడనును. సూర్యుడు ప్రాణప్రదములైన తన కిరణములను కిటికీలనుండి పంపి ఆ సోమరిని లేపును.

"సూర్య ఆత్మా జగతస్త స్థుషశ్చ'

సూర్యుడు సమస్త స్థావర – జంగములకును ఆత్మ. చరాచరముల కాధారము. ఋషి అతనికి "మిత్ర"డను పేరు పెట్టినాడు.

"మిత్రోజనాన్ యాతయతి బ్రువాణో,
మిత్రోదాధార పృథివీ ముతద్యామ్"

"ఈ మిత్రుడు మానవులను పిలుచుచున్నాడు. వారిని పనిపాటలలో ప్రవేశపెట్టుచున్నాడు. అతడు స్వర్గమును, పృథివిని భరించుచున్నాడు". ఆ సూర్యుడు నిజముగ జీవితమున కాధారము. అతనియంను పరమాత్మను దర్శింపుము.

పావనమైన ఆ గంగను చూడుము. నేను కాశిలో నున్నప్పుడు గంగాతీరమునకు వెళ్ళి కూర్చుండువాడను. రాత్రియే కాంతసమయమున వెళ్లుచుండువాడను. ఆ నదీ ప్రవాహమెంతో సుందరముగను, ప్రసన్నముగను ఉండును. దాని భవ్య, గంభీర ప్రవాహమును, దాని గర్భములో నిమిడియున్న ఆకాశములోని అనంతతారలను చూచి నేను ముగ్ధుడనగువాడను. శంకరుని జటాజూటమునుండి, అనగా హిమాలయమునుండి ప్రవహించుచు రాజ్యములను తృణప్రాయముగ త్యజించి తపస్వులైన రాజాధి రాజుల కాశ్రయమిచ్చిన ఆ గంగను దర్శించి నే నపారమైన శాంతి ననుభవించువాడను. ఆ శాంతిని నే నెట్లు వర్ణింపగలను? అది భాషకతీతము. తన శరీరమంతయు కాకపోయినను, కనీసము అస్థులైనను గంగలో కలియవలెనని హిందువు ఎందులకు కోరుకొనునో నా కప్పుడర్థమయ్యెను. మీరు నవ్వుదురు. నవ్విన వచ్చు నష్టమేమియులేదు. కాని నాకు మాత్ర మీ భావనలుపవిత్రములుగా, స్మరణీయములుగా తోచుచున్నవి. మరణసమయములో గంగాజలము రెండుబొట్లు నోటిలో

వేయుదురు. ఆ రెండు బిందువు లనగా పరమేశ్వరుడే ఆ రూపములో లోపలికి ప్రవేశించుచున్నాడన్న మాట. ఆ గంగను పరమేశ్వరుడనియే భావింపుము. పరమేశ్వరుని కరుణాప్రవాహమే గంగ. నీ సమస్త బాహ్యాంతర మాలిన్యములను ఆ తల్లి కడిగివేయును. పరమేశ్వరుడు గంగామాతలో కాక మరెక్కడకనబడును? సూర్యుడు, నదులు, అలలతో ఘోషించు విశాలసాగరము – ఇవన్నియు పరమేశ్వరుని మూర్తులే.

ఇక గాలినిచూడుడు! అది ఎక్కడినుండి వచ్చుచున్నదో, ఎక్కడికి పోవుచున్నదో ఏమియు తెలియదు. కేవలము భగవంతుని దూతయే అది. భారతదేశములోనికి వచ్చుగాలి కొంత సుస్థిరహిమాలయముమీదుగను, కొంత గంభీరసాగరముమీదుగను వచ్చును. ఈ పవిత్రవాయువు హృదయములనుతాకి, చెవిలో గునగున శబ్దముచేయుచు మనలను మేల్కొల్పును. కాని దాని సందేశమును వినువారెవరు? నీ పేరవచ్చిన నాలుగు పంక్తుల యుత్తరమును జైలరు నీ కీయకపోయినచో నీకు బాధకలుగును. ఓ మంద భాగ్యుడా! ఏమున్న దాయుత్తరములో? పరమేశ్వరుని యొద్దనుండి అనుక్షణమును గాలితోపాటు వచ్చుచున్న ఈ ప్రేమసందేశమును వినుము.

నిత్యకృత్యములలో మనకుపకరించు గోసంపదను తీసికొనుడు. ఆ గోమాతలో నెంతవాత్సల్యము, మమత, ప్రేమ నిండియున్నవి! అది అడవిమేతకుపోయి రెండుమూడు

మైళ్ళ దూరమునుండి తన లేగదూడకొఱకు ఎట్లు పరుగెత్తు కొని వచ్చును! వైదికఋషులు పర్వతములనుండి కలకల ధ్వనితో ప్రవహించు స్వచ్ఛ జలములుగల నదులనుచూచి నిండు పొదుగులతో బిడ్డలకొఱకు అంబాయని పరుగెత్తు కొనివచ్చు గోవులను స్మరణకు దెచ్చుకొనెడువారు. ఆ ఋషి నదినిచూచి ఇట్లనును- ''ఓ దేవీ, క్షీరములవంటి పవిత్రమైన మధురజలములను తీసికొనివచ్చెడు నీవు గో మాతవలె నున్నావు. గోవు ఎట్లు అడవిలోనే స్థిరపడలేదో అట్లే నీవు కూడ పర్వతములలో నుండలేవు. దప్పికగొన్న నీ బిడ్డలను కలిసికొనుటకు నీవు పరుగెత్తుకొనుచు వత్తువు".

"వాశ్రా ఇవ ధేనవః స్యందమానాః"

వాత్సల్యమూర్తియగు గోవు రూపమున భగవంతుడే వచ్చి వాకిట నిలబడి యున్నాడు.

ఆ గుఱ్ఱమును చూడుడు? ఎంత తీవి, ఎంత విశ్వాసము, ఎంత స్వామిభక్తి కలది! అరబ్బులకు గుఱ్ఱము లనిన ఎంత యిష్టము! అరబ్బీవాని కథ మీకు తెలియును కదా! విపత్తులోనున్న ఒక అరబ్బీ తన గుఱ్ఱము నొక వర్తకునకు అమ్మవలె ననుకొని డబ్బుసంచి చేతబట్టుకొని గుఱ్ఱపుసాలకు పోయెను. కాని గుఱ్ఱము గంభీర, ప్రేమ పూర్ణనేత్రములతో వానివంక చూచెను. అతడది చూచి సంచిని క్రింద పారవేసి యిట్లు తలంచెను. "నా ప్రాణము పోయినను సరే! నేను గుఱ్ఱమును మాత్రము అమ్మను. ఏమి కావలసియున్నదో అది యగును. నాకు తిండి లేకపోయినను సరే! గుఱ్ఱమును

అమ్మజాలను. అల్లాయే నన్ను రక్షించును.'' వెన్ను తట్టగానే గుఱ్ఱము ఎంత ప్రేమతో సకిలించును! దాని జూలెంత అంద మైనది! గుఱ్ఱములో నిజముగ అమూల్యమైన గుణము లున్నవి. సైకిలులో నే మున్నది? గుఱ్ఱమునకు మాలిష్ చేయుము. అది నీకు ప్రాణము నిచ్చును, నీకు మిత్రమై యుండును. నా మిత్రు డొకడు గుఱ్ఱపుస్వారి నేర్చుకొను చుండెడివాడు. గుఱ్ఱము వానిని పడవేయుచుండెను. అది తన్నెక్కనిచ్చుటలేదని అతడు నాతో చెప్పెను. అప్పుడు నే నిట్లంటిని – "గుఱ్ఱము నెక్కుటకు మాత్రము తయారగు చున్నావు. కాని దాని సేవ యేమైనను చేయుచున్నావా? సేవ చేయువాడు మరొకడా, నీవారి చేయువాడవు నీవా? అ దెట్లు సాగును? దానికి స్వయముగ దాణా పెట్టుము, నీరు పెట్టుము, మాలిష్ చేయుము. తరువాతస్వారిచేయుము." అత డట్లే చేసెను. తరువాత కొన్నాళ్లకు నన్ను కలిసికొని గుఱ్ఱము తన్ను పడవేయుటలేదని చెప్పెను. గుఱ్ఱము పర మేశ్వర స్వరూపము. అది భక్తుని ఎందులకు పడవేయును? వాని భక్తినిచూచి అది సాధువగును. వీడు భక్తుడౌనా కాడా యని అది పరిశీలించును. కృష్ణభగవానుడు స్వయ ముగా గుఱ్ఱములకు మాలిష్‌చేయువాడు. దాణాతన యొడిలో వేసికొని తెచ్చి తినిపించువాడు. గుట్టలుగాని పిల్లకాలువలు గాని అడుసుగాని అడ్డుతగిలినచో సైకిల్ ఆగిపోవును; కాని గుఱ్ఱము దుమికి దాటును. సుందరము ప్రేమమయము అయిన గుఱ్ఱము పరమేశ్వరుని మూర్తికాక మరియేమి?

ఇక సింహమును చూతము. బరోడాలో నేనున్నప్పుడు తెల్లవారుజామున దాని గర్జన నాకు వినిపించెడిది. రమ్యమైన దాని గంభీరధ్వని విని నా హృదయము కదలిపోయెడిది. అపుడు గర్భాలయములో శబ్దము ప్రతిధ్వనించినట్లుండెడిది. ఏమి! దాని హృదయగర్భమునుండి వెలువడు ఆ గంభీరగర్జన! ఏమి! దానిముఖముమీది ధీరోదాత్తమైన ఆ భవ్య నిర్భయ ముద్ర! ఏమి! దాని రాజఠీవి, రాజవైభవము! వీటు వింజామరవంటి ఆ సుందరమైన జూలేమి! పార్శ్వంలోనుండెడిది ఆ సింహము. దాని కక్కడ స్వేచ్ఛలేదు; బోనులో ఇటు నటు తిరుగుచుండెడిది. దాని చూపులో క్రూరత్వ మేమాత్ర మును కనిపించదు. ప్రపంచమునుండి తనకేమియు భయము లేదన్నట్లు దాని రూపము, దృష్టి కరుణతో నిండియున్నవి. తనలో తాను నిమగ్నమైనట్లు కనబడినది దాని చూపు. సింహము నిజముగ పరమేశ్వరుని పవిత్ర విభూతులలో నొకటి యని అనిపించును. నా బాల్యములో "ఆండ్రొకిల్సు — సింహము" అను కథను చదివియుంటిని. అదెంత రమ్యమైన కథ! ఆకలిదప్పులతోనున్న ఆ సింహము వెనుకటి కృతజ్ఞ తను జ్ఞప్తియం దుంచుకొని ఆండ్రొకిల్సునకు మిత్రమై అతని పాదమును నాక మొదలుపెట్టెను. ఇందలి రహస్యమేమి? సింహములోనున్న పరమేశ్వరుని ఆండ్రొకిల్సు దర్శించె నన్న మాట. శివునియొద్ద ఎప్పుడును సింహముండును. సింహము భగవంతుని దివ్యవిభూతి.

పెద్దపులివలని ఆనందము మాత్రము ఏమంత తక్కువదా? దానిలోకూడ ఈశ్వరతేజస్సు హెచ్చుగా వ్యక్త

మగుచుండును. దానితో స్నేహముచేయుట అసంభవము కాదు. భగవానుడు పాణిని అరణ్యములో శిష్యులకు పాఠము చెప్పుచు కూర్చుండెను. ఇంతలో వ్యాఘ్రమొకటి వచ్చెను. శిష్యులు భయపడి వ్యాఘ్రము, వ్యాఘ్రమని కేకలు పెట్టిరి. పాణిని, "సరే, అసలు వ్యాఘ్రమనిన నేమో తెలియునా? 'వ్యా జిఘ్రతీతి వ్యాఘ్రః' అనగా దేని ఘ్రాణేంద్రియము తీవ్రమైనదో అది వ్యాఘ్రము" అన్నాడు. బాలురకు దానిని చూచి కొంత భయము కలిగియుండవచ్చును. కాని భగవానుడగు పాణినికి అది నిరుపద్రవమైన ఆనందమయమైన శబ్దమాత్రమే యయ్యెను. పెద్దపులిని చూచి ఆయన వ్యాఘ్ర శబ్ద వ్యుత్పత్తి చెప్ప నారంభించెను. పులి పాణినిని తిని వేసెను; కాని తినివేసినంతమాత్రమున నే మయినది? పాణిని శరీరముయొక్క మధురమైన వాసన దానికి తగులగానే అది యతనివైపు తిరిగెను. కాని పాణిని పారిపోలేదు, ఎందుచేతనగా అతడు శబ్దబ్రహ్మను ఉపాసించువాడు. అతనికి సర్వమును అద్వైతమయ మయ్యెను. వ్యాఘ్రములోకూడ అతడు శబ్దబ్రహ్మనుభూతినే పొందెను. పాణినిలోని ఈ మాహాత్మ్యమువలననే అతనిపేరు వచ్చినచోట నెల్ల పూజ్య భావముతో "భగవానుడు పాణిని"అని భాష్యము లుల్లేఖించి నవి. అవి పాణినియెడల అత్యంత కృతజ్ఞతను వెలిపుచ్చినవి.

అజ్ఞానాంధస్య లోకస్య, జ్ఞానాంజన శలాకయా।
చక్షురున్మీలితం యేన, తస్మై పాణినయే నమః ॥

ఈ విధముగ భగవానుడు పాణిని వ్యాఘ్రమునందు

పరమాత్మను దర్శించెను. జ్ఞానదేవు డిట్లన్నాడు—

ఘర్ ఆవే కోయం న స్వర్గ, యూ ఆ ఛడే వ్యాఘ్ర।
తో భీ ఆత్మబుద్ధిమే భంగ, నహోూ కభీ॥

మహర్షి పాణిని స్థితి యిట్టిది. వ్యాఘ్ర మొక దైవ విభూతి యని ఆయన తెలిసికొన్నాడు.

ఇట్టిదే పాముకూడ. పా మనిన మనుష్యులకు చాల భయము; కాని అది పరిశుద్ధిపట్ల కేవలము బ్రాహ్మణుని వంటిది. దానిది ఎంత స్వచ్ఛత, ఎంత సౌందర్యము! ఏ పాటి మాలిన్యమునేని అది సహించదు. అపరిశుద్ధులగు బ్రాహ్మణు లెందరో ఉన్నారు. కాని మురికితోనున్న పాము నెప్పుడైన ఎవరైన చూచినారా? పాము ఏకాంతవాసియైన ఋషి వంటిదే! అది నిర్మలముగను, మనోహరముగను మెరయు హారము వంటిది. దానికి మనము భయపడవలసిన పని యేమున్నది? మన పెద్దలు దానిని పూజింపవలెనని చెప్పి నారు. హిందూధర్మములో మూఢాచారము లేవేవి యున్నవో మీకు తెలియును. కాని నాగపూజావిధానము అట్టిదికాదు. అది మాత్రము శుద్ధమైనది. నా బాల్యములో మా యమ్మకు గంధముతో పామువిగ్రహమును చేసిపెట్టుచుండువాడను. "అమ్మా, బజారులో మంచి విగ్రహము దొరకును" అని నే ననగా "అది నాకక్కరలేదు; పనికిమాలినదది. నాపిల్ల వాడు చేసినదే నాకు బాగుగా నుండును" అని ఆమె యనెడిది. అప్పుడామె నాగపూజ చేసికొనెడిది. ఇది పిచ్చి తనమా? మీరే యోజింపుడు. సర్పము శ్రావణమాసములో

మన యింటికి అతిథిగా వచ్చును. వర్ష కాలములో పాపము ! దాని యిల్లంతయు నీటితో నిండిపోవును. అప్పుడదేమి చేయవలె ? ఎక్కడనో దూరమున ఏకాంతముగ వసించు ఆ ఋషి ఎవరికిని ఇబ్బంది కలిగించకుండ తనదారిని తాను వచ్చి ఏ యింటిచూరుననో, ఏ వాసముల చాటుననో చాల తక్కువచోటు నాక్రమించి పడియుండును. కాని మనము బడిత తీసికొని దానివెంటబడుదుము. సంకటగ్రస్తమై యింటికివచ్చిన అతిథిని చంపవచ్చునా ? సెయింట్ ఫ్రాన్సిస్‌నుగూర్చి ఒక కథ చెప్పుదురు. అతనికి అడవిలో పాము కనిపించినప్పుడు, "రా, నాయనా, రా" అని యతడు ప్రేమతో పిలుచువాడట. సర్పములు అతనియొడిలో ఆడుచు శరీరమందంతటను సొగసుగ తిరుగుచుండెడివి. దీనిని వట్టి మాట యనకుడు. ప్రేమలో ఈ శక్తియున్నది. పాము విషమంతువందురు. కాని మనుష్యుడంతకంటె తక్కువ విషము కలవాడా ? పాము కరచినను ఎప్పుడో ఒకసారి కరచును. కాని అదెప్పుడును పనిగట్టుకొని కరవదు. పాములు నూటికి తొంబది విషములేనివే. మీ పొలములలో పంటను అవి రక్షించును. పంటను పాడుచేయు అనేక కీటకములను, జంతువులను పాము తినివేయును. ఇట్టి యుపకారి, ఏకాంత ప్రియము, పరిశుద్ధము, తేజస్వియైన సర్పము భగవంతుని రూపమే. మన దేవతాగణములో అక్కడక్కడ సర్పము తప్పక వచ్చుచునేయుండును. విఘ్నేశ్వరునికి పామే మొల త్రాడయినది. శంకరునికంఠమున పాములు చుట్టవేసికొని యుండును. విష్ణుమూర్తి శేషతల్పముమీదనే పరుండును.

దీనిలోని మాధుర్యమును చూడుడు. దీనికెల్లను భావార్థమిది : సర్పముద్వారా ఈశ్వరుని మూర్తి వ్యక్తమగుచున్నది. సర్పములోనున్న పరమేశ్వరునితో పరిచయము చేసికొనుము.

53

సృష్టిలోని పరమేశ్వరుడు : మరికొన్ని యుదాహరణలు

ఇట్టి యుదాహరణ లింకను ఎన్నిటినీయను ? విషయమును తెలియజెప్పుచున్నాను. రామాయణ సారమంతయు ఇట్టి రమణీయమైన కల్పనలలోనే యున్నది. రామాయణములో తండ్రికొడుకులప్రేమ, తల్లిబిడ్డలప్రేమ, అన్నదమ్ముల ప్రేమ, సతీపతులప్రేమ – ఇవన్నియు ఉన్నవి. కాని నాకు రామాయణము ప్రియమగుట వీనివలనకాదు. రాముడు వానరులతో మైత్రిచేసికొనుటవలననే అది నాకు ప్రియమైనది. వానరులు నాగజాతికి చెందినవారని ఈనాటికిని వాడుక. పురాతన విషయములను విమర్శించుట ఐతిహాసికులపని. వానిని నేను విమర్శించను. రాముడు సాధారణ వానరములతోనే మైత్రిచేసికొన్నాడనుకొనుడు. అందు అసంభవమేమున్నది ? రాముడు వానరులు మిత్రులగుటలోనే నిజముగ రాముని రామత్వము రమణీయత్వము ఉన్నవి. కృష్ణునికిని గోవులకునుగల సంబంధమును ఇట్టిదే. కృష్ణుడు పూజింపబడుట ఈ భావన నా ధారముచేసికొనియే. శ్రీకృష్ణుని చిత్రపట మేదిచూచినను, అందు కృష్ణుని

తోపాటు గోవులుకూడ ఉండును. "గోపాలకృష్ణ! గోపాల కృష్ణ!" అని యందుము. కృష్ణునినుండి గోవులను వేరు చేసిన, ఇక కృష్ణునిలో మిగులున దేమున్నది? రామునినుండి వానరులను వేరుచేసినచో ఇక రాముడెక్కడ? వానరులలో కూడ రాముడు పరమాత్మను దర్శించినాడు; వారితో ఘనిష్ఠమైన ప్రేమసంబంధమునునెలకొల్పుకొన్నాడు. రామాయణములోని కీలకమిది. దీనిని మీరు విస్మరించినచో రామాయణములోని మాధుర్యమును మీరు చవిచూడ లేరు. తండ్రి - కొడుకుల, తల్లి - బిడ్డల ప్రేమ ఇతరమైన యితిహాసములలోకూడ కనబడును. కాని నరవానరులమధ్య ఇట్టి మధురమైత్రి ఒక్క రామాయణములోనే దర్శింప గలము. మరెక్కడను చూడలేము. వానరులుకూడ దైవ స్వరూపులే యని రామాయణము రుజువుచేయుచున్నది. వానరులనిన ఋషులకు చాల సంతోషము. రామటేక్ మొదలు కృష్ణాతటమువరకును కాలు క్రిందపెట్టకుండ వానరములు చెట్టునుండి చెట్టునకు దుముకుచు, ఆడుచు తిరుగుచు ఉండెడివి. ఈవిధముగ దట్టమైన ఆ వనములను, అక్కడ ఆటలాడెడు వానరములను చూచినపుడు సహృదయులైన ఋషులలో ఆనందముకలిగి కవిత్వ ముత్పన్నమయ్యెను. ఉపనిషత్తులు బ్రహ్మాయొక్క నేత్రములను వర్ణించుచుకోతుల కన్నులను ఉపమానముగ నిచ్చినవి. కోతుల కన్నులు అతి చంచలముగ నలుదిక్కులను చూచుచుండును. బ్రహ్మనేత్ర ములుకూడ ఇట్లే యుండవలె. దృష్టి నొకచోటనే నిలిపి యుంచుటవలన బ్రహ్మాయొక్క పని నెరవేరదు. మనము

ధ్యాననిమగ్నులమై ఒక చోట కూర్చున్నను కలిగెడి యిబ్బంది లేదు. కాని ఈశ్వరుడే ధ్యానములో మునిగియున్న చో సృష్టి యేమి కావలె? కనుక అందఱి క్షేమమును కనిపెట్టు బ్రహ్మ నేత్రములే కోతుల కనులలో ఋషులకు కనిపించెను. వానరు లలో పరమాత్మను దర్శించుట నేర్చుకొనుము.

నెమిలిని చూడుడు! మహారాష్ట్రములో నెమిళ్లెక్కు వగా లేవు; కాని గుజరాతులో చాలనున్నవి. నేను గుజరా తులో నున్నప్పుడు ప్రతిదినమును పది పండ్రెండు మైళ్లు తిరిగి వచ్చుట నా కలవాటు. అప్పుడు నాకు నెమిళ్లు కనిపించెడివి. ఆకాశము నల్లని మేఘములతో నిండి వర్షము కురియు ముందు నెమిలి తనధ్వనిని వినిపించును. హృదయమునుండి పెకల్చుకొని వచ్చు ఆ కేక సొగసు విన్నవారికే తెలియును. మన సంగీతశాస్త్రమంతయు ఈధ్వనినుండియే నిర్మాణ మయినది. మయూరధ్వనియే "షడ్జము-షడ్జంరౌతి". మొదటి షడ్జము మనకు నెమిలినుండియే లభించినది. దీనినే పెంచి, తగ్గించి ఇతరస్వరముల కూర్చితిమి. మేఘముల వైపు నిగుడ్చు దానిదృష్టి, ఆ గంభీరధ్వని, మేఘగర్జనను వినినంతనే గొడుగు వలె విప్పుకొను దాని పింఛము ఎంత సొగసుగా నుండును! ఆహా! ఆ పింఛముయొక్క సౌందర్యము ముందర మను ష్యుని దర్పమంతయు చూర్ణమైపోవును. రాజాధిరాజులుకూడ అలంకారములు చేసికొందురు. కాని నెమిలిపింఛముముందర అవన్నియు ఎందులకు? ఎట్టి భవ్యదృశ్యమది? లెక్కలేని ఆ కన్నులు, రంగు రంగుల ఆ దీప్తి, అద్భుతమును, సుందర

మును అయిన ఆ ముద్ర, రమణీయ రచన, ఆ చక్కని నగిషీ ఒక్కసారి ఆ పింఛమును చూడుడు. పరమాత్మను కూడ అందులోనే చూడగలరు. సృష్టియంతయు ఈ విధముగనే అలంకృతమైయున్నది. పరమాత్మ సర్వత్ర దర్శనమిచ్చుచునేయున్నాడు. కాని అతనిని చూడలేని మంద భాగ్యులము మనమే.

"ప్రభుకా సర్వత్ర సుకాల్, అభాగీకోహై అకాల్" అని యన్నాడు తుకారాము. మహాత్ములకు సర్వత్ర సుభిక్షమే. కాని అభాగ్యులమైన మనకు అన్నిచోట్ల దుర్భిక్షమే.

వేదములలో అగ్నియుపాసన చెప్పబడినది. అగ్ని నారాయణ స్వరూపము. ఎట్టి దేదీప్యమాన మూర్తియది! రెండు కట్టెలరాపిడితో అది ప్రత్యక్షమగును. వానిలో అది యెక్కడ దాగియున్నదో ఎవరికి తెలియును? ఏమి యీ వేడిమి! ఆ తేజస్సు! వేదధ్వని అగ్నియుపాసనతోనే ప్రారంభమయ్యెను.

"అగ్నిమీళే పురోహితం యజ్ఞస్య దేవ మృత్విజమ్
హోతారం రత్నధాతమమ్"

ఏ యగ్నియొక్క ఉపాసనతో వేద మారంభమైనదో ఆ యగ్ని నొకసారి చూడుడు. అగ్నిజ్వాలలను చూచినప్పుడు జీవాత్మనుభవించు ఒడుదొడుకులు నాకు స్ఫురణకువచ్చును. ఆ జ్వాలలు ఇంటియందలి ప్రొయ్యిలోనివైనను, దావాగ్ని లోనివైనను సడి చప్పుడులేని విరాగి యింటివలె నుండవు ఆ జ్వాలలున్నచోటులందెల్ల వానిసందడి ఉండనే యుండును.

అవి అంతకంతకు పైకెగసిపోవలెనని ఆరాటపడుచుండును. 'ఈథర్' వలనను, గాలియొత్తిడివలనను ఈ జ్వాలలు కదలుచుండునని మీలో విజ్ఞానవేత్తలు అందురు. కాని నేనిచ్చు అర్థమిది : పైనున్న పరమాత్మను, తేజోరాశియైన ఆ సూర్యనారాయణుని కలియుటకు అవి నిరంతరమును పైకెగయుచుండును. అంటుకొన్నది మొదలు ఆరిపోవువరకును వాని యాతురత అట్లే యుండును. సూర్యుడు అంశి, ఈ జ్వాలలు అంశలు. అంశ అంశిలోకలియుటకు తహతహపడుచుండును. మంటలారిపోయినప్పుడే వాని యాతురత నిలిచిపోవును; అంతవరకును ఆగదు. సూర్యునికి తామెంతో దూరమున నున్న విషయమే యీ జ్వాలలకు తెలియదు. శక్తికొలది క్రిందినుండి పైకి లేచుచుండుటయే వానికి తెలియును. అగ్నియనగా ఈ విధముగ జాజ్వల్యమానమైన వైరాగ్యమును ప్రకటించు జ్వాలయే యని తోచును. ఇంచుచేతనే 'అగ్నిమీళే' అనునది వేదములో మొదటిధ్వనియైనది.

ఆ కోయిలను నే నెట్లు మఱవగలను? ఎవరి నది పిలుచుచున్నది? వేసవిలో నదులును కాలువలును ఎండిపోయినను వృక్షములు క్రొత్తగ చిగుర్చుచుండును. వృక్షముల కింత వైభవమును సమకూర్చినవా రెవరు? ఆ వైభవదాత యెక్కడ నున్నాడు! అని యది అడుగుటలేదుకదా! ఎంత మధురధ్వని ఆ కోయిలది! హిందూధర్మములో కోయిలపేరిట ఒక వ్రతవిధానమే యున్నది. కోకిలధ్వనిని వినకయే భుజింప మని స్త్రీలు వ్రతము పట్టుదురు. కోకిలరూపములో

పరమాత్మను దర్శించుటను ఈ వ్రతము నేర్పును. కోయిల యెంతో సుందరముగ గానము చేయును. ఉపనిషత్తునే గానము చేయుచున్నదా యన్నట్లుండును. దాని మధురమైన వాణి వినబడునే కాని అదిమాత్రము కనబడదు! అంగ్లకవి వర్డ్సువర్తు దానిని చూచుటకు పిచ్చివానివలె అడవుల వెంట పరుగెత్తును. అంగ్లమహాకవి కోయిలను వెదకబోవును. కాని భారతదేశపు సామాన్యస్త్రీలు కోకిలవాణి వినబడకపోయినచో భోజనమే చేయరు. ఈ కోకిలవ్రతముద్వారా భారత స్త్రీలు మహాకవి పదవిని పొందినారు. కోయిల వినిపించు పరమానందకరమైన మధురధ్వనిలో సుందర పరమాత్మ నిశ్చయముగ అభివ్యక్తమగును.

కోయిల సుందరమైనదా? కాకి పనికిమాలినదా? కాకినిగూడ గౌరవింపుము. కాకి నాకు చాల ప్రియమైనది. దానిది కారునలుపు. తీవ్రమైన ధ్వని. ఆ ధ్వని యేమైన చెడ్డదా? కాదు, అదికూడ మధురమే. రెక్కలు కొట్టుకొనుచు అది వచ్చుచుండుట ఎంత మనోహరముగ నుండును! చిన్నపిల్లల చిత్తమును అదియెంతైనఆకర్షించును. చిన్నపిల్లలు ఇంటిలోపల అన్నము తినరు. బయటివాకిటిలో కాకిని పిచ్చుకను చూపించుచు ముద్దలు తినిపించినచే వారుతిందురు. కాకితో స్నేహముచేయు పిల్లవాడు పిచ్చివాడా? కాడు. వానిలో జ్ఞానము నిండియున్నది. కాకిలో వ్యక్తమగు పరమేశ్వరునితో అతడంతలో లీనమైపోవును. తల్లి అన్నములో పెరుగువేసిపెట్టినను, పాలు పంచదార వేసిపెట్టినను వాని కది రుచింపదు. కాకి, రెక్కలు ముక్కు ఆడించుటలోనే

వాని కానందము కలదు. సృష్టిపట్ల చిన్నపిల్లలకుగల యుత్సాహమును ఆధారముగా చేసికొని 'ఈసబు' తన నీతికథలను రచించెను. ఈసబునకు సర్వత్ర ఈశ్వరదర్శనము కల్లు చుండెడిది. నాకు ప్రియమైన పుస్తకముల పట్టికలో ఈసబు నీతికథలకు తప్పక ప్రథమస్థాన మిత్తును. ఈసబురాజ్యములో రెండుచేతులు, రెండుకాళ్లుగల మానవులుమాత్రమే కాక నక్కలు కుక్కలు కాకులు కప్పలు కుందేళ్లు తోడేళ్లు తాబేళ్లు మొసళ్లు కలవు. ఇవన్నియు సంభాషించుచునవ్వుచు ఉండును. ఇదొక సజీవమైన గొప్ప సమ్మేళనము. ఈ చరాచర సృష్టియంతయు తనతో సంభాషించుచున్నట్లు ఈసబు భావించెను. అతనికి దివ్యదర్శనము లభించెను. రామాయణముకూడ ఈ తత్త్వముమీదనే ఈ దృష్టితోనే రచింపబడినది. తులసీదాసు రాముని బాలలీలలను వర్ణించినాడు. రాముడు అంగణములో ఆడుకొనుచుండును. కాకియొకటి దగ్గరకు వచ్చును. రాముడు దానిని నెమ్మదిగా పట్టుకొనబోవును. కాకి వెనుక వెనుకకు పోవును. చివరకు రాముడు అలసిపోవును. అంతలో అతని కొక ఉపాయము తోచును. రాముడు కొంచెము మిఠాయి దానికి చూపుచు సమీపించును. అది చూచి కాకి మెల్ల మెల్లగా దగ్గరకు వచ్చును. కాకి పరమేశ్వర స్వరూపుమే కనుక తులసీదాసు ఈ వర్ణనకు చాల పుటలు వినియోగించినాడు. రాముని యంశమే ఆ కాకియందును ఉన్నది. రామునికిని కాకికిని గల పరిచయము పరమాత్మకును పరమాత్మకునుగల పరిచయమువంటిదే.

54

దుర్జనులలోకూడ పరమాత్మను చూచుట

సారాంశము: ఈ విధముగ సృష్టిలోని పవిత్రమైన నదులు, పెద్ద పర్వతములు, గంభీర సాగరము, వాత్సల్యమూర్తియగు గోమాత, శ్రేష్ఠమైన గుఱ్ఱము, శౌర్యముగల సింహము, మధురమైన కోయిల, సుందరమైన నెమిలి, స్వచ్ఛమును ఏకాంతప్రియము నగు సర్పము, రెక్కలాడించు కాకి, పై కెగయు అగ్నిజ్వాలలు, ప్రశాంతమైన నక్షత్రములు మొదలగు వివిధరూపములలో పరమేశ్వరుడు నిండియున్నాడు. అతని చూచుట నేత్రములకు అలవాటు చేయువలె. పెద్ద అక్షరములు సరళాక్షరములు మొదటను, చిన్న అక్షరములు సంయుక్తాక్షరములు తరువాతను నేర్చుకొనవలె. సంయుక్తాక్షరములు అడుగడుగునను వచ్చుచునేయుండును. కనుక నవి నేర్చుకొననంతవరకు ప్రగతి లేదు. దుర్జనులు సంయుక్తాక్షరములవంటివారు. కనుక దుర్జనులలోని పరమాత్మనుకూడ చూచుట నేర్చుకొనవలె. రాముడు ఈశ్వరస్వరూపుడని తెలిసికొనగలము. రావణుడుకూడ అంతేయని తెలిసికొనవలె. ప్రహ్లాదుని ఈశ్వరాంశగా ఆమోదించగలము. కాని హిరణ్యకశిపునిగూడ ఆమోదించవలె. వేదములో— "నమోనమః స్తేనానాం పతయే నమోనమః

నమః పుంజిష్టేభ్యోనమో నిషాదేభ్యః"

"బ్రహ్మ దాశా బ్రహ్మదాసా బ్రహ్మైవేమే కితవాః"

ఆ బందిపోటుదొంగల నాయకులకు నమస్కారము.

ఆ క్రూరాత్ములకు, హింసకులకు నమస్కారము. ఈ మోస గాండ్రు, ఈ దుష్టులు, చోరులు అందరును బ్రహ్మస్వరూపులే. వీరందరికిని నమస్కారము.

దీనియర్థమేమి? "సరళోత్తరములను నేర్చుకొన్నారము. ఇక కఠినోత్తరములనుకూడ అవగాహన చేసికొనవలె"నని. కాగ్రెల్ "వీరపూజ"అను గ్రంథమును రచించెను. అందతడు నెపోలియనునుకూడ ఒక వీరునిగ చిత్రించెను. ఈ పాత్ర శుద్ధ పరమాత్మ స్వరూపముకాదు; మిశ్రితరూపము. కాని ఇందు లోని పరమేశ్వరునికూడ మన మవగాహన చేసికొనవలెను. కనుకనే తులసీదాసు రావణుని రామునియొక్క విరోధిభక్తు డన్నాడు. ఈభక్తునిరూపరేఖలు కొంచెము వేరుగానుండును. నిష్పృహోకటవలన కాలు వాచును. కాని దానికి కాపుకాచిన వాపుతీరును. ఇక్కడ రెండుచోట్లను పనిచేసినది ఒకటే వేడిమి. కాని అది భిన్నభిన్నరూపములలో కనబడును. అట్లే రామ రావణుల బాహ్యప్రవర్తనలు వేరువేరుగ కనబడుచున్నను అవి పరమేశ్వరుని రూపములనియే గ్రహింపవలె.

స్థూలము, సూక్ష్మము; సరళము, మిశ్రమము; సరళోత్తరములు, సంయుక్తోత్తరములు అన్నియు నేర్చుకొనుము. చివరకు పరమేశ్వరుడు లేని స్థానమే లేదను అనుభవమును పొందుము. అణు – రేణువులయందున్నవాడుకూడ అతడే. చీమ మొదలు బ్రహ్మాండమువరకు సర్వమును పరమాత్మతోనే నిండియున్నది. సమస్తమును ఒకరకముగనే కని పెట్టి చూచు కృపాళువు, జ్ఞానమూర్తి, వత్సలుడు, సమర్థుడు, పావనుడు, సుందరుడు అయిన పరమాత్మ నలుదిశల సర్వత్ర నిలిచియున్నాడు.

గీతా ప్రవచనములు

పదునొకొండవ అధ్యాయము

విశ్వరూప దర్శనము

55

విశ్వరూప దర్శనముకొఱకై అర్జునుని ఆరాటము

సోదరులారా !

ఈ విశ్వములోని అనంతవస్తువులలో వ్యాపించియున్న పరమాత్మను మన మెట్లు గుర్తింపవలెనో, మన కనుల కగపడుచున్న ఈ విరాడ్రూపమును మన మెట్లు హృద్గతము చేసికొనవలెనో కడచినసారి విపులముగ తెలిసికొన్నారము. మొదట స్థూలము. తరువాత సూక్ష్మము. మొదట సరళము తరువాత జటిలము–ఈ విధముగ సమస్త వస్తువుల లోను భగవంతుని సాక్షాత్కారము చేసికొనవలెనని, ఎడ తెగని అభ్యాసముచే సమస్త విశ్వమును ఆత్మస్వరూపముగ చూచుట నేర్చుకొనవలెనని కడచిన అధ్యాయములో తెలిసి కొంటిమి.

ఈ నాడు పదునొకొండవ అధ్యాయము చూడవలసి యున్నారము. ఈ యధ్యాయములో భగవంతుడు తన

ప్రత్యక్షరూపమును చూపించి తన పరమ కృపారసమును అర్జునునిపై కురియించినాడు. "ప్రభూ! నీ ప్రభావమును పూర్ణముగ ప్రకటించు రూపమును చూడగోరుచున్నాను" అని యర్జునుడు భగవంతుని కోరినాడు. అర్జునుడు కోరినది ఇట్టి విశ్వరూప సందర్శనమే.

'విశ్వము' 'జగత్తు' అను మాటలు మనము వాడుచుందుము. ఈ భూమండలము విశ్వములో నొక చిన్నభాగము. దీనినైనను మనము సరిగా తెలిసికొనలేకున్నారము. ఈ భూమండల మింత విశాలముగ కనబడుచున్నను, సమస్త విశ్వమును దృష్టిలో పెట్టుకొని చూచినచో అది మిగుల అల్పమైనదని గ్రహింపగలుదుము. రాత్రివేళ ఆకాశము వంక కొంచెము దృష్టినిలిపి చూచిన అసంఖ్యాకములైన గోళములు కనబడును. విశాలాకాశమున సుందరములై రంగురంగుల చిన్నచిన్నపూలవలె మినుకుమినుకు మనులక్షలకొలది నక్షత్రముల స్వరూపము మీకు తెలియునా? ఈ చిన్నచిన్న నక్షత్రములు మహాప్రచండమైనవి. వానిలో లెక్కలేనన్ని సూర్యమండలములు ఇమిడియున్నవి. రసమయములు, తేజోమయములు అయి ప్రకాశించు గోళరాసులవి. ఈ యనంతరాసుల లెక్క ఎవరు తేల్చగలరు? వీనికి దరిలేదు, అంతములేదు. మన సాధారణ నేత్రములకే అవి వేలకొలదిగ కనబడును. దుర్బిణితో చూచిన అవి కోట్లకొలదిగ కనబడును. ఇంకను పెద్ద దుర్బిణి యైనచో కనబడు సంఖ్య యింకను పెరుగును. దీని కంతమెక్కడనో,

అదెట్లుండునో తెలిసికొనుట కష్టసాధ్యము. పైని, క్రింద, సర్వత్ర వ్యాపించియున్న అనంతసృష్టిలో ఒక చిన్న భాగమును భూమండల మందుము. కాని ఈ చిన్నదికూడ ఎంతో విశాలమైనదిగా కనబడును.

ఈ విశాల సృష్టి పరమేశ్వరుని రూపముయొక్క ఒక వైపుమాత్రమే. ఇక దాని రెండవవైపు చూతము. అది కాలము. ఇంతవరకు గడచినకాలము ఐతిహాసికముగా ఎంత చూచినను పదివేల సంవత్సరములకు మించదు. భవిష్యత్తు మన ఊహకే అందదు. చారిత్రిక కాలము పదివేల సంవత్సరములైన మన జీవిత పరిమితి నూరేండ్లు దాటుట కష్టము. నిజమునకు కాలమనునది అనాది. అనంతము. కడచిన కాలమునకు హద్దు పద్దులులేవు. ఇక గడవనున్న కాలము మన ఊహ కందనిది. అనంత విశ్వముతో పోల్చిన మనభూమి ఎంత అల్పమో, అనంతకాలములో ఈ పదివేల సంవత్సరములును అంతే. భూతకాలము అనాది. భవిష్యత్తు అనంతము. ఈ కొలదిపాటి వర్తమానకాలము మనము మాటలాడుచుండగనే భూతకాలములోనికి వెళ్ళిపోవును. 'ఇదిగో ఇది వర్తమానకాలము' అని యనుచుండగనే అది భూతకాలములో లీనమైపోవును. ఇట్లు మన వర్తమానకాలము అత్యంత చపలమైనది. ఈ విధముగ కాల మను ఈ మహానది అఖండముగ ప్రవహించుచున్నది. దాని ఆద్యంతములు మనకు తెలియవు. ఈ ప్రవాహముయొక్క అత్యల్పమైన మధ్యభాగము మాత్రము మనకు కనిపించును.

ఈ విధముగ ఒకవైపున విశ్వముయొక్క–ఒకవైపున కాలముయొక్క అనంతత్వము గోచరించుచున్నది. దీనిం బట్టి సృష్టియొక్క అంతము మన ఊహకు అందని విషయ మని తేలుచున్నది. మూడుకాలములలోను, ముల్లోకముల లోను, భూత భవిష్య ద్వర్తమానములలోను, పైని క్రిందను నడుమను, సర్వత్ర వ్యాపించియున్న పరమేశ్వరుని విరా ట్రూపమును ఒక్కసారిగా చూడవలెనను ఇచ్ఛ అర్జునునిలో ఉత్పన్నమయ్యెను. ఈ యిచ్ఛనుండి పదునొకొండవ అధ్యా యము పుట్టినది.

అర్జును డనిన భగవంతునికి చాల ప్రేమ. అది ఎంత ప్రేమయనగా, పదియవ అధ్యాయమున ఏ యే రూపము లలో తన్ను చింతనచేయవలెనో ఆయా రూపములనుగూర్చి భగవంతుడు చెప్పుచు "పాండవులలోని అర్జునునిరూపములో నన్ను స్మరించుము" అని యనును. "పాండవులలో నేను ధనంజయుడను"అని కృష్ణుడు చెప్పును. దీనిని మించిన ప్రేమోన్మత్తత మరెక్కడ నుండును? ప్రేమ యెంత పిచ్చిది కాగలదో తెలుపుట కిది యుదాహరణ. భగవంతునికి అర్జు నునిపైని అపారమైన ప్రీతి. ఆ ప్రేమ ప్రసాదమే పదు నొకొండవ అధ్యాయము. భగవంతుడర్జునునకు దివ్యదృష్టిని ప్రసాదించి, తన దివ్యరూపమును చూడవలెనను అర్జునుని కోరికను సఫలము చేసెను. ఈ విధమున నతడు తన ప్రేమ ప్రసాదమును అర్జునున కందించెను.

56

సూక్ష్మరూపములో సైతము పూర్ణదర్శనము సిద్ధించును

ఆ దివ్యరూపముయొక్క భవ్యవర్ణన ఈ యధ్యాయములో నున్నది. ఇ దంతయు నిజమైనను ఈ విశ్వరూప దర్శనము కావలెనను ప్రలోభమే నాకు లేదు. నేను చిన్న రూపముతోనే సంతృప్తి నొందుదును. నాకు కనిపించు సామాన్య సుందరరూపముయొక్క మాధుర్యమును అనుభవించుట నేను నేర్చుకొంటిని. పరమేశ్వరుడు ముక్కముక్కలుగ విభజింపబడిలేడు. మనము చూచు పరమేశ్వరుని రూపము పరమేశ్వరునిలో నొక భాగము మాత్రమేయని, మిగిలిన భాగమంతయు బయట నెక్కడనో ఉద్దనది నేను భావించను. ఈ మహావిశ్వమందెల్ల వ్యాపించియున్న పరమేశ్వరుడే యథాతథముగా సంపూర్ణ రూపముతో ఒక చిన్న మూర్తిలోను, ఒక రజఃకణములోనుకూడ వ్యాపించియున్నాడని నా భావము. చిన్న వస్తువులో అత డే మాత్రమును తక్కువగా నుండడు. అమృతసాగరములో నున్న మాధుర్యమే అందలి చిన్నబిందువులోకూడ ఉండును. నాకు లభించిన ఒక చిన్న అమృతబిందువులోని మాధుర్యము చవిచూచుచుండుటయే నాకు ప్రియము. కావలెననియే నే నిక్కడ అమృతమును దృష్టాంతముగ తీసికొన్నాడను. నీటినో, పాలనో ఉపమానముగ తీసికొనలేదు. ఒక గిన్నెడు పాలలో నెంత రుచి యున్నదో గరిటెడుపాలలోకూడ అంతే రుచి యుండును. కాని గిన్నెడు పాలలోని పుష్టి గరిటెడు పాలలో నుండదు.

కాని అమృతము యొక్క విషయము వేరు. అమృత సాగరములో నున్నంత మాధుర్యము ఒక్క అమృత బిందువులోగూడ నున్నది. దానితోపాటు పుష్టికూడ సమానమే. అమృతబిందు వొకటి యైనను గొంతులోనికి దిగిన అమృతత్వమే లభించును.

ఆ విధముగనే పరమేశ్వరుని విరాట్స్వరూపములో నున్న దివ్యత్వమే, పవిత్రతయే ఒక చిన్న మూర్తిలోకూడ ఉన్నది. మచ్చునకై తెచ్చిన గుప్పెడు గోధుమలనుబట్టి ఇవి గోధుమలని నేను గుర్తుపట్టలేకపోయినచో, గోనెడు గోధుమలను నా యెదుట బెట్టినను ఎట్లు గుర్తుపట్టగలను ? నా కంటియెదుటి ఈశ్వరునియొక్క ఒక చిన్న మూర్తిలోనే నీశ్వరుని గుర్తింపలేకపోయిన, అతని విరాట్స్వరూపమును చూచి మాత్రము ఎట్లు గుర్తింపగలను ? చిన్న, పెద్ద-ఇందు విశేషమేమున్నది ? చిన్నరూపమును మనము తెలిసికొన్నచో పెద్దరూపము అవగత మయినట్లే ! కనుక ఈశ్వరుడు తన విశ్వరూపమును చూపవలె ననుటకాంక్ష నాకేమియు లేదు. అర్జునునివలె విశ్వరూప సందర్శనమును అర్థించు యోగ్యత కూడ నాలోలేదు. అదిగాక నాకు కనబడునది ఆ విశ్వరూపములో నొక చిన్నభాగ మనికూడ నాకు తోచదు. చిత్రపటమునుండి కత్తిరింపబడిన ఒక ముక్కనుచూచి ఆ చిత్రపటము ఎవరిదో మనము గుర్తింపలేము. కాని పరమాత్మయిట్టి ముక్కల సంపుటి కాడు. అతడు ముక్కలుముక్కలుగ ఖండింపబడజాలడు. ఒక్క చిన్నరూపములో కూడ అనంతు

డైన పరమేశ్వరుడు సంపూర్ణముగ నిండియుండును. చిన్న ఫొటోకును పెద్దఫొటోకును భేద మేమి? పెద్దఫొటోలోనున్న వివరణములన్నియు దాని ప్రతిరూపమైన చిన్న ఫొటోలో కూడ ఉండును. చిన్నఫొటో పెద్దదానిలో నొక భాగము కాదు. చిన్నపైపుఅక్షరములలో నున్నమాట ఏ యర్థము నిచ్చునో ఆ యర్థమునే పెద్దపైపు అక్షరములలో నున్నమాట కూడ ఇచ్చును. పెద్దపైపులోనున్నది ఎక్కువ అర్థమును, చిన్నపైపులోనున్నది తక్కువ అర్థమును ఈయదు.

ఈ వాదమే మూర్తిపూజకు ఆధారము. అనేకులు మూర్తిపూజమీద దాడి వెడలుచుందురు. విదేశీయులును, స్వదేశస్థులు కొందరును మూర్తిపూజ అనుచిత మనుచుందురు. కాని ఆలోచించినకొలది మూర్తిపూజలోని దివ్యత్వము నాకు స్పష్టముగ కనబడుచుండును. మూర్తిపూజ యనగా నేమి? ఒక చిన్నవస్తువులో బ్రహ్మాండమును దర్శింపగల విద్యయే మూర్తిపూజ. ఒక కుగ్రామములో విశ్వమునెల్లను చూడగల విద్యను నేర్చుకొనుట తప్పా? ఇది ఊహాగానము కాదు, అనుభవసిద్ధమైన విషయము. విరాట్స్వరూపములో నేమున్నదో అదంతయు ఒక చిన్న మూర్తిలోకూడ ఉన్నది. అదే ఒక మృత్తికాకణములోకూడ ఉన్నది. ఈ మృత్తికలోనే మామిడి, అరటి, గోధుమ, బంగారము, వెండి – ఇవన్నియు ఉన్నవి. సృష్టియంతయు ఈ మృత్కణములో నున్నది. ఒక చిన్న నాట్యమండలిలో ఒక వ్యక్తియే భిన్నభిన్న వేషములు ధరించి నాట్యరంగము

మీదికి వచ్చుచుండును. పరమేశ్వరుడుకూడ ఇట్టివాడే. నాటకకర్త నాటకమును వ్రాసి, తానే నాటకపాత్రలుకూడ ధరించినట్లు పరమేశ్వరుడుకూడ అనంతమైన నాటకమును రచించి, తానే అనంతమైన పాత్రలను ధరించి ఈ నాట్య రంగమునిండ అభినయించుచుండును. ఈ యనంతనాటకములో ఒక్క పాత్రను అర్థముచేసికొంటిమా, అందున్న పాత్రల నన్నింటిని అర్థముచేసికొన్నట్లే !

కావ్యములలో ఉపమానములు, దృష్టాంతములు మొదలైనవానికున్న ఆధారమే మూర్తిపూజకును ఉన్నది. ఏదైన గుండ్రని వస్తువును చూచినప్పుడు మనకు ఆనందము కలుగును. ఎందువలననగా దానిలో నొక క్రమవిధాన ముండును కాబట్టి. ఈ విధానము ఈశ్వరుని స్వరూపము. ఈశ్వరసృష్టి సర్వాంగ సుందరము. దానిలో ఒక క్రమపద్ధతి యున్నది. ఆ గుండ్రని వస్తువు సువ్యవస్థితమైన ఈశ్వరుని మూర్తి. కాని అడవిలో పెరుగు వంకరటింకర చెట్టుకూడ ఈశ్వరుని స్వరూపమే. దానిలో ఈశ్వరుని స్వచ్ఛందత యున్నది. ఆ చెట్టునకు ఏమియు బంధనములు లేవు. భగవంతు నెవరు బంధింపగలరు ? ఆ వంకరటింకర చెట్టులో బంధనాతీతుడైన పరమేశ్వరుడున్నాడు. ఒక తిన్నని నున్నని స్తంభమును చూచినప్పుడు దానిలో ఈశ్వరుని సమత్వము కనబడును. నగిషీలుచెక్కిన స్తంభమును చూచినప్పుడు, నక్షత్రమాలికలతో ఆకాశమును అలంకరించిన పరమేశ్వరుడు కనబడును. పార్కులో అలంకారముకొఱకు కత్తిరింప

బడిన మొక్కలను చూచినపుడు ఈశ్వరుని సంయమరూపము కనబడును. హద్దులులేని విశాలమైన అరణ్యములో ఈశ్వరుని భవ్యతను, స్వతంత్రతను దర్శింతుము. అడవిలోను ఆనందమును పొందుదుము. తీర్చి దిద్దిన పార్కులోను పొందుదుము. కాని మనము పిచ్చివారమా? కాము. ఆనంద కారణము రెంటిలోను ఉన్నది. ఎందుచేతననగా ఈశ్వరుని గుణము ప్రతిదానియందును ప్రకటమై యున్నది. నున్నని సాలగ్రామములోనున్న తేజస్సే నర్మదలోని వంకర టింకర గణపతిలోను ఉన్నది. కనుక నా కా విరాట్స్వరూపము వేరుగ కనబడక పోయినను నష్టి లేదు.

పరమేశ్వరుడు సర్వత్ర వేఱువేఱు వస్తువులలో భిన్న భిన్న గుణములద్వారా ప్రకటమగుచుండును. ఇందువలన మన కానందము కలుగును. ఆ వస్తువులలో ఆత్మీయత గోచరించును. నీకు ఆనందము అకారణముగ కలుగుటలేదు. ఆనంద మెందులకు కలుగుచున్నది? ఏదో కొంత సంబంధ ముండుటం బట్టియే! బిడ్డను చూచినతోడనే తల్లికి ఆనందము కలుగును. ఎందుల కనగా ఆ సంబంధమును ఆమె యెరుగును కనుక. ఈ విధముగనే ప్రతి వస్తువుతోడను ఈశ్వర సంబంధము పెట్టుకొనుము. నాలోనున్న పరమేశ్వరుడే ఆ వస్తువులోను ఉన్నాడనుకొనుటయే ఆనందమునకు కారణము. మరొక కారణ మేమియు లేదు. ఈ ప్రకారము ఆత్మసంబంధమును పెంచుకొనుటయే ఆనందమును పెంచుకొనుమార్గము. అంతటను ప్రేమ సంబంధమును పెట్టుకొని చూడుము. ఎంత

మనోహరముగ నుండునో ! అప్పు డనంతసృష్టిలో నున్న పర మాత్మ పరమాణువులోకూడ నీకు కనబడును. ఒక్కసారి ఆ దృష్టి అలవడినచో ఇక కావలసిన దేమున్నది ? కాని దీనికై ఇంద్రియములకు సుసంస్కారములు, సదభ్యాసములు కావలెను. భోగవాసనలు తొలగిపోయి పవిత్రమైన ప్రేమదృష్టి మనకు లభించినప్పుడు ప్రతివస్తువులోను ఈశ్వరుడే కనబడును. ఉపనిషత్తులలో ఈ విషయము చాల సుందరముగ వర్ణింప బడినది. ఆత్మరంగు ఎట్టి దన్నపుడు ఋషి ప్రేమ పూర్వకముగ

"యథా అయం ఇంద్రగోపః"

ఇది పట్టువలె మృదువై ఎఱ్ఱనిదైన ఇంద్రగోపమను పురుగువంటి దన్నాడు. ఆ పురుగును చూచినప్పుడు ఎంత యానందము కలుగును ! ఈ యానంద మేల కలుగును ? ఏ భావముతో నన్ను నేను చూచుకొనుచుందునో ఆ భావము తోనే దానినికూడ చూచుచుందును. దానితో నా కెట్టి సంబంధమును లేకపోయినచో నా కా ఆనందము కలుగునా ? నా లోపలనున్న సుందరమైన ఆత్మయే ఆ యింద్రగోపము నందును ఉన్నది. కావుననే ఆ యుపమాన మిచ్చినాడు. ఇంతకు ఉపమాన మెందుల కిత్తురు ? దానినుండి ఆనంద మెందులకు కలుగును ? రెండువస్తువులలో సామ్యముండుట చేత ఉపమాన మీయబడును. అందుల కనియే ఆనందము కలుగును. ఉపమానోపమేయములు కేవలము భిన్నవస్తువు లైనచో ఆనందము కలుగదు. ఉప్పు కారమువలె నుండునని ఎవడైన అనినచో వాడు పిచ్చివాడందుము. కాని యెవరైన

నక్షత్రములను పుష్పములతో పోల్చిన, ఆ పోలికకు మన మానందింతుము. ఉప్పు కారమువలె నుండునన్నప్పుడు వాని లోని సాదృశ్యము మన కవగతము కాదు. కాని ఉప్పులో నున్న పరమాత్మయే కారములోకూడ ఉన్నాడను ఎఱుక కలవాడు ఈ సాదృశ్యములోకూడ ఆనందమును పొందును. ప్రతి వస్తువునందును ఈశ్వరుడు పడుగుపేకగా నిండియున్నా డనియే దీని సారాంశము. ఈ యనుభవము కలవానికి విశ్వ రూపదర్శనముతో పనిలేదు.

57

విరాడ్విశ్వరూప దర్శనము సుకరము సైతము కాదు

నే నా విశ్వరూపమును చూచి సహింపగల్గుటమాత్ర మెట్లు? సగుణము, సుందరము అయిన ఒక చిన్న రూపము నెడల నాకున్న ప్రేమ, ఆత్మీయత, మాధుర్యము - వీని యొక్క అనుభవము ఈ విశ్వరూప దర్శనములో ఉండదేమో అనుకొందును. ఈ స్థితియే అర్జునునకు కలిగెను. చివర కతడు "ఓ ప్రభూ, నీ మనోహరమైన పూర్వరూపమును చూపుము" అని గజగజ వణకుచు అన్నాడు. విరాట్స్వరూప మును చూడవలెనను కోరిక పెట్టుకొనవలదని అతడు స్వానుభవమువలన మనకు చెప్పుచున్నట్లున్నది యిది. ఈశ్వరుడు త్రికాలములయందు, త్రిలోకములయందు వ్యాపించియుండు

టయే భాగుగా నున్నది. ముద్దకట్టుకొని బగబగ మండుచు గోళాకారమువలెనున్న ఆ తార నాయొద్దకువచ్చి నిలిచినచో నా స్థితి యేమికావలె? ఆ నక్షత్రములు వాని స్థానములలో నవియుండి ఎంతశాంతముగ కనబడుచున్నవి! అంతదూరము నుండి అవి నాతో మాట్లాడుచున్నవా యని అనిపించును. కాని దృష్టికి శాంతినికలిగించు ఆ నక్షత్రము నా యొద్దకు వచ్చిననిం కేమున్నది? బగబగమండు ఆ యగ్నిలో నేను కాలి బూడిదయైపోదును. ఈశ్వరునియొక్క ఈ యనంతబ్రహ్మాం డములను ఉన్నచోటనే యుండనిండు. వాని నన్నిటిని ఒక చోటికే తీసికొనివచ్చుటలో ఏమి యా న ం ద మున్న ది? బొంబాయి 'కబూతర్‌ఖానా' (పావురముల ప్రదర్శనశాల)లో వేలకొలది పావురము లుండును. వాని కక్కడ నేమైనను స్వేచ్ఛ యున్నదా? ఆ దృశ్యము చాలవికటముగ నుండును. ఈ సృష్టి పైని, నడుమ, దిగువ-ఇట్లు మూడురీతుల విభజింప బడి యుండుటలోనే మాధుర్యమున్నది. స్థలాత్మక సృష్టికి వర్తించుధర్మమే కాలాత్మక సృష్టికికూడవర్తించును. వెనుకటి జన్మయొక్క స్మృతి మనకు లేదు. అట్లే భవిష్యత్తునుగూర్చిన జ్ఞానముకూడ లేదు. ఇది మనకు శుభదాయకము. మానవ మాత్రులకు తెలియక కేవలము పరమేశ్వరునికే తెలిసిన అయిదు విషయములు ఖురాన్ షరీఫ్‌లో చెప్పబడినవి. వానిలో నొకటి భవిష్యత్తునుగూర్చిన జ్ఞానము. మనము అంచనాలు వేయుచుందుము. కాని ఊహించివేయు అంచ నాలు జ్ఞాన మనబడవు. భవిష్యత్తును గూర్చిన జ్ఞానము మనకు లేకపోవుటలోనే శుభమున్నది. అట్లే భూతకాల

విస్మృతికూడ నిజముగ శుభావహము. దుష్టు డెవడయిన సజ్జనుడుగా మారి నా యెదుటికి వచ్చినప్పుడు వాని వెనుకటి ప్రవర్తన నాకు జ్ఞప్తికి వచ్చినచో వానియెడల నా కాదరణ కలుగదు. వా డెంత నచ్చజెప్పినను వాని వెనుకటి పాపములను నేను మఱువలేను. వాడు చచ్చి మరల పుట్టినప్పుడే ప్రపంచము వాని పాపములను మరచిపోవును.

పూర్వవిషయములను స్మరించుటవలన వికారములు పెరుగును. ఈ పూర్వస్మృతి నశించినచో చిక్కులన్నియు తీరును. పాపపుణ్యములను విస్మరించుట కొక యుపాయము ఉండవలెను. మరణమే ఆ యుపాయము. ఈ జన్మలో కలుగు బాధలనే మనము సహించలేనపుడు ఇక వెనుకటి జన్మలోని క్లుల్లంతయు త్రవ్వుకొనుట యెందులకు ? ఈ జన్మ మను గృహమునందు క్లుల్లైమైన తక్కువా ? మన బాల్యావస్థను కూడ మనము చాలవరకు మరచిపోదుము. ఈ విస్మృతి మంచిదే ! జరిగిపోయిన విషయములను మరచిపోవుటయే హిందూ - ముస్లిం మైత్రికి ఏకైకమార్గము. ఔరంగజేబు అత్యాచారములను చేసెను. వాని నెన్నాళ్లు వల్లెవేయుచుందుము ? గుజరాతీభాషలో రతన్‌బాయియొక్క గీత మొకటి యున్నది. దానిని తఱచు మన మిక్కడ వినుచుందుము. "ప్రపంచములో చివరకు నిలిచియుండునది కీర్తి యొక్కటే ! పాపమును ప్రజలు మరచిపోదురు" అని యా గీతముచివర ఉన్నది. కాలమే జల్లెడపట్టి చెడుగును మంచి నుండి వేరుచేయును. చరిత్రలో మంచి యెంత యుండునో

అంతే తీసికొనవలె. పాపమును విసర్జింపవలెను. మానవుడు చెడుగునెల్లను విడిచివేసి మంచిని మాత్రమే గుర్తుపెట్టు కొన్నచో ఎంత బాగుగా నుండును ! కాని అట్లు జరుగుట లేదు. కనుకనే విస్మృతి చాల అవసరము. ఇందులకై భగవంతుడు మృత్యువును నిర్మించినాడు.

సారాంశమిది : ఈ జగత్తు ఎట్లున్నదో అట్లుండుటయే మంగళకరము. కాలస్థలాత్మకమైన జగత్తునెల్ల దగ్గరకు తెచ్చు కొనవలసిన అవసరము లేదు. అతిపరిచయములో సారస్యము లేదు. కొన్ని వస్తువులతో సన్నిహితత్వము పెంచుకొనవలె. మరికొన్నిటితో సంబంధము మానవలె. "గురువునకు దూర ముగా నమ్రతతో కూర్చుందుము. తల్లికట్లు చేయుదుమా ? ఆమె యొడిలోనే కూర్చుందుము. ఏ వ్యక్తితో నెట్లు వ్యవహ రింప వలెనో అట్లే చేయవలె. పుష్పములను మనము దగ్గరకు తీసికొందుము. కాని నిప్పును ఎడముగా నుంతుము. నక్షత్రము దూరముననుండియే సుందరముగా తోచును. సృష్టికూడ అంతే ! అతిదూరముననున్న సృష్టిని చాల దగ్గరకు తెచ్చు కొనుటవలన అధికమైన ఆనందమును పొందుదుమని చెప్ప లేము. ఉన్నవస్తువును ఉన్నచోటనే యుండనిమ్ము. అందు లోనే సారస్యమున్నది. దూరముననుండి రమ్యముగ కనబడు వస్తువును దగ్గరకు తెచ్చుకొనిన అది సుఖదాయకమే యగు నని చెప్పలేము. దానిని దూరముగనేయుంచి దాని సారస్య మును గ్రహింపవలెను. మొండిపట్టుదలతో అతిపరిచయ మును చేసికొనుటవలన ప్రయోజనమేమియు లేదు.

సారాంశమిది : త్రికాలము లొకసారియే మనయెదుట నిలువకుండుట మంచిది. త్రికాలజ్ఞాన ముండుటచే ఆనందము, కల్యాణము మనకు విధిగా చేకూరునని అనుకొనలేము. అర్జునుడు ప్రేమవశుడై మొండిపట్టుతో ప్రార్థించుటవలన భగవంతు డంగీకరించి తన విశ్వరూపమును అతనికిచూపెను, కాని నాకు భగవంతుని చిన్నరూపమే చాలును. ఈ చిన్న రూపము పరమేశ్వరునిలో ఒక ముక్క కాదు. అదిముక్కయే అయినను, మహామహామైన ఆ విశాల మూర్తియొక్క పాదమో, లేక దాని వ్రేలో అయినను, ఆపాటి దర్శనము లభించినందులకే నా జన్మ ధన్యమనుకొందును. స్వానుభవము వలన నేను పొందిన జ్ఞాన మిది. వార్ధాలో జమ్నాలాల్ గారు లక్ష్మీనారాయణ దేవాలయములో హరిజనులకు ప్రవేశ మిచ్చినప్పుడు దర్శనార్థము నేను వెళ్ళితిని. పదిపదునైదు నిమిషములు ఆ రూపమును చూచుచుంటిని. అపుడు నాకు సమాధిస్థితిని పొందినట్లయ్యెను. భగవంతుని ఆ ముఖము, వక్షము, చేతులు చూచుచుచూచుచు నా దృష్టి పాదముల మీదికి పోయి స్థిరపడెను. "నీ పాదసేవ మధురమైనది"అను భావన చివరకు నిలిచిపోయెను. ఒక చిన్నరూపములో ఆ పరమపురుషుడు ఎ ట్లిమిడునని ఎవరైనను శంకించినయెడల ఆ పరమపురుషుని పాదములే నాకు చాలునని నే నందును. పూర్ణరూపము కనబడవలెనని కోరను. అర్జునుడు విశ్వ రూప దర్శనమును అర్థించినా డనిన అతడు దాని కధికారి. అతనికి భగవంతునితో నెంత సన్నిహితత్వము ! అతనియెడల

ఎంతప్రేమ। ఎంత సఖ్యభావము! ఆ యోగ్యత నాకెక్కడ! నా కా పాదములే చాలును. ఇంతే నా యర్హత.

58

సర్వార్థ సారము

పరమేశ్వరుని ఆ దివ్యరూప వర్ణనలోనికి బుద్ధిని పోనిచ్చుట నా కిష్టము కాదు. అట్లు పోనిచ్చుట పాపము. ఆ విశ్వరూప వర్ణనగల పవిత్ర శ్లోకములను పఠించి మనము పవిత్రుల మయ్యెదము గాక! బుద్ధిని ప్రయోగించి ఈశ్వర రూపమును ముక్కలు చేయబూనుట నాకు నచ్చదు. అది 'అఘోర – ఉపాసన' యగును. అఘోరోపాసకులు శ్మశాన మునకుపోయి మృతకళేబరములను చీల్చి తంత్రోపాసన చేయుదురు. ఇట్లే యుండును పై పనికూడ. పరమేశ్వరుని ఆ దివ్యరూపము

"విశ్వతశ్చక్షురుత విశ్వతో ముఖో
విశ్వతో బాహురుత విశ్వతస్పాత్"

ఆ విశాలమైన అనంతరూప మిట్లుండును. ఆ వర్ణనాత్మక శ్లోకములను గానముచేసి మన హృదయమును పాపరహితముగను, పవిత్రముగను చేసికొందముగాక!

పరమేశ్వరుని గూర్చిన ఈ వర్ణనయం దెల్ల బుద్ధి ఆలోచనకు దిగుచోటు ఒక్కటే యున్నది.—"ఓ యర్జునా!

వీ రందరును చనిపోవువారే, నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము. అంతయు చేయువాడను నేనే" అని భగవంతు డర్జునునితో అనును. ఇదే నా మనస్సులో ప్రతిధ్వనించుచుండును. మన మీశ్వరుని చేతిలోని ఖడ్గముగా కావలెనను భావము కలిగినప్పుడు బుద్ధి యాలోచనకు దిగును. ఈశ్వరుని చేతిలోని పనిముట్టుగా అగుట యెట్లు? అతని చేతిలో మురళిని అగుదునా? అతడు నన్ను పెదవులకు చేర్చుకొని మధురస్వరములను పలికించు యోగ్యత నాకు కలుగుట యెట్లు? నేను మురళి నగుట యనగా లోపల లొట్టయగుట అన్నమాట. కాని నాలో వికారములు, వాసనలు పూర్తిగ నిండియున్నవి. ఇక నా వలన మధురస్వరములు వెలువడు టెట్లు? నాలో అహంకారము నిండియున్నది. నేను నిరహంకారుడను కావలెను. నేను పూర్ణముగ ముక్తుడనై, లోన బోలుగానైనప్పుడే పరమేశ్వరుడు నన్ను మురళిగ చేసికొనును. కాని పరమేశ్వరునికి మురళి నగుట చాల సాహసము. పోనీ! అతని పాదరక్షను కావలెననుకొన్నను అదియు సులువైనపని కాదు. ఆయన కాలికి కొంచెమేని ఒత్తిడిలేని మెత్తని చెప్పను కావలె. పైనున్న పరమేశ్వరుని పాదమునకును, క్రింది ముండ్లకు - రాళ్లకును మధ్య నే నుండవలె. నా చర్మమును ఒలిచి, భాగుగ ఊని మెత్తపఱుపవలె. కాన పరమేశ్వరుని పాదరక్ష నగుటకూడ తేలికపని కాదు. ఇక పరమేశ్వరుని చేతిలోని పనిముట్టును కావలెనని పదిసేర్ల బరువుగల ఇనుపగుండుగా కారాదు. తపశ్చర్య యను సానమీద పదను పెట్టిన కత్తిగా కావలె. ఈశ్వరునిచేతిలో నా జీవిత మను ఖడ్గము మెఱయు

చుండవలె. ఈ భావము నా హృదయములో ప్రతిధ్వనించు చుండును. అట్లు భగవంతుని చేతి పనిముట్టును కావలెనను ఆలోచనలో మునిగిపోదును. ఇది యెట్లు సాధ్యమో ఆ విధానము స్వయముగ భగవంతుడే ఈ యధ్యాయముయొక్క చివరి శ్లోకములో చెప్పినాడు. శ్రీ శంకరాచార్యుడు తన భాష్యములో ఈ శ్లోకము "సర్వార్థ సారము"-గీతకు నెల్ల సారమని అన్నాడు. ఆ శ్లోక మిది—

"మత్కర్మకృన్మత్పరమో మద్భక్తః సంగవర్జితః ।
నిర్వైరః సర్వభూతేషు యః స మామేతి పాండవ॥"

* * * *

మేరే అర్థక రేకర్మ, మత్పరాయణ భక్తజో ।
జో అనాసక్త నిర్వైర సో ఆకే మిలతే ముఝే॥

"ప్రపంచములో ఎవనికి ఎవ్వనితోను శత్రుత్వము లేదో, ఎవడు తటస్థుడై ప్రపంచమునకు నిష్కామసేవ చేయునో, తాను చేయు పనియంతయు నా కెవ్వడర్పించునో ఎవడు నా భక్తుడు, ఋమాశీలుడు, నిస్సంగుడు, విరక్తుడు, ప్రేమమయుడు అయియుండునో, అట్టివాడు నా చేతిలో ఖడ్గమగును" ఇది గీతాసారము.

గీతా ప్రవచనములు

పండ్రెండవ అధ్యాయము

సగుణ నిర్గుణ భక్తి

59

ఆరవఅధ్యాయమునుండిపదునొకొండవయధ్యాయమువఱకు:
ఏకాగ్రతనుండి సమగ్రతవఱకు

సోదరులారా!

గంగాప్రవాహము అన్నిప్రదేశములలోను పవిత్రమైనదే! కాని హరిద్వారము, కాశి, ప్రయాగవంటిచోట్లు మిక్కిలి పవిత్రములైనవి. అవి ప్రపంచమునెల్ల పావనము చేయుచున్నవి. భగవద్గీత విషయముకూడ ఇంతే! భగవద్గీత మొదటినుండి చివరవరకు అంతయు పవిత్రమే! కాని మధ్య మధ్య కొన్ని అధ్యాయములు తీర్థక్షేత్రములై యున్నవి. మన మీ నాడు చెప్పుకొనవలసిన అధ్యాయము మిగులపవిత్రమైన తీర్థక్షేత్రము. దీనిని "అమృతధార" యని భగవంతుడే అన్నాడు. "యేతు ధర్మామృత మిదం యథోక్తం పర్యుపాసతే" ఇరువది శ్లోకములుగల చిన్న అధ్యాయమేయైనను ఇది అమృతధారయైనది. అమృతమువలె మధురము, సంజీవియైనది. ఈ యధ్యాయములో స్వయముగ భగవంతుడే

భక్తిరసముయొక్క మహిమను, దాని తత్త్వమును గానము చేసినాడు. వాస్తవమునకు ఆరవ అధ్యాయమునుండియే భక్తితత్త్వము ప్రారంభమైనది. అయిదవ అధ్యాయము చివరవరకు జీవనశాస్త్రమును చూచితిమి. స్వధర్మాచరణ రూపమైన కర్మలు, వానికి సహకారియైన వికర్మయను మానసిక సాధన, ఈ రెండుసాధనలవలనను సమస్తకర్మలను భస్ముచేయు అంతిమ సోపానమైన అకర్మయొక్క భూమిక– ఈ విషయముల విచారణ మొదటి అయిదు అధ్యాయములలో జరిగినది. దీనితో జీవనశాస్త్రము సమాప్తమయినది. ఆరవ అధ్యాయమునుండి పదునొకొండవ యధ్యాయము చివరవరకు ఒక విధముగ భక్తితత్త్వవిచారణ జరిగినది. అది యేకాగ్రతతో ప్రారంభమైనది. చిత్తైకాగ్రత యెట్లు కలుగగలదో, దాని కేయే సాధన లున్నవో, వాని యావశ్యక మేమో ఆరవ అధ్యాయములో చెప్పబడినది. పదునొకొండవ అధ్యాయములో సమగ్రత బోధింపబడినది. ఏకాగ్రత మొదలుకొని సమగ్రతవరకునుగల ఈ పెద్దమజిలీని మన మెట్లు దాటగలమో ఇప్పుడిక్కడ చూడవలె.

ఆరవ యధ్యాయము చిత్తైకాగ్రతతో ప్రారంభమయినది. ఏకాగ్రత సిద్ధించినమీదట ఏ విషయమునైనను మనుష్యుడాలోచింపగలుగును. చిత్తైకాగ్రతయొక్క ఉపయోగము గణితశాస్త్రాధ్యయనములో కనబడునని అభిమానముతో నేను చెప్పగలను. ఈ యధ్యయనమువలన లాభము కలిగితీరును. కాని ఇది చిత్తైకాగ్రతకు సర్వోత్కృష్టమైన

లక్ష్యముకాదు. పూర్ణమైన యేకాగ్రతకు గణితశాస్త్రాధ్యయనము ఒరపిడిరాయి కాదు. గణితాది శాస్త్రాధ్యయనములలో చిత్తైకాగ్రతవలన కీర్తి లభించును. కాని ఇది నిజమైన పరీక్ష కాదు. అందుచేత మన దృష్టి భగవంతుని చరణములదెసకు మరలవలెనని ఏడవ అధ్యాయము చెప్పుచున్నది. భగవంతుని చరణములయందు ఏకాగ్రదృష్టి నిరంతరమును నిలుపవలెనని, మన వాణి చెవి కన్ను ఆ చరణములయందే సతతము లగ్నముకావలెనని, దీనికై మరణపర్యంతము ప్రయత్నింప వలెనని ఎనిమిదవ అధ్యాయము బోధించుచున్నది. ఇంద్రియము లన్నింటికిని ఇది యభ్యాసముకావలె. అన్యచింత కలుగనంతగా అన్ని యింద్రియములకును ఇది యలవడవలె. అన్ని యింద్రియములకును భగవంతుని పొందవలెనను ఉత్కంఠ కలుగవలెను. మనయెదుట ఒకడు విలపించు చుండవచ్చును. ఒకడు భజనచేయుచుండవచ్చును. ఒకడు వాసనారూపమైన వలను అల్లుచుండవచ్చును. లేక విరాగు లైన మహాత్ముల సమావేశము జరుగుచుండవచ్చును. సూర్యుడు వెలుగుచుండవచ్చును. చీకటి క్రమ్మియుండ వచ్చును. ఏది యెట్లున్నను మరణకాలమందు పరమేశ్వరుడు చిత్తములో ప్రత్యక్షమగుస్థితిని అన్ని యింద్రియములకును జీవితముపొడుగునను అలవరుపవలెను. ఈ సాతత్యశిక్షణ ఎనిమిదవ అధ్యాయములో ఇయ్యబడినది. ఆరవ అధ్యాయ ములో ఏకాగ్రతయు, ఏడవ అధ్యాయములో ఆ యేకాగ్రత ఈశ్వరాభిముఖము కావలెననుటయు, (దీనినే ప్రపత్తి యందురు) ఎనిమిదవదానిలో సాతత్య యోగమును, తొమ్మి

దవదానిలో సమర్పణయోగమును బోధింపబడినవి. పదియవ అధ్యాయములో ఈశ్వర విభూతులు క్రమానుగుణముగ చెప్పబడినవి. ఒక్కొక్క అడుగు ముందునకు వేయుచు ఈశ్వరస్వరూపమును ఎట్లు హృద్గతము చేసికొనవలెనో, చీమ మొదలు బ్రహ్మవరకు వ్యాపించియున్న పరమాత్మను మెల్లమెల్లగా ఎట్లు హృదయములో ఇముడ్చుకొనవలెనో చెప్పబడినది. పదునొకొండవ అధ్యాయములో సమగ్రత చెప్పబడినది. విశ్వరూప దర్శనమునే నేను సమగ్రతాయోగమంటను. సామాన్య రజఃకణములోకూడ విశ్వమంతయు ఇమిడియున్న దను అనుభవమును పొందుటయే విశ్వరూప దర్శనము. ఇదే విరాడ్దర్శనము. ఆరవ అధ్యాయమునుండి పదునొకొండవ యధ్యాయమువరకు భక్తిరసము అనేకవిధముల వడియగట్టబడి సారము తీయబడినది.

60

సగుణోపాసకుడు. నిర్గుణోపాసకుడు తల్లి యిద్దరు బిడ్డలు

పండ్రెండవ అధ్యాయములో భక్తితత్త్వ విచారణ పూర్తిచేయవలసియున్నది. అర్జునుడు ఈ సమాప్తికి సంబంధించిన ప్రశ్న వేసెను. అయిదవ అధ్యాయములో జీవన శాస్త్ర విచారణ సమాప్తి సందర్భమున ప్రశ్నించినట్లే అతడు ఇక్కడకూడ ప్రశ్నించెను. అర్జును డిట్లడుగును. "ప్రభూ ! కొందరు సగుణోపాసన చేయుదురు. మరికొందరు

నిర్గుణోపాసన చేయుదురు. కాగా ఈ యిరుతెగలలో నీ కెవరు ప్రియులు ?"

భగవంతుడు దీని కేమి సమాధానము చెప్పగలడు ! ఒక తల్లికి యిద్దరు బిడ్డ లున్నారనుకొనుడు. వారిలో చిన్న వానిది తల్లిని వదలి యుండగల వయస్సు కాదు. వానికి ఆమె మీద ఎంతో ప్రేమ. తల్లిని చూచుసరికే అత డానందపర వశుడగును. తల్లి కొంచెము సేపు కనబడకపోయెనా వ్యాకులు డగును. వా డామెను విడిచిపోనే లేడు. ఆమెవియోగము నే మాత్రమును సహింపలేడు. తల్లి లేనిచో వానికి ప్రపంచమే శూన్యము. చిన్నవాడు ఇట్లున్నాడనుకొనుడు. ఇక రెండవ వాడు పెద్దవాడు. వాడుకూడ అపారమైన మాతృప్రేమ కలవాడు. కాని వివేకవంతుడు. తల్లిని విడిచియుండగలడు. అయిదారు మాసములు తల్లిని చూడకపోయినను ఉండ గలడు. తల్లికి సేవ చేయుచు బాధ్యతతో పనులన్నియు నిర్వహించును. పనిపాటలలో నిమగ్నుడగుటచేత మాతృ వియోగమును సహింపగలడు. అతడు ప్రజలలో ప్రతిష్ఠ సంపాదించినాడు. ఇంటలకు తల్లి చాల ఆనందించును. పెద్దవా డిట్టివాడు. ఇట్టి ఇద్దరు కుమారులను గూర్చి "ఏమమ్మా ! ఈ యిద్దఱిలో ఎవనినో ఒకనిని నీయొద్దనుండ నిత్తుము. నీ కిష్టమగు వానిని కోరుకొను"మని ఆ తల్లితో అని చూడుడు. అప్పు డామె యేమి సమాధాన మిచ్చును ? ఏ కుఱ్ఱవానిని కోరుకొనును ? ఇద్దరను తక్కెడలోవేసి తూచునా ? ఆ మాతయొక్క మానసికస్థితిని విచారింపుడు.

సహజముగ ఆమె యీయగల ప్రత్యుత్తర మేమి? "గత్యంత రములేక ఒకని వియోగము నాకు తప్పకపోయినచో పెద్ద వానిని తీసికొనుడు. వాని యెడబాటు నేను సహింతును." అని యనుచు చిన్నకుట్టవానిని గుండెకు అదుముకొనును. ఆమె వానిని వదలిపెట్టదు. చిన్నవానికి తనమీద నున్న ప్రేమాతిశయమువలన "పెద్దవాడు ఎడమైనను ఇబ్బంది లేదు" అన్నట్లుగ సమాధానము చెప్పును. కాని "ఇద్దఱిలో నీ కెవనియందు ఎక్కువప్రేమ" యను ప్రశ్నకు ఇది జవాబు కానేరదు. ఏదోయొక జవాబు చెప్పవలెను. కనుక అట్లుచెప్పి వేసినది. దానినిబట్టి పెద్దవానియం దామెకు ప్రేమ తక్కువ యని వ్యాఖ్యానము చేసినచో అది అనుచిత మగును.

ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరమిచ్చుచు ఆ తల్లి యేసందిగ్ధావస్థలో పడినదో భగవంతుడుకూడ సరిగా ఆ స్థితిలోనేపడెను. అర్జును డిట్లడుగును— "ప్రభూ! నీ భక్తులలో రెండురకములవారు కలరు. ఒకరకమువానికి నీయం దత్యంతప్రేమ. వాడు నిన్ను సదా స్మరించుచుండును. వాని కన్నులు నీకొఱకు తపించుచుండును. చెవులు నీ గుణగానమును వినకుతూహలపడును. చేతులును కాళ్లును నీ సేవాకార్యములకై వేగిరపడుచుండును. రెండవతెగ భక్తుడు స్వావలంబి. అత డింద్రియముల నెల్లప్పుడు వశమునందుంచుకొనును. సర్వభూతహితుడై పరమేశ్వరస్మరణ లేనివానివలె అహర్నిశము నిష్కామమగు సమాజసేవలో నిమగ్నుడై యుండును. అతడు అద్వైత భక్తుడు. ఇప్పు డీ యిరువురిలో నీకు ప్రియమైనవా డెవడో

నాకు తెలియజెప్పుము" ఇది అర్జునుడు భగవంతునడిగిన ప్రశ్న. ఆ బిడ్డలతల్లి యెట్లు సమాధానము చెప్పినదో సరిగా ఆ విధముగనే భగవంతు డిట్లు జవాబిచ్చెను– "సగుణభక్తుడు నాకు ప్రియుడు. అద్వైతభక్తుడుకూడ నావాడే" ఈ విధముగ భగవంతుడు సందిగ్ధస్థితిలో పడెను. ఏదో యొకసమాధానము చెప్పవలెను. కనుక అట్లు చెప్పినాడు.

నిజమున కిది సందిగ్ధావస్థయే. అక్షరశః ఈ రెండు తెగల భక్తులను ఒకరే. ఇరువురి యోగ్యతయు ఒకటే. ఇద్దరిని పోల్చిచెప్పుట హద్దుమీరిపోవుటయే. అయిదవ అధ్యాయములో అర్జునుడు కర్మనుగూర్చి ప్రశ్నించినట్లే ఇక్కడ భక్తి విషయములోకూడ ప్రశ్నించినాడు. కర్మ వికర్మల సహాకారముతో మనుష్యుడు అకర్మదశను పొందునని అయిదవ అధ్యాయములో చెప్పబడినది. ఆ యకర్మదశ రెండువిధములుగ ప్రకటమగును. అహర్నిశము కర్మల నాచరించుచుసైతము లేశమాత్రమును కర్మ చేయని ట్లుండువాడొకడు. ఇరువదినాలుగు గంటలును ఏ కొంచెమేని కర్మ నాచరింపకుండ ప్రపంచమునెల్లను కదలించు శక్తిగలవాడొకడు. ఈ రెండువిధములను అకర్మదశ ప్రకటమగును. మరి యీ రెంటిని పోల్చుచెట్లు? ఒక వృత్తమును రెండుసమభాగములుచేసి అందలి ఒకదానితో నొకదానిని పోల్చుట యెట్లు? రెంటిలక్షణములు ఒకటిగనే యుండును. అకర్మ యొక్క భూమికనుగూర్చి వివరించుచు భగవంతుడు ఒకదానిని సంన్యాసమని, రెండవదానిని యోగమని అన్నాడు.

శబ్దములు రెండైనను అర్థమొకటే. సంన్యాసము, యోగము – ఈ రెండును సరళమైన, సులభమైన సాధనలు. సగుణ నిర్గుణ ములుకూడ నిట్టివే. సగుణభక్తుడు ఇంద్రియములద్వారా పరమేశ్వరుని సేవచేయును. నిర్గుణభక్తుడు విశ్వకల్యాణము కొఱకు మనస్సుతో చింతనచేయును. మొదటివాడు బాహ్య సేవయందు నిమగ్నుడైయుండును. కాని, వాని మనస్సులో నిరంతరమును చింతన జరుగుచునేయుండును. రెండవవాడు ప్రత్యక్షముగ నేమియు చేయనట్లు కనబడుచున్నను వాని లోపలమాత్రము నిరంతరమైన సేవ జరుగుచునే యుండును. ఈ యిద్దరు భక్తులలో నెవడు శ్రేష్ఠుడు? అహర్నిశము కర్మనాచరించుచు లేశమాత్రము నాచరింపనట్లుండు సగుణ భక్తుడు, హృదయములో లోకకల్యాణముకొరకు చింతన చేయు నిర్గుణభక్తుడు – ఈ యుభయులును బయటికి వేరు వేరుగ కనబడుచున్నను లోపలమాత్ర మొకరే. ఇరువురిది ఒకటే రూపము. ఇరువురును భగవంతునికి ప్రియులే. కాని ఈ రెంటిలో సగుణభక్తి చాల సులభము. ఇట్లు భగవంతుడు అయిదవ అధ్యాయములో నిచ్చిన జవాబే ఇక్కడకూడ నిచ్చినాడు.

61

సగుణము సులభము, సురక్షితము

సగుణభక్తిలో ఇంద్రియములకు ప్రత్యక్షముగ పని యుండును. ఇంద్రియములు సాధనములుగా, లేక విఘ్నము

లుగా, లేక రెండునుగా అగును. అవి మారకములా తారక ములా యను విషయము సాధకుని దృష్టిపై ఆధారపడి యుండును. ఒకనితల్లి మరణశయ్యపైబడియున్నదనుకొనుడు. వాడామెను చూడగోరును. పదునైదుమైళ్లు పోవలె. ఆ మార్గ మున మోటార్లు పోవు. అది వంకరటింకర కాలిబాట. ఇట్టి పరిస్థితిలో ఈ మార్గము సాధనమా? విఘ్నమా?– వీలు వాలు లేని ఈ మార్గ మెక్కడ దాపరించినదో! లేకపోయిన ఎప్పుడో మా యమ్మయొద్దకు వెళ్లియుండువాడను" అని యతడనుకొనును. ఇట్టివాని కీ మార్గము శత్రువు. ఎట్లో కాళ్లీడ్చుకొనుచు, దారిని నిందించుచు వాడు నడిచిపోవును. కాని ఏది ఎట్లున్నను, తల్లిని చూచుటకు త్వరత్వరగా అడుగువేయుచు పోవుట వాని కవసరము. మార్గమును శత్రు వుగ భావించి నడుమనెక్కడనో వాడు కూర్చున్నచో తాను శత్రువుగ భావించిన మార్గమునకే విజయము కలుగును. వడివడిగ నడిచిపోయినప్పుడే వా డా శత్రువును జయించినట్లు. ఈ పరిస్థితిలోనే మరియొకడు ఇట్లనవచ్చును— "దట్టమైన ఈ యరణ్యములో ఈ మాత్రపు మార్గమైన ఉన్నది. ఇంతే చాలును. ఇక తల్లియొద్దకు పోగలను. ఈ మార్గమే లేక పోయిన ఈ కొండలమీదుగ నే నెట్లుపోవుదును?" ఇట్లను కొనుచు, అత డీ కాలిబాట నొక సాధనముగ నెంచి వేగముగ సాగిపోవును. వా డా మార్గమును మిత్రునిగ భావించును. మీరు దానిని మిత్రుడనుడు, శత్రువనుడు, అనుకూలమనుడు లేక ప్రతికూలమనుడు. ఏమైనను వడివడిగా ఆ మార్గమున పురోగమించవలసినదే. మార్గము విఘ్నకారకమా, సాధన

భూతమా అను విషయము ఆ యా వ్యక్తుల మనోభూమికలపై అనగా దృష్టిపై ఆధారపడియుండును.

సగుణోపాసకునికి ఇంద్రియములు సాధనభూతములు. ఇంద్రియములు పరమేశ్వరునికి అర్పించు పుష్పములు. కనులతో హరిని దర్శించుచు, చెవులతో హరికథలను వినుచు, జిహ్వాతో హరి నామస్మరణ, పాదములతో తీర్థయాత్రలు, చేతులతో సేవాకార్యములు చేయుచు సగుణభక్తుడు సమస్తేంద్రియములను పరమేశ్వరుని కర్పించును. ఇంద్రియములు భోగముకొఱ కీయబడలేదు. పువ్వులు పరమేశ్వరునికి అర్పించుటకొరకు పుట్టినవిగాని దండగుచ్చి ఎవరికివారు మెడలో వేసికొనుటకుగాదు. అట్లే ఈశ్వరసేవలోనే ఇంద్రియముల నుపయోగింపవలె. ఇది సగుణోపాసకుని దృష్టి. కాని నిర్గుణోపాసకునకు ఇంద్రియములు విఘ్నములుగ తోచును. అంతవలన వాని నతడు అదుపులో నుంచును. లేక బంధించును. వానిని నిరాహారములుగ నుంచును. వానిపై కావలి పెట్టును. కాని సగుణోపాసకునకు ఇట్లు చేయవలసిన పనిలేదు. అతడు సర్వేంద్రియములను హరి చరణములకు సమర్పించును. ఈ రెంటి యుద్దేశము ఇంద్రియ నిగ్రహమే. ఏ మార్గము ననుసరించినను ఇంద్రియ నిగ్రహమే ఏకైక లక్ష్యము. విషయములమీదికి ఇంద్రియములను పోనీయకుండ పట్టవలె. కాని ఇందొక మార్గము సులభము, రెండవది కఠినము.

నిర్గుణోపాసకుడు సర్వభూతహితుడై యుండును. ఇది

సామాన్యవిషయము కాదు. విశ్వకల్యాణమును సాధించుట యనునది చెప్పుటకు తేలికయే. కాని ఆచరించుట చాల కష్టము. విశ్వకల్యాణమునుగూర్చి చింతన చేయువాడు చింతనతప్ప మరేమియు చేయడు. ఇంచుచేతనే నిర్గుణోపాసన కష్టము. సగుణోపాసనను తమ తమ శక్తి ననుసరించి అనేక విధములుగ అందరును చేయవచ్చును. మనము జన్మించిన గ్రామముయొక్క సేవ, లేక తల్లిదండ్రుల సేవ సగుణపూజ యగును. ఈ పూజ లోకకల్యాణమునకు విరుద్ధముకాకుండ ఉండుటయే మనము గమనింపవలసిన విషయము. చేయు సేవ ఎంత స్వల్పమైనను, ఇతరుల క్షేమమున కది భంగకరము కాకున్నచో భక్తిమార్గములో అదొక మెట్టే. అట్లుకానిచో ఆ సేవ ఆసక్తితో కూడినదగును. తల్లిదండ్రులు, పీడితులైన బంధువులు, సాధువులు, మహాత్ములు – వీరినందఱను ఈశ్వర స్వరూపులనుగ భావించి సేవింపవలె. ఈ భావముతో సేవ చేయుచు ఆనందము ననుభవింపవలె. ఈ సగుణపూజ సులభమైనది. నిర్గుణపూజ కఠినమైనది. ఈ భేదమే లేకున్న రెంటియొక్క ప్రయోజనమును ఒకటే. సౌలభ్యమునుబట్టిచూచిన సగుణమే శ్రేయస్కరము — అంతే!

సగుణము సులభమనియేకాక, మరొకవిధముగకూడ దానిని సమర్థింపవచ్చును. నిర్గుణోపాసనలో భయమున్నది. నిర్గుణము జ్ఞానమయము. సగుణము ప్రేమమయము. సగుణములో ఆర్ద్రత యున్నది. దానిలో భక్తుడు సురక్షితుడుగ నుండును. నిర్గుణములో కొంచెము ప్రమాదమున్నది.

నే నొకప్పుడు జ్ఞానముమీద ఎక్కువగ ఆధారపడి యుండు వాడను. కాని కేవలము జ్ఞానమువలననే ముందునకు పోలేనని అనుభవమువలన ఇప్పుడు తెలిసికొన్నాడను. జ్ఞానమువలన మనస్సులోని స్థూలమైన మాలిన్యము కాలి భస్మమైపోవును. కాని సూక్ష్మమైన మాలిన్యము నశింపదు. స్వావలంబనము, విచారణ, వివేకము, అభ్యాసము, వైరాగ్యము – ఈ సాధన లన్నియు అవలంబించినను, వీనిద్వారా సూక్ష్మమైన మాలి న్యము తొలగిపోదు. భక్తియను నీరు లేకుండ ఈ మైలను కడిగివేయలేము. ఆ శక్తి భక్తియను నీటికే యున్నది. దీనిని మీరు పరావలంబన మనిన అందురుగాక! కాని 'పర' అనిన 'మరియొక' అనికాక "శ్రేష్ఠపరమాత్మ" అని యనుకొని అతనిమీద ఆధారపడి యుండుడు. పరమాత్ముని సాహా య్యము లేకుండ మనోమాలిన్యము తొలగిపోదు.

ఇక్కడ 'జ్ఞాన' శబ్దముయొక్క అర్థమును సంకుచిత పరచితినని ఎవరైన అనవచ్చును. జ్ఞానమువలన మనో మాలి న్యము తొలగదని నే ననుటలో జ్ఞానముయొక్క మహిమను నేను తగ్గించుచున్నానని ఒప్పుకొందును. కాని శుద్ధజ్ఞానము మట్టిబొమ్మలైన శరీరధారులకు కష్టసాధ్యమని నా వాదన. శరీరముతో పొందు జ్ఞానము ఎంత శుద్ధమైనదైనను కొంత లోపము కలదిగను వికృతముగను ఉండును. ఈ దేహ ములో ఉత్పన్నమగు జ్ఞానశక్తి పరిమితముగనే యుండును. శుద్ధజ్ఞానోదయమైనచో దానితో సమస్త మాలిన్యమును భస్మీభూతమగు ననుటలో తిలమాత్రముకూడ నాకు సందే

హాము లేదు. చిత్తము నంటియున్న మాలిన్యము లన్నిటిని భస్మముచేయగల సామర్థ్యము జ్ఞానములో నున్నది. కాని వికారములతోకూడిన ఈ దేహాములో జ్ఞానమొక్క బలము తక్కువగా నుండును. ఇందువలన దానిచే సూక్ష్మ మాలిన్యములు నశించుట సంభవముకాదు. అందువలన భక్తిని ఆశ్రయింపనిచో సూక్ష్మమాలిన్యములు నిర్మూలింప బడజాలవు. కనుకనే మానవుడు భక్తిమార్గములో మిగుల సురక్షితుడై యుండును. ఈ 'మిగుల' అను విశేషణము నే నుపయోగించినదే ! ఇది గీతలోనిది కాదు. సగుణభక్తి సుల భము. ఇందులో పరమేశ్వరావలంబనమున్నది. నిర్గుణములో స్వావలంబనమున్నది. ఇందలి 'స్వ' అనునది మాత్రమేమిటి? అది హృదయస్థుడైన పరమేశ్వరుని దెల్పుమాట కాదా? అయినప్పుడు అట్టి పరమేశ్వరుని ఆశ్రయమనియేకదా స్వావ లంబన మనుమాట కర్థము ? కేవలము బుద్ధిసహాయతవలననే పరిశుద్ధుడైనవా డెక్కడను కనబడడు. స్వావలంబనవలన అనగా హృద్గతమైన ఆత్మజ్ఞానమువలన శుద్ధజ్ఞాన ము లభించును. సారాంశ మేమనగా నిర్గుణభక్తుని స్వావలంబనలోకూడ ఆత్మపై ఆధారపడుట యున్నది.

62

నిర్గుణము కలియనిచో సగుణముకూడ దోషయుతమే !

సగుణోపాసన చాల సులభము సురక్షితము అని నేను పైని చెప్పియున్నాడను. ఇప్పుడు నిర్గుణోపాసననుగూర్చికూడ అల్పే చెప్పగలను. నిర్గుణమున కొక హద్దు ఉండును. వేఱు

వేఱు సేవాకార్యములకు, తదితరములైన పనులకు మనము సంస్థలను స్థాపింతుము. సంస్థలు మొదట వ్యక్తుల నాధారము చేసికొనియే ప్రారంభమగును. అనగా మొట్టమొదట సంస్థకు వ్యక్తినిష్ఠ యుండును. ఆసంస్థ వికాసము పొందినకొలది దానిలో వ్యక్తినిష్ఠపోయి తత్త్వనిష్ఠ యేర్పడును. అట్లు తత్త్వనిష్ఠ యేర్పడనిచో, దానికి బలము చేకూర్చు వ్యక్తి లోపించి నంతనే ఆసంస్థలో అంధకారము వ్యాపించును. నాకు ప్రియమైన ఉదాహరణ ఒకటి యిచ్చెదను. రాట్నముయొక్క త్రాడు తెగినంతనే నూలువడుక లేము సరికదా, తీసిన బార కూడ కదురునకు చుట్టలేము. వ్యక్తి లోపించగానే సంస్థకు కూడ ఈ దశయేపట్టి అది యనాథసంస్థయైపోవును. అట్లు కాక వ్యక్తినిష్ఠనుండి తత్త్వనిష్ఠ ఉత్పన్నమైనచో ఈదుస్థితి కలుగదు. సగుణమునకు నిర్గుణము తోడ్పడవలెను. ఎప్పుడో ఒకప్పుడు వ్యక్తి సాకారమునుదాటి తత్త్వనిష్ఠలోప్రవేశించు అభ్యాసము చేయవలె. గంగ హిమాలయమునుండి-శంకరుని జటాజూటమునుండి – బయలుదేరి అక్కడనే ఆగిపోలేదు. ఆ జటాజూటమునుండి వెలువడి, అది అక్కడి గిరికందరములను, ఘట్టములను, అరణ్యములను దాటి సమతలములగు మైదానములలో గలగల జలజల ప్రవహించుచుండుటచేతనే సర్వజనులకును ఉపయోగపడుచున్నది. ఈ విధముగ వ్యక్తి యను ఆధారము పడిపోయినను తత్త్వమను బలిష్ఠమైన స్తంభముపై సంస్థ నిలువగలిగియుండవలె. ఇంటిలో దూది యేకు కమానును ముందుత్రాటితో వ్రేలాడగట్టుదుము. అలవాటయిన తరువాత ఆ త్రాడు తీసివేయుదుము. తరువాత త్రాడు

లేకపోయినను కమాను చేతిలో సరిగా నిలిచియున్నచో దానికి సరియైన ఆధారము చిక్కినట్లు భావింతుము. ఈ విధముగనే సగుణముతో ఉత్సాహము ప్రారంభమైనను చివరకు తత్త్వనిష్ఠతో-నిర్గుణముతో అది పూర్ణత్వమును పొందవలె. భక్తిగర్భమునుండి జ్ఞానోదయముకావలె. భక్తి లతకు జ్ఞానమను పుష్పములు పూవవలెను.

బుద్ధుడు తన యాలోచనలో స్ఫురించిన మూడు నిష్ఠలను బోధించెను. మొదట వ్యక్తినిష్ఠ, తర్వాత దాని నుండి తత్త్వనిష్ఠ, తత్త్వనిష్ఠ కలుగనిచో కనీసము సంఘ నిష్ఠయైనను ఉత్పన్నముకావలె. ఒక వ్యక్తియెడల నుండు గౌరవము పదిమందికి వ్యాపించవలె. ఇట్లు సంఘమునెడల ప్రేమ యేర్పడకపోయినచో పరస్పర వైమనస్యములు, కల హములు ప్రారంభమగును. వ్యక్తిశరణత తొలగి సంఘ శరణత రావలె. తరువాత సిద్ధాంతశరణత రావలె. ఇందు చేతనే బౌద్ధధర్మములో శరణత్రయ మిట్లు చెప్పబడినది.

"బుద్ధం శరణం గచ్ఛామి సంఘంశరణం గచ్ఛామి
ధమ్మం శరణం గచ్ఛామి."

మొదట వ్యక్తిమీదను, తరువాత సంఘము నెడలను ప్రీతి. కాని ఈ రెండు నిష్ఠలును బలహీనములైనవే. కనుక చివరకు సిద్ధాంతనిష్ఠ కలిగినప్పుడే సంస్థ నిలుచును. అప్పుడే అది లాభదాయకమగును. ఉత్సాహమను ప్రవాహము సగుణములో ప్రారంభమైనను అది సాగిసాగి నిర్గుణసాగర ములో కలియవలెను. నిర్గుణము కలియనిచో సగుణము

దోషయుతమగును. సగుణము నిర్గుణముయొక్క హద్దులలో నుండి తన స్థిరత్వమును కాపాడుకొనును. ఇందుచేత సగుణము నిర్గుణమునకు ఋణపడియుండును.

హిందూధర్మము, క్రైస్తవధర్మము, ఇస్లాంధర్మము మొదలైన ధర్మములన్నిటిలోను ఏదో యొక రూపములో మూర్తిపూజ అనుష్ఠింపబడుచునేయున్నది. అది అధమ శ్రేణికి చెందినదిగా తలపబడుచున్నను మాననీయమైనది, గొప్పది యని నా భావము. కాని మూర్తిపూజ నిర్గుణము యొక్క హద్దులలో నున్నంతవరకే దోషరహితముగ నుండును. నిర్గుణముయొక్క ఆశ్రయమును వదలగానే సగుణము దోషయుతమగును. అన్ని ధర్మములలోను సగుణము నిర్గుణముయొక్క ఆశ్రయమును వదలి అధోగతిపాలయినది. పూర్వము యజ్ఞములలో పశుహత్య జరిగెడిది. ఇప్పటికిని శాక్తేయులు దేవికి జంతువులను బలియిచ్చెదరు. ఇదిమూర్తి పూజపేర జరిగెడు అత్యాచారము. హద్దుమీరిన మూర్తి పూజ అపమార్గములో పడిపోయినది. కాని సగుణము నిర్గుణ నిష్ఠయొక్క హద్దులలో నున్నచో ఈ ప్రమాదములేదు.

63

సగుణ నిర్గుణములు పరస్పర పూరకములు : రాముని చరిత్రనుండి దృష్టాంతము

సగుణము సులభము, సురక్షితము. కాని సగుణమునకు నిర్గుణము ఆవశ్యకము. సగుణములో పురోగమించగా

నిర్గుణము – అనగా – తత్వనిష్ఠారూపమైన పుష్పము వికసించ వలె. సగుణ నిర్గుణములు పరస్పర పూరకములుగాని విరుద్ధ ములు కావు. సగుణమునుండి నిర్గుణమను అంతస్తునకు చేర వలెను. హృదయములోని సూక్ష్మమాలిన్యమును కడిగి వేయుటకు నిర్గుణమునకు సగుణముయొక్క ఆర్ద్రత అవ సరము. ఈ రెండును ఒకదాని కొకటి శోభ నిచ్చును. ఈ రెండురకముల భక్తియు రామాయణమునందు ఉత్తమ స్థాయిలో చూపబడినది. ఈ రెండురకములభక్తినిఅయోధ్యా కాండములో విపులముగ వర్ణించినారు. భరతునిభక్తి నిర్గుణ భక్తి. లక్ష్మణునిది సగుణభక్తి. నిర్గుణ సగుణభక్తుల స్వరూ పము ఈ యుదాహరణలద్వారా స్పష్టమగును.

రాముడు వనవాసమునకు వెళ్లునప్పుడు లక్ష్మణుని తనవెంట తీసికొని వెళ్లుటకు సిద్ధముగలేడు. ఆ తమ్మునిసాయ మవసరమని రామునికి అనిపించలేదు. అతడు లక్ష్మణునితో ఇట్లనును – "లక్ష్మణా! తండ్రిగారి ఆజ్ఞానుసారము నే నడవికి వెళ్లుచున్నాను. నీ వింటియొద్దనుండుము. నా వెంటవచ్చి దుఃఖములోనున్న తల్లిదండ్రులను మరింత దుఃఖపెట్టకుము. పితరులసేవ చేయుచు నీవు వారియొద్దనున్నచో నేను నిశ్చింత ముగా నుందును. నా ప్రతినిధిగ నీ వికడ నుండుము. నే నడవికిపోవుటచే కష్టములపాలగుదునని తలపవలదు. ఋష్యా శ్రమములకే కదా నా యీ ప్రయాణము?" ఈ విధముగ రాముడు తమ్మునికి నచ్చజెప్పినాడు. కాని లక్ష్మణుడు అన్న చెప్పిన దానినెల్లను ఒక్కమాటతో ఎగురగొట్టెను. ఒక్క

దెబ్బతో అది రెండుముక్కలయ్యెను. తులసీదాసు దీనిని సుందరముగ చిత్రించినాడు. లక్ష్మణు డిట్లనును — "నీవు చెప్పినది ఉత్కృష్టమగు నిగమనీతియే. నిజమునకు నేను దానిని పాలింపవలసినవాడనే. కాని యీ రాజ్యభారమును నేను మోయలేను. నీకు ప్రతినిధిగనుండగలశక్తి నాకులేదు. నేను బాలుడను."

"దీన్హి మోహి సిఖ్ నీకి గోసాఁ యీ
లాగి అగమ్ అపనీ కదరాయీ॥
నరవర్ ధీర్ ధరమ్-ధుర్-ధారీ।
నిగమ నీతికే తే అధికారీ॥
మైశిశు ప్రభు-సనేహ-ప్రతిపాలా।
మందరుమేరు కి లేహిఁ మరాలా॥"

హంస మేరుపర్వతమును మోయగలదా? రామచంద్రా! నేను నేటివరకును నీ ప్రేమలో పెరిగితిని. ఈ రాజనీతిని నీవు మరెవరికైనను నేర్పుము. నే నింకను బాలుడను" అని చెప్పి లక్ష్మణుడు ఊరకుండెను.

చేప నీటినివదలి యుండలేనట్లయినది లక్ష్మణుని స్థితి. రాముని వదలియుండు శక్తి అతనిలోలేదు. రామునియెడల సహానుభూతి అతని రోమరోమములోను నిండియున్నది. రాముడు నిద్రించుచున్నపుడుకూడ తాను మేల్కొని అతని సేవ చేయువాడు. ఇందులోనే అతనికి ఆనందముండెడిది. ఎవరైనను కంటిమీద కంకరతాయి విసరినచో వెంటనే చేయిపైకి లేచి ఆ దెబ్బను తాను భరించి కంటిని కాపాడును.

అల్లే లక్ష్మణుడు రామునికి చేతివలె నుండువాడు. రాము నిపై దెబ్బ పడబోయినచో లక్ష్మణు డా దెబ్బను తట్టుకొను వాడు. తులసీదాసు లక్ష్మణునిగూర్చి ఒక చక్కని యుదా హరణ నిచ్చినాడు. జెండా ఒక దండముపై ఎత్తున నెగురు చుండును. గానము, వందనము మొదలైనవన్నియు జెండాకే చేయుదుము. దానిరంగు, ఆకారము మొదలైనవానినిగూర్చి స్తుతిగీతములు పాడుదుము. కాని సూటిగా నిలిచియున్న ఆ స్తంభమును తలచువారెవరు ? రాముని యశస్సను పతాకకు ఆధారమైన దండము లక్ష్మణుడు. జెండాదండ మెప్పు డును ఒరగియుండరాదు. అట్టి దండమై నిలిచిన లక్ష్మణుడును ఎన్నడును ఒరగియుండలేదు. యశస్సెవరికి వచ్చినది ? రామునికి. ప్రపంచమునకు కనబడునది పతాక. దండముతో నెవ్వరికిని పనిలేదు. శిఖరము కనబడును. కాని క్రిందనున్న పునాది యెవరికిని కనబడదు. రాముని యశస్సు వ్యాపించి యున్నది. కాని లక్ష్మణుని యీరును పేరును లేదు. పదు నాలుగు వత్సరములు ఈ దండ మల్లే నిలిచియుండెను. ఏ వైపునకును ఇంచుక ఒరగలేదు. అతడు స్వయముగ రాముని వెనుకనే నిలిచి రామయశమును వ్యాపింపజేయు చుండెను. రాముడు అత్యంత కఠిన కార్యములను లక్ష్మణుని చేత చేయించెను. సీతను అడవిలో వదలిపెట్టుపని చివరకు లక్ష్మణునికే అప్పగించెను. పాపము లక్ష్మణు డల్లే ఆమెను అడవిలో వదలివచ్చెను. లక్ష్మణునికి స్వతంత్రముగా నెట్టి అస్తిత్వమును లేదు. లక్ష్మణుడు రాముని నేత్రములు, హస్తములు, పాదములు, మనస్సు ఆయెను. నది సము

ద్రములో కలిసినట్లే లక్ష్మణుని సేవ రామునిలో లీనమై పోయినది. అతడు కేవలము రాముని ఛాయగా నయ్యెను. లక్ష్మణుని ఈ భక్తి సగుణ భక్తి.

భరతుడు నిర్గుణభక్తుడు. అతనిపాత్రనుగూడ తులసీదాసు బాగుగనే చిత్రించినాడు. రాముడడవికి వెళ్లినప్పుడు భరతుడయోధ్యలోలేడు. అతడు తిరిగి వచ్చునప్పటికి దశరథుడు చనిపోయెను. 'ఇక నీవు రాజ్యము చేయవలె'నని గురువైన వసిష్ఠుడు భరతునికి నచ్చజెప్పుచుండగా నతడు "నేనుపోయి రాముని కలిసికొనిరావలె" నన్నాడు. రాముని చూచిరావలెనని భరతుడు లోలోపల తహతహ పడుచునే దానితోపాటు రాజ్యనిర్వహణమునకు వలసిన యేర్పాట్లు చేయుచుండెను. "ఇది రాముని రాజ్యము. దానిని నిర్వహించుట యనగా రాముని కార్యము నిర్వహించుటయే. ఈ సంపత్తి కెల్ల యజమానుడు రాముడు. దానికి తగిన యేర్పాటు చేయుటయే నా కర్తవ్యము" అని భరతుని భావము. లక్ష్మణునివలె భరతుడు ఈ కర్తవ్యభావననుండి విముక్తుడు కాలేకపోయెను. భరతుని భూమిక యిది. రామునివిూది భక్తియనగా రాముని కార్యము చేయుటయే. లేకున్నచో ఆ భక్తి యెందులకు? రాజ్యనిర్వహణమునకు ఏర్పాట్లన్నియుచేసి రాముని కలిసికొనుటకు భరతుడు అడవికి వెళ్లెను. "అన్నా! ఈ రాజ్యము నీది, నీవు—" అని యను నంతలో రాముడు "భరతా! నీవే రాజ్యము చేయుము" అనెను. అంత భరతుడు సంకోచముతో అట్లే నిలబడిపోయి

"నీ యాజ్ఞ నాకు ప్రమాణము" అనెను. రాము డన్నదెల్ల భరతునికి ప్రమాణము. అతడు తన సర్వమును రాముని కర్పించివేసెను. తిరిగివెళ్లి రాజ్యపాలనను ప్రారంభించెను. కాని అందలి విశిష్టతను చూడుడు— అయోధ్యకు రెండు మైళ్ల దూరములో అతడు తపస్వినగానుండి రాజకార్యములు చక్కబెట్టుచుండెను. చివరకు రాముడు తిరిగివచ్చి భరతుని కలిసినప్పుడు వారిలో వనమునందుండి తపస్సు చేసిన వారెవరో తెలిసికొనుట ప్రజలకు కష్టమయ్యెను. వయసులో కొంచెము భేదమున్నను రామభరతుల ముఖముద్రలలో ఒక రీతపోనిష్ఠ. కాన ప్రజలు రాము డెవరో భరతు డెవరో గుర్తింపలేని స్థితిలో బడిరి. చిత్రకారు డెవడైన ఈ దృశ్యమును చిత్రించి నచో అదెంత పవిత్రమైన దగును! ఇట్లు భరతుడు శారీరకముగ రామునికి దూరమునందున్నను మానసికముగ ఒక్క క్షణకాలమైనను రాముని ఎడబాయలేదు. ఒక ప్రక్క నతడు రాజ్యపాలనచేయుచున్నను మానసికముగ రాముని యొద్దనే యుండెను. నిర్గుణములో సగుణభక్తి పూర్ణముగ నిండియుండును. కనుక అట్టి స్థితిలో వియోగమను మాట భరతునికి స్ఫురించు రీట్లు? అతనికి వియోగబాధ కలుగనే లేదు. అతడు తన ప్రభువుయొక్క కార్యమును నిర్వహించుచునే యుండెను.

"రామనామము, రామభక్తి, రామోపాసన — ఇదంతయు మాకు బోధపడుట లేదు. మేము చేయునదంతయు దేవుని పనియే" అని ఈ కాలపు యువజనులనుచుందురు.

దేవుని కార్య మెట్లు చేయవలెనో భరతుడు చేసిచూపించెను. రాముని కార్యము చేయుచు భరతుడు రామవియోగమును విస్మరించెను. భగవద్వియోగము ననుభవించుటకు తీఱిక లేకుండ భగవత్కార్యము నిర్వహించుట వేఱు, భగవంతునితో ఆత్మీయమగు సంబంధము కాసంతయు లేక ఊరక అతనినిగూర్చి మాటలాడుట వేరు. భగవంతుని కార్యములు చేయుచు సంయమపూర్ణమైన జీవితము గడపుట దుర్లభము. భరతునిది నిర్గుణభక్తియైనను దానికి సగుణముయొక్క ఆధారము లేకపోలేదు. "రామా ! నీ మాట నాకు ప్రమాణము. నీ వేది చెప్పినను, అందు నాకు సందేహమేమియు లేదు" అని భరతుడు వెళ్లబోవుచు మరల వెనుకకు దిరిగి రామునివంక చూచి "రామా ! మనసు తృప్తిపడుటలేదు. ఏదో వెలితి అయినట్లు తోచుచున్నది" అనెను. వెంటనే రాము డతని మనోభావమును గ్రహించి "ఈ పాదుకలు తీసికో" అన్నాడు. సగుణము నెడల ఆదరణ చివర కుండనే యున్నది. సగుణము వచ్చి నిర్గుణమునకు మృదుత్వము నిచ్చెను. లక్ష్మణుడైనచో ఆ పాదుకలతో తృప్తిపడువాడు కాడు. ఇది యతని దృష్టిలో పాలు కావలసిన వానికి మజ్జిగ దొరకినట్లుండును. భరతుని భూమిక వేరు. అతడు రామునికి దూరముగానుండి కర్మ నాచరించెను. కాని అతని హృదయము రామమయము. భరతుడు కర్తవ్యపాలనమునే రామభక్తిగా నెంచుకొనెను. అతనికి పాదుకల ఆవశ్యకము ఎంతైనను కనబడెను. పాదుకలులేకపోయినచో అతడు రాజ్యపాలన చేయలేడు. పాదుకలఆజ్ఞ ననుసరించి అతడు తన కర్తవ్య

మును నిర్వహించెను. లక్ష్మణు డెంత రామభక్తుడో, భరతుడును అంతే. బాహ్యముగ చూచిన ఇరువురి భూమికలు వేరు వేరు. భరతుడు కర్తవ్యనిష్ఠుడు, తత్త్వనిష్ఠుడు అయినను ఆ తత్త్వనిష్ఠకు పాదుకలతోడి ఆవశ్యకము తప్పలేదు.

64

సగుణ నిర్గుణములు పరస్పర పూరకములు
కృష్ణుని చరిత్రనుండి దృష్టాంతము

హరిభక్తియను ఆర్ద్రిత ముఖ్యముగ కావలెను. ఇందు చేత భగవంతు డర్జునునితో — "మయాసక్తమనాః పార్థ" అర్జునా! నాయం దాసక్తితో, నా కృపారసమును క్రోలుచు కర్మ నాచరింపుము – అని పదేపదే చెప్పుచు వచ్చినాడు. ఆసక్తి యను శబ్దమునే సూచింపని, ప్రేమింపని భగవద్గీత, అనాసక్తుడవై రాగద్వేషరహితుడవై నిరపేక్షతో కర్మ నాచరింపుమని పదేపదేనొక్కి చెప్పు భగవద్గీత, అనాసక్తిని, నిస్సంగత్వమును పల్లవి అనుపల్లవిగా చేసిన భగవద్గీత "అర్జునా! నాయం దాసక్తినుంచుము" అని యనుచున్నది. కాని భగవంతునియం దాసక్తికలిగియుండుట చాల ఉత్కృష్ట విషయ మను సంగతి మనము లక్ష్యమునం దుంచుకొనవలె. అది ఏభౌతిక వస్తువుమీదనో మనము చూపు ఆసక్తికాదు. సగుణము నిర్గుణము – ఈ రెండును ఒకదానితో నొకటి పెనవేసికొని యుండును. సగుణము నిర్గుణముయొక్క ఆశ్ర

యమును పూర్తిగా వదలియుండజాలదు. అట్లే నిర్గుణమునకు సగుణముయొక్క ఆర్ద్రిత అవసరము. ఎల్లప్పుడును కర్తవ్య కర్మ నాచరించువానికర్మ పూజారూపమే. కాని పూజతో పాటు రసము, ఆర్ద్రిత (భక్తి) ఉండవలె. "మా మనుస్మర యుధ్యచ" నా స్మరణచేయుచునే కర్మనాచరింపుము. కర్మ వస్తుతః పూజయే! కాని దాని వెనుక సజీవమైన భక్తిభావము ఉండవలె. కేవలము పువ్వులతో చేయునది పూజకాదు. దానిలో భక్తిభావము ఉండవలెను. పుష్పములు సమర్పించుట ఒక పూజావిధానము. సత్కర్మలద్వారా పూజ చేయుట మరియొక పద్ధతి. కాని రెంటిలోను భక్తిభావము ఉండవలెను. పుష్పములు సమర్పింపుము. కాని భక్తిలేనిచో ఆ పూవులు కేవలము ఖాతిమీద పడవేసినట్లే. కనుక ముఖ్య వస్తువు భక్తి. సగుణము-నిర్గుణము, కర్మ-ప్రేమ, జ్ఞానము - భక్తి - వీని యన్నిటి రూపమును ఒకటే. వీని ద్వారా పొందు అనుభవము చివర కొకటే

ఉద్ధవార్జునుల విషయము తీసికొనుడు. రామాయణమునుండి ఒక్కసారిగ మహాభారతములోనికి దుముకుచున్నాను. ఇందులకు నా కధికార మున్నది. ఎట్లనగా రాము డన్నను కృష్ణు డన్నను ఒకటే. భరత లక్ష్మణులవంటి వారే ఉద్ధవార్జునులును. కృష్ణుడున్నచోటనెల్ల ఉద్ధవు డుండవలయును. కృష్ణునితోడి వియోగముఉద్ధవుడుక్షణమాత్రము కూడ సహింపలేడు. అతడు నిరంతరము కృష్ణుని సేవలో నిమగ్నుడై యుండును. కృష్ణుడువినా ప్రపంచమంతయు అతనికి రసవిహీనముగ నుండును. అర్జునుడుకూడ కృష్ణుని

సఖుడే! కాని యతడు దూరముగా ఢిల్లీలో నుండును. అర్జునుడుకూడ కృష్ణుని కార్యము నెరవేర్చువాడే! కాని కృష్ణుడు ద్వారకలోను, అర్జునుడు హస్తినాపురములోను ఉందురు. ఇద్దరి సంబంధమిది. కృష్ణుడు దేహత్యాగము చేయవలసి వచ్చినప్పుడు అత డుద్ధవునితో "ఉద్ధవా! నేనిక పోవుచున్నాను" అనెను. "నన్నుకూడ మీతో తీసికొని వెళ్లరా? మన ముద్దరమును కలిసియే పోవుదము" అన్నాడు ఉద్ధవుడు. కాని కృష్ణుడు "ఇది నాకు సమ్మతముకాదు. సూర్యుడు తన తేజస్సును అగ్నిలోఉంచి వెళ్లినట్లే నాజ్యోతిని నీలో ఉంచి పోవుచున్నాను" అని చెప్పినాడు. ఈ విధముగ భగవంతుడు ఉద్ధవునిపట్ల చరమనిర్ణయ మొనర్చి, జ్ఞానమును ప్రసాదించి అతనిని పంపెను. తరువాత కొన్నాళ్లకు కృష్ణుడు తన లోకమున కేగెను. ఈ వార్త ఉద్ధవునికి తీర్థయాత్రలో మైత్రేయఋషివలన తెలియవచ్చెను. కాని దీని కత డించుక యు చలింపలేదు. ఏమియు జరుగనట్లే యుండెను. "గురు మరా తో చేలా రోయా - దోనోం నే బోధ వ్యర్థ్ఖోయా" (గురువు చనిపోగా శిష్యు డేడ్చినాడు, ఉభయులును బోధను వ్యర్థమొనర్చినారు) - ఇట్టిగతి ఉద్ధవునికి పట్టలేదు. వియోగము కలుగనట్లే యున్నా డతడు. అతడు జీవితము పొడుగునను సగుణోపాసన చేసినవాడు. ఎప్పుడును పరమేశ్వర సన్నిధినేఉండువాడు. కాని ఇప్పుడతడు నిర్గుణములోనేఆనందమును పొందుచు, నిర్గుణమను మజిలీని చేరుకొన్నాడు. సాధన సగుణముతో ప్రారంభమైనను నిర్గుణ మను మెట్టును ఎక్కవలసియే యున్నది. లేకున్న పరిపూర్ణత కలుగదు.

అర్జునునిస్థితి దీనికి వ్యతిరేకము. శ్రీకృష్ణుడు అతని నేమిచేయుమనెను ? తాను పోయినతరువాత తన స్త్రీల రక్షింపుమనెను. అర్జునుడు ఢిల్లీనుండి ద్వారకకు వచ్చి శ్రీకృష్ణుని స్త్రీలను తీసికొని ఢిల్లీకి బయలుదేరెను. దారిలో హిసార్ దగ్గర పాంచాలచోరులు వారిపైబడి సొమ్ములు దోచుకొనిపోయిరి. తా నొక్కడే నగుడని, మహావీరుడని, పరాజయ మెరుగనివాడని, విజయుడని ప్రసిద్ధికెక్కిన అర్జునుడు, ప్రత్యక్షముగ శివునితో యుద్ధముచేసి ఓడించిన అర్జునుడు చివర కీ సందర్భములో అజమీరునకు పారిపోయి ప్రాణమును రక్షించుకొనెను. కృష్ణుని వియోగమువలన అతడు చాల కలతపడి జీవచ్ఛవమైపోయినాడు. దీని సారాంశమిది : సర్వదా కర్మరతుడయి, కృష్ణునికి దూరముగనుండి నిర్గుణోపాసన చేసిన అర్జునునికి చివర కీ వియోగభారము దుస్సహమయినది. దీనితో అతడుచేసిన నిర్గుణోపాసనకే ముప్పు వాటిల్లినది. నిర్గుణమునకు సగుణానుభవము తప్పినదికాదు. సగుణము, నిర్గుణము పరస్పర పూరకములయి పూర్ణత్వమును పొందును. దేనికది పూర్ణముకాదు.

65

సగుణమును నిర్గుణమును ఒకటే యను
విషయమున స్వానుభవములోని ఒక కథ

అందువలన సగుణ నిర్గుణోపాసకు లిరువురనడుమ నుండు భేదమును వివరింపవలెనని భావకుంటువడును. సగు

ణము, నిర్గుణము చివరకొకటే. భక్తిస్రవాహము మొదట సగుణములో ప్రారంభమైనను చివరకు నిర్గుణములో పరిసమాప్తి నొందును. వెనుక నొకసారి నేను 'వైకము' సత్యాగ్రహమును చూచుటకు వెళ్లితిని. మలబారు సరిహద్దులో శంకరాచార్యుడు జన్మించిన గ్రామ మున్నదని భూగోళపరిచయమునుబట్టి నాకు తెలియును. నేను వెళ్లుమార్గమునకు సమీపములోనే పూజ్యులు శంకరాచార్యుల 'కాలడీ' గ్రామ ముండితీరవలెనని నాకు తోచి అదెక్కడనున్నదో నీకు తెలియునా యని నా వెంటనున్న మళయాళీసోదరుని అడిగితిని. అతడది అక్కడికి పది పండ్రెండుమైళ్లలోనే యున్నదని చెప్పి "మీరక్కడికి వెళ్లదలచితిరా?" అని నన్నడిగెను. 'లే'దంటిని. నేను వెళ్లుట సత్యాగ్రహము చూచుటకు. కనుక మరెక్కడికి వెళ్లుటయు ఉచితముకాదని అప్పుడు నే నక్కడికి వెళ్లనైతిని. అదట్లు జరుగుట సమంజసమేయని ఇప్పటికిని నా కనిపించును. కాని ఆ రాత్రి నిద్రలో ఆ 'కాలడీ' గ్రామమును, శంకరాచార్యుని మూర్తియు సర్వదా నా కనులకు కట్టినట్లుండెను. నా నిద్ర యెగిరిపోయెను. ఈ నాటికిని ఇదే నా యనుభవము. శంకరాచార్యుని జ్ఞానప్రభావమును, దివ్యమైన అద్వైతనిష్ఠయు, ఎట్టయెదుట కనబడుచున్న ప్రపంచమెల్ల మిథ్యయని నిర్ధూపించగల అలౌకికమైన ఉజ్జ్వలమైన వైరాగ్యమును, గంభీరమైన వాణియు, ఆయనవలన నాకు కలిగిన మహోపకారమును - ఇన్నిటితో నా హృదయము నిండి రాత్రులకు రాత్రులే గడచిపోవునవి. నిర్గుణములో సగుణమెట్లు ఓత

ప్రోత్తమై యుండునో అప్పుడు నా కర్థమయ్యెను. ప్రత్యక్ష దర్శనములోకూడ అంతటి ప్రభావము ఉండదు. నిర్గుణములో కూడ సగుణముయొక్క సారము పూర్తిగ నిండియుండును. కుశలవార్తలు తెలిసికొనుటకు విశేషించి నే నెవరికిని లేఖలు వ్రాయను. కాని ఏ మిత్రునికి లేఖలు వ్రాయకపోయినను హృదయములో అతనిని నిరంతరమును స్మరించుచునే యుందును. ఈ విధముగ నిర్గుణములో సగుణము గుప్తముగా నుండును. సగుణము, నిర్గుణము – ఈ రెంటి రూపమును ఒకటే. (౧) ప్రత్యక్షముగ మూర్తిని పూజించుట, ప్రకటరూపమున సేవాకార్యములుచేయుచుండుట (౨) ప్రకట రూపమున పూజను, సేవాకార్యములను వెలువరింపకపోయినను లోకకల్యాణముకొరకు హృదయములో నిరంతరమును చింతనచేయుచుండుట – ఈ రెంటి విలువ, యోగ్యత సమానము.

66

సగుణ నిర్గుణములు కేవలము దృష్టి భేదములే ! కావున
భక్తలక్షణముల నార్జింతముగాక ! సారాంశమిదియే !

సగుణ మేదో, నిర్గుణమేదో నిశ్చయించుట తేలికైన పనికాదు. ఒక దృష్టిలో సగుణమైనది మరొకదృష్టిలో నిర్గుణముగ నిర్ణయము కావచ్చును. శిలావిగ్రహముద్వారా చేయుదానిని సగుణసేవ యందుము. ఆ శిలలో భగవంతుని మూర్తీభవింపజేయుదుము. మన తల్లిలోను, మహాత్ములలో

లోను చైతన్యమును ప్రత్యక్షముగ మనము దర్శించు చుందుము. వారిలో జ్ఞానము, ప్రేమ, సుహృద్భావము, స్పష్టముగ గోచరించుచుండును. అయినను మనము వారిని పరమాత్మగ భావించి పూజింపము. ఈ చైతన్య స్వరూపులు ఎల్లరకును కనబడుచునేయుందురు. కావున వారిలో సగుణ పరమాత్మను దర్శించి సేవింపవలెను. కాని అట్లు చేయక మానవులు జాతిలో పరమేశ్వరుని చూతురు. ఒక దృష్టిలో జాతియందు పరమేశ్వరుని చూచుట నిర్గుణముయొక్కతుది మెట్టు. మహాత్ములు, తల్లిదండ్రులు, ఇరుగుపొరుగువారు— వీరిలో ప్రేమ, జ్ఞానము, ఉపకారబుద్ధి వ్యక్తమగుచుండును. వారిలో ఈశ్వరుని చూచుట తేలిక. కాని జాతిలో ఈశ్వరుని చూచుట కష్టము. నర్మదానదిలోని జాతిని శంకరునిమూర్తిగ భావింతుము. ఇది నిర్గుణపూజ కాదా ? కష్టమనుకొను నదియే మరియొక దృష్టిలో చూచిన సులభ మనిపించును; జాతిలో పరమేశ్వరుని భావింపలేకపోయినచో మరి భావింపగలుగున దెక్కడ ? భగవంతుని మూర్తిగా నుండుటకు తగినది జాయియే. అది నిర్వికారము, శాంతము. అంధకారమయినను, వెలుతురయినను, వేడియైనను, చలి యైనను ఆ జాయి యేమియు చలింపదు. ఇట్టి నిర్వికార మయిన జాయియే పరమేశ్వరుని చిహ్నముగా నుండదగినది. తల్లిదండ్రులు, ప్రజానీకము, ఇరుగుపొరుగువారు - వీరందరును కొలదిగనో గొప్పగనో వికారములతో కూడియుందురు. కావున జాతిని పూజించుటవలె వీరిని భగవద్భావనతో పూజించుట ఒక దృష్టిలో కఠినమే !

సగుణ నిర్గుణములు పరస్పరపూరకము లని సారాంశము. సగుణము సులభము, నిర్గుణము కఠినము. కాని మరొక దృష్టిలో సగుణము కఠినము. నిర్గుణము సులభము. రెంటిద్వారా ఒక లక్ష్యమునే చేరుకొందుము. ఇరువదినాలుగు గంటలును కర్మ నాచరించుచు లేశమాత్రమును కర్మచేయని యోగి, ఎప్పుడును ఏ మాత్రమేని కర్మ నాచరింపక సమస్త కర్మలను చేయు సంన్యాసి – ఈ యిరువురును ఒకరే యని అయిదవ అధ్యాయములో చెప్పబడినట్లే ఇక్కడకూడ చెప్పవచ్చును. సగుణ కర్మయోగము, నిర్గుణ సంన్యాస యోగము–రెండును ఒకటే. సంన్యాసమా, కర్మయోగమా ఏది శ్రేష్ఠమను ప్రశ్నకు ప్రత్యుత్తర మిచ్చుట భగవంతుని కెట్లు కష్టమయినదో ఇక్కడను అట్లే యైనది. చివరకు సాధనలో ఒకదానికంటె నొకటి సులభమను విషయమును లక్ష్యములో నుంచుకొని భగవంతుడు సమాధాన మిచ్చెను. లేకున్న యోగము–సంన్యాసము, సగుణము – నిర్గుణము అన్నియు ఒకటే. భగవంతుడు చివర కిట్లన్నాడు. "అర్జునా ! నీవు సగుణోపాసన చేయుము. లేక నిర్గుణోపాసన చేయుము. ఏదైనను సరే! కాని నీవు భక్తుడవు మాత్రము కావలె! ఆతివి మాత్రము కావలదు" అని చెప్పి చివరకు భక్తుని లక్షణములు బోధించెను. అమృతము మధురముగ నుండును. కాని దాని మాధుర్యమును మనము చవిచూడలేము. కాని భక్తుని లక్షణములు ప్రత్యక్ష మధురములు. వీనిని మనము ఊహింపవలసినపని లేదు; అనుభవములోనికి తెచ్చుకొందము గాక ! ఈ యధ్యాయములోని భక్తలక్షణములను స్థిత

ప్రజ్ఞని లక్షణములవలెనే మనము నిత్యమును పఠింపవలెను. మననము చేయవలెను. వానిని మెల్లగ నిత్యానుభవములోనికి తెచ్చుకొని పుష్టిమంతులము కావలెను. ఈ విధముగ మనము మన జీవితములను మెల్లమెల్లగ పరమేశ్వరుని వైపునకు నడుపుకొనుచు పోవలెను.

గీతా ప్రవచనములు

పదుమూడవ అధ్యాయము

ఆత్మానాత్మ వివేకము

67

కర్మయోగమున కుపకరించు దేహాత్మల – పృథక్కరణ

సోదరులారా!

వ్యాసదేవుడు తన జీవితసారమును భగవద్గీతలో పొందుపరచెను. ఆయన ఇంకను అనేక గ్రంథములు విపుల ముగ వ్రాసెను. ఒక్క మహాభారత సంహితయే లక్ష – లక్షపాతిక వేల శ్లోకముల గ్రంథము. సంస్కృతములో 'వ్యాస' శబ్దమునకే 'విస్తార'మని యర్థము. కాని భగవద్గీతలో ఆయన పోకడ విస్తరణవైపునకు మ్రొగ్గలేదు. భూమితి శాస్త్రములో తత్త్వమును సిద్ధాంతమును యూక్లిడు చెప్పి నట్లే వ్యాసదేవుడు గీతయందు జీవితోపయోగ తత్త్వమును వ్రాసియుంచెను. భగద్గీతలో విశేష చర్చగాని విశేష వ్యాఖ్యానముగాని లేదు. దీనికి ముఖ్యకారణమేమన గీతలో చెప్పబడిన విషయములను ప్రతిమానవుడును పరిశీలించుకొని వానిని తన జీవితములో ప్రయోగించుకొనవలెనని ఆయన

యుద్దేశము. జీవితమున కుపయోగపడువిషయములుమాత్రమే గీతలో చెప్పబడినవి. అట్లు చెప్పుటలో వ్యాసునియుద్దేశముకూడ అదే! కావుననే అతడు తత్త్వమును క్లుప్తముగ చెప్పి సంతృప్తి చెందినాడు. ఇట్లు తృప్తిపడుటలో అతని సత్యనిరతి, అనుభవ సిద్ధమైన ఆత్మవిశ్వాసము మనకు కనబడుచున్నవి. సత్యమైన విషయమును సమర్థించుటకు ఎక్కువ యుక్తితో పనిలేదు.

గీతమీద మనము దృష్టి పెట్టుకొనుటలో ముఖ్యోద్దేశ మేమనగా జీవితములో మనకు సాహాయ్యము అవసరమైనపుడెల్ల గీతనుండి మనకది కలుగుచుండవలెనని. అట్టిసాయమును మన కది యెల్లపుడును ఇచ్చుచున్నట్లే యుండును. గీత జీవనోపకారియగు శాస్త్రము. కావుననే దానిలో స్వధర్మము అంతగా నొక్కి చెప్పబడినది. మానవ జీవితమునకు స్వధర్మాచరణయే గట్టి పునాది. జీవిత సౌధము ఈ పునాదిమీదనే నిర్మితముకావలె. ఈ పునాదియొక్క గట్టితనమునుబట్టి భవనమయొక్క మనుగడ యుండును. ఈ స్వధర్మాచరణను గీత 'కర్మ'యనును. స్వధర్మాచరణకు సన్మిహితముగనుండు అనేకములగు ఇతర విషయములుకూడ ఇందుప్రతిపాదింపబడినవి. వాని రక్షణకొరకు అనేక వికర్మలు చక్కగా సూచింపబడినవి. స్వధర్మాచరణను సుందరముగాను, ఆకర్షణీయముగాను, ఫలప్రదముగాను చేయుటకు కావలసిన ఆధారమును, సాహాయ్యమును సమకూర్చుట అవసరము. ఇంచుచేత ఇటువంటి సంగతులనేకములు మన మింతవరకు గీతలో చూచినారము. అవి చాలవరకు భక్తి

రూపమైనవి. ఇప్పుడు పదుమూడవ అధ్యాయములో మనము చూడబోవు విషయముకూడ స్వధర్మాచరణకు చాల ఉప యోగపడునదే. ఈ సాహాయ్యము భావివికాసముద్వారా జరుగును.

స్వధర్మము నాచరించువాడు ఫలత్యాగము చేయ వలసి యున్నాడను ముఖ్యవిషయము గీతలోసర్వత్ర చెప్పబడి యున్నది. విధిగా కర్మను చేయుము. కాని దాని ఫలమును విడిచిపెట్టుము. చెట్టునకు నీరు పోసి పోషింపుము. కాని దాని నీడను, ఫలపుష్పములను స్వయముగ అనుభవింపవలెనని కోరకుము. స్వధర్మము నాచరించు కర్మయోగము యొక్క రూప మిది. కర్మయోగ మనగా కేవలము కర్మలను చేయు చుండుట యని కాదు. ఈ సృష్టిలో కర్మ అంతటను జరుగు చునే యుండును. ఆ విషయము లెక్కకు రానక్కరలేదు. కాని ఇటువంటి వట్టికర్మకాక, స్వధర్మాచరణరూపమైన కర్మను చక్కగా నాచరించుచు దాని ఫలమును వదలిపెట్టు మని చెప్పట, గ్రహించుట తేలికయేకాని, ఆచరించుట కష్టము. ఎందువలన ననగా ఏ కార్యమునకైనను ప్రేరేపించు నది దాని ఫలవాంఛయే! ఫలవాంఛ లేకుండ కర్మ నాచరించుట తలక్రిందుపద్ధతి. ఈ పని లోకవ్యవహారమునకు విరుద్ధము. బహు కష్టాలాచరించువాడు కర్మయోగి అని మనము గీతాదృష్టిలో తలచుచుగా తలంతుము. ఎడతెగని పనులు చేయువాని జీవితము కర్మయోగమయమని మన లెక్క. కాని ఇది సరియైన నిర్వచనము కాదు. గీత యిచ్చు నిర్వచనమునుబట్టి చూచిన ఇట్టివాడు కర్మయోగి కాడు.

కర్మ నాచరించు లక్షలకొలది ప్రజలలోను – వట్టికర్మలేకాక స్వధర్మమును ఆచరించువారిలోనుకూడ – గీత నిరూపించిన కర్మయోగులు లభించుట కష్టసాధ్యము. కర్మయోగము యొక్క సూక్ష్మమైన, నిజమైన అర్థమునుబట్టి చూచిన సంపూర్ణుడైన కర్మయోగి ఎక్కడను దొరకడనియే చెప్పవచ్చును. కర్మ నాచరించుట, దాని ఫలమును వదలివేయుట కేవలము అసాధారణవిషయము. అయినను గీతయింతవరకును కర్మను కర్మఫలమును వేరుచేయుమనియే చెప్పుచువచ్చినది.

ఈ పృథక్కరణ ఆచరణయోగ్యమగుటకే మరియొక పృథక్కరణ ఈ పదుమూడవ అధ్యాయములో చెప్పబడినది. "కర్మ నాచరింపుము, ఫలాసక్తిని వదలివేయుము" అను పృథక్కరణకు "దేహమును ఆత్మను వేరుపరుచు"మను మహోత్కృష్టమైన పృథక్కరణ చాల సాయపడును. పదుమూడవ అధ్యాయములో ప్రతిపాదింపబడిన దిదియే. మనకనుల కగపడు రూపమును మూర్తి, ఆకారము, దేహము అని యందుము. మన నేత్రములకు బాహ్యరూపము పరిచితమైనను దాని ఆంతర్యమునుగూడ మనము తెలిసికొనవలెను. ఫలముయొక్క పై చర్మమును ఒలిచి లోపలి గుంజును రుచి చూడవలె. కొబ్బరికాయపైగల కవచము తొలగించినప్పుడు లోపలి కొబ్బరి కనబడును. పనసపండునుకూడ అట్లు చేసినచే లోపల చక్కని తియ్యని తొనలు కనబడును. స్వవిషయమునగాని, ఇతరుల విషయమునగాని బహిరంతరములను వేరుచేసి చూచుట అవసరము. ఇట్లు పై తొడుగును వేరు

చేయుట యన నేమి ? ప్రతి వస్తువుయొక్క బాహ్యరూపము నుండి లోపలిసారమును వేరుచేసి చూచుటయని యర్థము. ప్రతి వస్తువునకును వెలుపల దేహమని లోపల ఆత్మయని రెండు ఉండును. కర్మవిషయములోకూడ ఇంతే. బాహ్య ఫలము కర్మకు దేహము. కర్మనాచరించుటచే కలుగు చిత్త శుద్ధి కర్మకు ఆత్మ. స్వధర్మాచరణయొక్క బాహ్యఫలమును దేహమును వదలిపెట్టును; ఆంతరమగు చిత్తశుద్ధి యను ఆత్మను గ్రహించి నూతన చైతన్యమును పొందుము. ఈవిధముగా చూచు అభ్యాసముతో దేహమును వేరుచేసి, ప్రతి వస్తువులోని సారమును గ్రహించుదృష్టిని మనము అలవరుచుకొనవలెను. కంటికి, మనస్సునకు, భావనకు ఇటువంటి శిక్షణను, అభ్యాసమును నేర్పవలెను. ప్రతి విషయమునందును దేహమును వెరుపరచి ఆత్మను గౌరవింపవలెను. మన భావ వికాసముకొరకు పదుమూడవ అధ్యాయము ఈ పృథక్కరణను బోధించినది.

68

సంస్కరణకు మూలాధారము

సారమును గ్రహించు దృష్టిని కుదుర్చుకొనుటలో చాల మహత్త్వమున్నది. బాల్యమునుండియు మన మిట్టి అభ్యాసమును చేసిన నెంతబాగుగానుండును ! ఈ విషయము జీర్ణముచేసికొనదగినది, ఈ దృష్టి అంగీకరింపదగినది.

అధ్యాత్మవిద్య జీవితమునకు సంబంధించినది కాదని చాల మంది అనుకొందురు. అట్టిసంబంధ మేదేని ఉన్నను అది యుండరాదని కొందఱు యుద్దేశము. కాని దేహమునుండి ఆత్మను వేరుగ భావించెడు శిక్షణను బాల్యమునుండియే అలవరిచికొనుట శుభప్రదముగ నుండును. ఇది శిక్షణ శాస్త్రమునకు సంబంధించిన విషయము. నేటి కుశిక్షణ ఫలితముగ బిడ్డలకు చాల చెడ్డసంస్కారములు అబ్బుచున్నవి. ఈ కుశిక్షణలో నున్నంతకాలము ఈ దేహమే నేనను భావమును దాటిపోలేము. దేహభ్రాంతివలన ఇంద్రియలోలత్వములోనే కాలమంతయు గడచిపోవును. ఇట్లెన్నాళ్లు గడచినను దేహము సేవకు తగినఉపకరణముగా ఏర్పడజాలదు. ఈ విధముగనే దేహమునకు వృథాపూజ జరుగుచున్నది. ఆత్మ మాధుర్యమువైపునకు దృష్టిపోవుటయే లేదు. వర్తమాన శిక్షణవిధానమువలననే ఈ స్థితి యేర్పడినది. ఇట్లు అహర్నిశము దేహమునకు మూర్తిపూజ చేయుచున్నాము.

అతిబాల్యమునుండియు దేహమును దైవముగ పూజించు శిక్షణ మనకీయబడుచున్నది. పిల్లవాని కాలికి కొంచెము ఎదురుదెబ్బ తగిలినచో దాని కింతమట్టి యంటించిన సరిపోవును. దెబ్బ చిన్నదైనచో ఆ మట్టి అద్దవలసిన అవసరముకూడ వానికి కనిపించదు. చిన్న దెబ్బలను పిల్లవాడు లెక్కచేయడు. కాని కట్టువాని సురక్షకుడు ఇట్లూరకుండ లేడు. అతడు పిల్లవానిని దగ్గరకుపిలిచి బుజ్జగించి "ఎంత దెబ్బతగిలినది? ఎట్లు తగిలినది? ఎక్కడ తగిలినది? పెద్ద

దెబ్బయే తగిలినదే! అరే, రక్తముకూడ వచ్చుచున్నదే!'' అని యనుచు, కుట్టివాడు ఏక్ష్వక పోయినను వానినేడ్పించును. ఇట్లు ఏడ్వని కుట్టివానిని ఏడ్పించు లక్షణము నే మనవలెను! "నాయనా! గంతులువేయకుము. అటలకు పోవలదు. పడెదవు. దెబ్బతగులును.''అని కేవలము దేహముమీదనే దృష్టి నిలుపు శిక్షణ పిల్లల కీయబడుచున్నది.

బాలుని ఎందులకేని మెచ్చుకొన్నను అది కేవలము దేహదృష్టితోనే. వాని నొకప్పుడు నిందించినచో అదియు దేహదృష్టితోనే. బిడ్డనుచూచి "ఎంత మురికితో నున్నావురా?" అని యందురు. దీనివలన కుట్టివాని కెంతో మనోవ్యథ కలుగును. ఇది ఎంత మిథ్యారోపణ! కుట్టివాడు మురికితో నున్నమాట నిజమే! వానినిశుభ్రపరుపవలసియుండగా వాని నిట్లు నిందించి హింసించుట యెందులకు? కుట్టివాడు దీనిని సహింపలేడు. వాడు చాల విచారపడును. వాని యంతరాత్మలో పవిత్రత, నైర్మల్యము నిండియున్నను పాపము! వానిపై వృథాగా ఇట్టి యారోపణ యెందులకు! నిజమునకు ఆ కుట్టివాడు మురికివాడు కాడు. అతి సుందరము, మధురము, పవిత్రము, ప్రియము అయిన పరమాత్మ స్వరూపమే వాడు. పరమాత్మయొక్క అంశమే వానిలో మూర్తీభవించి యున్నది. అట్టివానిని పట్టుకొని ''మురికివాడా!" అందురు. ఆ మాలిన్యముతో వానికేమి సంబంధమున్నది? ఇంతకు ఆ మాలిన్యమున్నట్లు వానికి తెలియదు. అందుచేతనే ఈ నిందను వాడు సహింపలేడు. వాని మనస్సు

క్షోభపడును. అట్టివానిలో నిక సంస్కరణకు అవకాశము లేదు. అందువలన చక్కగా నచ్చజెప్పి వానిని పరిశుభ్ర పరుపవలెను.

కాని ఇందులకు విరుద్ధమైన పద్ధతుల నవలంబించి "దేహమే తాను" అను భావమును వానిలో బలపరుచుచున్నాము. దేహాత్మల పృథక్కరణను శిక్షణశాస్త్రములో నొక ఉత్తమోత్తమ సిద్ధాంతముగ భావింపవలె. తనయొద్ద విద్య నభ్యసించు శిష్యుడు సర్వాంగ సుందరు డను భావన గురువున కుండవలె. కాని ఇప్పు డా భావన కనబడదు. లెక్కలలోగాని, ప్రశ్నకు సమాధాన మిచ్చునప్పుడుగాని పిల్లవాడు తప్పు చెప్పినచో గురువు చెంపదెబ్బవేయును. పిల్లవాని తప్పునకును చెంపదెబ్బకును ఏమి సంబంధము? బడికి ఆలస్యముగ వచ్చినచో చెంపదెబ్బ పడినదన్నమాటే! అందువలన వాని చెంప కందునేకాని వాడు త్వరగా బడికివచ్చునా? చెంపమీద తేలినవ్రేళ్లు బడికిరావలసిన గంటను వానికి తెలుపగలవా? నిజమునకు ఈ దెబ్బవలన వానిలోని పశుత్వమును పెంచుచున్నాము. నీవే "దేహమేసుమా!" అను భావమును దృఢపరుచుచున్నాము. కుఱ్ఱవాని జీవితమును భయమను పునాదిమీద నిర్మాణము చేయుచున్నాము. వాని జీవితమును సంస్కరించు ఉద్దేశమే మనకున్నచో ఈ విధముగ హింసపెట్టి, దేహాసక్తిని పెంచము. ఇందువలన వానిలో ఎన్నటికిని సంస్కరణను తీసికొనిరాలేము. "దేహమునుండి నేను వేరు" అని గ్రహించినప్పుడే సంస్కరణము కలుగును.

తనలో శారీరక, మానసిక దోషము లున్నట్లు మానవుడు గుర్తించుకొనుట తప్పు కాదు. ఈ జ్ఞానము దోషములను తొలగించుకొనుటకు సాయపడును. కాని "నేను దేహమను కాను. ఈ దేహమునుండి పూర్తిగా భిన్నము, అత్యంత సుందరము, ఉజ్జ్వలము, దోషరహితము – అయిన ఆత్మను" అని మానవుడు స్పష్టముగా గ్రహింపవలయును. తాను నిర్దోషియగుటకు చేసికొను ఆత్మపరీక్షనుకూడ దేహభావమును తొలగించుకొనియే చేసికొనవలెను. అట్టివాడు ఎవరైనను తనదోషమును పట్టి తనకు చూపినచో ఏమియు అనుకొనడు. చూపినవానిమీద వానికి కోపము రాదు. మీదు మిక్కిలిశరీరముతో, మనస్సుతోకూడిన ఈ యంత్రములోని దోషములను పరిశీలించుకొని, వానిని తొలగించుకొనును. అట్లు దేహమునుండి తన్ను వేరుగా చూచుకొనలేనివాడు తానై తన్ను సంస్కరించుకొనలేడు. "ఈ దేహము, ఈ పిండము, ఈ మట్టిబొమ్మ – ఇదే నే" ననుకొనువాడు తన్ను దా నెట్లు సంస్కరించుకొనగలడు? ఈ దేహము సాధనమై నాకు లభించినదని నమ్మినప్పుడే నాలో సంస్కరణ రాగలదు. ఎవరైనను నా రాట్నములో లోపమును చూపినచో వారిమీద నాకేమైన కోపము వచ్చునా? ఏదైన దోషమున్నచో దానిని సవరించుకొందును. శరీర విషయము కూడ ఇంతే? వ్యవసాయపుపనిముట్లవంటిదే ఈ దేహము కూడ. భగవంతుని సేవ్యమునకు ఉపకరించు పనిముట్లీ దేహము. పనిముట్లు చెడినచో వెంటనే దానిని తప్పక సరిదిద్దుకొనవలె. సంస్కరించుకొనవలెను. ఈ దేహము

సాధననిమిత్త మీయబడిన వస్తువు. అందువలన మనము దేహమునుండి మనలను వేరుపరుచుకొని, దోషవిముక్తికొఱకు ప్రయత్నింపవలె. "దేహమును ఈ పనిముట్లునుండి నేను వేరు, దీనికి నేను స్వామిని, దీనిచేత నేను ఉత్కృష్టమైన సేవా కార్యములను చేయింతును" అని బాల్యము నుండియే "దేహము వేరు, తాను వేరు" అను వృత్తిని మానవుడు అలవరుచుకొనవలె.

స్వయముగ ఆటలో పాల్గొనకుండ మధ్యవర్తిగ నుండువాడు ఆటలోని గుణదోషములను నిర్లిప్తముగ చూడ గలిగినట్లు మన దేహ మనో బుద్ధులనుండి మనము వేరై యుండియే వాని గుణదోషములను పరిశీలింపగలము. ఒకొక్కడు— "నా జ్ఞాపకశక్తి యేదో కొంచెము తగ్గిపోయిన దండీ! దీని కేదైన ఉపాయము చెప్పగలరా?" అనును. మనుష్యుడిట్లనుటలో తాను "జ్ఞాపకశక్తినుండి వేరు" అని స్పష్టమగుచున్నది. "నా జ్ఞాపకశక్తి చెడిపోయినది" అని అతడనును. ఇందువలన వాని కున్న సాధనసామగ్రిలో ఒక పనిముట్లు చెడిపోయినదని వాని భావన. ఒకడు తన పిల్లవాడు పోయినాడనును. లేక తన పుస్తకము పోయిన దనును. కాని యెవ్వడును తన్ను తాను కోల్పోజాలడు. చివరకు మరణసమయములో పూర్ణముగ నష్టమగునది దేహమే! పనికిరాకుండ పోవునది అదే! కాని లోపలి ఆత్మవస్తువుమాత్రము చెక్కుచెదరకుండ ఉండును. అది నిర్దోషము, నీరోగముగనుండును. ఇది గ్రహింపదగిన విషయము. దీనిని గ్రహించి మన మోపెక్కుచిక్కులు తొలగిపోవును.

69

దేహసక్తితో దేహము బంధింపబడినది

'దేహమే నేను' అను భావన సర్వత్ర వ్యాపించినందు నలన మనుష్యుడు వివేకములేక దేహపుష్టికొఱకు అనేక సాధనలను నిర్మించుకొనును. వానినిచూచిన భయమగును. ఈ దేహ మెంతస్రాతదయి జీర్ణమయిపోయినను ఏదోయొక ఉపాయముచేత దానిని నిలబెట్టవలెనను నిశ్చయముతో అతడుండును. కాని యెంతకాలము ఈ దేహమును, ఈపై తొడుగును నిలుపగలము? చనిపోవువరకేకదా! మృత్యువు యొక్క 'వారంటు' వచ్చినతరువాత ఒక్కక్షణముకూడ అది నిలువజాలదు. మృత్యువు నెదుట దాని గర్వమంతయు ఉడిగిపోవును. అయినప్పటికి ఈ తుచ్ఛదేహముకొఱకు మానవుడు వివిధ సాధనలను సమకూర్చుకొనుచుండును. అహర్నిశము దేహమునుగూర్చి యోజించుచుండును. దేహ రక్షణార్థము మాంసభక్షణ చేయుటలో తప్పేమియు లేదని ఇటీవల కొందరనుచుందురు. మానవ శరీరము చాల విలువ కలది యని, మాంసము తినియైనను దానిని రక్షింపవలెనని వారి భావన. పశువుదేహముకంటె మానవదేహము విలువ కలదిగా ఎందులకయినది? పశువు దొరకినదెల్ల తినివేయ గలదు. స్వార్థమువినా దాని కింకొకవృత్తి లేదు. మానవుని విషయములో అట్లుకాదు. మనుష్యుడు తనచుట్టునుండు జీవు లను రక్షించును. కనుక మనుష్యదేహమునకు విలువ వచ్చి నది. కాని ఏ కారణమున మానవదేహమునకు విలువ

వచ్చినదో ఆ కారణమును మనము మాంసము తిని వమ్ము చేయుచున్నాము. ఓయీ! నీవు నిగ్రహముతో నుండుమని, సర్వ జీవులకొఱకును త్రికరణశుద్ధిగ పాటుపడుదువని, అందరిని కనిపెట్టి కాపాడు వృత్తి నీలో నున్నదనికదా నీకీ పెద్దరికము వచ్చినది? పశువుకంటె తనకున్న విశిష్టతచేతనే కదా మానవుడు శ్రేష్ఠుడనిపించుకొన్నాడు? ఇందువలననే కదా మానవదేహము దుర్లభమన్నారు? కాని దేనినాధారము చేసికొని మనుష్యుడు శ్రేష్ఠుడైనాడో దానినే యతడు నిర్మూలించుకొన్నచో ఇక వాని గొప్పతనము నిలుచునెట్లు? ఒక జంతువు మరియొక జంతువు మాంసముతిని బ్రతికినట్లు మానవుడుకూడ అట్లే నిస్సంకోచముగ బ్రతుకుట ప్రారంభించినచో వాని గొప్పతనమునకున్న మూలాధారమే కూలిపోయినట్లగును. తానెక్కికూర్చున్న కొమ్మను తానే కొట్టివేసికొన్నట్లుండును.

ఆధునిక వైద్యశాస్త్రము అనేక చమత్కార ప్రయోగములు చేయుచున్నది. వైద్యులు పశువునకు శస్త్రముచేసి అది బ్రతికియుండగనే దాని శరీరములో రోగక్రిములను ప్రవేశపెట్టి, దానివలన కలుగు వివిధ పరిణామములను పరిశీలింతురు. ఈ విధముగ బ్రతికియున్న జంతువును ఇంత బాధ పెట్టి సంపాదించు జ్ఞానము ఈ క్షుద్రమానవశరీరమును నిలువబెట్టుట కుపయోగింపబడుచున్నది. ఇదంతయు భూతదయ పేర జరుగుచున్నది. పశువుల శరీరములో రోగాణువులను ప్రవేశపెట్టి వాని రసినితీసి మనుష్యశరీరములోనికి

ఎక్కింతురు. ఇట్టి భీషణకృత్యము లనేకములుజరుగుచున్నవి. మనము ఏ శరీరముకొఱకు ఈపనులన్నిటిని చేయుచున్నామో ఆ శరీరము నిమిషములో విరిగి ముక్కలగు గాజువంటిది. అది యే క్షణములో పగిలిపోవునో ఎవరును చెప్పలేరు. ఈ దేహరక్షణకై ఈ పనులన్నియు జరుగుచున్నను, చివరకు దీనివలన మనకు కలుగుచున్న అనుభవమేమి? ఈ నాజూకు దేహమును పోషించి నిలువబెట్టు ప్రయత్నము జరుగుచున్న కొలది నశించు దేహములసంఖ్య పెరుగుచున్నది. ఇది మన నిత్యానుభవములోని విషయమే యైనను ఈ దేహమును పోషించి పెంచుటకు మనుష్యుడు చేయు ప్రయత్నములు మాత్రము జరుగుచునే యున్నవి.

ఎట్టి యాహారమును భుజించుటవలన బుద్ధి సాత్త్విక మగునో ఆ విషయముమీది కెన్నడును ఆలోచన పోదు. మనస్సును కుదురుగా నుంచుకొనుటకును, బుద్ధిని నిర్మలము జేసికొనుటకును ఏమి చేయవలెనో, దేని సాయము తీసికొన వలెనో మనుష్యుడు గమనింపనే గమనింపడు. శరీరము యొక్క తూక మెట్లు పెరుగునా యనియే అతని యాలోచన. భూమిమీదిమట్టి వచ్చి తన శరీరమున కెట్లు అంటుకొనునా యను విషయమును గూర్చియే ఎల్లప్పుడును జాగ్రత్తపడు చుండును. గోడకుకొట్టిన పిడకలు ఎండి రాలినట్లే శరీరమున కంటుకొన్న ఈ మట్టిపూత, ఈ క్రొవ్వుకూడ చివరకు రాలి పోయి శరీరము యథాస్థితిని పొందును. అనగా శరీరము భరించలేనంత మట్టిని మనము శరీరమున కెక్కించుచున్నా

మన్నమాట. శరీరమును ఇంత హద్దుమీరి పెంచుటమాత్ర మెందులకు ? ఈ దేహము మన చేతిలో ఒక పనిముట్టు. కనుకదానిని సరియైనస్థితిలో నుంచుటకు అవసరమైనదంతయు మనము చేయుచుండవలెను. యంత్రముద్వారా పనికావలె నని తలంతుము. కాని దానిమీద అభిమానము పెట్టుకొని కూర్చుందుమా? కాని శరీరమను యంత్రము విషయమున కూడ ఇట్టి వివేకము నేల చూపము ?

సారాంశమిది : ఈ దేహము సాధనమేకాని సాధ్యము కాదు. మనలో ఈ భావమే దృఢముగనున్నచో శరీరము నంటియున్న ఈ దురభిమానము తొలగిపోవును. జీవితము యొక్క స్వరూపమే వేరుగా కనబడును. అప్పుడు దేహము నలంకరించుకొనుటలో గౌరవమున్నదని అనిపించదు. నిజ ముగ దీనికొక సామాన్యవస్త్రమున్న చాలును. కాని అంత టితో ఆగుదుమా ? అది మృదువుగను, సన్నముగను ఉండ వలెనని, దానికి అందమైన రంగుగల అద్దకము, అంచు, వన్నె చిన్నెలు, జరీ ఉండవలెనని యందుము. వీనినితయారుచేయు టకు మన మనేకులను రకరకములైన శ్రమలపాలు చేయు చున్నాము. ఈ శ్రమయంతయు నేల ? దేవునికేమియు వివే కములేదా ? ఈ దేహమునకు సుందరమైన వన్నెచిన్నెల అవసరమే యున్నచో పెద్దపులి శరీరముమీద అతడు తన పనితనమును చూపించినట్లే మన శరీరము మీద మాత్రము చూపియుండువాడుకాడా ? తలచుకొన్నచో అయన చేయలేనిదేమున్నది ? నెమిలికిచ్చినట్లు మనకును

ఒక అందమైన పింఛమును తగిలించగలడు. కాని ఈశ్వరుడు మనుష్యున కొకరంగుగల చర్మమునే ఇచ్చినాడు. దేహము మీద నేకొంచెము మచ్చపడినను సౌందర్యము పెరుగుటకు బదులుగ చెడిపోవును. మానవుడున్నట్లుండుటలోనే సౌందర్యమున్నది. మానవదేహ మలంకరింపబడవలెనని పరమేశ్వరుని కుద్దేశములేదు. సృష్టిలో సౌందర్యమున కేమైన లోపమున్నదా? ప్రకృతి సౌందర్యమును దర్శించుచుండుటయే మానవునిపని. కాని మనుష్యుడీసంగతినే మరచిపోయినాడు. జర్మనీవారు మన రంగులను నాశనముచేసినా రందుము. సోదరుడా! నీ హృదయములోని రంగు ఎప్పుడో వెలిసిపోయినది. తరువాతనే నీకు కృత్రిమమైన రంగులమీద రుచి యేర్పడినది. దాని వలన నీవు పరావలంబుడవైతివి. నిరర్థకముగ నీ శరీర శృంగారమను కుచక్రములో పడిపోయితివి. మనస్సు నలంకరించుకొనుట, బుద్ధిని వికసింపజేయుట, హృదయ సౌందర్యమును చేకూర్చుకొనుట - ఇవన్నియు ఒక ప్రక్కకు నెట్టివేసితివి.

70

తత్త్వమసి

ఇందుచేత ఈ యధ్యాయములో భగవంతుడు మనకందించిన యీ భావములు చాల విలువకలవి. "నీవీ దేహమువుకావు. ఆత్మవు", "తత్త్వమసి" - ఆ యాత్మస్వరూపుడవు

నీవే". – ఇది మిక్కిలి ఉన్నతము, పవిత్రము అయిన మహా వాక్యము. "ఈ బాహ్యకవచము, ఈ పైబెరడు, ఈ యెము కలగూడు నీవుకాదు. నాశరహితమైన ఫలమేదో, ఆ లోపలి సారమేదో, అది నీవు" అన్నది సంస్కృత సాహిత్యములో పొందుపరుపబడిన యీ మహావాక్యము. "అది నీవు" అను భావము మానవుని హృదయములో స్ఫురించిన తక్షణమే, "ఈ దేహమను నేను కాను, ఆ పరమాత్మనే నేను" అను ఆలోచన మనసున నాటుకొన్నంతనే ఆనందానుభవము తరంగమువలె లేచును. ఈ నా సుస్వరూపమును నశింపజేయ గల శక్తి ప్రపంచములో దేనియందును లేదు. ఇంత సూక్ష్మ భావము ఈ మహావాక్యములో ఇమిడియున్నది.

ఈ దేహముకంటెభిన్నము, నాశరహితము, నిష్కళంకము అయిన ఆత్మతత్త్వమే నేను. ఆ యాత్మతత్త్వమునిమిత్తమే నాకీ శరీరము ప్రాప్తించినది. ఆ పరమేశ్వర తత్త్వము దూషితమగు అవకాశము కలిగినపుడెల్ల దానిని రక్షించుటకు ఈ శరీరమును విసరిపారవేయుదును. పరమేశ్వరతత్త్వమును ఉజ్జ్వలముగ నుంచుటకొఱకు ఈ దేహమును హోమము చేయుటకు నే నెల్లపుడును సిద్ధముగ నుందును. నే నీ దేహ మును వాహనముగ జేసికొని వచ్చుట నన్ను నేను నాశము చేసికొనుటకా? దేహముమీద నా అధికారము సాగ వలసినదే. నే నీ దేహమునుపయోగించుకొనుచు తద్ద్వారా లోక కల్యాణమును వృద్ధిపరచెదను. త్రిలోకముల నానంద ముతో నింపుదును. ఈ మహాతత్త్వముల నిమిత్తము ఈశరీర

మును విసరిపారవేయుదును. ఈశ్వరునికి విజయభేరి మ్రోగింతును. ధనికుడు ఒక బట్ట మైలపడినచో వెంటనే దానిని విడిచి మరియొకటి ధరించును. నేనును అట్లే చేయుదును. కర్మాచరణకే ఈ దేహము. ఇది పనికిరాదని తేలినంతనే దానిని విసరివేయుటకు నాకు సందేహ మెందులకు?

సత్యాగ్రహముద్వారా మన కీ శిక్షణ లభించినది. దేహము, ఆత్మ – రెండును వేరువేరు వస్తువులు. మానవుడీ రహస్యమును తెలిసికొన్నరోజుననే అతనికి నిజమైనశిక్షణ, యథార్థమైన వికాసము ఆరంభమగును. అప్పుడే సత్యాగ్రహము మన కలవడును. కనుక మనమందరమును ఈ భావనను మన హృదయములలో అంకితము చేసికొనుట అవసరము. దేహము కేవలము నిమిత్తమాత్రము, సాధనము, ఈశ్వరదత్తమైన ఒక పనిముట్టు. దాని యవసరము తీరిన నాడు దానిని విసరి పారవేయవలె. చలికాలములో ధరించు దుస్తులను వేసవికాలములోను, రాత్రి కప్పుకొన్న కంబళ్లను ఉదయమునను తీసివేయుదుము. ఉదయము వేసికొన్న దుస్తులను మధ్యాహ్నము మార్చెదము. ఆవిధముగనే ఈ దేహమునుకూడ వదలివేయవలెను. శరీరముతో పనియున్నంత వరకు దానిని ఉంచుకొందుము. ఏనాడది మనకు పనికిరాదో అప్పుడీ దేహమను నస్త్రమును విసరిపారవేయుదుము. ఆత్మవికాసముకొరకు భగవంతుడు మన కీ యుపాయమును చెప్పుచున్నాడు.

71

దుండగీండ్ర శక్తి అంతరించినది

"దేహముకంటె నేను వేరు" అని మనము తెలిసికొనంతవరకు దుండగీండ్రు మనపై అత్యాచారములు చేయుచునే యుందురు. మనలను బానిసలుగ చేసికొనుచునే యుందురు. మన కెన్నెన్ని కష్టములను తెచ్చిపెట్టుచుందురో చెప్పలేము. మనము భయపడినపుడే మనపైదుండగీండ్రువిజృంభింతురు. ఒక రాక్షసుడు ఒకనిని పట్టుకొని వాని చేత తెంపు లేకుండ పనులు చేయించుకొనుచుండెను. వాడెప్పుడైన పని చేయకపోయినచో "ఇదిగో! నిన్ను స్రుంగినేయుదును. నాశనము చేయుదును" అని రాక్షసుడు బెదరించుచుండెను. మొదట ఆ మనుష్యుడు భయపడుచుండెను. కాని ఆ బెదరింపు దుర్భరమగ్గునప్పటికి వాడు "ఇదిగో! తినదలచుకొన్నచో తినివేయుము" అనెను. కాని వానిని తినివేయుట రాక్షసుని యుద్దేశమే కాదు. వానికి చాకిరిచేయుటకు ఒక బానిస కావలసియుండెను. రాక్షసుడు వానిని తినివేసినచో ఇక వాని పనులు చేయువాడెవడు? తినివేయుదునని మాటిమాటికి బెదరించుటయే వాని పని; కాని తినివేయుమని బానిస చెప్పినంతనే రాక్షసుని యొక్క దుండగపుచేష్టలు కట్టుపడినవి. మనుష్యులు దేహమునంటిపెట్టుకొని యుందురని దుండగీండ్రకు బాగుగ తెలిసియే వారిని శారీరకముగ బాధపెట్టుదురు. అంతట మనుష్యులు వారికి బానిసలైపోదురు. కాని ఆ దేహాసక్తియే లేకపోయినచో వారు స్వతంత్రులు, సమ్రాట్టులైపోదురు. అపారమైన

శక్తి సామర్థ్యములు వారి హస్తగతములగును. అప్పు డొవ్వ డును వారిపై అధికారము చూపలేడు. వాని దుండగీనితనము నకు ఆధార మేపోవును. దేహమే నేనను భావనగల తావే దుండగీండ్రకు లోకువ యగును.

"దేహము నేను" అని తలచుచుండుటచేతనే ఇతరు లకు నాపై అత్యాచారములు జరువవలెనని, నన్ను కష్టపెట్ట వలెనని కోరిక కలుగును. కాని ఆంగ్లదేశపు ఆత్మత్యాగి 'క్రాన్మరు' ఏమన్నాడు? "నన్ను తగులబెట్టెదరా? సరే! తగులబెట్టుడు, ఇదిగో! యీకుడిచేతిని ముందుతగులబెట్టుడు" అనెను. ఈ విధముగనే 'రిడ్లే', 'లాటిమర్' అను త్యాగ మూర్తులేమనిరో చూడుడు– "మమ్ము తగులబెట్టవలెననియా మీ కోరిక? మమ్ముల నెవరు తగులబెట్టగలరు? మేము వెలిగించు ధర్మజ్యోతిని ఎవ్వరును చల్లార్పలేరు. శరీరమను ఈక్రొవ్వువత్తిని కాల్చివేసి తత్త్వజ్యోతిని ప్రజ్వలింపజేయు టయే మాపని. దేహము నశించిపోవును. అది నశించునదే!" సోక్రటీసునకు విషమిచ్చిచంపు దండన విధింపబడెను. అప్పు డాత డిట్లనెను– "నేనిపుడు వృద్ధుడనైనాడను. కొలది దినము లలో ఈ శరీరము ఎట్లును రాలిపోవలసినదే. రాలిపోనున్న ఈ శరీరమును చంపి మీరందరును ఏమి ఘనకార్యము చేయుచున్నట్లు? కొంచె మాలోచించినచో ఈ శరీర మెప్పుడో ఒకప్పుడు తప్పక వదలిపోవునదే యని తెలియ గలదు. చనిపోవుదానిని చంపుటలో నొప్పతనమేమున్నది" సోక్రటీసునకు రేపు విషమిచ్చెద రనగా ఆ రాత్రి యతడు

శిష్యులకు ఆత్మయొక్క అమరత్వమునుగూర్చి బోధించు చుండెను. శరీరములో విషము ప్రవేశించినతరువాత కలుగు బాధల నతడు ఆనందముతో వర్ణించుచుండెను. అతని కేమాత్రమును విచారము కలుగలేదు. ఆత్మయొక్క అమరత్వమునుగూర్చిన చర్చ ముగియగానే ఒక శిష్యుడు — "అయ్యా, మీరు చనిపోయినతరువాత మీ యంత్యక్రియలెట్లు జరుపవలెనని మీ కోరిక ?" అని యడిగెను. సోక్రటీసిట్లు జవాబిచ్చెను— "చంపువారు వారా ? పాతిపెట్టువారు మీరా ? బాగుగానున్నది ! చంపువారు నా శత్రువులా ? పాతిపెట్టు మీరు నా కాప్తులా ! తెలివినెల్లను ఉపయోగించి వారు నన్ను చంపువారును, వివేకముతో మీరు నన్ను పూడ్చిపెట్టువారునా ? నన్ను పూడ్చగలవారా మీరు ? మీ రందరును పోయినతరువాత మిగులువాడను నేను. నన్నెట్లు పూడ్చవలెననియా మీ ప్రశ్న ? మట్టిలోనా ? లేక ముక్కుపొడుములోనా ? అనియా మీ శంక ? నన్నెవరును చంపలేరు, పూడ్చి పెట్టలేరు. ఇప్పటివరకు మీకు నేను చెప్పుచువచ్చిన మాటలేమి ? ఆత్మకు చావులేదు, దానిని చంపగలవారుగాని, పాతిపెట్టగలవారుగాని లేరనియేకదా!" రెండున్నరవేల సంవత్సరములనుండి ఎందరో పోయినను సోక్రటీసు మహాత్ముడు మాత్రము నిజముగ సజీవుడయియే యున్నాడు.

72

పరమాత్ముని శక్తిపై విశ్వాసము

సారాంశమేమనగా దేహాసక్తియు, భయమును ఉన్నంతవరకు నిజమైన రక్షణ లేదు. అంతవరకును ఒక విధముగ భయము పట్టుకొని పీడించుచుండును. నిద్రవచ్చి కన్ను మూతపడినదా, పా మెక్కడ కాటువేయునో, దొంగ లెక్కడ దెబ్బ కొట్టుదురో యను భయమే కలకపెట్టు చుండును. మనుష్యుడు తలక్రింద కట్టపెట్టుకొని నిద్రపోవును. ఇది ఎందులకని యడిగిన "దగ్గర నుంచుకొనుట మంచిది. దొంగలునచ్చిన నేమి చేయవలె?" అనును. ఓరి వెఱ్ఱివాడా! వచ్చినదొంగలు ఆ కట్టతోనే నీ తలమీద కొట్టిన నేమగును! దొంగలు కట్టతెచ్చుకొనుట ఎక్కడ మరచిపోదురోయని ముందే దానిని సిద్ధపరచియుంచితి వన్నమాట! నీ వెవనిపై భారముంచి నిద్రపోవుచున్నావు? నీవు నిద్రించునప్పుడు ప్రపంచమునొక్క ఒడిలోనున్నాడవని గుర్తింపుము. నిన్ను నీవు రక్షించుకోగలుగునది మెలకువతో నున్నప్పుడు కదా! నిద్రలో నిన్ను రక్షించువా రెవరు?

ఒక మహాశక్తిపై విశ్వాసము పెట్టుకొని నేను నిద్రింతును. ఏ శక్తిపై విశ్వాసముంచి పులి, ఆవు మొదలగు జంతువులు నిద్రించుచున్నవో ఆ విశ్వాసముతోడనే నేనును నిద్రించుచున్నాను. పులికిగూడ నిద్రవచ్చును. యావత్ప్రపంచమునకును శత్రువైన కారణముచేత గడియ గడియకును వెనుదిరిగి చూచుకొను సింహముకూడ నిద్రపోవును. దాని

కా శక్తిపై విశ్వాసమే లేకపోయినచో కొన్ని సింహములు నిద్రించుచుండగా మరికొన్ని సింహములు కావలికాచునట్టి వ్యవస్థ అవసరమయ్యేడిది. ఏ శక్తిమీది విశ్వాసముతో పులి, తోడేలు, సింహము మొదలైన క్రూరజంతువులుకూడ నిద్రించునో విశ్వవ్యాప్తమైన ఆ శక్తియొక్క ఒడిలోనే నేనును నిద్రించుచున్నాను. పిల్లవాడు తల్లియొడిలో నిర్భయముగ నిద్రించును. అప్పు డతడు ఈ పృథ్వికినెల్ల పాదుషా అన్నట్లుండును. మనముకూడ ఆ విధముగనే ఆ విశ్వమాత యొక్క ఒడిలో ప్రేమ, విశ్వాస, వివేకములతో నిద్రించు అభ్యాసము చేయుదముగాక ! నా జీవితమంతయు ఏ శక్తి నాధారము చేసికొని నడచుచున్నదో ఆ శక్తితో నా కంత కంతకు పరిచయము పెరుగవలె. పోనుపోను నా కా శక్తి ప్రస్ఫుటముగ గోచరింపవలె. ఆ శక్తిపై నా విశ్వాసము పెరిగనకొలది నా జీవిత మంతకంతకు సురక్షిత మగును. ఈ శక్తినిగూర్చిన నా యనుభవముతోపాటు నా వికాసము కూడ వృద్ధిపొందుచుండును. వీని క్రమవికాస మీ యధ్యాయములో కొంతవరకు చిత్రింపబడినది.

73

పరమాత్ముని శక్తినిగూర్చి క్రమక్రమముగ పొందు అనుభవము

దేహస్థితమైన ఆత్మయొక్క విచారణ మనసులోనికి రానంతవరకు మనుష్యుడు సాధారణ క్రియలలోనే లీనుడై

యుండును. ఆకలియైనప్పుడు తినుట, దప్పిక యయినప్పుడు నీరు త్రాగుట, నిద్రవచ్చినతఱి నిద్రించుట – ఇంతకు మించి వాని కేమియు తెలియదు. వీనిని తృప్తిపరుచుకొనవలెనను లోభము అతనిలో మెండుగా నుండును. అవసరమైనచో వానికై అతడు పోరాడును. ఈ విధముగ దేహావసరములను తృప్తిపరచుకొనుటలోనే అతడు నిమగ్నుడై యుండును. అటు తరువాతనే అతనిలో వికాసము ప్రారంభమగును. ఇంతవరకు ఆత్మ కేవలము తటస్థముగ చూచుచుండును. నూతివైపునకు ప్రాకిపోవు శిశువును వెనుకనుండి వివేకముతో చూచుచుండు తల్లివలెనే ఆత్మకూడ మనపై దృష్టినిలిపి ఓర్పుతో మన పనుల నన్నిటిని చూచుచుండును. ఈ స్థితియందున్న ఆత్మను ఉపద్రష్ట – లేక – సాక్షి – లేక – సర్వమునుచూచువాడని యందుము.

ఈ స్థితిలో ఆత్మ చూచుచుండునే కాని సమ్మతి నీయదు. అంతవరకు దేహమే నే ననుకొనుచు ప్రవర్తించుచున్న జీవుడు క్రమక్రమముగ జాగరూకుడగును. "అయ్యో! నేనింతవరకు పశువువలె జీవితము గడుపుచున్నానే" యను వివేకము వానికి కలుగును. మానవునిలో ఈ విధమైన వివేకము ఉదయించినప్పుడు అతని జీవితమున కొక నైతిక భూమిక యేర్పడును. అప్పుడు అడుగడుగునకును అతడు ఉచితానుచితములను యోజించి వివేకముతో పనులుచేయ నారంభించును. అతనిలో ఆత్మవివేచన ప్రారంభమగును. స్వేచ్ఛావిహారము కట్టువడి దానిస్థానే సంయమవర్తనము

ప్రారంభమగును. జీవునియం దీ నైతిక భూమిక యేర్పడిన తరువాత ఆత్మ కేవలము తటస్థముగ చూచుచుండక లోపలి నుండి తన ఆమోదమును తెలుపుచుండును. "సెబాస్ ! బాగుగానున్నది!"అను వాణి లోపలినుండి వినబడుచుండును. ఇప్పు డది కేవలము "ఉపద్రష్టగ" నుండదు. అనుమంత యగును. అనగా ఆమోదమును తెల్పునది యగును.

ఆకలిగొన్న అతిథి యింటికివచ్చినపుడు నీవు నీకు వడ్డించిన విస్తరిని అతనికి సమర్పించి రాత్రి పరున్నపుడు ఆ విషయము జ్ఞప్తికి వచ్చినచో ఎంత ఆనందింతువో చూడుము. లోపలినుండి అంతరాత్మ మెల్లగా 'మంచిపని చేసితివి' అనును. బిడ్డ వెన్నునిమిరి "నాయనా ! మంచిపని చేసితివి" అని తల్లి హెచ్చరింపగానే ప్రపంచమంతయు తన కొక గొప్ప కానుక నిచ్చుచున్నట్లు వాని కనిపించును. ఈ విధముగనే "మంచిపని చేసినాడవు" అని హృదయస్థితుడైన పరమాత్మ అను మాట మనలను ప్రోత్సహించును. అట్టి స్థితిలో ఈ జీవుడు భోగమయ జీవితమును విసర్జించి నైతిక జీవితమును పునాదిగ చేసికొనును.

దీని తరువాతి దశ యేమనగా నైతిక జీవితములో మానవుడు తన కర్తవ్య కర్మద్వారా హృదయ మాలిన్యమునెల్ల కడిగివేసికొనుటకు ప్రయత్నించును. కాని మానవుడు ఈ పని చేయుచు చేయుచు అలసిపోవు సమయ మొకటి వచ్చును. అప్పుడు జీవుడు "ఓ యీశ్వరా ! నా ప్రయత్న మింతకుమించి పైకిపోలేకున్నది. నాకు శక్తిని, బల

మును మరికొంత ప్రసాదింపుము" అని ప్రార్థించును. "యావచ్ఛక్తిని వినియోగించినను నేనొక్కడనే ఏమియు చేయలేను" అను అనుభవము మనుష్యునికి కలుగనంతవరకు ప్రార్థనలోని రహస్యము నతడు తెలిసికొనలేడు. తనశక్తినెల్ల వినియోగించినను అది చాలదను జ్ఞానము కలిగినప్పుడు ఆర్తభావముతో ద్రౌపదివలె పరమాత్మను పిలువవలెను. పరమేశ్వరుని కృప, సహకారము అను స్రోతస్సు నిత్యమును ప్రవహించుచునేయున్నది. దప్పిగొన్నవారు తమ హక్కుగ భావించి దానినుండి నీరు త్రాగుదురు. లోటుపడినవారు అడిగి తీసికొనవచ్చును. ఈ మూడవస్థితిలో నున్న సంబంధమిట్టిది. ఇట పరమాత్మ మరింత సన్నిహితుడగును. ఇప్పు డతడు బాగుగా నున్నదనుటతో ఆగక సాహాయ్యముచేయుటకే పరుగెత్తుకొని వచ్చును.

మొదట పరమేశ్వరుడు దూరముగ నిలిచి చూచుచుండును. ప్రశ్నకు సమాధానము వ్రాయు మని శిష్యునకు చెప్పి గురువు దూరముగ వెళ్లి నిలుచుండునట్లే జీవుడు భోగమయ జీవితములో మునిగియున్నంతవరకు పరమాత్మ దూరముగ నిలబడియుండి, "సరే! సాగనిమ్ము నీ సంసారపు జంజాటము"అనును. తదుపరి జీవుడు నైతిక భూమిక లోనికి ప్రవేశించును. అప్పుడు పరమేశ్వరుడు కేవలము తటస్థుడై యుండలేడు. జీవునిద్వారా సత్కర్మలు జరుగుచుండగా భగవంతుడు మెల్లగా తొంగిచూచి "సెబాస్" అనును. ఈ విధముగ సత్కర్మలు జరుగుచున్నచో హృదయమును

అంటియున్న స్థూల మాలిన్యము తొలగిపోవును. ఇక సూక్ష్మ మాలిన్యమును పోగొట్టుకొనుటకు తన శక్తికొలది ప్రయత్నించి విఫలుడై విసిగి వేసారినప్పుడు జీవుడు పరమాత్మను ఎలుగెత్తి పిలుచును. అప్పుడు భగవంతుడు "ఇదిగో! వచ్చుచున్నా"నని పరుగెత్తుకొని వచ్చును. భక్తుని యుత్సాహము తగ్గినంతనే భగవంతుడతని సాహాయ్యార్థము వచ్చి నిలుచును. జగత్సేవకుడైన సూర్యనారాయణుడు సదా మీ వాకిటిముందు నిలిచియేయుండును. మూసియున్న తలుపులను బ్రద్దలుకొట్టి సూర్యుడు లోపలికి ప్రవేశింపడు. ఏలయనగా అతడు సేవకుడు. అతడు స్వామిహృద్దులను తనహృద్దులను గుర్తెరిగి మెలగును. అతడు తలుపు తట్టనైన తట్టడు. యజమానుడు లోపల నిద్రించుచున్నను ఈ సేవకుడు వాకిలి వెలుపలనే వేచియుండును. యజమానుడు కొంచెము తలుపు తెఱవగానే సూర్యుడు తన పూర్ణతేజస్సుతో లోపలికి చొరబడి అంధకారమును పారద్రోలును. పరమాత్ముని స్థితికూడ ఇట్టిదే! తన సాయము నర్థించినంతనే అతడు చాచిన చేతులతో జీవునియొద్దకు వచ్చినాడన్నమాటే! భీమా నదియొడ్డున (పండరిపురములో) నడుముమీటుకొని పాండురంగడు సిద్ధముగ నిలబడియున్నాడు.

"ఉభాకే లో భుజా, కహే ప్రభు ఆజా"

తుకారాము మొదలయినవారు ఇట్టి వర్ణన చేసియున్నాగు. ముక్కు తెరచిన గాలి లోపలికి వచ్చితీరును. తలుపు తెరచిన వెలుగు లోపలికి ప్రవేశించుట తథ్యము.

ఈ సందర్భములో గాలిని, వెలుగును గూర్చిన ఈ దృష్టాంతములు నాకు తృప్తినీయవు. వానికంటెను పరమాత్మ సన్ని హితుడుగనుండి సాయపడవలెనని తహతహ పడుచుండును. అతడు ఉపద్రష్ట, అనుమంతగా గాక భర్తయయి అన్ని విధముల సహాయుడయి యుండును. మనోమాలిన్యమును పోగొట్టుకొనుటకు అగతికులమై— "మారీ నాడ్ తమారే హోథే ప్రభు సంభాల్ జోరే" (నీవే నాకు సహాయుడవు. నీ యాశ్రయమే నా కవసరము) అని ప్రార్థింతుము. అప్పుడా దయాధనుడు దూరముగ నెట్లుండగలడు? భక్తులకు సాయ పడు ఆ పరమేశ్వరుడు, అసంపూర్ణమును సంపూర్ణముగ జేయు ఆ ప్రభువు పరుగెత్తుకొని వచ్చును. వైదానునకు చర్మము లూని బొగుచేయుట, ధర్మవ్యాధునికి మాంసము అమ్మిపెట్టుట, కబీరునకు బట్టలు నేసిపెట్టుట, జనాబాయితో పిండి విసరుట – ఇవి మనకు కొన్ని దృష్టాంతములు.

దీని పైమెట్టు ఏమనగా ఈశ్వరప్రసాదముగ మనకు లభించిన ఫలమునుకూడ మనము స్వీకరింపకుండ అతనికి అర్పణ చేయుటయే! ఈ భూమికలో జీవుడు "నీ విచ్చిన ఫలమును నీవే యనుభవింపుము" అని భగవంతునితో అనును. నామదేవుడు "ప్రభూ! ఈ పాలుత్రాగక తప్పదు" అని పట్టుపట్టి కూర్చుండెను. ఇదెంత మధుర ప్రసంగము! కర్మఫలరూపమైన ఆ పాలను నామదేవుడు భగవంతునికి సమర్పించెను. ఈ విధముగ ఈశ్వర ప్రసాదముగ లభించిన సమస్త జీవిత మూలధనము, సమస్త సంపద ఆయనకే అత

డర్పించివేయును. ధర్మరాజు స్వర్గములో అడుగుపెట్టబోగా అతనివెంటనున్న కుక్కను దేవతలు లోపలికి రానీయరైరి. అప్పుడతడు యావజ్జీవిత పుణ్యఫలమైన స్వర్గమునే ఒక్క తృణములో వలదని నిరాకరించెను. ఈ విధముగనే భక్తుడు కూడ సమస్త పుణ్యఫలములను భగవంతునికే అర్పించి వేయును. ఉపద్రష్టగా, అనుమంతగా, భర్తగా ఇంతవరకు గోచరించిన భగవంతు డిప్పుడు భోక్తకూడ అగును. పరమేశ్వరుడే శరీరముతో భోగములనుభవించుచున్నా డని గుర్తించు భూమికలోనికి జీవుడు వచ్చును.

దీనితరువాత సంకల్పములనే విసర్జింపవలె. కర్మకు మూడు మెట్లున్నవి. మొదట సంకల్పము చేయుదుము. తరువాత కర్మ నాచరింతుము. అటుపైని ఫలము లభించును. కర్మ నాచరించుటకు ప్రభువుయొక్క సాయము నర్థించి పొందిన ఫలమునుకూడ ఆయనకే అర్పింతుము. కర్మ నాచరించినవాడు పరమేశ్వరుడు; ఫలము ననుభవించువాడును పరమేశ్వరుడే! ఇక ఆ కర్మను సంకల్పించువాడుకూడ పరమేశ్వరుడే యని గ్రహింపుము. ఈ విధముగ కర్మయొక్క ఆది మధ్యాంతములలో సర్వత్ర ప్రభువునే యుండనిమ్ము. జ్ఞానదేవుడు—

మాలీ జిధర్ లేగయా। ఉధర్ చుప్ చాప్ గయా ॥
యోంపానీ జైసాభైయా, హూవోసదా ॥

తోటమాలి నీటి నేవైపునకు నడుపవలెననుకొనునో ఆ వైపునకే నిరాఘాటముగ నీరు నడుచును. ఏ పూలమొక్కలను,

ఫలవృక్షములను పెంచవలె ననుకొనునో వానికే అతడు నీరు పెట్టి పోషణ చేయును. ఈ విధముగనే నీచే జరుగవలసిన పనులన్నిటిని ఆ పరమేశ్వరునే నిర్ణయించుకొననిమ్ము. నా చిత్తమున కలుగు సమస్త సంకల్పముల బాధ్యతను వాని పైనే ఉంతునుగాక ! నా బరువంతయు గుఱ్ఱమే మోయు చున్నపుడు దానిపై కూర్చుండి కొంతబరువు నా తలపై పెట్టుకొనుట యెందులకు ? దానినికూడ గుఱ్ఱముమీదనే యెందులకు పెట్టరాదు ? గుఱ్ఱమునకు భారము తప్పించవలె నని కొంతబరువు నాతలపైబెట్టుకొని కూర్చున్నను, ఆబరు వునుకూడ గుఱ్ఱమేమోయవలయునుగదా ! ఇకబరువంతయు గుఱ్ఱముమీదనే యెందుల కుంచరాదు ? ఈ విధముగ జీవిత ములో కలుగు మోసములు, సమస్త జీవితపు ఒడుదుడు కులు, లాభనష్టములు, అస్థిరత్వము, వినుగుదల మొదలగున వన్నియు చివరకు పరమాత్మ స్వరూపమే అయిపోవును. భగవంతుడు నా జీవితమునకు మహేశ్వరుడగును. ఈ విధ ముగా వికాసము వృద్ధిపొంది జీవితమంతయు పరమేశ్వర మయమగును. దేహమను తెర యొకటిమాత్రము మిగిలి పోవును. అదికూడ తొలగిపోగానే జీవుడు - శివుడు, ఆత్మ - పరమాత్మ ఒకటే యగుదురు.

ఈ ప్రకారముగా —

"ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః"

ఈ స్వరూపములలో పోనుపోను అధికాధికముగ పరమేశ్వ రానుభవమును మనము పొందవలసియున్నారము. మొదట

ప్రభువు తటస్థుడుగనుండి చూచుచుండును. తరువాత నైతిక జీవితారంభమయి మనము సత్కర్మ లాచరించుచున్నచో మనల నతడు 'సెబాస్!' అని మెచ్చుకొనును. తరువాత చిత్తము నంటియున్న సూక్ష్మమాలిన్యమును కడిగివేసికొను టకు మన ప్రయత్నబలముచాలక భక్తులమై పిలిచినప్పుడు ఆ యనాథనాథుడు మన సాహాయ్యార్థము పరుగిడుచు వచ్చును. అటుతరువాత ఫలములనుగూడ భగవంతునికే యర్పించి అతనిని భోక్తగా చేయవలె. చివరకు సంకల్పము లన్నిటిని అతనికే అర్పించి జీవితమంతయు హరిమయము చేసికొనవలె. ఇదే మానవుని అంతిమ లక్ష్యము. కర్మ యోగము, భక్తియోగము అను రెండు రెక్కలతో విహరించుచు సాధకుడీ తుది మజిలీని చేరుకొనవలెను.

74

నమ్రత, దంభశూన్యత మొదలగు మూలభూత జ్ఞానసాధనలు

వీని నన్నిటిని సాధించుటకొరకు నైతికసాధన యను బలీయమైన పునాది కావలెను. సత్యాసత్య వివేచన చేయుచు ఎల్లపుడును సత్యమునే గ్రహింపవలెను. సారాసార విచారణ ద్వారా సారమునే గ్రహించుచుండవలెను. చిప్పలను పారవైచి ముత్యములనే సేకరింపవలెను. ఈ విధముగ జీవితము ప్రారంభము కావలె. అటుపై స్వప్రయత్నము, ఈశ్వరుని

కృప – వీనిబలముతో పురోగమించవలె. ఈ సాధనలన్నిటిలో మనము దేహమునుండి ఆత్మను వేరుచేయు అభ్యాసము చేసినచో అది మనకు చాల సహాకారి యగును. ఈ సందర్భమున ఏసుప్రభువుయొక్క బలిదానము నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆయనను సిలువపైబెట్టి మేకులుకొట్టి చంపుచుండిరి. ఆ సమయమున అతని ముఖతః ఈ మహావాక్యములు వెలువడెనని చెప్పుదురు—''భగవానుడా! ఇన్ని కష్టములు నా కెందులకు కల్పించుచున్నావు?'' కాని అంతలోనే జీససు ప్రభువు మనస్సును కుదుర్చుపరుచుకొని "మంచిది! నీ యిచ్ఛ యేదో అదియే నేరవేరుగాక! ఈ మానవులను రక్షింపుము. వీ రేమి చేయుచున్నారో వీరికి తెలియదు'' అన్నాడు. జీససు ప్రభువును గూర్చిన ఈ యుదాహరణలో గొప్ప రహస్యమిమిడి యున్నది. దేహమునుండి ఆత్మను ఎంతగా వేరుచేయవలెనో దానికి సిలువ చిహ్నము. దేహాత్మల పృథక్కరణను ఎంత యెత్తునకు లేపవలెనో జీససు జీవితమునుండి మనకు సువిదితమగుచున్నది. దేహ మొక కవచము. అది యొక తొడుగువలె వేరు కాగలదు. ఈ యున్నతాదర్శమును జీససు జీవితము నిరూపించుచున్నది. దేహమునుండి ఆత్మను వేరు చేయవలెనన్న ఆలోచన నాకు కలిగినపు డెల్ల ఏసుప్రభువు జీవితమును, ఈ సిలువదృశ్యమును నా కన్నులకు కట్టినట్లుండును. దేహమునుండి తాను పూర్తిగ వేరని, దానికిని తనకును ఉన్న సంబంధము తెగిపోవునదే యని క్రీస్తుజీవితము స్పష్టము చేయుచున్నది.

సత్యాసత్య వివేకముతో ప్రవర్తింపనంతవరకు దేహాత్మల పృథక్కరణ శక్యముకాదు. ఈ వివేకము, ఈ జ్ఞానము మన రోమరోమమునకును వ్యాపింపవలెను. జ్ఞాన మనగా తెలిసికొనుట యని మన మర్థము చెప్పుదుము. కాని ఊరక బుద్ధితో తెలిసికొనుట జ్ఞానముకాదు. ముద్ద నోటిలో పెట్టుకొనుట భోజనముచేయుటకాదు. నోటిలో పెట్టుకొన్న ముద్దను నమలవలె. అది గొంతునుండి జఠరమునకుపోయి, జీర్ణము కావలె. దాని రసములు రక్తముగామారి శరీరము నందెల్ల వ్యాపించి దేహమును పుష్టిమంతము చేయవలె. అప్పుడే అది నిజమైన భోజనమగును. అట్లే కేవలము బుద్ధి గత జ్ఞానమువలన ప్రయోజనములేదు. ఆ వివేకము, ఆ జ్ఞానము జీవితమందెల్లను వ్యాపింపవలెను. దాని సంచారము హృదయములో కనబడవలెను. ఆ జ్ఞానము చేతులు, కాళ్లు, కన్నులు మొదలైన ఇంద్రియములద్వారా ప్రకటితము కావలెను. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు అన్నిపను లను వివేకముతో చేయు స్థితి కలుగవలెను. ఇందుచేత భగవంతుడు ఈ యధ్యాయములో జ్ఞానమునకు చాల చక్కని నిర్వచనము నిచ్చినాడు. స్థితప్రజ్ఞుని లక్షణములవంటివే జ్ఞానముయొక్క లక్షణములుకూడ.

"నమ్రతా, దంభశూన్యత్వ, మహింసా, ఋజుతా, క్షమా"

మొదలైన ఇరువది గుణములు భగవంతుడు చెప్పి నాడు. ఈ గుణములను జ్ఞాన మందురని చెప్పి అతడు ఊర కుండలేదు. వీనికి విరుద్ధమైనదంతయు అజ్ఞానమనికూడ

స్పష్టీకరించెను. జ్ఞానోపార్జనకు చెప్పబడిన సాధననే జ్ఞాన మంటరు. కాని వట్టి పాండిత్యము జ్ఞానమనబడదు. [సద్గుణ మునే నేను జ్ఞానమందును' అని సోక్రటీసు చెప్పెను. సాధన, సాధ్యము – రెండును ఒకటే.

గీతలోని ఈ యిరువది సాధనలను జ్ఞానదేవుడు పదు నెనిమిదిగా చేసెను. అతడు వీనిని చాల అభిమానముతో వర్ణించెను. ఈ గుణములకు సంబంధించిన శ్లోకములు భగవ ద్గీతలో అయిదుమాత్రమే యున్నవి. కాని జ్ఞానదేవుడు తన జ్ఞానేశ్వరిలో వీనిమీద ఏడువందల పద్యములను వ్రాసినాడు. సమాజములో సద్గుణములు వికసింపవలెనని, సత్యస్వరూపు డైన పరమేశ్వరుని మహిమ వ్యాపకము కావలెనని అతని యాతురత. ఈ గుణములను వర్ణించుచు అతడు తన జీవితా నుభవము నెల్లను ఈ పద్యములలో చొప్పించెను. మహారాష్ట్ర భాషలో దానిని చదివిన వారందరు ఆయనకు ఋణపడి యున్నారు. జ్ఞానదేవుని రోమరోమములోను ఈ గుణములు వ్యాపించియున్నవి. దున్నపోతు నొకడు కొట్టిన కొరడా దెబ్బలు జ్ఞానేశ్వరుని వెన్నుమీద తేలినవి. భూతకోటియెడల అతని సానుభూతి అంతటిది. అట్టి జ్ఞానదేవుని కరుణాపూర్ణ హృదయమునుండి జ్ఞానేశ్వరి వెలువడినది. ఈ గుణముల నతడు పరిశీలించెను. ఆయన వర్ణించిన గుణములు పఠన యోగ్యములు. మననముచేసి, హృదయాంకితము చేసికొన దగినవి. జ్ఞానదేవుని ఈ మధుర భాషణను చవిచూడగలిగి నందులకు నేను ధన్యుడ ననుకొనుచున్నాను. ఆయన మధుర

భాషను నేనలవరుచుకొనుటకు తిరిగి జన్మ యెత్తవలసి వచ్చినను నేను ధన్యుడ ననియే యనుకొందును. సరే ! సారాంశ మిది—

అంతకంతకు వికాసమును పెంచుకొనుచు దేహము కంటె ఆత్మ వేరని తెలిసికొనుచు అందరును తమ జీవితములను ఈశ్వరమయము చేసికొను ప్రయత్నము చేయుదురుగాక.

గీతా ప్రవచనములు

పదునాల్గవ అధ్యాయము

గుణముల విస్తరణ, వానినుండి విమోచన

75

ప్రకృతి పరిశీలన

సోదరులారా !

నేటి పదునాల్గవ అధ్యాయము ఒక దృష్టిలో వెనుకటి అధ్యాయమును పూర్తి చేయునదే ! నిజమునకు ఆత్మ చేయ వలసిన పనులేవియు లేవు. అది స్వయం సంపూర్ణము. స్వభావముచేత ఆత్మ ఊర్ధ్వగామియే. కాని దేనికైనను క్రిందనొక పెద్దబరువును కట్టినచో అది దానినెట్లు క్రిందికి లాగునో ఆ విధముగనే ఈ శరీరమను బరువు ఆత్మను క్రిందికి లాగుచుండును. ఏ యుపాయముచేతనైనను దేహాత్మలను వేరు చేయగలిగినచో మనకు ప్రగతి కలుగునని పదుమూడవ అధ్యాయములో చూచితిమి. ఈ పని కఠినమైనదే యైనను దీనినుండి కలుగు ఫలముమాత్రము చాల గొప్పది. ఆత్మ యొక్క పాదములను బంధించిన దేహమను సంకెళ్లను మనము త్రెంపగలిగితిమా గొప్ప ఆనందము ననుభవింతుము. ఇక మానవుడు శారీరక క్లేశమువలన దుఃఖపడడు. అతడు

స్వతంత్రుడగును. మనుష్యుడు ఈ దేహమును జయింపగలిగి నచో ఇక నీ ప్రపంచమున వానిపై అధికారము చలాయించ గలవారెవరు ? తన్నుదా శాసించుకొనగలవాడు విశ్వమునకు సమ్రాట్టగును. కనుక ఆత్మపై దేహము చలాయించు అధి కారమును తొలగించుకొనును. దేహమునకున్న సుఖ దుఃఖములన్నియు విదేశీయములు, పరకీయములు. ఆత్మతో వానికి తిలమాత్ర సంబంధముకూడ లేదు.

ఈ సుఖదుఃఖముల నే పరిమాణములో వేరుచేయ వలసియుండునో దాని కల్పనను ఏసుప్రభువుయొక్క ఉదా హరణద్వారా తెలిపియుంటిని. దేహము తునుకలైపోవు చున్నను మనస్సును శాంతముగను,ఆనందమయముగను ఎట్లు ఉంచుకొనవచ్చునో ఆయన చూపించెను. కాని ఈ విధముగా ఆత్మనుండి ఈ దేహమును వేరుచేయుటకు ఒకవైపున వివేకము, రెండవవైపున నిగ్రహము అవసరము.

"వివేక్ కే సాథ్ వైరాగ్య కా బల్"

అని తుకారామ్ అన్నాడు. వివేకము, వైరాగ్యము రెండును అవసరమే. వైరాగ్యమనగా ఒకవిధమైన నిగ్రహము, తితీక్ష. ఈ పదునాల్గవ అధ్యాయములో నిగ్రహామార్గము చూపబడినది. నావను నడుపువని తెడ్డది. కాని దిశను చూపించువని చుక్కానిది. తెడ్డు, చుక్కాని-రెండును కావలె. ఆ విధముగనే శారీరక సుఖదుఃఖములనుండి ఆత్మను వేరు చేయుటకొఱకు వివేకనిగ్రహములు రెండును అవసరము.

వైద్యుడు రోగియొక్క ప్రకృతినిబట్టి ఔషధమిచ్చి

నల్లే భగవంతుడు పదునాల్గవ అధ్యాయములో ప్రకృతినెల్ల పరీక్షించి పృథక్కరణచేసి అందు దేని కే యే రోగము లున్నవో నిరూపించెను. ఈ యధ్యాయములో ప్రకృతివిభజన చక్కగా చేయబడినది. రాజనీతిలో విభాజక సూత్రమని ఒక గొప్ప సూత్రమున్నది. ఎదుటనున్న శత్రుబలమును చీలదీయ గలిగినచో దానిని త్వరలో ఓడించవచ్చును. భగవంతుడు చేసినపని యదియే.

నా యొక్క, మీ యొక్క, జీవులన్నిటియొక్క సర్వచరాచరములయొక్క ప్రకృతిలో మూడుగుణములున్నవి. ఆయుర్వేదములో కఫ, పిత్త, వాతము లున్నట్లే ఇక్కడ సత్త్వరజస్తమము లను మూడుగుణము లున్నవి. ఈ మూడు గుణముల చేరికతోనే అంతయు నిండియున్నది. ఒకదానిలో ఒక గుణము తక్కువైన మరొకటి హెచ్చు. ఇదే భేదము. ఈ మూటినుండి ఆత్మను వేరుచేసినచో దేహమునుండి ఆత్మను వేరుచేసినట్లే! ఈ మూడుగుణములను పరీక్షించి వానిని జయించుటయే దేహమునుండి ఆత్మను వేరుచేయు విధానము. నిగ్రహముద్వారా రజస్తమో గుణములను జయించి చివరకు సత్వగుణమును చేరవలె.

76

తమోగుణము: దానిని జయించుట కుపాయము శరీరపరిక్రమ

మొదట తమోగుణమును తీసికొందము. ఆధునిక సామాజికస్థితిలో తమోగుణముయొక్క భయానక పరిణా

మనులు మనకు కనిపించుచున్నవి. దీని ముఖ్యపరిణామము సోమరితనము. దీనినుండియే నిద్ర, మరపు పుట్టును. ఈ మూడు విషయములను జయించినచో తమోగుణమును జయించినట్లే భావింపుము. వీనిలో సోమరితనము మిక్కిలి భయంకరమైనది. ఉత్తమోత్తములుకూడ ఈ సోమరితనము వలననే పనికిమాలినవారగుచున్నారు. ఇది సమాజము యొక్క శాంతిసుఖములను పూర్తిగ నశింపజేయు శత్రువు. చిన్నవారినుండి పెద్దవారివఱకు అందఱిను ఇది పాడుచేయును. ఈ శత్రువు అందఱను తినివేయును. మనలను వశపరుచుకొనుటకు అది సన్నాగములు పన్నుచుండును. ఏ కొంచెము అవకాశము చిక్కినను ఈ సోమరితనము మనలో ప్రవేశించి తీరును. తినవలసినదానికంటె నెక్కువ తింటివా నడుము వాల్చుమని నిన్నది ఒత్తిడిచేయును. అట్లు కొంచెము ఎక్కువసేపు వాల్చితివా కినులలో సోమరితనము తాండవమాడుచుండును. దీనిని మనము వశపరచుకొనంతవరకు మన ప్రయత్నము లన్నియు వ్యర్థమే! కాని మనము సోమరితనమును హెచ్చుగా వాంఛించుచునేయుందుము. అహర్నిశము విరామములేని పనిచేసి ధనమును కూడబెట్టి తరువాత విశ్రాంతితో జీవితము గడపవచ్చు ననుకొందుము. ధనము నధికముగ కూడబెట్టుటయనగా భవిష్యత్తులో సోమరిగా జీవించుటకు తయారగుట యని యర్థము. వార్ధక్యములో విశ్రాంతి చాల అవసరమని సామాన్యముగ మన మనుకొందుము. కాని ఈ భావన తప్పు. మానవులు జీవితమును సరిగా నడుపుకొన్నచో వృద్ధత్వములోకూడ పనులు చేయు

చునేయుందురు. హెచ్చుగా అనుభవములు సంపాదించినందు వలన ముదిమిలో మిగుల ఉపయోగకరమైన సేవచేయుటకే చూచుచుందుము. కాని మనము సోమరితనమున కలవాటు పడినందువలన వృద్ధత్వము రాగానే విశ్రాంతి కావలెనందుము.

సోమరితనమున కే మాత్రమును తావులేని జాగరూకతను మనము సంపాదింపవలెను. నలమహారాజు నంతటి మహాపురుషుడు పాదములు కడుగుకొనునప్పుడు పాదమొక మూల కొంచెము తడియనంత మాత్రముచేత అక్కడినుండి కలి యతనిలో ప్రవేశించెనని చెప్పుదురు. నలు డత్యంత పరిశుద్ధుడు. అన్నివిధముల నిష్కళంకుడు. కాని పాదములు బాగుగ కడుగుకొనని అలసత్వమువలన అంతలో నతనిలోనికి కలి చొరబడెను. ఇక మన శరీరము ఏదో యొక మూల కాక ఆపాదమస్తకము కలి ప్రవేశించుటకు తగిన స్థితిలోనే యుండును. ఎక్కడికక్కడనే సోమరితనము మనలో ప్రవేశించగలదు. శరీరమునకు సోమరితన మబ్బినచో మనోబుద్ధులకుకూడ అది సోకును. ఈ నాటి సమాజనిర్మాణము ఈ సోమరితనము మీదనే ఆధారపడియున్నది. దీనివలన మితిలేని దుఃఖములు ఉత్పన్నమైనవి. మన మీ సోమరితనమును పోగొట్టుకొనగలిగినచో మన దుఃఖములను అన్నిటిని కాక పోయినను పెక్కింటిని దూరముచేసికొనగలము.

సమాజమును సంస్కరింపవలెనను ఆలోచన లిప్పుడు నలుదిశలకు వ్యాపించుచున్నవి. ప్రతిమానవునికిని కనిష్ఠ ప్రమాణములో కొంత సుఖముండుట, దాని కనుకూలమైన

సమాజ వ్యవస్థ నిర్మింపబడుట- ఈ మొదలగువానినిగూర్చిన చర్చలు జరుగుచుండును. ఒకప్రక్కను మితిమీరినసుఖము, మరియొకవంక అపారమైన దుఃఖము ప్రపంచమునం దున్నవి. ఒకప్రక్కను కుప్పతిప్పలుగ సంపదలు, రెండవవైపున దారిద్ర్యమను లోతైన గోతులు సమాజములో వ్యాపించి నచో ఈ విషమస్థితి తొలగిపోవు టెట్లు? అవసరమగు సుఖము లన్నిటిని సహజముగ పొందవలెననిన ఒకటే యుపాయమున్నది. అదేమనగా సోమరితనమును వదలి అందరును శ్రమచేయుటకు తయారగుటయే! దుఃఖము ముఖ్యముగ మన సోమరితనమువలన కలుగుచున్నది. అందరును శరీరశ్రమ చేయ నిశ్చయించుకొన్నచో ఈ దుఃఖము తొలగిపోగలదు.

కాని నేడు సమాజమున కనబడుచున్నదేమి? ఒకవైపున త్రుప్పుపట్టి పనికిరాని మనుష్యులు కనబడుచుందురు. ఈ శ్రీమంతుల ఇంద్రియములు త్రుప్పుపట్టుచున్నవి. వారు తమశరీరము నేమాత్రమును ఉపయోగింపరు. రెండవవైపున మితిమీరినపని చేయవలసినవారుకలరు. ఈ శ్రమ చేయలేక బీదలశరీరములు అరిగి శిథిలములైపోవుచున్నవి. సమాజమునం దెల్ల శరీరశ్రమనుండి తప్పించుకొను ప్రవృత్తియే కనబడుచున్నది. విరిగి తునుకలైపని చేయువారు దానిని సంతోషముతో చేయుటలేదు; విధిలేక చేయుచున్నారు. చదువుకొన్నవారు, వివేకవంతులు శరీరశ్రమనుండి తప్పించుకొనుటకు రకరకములగు పన్నాగములను పన్నుచుందురు. "శరీరశ్రమలో కాలము సొందులకు వృథాపుచ్చవలెనా?" అని కొందరందురు. కాని

"వృథాగా నిద్రయెందులకుపోవలె? భోజనము చేయుటలో సమయము నెందులకు పాడుచేసికొనవలె?" నని మాత్రము ఎవ్వరును ప్రశ్నింపరు. ఆకలియైనచో తినుటయే, నిద్ర వచ్చినచో పండుకొనుటయే పని. కాని శరీరశ్రమ చేయవలె నను సమస్య వచ్చినప్పుడుమాత్రము ఇందులో మన సమయము నెందులకు వృథాపుచ్చవలె? శరీరమున కింత కష్టము నెందుల కీయవలె? మానసిక శ్రమ చేయుచునే యున్నారముకదా?" అని నిస్సంకోచముగ అనుచుందురు. సరే! బాగుగానున్నది. శ్రమ మానసికముగ చేయుచున్నారు. కనుక మీరు భోజనముకూడ మానసికముగనే చేయుడు. మానసికముగనే నిద్రకూడ పొండు. మనోమయనిద్ర, మనోమయ భోజనముచేయు ఉపాయమేదైన యోజింపుడు.

ఈ విధముగ సమాజములో రెండుతెగల మనుష్యులు తయారైనారు. ఎడతెఱిపిలేకుండ కష్టించి మరణించు రక మొకటి; ఇక్కడి పుల్లతీసి అక్కడపెట్టని రక మొకటి. నా మిత్రుడొకడు "మొండెములువేరు, తలలువేరు"అన్నాడు. ఒకవైపున కేవలము మొండెములు, రెండవవైపున తలలు. మొండెములకు కేవలము అరిగిపోవుటయే పని. తలలకు కేవలము ఆలోచించుటయేపని. ఈ విధముగ సమాజములో రాహుకేతువులవలె మొండెములు, తలలు వేరయిపోయినవి. కాని నిజమునకు మొండెములు, తలలు వేరువేరుగ నుండినచో బాగుగానుండెడిది. అప్పుడు అంధ-పంగున్యాయముగ ఏదేనొక యేర్పాటు చేయుటకు వీలుండెడిది. కుంటివాడు అంధునికి దారిచూపించును. గ్రుడ్డివాడు కుంటివానిని భుజము

లపై కూర్చుండబెట్టుకొనును. కాని మొండెములు, తలలు వేనికవి వేరుగా లేవు. ప్రతివానికిని ఒక మొండెము దానిపై తల రెండును కలిసియేయున్నవి. ఈ విధముగ ఎక్కడచూచినను తలలు, మొండెములు కలసిన జంటలే! ఏమిచేయవలె? ఇదే వచ్చినచిక్కు. కనుక ప్రతివాడును సోమరితనమును తప్పక వదలవలెను.

సోమరితనము పోవలెనన్ని శరీరపరిశ్రమ చేయవలె. సోమరితనమును జయించుటకు ఇదొకటే యుపాయము. దీనిని ఆచరణలో నుంచకపోయినచో ప్రకృతి దండించక మానదు. రోగముద్వారాగాని లేక మరొకరూపమునగాని శిక్ష ననుభవింపవలసినదే! శరీరధారులము కనుక శ్రమ చేయవలసినదే! శరీరశ్రమలో గడపినసమయము వ్యర్థముగ పోదు. దానికి ప్రతిఫలము తప్పక లభించును. ఉత్తమమైన ఆరోగ్యము చేకూరును. బుద్ధి తేజస్వంతము, నిశితము, పరిశుద్ధము అగును. చాలమంది మేధావుల ఆలోచనలలోకూడ తమ తలనొప్పి, కడుపునొప్పి మొదలగు శారీరక రుగ్మతల ప్రభావము కనబడుచునే యుండును. ఈ స్థితిని తొలగించుటకు మేధావులుకూడ ఆరుబయట ఎండలో, ప్రకృతిమాత ఒడిలో పరిశ్రమచేసినచో వారి భావములుకూడ తేజస్వంతము లగును. శారీరక రుగ్మతయొక్క ప్రభావము మనస్సు మీద పడినట్లే శరీరారోగ్యముయొక్క ప్రభావముకూడ మనస్సుమీద పడును. ఇది యనుభవసిద్ధము. ఈయవ్యాధి ప్రవేశించినతరువాత పరిశుద్ధమైన గాలిపీచు మదనపల్లికో

మరి యే కొండప్రదేశమునకో పోవుటకు, లేక సూర్యకిరణ చికిత్స పొందుటకుపూర్వమే ఆరుబయట గడ్డపారతో త్రవ్వుటయో, తోటలోని చెట్లకు నీరు పోయుటయో, లేక కట్టెలు కొట్టుటయో చేసిన నష్టమేమి?

77

తమోగుణమును జయించుటకు మరియొక ఉపాయము

సోమరితనమును జయించు విషయము తెలిసికొన్నాము. నిద్రను జయించుట రెండవ విషయము. నిద్ర వస్తుతః పవిత్ర మైనది. సేవచేసి అలసిపోయిన సాధుసజ్జనుల నిద్ర యోగమే! ఇట్టి శాంతి నిచ్చు గాఢనిద్ర అదృష్టవంతులకే లభ్యమగును. నిద్ర గాఢమైనదిగా నుండనలె. నిద్రయొక్క మహత్వము దాని కాలపరిమాణముపై ఆధారపడియుండదు. నిద్ర సెజ్జ యొక్క వైశాల్యముమీదను, దానిపై మనుష్యుడు పరుండు కాలముమీదను ఆధారపడి యుండదు. నూయి యెంత లోతుండునో నీరు అంత పరిశుభ్రముగ నుండును. ఆ విధము గనే నిద్రపోయిన సమయము కొంచెమైనను ఆ నిద్ర గాఢ నిద్రయైనచో ఉత్తమపరిణామము కలుగును. చంచలత్వముతో మూడుగంటలు చదివినదానికంటె తదేకనిష్ఠతో అరగంట సేపు చదువుటే ఎక్కువఫలము నిచ్చును. నిద్ర విషయము కూడ నింతే! చాలసేపు సాగిన నిద్ర మంచిపరిణామమునే కలిగించునని చెప్పలేము. రోగి ఇరువదినాలుగు గంటలును

మంచముమీదనే పడియుండును. మంచమునకును వానికిని ఎడతెంపులేని సహవాస మున్నను నిద్రకును వానికిని సంబంధమే యుండదు. గాఢమై, స్వప్నరహితమైన నిద్రనే నిద్ర యందుము. మరణానంతరమువచ్చు యమయాతనల విషయము మనకు తెలియదు. కాని దుస్స్వప్నములు వెంటాడులచే నిద్రపట్టనివాడు పడు యమయాతన ఇంతంత కాదు. వేదములో ఋషి బాధపడుచు ఇట్లనును :-

"పరాదుఃస్వప్న్యంసువ"

"అట్టి పనికిమాలిన నిద్ర నాకు వలదు."

విశ్రాంతికొఱకే నిద్ర. కాని నిద్రలోకూడ దుస్స్వప్నములు, చెడ్డభావనలుపట్టపీడించుచో ఇక విశ్రాంతియెక్కడ?

కాగా గాఢనిద్రపట్టు టెట్లు? సోమరితనము పోవుటకు చెప్పిన యుపాయములే నిద్రకుకూడ వర్తించును. శరీరముతో నిరంతరమును ఏదో యొకపని చేయుచుండవలె. అప్పుడు ప్రక్కమీద పండుకొనగానే మనుష్యుడు మైమరచి శవమువలె పడి నిద్రపోవును. నిద్రయనగా చిన్న మృత్యువే! ఇట్టి కమ్మని నిద్ర పట్టవలెనన్నచో పగలంతయు దానికి తగిన కృషి బాగుగ జరిగియుండవలెను. శరీరము అలసిపోవలెను. ఆంగ్లకవి షేక్స్పియర్ - "రాజు తలమీద కిరీట ముండునే కాని లోపల అన్నియు చింతలే" అన్నాడు. అట్టి రాజునకు నిద్రరాదు. శరీరశ్రమ చేయకపోవుటయే దానికి ముఖ్య కారణము. మెలకువతో నుండవలసిన సమయములో నిద్ర పోవువాడు నిద్రించుసమయమున మేల్కొనియుండును.

పగటివేళ బుద్ధిని, శరీరమును ఉపయోగింపనివాడు నిద్రపోయినట్లుకాక మరేమి? ఇక నిద్రవేళ వానిబుద్ధి పరిపరి ఆలోచనలలో తిరుగుచుండును. శరీరముకూడ నిజమైన సుఖనిద్రకు దూరమగును. కాని యతడు గంటలకొలది ప్రక్కమీదపడి దొర్లుచుండును. పరమపురుషార్థమును సాధింపవలసిన ఈ జీవితమును నిద్రయే మ్రింగివేసినచో ఇక పురుషార్థమును సాధించునదెప్పుడు? జీవితములో సగభాగము నిద్రలోనే గడచిపోయినచో ఇక మనము పొందగలుగునదేమి?

చాలసమయము నిద్రయందే ఖర్చుపడినచో తమోగుణముయొక్క మూడవ లక్షణమైన మరపు సహజముగనే వచ్చిపడును. నిద్రాసక్తునిలో దక్షత, జాగరూకత మృగ్యము. అందువలన అజాగ్రత్త ఉత్పన్నమగును. అధికనిద్రవలన మరల సోమరితనము, సోమరితనమువలన మరపు పెరుగును. విస్మృతి పరమార్థమును నశింపజేయును. ప్రాపంచిక దృష్టితోసైతము విస్మృతివలన ముప్పువాటిల్లును. కాని యిప్పటి సమాజములో మరపు సర్వసామాన్య విషయమైపోయినది, ఎవ్వరికిని మరపు పెద్దదోషమనియే తోచదు. ఎవరినో కలిసికొనవలెనని నిశ్చయించుకొందుము. కాని ఆ పనికి వెళ్లమనుకొనుడు. వెళ్లలేదేమని ఎవరేని ప్రశ్నింపగా "అరే! ఆ విషయమే బొత్తిగా మరచిపోయితిమి!" అని యందుము. ఇట్లు సమాధానము చెప్పుటలో ఒక పెద్దతప్పు చేయుచున్నామను భావనయే మనకు కలుగదు. ప్రశ్నించువాడుకూడ ఈ సమాధానముతో తృప్తిపడును. మరపునకు

చికిత్సయేలేనట్లు ప్రజలు వర్తించుచుందురు. కాని యీ పొరపాటు పారమార్థిక ముగను, ప్రాపంచిక ముగనుకూడ చాల హానికరము. నిజమునకు మర్రపొక పెద్ద జాడ్యము. దానివలన బుద్ధిలో పురుగుపుట్టి జీవితమును డొల్లచేయును.

మానసికమైన అలసత్వము మరపునకు కారణము. మనస్సు జాగరూకతతో నున్నచో మర పుండదు. సోమరియై పడియుంటవాని చిత్తమునకు మర పను రోగము రాక మానదు. కావుననే బుద్ధభగవానుడు—

"ప్రమాదో మచ్చునో పదం" అన్నాడు.

ప్రమాదము – లేక – మరపు మృత్యువుయొక్క పర్యాయ పదమే! ఈ మరపును జయింపవలెనని సోమరితనమును, నిద్రను వశపరుచుకొనవలె. శరీరశ్రమ చేయుచు సతతమును మెలకువతో నుండవలెను. చేయు పనులన్నియు యోజించి చేయవలె. ఆలోచింపకుండ నేపనిని ప్రారంభింపరాదు. పనికి ముందు ఆలోచన, పనితరువాత ఆలోచన సాగింపవలెను. ముంను వెనుక సర్వత్ర ఆలోచన యను పరమేశ్వరుడు దర్శన మిచ్చుచుండవలె. ఈ యలవాటు చేసికొన్నచో అజాగ్రత్తయను రోగము తొలగిపోవును. నీ సమయమునెల్ల ఒక నిర్దిష్టకార్యక్రమమునకు బంధించియుంచుము. ప్రతి క్షణమునకును లెక్కచెప్పు జాగ్రత్తలో నీ వున్నచో సోమరి తనము ప్రవేశించుటకు సందే యుండదు. ఈ రీతిగ తమో గుణమునెల్ల జయించు ప్రయత్నము చేయుము.

78

రజోగుణము : దానిని జయించుట కుపాయము "స్వధర్మమునకు కట్టువడి యుండుటయే :

రజోగుణముపై దాడి సలుపవలె. ఇదికూడ ఒక భయంకరమైన శత్రువు. ఇది తమోగుణముయొక్క రెండవ వైపే! ఈ రెండును పర్యాయపదములే యనవచ్చును. మితి మీరి నిద్రపోవువాడు నిద్రనుండి లేవగానే ఇష్టమువచ్చినట్లు తిరుగ నారంభించును. పరుగులెత్తి, తిరిగి పండుకోవలె ననుకొనును. ఇట్లు తమోగుణమునుండి రజోగుణము రజో గుణమునుండి మరల తమోగుణము కలుగుచుండును. ఒకటి యున్నదనిన రెండవదికూడ వచ్చినదన్నమాటే! ఇటు అటు నిప్పు, మధ్య రొట్టె యున్నట్లే మానవుడు తమోగుణ రజో గుణములమధ్య పడియుండును. "ఇటు రమ్ము! నిన్ను తమో గుణము వైపునకు తన్నుదును" అని రజోగుణ మనును. "నా యొద్దకు రమ్ము! నిన్ను రజోగుణమువైపునకు ఎగుర వేయుదును" అని తమోగుణ మనును. ఈ విధముగ రజ స్తమోగుణములు రెండును పరస్పర సహకారముతో మను ష్యుని నాశనము చేయును. 'ఫుట్ బాల్' నలువైపులనుండి తన్నులు తినుటకే పుట్టినట్లు మానవుని జీవితముకూడ రజ స్తమోగుణములచే తన్నులు తినుటలోనే గడచిపోవును.

పెక్కురకముల పనులు చేయవలెనను పేరాస, మానవాతీతమైన అద్భుతకార్యములు చేయవలెనను అపార మైన ఆసక్తి రజోగుణమునకు ప్రధాన లక్షణములు. రజో

గుణమువలన అపారమైన కర్మాసక్తి మనుష్యునిలో ఆవహిల్లును. లోభాత్మకమైన కర్మాసక్తి ఉత్పన్నమగును. లేదు పరివాసనావికారముల వేగము హెచ్చును. అది అరికట్టనలవికాదు. ఇక్కడనున్న పర్వతమును తీసికొనివెళ్లి అక్కడనున్న గోతిని పూడ్చవలె ననుకోరిక పుట్టును. మట్టిపోసి సముద్రమును పూడ్చవలెనని, నీరునింపి సహారా యెడారిని సముద్రమును చేయవలెనని బుద్ధిపుట్టును. ఇక్కడ సూయజ్ కాలువ త్రవ్వవలెనని అక్కడ 'పనామా' కాలువ నిర్మింపవలెనని మానవుడు వెఱ్ఱియాలోచనలు చేయుచుండును. ఏదోయొకటి నిర్మించుట, ఒకటి నాశనముచేయుట లేనిచో వానికి తోచదు. ఈ పనులు చిన్నపిల్లవాడు గుడ్డపీలికలను తీసికొని వానిని ఇంకను సన్నగా చింపుట, లేక అతుకులు పెట్టుటవలె నుండును. దీనిని దానిలోకలుపుము, దానిని దీనిలోకలుపుము, దానినిముంచుము, దీనినెగురగొట్టుము – రజోగుణముయొక్క మితిలేనిచేష్టలీ విధముగ నుండును. పక్షి ఆకాశములో నెగురుచున్నట్లు మనముకూడ ఎగురవలెను. చేప నీటిలోనున్నట్లే మనముకూడ జలాంతర్గామిని నిర్మించుకొని నీటిలో నుండవలెను. ఈ విధముగ నరజన్మమెత్తి పశుపక్షుల ననుకరించుటలోనే కృతార్థత కలదని భావింతుము. పరకాయప్రవేశముచేసి ఇతర జంతువుల వింతవింత అనుభవములను పొందవలెనను గొంతెమ్మకోరికలు ఈ నరజన్మములోకలుగుచుండును. "పదండి! అంగారక గ్రహముకడకు పోయివత్తము, అక్కడి జనసంఖ్య యెంతయో తెలిసికొందము" అని యొకడనును. అనేక వాసన లనెడి పెనుభూతము

మనలో కుదురుకొని యున్నదా యన్నట్లు చిత్తము అదే పనిగా తిరుగుచుండును. రజోగుణముకలవాడు ఉన్న దున్న ట్లుండుట సహింపలేడు. అంతయు తారుమారై పోవలె. "ఇంత మానిసిని నేను జీవించియుండగా ఈ సృష్టి ఉన్న దున్నట్లుండుటయా !" అని వాని కనిపించును. హైల్వాన్ అవయవములు బలప్రదర్శనము చేయవలెనని పెరపెరలాడు చుండును. అందులకై ఒక గోడను తన్నికాని, ఒక చెట్టును గ్రుద్దికాని అతడు తృప్తిపడుచుండును. రజోగుణముగల వానియొక్క ఉద్రేకము ఈ విధముగనుండును. మనుష్య డీ యుద్రేకమునకు వశుడై భూమిలో లోతైన గనులు త్రవ్వును. భూగర్భమునుండి కొన్ని రాళ్లు పైకితీయును. వానికి రత్న ములు, మాణిక్యములు అని పేరు పెట్టును. ఆ యుత్సాహము నకు వశుడై అతడు సముద్రములో దుముకును. సముద్ర గర్భములోనున్న చెత్తను చెదారమును పైకితీసి వానికి ముత్యములని పేరుపెట్టును. కాని ముత్యములో రంధ్ర ముండదు. కనుక దాని కతడు చిల్లిపొడుచును. ఆ ముత్యము లను ధరించుట యెక్కడ ? కంసాలినిపిలిచి ముక్కునకు, చెవులకు రంధ్రములు పొడిపించును. మనుష్య డివియన్నియు ఎందులకు చేయును ? ఇదంతయు రజోగుణ ప్రభావము.

రజోగుణముయొక్క రెండవ పరిణామ మేమనగా మనుష్యుని బుద్ధికి స్థిరత్వము లేకుండుట. రజోగుణము గల వాడు తాత్కాలిక ఫలమునే కోరుకొనును. కనుక ఏకొంచెము విఘ్నము కలిగినను వెంటనే వాడు అంగీకృతమార్గమును

వదలివేయును. అతడు నిరంతరమును ఒకదానిని సేకరించుచు వేరొక దానిని విసర్జించును. అతని నిర్ణయములు దిన దినమును మారిపోవుచుండును. చివర కతని కేమియు చేజిక్కకపోవుటయే దీని పరిణామము.

"రాజసం చల మధ్రువం"

రజోగుణ ప్రధానుని పనులన్నియు చంచలములు, అనిశ్చితములు. చిన్నపిల్లలు గోదుమగింజలను పాతిపెట్టి అప్పుడే మరల వానిని పెల్లగించి చూతురు. ఆ విధముగనే రాజసికుడుకూడ ఫలమంతయు అప్పటి కప్పుడు కనిపించవలె నని కోరుకొనును. అంతలో నతడు అధీరుడై పోవును. ఒక్క చోట కాలూని గట్టిగా నిలబడుట వానికి తెలియనే తెలియదు. ఇక్కడ నొక చిన్నపని నెరవేర్చును. అక్కడ నొక గౌరవమును పొందును. వెంటనే మూడవచోటికి ప్రయాణమగును. ఈరోజు మద్రాసులో సమ్మానపత్రము; రేపు కలకత్తాలో, ఎల్లుండి బొంబాయిలోను, నాగపురములోను. ఎన్ని మ్యునిసిపాలిటీలున్నవో అన్నిటి సమ్మానపత్రములను స్వీకరించు లాలస వానికుండును. గౌరవప్రతిష్ఠలుమాత్రమే వానికి కనబడును. ఒక్కచోట కూర్చుండి పనిచేయు అలవాటే వానికుండదు. ఇందువలన రజోగుణము గలవాని యొక్క స్థితి చాల భయంకరముగ నుండును.

రజోగుణము వలన మనుష్యుడు "అన్నిపనులలోనే నున్నాడ"ననును. స్వధర్మమనునది వానికుండదు. ఇతర కర్మల నన్నిటిని వదలిపెట్టుటయే నిజమైన స్వధర్మాచరణ.

గీతలోని కర్మయోగము రజోగుణమునకు రామబాణము. రజోగుణములో నంతయు చంచలత్వమే. పర్వతాగ్రముపై బడుచున్న వర్షము నలువైపులకును ప్రవహించినచో అది నామరూపములు లేకుండ నిరర్థకమై పోవును. కాని ఏదో యొక దిశకు ప్రవహించినచో పోనుపోను అది యొక నది యగును. దానినుండి యొక శక్తియు ఉత్పన్నమగును. దాని వలన దేశమునకు లాభము చేకూరును. ఆ విధముగనే మానవుడు తన శక్తినెల్ల వివిధ కార్యములలో ప్రవేశపెట్టక దానిని ఏకముఖమునకు తెచ్చి ఒక కార్యములోనే చక్కనిపద్ధతిలో వినియోగించినచో కొంతపని జరుగును. ఇందువలననే స్వధర్మములో చాల మహత్త్వమున్న దన్నారు.

నిరంతరమును స్వధర్మమునుగూర్చి చింతనచేయుచు దానియందే సమస్తశక్తిని చొప్పించవలె. మఱి యే విషయమువైపునకును దృష్టిని పోనీయరాదు. స్వధర్మమునకిదియే ఒరపిడిఱాయి. కర్మయోగ మనగా అపరిమితమైన – లేక – అద్భుతమైన పనులు చేయుటకాదు. గీతలోని కర్మయోగము ఇందులకు భిన్నము. దాని విశిష్టత యిది :– ఫలమువైపు చూడకుండ కేవలము సహజప్రాప్తము, విసర్జింపరానిది అయిన స్వధర్మమును నెరవేర్చుచు తద్ద్వారా చిత్తశుద్ధి కలిగించుకొనుచుండవలె. అట్లుగాక చిత్తశుద్ధి నపేక్షింపని కర్మకలాపము ఈ సృష్టిలో ఎంత జరిగిన నేమి ? కర్మయోగమనగా విశిష్టమైన మనోవృత్తితో సమస్తకార్యములను చేయుటయే ! పొలములో విత్తనములు చల్లుట, గుప్పెడు

గింజలను చేతబట్టుకొని ఎక్కడనో విసరిపారవేయుట — ఈ రెండును పూర్తిగా పరస్పర భిన్నమైన కర్మలు. రెంటిలో చాల నంతర మున్నది. విత్తనములు నాటుటవలన ఎంత ఫలము వచ్చునో వానిని ఊరక విసరిపారవేయుట వలన ఎంత నష్టి కలుగునో మనకు తెలియును. కర్మనుగూర్చి గీత చేయు ఉపదేశము విత్తనములు నాటుటవంటిది. ఇట్టి స్వధర్మ రూపమైన కర్తవ్యముయొక్క శక్తి అమితముగ నుండును. ఎంతశ్రమ చేసినను చాలుననిపించదు. అందువలన గంతులతో పరుగులతో అవసరమే లేదు.

79

స్వధర్మ మిదియని నిశ్చయించు టెట్లు ?

స్వధర్మమును నిశ్చయించుటెట్లని ఎవరైనను ప్రశ్నించినచో 'స్వాభావికమైనదే స్వధర్మము' అని సులువుగ సమాధానము చెప్పవచ్చును. స్వధర్మము సహజమైనది. దానిని వెదకవలెనను ఆలోచనయే చాల విచిత్రమైనది. మనుష్యుని జన్మతోనే వాని ధర్మముకూడ జన్మించును. తల్లి బిడ్డ కొరకు వెదకవలసిన యవసరము లేనట్లే స్వధర్మము కొఱకు ఎవ్వరును వెదక నవసర ముండదు అది మొదటి నుండియు ప్రాప్తమైయుండును. మనము జన్మించకమునుపే సృష్టియుండెను. మన యనంతరముకూడ అది యుండును. మనకు పూర్వమునుండి ఒక మహాప్రవాహము వచ్చుచున్నది.

మన తరువాతకూడ అది యుండును. ఇట్టి ప్రవాహములో మనము జన్మించుచున్నాము. ఏ తల్లిదండ్రుల కడుపున మనము జన్మించితిమో వారిసేవ, ఏ యిరుగుపొరుగువారిమధ్యమనము బ్రతుకుచున్నామో వారిసేవ – ఈ రెండుకర్మలును మనకు సహజముగనే లభించుచున్నవి. ఇక మనవృత్తులు మన నిత్యానుభవములోనివేకదా! నాకు ఆకలియగును, దప్పిక యగును; కనుక ఆకలిగొన్నవారికి అన్నముపెట్టుట, దప్పి గొన్నవానికి నీరిచ్చుట నాకు సహజప్రాప్తమైన ధర్మములు. ఈ విధముగ సేవారూపము, భూతదయారూపము అయిన స్వధర్మమును వెదకవలసినపని మనకులేదు. ఎవడైన 'నా ధర్మమేమి?' యని వెదకుచున్నాడనిన కొలదిగనో గొప్ప గనో పరధర్మములోగాని లేక అధర్మములోగాని వాడు పడు చున్నాడని నిశ్చయముగ చెప్పవచ్చును.

సేవకుడు సేవకొరకు వెదకుకొనవలసిన పనిలేదు. సేవ దానికదే అతనియొద్దకు వచ్చును. కాని అనాయాన ముగ ప్రాప్తమైనదెల్ల ఎప్పుడును ధర్మమేయని భావింపరాదు. ఇది మఱవరానివిషయము. ఎవడైన నొకరైతు రాత్రివేళ వచ్చి నాతో "పోదమురా! నాచేనిగట్టు నాలుగైదు బారలు ముందునకు జరుపుదము; నా చేనియొక్క విస్తీర్ణత పెరుగును. ఇప్పుడైనచో ఎవరికంటను పడము. వెల్లడి కాకుండ పని జరిగిపోవును" అని యన్నాడనుకొనుడు. ఈపని నా పొరుగువాడు కోరినదేయైనను, సహజప్రాప్తమైనదే యైనను అది యసత్యము కనుక నాకర్తవ్యము కాజాలదు.

చాతుర్వర్ణ్య వ్యవస్థ స్వాభావికము, ధర్మము అయి నందువలన నాకు చాల ప్రియము. ఈస్వధర్మమును వదలి నచో పనియే సాగదు. నాకు ప్రాప్తించిన జననీ జనకులే నా తల్లిదండ్రులు. వారు నాకు నచ్చలేదనుటలో అర్థ మేమున్నది? తల్లిదండ్రులు చేయు వృత్తి స్వాభావికముగ పిల్ల వానికి బొరసత్వముగ లభించును. తన పెద్దలనుండి లభించిన వృత్తి నీతివిరుద్ధము కాకున్నచో దానిని సాగించుట చాతు ర్వర్ణ్యవ్యవస్థలోనున్న విశిష్టత. ఇట్టి వర్ణవ్యవస్థ ఈ నాడు తారుమారయిపోయినది. దానిని పాలించుట నేడతి కఠినమై పోయినది. కాని దీనిని సరియగు పద్ధతిలోనికి తీసికొని రాగలిగినచో చాల బాగుగానుండును. లేనిచో జీవితములో మొదటి పాతిక, ముప్పది సంవత్సరములు ఒక కొత్తపనిని, నూతనవృత్తిని నేర్చుకొనుటలోనే గడచిపోవును. పని నేర్చు కొనినపిమ్మట మనుష్యుడు తన సేవాక్షేత్రమును, కార్య క్షేత్రమును వెదకుకొనవలసి వచ్చును. ఈ విధముగ మొదటి పాతిక సంవత్సరములును అతడు నేర్చుకొనుచునే యుండును. ఈశిక్షణకును అతని జీవితమునకును ఏమియు సంబంధముండదు. అతడు "భవిష్యజ్జీవితమునకు సిద్ధపడుచున్నా" ననును. అనగా శిక్షణ పొందుచున్న సమయములో అతడు జీవించి లేడని, జీవించుట అతరువాతనని అన్నమాట. మొదటఅన్నియు నేర్చుకొనవలెనని, బ్రతుకుట తరువాత యని అత డనును. బ్రతుకుట, నేర్చుకొనుట రెంటికిని సంబంధము లేకుండ చేసి కొన్నాడా యన్నట్లుండును. కాని జీవితముతో సంబంధము లేని స్థితిని మరణ మందుము. భారతదేశములో మనుష్యుని సరా

సరి ఆయుర్దాయము ముప్పదిమూడు సంవత్సరములు. ఇందు పాతిక యేండ్లు జీవితమునకు తయారగుటలోను అనగా క్రొత్త పని, వృత్తి నేర్చుకొనుటలోనే గడచిపోవును. అప్పు డెక్కడ నైన అతడు పనిని ప్రారంభించవలెను. ఈ విధానములో మహత్త్వపూర్ణమైన, ఉత్సాహకరమైన కాలమంతయు నిరర్థకముగ గడచిపోవుచున్నది. లోకసేవలో సార్థకము కావలసిన జీవితము వృథాగా పాడగుచున్నది. మానవజీవి తము పిల్లల ఆటవంటిదికాదు. జీవించుటకు వృత్తిని వెదకు కొనుటలోనే అమూల్యమైన మొదటికాలమంతయు ఖర్చు పడిపోవుట చాల దుఃఖకరమైన విషయము. ఇందుచేతనే హిందూధర్మము వర్ణవ్యవస్థను ఏర్పరచినది.

కాని చాతుర్వర్ణ్య వ్యవస్థమాట నటుంచినను, అన్ని దేశములలోను – ఈ వ్యవస్థలేనిచోట్లకూడ – స్వధర్మ మను నది అందఱికును ఉండనేయున్నది. ఒక ప్రవాహములో, అందరమును ఒక్కొక్క పరిస్థితిలో జన్మించినందువలన స్వధర్మాచరణ మను కర్తవ్యము దానియంతట నదే మనకు లభించుచున్నది. ఒకనికి తన పరిస్థితినిబట్టి ముఖ్య కర్తవ్య మైనది మరొకనికి దూరస్థము, అనగా అప్రధానము కావచ్చును. అందువలన ఆ కర్తవ్య మెంతమంచిదిగా కన బడుచున్నను రెండవవాడు దానిని గ్రహింపరాదు. అది తన కర్తవ్యమనుకొనుట సరికాదు. తఱచుగా దూరముననుండు వస్తువులు అందముగా కనబడును. వానినిచూచి మనుష్యుడు మోహితుడగును. మనుష్యునిప్రక్కనే దట్టమైన పొగమంచు

వ్యాపించియున్నను వాని కదికనిపించదు. కొంతదూరములో కనబడు మంచును వ్రేలితోచూపి "అక్కడ మంచు ఎంత దట్టముగనున్నదో చూడుము" అనును. అక్కడనున్న మరొకడు ఇక్కడ దట్టముగ పడుచున్న దనును. నిజమునకు మంచు అంతటను వ్యాపించియేయున్నది. కాని దగ్గరలో నున్నది కనబడదు. మనుష్యునికి దూరవస్తువులు రమణీయములుగా కన్పించును. దగ్గరదానినతడు నిర్లక్ష్యముచేయును. దూరపుదానికొఱకు కలలుగనును. ఇది మోహము. దీనిని వదలవలె. తనకు లభించిన స్వధర్మము సాధారణమైనదైనను, కొలదిపాటిదైనను, రసహీనమైనను, అది సహజప్రాప్తమైనది కనుక అదే నాకు సుందరము, శ్రేయోదాయకము. సముద్రములో మునిగిపోవువానికి చేజిక్కిన వంకరటింకర కొయ్య ముక్కయే ఆధారమగును. అది సుందరముగాలేదని, మెరుగు పెట్టబడలేదని దానిని వాడు త్రోసివేయడు. వడ్రంగికర్మాగారములో మనోహరమైన, నగిషీలుచెక్కిన చెక్కలనేకములుండును. కాని అవి యక్కడనే యున్నవి. ఇత డిక్కడ సముద్రములో మునిగిపోవుచున్నాడు. అందువలన ఆ వంకరటింకర చెక్కయే వానికి తారకము. దానినే యతడు పట్టుకోవలె. ఆ విధముగనే నాకు సహజప్రాప్తమైన సేవయే, అది అప్రధానముగ కనబడుచున్నను నాకుపకరింపవలె. ఆ సేవలో నిమగ్నుడనై యుండుటయే నాకు శోభాకరము. అదే నన్నుద్ధరింపగలదు. అట్టి సేవను వదలి మరియొక సేవకొరకు వెదకు భ్రమలో పడినచో మొదటిది జారిపోవును. రెండవది చేజిక్కదు, అపుడు మనుష్యుడుసేవావృత్తికే దూరమైపోవును.

కాన స్వధర్మమును కర్తవ్యమునకే మనము కట్టువడియుండ వలెను.

మనము స్వధర్మములో నిమగ్నులమై యున్నచో రజోగుణము నీరసించిపోవును. చిత్తమున కేకాగ్రత కుదురుటయే దీనికి కారణము. అప్పుడు మానవుడు స్వధర్మమును వదలి ఎక్కడికిని పోడు. దినివలన చంచలమైన రజోగుణము యొక్క బలమంతయు తగ్గిపోవును. నది లోతుగను, శాంతముగను ప్రవహించుచున్నప్పుడు వరదనీ రెంత వచ్చినను దాని నెల్ల అది తనలోనే ఇముడ్చుకొనును. ఈ విధముగనే స్వధర్మమనునది మానవుని బలమును, వేగమును, శక్తినెల్లను అనాయాసముగ ఇముడ్చుకొనును. స్వధర్మనిర్వహణముపట్ల ఎంత శక్తిని వినియోగించినను అది తక్కువయే యగును. మన శక్తియంతయు స్వధర్మనిర్వహణములో వినియోగించినచో పరుగులు, గంతులువేయు రజోగుణముయొక్క వృత్తియే నశించును. దాని చంచలత్వమంతయు కాళ్ళక్రింద బెట్టి రాచిన ట్లగును. రజోగుణము నీ విధముగ వశపరుచుకొనవలెను.

80

సత్త్వగుణము : దానిని వశపరుచుకొను ఉపాయము

ఇక సత్త్వగుణము మిగిలియున్నది. దీని విషయములో మనము చాల జాగరూకతతో వ్యవహరింపవలె. సత్త్వగుణమునుండి ఆత్మను వేరుచేయుట యెట్లు? సూక్ష్మముగ

పరిశీలనచేయవలసిన విషయ మిది. సత్త్వగుణమునొక్కసారిగ నిర్మూలనము చేయరాదు. రజస్తమోగుణములను పూర్తిగ నాశనము చేయవలెను. కాని సత్త్వగుణముయొక్క భూమిక కొంచెము వేరు. ఎక్కడనైనను పెద్దగుంపును చెదరగొట్ట వలసి వచ్చినప్పుడు నడుము పై భాగమున దెబ్బ తగులకుండ కాళ్లపై తుపాకులను ప్రేల్చుడని సిపాయీలకు ఆజ్ఞ నిత్తురు. ఇట్లు చేసినచో మనుష్యుడు చావడు. గాయములుమాత్రము తగులును. ఇట్లే సత్త్వగుణమును గాయపరుపవలెనేకాని చంపరాదు. రజస్తమోగుణములు రెండును పోయినమీదట శుద్ధసత్త్వము మిగిలియుండును. శరీర మున్నంతవరకు మనము ఇం దేదో యొక భూమికలో - స్థితిలో నుండక తప్పదు. ఇట్లు రజస్తమములు రెండును వదలిన తరువాత మిగిలెడు సత్త్వగుణమునుండి వేరగుట యనగా అర్థ మేమి?

నేను సాత్త్వికుడనను దురభిమానము మానవునిలో ప్రవేశించినప్పుడు అది ఆత్మను శుద్ధసత్త్వమునుండి క్రిందికి లాగును. లాంతరుయొక్క ప్రకాశము బాగుగ బయట వ్యాపింపవలెనన్న అద్దములోపలి మసినెల్ల పూర్తిగా తుడువవలె; ఇంకను అద్దముపైని దుమ్మున్నచో దానినికూడ శుభ్రముగ కడిగివేయవలె. ఈ విధముగనే ఆత్మప్రభను కప్పివేయుచు చుట్టును జేరుకొన్న తమోగుణమను మసిని చక్కగా తుడిచివేయవలె. అటుపైని రజోగుణ మను పైదుమ్మును గూడ తుడిచి శుభ్రముచేయవలె. ఈ విధముగ రజస్తమోగుణములను తుడిచివేయగా సత్త్వగుణమను నిష్కళంకమైన

అద్దము మిగిలియుండును. ఈ సత్త్వగుణమునుకూడదూరము చేయవలెనని అద్దమునుకూడ బ్రద్దలు కొట్టుమని యీ అర్థము కాదు. అద్దమునే బ్రద్దలుకొట్టిన లాంతరుయొక్క పని నెరవేరదు. జ్యోతియొక్క ప్రకాశము వ్యాపింపవలెనని అద్దము అవసరమేకదా! కనుక పరిశుభ్రమైన అద్దమును వగులగొట్టము. కన్నులు మిరుమిట్లుగొనకుండ ఒక కాగితపు ముక్కను అద్దముపై అడ్డుపెట్టుకొందుము. కావలసినదెల్ల కన్నులు మిరుమిట్లుగొనకుండ చేసికొనుటయే! సత్త్వగుణమును జయించుట యనగా దానియెడల మనకుండు దురభిమానమును – ఆసక్తిని తొలగించుకొనుటయే! సత్త్వగుణమును మనము ఉపయోగించుకొనవలె. కాని, దానికొక పద్ధతి, ఉపాయము ఉండవలె. సత్త్వగుణమును అహంకార రహితముగ చేసికొనవలె.

కాగా ఈ సత్త్వగుణమువలన కలుగు అహంకారమును జయించు టెట్లు? దీనికొక ఉపాయమున్నది. మనలో సత్త్వగుణమును స్థిరపరుచుకొందముగాక! సాతత్యమువలన (అనగా సత్త్వగుణమును అంత్యసమయమువరకును అవలంబించుటవలన) దురభిమానముతొలగిపోవును. సాత్త్వికకర్మనే మనము సతతమును చేయుచుండవలె. అది స్వాభావికమయిపోవలె. సత్త్వగుణము కొంచెముసేపు మనతోనుండి పోవు అతిథివలె నుండరాదు. అది మన యింటిమానిసిగామాఱవలె. ఎప్పుడైన అరుదుగ మన మొక మంచిపనిని చేసినచో దాని వలన దురభిమాన మేర్పడును. మనము ప్రతిదినము నిద్ర పోదుము. కాని ఈ విషయమునుగూర్చి యితరులతో

చర్చింపము. కాని పదునైదురోజులు నిద్రపట్టనిరోగి కాసంత నిద్ర పట్టినచో "నిన్న కొంచెము రెప్పవాల్చితిని" అని యందఱతో చెప్పుకొనును. వాని కదియొక ఘనకార్యముగ కనబడును. ఉచ్ఛ్వాస నిశ్వాసక్రియ యింతకంటెను మంచి యుదాహరణ. ఇరువదినాలుగు గంటలును మనము ఊపిరి పీల్చుచునే యుందుము. కాని ఎల్లవారితో దీనినిగూర్చి చర్చింపము. "నే నూపిరిపీల్చుచున్నాను"అని ఒకడొకనితో నెప్పుడైన సగర్వముగ చెప్పుకొనునా? హరిద్వారమునొద్దగంగలో పారవేసిన గడ్డిపోచ వేయిన్నరమైళ్లు ప్రయాణము చేసి కలకత్తాకు చేరినందులకు అదేమైన గర్వించునా ? అది యా ప్రవాహముతోపాటు సహజముగ కొట్టుకొని వచ్చుటచే గర్వపడుటకు కారణములేదు. వేగముగల ప్రవాహమున కెదురుగ పది, యిరువది బారలు ఈదినవా డెంతగా ప్రగల్భములు కొట్టును ! ఇంతకును సారాంశమిది : స్వాభావికముగ జరుగు మంచిపనులవలన మనలో అహంకారము పుట్టదు.

మానవుడు ఏదేని మంచిపని చేసినచో అప్పుడు "నేను కాబట్టి యిది చేసితి"నను అభిమాన మతనికి నేర్పడును. ఎందువలన? మంచిపనులు చేయుట అతనికి సహజము కాలేదు కాబట్టి. ఎప్పుడును తల్లిచేత దెబ్బలు తిను కుఱ్ఱవాడైనను ఏదో మంచిపని చేసినచో, తల్లి వాని వెన్ను తట్టి మెచ్చుకొనును. రాత్రి గాఢాంధకారములో నెక్కడనైన ఒక మిణుగురుపురుగున్నచో దాని గర్వమెంతో చూడుడు ! ఒక్కసారిగ అది తన వెలుగును చూపదు. ఉండియుండి

మినుకు మినుకుమనుచుండును. కొంతసేపు ఆగి తిరిగి మినుకు మినుకుమనుచుండును. వెలుతురును కొంతసేపు కప్పిపెట్టును. కొంతసేపు ప్రసరింపజేయుచుండును. అట్లుగాక దాని వెలుగు ఎల్లపుడును ప్రసరించుచుండినచో దాని కప్పుడు గర్వముండదు. అనగా సాతత్యమువలన తనలో ఒక విశిష్టత ఉన్నట్లే దాని కనిపించదు. ఈ విధముగ మన పనులలో సత్త్వగుణము నిరంతరమును ప్రకటమగుచున్నచో అది మనకు స్వభావసిద్ధమైపోవును. సింహమునకు తన శౌర్యముపట్ల అభిమానముండదు. ఆస్పృహయే దానికుండదు. ఈ విధముగ నే "నేను సాత్త్వికవృత్తికలవాడ"ను స్మృతికూడ లేనంతగా నీ సాత్త్వికవృత్తిని సహజమును చేసికొనుము. వెలుతురు నిచ్చుట సూర్యునికి సహజమైనపని. దీనికి సూర్యుడేమియు గర్వపడడు. సూర్యుడుచేయుపని కెవరైన సమ్మానపత్రము నీయబోయినచో అత డిట్లనును. "నేను చేయుపనిలో విశేషమేమున్నది? వెలుగునిచ్చుచున్నాను. ఇంతకంటె నధికముగ నేమిచేయుచున్నాను? వెలుగునిచ్చుటయే నా జీవితకార్యము. వెలుతురు నీయకపోయినచో నేను చనిపోయినట్లే! ఇంతకంటె నా కేమియు తెలియదు." సాత్త్వికవృత్తికలవాడిట్లు కావలె. సత్త్వగుణ మతని రోమరోమమునందును వ్యాపించవలె. ఈవిధముగ మన స్వభావము సత్త్వగుణమయమైపోయినప్పుడు 'నేను సాత్త్వికకర్మను చేయుచున్నా' ననుఅభిమానముండదు. సత్త్వగుణము యొక్క తీక్ష్ణతను తగ్గించుటకు, దానిని వశపరుచుకొనుటకు ఇది యొక ఉపాయము.

ఇక రెండవయుపాయ మేమనగా సత్త్వగుణమును గూర్చిన ఆసక్తినికూడ వదలుట. అహంకారము, ఆసక్తి - ఈ రెండును వేరువేరు విషయములు. వీనిలోని భేదము కొంచెము సున్నితమైనది. అందువలన దృష్టాంతముద్వారా ఇది త్వరగా తెలియగలదు. "నేను సత్త్వగుణుడను" అను అహంకారము పోయిన తరువాతకూడ ఆసక్తిమాత్రము నిలిచియుండును. తిరిగి శ్వాసోచ్ఛ్వాసముల యొక్క ఉదాహరణనే తీసికొందము. ఊపిరి పీల్చుచున్నామను అభిమానము మాత్రము ఉండదు కాని ఆ పనియం దాసక్తిమాత్రము మెండుగా నుండును. అయిదు నిమిషములపాటు ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములుకట్టిపెట్టుమనినచో అది సాధ్యమగుపని కాదు. శ్వాసోచ్ఛ్వాసములను గూర్చిన అభిమానము ముక్కునకేమియు లేకపోయినను అది విడువకుండ గాలిని పీల్చుచునే యుండును. సోక్రటీసునుగూర్చిన మనోరంజకమైన కథ యొకటున్నది. అతనిది చట్టిముక్కు. దానినిచూచి ప్రజలు నవ్వుచుండెడివారు. కాని హాస్యమున పేరందిన సోక్రటీసు "నా ముక్కే మంచిది. పెద్ద నాసావుటము లున్న ముక్కు ఎక్కువగాలిని పీల్చుకొన గలదు. కనుక యీ ముక్కే అందఱిముక్కులకంటెను సుందరమైనది" అనెడు వాడు. ముక్కునకు శ్వాసోచ్ఛ్వాసములను గూర్చిన అభిమానము లేకపోయినను ఆసక్తిమాత్ర ముండునని దీని తాత్పర్యము. సత్త్వగుణమునెడల కూడ ఇట్టి యాసక్తియేయుండును. ఉదాహరణకు భూతదయను తీసికొనుడు. ఈ గుణము చాల ఉపయోగకరమైనది. కాని దీనియందుకూడ ఆసక్తియుండరాదు.

మహాత్ములలో సత్త్వగుణము వలననే ఇతరులకు మార్గ దర్శకులగుదురు. వారిలోని భూతదయవలన వారి శరీరము ఎల్లరకును ఉపయోగపడుచుండును. బెల్లపుగడ్డకు ఈగలు ముసిరినట్లే ప్రపంచమంతయు తన ప్రేమతో మహాత్ములను కప్పివేయును. విశ్వమంతయు తమ్ము ప్రేమించునంత ప్రేమాతిశయము మహాత్ములలో నుండును. మహాత్ములు దేహాసక్తిని విడిచిపెట్టుదురు. అందువలన యావత్ప్రపంచమును వారిపై ఆసక్తి చూపును. జగత్తంతయు వారి యోగక్షేమమును గూర్చి జాగ్రత్త తీసికొనును. కాని మహాత్ములదృష్టి దీనిపై ఏ మాత్రమును ఉండరాదు. ప్రపంచముచూపు ప్రేమ యను గొప్ప ఫలమునుండికూడ మహాపురుషుడు తన యాత్మను వేరుచేసికొనవలెను. "నేనొక విశిష్టవ్యక్తిని" అని అత డెన్నడును తలపరాదు. ఈ విధముగ సత్త్వగుణము తనలో ఇంకునట్లు చేసికొనవలె.

మొదట అహంకారమును, తరువాత ఆసక్తిని జయింపుము. సాత్త్వముచే అహంకారము జయింపబడును. ఫలాసక్తినివదలి, సత్త్వగుణమువలన లభించిన ఫలమునుకూడ ఈశ్వరార్పితమును చేయుటవలన ఆసక్తిని జయింపవచ్చును. జీవితములో సత్త్వగుణము స్థిరపడినతరువాత ఒకప్పుడు సిద్ధి రూపములోను, వేరొకప్పుడు కీర్తిరూపములోను దాని ఫలము కనబడుచుండును. కాని ఆ ఫలమునుగూడ తుచ్ఛ ముగ భావింపుము. మామిడిచెట్టు తన ఫలములను తాను తినదు. పండెంత సుందరముగను, మధురముగను, రసవంతము

గను ఉన్నను చెట్టు దానిని తినుటకంటె తినకుండుటలోనే మాధుర్య మున్నది. భోగముకంటె త్యాగమే ఎక్కువ మధురమైనది. ధర్మరాజు తన యావజ్జీవిత పుణ్యఫలమైన స్వర్గసుఖమునుగూడ చివరకు తన్నిపారవేసెను. అతని త్యాగములలోనికెల్ల ఈ త్యాగము తుదిమెట్టునకు చేరును. స్వర్గఫలము ననుభవించుటకు అతని కధికార మున్నది. కాని యతడు దాని ననుభవించినచో అది ఖస్సుపడి యుండును. తదుపరి తిరిగి జన్మమెత్తవలసి వచ్చెడిది. "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" — ఈ జననమరణచక్ర మతనిని వెన్నంటి యుండెడిది. ధర్మరాజు ఈ ప్రలోభమును జయించుటలో నెంతో త్యాగమున్నది. ఇది యెల్లపుడును నా కనుల యెదుట నిలిచియేయుండును. ఈ విధముగ సత్త్వగుణమును ఎల్లపుడును ఆచరణలో నుంచుటద్వారా "నేను సత్త్వగుణుడను" అను అహంకారమును జయింపవలెను. తటస్థముగ నుండి, ఫలమునెల్లను ఈశ్వరార్పణచేసి, దాని యాసక్తి నుండికూడ విముక్తిని పొందవలె. అప్పుడు సత్త్వగుణముపైని కూడ విజయము కలిగినదని చెప్పవచ్చును.

81

చివరి విషయము : ఆత్మజ్ఞానము, దాని కాధారమైన భక్తి

ఇక చివరకు చెప్పవలసిన దొకటియున్నది. నీవు ఉత్తమ సత్త్వగుణుడవు కావచ్చును. అహంకారమును

జయింపవచ్చును. ఫలాసక్తిని వదలవచ్చును. అయినను శరీర మున్నంతవరకు మధ్యమధ్య రజస్తమములదాడి నీపై జరుగు చునేయుండును. ఈ గుణములను జయించినట్లే కొంతసేపు తోచును. కాని తిరిగి వాని తీవ్రత పెరుగుచుండును. అందు వలన నిరంతరమును జాగరూకులమై యుండవలె. సముద్ర జలము వేగముతోవచ్చి గట్టునుకోసికొనుచు లోపలికి ప్రవే శించినట్లే రజస్తమోగుణములను ప్రవాహపు వేగము మన మనోభూమిలో ప్రవేశించి ఆఘాతములను కలుగజేయు చుండును. అందువలన నీలో ఏమాత్రపు తూట్లును పడకుండ గట్టి బందోబస్తు చేసికొనుము. రజస్తమోగుణములపై పహారానుంచుము. ఎంత యవధానముతోను, దక్షతతోను ప్రవర్తించినను, ఆత్మజ్ఞానము కలుగనంతవరకు, ఆత్మదర్శ నము కానంతవరకు ప్రమాదము కలదని తెలిసికొనుము. కనుక అన్నివిధముల ప్రయత్నించి ఆత్మజ్ఞానమును సంపా దింపుము.

మెలకువతో మెలగినంతమాత్రమున ఆత్మజ్ఞానము కలుగదు. మఱి అదెట్లు కలుగును? అభ్యాసముచేతనా? కాదు. దానికొకటే యుపాయము, అది నిజమైన హృదయ ముతో, హృదయపూర్వకమైన వ్యాకులతతో భగవద్భక్తి కలిగియుండుట. రజస్తమోగుణములను జయింపవచ్చును. సత్త్వగుణమును స్థిరపరుచుకొని దాని ఫలాసక్తినికూడ వదలి పెట్టవచ్చును. కాని ఇంతమాత్రముననే ఆత్మజ్ఞానము కలు గదు. అది కలుగనంతవరకు జీవితమేలేదు. చివరకు కావలసి నది భగవత్కృపయే! సత్యహృదయముతో చేయు భక్తి

సాధనద్వారా భగవంతుని కృపకు పాత్రులము కావలె. ఇది వినా మార్గమే కనబడదు. ఈ యధ్యాయము చివర అర్జును డిదే ప్రశ్న అడుగగా భగవంతు డిట్లు సమాధానము చెప్పి నాడు-"ఏకాగ్రబుద్ధితో, నిష్కామభావముతో నాభక్తుడవు కమ్ము, నాసేవ చేయుము. ఈ ప్రకారము నా సేవచేసినవాడు మాయయొక్క అవతలియొడ్డునకు చేరగలుగును. లేని యెడల దుర్భేదమైన ఈమాయను దాటుటసులభము కాదు"- ఇది భక్తియొక్క సరళమార్గము, ఏకైకమార్గము.

గీతా ప్రవచనములు

పదునైదవ అధ్యాయము

పూర్ణయోగము : సర్వత్ర పురుషోత్తమ దర్శనము

82

ప్రయత్న మార్గమునుండి భక్తి వేరుకాదు

సోదరులారా !

ఒక విధముగ ఈ నాటితో గీతయొక్క కొసకు చేరు కొన్నామనవచ్చును. చెప్పదలచిన విషయములన్నియు సమగ్రముగ పదునైదవ అధ్యాయములో చెప్పబడినవి. పదునాఱవ పదునేడవ అధ్యాయములు అనుబంధములు. పదునెనిమిదవ అధ్యాయము ఉపసంహారము. ఈ కారణమువలననే భగవంతు డీ యధ్యాయాంతమున దీనికి శాస్త్రమని నామకరణముచేసెను.

"ఇతి గుహ్యతమం శాస్త్ర మిదముక్తం మయానఘ !"

తుదిని భగవంతు డిట్లన్నాడు. జీవితశాస్త్రమునుగురించి, దాని సిద్ధాంతములను గురించి చెప్పవలసినదంతయు పూర్తియైనది. కనుక దీనిని శాస్త్రమని భగవంతుడన్నాడు. అంతేకాని ఇది చరమాధ్యాయమని మాత్రము కాదు. ఈ యధ్యాయములో

పరమార్థము పూర్తిగ బోధింపబడినది. వేదసారమంతయు ఇందులో వచ్చినది. పరమార్థముయొక్క చైతన్యమును మానవునిలో కలిగించుటయే వేదముల పని. ఈ యధ్యాయముచేసినపని యదే. అందువలననే దీనికి వేదసారమను గౌరవప్రదమైన పదవి లభించినది.

పదుమూడవ అధ్యాయములో దేహమునుండి ఆత్మను వేరుచేయవలసిన ఆవశ్యకమును గూర్చి తెలిసికొన్నారము. పదునాల్గవ అధ్యాయములో తత్సంబంధమైన ప్రయత్నవాదమును పరిశీలించినారము. రజస్తమోగుణములను నిగ్రహముతో త్యజింపుము. సత్త్వగుణమును వికసింపజేసి దాని యందలి ఆసక్తిని జయింపుము. దాని ఫలమును త్యజింపుము. ఈ విధముగ ప్రయత్నము చేయవలె. ఈ ప్రయత్నములు పూర్తిగ సఫలమగుటకు ఆత్మజ్ఞాన మవసరమని భక్తిలేనిచో ఆత్మజ్ఞానము అసంభవమని ఈ యధ్యాయము చివర చెప్పబడినది.

కాని భక్తిమార్గము ప్రయత్నమార్గమునుండివేరైనది కాదు. దీనిని సూచించుటకు ఈ యధ్యాయ ప్రారంభమునందే ప్రపంచము ఒక మహావృక్షముతో పోల్చబడినది. త్రిగుణములచే పోషింపబడు ప్రచండశాఖలు ఈ వృక్షమున కున్నవి. అనాసక్తి, వైరాగ్యము అను శస్త్రములతో ఈ వృక్షమును కొట్టివేయవలెనని ఆరంభములోనే చెప్పబడినది. వెనుకటి యధ్యాయములోని సాధనమార్గము ఇక్కడ ప్రారంభములోనే తిరిగి చెప్పబడినది. రజస్తమములను నశింప

జేయుటద్వారా, సత్త్వగుణమును పుష్టిమంతము చేయుట ద్వారా స్వవికాసమును పొందవలె. ఇందొకటి వినాశకము రెండవది విధాయకము. రెంటిని కలిపినచో పరిణామముగ వచ్చున దొకటే మార్గము. గడ్డి కోయుట, విత్తనముల నాటుట – రెండును ఒక క్రియయొక్క భిన్నరూపములే! రజస్తమములను గూర్చియు సత్త్వగుణమును గూర్చియు చెప్పినవికూడ నిట్టివే! రామాయణములో రావణ కుంభ కర్ణ విభీషణులు ముగ్గురు సోదరులు. కుంభకర్ణుడు తమో గుణము, రావణుడు రజోగుణము, విభీషణు డు సత్త్వగుణము. మన శరీరములో నీ మూడుగుణములతో రామాయణము రచింపబడుచునే యున్నది. రామాయణములో రావణ కుంభ కర్ణుల నాశము ఉచితమైన విషయము. ఇక మిగిలిన విభీషణ తత్త్వము హరిచరణములకు సమర్పితము కాగలిగినచో ప్రగతికి సాధనము, పోషకము కాగలదు. ఇందువలన నది అలవరచుకొనదగినది. పదునాల్గవ అధ్యాయములో ఈ విష యమును మనము తెలిసికొన్నారము. ఈ పదునేనవ అధ్యా యము మొదట తిరిగి ఆ విషయమే వచ్చినది. సత్త్వరజ స్తమోభరితమైన ఈ ప్రపంచమును అసంగమను శస్త్రముతో ఛేదింపుము. రజస్తమములను నిరోధింపుము. సత్త్వగుణమును వికసింపజేసి పవిత్రుడవు కమ్ము. ఇప్పట్లు కమలముయొక్క యాదర్శమును భగవద్గీత విశదీకరించుచున్నది. భారతీయ సంస్కృతిలో జీవితాదర్శములు, ఉత్తమోత్తమములు అయిన వస్తువులు కమలముతో పోల్చబడినవి. కమలము భారతీయ సంస్కృతికి చిహ్నము. ఉత్తమోత్తమములైన భావములను

ప్రకటించుటకు కమలము నొక చిహ్నముగ తీసికొందురు. ఎందుల కనగా కమలము స్వచ్ఛము, పవిత్రము అయ్యి నిర్లిప్తముగ నుండును. పవిత్రత, నిర్లిప్తత అను శక్తి ద్వయము కమలమున కున్నది. భగవంతుని వివిధావయవము లను కమలముతో పోల్చెదరు. నేత్రకమలము, పదకమలము, కర కమలము, ముఖకమలము, నాభికమలము, హృదయ కమలము, శిరఃకమలము మొదలగు ప్రయోగములు కలవు. సర్వత్ర సౌందర్యము, పవిత్రత- వీనితోపాటే నిర్లిప్తకూడ ఉన్నదనుభావము ఈ ప్రయోగములద్వారా మన హృదయ ములో అంకితమగుచున్నది.

వెనుకటి అధ్యాయములో చెప్పబడిన సాధనకు పూర్ణ త్వము కలుగుటకొఱకు ఈ యధ్యాయము చెప్పబడినది. ప్రయత్నముతో ఆత్మజ్ఞానమును, భక్తిని జోడించినప్పుడు పూర్ణత్వము సిద్ధించును. భక్తి, ప్రయత్నమార్గములో ఒక భాగమే. ఆత్మజ్ఞానము, భక్తి ఆ సాధనకు అంగములు. వేదములలో ఋషులు

"యోజాగార తం ఋచః కామయంతే
యోజాగార తం సామాని యాంతి"

అని యన్నారు. "జాగరూకుని వేదములు ప్రేమించును; వానిని కలియుట కవి వచ్చును" అనగా జాగ్రత్తకలవాని యొద్దకు వేదనారాయణుడు వచ్చును. వారియొద్దకు జ్ఞాన మును భక్తియు వచ్చును. ప్రయత్నమార్గమునుండి భక్తి, జ్ఞానములు వేరుకావు. ఈ రెండు తత్త్వములును ప్రయత్న

మార్గమునకు మాధుర్యమును చేకూర్చున వని మన మీ యధ్యాయములో చూడగలము. కనుక ఏకాగ్రచిత్తముతో భక్తిజ్ఞానముల స్వరూపమును చిత్రించు ఈ యధ్యాయమును విందురుగాక !

83

భక్తివలన ప్రయత్నము సులువగును

జీవితమును నేను ముక్కలుగ చేయజాలను. భక్తి జ్ఞానకర్మములను నేను వేరు వేరుగ భావింపను. నిజమున కవి వేరుకానేకావు. చెఱసాలలో జరుగు వంటపనినే ఉదాహరణముగ తీసికొందము. అయిదారువందలమందికి మనలో నే కొలదిమందియో వంటచేయుదురు. ఇందులో సరియైన పాక శాస్త్ర జ్ఞానములేనివా డొకడున్నచో వాడు వంటను పాడు చేయును. చేసినరొట్టెలు పచ్చిగానైన ఉండును, లేక మాడి యైనపోవును. అందువలన ఉత్తమమైన జ్ఞానానుభవముతోనే ఇక్కడ వంట జరుగుచున్నదనుకొందము. అయినను ఆ వ్యక్తి హృదయములో ఆ పనియెడల అభిరుచి, భక్తిభావము లేక పోయినచో "వీనిని భుజించువారు నా సోదరులు, నారాయణ స్వరూపులు; ఈ రొట్టెలను చక్కగా నొత్తి కాల్చవలెను, ఇది ప్రభుసేవ" అను భావము హృదయములో లేకపోయి నచో, శాస్త్రజ్ఞానముండికూడ వా డీ పనికి యనర్హుడని తేలిపోవును. కనుక వంటపనికి జ్ఞానమెట్లు అవసరమో అట్లే

అభిరుచికూడ అవసరము. హృదయములో భక్తిరసము లేనంతవరకు పాకము రుచిగా నుండనేరదు. ఇందువలననే తల్లిచేయని వంటకు రుచియుండదందురు. తల్లితప్ప ఎవరీ పనిని ఇంత భక్తిశ్రద్ధలతో చేయగలరు? దీనికితోడు తపశ్చర్యకూడ కావలెను. తాపమును సహింపకుండ, కష్టపడకుండ వంటపని యెట్లుజరుగును? ఏ పనిగాని సఫలము కావలెనని ప్రేమ, జ్ఞానము, కర్మ ఈ మూడును అవసరమని దీనివలన రుజువగుచున్నది. మనముచేయు పనులన్నియు ఈ మూడుగుణములపై ఆధారపడియున్నవి. ముక్కాలి పీటకు ఏ కాలు విరిగినను అది నిలువజాలదుకదా! మూడుకాళ్లును ఉండవలె. దాని నామములోనే దాని స్వరూప మిమిడియున్నది. జీవిత విషయముకూడ నిట్టిదే! జ్ఞానము, భక్తి, కర్మ ఈ మూడును జీవితమునకు మూడుకాళ్లు. ఈ మూడు స్తంభములమీదను జీవితమను సింహద్వారమును నిలబెట్టవలె. ఈ మూడుకాళ్లును కలిసి ఒకవస్తువేయగును. ఇక్కడ ముక్కాలిపీట దృష్టాంతము అక్షరశః సార్థకమగుచున్నది. తర్కదృష్టిలో భక్తి, జ్ఞాన, కర్మలను మీరు వేరువేరుగా చూడవచ్చును; కాని ప్రత్యక్షముగ వీనిని మనము విడదీయలేము. మూడును కలిసి ఒక విశాల వస్తువే యగును.

ఇదియిట్లున్నను భక్తిలో గుణాధిక్యములేదని నేననను. ఏ కర్మతోనైన భక్తి కలిసినప్పుడే అది సులభమనిపించును. "సులభమనిపించు" ననగా అందు కష్టము లేదనికాదు. కాని ఆ కష్టము కష్టమనిపించదు. మీదు మిక్కిలి ఆనందదాయక

మగును. అపుడు శూలము పుష్పమువలె తోచును. కనుక భక్తిమార్గము సులభ మనుటలో భక్తివలన కర్మ బరు వని పించదని తాత్పర్యము. భక్తిచే కర్మలోని కాఠిన్యముపోవును. ఎన్ని కర్మల నాచరించినను వానిని చేయనట్లుగనే యుండును. ఏసుప్రభు వొకచోట ఇట్లనెను– "నీవు ఉపవాసము చేయునప్పుడు ఉపవాసముయొక్క బడలిక నీ ముఖములో కనబడరాదు. అంతేకాదు, నీదొడలు, నీ ముఖము సుగంధమును పూసికొన్నవానివలె ఆనందవికాసములను వెదజల్లుచుండవలె. ఉపవాసము వలన కష్టము కలుగుచున్నట్లు కనబడరాదు." తాత్పర్య మేమనగా నీ మనోవృత్తి కష్టమును మరచిపోవునట్లుగా భక్తిమయము, భక్తివిలీనము కావలె. ఒక వీరపురుషుడు, దేశభక్తుడు నవ్వుచు నవ్వుచు ఉరికంబ మెక్కినాడని మన మనుకొనుచుందుము. సుధన్వుడు సలసల క్రాగుచున్న నూనెపాత్రలోనుండి కూడ నవ్వుచునే యుండెను. కృష్ణా, విష్ణూ, హరీ గోవిందా! యని నామస్మరణ చేయుచుండెను. దీనియర్థ మేమనగా, అంతులేని కష్టములువచ్చి పైబడినను భక్తిప్రభావమువలన అవిభాసింపనేలేదు. నీటిపైతేలు నావను గెంటుట కష్టముకాదు; కాని దానిని భూమిమీద ఈడ్చి వలసి వచ్చిన నెంతో కష్టమగును. నావక్రింద నీరుండినచో మనము సులువుగా దాటిపోగలము. ఈ విధముగనే మనజీవిత నౌకకు అడుగున భక్తియను నీరున్నచో దానిని ఆనందముతో నడుపుకొనిపోగలము. కాని జీవితము శుష్కమైనచో మార్గమంతయు సికతామయము శిలాకంటకమయము అయినచో, గోతులతో గొప్పలతో నిండియున్నచో నావ నీడ్చు

కొనిపోవుట చాలదుష్కరమగుపని యగును. భక్తితత్త్వము సీటివలె మన జీవితనౌకను సులభముగ ఒడ్డు చేర్చును.

భక్తిమార్గమువలన సాధనలో సౌలభ్యమేర్పడును. కాని ఆత్మజ్ఞానమువినా త్రిగుణములను దాటిపోవు ఆశ యెన్నటికిని లేదు. ఇక ఆత్మజ్ఞానమునకు సాధనయేమి! నిరంతర సత్త్వగుణసాధనవలన దానితో తా నేకరూపమయి నేను సత్త్వగుణుడ ననుఅహంకారమును సత్త్వగుణ ఫలాసక్తిని భక్తిద్వారా జయించు ప్రయత్నమే ఆసాధన. ఈ సాధనద్వారా నిరంతర ప్రయత్నము చేయుచున్నచో ఎపుడో యొకనాడు ఆత్మదర్శనమగును. అంతవరకును మన ప్రయత్నము పూర్తికానేరదు. ఇందు పరమపురుషార్థ మిమిడి యున్నది. ఆత్మదర్శనమనగా నవ్వులాటకాదు. ఆడుచు పాడుచు పోవుమార్గములో దొరకు వస్తువుకాదు. దానికై నిరంతర ప్రయత్నము ప్రవాహముగ పారుచుండవలె. "నేను నిరాశకు అవగింజంత చోటీయను; నిరాశతో నే నొక్క ఋణముకూడ కూర్చుండను". పరమార్థ మార్గమునకున్న మరతేయిది. ఇది వినా పరమార్థమునకు వేరొక సాధనయే లేదు. అప్పుడప్పుడు సాధకుడు అలసి యిట్లనును –

"తుమ్‌కారన్ తప్ సంయం కిరియూక హూకహోలా కీజై"

"ప్రభూ! నేను నీకొఱ కెందాక తపించుచుందును?" కాని యిట్లనుకొనుట గౌణము. తపస్సును, సంయమమును స్వాభావికమైపోవునంతగ అభ్యసింపవలె. "ఎందాక సాధన చేయుచుందును?" – ఇట్టి భాష భక్తిమార్గమునకు శోభనీయదు.

అధీరతా, నిరాశలనుండి భక్తి యెన్నడును ఉద్భవింపనేరదు. భక్తిమార్గములో విసుగుదలకు తావేయుండరాదు. భక్తిసాధనలో పోనుపోను ఉల్లాసమును ఉత్సాహమును కలుగుటకు చక్కనిభావములు ఈ యధ్యాయములో వ్యక్తపరుపబడినవి.

84

సేవాత్రిపుటి : సేవ్యుడు, సేవకుడు, సేవాసాధనములు

ఈ విశ్వములో మన కసంఖ్యాకములైన వస్తువులు కనబడుచుండును. వీనిని మూడుభాగములుగ చేయుదుము. భక్తుడు నిద్రనుండి లేవగనే మూడువస్తువులే అతనియెదుట గోచరించును. మొదట అతనిదృష్టి భగవంతునివైపునకు మరలును. అప్పుడతడు పూజకు కావలసినవన్నియు సిద్ధము చేసికొనును. నేను సేవించు భక్తుడను, అతడు సేవ్యుడైన భగవంతుడు, ప్రభువు – ఈ రెండుభావము లెల్లపుడును అతని మనస్సునకు పట్టియేయుండును. ఇక మిగిలినది సృష్టి; అది యతని పూజకై యుపయోగించు సాధనసామగ్రి. పుష్పములు, గంధము, ధూపదీపములు – వీని కొఱకే ఈ సృష్టి యంతయు. ఉన్నవి మూడేవస్తువులు – సేవకుడైన భక్తుడు, సేవ్యుడైన పరమాత్మ, సేవకు సాధనభూతమైన ఈ సృష్టి. ఈ శిక్షణయే ఈ యధ్యాయములో గుఱుపబడినది. మూర్తి పూజచేయు సేవకునకు సృష్టిలోని పదార్థములన్నియు పూజాసాధనములుగ గోచరింపవు. తోటకువెళ్లి నాలుగు పుష్ప

ములు కోసితెచ్చును. ఎక్కడనుండియో యొక అగరు వత్తినికూడ తెచ్చును. కొంచెము నైవేద్య మర్పించును. ఏరి కోరితెచ్చిన వస్తువులనే వాడవలెననుకొనును. కాని పదునేనవ అధ్యాయములోని విశాలశిక్షణ ననుసరించి ఈ విధముగ ఏరితేవలసిన అవసరము లేదు. తపశ్చర్యకు సాధన ములైనవి, కర్మకు సాధనములైనవి యన్నియు పరమేశ్వరుని సేవకు సాధనములే. వానిలో కొన్నిటిని మనము పుష్పము లని, కొన్నిటిని గంధమని, మరికొన్నిటిని నైవేద్యమని యనుకొనవలె. ఈ విధముగ మన మాచరించు కర్మలన్నిటిని పూజాద్రవ్యములుగ భావింపవలెను. ఈ యధ్యాయములోని దృష్టియిది. ఇట్టి ప్రపంచములో నున్నవెల్ల ఈ మూడు వస్తువులే. గీత మన హృదయములకు అంకితము చేయగోరు వైరాగ్యమయ సాధనమార్గమునకు ఈ యధ్యాయము భక్తి రూపము నిచ్చుచున్నది. కర్మల నాచరించుటలోగల భార మును తొలగించి సౌలభ్యము కూర్చుచున్నది.

ఆశ్రమములో హెచ్చుపనులు చేయవలసిన యవస రము ఏ యాశ్రమవాసికైనను కలిగినపుడు "ఇంతమంది యుండగా ఎక్కువపని నేనే యెందులకు చేయవలె" నన్న భావమే వానికి కలుగదు. ఈ దృష్టిలో చాల సారమున్నది. రెండుగంటలపూజకు బదులు నాలుగుగంటల పూజ చేయ వలసిన అవసరము కలిగినట్లైన విసుగుజెంది "అరే రామ ! ఈరోజున నాలుగుగంటలు పూజ చేయవలసి వచ్చినదే"యని ఏ భక్తుడును తలపోయడు. మీదుమిక్కిలి అందువలన వానికి

మరింత ఆనందమే కలుగును. ఇట్లే సేవాకార్యము లధికమైన కొలది ఆత్మవాసికి ఆనంద మధికమగుచుండును. ఈ యను భవమే సర్వత్ర మనకు కలుగుచుండవలె. జీవితము సేవా పరాయణమైపోవలె. అతడు సేవ్యపురుషోత్తముడు, ఆయన సేవకై నిరంతర తత్పరుడ నగు అక్షరపురుషుడను నేను.అక్షర పురుషు డన్నగా ఎన్నడును అలసిపోనివాడు, సృష్ట్యారంభము నుండియు సేవ చేయుచున్న సనాతన సేవకుడు. రాముని యెదుట నిరంతరమును చేతులుమోడ్చి నిలువబడు హను మంతు డిట్టివాడే. సోమరితన మతనిదగ్గరకైనను పోలేదు. హనుమంతుని వలెనే చిరంజీవియైన ఈ సేవకుడు సేవాతత్పరుడై నిలిచియుండును.

ఇట్టి ఆజన్మసేవకునే అక్షరపురుషు డందుము. "పరమాత్మ" యను వ్యవస్థ సదా సజీవమైనది. ఇక ఆ పరమాత్మ సేవకుడనైన నేనుకూడ సదా స్థిరుడనే. ప్రభువు స్థిరుడైన నేనును స్థిరుడనే. నా సేవను పొందుచు అతడే అలసిపోవునో లేక వాని సేవచేయుచు నేనే యలసిపోదునో చూచెదను గాక! అతడు పదియవతారము లెత్తియుండిన నాకును పది యవతారములైనవి. అతడు రాముడైన నేను హనుమంతుడను; అతడు కృష్ణుడైన నే నుద్ధవుడను. అతని కెన్ని యవతారములో నాకును అన్ని కలవు. మా యిరువుర మధ్యను ఇట్టి మధుర మైన పోటీ జరుగుచుండును. ఈ విధముగ యుగయుగముల నుండి పరమేశ్వరుని సేవచేయువాడును, ఎన్నడును నాశము లేనివాడును అయిన ఈ జీవు డక్షరపురుషుడు. ఆపురుషోత్త

ముడు ప్రభువు; నే నతని దాసుడను, సేవకుడను. ఈ భావమును సదా హృదయమునందుంచుకొనవలెను. ఇక అనుక్షణమును మార్పు చెందునది, అనంతరూపములచే అలంకృతమైనదియైన ఈ సృష్టిని పూజాసాధనముగ, సేవాసాధనముగ చేసికొనవలె. మనము చేయు ప్రతికార్యమును పురుషోత్తముని పూజయే యన్నట్లుండవలె.

సేవ్య పరమాత్మ - పురుషోత్తముడు, సేవకుడైన జీవుడు - అక్షరపురుషుడు; కాని నాధనరూపమైన సృష్టి మాత్రము క్షరము. ఇది యిట్లు క్షరమగుటలో చాల అర్థమున్నది. సృష్టి కిది దూషణముకాదు, భూషణమే! దీనివలన సృష్టికి నిత్య నూతనత్వము స్ప్రాప్తించును! నిన్నటి పుష్పములు నేడు పూజకు ఉపకరింపవు; అవి నిర్మాల్యములగును. సృష్టి నశ్వరమైన దగుట మిక్కిలి శుభసూచకము. సేవకిది వైభవము నిచ్చును. రోజురోజును క్రొత్తపుష్పములు సేవకై దొరుకుచునేయుండును. ఆ విధముగనే నేను నూతన శరీరములను ధరించుచు ఈశ్వరసేవ చేయుచుందును. నా సాధనలకు నేను నిత్యనూతన రూపముల నిచ్చుచు వానిద్వారా ఆయన పూజచేయుచుందును. ఈ నశ్వరత్వమువలననే సృష్టి కీ సౌందర్యము వచ్చినది. చంద్రుని కీ రోజుననున్న కళ నిన్న లేదు. దినదినాభివృద్ధినొందు చంద్రుని లావణ్యమును, విదియ మొదలుకొని క్రమాభివృద్ధినొందు చంద్రుని చూచిన నెంత ఆనందము కలుగును! విదియనాటి చంద్రుడు శంకరుని లలాటమునింద నెంతగా ప్రకాశించును! అష్టమినాటి చంద్రుని

సౌందర్యము ఇంకను ఎక్కువ. ఆ రోజున ఆకాశములో లెక్కింపదగినన్ని చుక్కలే ముత్యములవలె మెరయుచు కనబడును. పూర్ణిమరోజున వెన్నెలలో నక్షత్రములు కనిపించవు. ఆ రాత్రి కేవలము పరమేశ్వరుని ముఖచంద్రుడే మనకు దర్శనమిచ్చును. అమావాస్యనాటి రాత్రి కలుగు ఆనందము చాలగంభీరముగనుండును. ఆ రాత్రియెంత పూర్ణమైనశాంతి వ్యాపించియుండును! తమ కపచార మొనర్చిన చంద్రుని కాంతి మఱుగుపడుటచే అసంఖ్యాకములైన చిన్న, పెద్దచుక్కలు ఆనాడు కావలసినంత స్వేచ్ఛతో ప్రకాశించును. వాని స్వతంత్రత ఆ యమావాస్యనాడు కొలమలు పెట్టరానిదై యుండును. వెలుగు నిచ్చుచున్నానని గర్వించు చంద్రుడీ రోజున అక్కడలేడు. తనకు ప్రకాశదాతయైన సూర్యునితో ఏకరూపమైనాడు; అతడు పరమేశ్వరునిలో కలిసిపోయినాడు. జీవుడాత్మార్పణచేసి ప్రపంచమున కేపాటి దుఃఖమునేని కల్గింపడను విషయమును అమావాస్య వెల్లడించుచున్నదా యేమి? చంద్రుడు క్షరుడు, పరివర్తనశీలుడు. అయినను అతడు భిన్నభిన్న రూపములలో మన కానందము నిచ్చును.

సృష్టియొక్క నశ్వరత్వములోనే దాని యమరత్వ మున్నది. సృష్టియొక్కరూపము నదీప్రవాహమువలె ఎప్పటి కప్పుడు మారుచుండును. ఈ విధముగ రూపమను నదికి చలనమే లేకపోయిన అది యొక మురుగుగుంట యగును. నదీజలము అఖండముగ ప్రవహించుచు నిరంతరము మారుచుండును. ఒక బిందువుపోగా మరొకటి దానిస్థాన మాక్ర

మించును. అందుచేతనే ఆప్రవాహము జీవనది యగును. వస్తువులో మనకు కలుగు ఆనందమునకు కారణము దాని నవీనతయే! వేసవిలో దొరకు పుష్పములను వేసవిలో పరమాత్మకు అర్పింతుము. వర్షకాలములో ఆకు పచ్చని గరిక పోచలు అర్పింతుము. శరదృతువులో రమ్యమైన కమల పుష్పముల నర్పింతుము ఆ యా ఋతువులలో వచ్చు ఫల పుష్పములతో భగవంతునిపూజ జరుపబడుచుండును. ఇందు వలననేఆపూజనిత్యమునూతనత్వముతో ప్రకాశించుచుండును. అందువలన ప్రాణము విసుగుజెందదు. చిన్నపిల్లవానికి 'క' అను అక్షరమును వ్రాసియిచ్చి దానిని బాగుగా లావగునట్లు దిద్దుమని చెప్పుదుము. కాని ఆ పని వానిని మిక్కిలి విసి గించును. దాని నెందులకు లావుగ చేయవలెనో వాని కర్థము కాదు. వాడు బలపమును అడ్డముగ త్రిప్పి అక్షరము నొక్క సారియే లావుగా చేసివేయును. అయినను తదుపరి క్రొత్త అక్షరములను, వాని సముదాయములను చూచినేర్చుకొనును. నానావిధసాహిత్యగ్రంథముల అనుభవమును అతడు పొందును. తద్ద్వారా అత డపారానందమును అనుభవించును. సేవా క్షేత్రములోకూడ ఈ ధర్మమే వర్తించును. సాధనలయొక్క నిత్యనవీనత వలన సేవలో ఉత్సాహము పెరుగును. సేవా వృత్తి వికాసము నొందును.

సృష్టియొక్క ఈ నశ్వరస్వభావము నిత్యనూతన పుష్పములను వికసింపజేయుచుండును. గ్రామమునకు సమీపములో శ్మశానమున్నది. కావున గ్రామము రమణీయముగ

కనబడును. వృద్ధులు చనిపోవుచుందురు. నూతన శిశువులు జన్మించుచుందురు. సృష్టికి నిత్యనూతనత్వము కలుగుచుండును. బయటనున్న ఆశ్మశానమును తీసివేసినచో అది యింటిలోనికే వచ్చికూర్చుండును. చూచిన వ్యక్తులనే దినదినమును చూచుచుండుటవలన విసుగుచెందెదవు. వేసవికాలములో ఎండవేడిమియెక్కువ. భూమి ఆ వేడికి కాలును. దీనికి నీవు భయపడవలదు. ఏలయన ఈ వేడి ఎన్నాళ్లో ఉండదు. వర్షాకాలపు సుఖమును పొందుటకు భూమి కాలుట అవసరము. అది బాగుగ కాలకపోయినచో వాన కురియగానే భూమి బురదయైపోవును. పైరుపచ్చలతో అది శోభిల్లదు. నేనొకసారి వేసవికాలపు సెలవులలో తిరుగుచుంటిని. ఎండవేడిమికి తల మాడుచుండెను. కాని నాకదిఆనందమునే కలిగించెను. "తల వేడియెక్కును. తరువాత బాధపడెదవు"అని యొక మిత్రుడనెను. "క్రింద భూమికూడ కాలుచున్నదికదా ! ఈ మట్టిబొమ్మనుకూడ కొంచెము కాలనిమ్ము"అని నేనంటిని. ఆహా! ఎండవేడిమికి తల కాలుట, తరువాత వర్షపుజల్లునకు తడియుట – ఇదెంత బాగుండును! కాని యెండలో తపించని వాడు వర్షము పడినప్పుడుకూడ పుస్తకములలో తలదాచుకొని కూర్చుండును. తన గదినే గోరీగా చేసికొని కూర్చుండును. ఇంటివెలుపల ఈ విశాలమైన అభిషేకపాత్రక్రింద నిలుచుండి అత డానందముతో నృత్యము చేయడు. కాని మహర్షియైన మనువు సృష్టిని ప్రేమించు గొప్ప రసికుడు. "వర్షము కురిసినప్పుడు సెలవిమ్ము"అని అతడు తన స్మృతిలో వ్రాసినాడు. వర్షము కురియునప్పుడు ఆశ్రమములో కూర్చుండి

సంధ్యవార్చుటయా మన పని? వర్షములో గానము, నృత్యము చేయవలె. సృష్టితో ఏకరూపము కావలె. వర్షములో భూమి, ఆకాశము ఒకదానితో నొకటి కలిసిపోవును. ఈ భవ్యదృశ్య మెంత ఆనందదాయకము! ఈ సృష్టి స్వతః మనకు శిక్షణ నిచ్చుచున్నది.

సారాంశమిది: సృష్టియొక్క తీరత్వము, నశ్వరత్వము అనగా సాధనములయొక్క నూతనత్వమనియే అర్థము. ఈ విధముగ క్రొత్తక్రొత్త సాధనసామగ్రినిచ్చు ఈ సృష్టి, నడుము గట్టుకొని సేవకైనిలిచిన సనాతన సేవకుడు, సేవ్యపరమాత్మ- ఈ మూడే మనకు కనిపించునవి. ఇక వీనిమధ్య ఆటసాగ నిమ్ము. ఆ పరమపురుషుడు-పురుషోత్తముడు, క్రొత్తక్రొత్త సేవాసాధనముల నిచ్చి, నా వలన ప్రేమపూర్వకమైన సేవను పొందుచున్నాడు. పలువిధములైన సాధనలనిచ్చి నా చేత ఆట ఆడించుచున్నాడు. రకరకములైన ప్రయోగములను నా చేత చేయించుచున్నాడు. ఇట్టి భావనతో జీవితయాత్ర సాగించినచో ఎంత ఆనందము లభింపగలదు!

85

అహంకారములేని సేవయే భక్తి

మనము చేయు ప్రతికార్యమును భక్తిమయము కావలె నని గీతయొక్క ఉద్దేశము. గంటయో, అరగంటయో మన విశ్వేశ్వరపూజ చేయుచుండుట మంచిదే. ఉదయము, సాయం

కాలము సుందరమైన సూర్యప్రభశోభిల్లుచుండగా చిత్తమును స్థిరపరుచుకొని, కొంతసేపు ప్రపంచమును విస్మరించి, ఆయనం తుని గూర్చి చింతనచేయుట ఉత్తమ మైన కార్యము. ఈ సదాచారము నెన్నడును విడువరాదు. కాని గీత యింత మాత్రమున సంతోషింపదు. ఉదయము మొదలు సాయం కాలమువరకును జరుగుకార్యము లన్నియు భగవంతుని పూజగా జరుగవలెను. స్నానముచేయుచు, భోజనము చేయుచు, నడచుచు, ఊడ్చుచు అతని స్మరణచేయవలె. ఊడ్చు సమయములో "నా ప్రభువు, నా జీవనదేవత-యొక్క అంగణమును పరిశుభ్రముచేయుచున్నా"నను భావన యుండ వలె. మన సమస్త కర్మలును ఈ విధముగ పూజాకార్యము లయిపోవలె. ఈ దృష్టి యేర్పడినచో నీ వ్యవహారములలో ఎంత వ్యత్యాసము కనబడునో నీవే చూడగలవు. మన మెంతో శ్రద్ధతో పూజకు పుష్పములను ఏరుకొని వత్తుము. వానికి ఒత్తిడి తగులకుండ, అవి వాడిపోకుండ ఎంతో శ్రద్ధతో వానిని పళ్లెములో భద్రపరుతుము. అవి యెక్కడ మలినములైపోవునోయని వానిని వాసనచూడవలెననికూడ అనుకొనము. ఈ దృష్టియే, ఈ భావనయే అనుదిన జీవిత కార్యము లన్నిటిలోను ఉండవలెను. ఈ నా గ్రామములో నా నారాయణుడే, నా ప్రభువే నా పొరుగువాని రూపములో దర్శనమిచ్చుచున్నాడు. కనుక నే నీగ్రామమును పరిశుభ్రము గను, నిర్మలముగను ఉంచెదను. మన కీ దృష్టిని కలిగింప వలె ననియే గీత కోరునది. మన కర్మలన్నియు ప్రభుపూజ యగుట గీతకు అత్యంతప్రియమైన విషయము. గంట, అర

గంటచేయు పూజలతో గీతవంటి గ్రంథరాజమునకు తృప్తి లేదు. జీవితమంతయు హరిమయముకావలె; పూజారూపముకావలె. ఇది గీతయొక్క ఉత్కృష్టమైన కోరిక.

గీత పురుషోత్తమయోగమును బోధించి, కర్మమయ జీవితమును పూర్ణత్వమునకు చేర్చుచున్నది. అతడు సేవ్య పురుషోత్తముడు, నే నతని సేవకుడను, ఈ సృష్టియంతయు సేవకు సాధనభూతము–ఈవిషయమును ఈ రూపములో ఒక్కసారి మనము దర్శింపగలిగినచో ఇక కావలసినదేమున్నది ?

పాహూగయా దర్శన్‌తో కరూంగా సేవా
ఔర్ కుచ్ నహీఁ చాహూఁ ప్రభో॥

అని యన్నాడు తుకారామ్.

అప్పుడు మనవలన అఖండమైన సేవ జరుగును. అప్పుడు "నేను" అనునదేమాత్రమును మిగులదు. "నేను, నాది" తుడిచిపెట్టుకొనిపోవును. ఇక యున్నదంతయు భగవంతునికొరకే. పరహితార్థము జీవించుటతప్ప మరి యితర మేదియు ఉండదు. అహంకారమును వదలుకొని, జీవితమును హరిపరాయణము గావించుకొనుమని, భక్తిమయ జీవితమును గడపుమని గీత పదేపదే మనకు బోధించుచున్నది. సేవ్య పరమాత్మ యతడు, సేవకుడను నేను, ఈ సృష్టి సాధన రూపము – అను భావము కలిగినతరువాత "నేను, నాది" అను దానికి తావెక్కడ? జీవితములో మరేవిషయమును గూర్చిన చింతయు ఉండదు.

86

జ్ఞానలక్షణము : నేను పురుషుడను,
అతడు పురుషుడు, అదియు పురుషుడే !

కర్మతో భక్తిని జోడించవలెనని ఇంతవరకును మనము తెలిసికొన్నారము. కాని దానిలో జ్ఞానముకూడ కలిసి యుండవలెను. లేకున్న గీతకు తృప్తిలేదు. దీనినిబట్టి కర్మ, భక్తి, జ్ఞానములు వేరువేరని తలపరాదు. మనకు బోధపడు టకు వేరువేరు మాటలతో చెప్పుకొందుము. కర్మయనిననే భక్తి. భక్తి నెక్కడినుండియో తెచ్చి కర్మతో కలుపవలసిన పనిలేదు. జ్ఞానమువిషయముకూడ నంతే! ఈ జ్ఞాన మెట్లు గలుగును ? "సర్వత్ర పురుషదర్శనము వలన" అని గీత చెప్పును. సేవచేయు సనాతన సేవకుడవు, సేవాపురుషుడవు నీవు; ఆ పురుషోత్తముడు సేవ్యపురుషుడు. అనంతరూపధారిణి, ప్రవాహరూపిణి, వివిధ సాధనదాయిని యైన ఈ సృష్టికూడ పురుషుడే !

ఇట్టి దృష్టి కలిగియుండుట యనగానేమి ? సర్వత్ర, దోషరహితమైన నిర్మల సేవాభావము కలిగియుండుట. మీ చెప్పులజోడు కిట్టుమనుచున్నచో దానిలో కొంచెము నూనె వేయుడు. అదికూడ పరమాత్మయొక్క అంశమే ! కనుక దానిని బాగుచేసి మంచిస్థితిలో నుంచవలె. సేవకు సాధన మైన రాట్నములోకూడ నూనెవేయుడు. అది చప్పుడుచేయు చునేయున్నది చూడుడు. "నేతి, నేతి" — "అట్లయిన నేను దారమునీయనుసుమా !" అని యది అనును. ఈ రాట్నము—

ఈ సేవాసాధనముకూడ పురుషుడే. దీని వడిదారమును అనగా యజ్ఞోపవీతమును మంచిస్థితిలో నుంచుము. ఈ సృష్టి యంతయు చైతన్యమయమని తెలిసికొనుము. ఇది జడమని యనుకొనవలదు. ఇంపైన ఓంకారనాదముచేయు ఈ రాట్నము జడమా ? ఇది పరమేశ్వరుని మూర్తియే. శ్రావణమాసపు-అమావాస్యరోజున మనము అహంకారమును విడిచిపెట్టి వృషభమును పూజింతుము. ఇది చాల గొప్పవిషయము. దీని విశిష్టతను నిత్యమును స్మరించుచు ఎద్దులను చక్కని స్థితిలో నుంచి, వానిచే ఉచితమైనపనిని చేయించుకొనుడు. *ఉత్సవ దినమున కనబరుచుభక్తి ఆరోజుతోనే సమాప్తము కారాదు. ఎద్దుకూడ పరమాత్మయొక్క మూర్తియే ! నాగలి, ఇతరములైన వ్యవసాయపు పనిముట్లు - అన్నిటిని మంచిస్థితిలో నుంచుము. సేవ కుపయోగపడు సాధనము లన్నియు పవిత్రములే ! ఈ దృష్టి యెంత విశాలమైనది ! పూజయనగా బుక్కాపొడి, గంధాక్షతలు, పుష్పములు వేయుట కాదు. పాత్రలను అద్దమువలె తోమి శుభ్రపరుచుట పాత్రపూజ యగును. లాంతరును శుభ్రముగ తుడుచుట లాంతరుపూజ. కొడవలికి పదనుపెట్టి గడ్డికోయుటకు సిద్ధపరుచుట కొడవలిపూజ. తలుపుబందులకు త్రుప్పు పట్టినచో వానికి నూనెవేసి మెత్తపరుచుట వానిపూజ. మానవుడు సర్వత్ర ఇట్టి దృష్టితో పని చేయించుకొనవలె. మానవుడు సేవాసాధనములను ఉత్కృష్టములుగాను, నిర్మలములుగను ఉంచి, వానిచేత పనులు జరుపుకొనవలెను. నేను అక్షర

* మహారాష్ట్రమున 'పోలా' యను ముఖ్యమైన పండుగదినమిది.

పురుషుడను, అతడు పురుషోత్తముడు, సాధనరూపమైన ఈ సృష్టికూడ పురుషుడే, పరమాత్మయే! సర్వత్ర ఒక చైతన్యమే నిండియున్నది. ఈ దృష్టి కలిగినప్పుడు మన కర్మలోనికి జ్ఞానముకూడ వచ్చి చేరినట్లే!

మొదట కర్మలో భక్తిని కలుపుము. తరువాత జ్ఞానమునుకూడ కలిపినచో దానినుండి అపూర్వమైన జీవనరసాయనము తయారగును. గీత మనలను తుట్టతుదకు అద్వైత మయమగు సేవామార్గములో పెట్టును. ఈ సర్వసృష్టిలో ఎక్కడచూచినను ముగ్గురుపురుషులు ప్రత్యక్షమైయున్నారు. ఒక్కడైన పురుషోత్తముడు ఈ మూడురూపములను ధరించియున్నాడు. వాస్తవమునకు ఈ మూడునుకలిసి ఒక్క పురుషుడే! ఇది కేవలము అద్వైతస్థితి. ఇక్కడ గీత మనలను అత్యున్నత శిఖరమునకు చేర్చును. కర్మ, భక్తి, జ్ఞానములు మూడును ఏకమైపోవును. జీవుడు, శివుడు, సృష్టి ఇవన్నియు ఏకరూపమే! కర్మ, భక్తి, జ్ఞానములమధ్య ఎట్టి వైరుధ్యమును లేదు. జ్ఞానదేవుడు "అమృతానుభవము"లో తన ప్రియమైన దృష్టాంతమును ఇచ్చియుండెను.

దేవ, మందిర్, పరివార్-బనాయాకాట్ పర్వత్
ఐసా భక్తికా ఆచార్ - కోయం నహోవే?

ఒక జాతినే తొలిచి దేవళము నిర్మించిరి. ఆ దేవళములోని భగవద్విగ్రహమును ఆ జాతిలోనే సృష్టించిరి. ఆ విగ్రహమునెదుటనున్న భక్తుని, ఆభక్తుడుసమర్పించు పండ్లను కూడ ఆ జాతిలోనే ఏర్పరిచిరి. ఒక మహాశిలలోనే యిన్ని

రూపములను నిర్మించిరి. భక్తుని విషయమున సైతము ఇట్లే యేల కాగూడదు? స్వామి, సేవకుడు అను సంబంధములో నున్నప్పటికిని ఏకత్వ మెందులకుండరాదు? పూజాద్రవ్య మగు ఈ బాహ్యసృష్టి వేరుగనున్నప్పటికిని అది ఆత్మరూపమునేల పొందరాదు? ముగ్గురు పురుషులు నొకరేకదా! జ్ఞానము, కర్మ, భక్తి-ఈ మూటిని కలిపి యొక విశాల జీవన ప్రవాహమును చేయవచ్చును. ఇట్టి పరిపూర్ణ పురుషోత్తమ యోగమిది. స్వామి, సేవకుడు, సేవాద్రవ్యము - అన్నియు నేకరూపమే. ఇక భక్తి-ప్రేమల ఆట సాగవలె.

ఇట్లు పురుషోత్తమ యోగమును హృదయమునకు అంకితముచేసికొన్నవాడే నిజమైన భక్తుడు.

"న సర్వవిద్ భజతిమాం సర్వభావేన భారత!"

ఇట్టి పురుషుడు జ్ఞానియైయున్నను పదునారణాల భక్తుడైయుండును. ఎవనిలో జ్ఞానమున్నదో వానిలో ప్రేమ కూడ నుండును. పరమేశ్వరునిగూర్చిన జ్ఞానము, ప్రేమ - ఈ రెండును వేరువేరు వస్తువులుకావు. 'కాకరకాయచేదు' అను మనోవృత్తియున్నచోట దానిపై ప్రేమ పుట్టదు. ఇట్టిస్థితిలో కూడ ప్రేమను నిలబెట్టుకొనువారు కొందఱుండనే యుందురు. చేదు ననుభవించుపట్ల మనస్సు విసుగుచెందును. కాని పటికబెల్లము మాట స్ఫురించగనే చేదునెడల గల వైమనస్యము తొలగిపోవును. వెంటనే ప్రేమ ప్రవాహము వెల్లివిరియును. పరమేశ్వర సంబంధమైన జ్ఞానము కలుగుట, ప్రేమ యుత్పన్నమగుట రెండును ఒకటే. పరమే

శ్వరుని రూపములోనుండు మాధుర్యమును పనికిమాలిన పంచదారతో నెందులకు పోల్చవలె? పరమేశ్వరునిగూర్చిన జ్ఞానము కలిగిన తక్షణమే ప్రేమభావముకూడ పుట్టుకొని వచ్చును. జ్ఞానముకలుగుట, ప్రేమకలుగుట ఈ రెండును భిన్నక్రియలు కావని తెలిసికొనుము. అద్వైతములో భక్తికి స్థానమున్నదా లేదాయను చర్చతో పనిలేదు. జ్ఞానదేవుడు—

సోహీ భక్తి, సోహీజ్ఞాన్।
ఏకో విఠల్ హీ జాన్॥

అని యన్నాడు. భక్తి - జ్ఞానము, ఇవి యొకవస్తువుయొక్క రెండుపేరులే!

జీవితమందెల్ల ఉత్తమమైన భక్తి వ్యాపించినప్పుడు జరుగు కర్మలన్నియు భక్తి జ్ఞానములకు విరుద్ధముగ నుండవు. కర్మ, భక్తి, జ్ఞానము–ఈ మూడును కలిసి ఒక రమణీయమైన రూపమగును. ఈ రమణీయ రూపమునుండి ప్రేమమయము, జ్ఞానమయము అయిన అద్భుతసేవ సహజముగ ఉత్పన్న మగును. తల్లియెడల బిడ్డకున్న ప్రేమ బిడ్డ చేయు పనుల ద్వారా ప్రకటితము కావలె. ప్రేమ యెల్లపుడును ఎంత కష్టమునైనను సహించును. సేవద్వారా అది ప్రకటమగు చుండును. ప్రేమయొక్క బాహ్యరూపము సేవయే. ప్రేమ అనంతసేవాకర్మలరూపమున అలంకృతమై నృత్యము చేయును. ప్రేమ యున్నచోట జ్ఞానముకూడ ఉండితీరును. ఎవరికి నేను సేవ చేయవలసియున్నదో, వాని కెట్టిసేవ ప్రియమో, అవస రమో అది నాకు తెలియవలె. అది లేకపోయినచో ఆ సేవ

అనేవ-లేక-దున్నేవ అయిపోవును. నేవ్యవస్తువును గూర్చిన జ్ఞానము ప్రేమ కుండవలె. ప్రేమయొక్క ప్రభావమును కార్యములద్వారా వ్యాపింపజేయుటకు జ్ఞానము అవసరము. కాని దానిమూలములో ప్రేమ యుండవలె. అది లేకపోయినచో జ్ఞానము నిరుపయోగమగును. ప్రేమతోచేయు కర్మ సామాన్య కర్మకంటె భిన్నముగా నుండును. పొలముపనిచేసి అలసి వచ్చిన కుమారునిచూచి తల్లి ప్రేమభావముతో "నాయనా! అలసిపోయితివా?" అని యనును. ఈ పని చిన్నదేయైనను ఇం దెంత సామర్థ్య మున్నదో చూడుడు. మీ జీవితకార్యములన్నిటియందును భక్తి జ్ఞానములను ఓతప్రోతము చేయుడు. దీనినే పురుషోత్తమయోగమందురు.

87

సర్వవేదసారము నా చేతిలోనే యున్నది

ఇదంతయు వేదములసారము. వేదము లనంతములు. కాని ఆ యనంతవేదములయొక్క సారసంగ్రహము ఈ పురుషోత్తమయోగము. ఈ వేదమెక్కడనున్నది? వేదములచరిత్ర చాల విచిత్రము. వేదములసార మెక్కడనున్నది? ఈ యధ్యాయప్రారంభములోనే "దేని పత్రములు వేదములో" అని చెప్పబడినది. సోదరా! వేదము లీవృక్షముయొక్క ప్రతి పత్రములోను నిండియున్నవని తెలిసికొనుము. మీగ్రంథముల లోను, సంహితలలోను వేదములు దాగియుండలేదు. అవి విశ్వమంతెల్లను వ్యాపించియున్నవి.

"ప్రవహించు సెలయేళ్లలో సద్గ్రంథము లభించును. తాయి రప్పలలో ప్రవచనములు వినబడును." అని పేక్షి్ పియర్ అన్నాడు. వేదములు సంస్కృతములోను, సంహితల లోను గాక సృష్టిలోనున్నవని దీని భావము. సేవచేసినవారి కవి గోచరించును. "ప్రభాతే కరదర్శనం". ఉదయమున నిద్రనుండి లేవగానే నీ యఱచేతిని చూచుకొనవలె. వేదము లన్నియు నీ చేతిలోనే యున్నవి. వేదము సేవచేయుమనును. నిన్నటిదినము చేయి పనిచేసినదా లేదా ? ఈ రోజున పని చేయుటకు సిద్ధముగనున్నదా లేదా ? పనిచేసిన గుర్తులు దానిలో నున్నవా లేవా ? ఇవి మనము చూడవలసినవి. సేవచేసి చేయి అరిగినప్పుడు బ్రహ్మలిఖితము గ్రాహ్యమగును. "ప్రభాతే కర దర్శన" మనగా అర్థమిది.

వేదము లెక్కడనున్నవందురు ? సోదరా! అవి నీ చేతిలోనేయున్నవి. శంకరాచార్యుడు ఎనిమిదవయేటనే అన్ని వేదములలోని జ్ఞానమునుసంపాదించినట్లు చెప్పుదురు. పాపము! అతనిది మందబుద్ధి. అతని కెనిమిదేండ్లు పట్టినది ! కాని మీకును నాకును అవి జన్మసిద్ధముగనే ప్రాప్తమైనవి. ఎనిమిదేండ్లు పట్టవలసిన పనియేమున్నది ? నేను సజీవమగు వేదమనే. ఇంతవరకు వచ్చిన వేదపరంపరయంతయు నాతో ఏకరూపమయినది. నే నా పరంపరయొక్క ఫలమనే. ఆ వేద బీజమునుండి వచ్చిన ఫలమనే నేను. అట్టి ఫలస్వరూపుడనైన నేను సమస్తవేదములను బీజరూపమున నాయందు పొందుపరచియుంచినాడను. నా యుదరములో అవి పెక్కు రెట్లుగ

వృద్ధిపొందినవి. వేదముల సారము మనచేతిలోనే యున్నదని దీని సారాంశము. సేవ, ప్రేమ, జ్ఞానము అను పునాదిమీద మనము జీవితసౌధమును నిర్మించుకొనవలె. మన చేతులలో వేదములున్నవనుదానికి అర్థమిదే. అప్పుడు నేనేది చెప్పినను అదే వేదమగును. వేదము బయట నెక్కడను లేదు. సేవా మూర్తులైన మహాత్ములు వేదార్థమును గ్రహించినవారము మేమే!" అని యందురు. "వేదములన్నియు నన్నే యెరిగి యున్నవి. సమస్తవేదసారరూపుడ నైన పురుషోత్తముడను నేనే." అని భగవంతుడన్నాడు. వేదములసార మైన ఈ పురుషోత్తమ యోగముతో మన జీవితము నేకరూపముచేసి కొనగలిగినచో ఎంతబాగుగానుండును! అప్పుడిట్టి పురుషుడు చేయు పనులద్వారా వేదమే ప్రకటితమగునని గీత సూచించు చున్నది. గీతయొక్క సారమంతయు ఈ యధ్యాయములో వచ్చినది. గీతచేయు బోధ, పూర్ణరూపములో ఇందు ప్రకటితమైనది. దానిని మన జీవితములో అనుష్ఠించుటకు అహర్నిశము ప్రయత్నింపవలె. ఇంతకంటె చెప్పవలసిన దేమున్నది?

గీతా ప్రవచనములు

పదునాఱవ అధ్యాయము

అనుబంధము ౧ : దైవాసుర వృత్తుల సంగ్రామము

88

పురుషోత్తమయోగముయొక్క పూర్వప్రభ దైవసంపద

సోదరులారా !

జీవిత ప్రణాళిక యెట్లుండవలెనో, మన జన్మము నెట్లు సఫలపరుచుకొనగలమో గీతలోని మొదటి యైదు అధ్యాయములలోను మనము చూచియున్నారము. దాని తరువాత ఆఱవ అధ్యాయము మొదలు పదునొకొండవ యధ్యాయము వరకు భక్తితత్త్వమును అనేకరీతుల విచారణ చేసినారము. పదునొకొండవ అధ్యాయములో భక్తియొక్క స్వరూపమును దర్శించినారము. పండ్రెండవ అధ్యాయములో సగుణ, నిర్గుణ భక్తిరూపములనుపోల్చి భక్తుని ఉత్తమ లక్షణములను తెలిసికొన్నారము. పండ్రెండవఅధ్యాయము తుదివరకు కర్మ, భక్తి-ఈ రెంటిని గూర్చిన నిజస్థితిని పరిశీలించినారము. ఇక జ్ఞానమను మూడవ విభాగము మిగిలిపోయినది. దానిని మనము పదు మూడవ, పదునాల్గవ, పదునైదవ అధ్యాయములలో చూచి

నారము. దేహమునుండి ఆత్మను వేరుచేయుట, దానికొఅకై త్రిగుణములను జయించి చివరకు సర్వత్రప్రభువును దర్శించుట యెట్లో చూచినారము. పదునైదవ అధ్యాయములోసంపూర్ణ జీవిత శాస్త్రమును అవగతము చేసికొన్నారము. పురుషోత్తమ యోగములో జీవితము పూర్ణత్వమును పొందినది. దాని తరువాత నిక మిగిలిన దేమియును లేదు.

కర్మ, జ్ఞానము, భక్తి - వీనిని మూడుగా విడదీయుట నేను సహించలేను. కొందరు సాధకులనిష్ట కేవలము కర్మ వైపునకే మ్రొగ్గియుండును. కొందరు భక్తికే ప్రాధాన్యము నిచ్చి దానియందే దృష్టినెల్లను కేంద్రీకరింతురు. మరికొందఅ ధోరణి జ్ఞానము వైపునకే మరలును. జీవిత మనగా కేవలము కర్మయే, కేవలము భక్తియే, కేవలము జ్ఞానమే యనుకొను ఈ 'కేవల' వాదమును ఒప్పుకొనుట నా కిష్టములేదు. దీనికి విరుద్ధముగ కర్మ, భక్తి, జ్ఞానయోగముల సముచ్చయ వాదమునుగూడ నేనంగీకరింపను. కొంతభక్తి, కొంతజ్ఞానము, కొంత కర్మ - ఇట్టి అవసరవాదముకూడ నాకు గిట్టదు. మొదటకర్మ, తరువాతభక్తి, తరువాతజ్ఞానమనుక్రమవాదమునుకూడ నేనంగికరింపను. ఈ మూటిని కలుపుట సమంజసమను వాదము కూడ నాకంగీకృతముకాదు. కర్మయేభక్తి, భక్తియేజ్ఞానము, జ్ఞానమే కర్మ యను అనుభవమును పొందవలెనని నాకోరిక. బర్ఫీముక్కయొక్క మాధుర్యము, దాని యాకారము, దానిబరువు, మూడును వేరువేరుకావు. మన మా ముక్కను నోటిలో వేసికొన్న వెంటనే దాని యాకారమును తినివేసి

నారము. దాని బరువును జీర్ణముచేసికొన్నారము. మాధుర్య మునుగూడ రుచిచూచినారము. ఆ మూడుపనులును కలిసి యొకసారియే జరుగుచుండును. బర్ఫీయొక్క ప్రతి కణము లోను ఆకారము, బరువు, మాధుర్యము కలిసియేయున్నవి. ఒక కణములో కేవలము ఆకారము, మరొకదానిలో కేవ లము మాధుర్యము, మరొకదానిలో వట్టిబరువు లేదు. ఆ విధముగనే జీవితములోని ప్రతిక్రియయందును పరమా ర్థము నిండియుండవలెను. ప్రతికార్యమును సేవామయము, ప్రేమమయము, జ్ఞానమయము కావలె. జీవితముయొక్క విభాగములన్నిటిలోను కర్మ,భక్తి, జ్ఞానములు నిండియుండ వలె. దీనినే పురుషోత్తమయోగమందురు. జీవితమునెల్ల పర మార్థమయము చేయవలె ననుమాటను చెప్పుట చాల సుల భము. కాని ఈ భావము ఆచరణములోనికి రావలెనన్ని శుద్ధమైన భక్తిజ్ఞానములతో హృదయమును వికసింపచేసి కొని సాధనచేయవలెను. కావున కర్మ భక్తి జ్ఞానముల రూపము అక్షరశః ఒకటే ! ఈ యుత్కృష్టస్థితినే పురుషో త్తమ యోగమన్నారు. దీనితో, జీవితము చరమదశను పొందును.

ఇప్పు డీ పదునారవ అధ్యాయములో చెప్పబడిన విషయమేమి ? సూర్యోదయము కాబోవుముందు సూర్యుని ప్రభ ఆకాశమునునింపినట్లుగానే కర్మ, భక్తి, జ్ఞానములతో గూడిన పూర్ణ పురుషోత్తమయోగము జీవితాకాశములో నుదయించుటకుముందు సద్గుణముల ప్రభ బహిర్గతమగును. పూర్ణజీవితమును సూచించుచు ముందుగావచ్చు ఈ ప్రభ

యొక్క వర్ణనము ఈ పదునాఱవ అధ్యాయములో చేయబడినది. ఏ యంధకారముతో పోరాడి యీ ప్రభ బయలు వెడలునో దాని వర్ణనకూడ ఇక్కడ చేయబడినది. ఏదేని ఒక విషయమును రుజువుచేయుటకొరకు మరికొన్నిటి సాహాయ్యము అవసరమగుచుండును. సేవా, భక్తి, జ్ఞానములు మన జీవితములోనికి వచ్చినట్లు మనము తెలిసికొనుట యెట్లు ? పొలములో మనము కృషిచేసినందులకు ప్రతిఫలముగ ధాన్యమును కొలిచి యింటికి తెచ్చుకొందుము. ఈ విధముగనే మనము చేసిన సాధనలేవో, వానినుండి మనకు కలిగినఅనుభవములేవో, ఎన్ని సద్వృత్తులు మనలో లోతుగ నాటుకొన్నవో, ఎన్ని సద్గుణములు మనలో ప్రవేశించినవో, జీవితము నిజముగ నెంత సేవామయమైనదో - వీనిని పరిశీలించుటకు ఈ యధ్యాయము దారి చూపును. జీవితకళ యెంతపురోగమించి వృద్ధిచెందినదో కొలిచి చూచుకొనుడని ఈ యధ్యాయము మనకు చెప్పుచున్నది. వికాసయుతమగు ఈ జీవితకళను గీత దైవసంపదయనును. ఇందుకు విరుద్ధమైన వృత్తులను అసురసంపదయనును. ఈ యధ్యాయములో దైవసంపదకు అసురసంపదకు మధ్య జరుగు సంఘర్షణ చెప్పబడినది.

89

హింసాహింసల సేనలు

మొదటి యధ్యాయములో ఒక వైపున కౌరవసేనయు, రెండవవైపున పాండవసేనయు ఎదురెదురుగ నిలిచియున్నట్లు

ఇక్కడ సద్గుణములనెడి దైవసేన, దుర్గుణములనెడి అసురసేన ఒక దానియెదుట నొకటి నిలిచియున్నవి. మానవ హృదయములో సత్యాసత్య ప్రవృత్తులమధ్య జరుగుచుండు పోరాటమును బహు ప్రాచీనకాలమునుండియు రూపకాలంకారము ద్వారా వర్ణించుట పరిపాటియైనది. వేదములలో ఇంద్రునికిని వృత్రునికిని, పురాణములలో దేవతలకును దానవులకును, అట్లే రామరావణులకును, పారసీక ధర్మగ్రంథములలో అహుర్మజుదునకును అహరిమానునకును, క్రైస్తవమతములో భగవంతునికిని సైతానునకును, ఇస్లాములో అల్లాకును ఇబ్లీసునకును ఉన్న పోరాటములవంటివి అన్ని ధర్మగ్రంథములలోను కనబడుచున్నవి. కావ్యములలో స్థూలవిషయముల వర్ణన సూక్ష్మవస్తువులద్వారా చేయబడుచుండగా ధర్మగ్రంథములలో సూక్ష్మమనోభావములు బ్రహ్మాండమైన వస్తువులతో పోల్చబడి వర్ణింపబడుచుండును. కావ్యములలో స్థూలవస్తువులవర్ణన సూక్ష్మవస్తువులద్వారా జరుగగా, ఇక్కడ సూక్ష్మవస్తువులవర్ణన స్థూలవస్తువులద్వారా జరుగును. గీతకు ప్రారంభములో చేయబడిన యుద్ధవర్ణన కేవలము కల్పిత మని నేను సూచించుట లేదు. అది చరిత్రాత్మక విషయమే కావచ్చును. కాని యిక్కడ వ్యాసుడు తన యభీష్టమును నెరవేర్చుకొనుటకు ఈ యుద్ధము నుపయోగించుకొనుచున్నాడు. కర్తవ్య నిర్వహణములో మనస్సునందు మోహము జనించినప్పుడు మనుష్యుడెట్లు సంచరింపవలెనన్న విషయము యుద్ధ మను రూపకముద్వారా నచ్చజెప్పబడినది. ఈ పదునాఱవ అధ్యాయములో మంచిచెడుగుల నడుమ కలుగు పోరాటము చిత్రింప

బడినది. గీతయందు యుద్ధముయొక్క రూపకముకూడ చూప బడినది.

కురుక్షేత్రము మన వెలుపలను మనలోపలనుఉన్నది. సూక్ష్ముగ చూచిన మన లోపల జరుగుచున్న సంగ్రామమే బాహ్యప్రపంచములో కూడ మూర్తీభవించి కనబడు చున్నది. బయట కనబడుచుండు నా శత్రువులు నా మనో వికారముల సాకారరూపములే. నా ముఖములోని మంచి చెడుగులు అద్దములో ప్రతిబింబించినట్లు నా మనస్సులోని మంచి, చెడ్డ తలంపులు బయటనున్న మిత్రులుగ, శత్రువులుగ కనబడుచుండును. జాగ్రదవస్థలోని విషయములనే మనము స్వప్నములో దర్శించినట్లు మన మనస్సులోనున్న భావనలనే వెలుపల చూచుచుందుము. బయట జరుగు యుద్ధమునకును లోపల జరుగు యుద్ధమునకును భేద మేమియులేదు. నిజము చెప్పవలెనన్న ముఖ్యమైనయుద్ధము లోపలనేజరుగుచుండును.

మన అంతఃకరణములో ఒకవైపున సద్గుణములు, మరి యొకవైపున దుర్గుణములు నిలిచియున్నవి. అవి తమ తమ వ్యూహములను చక్కగా పన్నుకొని సంసిద్ధముగ నున్నవి. సేనకు సేనాపతి అవసరమైనట్లే ఇక్కడకూడ సద్గుణములొక సేనాపతిని యెన్నుకొన్నవి. ఆసేనాపతిపేరు 'అభయము'. ఈయధ్యాయములో అభయమునకు ప్రథమస్థాన మీయ బడినది. ఇది అనాలోచితముగా నీయబడిన స్థానముకాదు. బాగుగా యోజించియే అభయమున కీ ప్రథమస్థాన మీయ బడియుండును. అభయమువినా మరి యే గుణమును రాణింప

జాలదు. సత్యము లేని చోసద్గుణమున కేమియువిలువలేదు. కాని సత్యమునకు నిర్భయత్వమావశ్యకము. భీతవాతావరణములో సద్గుణములు వికసింపజాలవు. అట్టి వాతావరణములో సద్గుణములుకూడ దుర్గుణములైపోవును. సద్వృత్తులుకూడ బలహీనములైపోవును. నిర్భయత్వము సద్గుణము లన్నిటికిని ముఖ్యనాయకుడు. కాని సేనకు ముందును వెనుకను కాపుదలయుండవలె. సరళమైన దాడి యెదుటినుండియే వచ్చును. కాని వెనుకనుండి దొంగపోటుగ దాడి జరుగవచ్చును. సద్గుణములకు ముందు 'అభయము' డేరా వేసికొని నిలిచియుండును. ఇక వెనుకనుండి 'నమ్రత' సేనను రక్షించుచుండును. ఈ విధముగ మిక్కిలి చక్కనిరీతిని దైవియగు సంపద రక్షింపబడుచున్నది. ఇందు మొత్తము ౨౬ గుణములు చెప్పబడినవి. వీనిలో ౨౫గుణములు పూర్వమేయుండి, వానిని గూర్చిన యహంకారము ప్రవేశించినయెడల వెనుకనుండి దొంగపోటుగ దాడి జరిగి సద్గుణము లన్నిటిని కోల్పోయెడు భయము కలదు. ఇందుచే నమ్రత యను సద్గుణము రక్షణకై వెనుకవైపున ఉంచబడినది. ఆ నమ్రతయే లేకున్నచో జయమెప్పుడు పరాజయముగ మారునో చెప్పలేము. ఈవిధముగ ముందర నిర్భయత, వెనుక నమ్రత వెన్నంటి యున్నపుడే సద్గుణము లన్నిటిని వికసింపజేసికొనవచ్చును. ఈ రెండు మహాగుణములమధ్య నున్న ఇరువదినాలుగు గుణములు అహింసకు పర్యాయపదము లనుటలో అనుచిత మేమియు లేదు. భూతదయ, మార్దవము, క్షమ, శాంతి, అక్రోధము, అహింస, అద్రోహము – ఇవన్నియు అహింసకు పర్యాయ

పదములే. అహింస, సత్యము అను నీ రెండుగుణములలో సద్గుణము లన్నియు ఇమిడియున్నవి. సద్గుణము లన్నిటిని సంక్షిప్తపరచినచో చివరకు సత్యాహింసలు రెండేమిగులును. తక్కిన సద్గుణములన్నియు ఈ రెంటియందే ఇమిడియుండును. కాని నిర్భయత, నమ్రత – ఈ రెంటివిషయమును వేరు. నిర్భయతవలన ప్రగతి కలుగును. నమ్రతవలన రక్షణ కలుగును. నిర్భయత సత్యముయొక్కయు, నమ్రత అహింసయొక్కయు చిహ్నములు. సత్యాహింసలను మూలధనముగ పెట్టుకొని నిర్భీతితో పురోగమించవలెను. జీవితము విశాలమైనది. దానియందు మనము నిరాతంకముగ సాగిపోవలెను. నమ్రత నంటియుండినచో అడుగు ఇటు నటు బెసగనేరదు. మరి యే యితర ప్రమాదమును ఉండజాలదు. ఇక సంతోషముతో సర్వత్ర సత్యాహింసల ప్రయోగములు జరుపుచు ముందునకు సాగిపొండు. తాత్పర్యమేమనగా సత్యాహింసల వికాసము నిర్భయత, నమ్రత వలననే కలుగుచుండును.

ఈ విధముగ నొకవైపున సద్గుణముల సేన నిలిచియున్నట్లే, రెండవవైపున దుర్గుణములసేనకూడ మోహరించియున్నది. దంభము, అజ్ఞానము మొదలగు దుర్గుణముల విషయమున అధికముగ చెప్పనవసరములేదు. ఇవి మన నిత్య పరిచయములో నున్నవే. దంభమునకు మన మలవాటుపడినట్లున్నారము. జీవితము సర్వమును దంభమను పునాదిమీదనే నిలిచియున్నట్లున్నది. ఇక అజ్ఞానమన్నచో, దానిని అడుగడుగునకును సాకుగా పెట్టుకొని బ్రతుకుట మనకు పరిపాటి

యైపోయినది. ఇదెంత హాస్యాస్పదము! అజ్ఞానము పాపమే కాదన్నట్లు మెలగుచుందుము. కాని అజ్ఞానము పాపమనియే భగవంతుడనును. సోక్రటీసు చెప్పినది దీనికి వ్యతిరేకము. "మీరు పాపమని తలచునది అజ్ఞానమని నే నందును. అజ్ఞానము తొలంతవ్యము. అజ్ఞానములేనిచో పాపమెట్లు జరుగగలదు? అజ్ఞానమునకు మీరు శిక్ష నెట్లు విధింతురు?" అని సోక్రటీసనెను. కాని అజ్ఞానముకూడ పాపమేయని భగవంతుడనును. రాజశాసనమునుగూర్చిన అజ్ఞానము తొలంతవ్యము కాదని న్యాయశాస్త్రము చెప్పును. ఈశ్వరశాసనమునుగూర్చిన యజ్ఞానముకూడ పెద్ద దోషమే. భగవంతుడు, సోక్రటీసు - ఇరువురుచెప్పిన వానిలోని భావార్థము ఒక్కటే! మానవుడు తన యజ్ఞానముపట్ల తా నెట్లు వర్తింపవలెనో భగవంతుడు బోధించుచున్నాడు. మరియొకని పాపము నే దృష్టితో చూడవలెనో దానిని సోక్రటీసు చెప్పుచున్నాడు. ఇతరుల పాపములను తొలమింపవలెను. కాని తనయజ్ఞానమును తొలమించుకొనుట పాపమగును. మనలో అజ్ఞానమున కేమాత్రమును తావీయరాదు.✓

90

అహింసయొక్క వికాసమునకు నాలు గంచెలు

ఈ విధముగ నొకవైపున దైవసంపద, రెండవవైపున అసురసంపద - ఈ రెండుసేనలును నిలిచియున్నవి. ఇందు

అసురసంపదను విడిచి దైవసంపదను పట్టుకొనవలె. సత్యము, అహింస మొదలైన దైవగుణముల వికాసము ఆదికాలము నుండియు ప్రకటమగుచునేయున్నది. మధ్యయుగములోకూడ అది చాలవరకు వికాసము పొందెను. అయినను ఇంకను చాలవికాసమును పొందవలసియేయున్నది. వికాసము పరిపూర్ణమయినదని చెప్పలేము. మానవసమాజ మున్నంత కాలము వికాసమునకు అంతులేని అవకాశముండును. వ్యక్తి వికాసము కలిగినతరువాతగూడ సామాజిక, రాష్ట్రీయ, జగద్వికాసమునకు అవకాశము మిగిలియేయుండును. వ్యక్తి తన వికాసమును ఎరువుగావేసి సామాజిక వికాసమును అనగా రాష్ట్రిమందలి లక్షలకొలది యితరవ్యక్తుల వికాసమును పండించుటకు ప్రయత్నింపవలసియుండును. ఉదాహరణకొక్కమాట. ఆదికాలమునుండియు అహింసయొక్క వికాసము మానవునిద్వారా పెంపొందుచువచ్చినను, ఆ వికాసక్రియ యిప్పటికిని సాగిపోవుచునేయున్నది.

అహింస యెట్లు వికాసము పొందినదో మనము పరిశీలింపదగియున్నది. పారమార్థిక జీవితము క్రమవికాసము నెట్లు పొందుచువచ్చెనో, దాని పరిపూర్తికి ఇంకను ఎంత యవకాశమున్నదో దీనినికూడ మనము గ్రహింపగలము. ఆదికాలములో అహింసాపరుడు 'హింసాపరులదాడిని ఎట్లు తప్పించుకొనవలెనా' అని యోజింప నారంభించెను. మొదట సమాజరక్షణకొరకు క్షత్రియవర్గము నిర్మింపబడెను. కాని కాలక్రమమున రక్షకవర్గము భక్షకవర్గముగ తయారయ్యెను.

అప్పు డిట్టి ఉన్మత్త క్షత్రియుల బారినుండి సమాజమును తప్పించుకొట్లని అహింసావ్రతులగు బ్రాహ్మణులు యోజింప మొదలిడిరి. పరశురాముడు అహింసాపరుడైనప్పటికిని హింస నవలంబించి క్షత్రియుల వినాశమునకు పూనుకొనెను. క్షత్రియులను హింసావిధానమునుండి తప్పించుటకై అతడు స్వయముగ హింసాకాండకు దిగెను. ఇదంతయు అతని దృష్టిలో అహింసాప్రయోగమే ! కాని అది ఫలించలేదు. ఇరువది యొక్కసార్లు అతడు క్షత్రియసంహారముచేసెను. క్షత్రియులింకను మిగిలియేయుండిరి. ఏలయన ఈ ప్రయోగము మూలములోనే దోషయుతమైయుండెను. హింసావృత్తిగల క్షత్రియవర్గమును నిర్మూలింపదలచి చివరకు తాను ఆవర్గములోనే చేరిపోయెను. ఇక క్షత్రియవర్గము నశించుటయెట్లు ? తానే హింసచేయు క్షత్రియుడయ్యెను. హింసాబీజము స్థిరముగనేయుండెను. బీజమును స్థిరముగనుంచి ఆకులను, కొమ్మలను కొట్టివేసినను చెట్టుమరలమరలచిగురించుచునేయుండును. పరశురాముడు గొప్పవాడే ! కాని యతడుచేసిన ప్రయోగము బహువిచిత్రమైనది. తాను క్షత్రియుడుగ మారి పృథ్విని క్షత్రియరహితమును చేయదలచెను. తాను తనమీదనే ప్రయోగము ప్రారంభించియుండిన బాగుండెడిది. ముందతడు తన శిరస్సును ఛేదించుకొని యుండవలసినది. కాని నే నతని కంటె మిక్కిలి బుద్ధికలవాడనై అతని దోషమును చూపుచున్నానని భావింపరాదు. నేను బాలకుడను; కాని నే నతని భుజములపై నిలిచియున్నందువలన సులువుగా ఎక్కువ దూరము చూడగలుగుచున్నాను. పరశురాముని ప్రయో

గము మూలములోనే దోషయుతమైనది. హింసామయుడై హింసను నివారించుట సంభవముగాదు, ఇందువలన హింసకుల సంఖ్య తీణించుటకుబదులు విధిగా వృద్ధిచెందును. కాని ఆ సమయమున అతని కీ విషయము స్ఫురింపలేదు. ఆ కాలపు పెద్దలు, ప్రసిద్ధులైన అహింసావ్రతులు తమకు స్ఫురించిన రీతిని ప్రయోగములుచేసిరి. పరశురాము డానాటి అహింసా వాదులలో మేటి. హింసింపవలెనను ఉద్దేశముతో అతడు హింసచేయలేదు. అహింసను స్థాపించుట కతడు హింసా మార్గము నవలంబించెను.

కాని యతని ప్రయోగము నిష్ఫలమాయెను. తరు వాత శ్రీరాముని యుగములో మరల బ్రాహ్మణులు ఆలో చింప మొదలిడిరి. వారు హింసను విడనాడిరి. 'స్వయముగ హింసాకాండకు దిగము' అని నిశ్చయించుకొనిరి. కాని రాక్షసుల దురాక్రమణనుండి రక్షణ కలుగు మెట్లు? "క్షత్రి యులు హింస చేయువారే కదా! వారిచేతనే రాక్షస సంహా రము చేయించవలెను. ముల్లును ముల్లుతోనే తీయవలె. మనము మాత్రము ఆ జోలికి పోవలదు" అని తలచిరి. అందు వలన విశ్వామిత్రుడు యజ్ఞరక్షణార్థము రామలక్ష్మణులను తీసి కొనివెళ్ళి వారిచే రాక్షస సంహారము చేయించెను. "తన్ను తాను రక్షించుకోలేని అహింస నడువ కాళ్ళు లేనిది. అట్టి కుంటి యహింస ఎట్లు నిలువగలదు!" అని ఈనాటివారి యుద్దేశము. కాని క్షత్రియబలముద్వారా తమ్ము రక్షించు కొనుటలో దోషమున్నదని విశ్వామిత్ర వసిష్ఠాదులకు తోచ

లేదు. కాని రామునివంటి క్షత్రియుడు వారికి లభించియుండ నిచో వారిగతి యేమి కావలెను? "నేను మరణించుటకైనను సమ్మతింతునుగాని హింసమాత్రము చేయను" అని విశ్వామిత్రు డనియుండెడివాడు. ఎందువలన ననగా హింసకవృత్తి నవలంబించి శత్రువులను హింసించు ప్రయోగములు చేసి చూచినవే. కనుక 'అహింసను విడనాడము'అను నిశ్చయము మాత్రమప్పటికి జరిగియుండెను. క్షత్రియులెవ్వరును లభించ నిచో ఆ యహింసావాదులు 'మరణించుటయే మంచి' దను స్థితికి వచ్చిరి. రాముడు విశ్వామిత్రుని వెంట వెళ్లుచు ఈ యెముకల ప్రోగులెవరివి?"అని ప్రశ్నించెను. "అహింసావ్రతులైన బ్రాహ్మణులు హింసావృత్తిగల రాక్షసులపై ప్రతీకారము చేయక చనిపోయిరి. ఇవి వారి యెముకలప్రోగులు" అని విశ్వామిత్రుడు బదులు చెప్పెను. ఈ యహింసలో బ్రాహ్మణుల త్యాగము మాత్రము ఉన్నది. కాని తమకు కావలసిన రక్షణను వా రితరులనుండి అపేక్షించిరి. ఇట్టి దుర్బల స్థితిలో నున్నంతవరకు అహింసకు పూర్ణత్వము సిద్ధింపనేరదు.

తరువాత మహాత్ములు మూడవ ప్రయోగము చేసిరి. "మా రక్షణకై ఇతరుల సాయమును మే మెప్పటికిని తీసికొనము. మా అహింసయే మమ్ము రక్షించును. ఇదే నిజమైన రక్షణ"అని వారు నిశ్చయించుకొనిరి. వీరు చేసిన ఈ ప్రయోగములో వ్యక్తినిష్ఠ కనబడును. వా రీ వ్యక్తిగత ప్రయోగమును పరిపూర్ణస్థితికి తీసికొనివెళ్లిరి. కాని చివరకది వ్యక్తిగత సాధనగనే నిలిచిపోయెను. హింసాపరులు సమాజముపై

దాడి సలిపినప్పుడు ఆ సమాజ మీ మహాత్ములయొద్దకువచ్చి "ఇప్పుడు మా కర్తవ్యమేమి?" అని యడిగినచో బహుశః నిశ్చితమైన సమాధాన మేదియు వారిచ్చియుండలేకపోదురు. వ్యక్తిగత జీవితములో పరిపూర్ణమగు అహింసను సాధించిన ఈ మహాత్ములు "సోదరులారా! మీ సమస్యను తీర్చగల శక్తి మాకులేదు" అని సమాధాన మిచ్చియుందురు. ఈ విధముగ మహాత్ములలోని బలహీనతను చూపుట నా బాల సాహసమే! కాని వారి భుజములపై కూర్చుండి చూచుచున్నదానినే నేను చెప్పుచున్నాను. దీనికి వారు నన్ను తిమింగెదరుగాక! తిమింతురుకూడ. ఏలయన వారు మహా తిమాశీలురు. అహింసా సాధనములద్వారా సాముదాయిక ప్రయోగములు చేయవలెనను ప్రేరణ వారికి కలుగలేదని కూడ చెప్పలేము. కాని ఆ నాటి పరిస్థితి అట్టి సాధనకు అనుకూలమని వారు తలచియుండక పోవచ్చును. వారు మాత్రము తమవఱకు తాము భిన్న భిన్న ప్రయోగములను చేసిరి. ఇట్టి వేరువేరు ప్రయోగమువలననే శాస్త్ర మేర్పడును. ఇట్టి యనుభవముల సమ్మేళనమే శాస్త్రమగును.

మహాత్ముల వ్యక్తిగత ప్రయోగముల తరువాత ఈ నాడు మనము నాల్గవ ప్రయోగమును చేయుచున్నాము. అదేమనగా, సమాజమంతయుకలిసి అహింసాసాధనలద్వారా హింసను ప్రతిఘటించుటయే! ఈ విధముగ నింతవరకు నాలుగు ప్రయోగములు జరిగినవి. ప్రతి ప్రయోగములోను అసంపూర్ణత ఉండనే యున్నది. వికాసక్రమములో నిది

యనివార్యమే. కాని ఆ యా కాలముల కా యా ప్రయోగ ములు పూర్ణములేయని తలపవలెను. పదివేల సంవత్సరముల తరువాతివారికి ఈనాటి అహింసాయుద్ధములో హింసా భాగము చాల గోచరింపగలదు. పరిశుద్ధమైన అహింసా సాధ నలో నూతన ప్రయోగములు జరుగుచునేయుండును. భక్తి, జ్ఞాన, కర్మలకే కాక సమస్త సద్గుణములకును వికాసము కలు గుచునేయుండును. పూర్ణవస్తువొక్కటే – అది పరమాత్మ. భగవద్గీతలోని పురుషోత్తమ యోగము పూర్ణమైనది. కాని వ్యక్తిగత, సాముదాయిక సాధనలలో పూర్ణవికాస మింకను కలుగవలసియేయున్నది. ఋషివాక్యములకుగూడ నూతన వికాసము కలుగుచుండును. ఋషులు మంత్రద్రష్టలుగనే భావింపబడుచుండిరి. కాని కర్తలుకారు. ఏలయన, వారికిస్ఫురించినదే మంత్రముల కర్థమని చెప్పలేము. వారు దర్శించినది మాత్రమే వారు చెప్పగలిగిరి. తరువాత కొంతకాలమునకు దానియర్థము మరింత స్పష్టముగ గోచరింపగలదు. వారి కంటె ఇప్పుడు మనకు కొంత విశేషార్థము కనబడుచున్న దనిన ఇది మన ప్రయోజకత్వముకాదు. ఏలయన వారిని ఆధారముగా చేసికొనియే మనము ముందునకు సాగిపోవు చున్నాము. సద్గుణములన్నిటియొక్కనిగ్గు తీసినచో అహింస వెలువడును. కనుకనే అహింసయొక్క వికాసమునుగూర్చి ఇక్కడనింతగా చెప్పుచున్నాను. ఇంతేకాక, మన మీ రోజున అహింసాత్మక యుద్ధమున నియుక్తులమైయున్నాము. అందు వలన ఈ యహింసాతత్త్వమెట్లు వికాసము చెందినదో మీకు విశదపరచితిని.

91

అహింసలో నొక మహా ప్రయోగము
మాంసాహార పరిత్యాగము

హింసకులవలన దురాక్రమణ కలిగినప్పుడు అహింసా పరుడు తన్ను దానెట్లు రక్షించుకొనవలెనను విషయమును మన మింతవరకు చూచియున్నారము. ఇది యహింసా సాధనలో నొక భాగము. వ్యక్తులలో పరస్పరకలహములు బయలుదేరి నప్పుడు అహింస యెట్లు వికాసమును బొందునను విషయమును గూడ మనము చూచితిమి. కాని జగడములు మానవులకును పశువులకును మధ్య జరుగుచుండును. మనుష్యు లింతవరకు తమ పరస్పర కలహములను అంతరింపజేసికొనలేదు సరికదా, మీదుమిక్కిలి పశువులను తమ పొట్టను బెట్టుకొని బ్రతుకు చున్నారు. తమకంటె దుర్బలజీవులను చంపి తినకుండ నుండ లేకపోవుచున్నారు. వేలకొలది సంవత్సరములనుండి మానవుడు జీవించుచు వచ్చినను, తానెట్లు జీవించవలెనో ఇంతవరకు ఆలోచన చేయలేదు. తాను మానవుడుగ బ్రతుకలేకపోవు చున్నాడు. కాని ఈ విషయమునగూడ కొంత వికాసము కలుగకపోలేదు. మనుష్యుడు పశువులను మాత్రమే చంపి తినకాల మొకటి యుండెను. కాని ఉత్తములు, బుద్ధి మంతులు అయిన వారి కిది నచ్చక ఒక కట్టుబాటు చేసిరి. మాంసమే తినక తప్పనిచో యజ్ఞమున బలి యీయబడిన పశువుల మాంసమునే తినవలెననిరి. హింసను నివారించుటయే దీని యుద్దేశము. పలువురు పూర్తిగ మాంసాహారమును

వర్జించిరి. కాని పూర్తిగ వదలివేయలేని వారు భగవత్ప్రార్థన చేసి యజ్ఞములో భగవంతునికి నైవేద్యముగా నీయబడిన మాంసమును తినవచ్చువను అనుమతిని పొందిరి. యజ్ఞములో మాత్రమే మాంసము తినవచ్చునను కట్టుబాటు చేయుటచేత హింస నిలిచిపోవునని ఆ నాటి పెద్దలు తలచిరి. కాని అట్లుగాక కాలక్రమమున యజ్ఞ మొక నిత్యకార్యక్రమ మాయెను. తమకు తోచినపు డెల్ల యజ్ఞములు చేయుచు మాంస భక్షణ చేయ మొదలిడిరి. అప్పుడు బుద్ధ భగవానుడు రంగమున ప్రవేశించి "మీరు మాంసము తినదలచినచో తినుడు. ఆ తినునది భగవంతుని పేర మాత్రము తినవలదు" అనెను. యజ్ఞముచేసి మాంసము తినుమన్నను, తినదలచినచో దేవుని పేర వలదన్నను – ఈ రెంటికిని మూలమున నున్న యుద్దేశ మొక్కటే! హింస నిలిచిపోవలెనని, ఏదో యొక విధమున ప్రజలు సంయమ మార్గమునకు రావలెననియే ఇందలి భావము. యజ్ఞము చేసినను లేక మానినను, క్రమక్రమముగ మాంస భక్షణను త్యజించుటే మనము నేర్చుకొంటిమి.

ప్రపంచ చరిత్రలో నొక్క భారతదేశమునందే ఈ మహాప్రయోగము చేయబడినది. కోట్లకొలదిగ ప్రజలు మాంసాహారమును విడిచిపెట్టిరి. మన మీనాడు మాంస భక్షణ చేయకుండుటలో మన గొప్పతనమేమియు లేదు. మన పూర్వుల పుణ్యమువలన మనము మాంసవిసర్జనకు అలవాటు పడితిమి. కాని ఆదిబుద్ధులు మాంసము తినెడివారని మన మిప్పుడు చెప్పుకొన్నను, ఎక్కడనైన చదివినను మనకు

ఆశ్చర్యము కల్గి "ఏమి యీ ప్రలాపము ! ఋషులుకూడ మాంసము తినెడివారా ? వట్టిమాట !" అని యందుము. కాని మాంసభక్షణచేయుచునే సంయమసాధనవలన వారు దానిని విడిచిపెట్టిరి. ఇది వారి పుణ్యము. ఆ కష్టానుభవములు నేడు మనకు లేవు. దాని పుణ్య మనాయాసముగ మనకు లభించినది. భవభూతి – ఉత్తరరామచరిత్రలో ఒక ప్రసంగమున్నది. వాల్మీకి – ఆశ్రమమున కొకనాడు వసిష్ఠుడు వచ్చెను. అతని కాతిథ్య మిచ్చుటకు ఒక లేగదూడ చంప బడెను. దీనినిగూర్చి ఒకచిన్నబాలుడు ఒక పెద్దపిల్లవానితో "ఈ రోజున మన యాశ్రమమునకొక గడ్డపుపులి వచ్చి మన ఆవుదూడను తినివేసినది తెలియునా ?" అనెను. అంతట పెద్దవాడు "నాటికివచ్చినట్లు వాగకు; ఆయన వసిష్ఠమహర్షి" అని జవాబిచ్చెను. మన పూర్వులు మాంసభక్షణ చేసినను మన మిప్పుడు చేయుటలేదనిన మనము వారికంటె గొప్పవార మని అర్థముకాదు. వారి యనుభవలాభము అనాయాసముగ మనకు లభించినది. మనము వారి యనుభవలాభమునకింకను వికాసమును కలిగింపవలెను. మనము పాలను పూర్తిగ వర్జించు ప్రయోగమునుకూడ చేయవలెను. మనుష్యుడు జంతువుల పాలను త్రాగుట అనుచితమే. పదివేల సంవత్సరముల తరువాత జన్మించువారు మనలనుగూర్చి "మన పూర్వులు 'పాలుత్రాగము' అను వ్రతము తీసికొనవలసి వచ్చెనా ? రామ, రామ! వారసలు పాలెట్లు త్రాగెడివారో! ఇంత అడవిమనుష్యులా వారు !" అని యందురు. సారాంశ మిది : మనము నిర్భయులమై నమ్రతాపూర్వముగ మన

ప్రయోగములను చేయుచు, నిరంతరమును ముందునకు సాగి పోవుచుండవలెను. సత్యముయొక్క ఆవరణను విశాలము చేసి కొనుచు పోవలె. ఏ సద్గుణమైనను పూర్ణవికాసమును పొంద లేదు. వికాసమున కింకను అపారమైన అవకాశమున్నది.

92

అసుర సంపదయొక్క బలిష్ఠమైన మూడు కోరికలు : సత్త, సంస్కృతి, సంపద

మనము దైవసంపదను వికసింపజేయవలె. అసురసంపదకు దూరముగా నుండవలె. అసురసంపదనుండి మనము దూరముగ నుండగలంచులకే భగవంతుడు దాని నిక్కడ వర్ణించినాడు. ఇందు మూడువిషయములే ముఖ్యమైనవి. అసురుల చరిత్రయొక్క సారమంతయు 'సత్త, సంస్కృతి, సంపద' - ఈ మూటిలో నున్నది. తమ సంస్కృతియొక్కయే గొప్పదని, దానినే ప్రపంచమం దందఱమీదను వేసి రుద్దవలె నని వారు గట్టిగ కోరుచుందురు. "తమ సంస్కృతిని ఇతరులపై ఎందులకు రుద్దవలె?" అని యన్నచో అది యన్నిటికంటెను మంచిదికనుక" అని యందురు. "ఇదే మంచిదని యెందుల కనవలె?" నన్నచో "అది మాది కనుక" అని యందురు. అసురత్వము ఒక వ్యక్తిలోనిదైనను, వ్యక్తులకూటమైన ఒక సామ్రాజ్యములోనిదైనను అది వర్ధిల్లుటకు పై మూడు వస్తువులును అవసరము.

తమ సంస్కృతి సర్వశ్రేష్ఠమని, జ్ఞానమంతయు తమ వేదములో నిండియున్నదని, వైదిక సంస్కృతి సర్వ ప్రపంచమునను విజయము పొందవలెనని బ్రాహ్మణు లనుకొందురు. "అగ్రతశ్చతురో వేదా: పృష్ఠతః సశరం ధనుః" - ఇట్లుండి ప్రపంచమం దెల్ల నీ సంస్కృతి యొక్క జెండాను ఎగుర వేయుము. కాని ధనుస్సును అమ్ములపొదిని ధరించి ప్రచారము చేయుట చేతనున్న వేదములను హత్య చేయుటయే యని తెలిసికొనుము. ముసల్మానులుకూడ ఖురాన్ పరీక్ష్‌లో వ్రాయబడినదే సత్యమని నమ్ముదురు. క్రైస్తవులును తమ మతముపట్ల ఇట్లే తలచెదరు. అన్యమతస్థు డెంత ఉత్ముడైనను, ఏసుప్రభువుపై విశ్వాసము కలిగినగాని స్వర్గమునకు పోజాలడని వారి మతము. దేవుని మందిరమున కొక్కటే ద్వారమని, అది యేసుద్వారమని వారిభావన. మనుష్యులు తమ యిండ్లకు అనేక ద్వారములు, కిటికీలు పెట్టుకొందురు. కాని, పాపము! దేవుని మందిరమునకు మాత్రము వారు పెట్టుకొన్నది ఒక్క ద్వారమే!

"మైఁ హీ కులీన్ శ్రీమంత్, మేరీ జోడ్ కహీఁ నహీఁ"

అందరును ఇట్లేభావింతురు. "నే నెవడను? భరద్వాజ సంతతి వాడను. ఈ నా వంశపరంపర అఖండముగ నడచిపోవుచున్నది." అని యనును. పాశ్చాత్యుల స్థితికూడ ఇట్టిదే. తమ రక్తనాళములలో 'నార్మను'ల రక్తము ప్రవహించుచున్నదని వా రందురు. మన సంప్రదాయములో గురుపరంపర ఉన్నదేకదా! ఆదిగురువు శంకరుడు, తరువాత బ్రహ్మ

దేవుడు, లేక మరొకడు, తరువాత నారదుడు, వ్యాసుడు, తరువాత మరియొక ఋషి, తరువాత పదునైదు పేర్లను స్మరించి, చివరకు తనగురువు, అతని శిష్యుడైన తాను – ఈ విధముగ తన పరంపరను ఏకరువు పెట్టును. వంశావళి నిట్లు చెప్పుకొని తాను ఘనుడనని, తనసంతతి గొప్పదని స్థిరపరుచుటయే వాని యుద్దేశము. సోదరా! నీసంస్కృతియే గొప్పదైనచో దానిని నీ యాచరణలో చూపరాదా! దాని ప్రభావమును నీ జీవితములో వ్యాపింపజేయరాదా! కాని అట్లు జరుగుటలేదు. మన జీవితములోను, మన గృహములోను వాడుకలోనికిరాని ఈ సంస్కృతిని ప్రపంచమందెల్ల వ్యాపింపజేయవలెనను కాంక్షనే అసురసంపద యందుము.

'నా సంస్కృతి సుందరము, శ్రేష్ఠము అని తలచినచో ప్రపంచములోని సంపదకెల్లను అధికారిని నేనే యని తలచుట అసురవృత్తి లక్షణము. "లోకములోని ఐశ్వర్యము సర్వము నాకు కావలె, దానిని నేను పొంది తీరుదును. ఎందులకు ? అందరికిని సమానముగ పంచిపెట్టుటకు ఇదంతయు నా కవసరము"అని యతడు తలచును. అక్కరుకూడ ఇట్లే యనెను-"ఈ రాజపుత్రులింకను నాసామ్రాజ్యములో కలియ రేమి? అంతయు మహాసామ్రాజ్య మగుచో ప్రపంచమున శాంతి సుస్థిర మగును కదా!" పాప మతడట్లు నమ్మి యుండును. ఈ నాటి అసురుల అభిప్రాయముకూడ ఇట్టిదే. ప్రపంచసంపద నెల్ల నొకచోటికే యేల ప్రోగుచేయవలె ? నని యన్నచో దాని నందరికిని పంచిపెట్టుటకే యని వారందురు.

"ఇందులకు నాకు సత్త (అధికారము) అవసరము. అధికార మంతయు ఒక్కని హస్తగతమై యుండవలె. ప్రపంచమంతయు నా చేతిలోనికి రావలెను. స్వ-తంత్రము- నా తంత్రము ననుసరించి నడువవలెను. నా వశములోనుండి, నా తంత్రము ననుసరించి నడుచునదే స్వతంత్రము"- ఈ విధముగ సంస్కృతి, సత్త, సంపద - ఈ మూడును అసుర సంపదలో ముఖ్యములుగ పరిగణింపబడును.

ఒకప్పుడు సమాజములో బ్రాహ్మణుల ప్రభుత్వము చలామణి యగుచుండెను. వారు ధర్మశాస్త్రములలోని శాసనములను రచించుచుండిరి. రాజులు వారినిగౌరవించుచుండిరి. ఆ యుగముమారి క్షత్రియయుగము వచ్చెను. క్షత్రియులు అశ్వమేధయాగములను చేసి దిగ్విజయమును పొందుచుండిరి. ఈ క్షత్రియ సంస్కృతికూడ కొంతకాలముండి అంతరించినది. "నేను విద్యను ప్రసాదించువాడను, ఇతరులు విద్యను గ్రహించువారు. నేనుతప్పమరి గురువెవరు?"అని బ్రాహ్మణుడనుచుండెను. తమ సంస్కృతిపట్ల బ్రాహ్మణుల కింత అభిమాన ముండెడిది. క్షత్రియులశక్తి అధికారముపై నాధారపడియుండెను. "ఈ రోజున ఇతనిని చంపితిని, రేపతనిని చంపుదును"— ఇదే వీరిధోరణి. తదుపరి వైశ్యులయుగము వచ్చెను. సంపదను సేకరించుటయే వీరి మతము. "వెన్ను మీద కొట్టుడు; కాని పొట్టమీద మాత్రము కొట్టవలదు"- ఇదే వారికి తెలిసిన తత్త్వజ్ఞానము. వారితత్త్వజ్ఞానము, తెలివితేటలు అన్నియు పొట్టకొఱకే. "ఈ ధనమునాది, అదికూడ

నాది కాగలదు"– వారి కిదే సంకల్పము, ఇదే జవము. "స్వరాజ్యము కావలసినచో తీసికొనుడు; కాని మేము తయారుచేసిన వస్తువుల నమ్మకొను సౌకర్యము మా కిచ్చి, తదుపరి మీ సంస్కృతివిషయము మీరు చూచుకొనుడు. మీరు కోపీనము ధరించి 'మా సంస్కృతి, మా సంస్కృతి' యని జపించుచు కూర్చుండుడు" అని ఆంగ్లేయులు మనతో చెప్పలేదా? ఈనాడు జరుగు యుద్ధములన్నియు వ్యాపారము కొరకే. ఈ యుగముకూడ మారిపోవును. మార్పుకూడ ప్రారంభమయినది. అసురసంపదయొక్కవిధానము లిట్లుండును.

93

కామక్రోధములనుండి విముక్తికై
శాస్త్రీయ సంయమమార్గము

మనము అసురసంపదను దూరముగ త్రోసివేయుదము గాక! కల్పముగ చెప్పవలెనని అసురసంపదయొక్క అర్థము "కామము, క్రోధము, లోభము". ఈ మూడే ప్రపంచము నెల్లను ఆడించుచున్నవి. ఈ యాట కట్టించవలె. దీనినుండి మనము తప్పుకొనవలసి యున్నారము. క్రోధ లోభములు కామమునుండి ఉద్భవించును. కామమునకు అనుకూలపరిస్థితి యేర్పడినప్పుడు లోభమును, ప్రతికూలత యేర్పడినప్పుడు క్రోధమును జనించును. ఈ మూటినుండియు తప్పించుకొను

మని గీత అడుగడుగునను హెచ్చరించుచున్నది. కామ, క్రోధ, లోభములే నరకమునకు మూడు పెద్దద్వారములని పదునారవ అధ్యాయము చివర చెప్పబడినది. వీనిలో పెక్కు బాటలు కలవు. వీనిద్వారా చాలమంది వచ్చుచు పోవుచు నుందురు. నరకమునకున్న బాట చాల విశాలమైనది. దానియందు మోటారులు పోవుచుండును. దారిలో చాలమంది సహయాత్రికులుకూడ లభించుచుందురు. కాని సత్యమార్గము ఇరుకైనది.

కాగా ఈ కామక్రోధలోభములనుండి తప్పుకొనుటకు శాస్త్రీయమైన సంయమమార్గమును పట్టుకొనవలె. మహాత్ముల అనుభవమే శాస్త్రము. ప్రయోగములద్వారా మహాపురుషులకు లభించిన అనుభవమునుండియే శాస్త్ర మేర్పడును. కనుక ఈ సంయమసిద్ధాంతము నాశ్రయింపుము. ఊరక కుశంకలు పెట్టుకొనకుము. "కామక్రోధములు నశించిపోయినచో ప్రపంచముగతి యేమికావలె! లోకవ్యవహారము జరుగుచుండవలెగదా! కామక్రోధములు కొంచెమైనను ఉండవలదా!" అనెడి కుశంకలుమాత్రము దయచేసి పెట్టుకొనకుడు. సోదరులారా! కామక్రోధములు ఆదినుండియు పుష్కలముగనే యున్నవి. అవి మనకు కావలసినయంతకంటె ఎంతో ఎక్కువగ యున్నవి. ఇక వ్యర్థముగ బుద్ధిభేద మెందులకు కల్పించెదరు? కామక్రోధలోభములు కావలసినంతకంటె బెత్తెడు హెచ్చుగనే ప్రపంచమున నున్నవి. కామము నశించినచో సంతానమెట్లు కలుగునని చింతింపకుడు. మీరు సంతానము నెంతగా వృద్ధిపరచినను, మనుష్యుడీ పృథ్వినుండి

నామరూపములు లేకుండ నశించిపోవురోజు రావేవచ్చునని శాస్త్రజ్ఞులు, విజ్ఞానవేత్తలు చెప్పుచుందురు. భూమి నెమ్మది నెమ్మదిగ చల్లబడిపోవుచున్నది. ఒకప్పు డీ భూగోళము చాల ఉష్ణముగ నుండెను. అప్పుడు దానిమీద జీవరాసు లేవియు ఉండెడివి కావు. అప్పటికీ ప్రాణికోటి పుట్టనేలేదు. పృథ్వి పూర్తిగ చల్లబడిపోయి జీవరాసులన్నియు లయమైపోవు సమయము ఎప్పుడో రానున్నది. కాని దీనికి లక్షసంవత్సరములు పట్టును. మీ రెంతగా సంతానమును వృద్ధిచేసినను చివరకు ఈ ప్రళయము తప్పదు. పరమేశ్వరుడు అవతార మెత్తుట ధర్మసంరక్షణకొరకు కాని జనసంఖ్యను నిలువబెట్టుటకు కాదు. ధర్మపరాయణుడు, పాపభీతి సత్యనిష్ఠకలవాడు ఒక్కడైనను ఉన్నంతవరకు చింతింపవలసినపని లేదు. ఈశ్వరదృష్టివానిపై ఉండనే యుండును. ధర్మచ్యుతులు వేలకొలదిమంది ఉన్న నేమి? పోయిన నేమి? రెండును సమానమే.

పై విషయమును జ్ఞప్తియందుంచుకొని నియమానుసారము సంయమముతో జీవితయాత్రను గడపుడు. హద్దు మీరి అవివేకముతో పరుగెత్తకుడు. లోకకల్యాణమనగా లోకులెల్లు చేయుమనిన అట్లుచేయుటకాదు. మానవ సంఘమును పెంపొందించుట, సంపదను కుప్పతిప్పలుగ ప్రోగు చేయుట సంఘసంస్కరణ కానేరదు. వికాసము సంఖ్యాబాహుళ్యముపై ఆధారపడి యుండదు. సమాజము హద్దు మీరి పెరిగిపోయినచో ప్రజ లొకరినొకరు హత్యచేయు నారంభింతురు. మొదట పశుపక్ష్యాదులను తిని మనుష్యుడు

బలిష్ఠుడగును. తరువాత తనబిడ్డలనే తిని జీవింపవలసివచ్చును. కామక్రోధములలో కొంతసార మున్నదని మనము ఒప్పుకొని నచో చివరకు మానవులొకరినొకరు చీల్చుకొని తినెద రను టలో తిలమాత్రమైన సందేహములేదు. సుందరమును విశుద్ధ మును అయిన నీతిమార్గమును తోడిమానవులకు చూపు టయే లోకకల్యాణ మనబడును. కామక్రోధములు లోపిం చిన కారణముచే పృథ్విపైగల మానవజాతి అంతరించిపోవుచో చింతింప బనిలేదు. కావలెనని న భగవంతుడు మానవజాతిని వేయంగారగ్రహమునందో పుట్టించగలడు. అవ్యక్తుడైన పర మేశ్వరుడు సర్వత్ర వ్యాపించియేయున్నాడు. మన యోగ క్షేమము నతడు విచారించును. కనుక ముందు మనము ముక్తులమయ్యెదముగాక! భవిష్యత్తునుగురించి మనము బెంగ పడవలసిన పనిలేదు. మానవజాతిని, సృష్టినెల్లనుగూర్చిన చింత మీరు పెట్టుకొనవలదు. మీనైతికశక్తిని పెంచుకొనుడు. మిమ్మాశ్రయించిన కామక్రోధములను విదిలించిపారవేయుడు. "అపనాతో గలా లో పహలే ఛుడా" "మీ కంఠమున చుట్టు కొనిన ఉరిత్రాటిని మొదట విడిపించుకొనుడు." ఇంతవరకు సాధింపగలిగినచో చాలవరకు నెగ్గినట్లే.

సంసార మనెడు సముద్రమునకు దూరముగ గట్టుపై నిలబడి ఆ సముద్రముయొక్క సౌందర్యమును దర్శించుటలో ఆనందమున్నది. సముద్రములో మునిగినవానికి, ముక్కున, నోట నీరునిండినవానికి సముద్రమేమి ఆనందమిచ్చును? మహా త్ములు ఈ సంసారసాగరపు టొడ్డున నిలబడి ఆనందమును

చూశారగొందురు. సంసారముననుండియు నిర్లిప్తముగ నుండు ఈ పుణ్యవృత్తి జీవితమున వ్యాపించనిచో ఆనందము కలుగ నేరదు. కనుక తామరాకుపై నీటిబొట్టువలె నిర్లిప్తులుగ నుండుడు. బుద్ధుడిట్లన్నాడు:- "మహాత్ములు పర్వత శిఖరముపై నిలబడి క్రిందిప్రపంచమును చూచుచుందురు. అప్పుడు ప్రపంచము వారికి క్షుద్రముగ తోచును. మీరుకూడ పైకెక్కి చూచినచో ఈ విశాలప్రపంచము క్షుద్రముగ కనబడును. మరల ప్రపంచవిషయములమీదికి మీ మనస్సు పోనేరదు."

సారాంశమిది : అసురసంపదను తొలగించుకొని దైవసంపదను లభింపజేసికొనుడని భగవంతుడీయధ్యాయములో నొక్కి చెప్పినాడు. రండు ! మనమట్లే ప్రయత్నించెదము గాక !

గీతా ప్రవచనములు

పదునేడవ అధ్యాయము

అనుబంధము - 3 : సాధకుని కార్యక్రమము

94

కట్టుబాటుగల నడవడి

ప్రియసోదరులారా !

మనము మెల్లమెల్లగా భగవద్గీత చివరకు చేరుకొన్నారము. పదునేనవ అధ్యాయములో జీవితముయొక్క సంపూర్ణ శాస్త్రమును అవలోకించితిమి. పదునారవ అధ్యాయములో మొదటి యనుబంధమును చూచితిమి. మానవుని మనస్సులోను, మనస్సుయొక్క ప్రతిబింబమైన సమాజములోను రెండువృత్తుల, రెండుసంస్కృతుల లేక రెండుసంపదలనడుమ పోరాటము జరుగుచుండును. ఈ రెంటిలో దైవసంపదను మనము వికసింపజేసికొనవలె. ఈ శిక్షణ అనుబంధరూపమైన పదునాఱవ అధ్యాయములో మనకు లభించినది. ఈ రోజున పదునేడవ అధ్యాయములో మనము రెండవ అనుబంధమును చూడనున్నారము. ఒకదృష్టిలో ఇందు కార్యక్రమయోగము చెప్పబడినదని యనుకొనవచ్చును. గీత యీ యధ్యాయములో అనుదిన కార్యక్రమమును సూచించుచున్నది. నేటి

అధ్యాయములో మనము నిత్యమును ఆచరించు క్రియలను గూర్చి ఆలోచింపవలెను.

మన మనోవృత్తి నిర్లిప్తముగను, ప్రసన్నముగను ఉండవలెననినచో మన వ్యవహారము లన్నియు ఒక క్రమ విధానమునకు కట్టువడి యుండవలెను. మన నిత్య కార్య క్రమము ఏదోయొక నిర్దిష్టమైన సూత్రముపై నడువవలెను. మన జీవితము నిశ్చితమైన నీతినియమములకు కట్టువడి నడచు చున్నపుడే మనస్సు నిర్లిప్తముగ నుండగలదు. నది స్వేచ్ఛగా ప్రవహించుచుండును. కానీ దాని ప్రవాహము కట్టలనడుమ బంధింపబడియుండును. అది యట్లుండనిచో దాని స్వాతం త్ర్యము వ్యర్థమైపోవును. జ్ఞానుల నిచట నుదాహరణగా గుర్తునకు తెచ్చుకొనుడు. సూర్యుడు జ్ఞానులకు ఆచార్యుడు. భగవంతుడు ప్రపథమమున కర్మయోగమును సూర్యునకు నేర్పెను. తరువాత సూర్యునినుండి మనువువకు – అనగా ఆలోచనచేయగల మనుష్యున కది ప్రాప్తమయ్యెను. సూర్యుడు స్వతంత్రుడు, ముక్తుడు. అతడు నియమబద్ధుడు. అతని స్వాతంత్ర్యముయొక్క సారము ఇందులోనేయున్నది. తెలిసినమార్గమున వాహ్యాళికి పోవుచో దారితప్పుదుమను భయము లేకుండ, మనసుతో నేదైన విషయమును గూర్చి చింతనచేయుచుగూడ మనము తిరిగి రాగలము. ఇది మనకు అనుభవసిద్ధమైన సత్యము. అట్లుగాక ఎప్పటికప్పుడు నూతన మార్గమున వాహ్యాళికి వెళ్లుచో, మన దృష్టియంతయు మార్గముమీదనే కేంద్రీకరింపవలసివచ్చును. ఇక మనస్సుతో

స్వతంత్రముగ ఆలోచించుటకు అవకాశమెక్కడ ? కావుననే జీవితము భారముకాకుండ ఆనందమయము కావలెననినచో మన వ్యవహారములను కట్టుబాటులో పెట్టుకొనవలె.

ఇందుచే భగవంతు డీయధ్యాయములో కార్యక్రమమును తెలియబరుచుచున్నాడు. జన్మసిద్ధముగనే మనము మూడుసంస్థలను వెంటదీసికొని ఈ లోకములోనికి వచ్చుచున్నాము. ఈ మూడుసంస్థలకును సంబంధించిన కార్యములను చక్కగ నెరవేర్చి మానవుడు తన జీవితమును సుఖమయము చేసికొనగల్లుటకై గీత ఈ కార్యక్రమము నేర్పరచినది. ఆ మూడుసంస్థ లేవి ? మనలను గట్టిగా అంటిపెట్టుకొనియున్న ఈ శరీరమే అందు మొదటి సంస్థ. మనచుట్టును వ్యాపించియున్న ఈ విశాల బ్రహ్మాండము రెండవ సంస్థ. ఇందు మన మొక అంశము మాత్రమే ! మనము జన్మించిన ఈ సమాజము, మన జన్మకై నిరీక్షించి మనలగన్న తల్లిదండ్రులు, సోదరీసోదరులు, ఇరుగుపొరుగువారు – వీరందరును మూడవ సంస్థ. మనము ప్రతిదినమును ఈ మూడుసంస్థలనుండి ఉపకారమును పొందుచున్నాము. ఇట్లే మూటికిని మనవలన అరుగుదల కలుగుచున్నది. మనవలన ఈ సంస్థలకు కలుగుచున్న లోటును పూర్తిచేయుటకు మనము సతతమును ప్రయత్నింపవలెననియు, జీవితమును సఫలపరుచుకొనవలెననియు గీత కోరుచున్నది. జన్మసిద్ధముగ మన కీ సంస్థలయెడల నేర్పడిన ఈ కర్తవ్యమును నిరహంకార భావముతో నెరవేర్చవలెను.

ఈ కర్తవ్యములను మనము పూర్ణముగ నెరవేర్చ వలెను. కాని దీని ప్రణాళిక ఎట్లుండవలెను? యజ్ఞము, దానము, తపస్సు – ఈ మూడింటి సంయోగమువలననే ఆ కార్యక్రమము ఏర్పడుచున్నది. ఈ మూడు శబ్దములును మనకు పరిచితమైనవే యైనను వీని యర్థము మనకు బాగుగా తెలియదు. మనము వీని యర్థమును తెలిసికొని, వీనిని మన జీవితములో ఆచరించినచో ఈ సంస్థలు సఫలీకృతములు కాగలవు. మన జీవితములుకూడ నిర్లిప్తములు, ప్రసన్నములు అగును.

95

నియమబద్ధమైన వ్యవహారమువలన మనోవృత్తి నిర్లిప్తమగును : ఇందులకై త్రివిధ క్రియాయోగము

యజ్ఞ, దాన, తపస్సుల అర్థము తెలియవలెననిన యజ్ఞమన నేమో ముందుగా మనము గ్రహించవలెను. సృష్టి సంస్థనుండి మన మనుదినమును ఉపకారమును పొందు చున్నాము. వందమంది యొకచోట కలిసియున్నచో మరు నాటికి అక్కడి వాతావరణమంతయు కలుషితమగును. అక్కడిగాలినెల్లను మనము మైలపరచెదము. ఆ ప్రదేశము నెల్ల మలినమును గావింతుము. ఆహారపదార్థములను భుజించి సృష్టికిగూడ కొరత వాటిల్ల జేయుదుము. ఇట్లు సృష్టిసంస్థకు కలుగు లోటును మనము తొలగింపవలెను. ఇందుచేతనే

యజ్ఞసంస్థ నిర్మితమైనది. యజ్ఞముయొక్క ఉద్దేశమేమి? సృష్టికి కలిగిన లోటును తొలగించుటయే యజ్ఞము. వేల కొలది సంవత్సరములనుండి మనము భూమిని దున్ని సేద్యము చేయుటవలన దానిసారము క్రమేణ తగ్గిపోవుచున్నది. "భూమి యొక్క సారము తిరిగి దానికిమ్ము; భూమినిదున్ని దానికి సూర్యరశ్మి బాగుగ తగులనిమ్ము; మంచియెరువు వేయుము" అని యజ్ఞమనును. లోటును తొలగించుటయే యజ్ఞములోని ఒక యుద్దేశము. ఉపయోగింపబడిన వస్తువుల శుద్ధపరచుట రెండవయుద్దేశము. మనము నూతిని ఉపయోగించుకొందుము. దానిచుట్టును నీరు నిలిచి బురదయగును. ఈ విధముగ మలిన మైన ప్రదేశమును పరిశుభ్రముచేయవలెను. బురదగుంటలోని నీటిని తీసివేసి బురదలేకుండ చేయవలెను. కలిగిన నష్టమును తొలగించి, పరిశుభ్రముచేయుటతోపాటు ప్రత్యక్షముగ కొంత నిర్మాణ కార్యమునుకూడ చేయవలెను. ఈ మూడవ విషయముకూడ యజ్ఞములో అంతర్భాగమే. మనము వస్త్రములను ధరింతుము. కనుక మనము అనుదినమును నూలు వడికి నూతన నిర్మాణము చేయవలెను. ప్రత్తి పండించుట, ధాన్యము పండించుట, నూలువడుకుట – ఇవికూడ యజ్ఞ కార్యములే. యజ్ఞముద్వారా మనముచేయు నిర్మాణము స్వార్థముకొరకు కాదు. మనము సృష్టికి కలిగించు నష్టమును తొలగింపవలెనను కర్తవ్యభావన దానిలో నిండియుండవలె. ఇది పరోపకారముకాదు. మనము అదిమండియు సృష్టికి ఋణపడియున్నారము. జన్మసిద్ధముగనే మనము ఋణస్థులమై ఈ ప్రపంచములోనికి వచ్చితిమి. ఈ ఋణ విముక్తికొరకు

మనము చేయు నిర్మాణ కార్యమే యజ్ఞము – లేక సేవ. అది పరోపకారము కాదు. ఆ సేవద్వారా మనము మన ఋణమును తీర్చుకొనుచున్నాము. మనము అడుగడుగునను సృష్టిసంస్థను ఉపయోగించుకొనుచున్నాము. కనుక తన్మూలమున సృష్టికి జరుగు హానిని తొలగించుటకును, సృష్టిని పరిశుద్ధము చేయుటకును, నూతన వస్తునిర్మాణము కొఱకును యజ్ఞము నాచరింపవలసియున్నది.

రెండవసంస్థ మానవ సమాజము. తల్లిదండ్రులు, గురువు, మిత్రుడు – వీరందరును మనకొఱకు శ్రమచేయుచున్నారు. ఈ ఋణమును తీర్చుకొనుటకు దాన మను వ్యవస్థ యేర్పరుపబడినది. సమాజఋణమును తీర్చుకొనుటకు చేయబడు ప్రయోగమునే దానమందురు. దాన మనిన పరోపకారముకాదు. సమాజమునుండి నేను అపారముగా సేవను పొందియుంటిని. నేనీ ప్రపంచములోనికి దుర్బలుడుగను, అసహాయుడుగను వచ్చియుంటిని. పసిపాపగ వచ్చిన నన్ను ఈ సమాజము పోషించి పెద్దవానిని చేసినది. ఇందుచేత నేను సమాజసేవ చేయవలసియున్నాను. ఇతరులనుండి ఏమియు పొందకుండచేయు సేవనే పరోపకారమందురు. కాని యిక్కడ మనము బాల్యమునసే సమాజమునుండి పుష్కలముగ సేవను పొందియుంటిమి. ఈ సమాజఋణమును తీర్చుకొనుటకు చేయబడు సేవయే దానమనబడును. మానవసమాజము పురోగమించుటకు సాయపడుటయే దానము. సృష్టికి కలుగు హానిని తొలగించుటకు చేయు శ్రమను యజ్ఞమనియు,

సమాజఋణమును తీర్చుటకు శరీరము, మనస్సు, ధనము మొదలగు సాధనములచేత చేయు సాహాయ్యమును జ్ఞాన మనియు తెలియనగును.

ఇవిగాక మూడవ సంస్థ మరియొకటి కలదు. అది శరీరము. శరీరముకూడ దినదినము అరిగిపోవుచుండును. మనస్సు, బుద్ధి, ఇంద్రియములు మన పనులకై ఉపయోగ పడుచు అరిగిపోవుచుండును. శరీరమను సంస్థకు కలుగు వికా రములను, దోషములను తొలగించి, శరీరమును పరిశుద్ధము చేసికొనుటకు తపస్సు చెప్పబడినది.

ఈ విధముగ సృష్టి, సమాజము, శరీరము-ఈ మూడు వ్యవస్థల కార్యములను ఉత్కృష్టమగు రీతిని జరుపుకొనుట మన కర్తవ్యము. మనము యోగ్యములు, అయోగ్యములు అయిన అనేక సంస్థలను నిర్మించుచుందుము. కాని ఈ మూడు సంస్థలు మాత్రము మానవ నిర్మితములుకావు. ఇవి స్వభావ సిద్ధముగనే మనకు ప్రాప్తమైనవి. ఈ సంస్థలు కృత్రిమములు కావు! కనుక ఈ మూడు సంస్థలకును కలుగు హానిని యజ్ఞ దాన తపములను సాధనలవలన తొలగించుట మనకు సహజ ప్రాప్తమైన ధర్మము. మన మీ మార్గము ననుసరించినచో మన శక్తియంతయు దీనిలో వినియోగపడును. సృష్టి, సమా జము, శరీరము- ఈ మూటిని ఉచితస్థితిలో నుంచుటకు యావచ్ఛక్తిని వినియోగపరుపవలసి యున్నది. కబీరువలెనే మనముకూడ "ఓ ప్రభూ! నీవు నాకు శరీర మనెడు సుందర మగు దుప్పటిని అనుగ్రహించితివి. దానిని ఆస్థితిలోనే తిరిగి

నీ కిచ్చిపోవుచున్నాను. ఇక దీనిని గూర్చిన జాగ్రత్త నీదే" అని చెప్పుకొనగలిగినచో జీవిత మెంతో సఫలమైనట్లు. కాని ఇట్టి సఫలతను పొందుటకు యజ్ఞ, దాన, తపములను త్రివిధకార్యక్రమమును యథావిధిగ నెర వేర్పవలెను.

యజ్ఞ దాన తపములను మన మిక్కడ వేరు వేరు వస్తువులుగ భావించితిమి. కాని నిజమునకు వీనిలో భేదమే లేదు. ఎందువల్ల ననగా సృష్టి, సమాజము, శరీరము భిన్న భిన్న సంస్థలు కానేకావు. ఈ సమాజము సృష్టికి వెలుపల లేదు. శరీరముకూడ సృష్టికి వెలుపలిదికాదు. ఈ మూడును కలియుటచే ఒక భవ్యమైన సృష్టిసంస్థ నిర్మితమగుచున్నది. ఇందు చేతనే మనము చేయు నిర్మాణాత్మక శ్రమయంతయు, ఇచ్చు దానములన్నియు, చేయు తపస్సంతయు కలిపి విశాలదృష్టిలో యజ్ఞమనియే అనవచ్చును. గీత నాల్గవ అధ్యాయములో ద్రవ్యయజ్ఞము, తపోయజ్ఞము మొదలైన యజ్ఞములను చెప్పి యజ్ఞముయొక్క అర్థమును విశాలపరచినది.

ఈ మూడుసంస్థల కొఱకును మనము చేయు కర్మలన్నియు యజ్ఞరూపమునే పొందును. ఆ సేవాకార్యములలో మనము ఫలాపేక్షను ఏ మాత్రమును రానీయరాదు. ఏలయన ఫలమును మనము మొదటనే పొందితిమి. కాన మొదటనే ఆ ఋణము మనపై బడియున్నది. ఆ ఋణమును తీర్చుకొనుటయే మన కర్తవ్యము. యజ్ఞమువలన సృష్టిసంస్థలో సమత్వము ప్రాప్తించును. దానమువలన సమాజములో సమత్వమేర్పడును. తపస్సువలన శరీరములో సమత్వము సిద్ధించును.

ఈ విధముగ మూడుసంస్థలలో సమత్వమును నెలకొల్పుటకు ఈ కార్యక్రమము తోడ్పడును. దీనివలన దోషములు తొలగి శుద్ధి కలుగును.

మనము సేవచేయగల్లుటకు కొంత భోగమునుకూడ అనుభవింపవలయును. భోగముకూడ యజ్ఞములో నొక భాగమే. ఈ భోగమును గీత ఆహారమనును. శరీర మను యంత్రమునకు అన్న మను బొగ్గు వేయవలె. ఈయాహారము యజ్ఞము కాకపోయినను, యజ్ఞమును సిద్ధింపజేయుట కిదియొక ముఖ్యసాధనము. కావుననే మనము—

"ఉదర భరణ నహీం జానో యహ యజ్ఞ – కర్మ"

అనుచుందుము. ఇది యుదరపోషణ కాదని, యజ్ఞకర్మయని తెలిసికొనుము. తోటనుండి పుష్పములను తెచ్చి దేవుని శిరస్సు పై నుంచుటను పూజయందుము. కాని పుష్పములు పూచుటకు తోటలోచేయు పరిశ్రమకూడ పూజయే. యజ్ఞపూర్తికిచేయు పనులుకూడ ఒకవిధమైన పూజయే. శరీరమునకు కావలసిన ఆహారము నిచ్చినప్పుడే అది చేయవలసిన పనులను చేయగలుగును. యజ్ఞసాధనరూపములైన కర్మలుకూడ యజ్ఞమే! గీత యీ కర్మలను 'తదర్థీయకర్మ', 'యజ్ఞార్థకర్మ' అని యనును. సేవకై శరీరము నిలుచుటకుగాను దానికి వేయబడు ఆహుతి కూడ యజ్ఞమే. సేవకొఱకు గ్రహింపబడు ఆహారము పవిత్ర మైనది.

ఈ విషయములన్నిటికిని ముఖ్యముగా శ్రద్ధయుండ వలె. సేవనెల్లను ఈశ్వరార్పణచేయు భావము మనసులో

నుండవలెను. ఇది చాల గొప్ప విషయము. సేవామయులము కానంతవరకు ఈశ్వరార్పణ బుద్ధి కలుగదు. ఈశ్వరార్పణ యను ఈ ప్రధాన వస్తువును విస్మరించిన యెడల పౌరోగమింప జాలము.

96

సాధన సాత్వికము కావలెను.

కాని మనము మన కార్యము లన్నిటిని ఈశ్వరుని కెప్పుడుఅర్పించగలము? అవి యన్నియు సాత్వికము లైనప్పుడే! యజ్ఞదానతపములు మూడును సాత్వికములు కావలె. క్రియల నెట్లు సాత్వికములను చేయవలెనో ఆ విషయమును మనము పదునాల్గవ అధ్యాయములో చూచియుంటిమి. గీత యీ యధ్యాయములో ఆ తత్త్వమును ఆచరణలో పెట్టు విధాన మును చెప్పుచున్నది.

గీత యీ సాత్త్విక ప్రణాళికను సూచించుటలో రెండు ఉద్దేశము లున్నవి. బాహిరముగా యజ్ఞ, దాన, తపోరూప ములో జరుగుచున్న సేవ లోతుగా విచారించినచో అధ్యాత్మిక సాధన యగును. ఇది యొక ప్రయోజనము. సృష్టికి సేవ చేయుట అధ్యాత్మిక సాధన. ఈ రెంటి కార్యక్రమములు వేరువేరుగ నుండరాదు. ఈ రెండును భిన్నవస్తువులు కానే కావు. ఈ రెంటికిని ప్రయత్నమొకటే. కర్మకలాపమొకటే. ఈ విధముగా చేయు కర్మనెల్లను చివరకు ఈశ్వరార్పణము

చేయవలె. సమాజసేవ, సాధన, ఈశ్వరార్పణము- ఈ మూటి సంయోగము ఒక క్రియచేతనే సిద్ధించవలెను.

యజ్ఞమును సాత్వికముచేయుటకు రెండు విషయమ్ము లనవసరము. ౧ నిష్ఫలత్వము లేకుండుట ౨ కామములేకుం డుట. ఈ రెండును యజ్ఞమున కుండవలసిన లక్షణములు. యజ్ఞము సకామమైనచో అది రాజసమగును. అందు నిష్ఫ లత్వము గోచరించినచో అది తామస యజ్ఞమగును.

నూలు వడుకుట యజ్ఞము. కాని నూలువడుకునప్పుడు ఏకాగ్రతతో మన హృదయమును అందు చొప్పించక పోయి నచో ఆ సూత్రయజ్ఞము జడమగును. వెలుపల మన చేయి పని చేయుచున్నపుడు, ఆ పని కనుగుణమగు మానసిక సహ యోగము లోపలినుండి రానిచో ఆ పనియంతయు విధిరహిత మగును. ఇట్టి విధిరహితమైనకర్మ జడమగును. విధిహీన కర్మలో తమోగుణము ప్రవేశించును. అట్టి పనినుండి ఉత్కృష్టమైన వస్తునిర్మాణము కాజాలదు. దానినుండి ఫల సిద్ధి కలుగనేరదు. యజ్ఞము కామరహితముగ నున్నను దాని నుండి ఉత్కృష్టఫలము కలిగితీరును. ఏకాగ్రతతోను, అంతఃకరణ శుద్ధితోను జరుగని కర్మ భారమనిపించుము. ఇక దానినుండి ఉత్కృష్ట ఫలమెట్లు లభించును? బాహ్యమగు పని చెడిపోయినచో దానికి మానసిక సహయోగము లేక పోయెననుటతథ్యము. కనుక కర్మలో నీ యాత్మను చొప్పిం పుము. ఆంతరిక సహయోగమును జోడించుము. సృష్టిసంస్థ యెడల మనకున్న ఋణమును తీర్చుకొనుటకు ఉత్కృష్టమైన

ఫలమును ఉత్పత్తి చేయవలెను. కర్మలలో ఫలహీనతరాకుండ జేయుటకు విధియుక్తమైన ఆంతరిక సహాయోగము అవసరము.

ఈ విధముగ మనలో నిష్కామత్వము ప్రవేశించి విధిపూర్వకమైన కర్మలు సఫలమైనప్పుడే చిత్తశుద్ధి కలుగును. కాని ఈ చిత్తశుద్ధి కలిగినట్లు గుర్తేమి? నీ బాహ్యకర్మను పరిశీలించి చూచుకొనుము. అది నిర్మలము, సుందరము కాకున్నచో మనస్సులోకూడ మాలిన్య మున్నట్లే భావింప వలయును. కర్మ సుందరమైన దెప్పుడగును? విశుద్ధ హృదయముతో కష్టించిచేయు కర్మపై ఈశ్వరుడు తన ఆమోద ముద్ర వేయును. ప్రసన్నుడయిన పరమేశ్వరుడు కర్మపై ప్రేమముద్రను వేసినపుడు, దానియందు సౌందర్య ముత్పన్న మగును. సౌందర్యమనగా పవిత్రశ్రమనుండి లభించు ఈశ్వర ప్రసాదము. శిల్పి విగ్రహముచేయుచు తన్మయుడై "ఈసుందర మూర్తిని నా చేతులతో చేయుటలే"దనుకొనును. విగ్రహ మును చెక్కుచుండగా చివరగడియలో సౌందర్యము తనకై తాను ఎక్కడినుండియో వచ్చి ప్రవేశించును. చిత్తశుద్ధి లేకయే ఇట్టి దివ్యకళ ప్రకటమగునా? ఆ మూర్తిలోని సారస్యమును, మాధుర్యమును ఎక్కడివి? శిల్పి తన అంతఃకరణములోని సౌందర్యమునెల్లను దానిలో ప్రవేశపెట్టుట వలన వచ్చినవే! చిత్తములోని ప్రతిమయే మూర్తియగును. మనము చేయు కర్మలన్నియు మన హృదయమునుండి వచ్చిన మూర్తులే! హృదయము సుందరమగుచో కర్మయనెడిమూర్తి కూడ సుందరమే యగును. బాహ్యకర్మల పారిశుధ్యమును

మనఃపారిశుధ్యమునుబట్టియు, మనఃపారిశుధ్యమును బాహ్య కర్మలనుబట్టియు పరీక్షించుకొనవలె.

మరియొకమాట చెప్పవలసి యున్నది. ఈ యన్ని కర్మలకును మంత్రముకూడ ఆవశ్యకము. మంత్రహీనమైన కర్మ వ్యర్థము. నూలువడుకు సమయమున "ఈ సూత్రము వలన నేను దరిద్ర ప్రజానీకముతో బంధింపబడుచున్నా"నను మంత్రమును హృదయములో జపించుచుండుము. ఈమంత్రము లేకుండ గంటలకొలది వడికినను అదంతయు వ్యర్థమైపోవును. అట్టి పనివలన చిత్తము పరిశుద్ధము కానేరదు. 'ఏకు' అనెడు అవ్యక్త పరమాత్మ సూత్రరూపములో ప్రకటమగుచున్నా డను మంత్రమును వడుకుపనిలో చొప్పించి చూడుము. అప్పు డా పని అత్యంత సుందరమును సాత్వికమును అగును. అది పూజాకార్యమును, యజ్ఞరూపమగు సేవయు నగును. ఆ చిన్న నూలుపోగుచే మనము ప్రజానీకముతోను పరమేశ్వరునితోను బంధింపబడుదుము. బాలకృష్ణుని చిన్ననోటిలో తల్లియగు యశోదకు విశ్వమంతయు కనబడినది. నీవు వడుకునట్టి ఈ మంత్రమయమగు దారములోకూడ విశాలమగు విశ్వము గోచరించును.

97

ఆహారశుద్ధి

ఇట్టిసేవకు ఆహారశుద్ధికూడ అవసరము. ఆహారమును బట్టియే మనస్సుండును. ఆహారము మితముగ నుండవలె.

ఆహార మెట్టిదనుదానికంటె ఎంతయనునది ఎక్కువముఖ్యము. ఎట్టి యాహారము తినుచున్నామను విషయము ముఖ్యము కాకపోలేదు. కాని అది తగిన పరిమాణములో నున్నదా లేదా యనునది అంతకంటెను ముఖ్యము. భుజించు ఆహారము నకు తగిన పరిణామము కలిగి తీరును. ఇంతకు మనము భుజించు టెందులకు? ఉత్కృష్టమైన సేవ చేయగలందులకు. ఆహారముకూడ యజ్ఞములో నొక భాగమే! సేవ యను యజ్ఞమును ఫలప్రదము చేయుటకు ఆహార మవసరము. ఆహారము నీ దృష్టితో చూడుము. ఆహారము పరిశుద్ధముగను, స్వచ్ఛముగను ఉండవలెను. ఆహారపరిశుద్ధత విషయమై మానవు డెంతో శ్రద్ధ చూపవలెను. మన సమాజము ఆహార శుద్ధి విషయమున చాల తపస్సు చేసియున్నది. ఈ విషయ మున చాల ప్రయత్నములు జరిగినవి. ఈ ప్రయత్నములు వేలకొలది సంవత్సరములనుండి జరుగుచున్నవి. వీనికై ఎంత తపస్సు ధారవోయబడెనో చెప్పలేము. భూమండలములో తెగలకు తెగలు మాంసాహారమును వర్జించుట ఒక్క హిందూదేశములోనే! మాంసాహారమును భుజించు తెగల వారు కూడ మాంసమును నిత్యమును ముఖ్యవస్తువుగవాడరు. మాంసభక్షకులుకూడ దానిని కొంతవఱకు నీచముగ భావిం తురు. అట్టివారు మానసికముగ దానిని వర్జించినట్లే. మాంసాహార ప్రవృత్తిని నిరోధించుటకే యజ్ఞము ప్రచారము చేయబడెను. తిరిగి దానికొఱకే జన్నము నాపుటయు చేయబడెను. శ్రీకృష్ణభగవానుడు యజ్ఞముయొక్క నిర్వచ నమునే మార్చివేసినాడు. అతడు పాలలోనుండు మహిమను

బాగుగ తెలియజెప్పెను. శ్రీకృష్ణుడు చేసిన ఘనకార్యము లేవియు తక్కువ కావు. కాని కృష్ణుని యే రూపమును చూచి హిందూప్రజలు తన్మయు లగుదురు? గోవులను పాలించిన గోపాలకృష్ణుని జూచియే! అతడే హిందువులకు ప్రియుడు. గోవులమధ్యనే యుండి మురళి వాయించుచు గోసేవా తత్పరుడైన గోపాలకృష్ణుడే ఆబాలగోపాలమునకును పరిచితుడు. ఇట్లు మాంసభక్షణను నిరోధించుటలో గోరక్షణ చాల ఉపయోగపడెను. గోక్షీరముల మహిమ బాగుగ గుర్తింపబడినంతనే మాంసభక్షణ తగ్గినది.

అంతమాత్రమున ఆహారశుద్ధి పూర్ణమయ్యెనని చెప్పలేము. ఈ వికాస క్రమమును పెంపొందించు బాధ్యత మనపైనున్నది. వంగదేశస్థులు చేపలను తినుట చాలమందికి ఆశ్చర్యమును కలిగించును. కాని దీనికై వారిని నిందించుట పాడికాదు. వంగభూమిలో కేవలము వరిధాన్యమే పండును. దాని వలన శరీరపోషణ పూర్తిగా జరుగనేరదు. ఇందుచేత ఈ విషయములో నూతనప్రయోగములు చేయవలసియున్నది. అపుడు చేపలకుమాఱుగా అంత పుష్టినిచ్చు శాకాహారమేది? అను ఆలోచన ప్రారంభమగును. ఇందులకై మహాత్యాగులు జన్మించి ప్రయోగములు జరిపెదరు. అట్టి మహాత్ములే సమాజమును ముందునకు నడుపగలరు. సూర్యుడు అంత వేడిమితో మండుచుండుటచేతనే శరీరమునకు వలసిన కొడిగ్రీల ఉష్ణము మనకు లభించుచున్నది. అట్లే మానవసమాజములో విరాగులనెడి ప్రజ్వలదభ్రస్కరులుదయించి, శ్రద్ధాళువులై బాహ్య

పరిస్థితులనెడి బంధములను ఛేదించి తమ ధ్యేయాకాశములో రెక్కలు లేకుండనే విహరించుచుందురు. అట్టివారి యునికి వలననే ఈ స్వల్పవైరాగ్యమైనను మనలో ప్రసరించి మనము సమాజమున కుపయోగపడగలుగుచున్నాము. మాంసాహారమును నిరోధించుటకు ఋషులెంత తపస్సు చేయవలసివచ్చెనో, పుష్టికరమైన శాకాహారము లభించక ఎందరు ప్రాణములు కోల్పోయినో యను భావము ఈ సందర్భమున నాలో పొడకట్టుచుండును.

సారాంశమిది : నేడు మనలో ఆహారశుద్ధి సాముదాయికముగ నింతవరకు జరిగినది. మన పూర్వులు మితిలేని త్యాగముచేసి సంపాదించిన దానిని మనము కోల్పోరాదు. భారతీయ సంస్కృతిలోని ఈ విశిష్టతను గంగపాలు చేయవలదు. ఏదో యొకవిధముగ జీవింపవలెననుకొనుట సరికాదు. అట్లు జీవించుట చాల సులువే. పశువులుకూడ అట్లు జీవించుటలేదా ? కాని పశువులెంతో మనమును అంతేయందురా ? పశువునకును మనకును అంతరమున్నది. ఈ యంతరమును పెంచుకొనుటయే సంస్కృతిని పెంపొందించుట యగును. మాంసాహారమును త్యజించుటకు మనదేశము చాల గొప్ప ప్రయోగములు చేసినది. వాని నింకను ముందునకు సాగింపుడు. ఈ పరిశోధనలో మన మింతవరకు లేచిన యెత్తునుండి జారిపోరాదు.

ఇటీవల అనేకులలో మాంసాహారముమీది కోరిక పెరిగిపోవుచుండుట చేత ఇంతగా దీనినిగూర్చి చెప్పవలసి

వచ్చినది. ఈ నాడు పూర్వపశ్చిమ సభ్యతల ప్రభావములు ఒక దానిపై నొకటి పనిచేయుచున్నవి. చివరకు దీని పరిణామము మంచిదే యగునని నా విశ్వాసము. పాశ్చాత్య సంస్కృతివలన జడత్వమును పొందిన మన శ్రద్ధ ఇప్పుడు కదల నారంభించినది. శ్రద్ధ నావరించిన అంధత్వము తొలగి పోయినచో వచ్చు నష్టమేమియు లేదు. మంచి దేదో అది నిలబడును. చెడుగు కాలి భస్మమగును. అంధశ్రద్ధ తొలగి పోయి దాని స్థానమును అంధ - అశ్రద్ధ ఆక్రమింపరాదు. అంధత్వమును పొందునది ఒక్క శ్రద్ధ మాత్రమే కాదు. 'అంధ' యను విశేషమును కేవలము శ్రద్ధయే గుత్తకు తీసికొనలేదు. అశ్రద్ధకూడ అంధత్వమును పొందగలదు.

మాంసాహారమును గూర్చిన చర్చలు నేడు తిరిగి ఆరంభమగుచున్నవి. ఏది యెట్లున్నను, నూతనభావ మేదైన ప్రజ లాలోచింపమొదలిడినచో నాకు చాల ఆనందము కలుగును. ప్రజలు మేలొక్కని సమస్య నెమరొనుచున్నారని దీనినిబట్టి తేలుచున్నది. ఈ చైతన్యము నాకు ప్రియము గొల్పుచున్నది. కాని మెలకువ వచ్చినంతనే కనులు నలుపు కొనుచు నడువ నారంభించినచో పడిపోగలము. అందువలన పూర్తిగ మెలకువ రానంతవరకు, కనులు తెరచి బాగుగ చూడనంతవరకు చేతులను కాళ్లను కదలింపకుండుట మంచిది. బాగుగ ఆలోచింపుడు. పక్షివిపక్షములు, తిరుగుమరుగులు - అన్నివైపులనుండియు బాగుగ యోచింపుడు. ధర్మవిషయములపై విచారణ యను కత్తెరను నడపుడు. పరిశీలన యను

ఈ కత్తెరతో ఏ ధర్మము ఛేదింపబడునో అది గవ్వకైనను పనికిరాదని తెలిసికొనుము. ఈ విధముగ తునుకలై పోయెడు ధర్మములను పోనిండు. ఏ ధర్మము నీ కత్తెరకు లొంగక కత్తెరనే విరిచివేయునో అదే సత్యమని నమ్ముము. ధర్మము విమర్శలకు భయపడదు. అందువలన ఏ విషయమునైనను బాగుగ యోజింపుము. కాని పనిమాత్రము తొందరపడి చేయకుము. వచ్చియురాని మెలకువతో పనులు చేయబూని నచో దడాలున పడిపోగలవు. విచారణ యెంత తీవ్రముగ సాగుచున్నను, ఆచరణను మాత్రము అదుపులో నుంచుకొనుము. సంయమముతో నీ పనులను చేయుచుండుము. పూర్వమునుండియు ఆర్జించిన పుణ్యమును కోల్పోకుము.

98

నిర్విరోధ జీవనమునకు గీత యిచ్చు ప్రక్రియ

ఆహారశుద్ధివలన చిత్తశుద్ధి కలుగును. శరీరమునకు కూడ బలము చేకూరును. సమాజసేవ బాగుగ జరుగగలదు. వ్యక్తికి మనశ్శాంతి కలుగును. సమాజమున సంతోషము వ్యాపించును. యజ్ఞ దాన తపఃక్రియలు విధిపూర్వకముగను, మంత్రసహితముగను జరుగు సమాజములో విరోధ భావము గోచరింపదు. రెండద్దములను ఎదురెదురుగ పెట్టినప్పుడు ఒకదానిలోని ప్రతిబింబము రెండవదానిలో కనబడినట్లే వ్యక్తియందును సమాజమునందును బింబ ప్రతిబింబ

న్యాయము ననుసరించి పరస్పరసంతోషము వెల్లడియగును. నాకు సంతోషకారకమైనదే సమాజమునకును, సమాజము నకు సంతోషకారకమైనదే నాకును ఇంపగును. ఈ రెండు విధములగు సంతోషములను పరిశీలించిచూచినచో రెండును ఒకటేయని తేలగలదు. ఎటుచూచినను అద్వైతానుభవమే కలుగును. ద్వైతము, ద్రోహము అస్తమించును. ఇట్టి సువ్యవస్థకు మనలను చేర్చగల ప్రణాళికనే గీతప్రతిపాదించుచున్నది. మన దైనిక కార్యక్రమములను గీతా ప్రణాళిక ననుసరించి ఏర్పరచుకొన్నచో ఎంతబాగుగానుండును!

కాని నేడు వ్యక్తి, సమాజ జీవితములమధ్య విరోధ భావ ముత్పన్నమైనది. ఈ విరోధము నెట్లు నిర్మూలింపగల మను విషయమే సర్వత్ర చర్చింపబడుచున్నది. వ్యక్తి,సమాజములకుండు హద్దులేవి? ఇందుశ్రేష్ఠమేది? గౌణమేది? వ్యక్తివాదమును సమర్థించువారు సమాజము జడమని భావింతురు. సేనాధిపతి తనయొద్దకువచ్చిన సిపాయితో మాటలాడు నపుడు సౌమ్యమైన భాష నుపయోగించును. సిపాయిని 'మీరు' అనికూడ సంబోధించును. కాని యతడు సైన్యము నకు ఇచ్చవచ్చినట్లు ఆజ్ఞలిచ్చును. సైన్య మొక అచేతన పదార్థమా – కొయ్యబొమ్మయా యన్నట్లు వర్తించును. సైన్యము నటునుండి ఇటు, ఇటునుండి యటు పోరల్చును. అతనిదృష్టిలోవ్యక్తి చైతన్యస్వరూపుడు, సమాజము జడము. చూడుడు; ఇక్కడను మనకు ఆ యనుభవమే కలుగుచున్నది. ఇక్కడ నా యెదుట రెండుమూడువందలమంది వ్యక్తు

లున్నారు. కాని, మీ కిది రుచించినను లేకున్నను, మీరు జడవస్తువులా యన్నట్లు భావించి నాకు తోచినట్లు మాట లాడుచున్నాను. కాని నా యెదుటి కే వ్యక్తియైన వచ్చినచో అతడు చెప్పు విషయమును శ్రద్ధగా వినవలసియుండును. ఆలోచించి తగిన ప్రత్యుత్తర మీయవలసియుండును. అట్లు గాక ఇప్పుడు గంటలకొలది మిమ్ములను కూర్చుండబెట్టి మాట్లాడుచున్నాను.

"సమాజము జడము, వ్యక్తి చైతన్యస్వరూపుడు" అని చెప్పుచు కొందరు 'వ్యక్తి చైతన్యవాదము'ను ప్రతిపాదింతురు. మరికొందరు సమాజమునకే మాహాత్మ్యము నిత్తురు. ఒకనికి తలవెండ్రుకలు రాలిపోయినవి, కన్నులు పోయినవి, చేయి విరిగినది, దంతము లూడినవి, వీనికితోడు ఒక యూపిరితిత్తికూడ చెడిపోయినది. అయినను అతడు జీవించియే యుండును. ఏలయన ఏ యవయవమున కా యవయవము జడము. ఇం దేదైననొకటి శిథిలమైపోయినను సర్వనాశము కాజాలదు. మొత్తముమీద శరీరము నడచుచునే యుండును. ఈ విధముగ పరస్పర విరుద్ధములైన దృష్టికోణము లివి. మీ దృక్పథమున కనుకూలమగు అంచనాలనే మీరు వేయుచుందురు. మన సులోచనముల రంగునుబట్టియే సృష్టిరూపము గోచరించును.

ఒకడు వ్యక్తికి ప్రాముఖ్యము నిచ్చిన మరియొకడు సమాజమున కిచ్చును. "పొట్టకొఱకు పోరాటము అవసరము" (స్ట్రగుల్ ఫర్ ఎగిస్టెన్స్) అను సిద్ధాంతము సమాజమునందు

వ్యాపించియుండుటయే ఈ భేదబుద్ధికి కారణము. కలహము కొఱకా మానవుడు జీవించుట ? కలహముయొక్క పరిణామము మరణమే యగును కాని జీవించుట యెట్లగును ? ఇట్లు కలహించుటకంటె మరణించరాదా ? ఈ భేద బుద్ధి వలన మనము స్వార్థమును పరమార్థమును వేరుచేయుచున్నాము. అవి వేరువేరు అను సిద్ధాంతమును మొదట నెవడు కల్పించెనోగాని వాడొక వింతమనుష్యుడై యుండవలె ! ఇదేమి వింతయోకాని, లేనివస్తువు ఉన్నట్లు నిరూపించువాని బుద్ధిని గౌరవించుట మనకు పరిపాటియైనది. లేనిభేదమును తెచ్చిపెట్టి దానిని ప్రజలకు బోధించుట ఏమిపని ? చైనా చుట్టును గోడగట్టిన పనివంటిదే యిది. నేలయు నింగియు కలిసినట్లు తోచుతావున (దిగ్వలయమున) హద్దులు పెట్టి, దాని వెలుపల భూమ్యాకాశములు లేవని తలంచుటవంటిదే యీ పని. నేడు యజ్ఞమయ జీవితము సమాజమున లోపించుటయే దీని కెల్లను కారణము. ఇందుచేతనే వ్యక్తికిని సమాజమునకును నడుమ భేదము బయలుదేరినది.

కాని వ్యక్తిసమాజములమధ్య భేదమేమియు కల్పింపరాదు. ఒక గదిని రెండుగ చేయుటకు నడుమ నొకతెర కట్టినచో గాలివలన ఆ తెర ఇటునటు ఎగురుచుండును. అప్పుడొకసారి ఒకభాగమును, మరియొకసారి రెండవభాగమును పెద్దదిగ కనబడును. గదిలోని పెద్దచిన్నభాగముల వైశాల్యము గాలివిసురుడుపై ఆధారపడియుండును. కాని అది స్థిరమైనదికాదు. గీత యిట్టి భేదముల కవ్వలిది. ఈ భేదారోపణ

కృత్రిమమైనది. అంతశ్శుద్ధిని గూర్చిన శాసనమును పాలింపు డని గీత యనును. అప్పుడు వ్యక్తిసమూజ యోగక్షేమముల మధ్య ఎట్టి వైరుధ్యమును బయలుదేరనేరదు. పరస్పర క్షేమమునకు ఏ పట్టమునుండియు అంతరాయము కలుగ నేరదు. ఇట్లు అంతరాయములను వైరుధ్యమును తొలగించు టలోనే గీతయొక్క విశిష్టత కలదు. ఈ గీతానియమమును పాటింపగలవా డొక్కడున్నను ఆ యొక్కనివలననే రాష్ట్రి మెల్లను సంపన్నమగును. రాష్ట్రిమనగా రాష్ట్రిములోని వ్యక్తుల సముదాయమే. ఇట్టి యనుష్ఠానపరులగు జ్ఞానులు లేని రాష్ట్రిమును రాష్ట్రిమని యెట్లనదగును? హిందూస్థాన మనగానేమి? హిందూస్థానమనగా రవీంద్రనాథుడు, హిందూ స్థానమనగా గాంధి; లేక ఇటువంటి అయిదారుగురు సుప్ర సిద్ధులు. వేరందిన ఈ యైదారుగురనుబట్టియే బయటి ప్రపం చము హిందూదేశముయొక్క స్వరూపమును ఊహించు కొనును. ఒకరిద్దరు ప్రాచీనులు, నలుగు రయిదుగురు మధ్య కాలికులు, అయిదారుగురు ఆధునికులు, వీరితో హిమాల యము, గంగ మొదలైనవానిని కలిపినచో అది హిందూ స్థానమగును. ఇదే హిందూస్థానముయొక్క నిర్వచనము. ఇక మిగిలినదంతయు ఈ నిర్వచనమునకు భాష్యము. భాష్య మనగా సూత్రముల విపులీకరణము. పాలనుండి పెరుగు, పెరుగునుండి మజ్జిగ, వెన్న వచ్చును. పాలకు, పెరుగునకు, మజ్జిగకు, వెన్నకు మధ్య జగడము లేదు. పాలయొక్క శక్తి దానినుండివచ్చు వెన్ననుబట్టి నిర్ణయింపబడును. ఇట్లే సమా జమునందుండు వ్యక్తులనుబట్టియే సమాజముయొక్క శక్తి

నిర్ధారణయగును. వ్యక్తి – సమాజముల మధ్య వైరుధ్య మేమియు లేదు. వైరుధ్య మెట్లుండగలదు? వ్యక్తికిని వ్యక్తి కినిమధ్యకూడ విరోధముండరాదు. ఒకనికంటె మరియొకడు అధిక సంపన్నుడైనచో వచ్చెడు హానియేమి? ఎవ్వడును లేమి ననుభవింపకుండ, కలవారి సంపద సమాజమున కుప యోగపడుచుండిన చాలును. పైకము నా కుడిజేబులో నుండిననేమి? ఎడమజేబులోనుండిననేమి? రెండుజేబులును నావేకదా! ఒకడు సంపన్నుడైనచో వానివలన నేనును సంపన్నుడనే. రాష్ట్రమును సంపన్నమే. ఈ స్థితి సాధింప దగినదే.

కాని మనము భేదమును పాటింతుము. బొందిని, తలను వేరుచేసినచో రెండును మరణించును. కనుక వ్యక్తిని, సమాజమును వేరు చేయవలదు. స్వార్థమును, పరమార్థమును సాధింపగల యేకైక క్రియావిధానమునే గీత బోధించుచున్నది. ఈ గదిలోని గాలికిని, బయటనున్న గాలికిని విరోధములేదు. ఒక వేళ రెంటికిని వైరుధ్యమును కల్పించి వెలుపలి గాలి రాకుండ గదితలుపులు మూసినచో ఊపిరి యాడక మరణింతుము. ఈ రెంటియొక్క అవిరోధభావమును గుర్తించి గది తలుపులను తెరచియుంచినచో అడ్డులేకుండ వాయువు లోనికి ప్రవేశించును. ఇతరుల సంపదనుండి నా భూమిని, ఇంటిని వేరుచేసికొన్నంతనే అనంతసంపదకు నేను దవ్వగు చున్నాను. నా చిన్నగృహము అగ్నిపాలైనను, కూలిపోయి నను నా సర్వస్వమును కోల్పోయినట్లు భావించి తల్లడిల్లు

దును. కాని యిల్లేల కావలె? ఏల విలపింపవలె? మొదట సంకుచితముగ భావించు కొందులకు? తదుపరి దుఃఖించు కొందులకు? "ఈ యైదువందల రూపాయలును నావి" యను కొనుటచే సృష్టియొక్క అపారసంపదకు నేను దూరమైపోవు చున్నాను. "నా కిరువురు సోదరులు" అని భావించినంతనే ప్రపంచములోని అసంఖ్యాకులైన సోదరులకు నేను దూరమై పోవుచున్నాను. ఈ విషయమును మనము గమనించుటలేదు. అయ్యో! మానవుడు తన్ను తానెంతగ సంకుచితపరుచు కొనుచున్నాడు! నిజమునకు మానవుని స్వార్థము పార మార్థిక మయిపోవలె. వ్యక్తికిని సమాజమునకును చక్కని సామరస్యము కుదురుటకు గీత ఇట్టి సరళమైన, సుందరమైన మార్గమును చూపుచున్నది. నాలుకకును, పొట్టకును మధ్య వివాద మేమిటి? పొట్టకు అవసరమైనంత ఆహారమునే నాలు కకు అందించవలెను! పొట్ట "చాలు" అనినంతనే నాలుక ఆహారమును గైకొనరాదు. పొట్ట యొక సంస్థ. నాలుక మరి యొక సంస్థ. నేసి రెండుసంస్థలకును అధిపతిని. ఈ యన్ని సంస్థలలోను అవ్యైక్యభావమే యున్నది. అమంగళమైన ఈ వైరుధ్యము ఎక్కడ దాపురించినది! ఒక దేహములోనే ఈ భిన్నభిన్న 'సంస్థలు' వైరుధ్య మేమియు లేక సహకార భావముతో మెలుగుచున్నట్లే సమాజములోకూడ సామరస్య మేర్పడవలెను. సమాజములో ఈ సహకారమును పెంపొం దించుటకే గీత చిత్తశుద్ధిపూర్వకమైన యజ్ఞ, దాన, తపము లనెడు క్రియావిధానములు బోధించుచున్నది. ఇట్టి కర్మల వలన వ్యక్తికిని సమాజమునకును కల్యాణము చేకూరును.

యజ్ఞమయజీవితమును గడపువాడు అందఱకును ఆప్తుడగును. తల్లిప్రేమను తానే పొందుచున్నట్లు ప్రతిపుత్రుడును భావించును. ఆ విధముగనే ఇట్టి వ్యక్తిని ప్రతి వ్యక్తియు తన వానినిగ భావించును. అట్టివాడు సర్వప్రపంచమునకును ప్రియుడుగను ఆత్మీయుడుగను భాసించును. "ఇతడు మన ప్రాణము, మనమిత్రుడు, మనసఖుడు" అని యందరనుకొందురు. "ఐసా పురుష్‌తో హై ధన్య లోగ్ చాహే ఉసే అనన్య" అని సమర్థరామదాసు అనెను. అట్టి జీవితమును గడపగల ఉపాయమును గీత ప్రతిపాదించుచున్నది.

99

సమర్పణ మంత్రము

జీవితమును యజ్ఞమయము చేసికొనుటకు దానినెల్లను ఈశ్వరార్పణము చేయవలెనని గీతయొక్క మరియొక ప్రతిపాదన. జీవితము సేవామయమైనతరువాత ఇక ఈశ్వరార్పణ మెందులకు? జీవితమునెల్లను సేవామయము చేయవలెననుట సులువేకాని అట్లుచేయుటమాత్రము చాల కష్టమైన పని. అనేకజన్మల సాధనమీఁద అట్టిస్థితి కొంతవరకు సాధ్యము కావచ్చును. కర్మలన్నియు కేవలము సేవామయములయినప్పటికిని అవి పూజామయములైనవని చెప్పలేము. ఇందు చేతనే "ఓం తత్ సత్" మంత్రముతోపాటు కర్మలన్నిటిని ఈశ్వరార్పణము చేయవలె.

సేవాకర్మ నూటికి నూరుపాళ్లు సేవామయమగుట కష్టసాధ్యము. ఎందువలన ననగా పరమార్థములో కూడ స్వార్థము యిమిడియేయుండును. కేవల పరమార్థము సంభవమే కాదు. కొంచెమైనను స్వార్థములేని పని యుండనేరదు. అందువలన అనుదినమును అధికతరమైన నిష్కామ, నిస్స్వార్థ సేవను తాను చేయుచుండవలెనని ప్రతివ్యక్తియు కోరుకొనవలెను. నీవు చేయు సేవలంతకంతకు పరిశుద్ధము కావలెనన్నిన నీ పనులన్నిటిని ఈశ్వరార్పణము చేయుచుండుము.

"జీవన్ – కళాసాధతే యోగీ
వైష్ణవకో హై నామ్ మధుర్"

అని జ్ఞానదేవు డనెను. రామామృతము యొక్క మాధుర్యమును, జీవితకళయు వేరుకావు. నామముయొక్క ఆంతరిక ఘోషకును, బాహ్యజీవిత కళకును సామరస్యమున్నది. యోగి, వైష్ణవుడు – ఇరువురును ఒకరే! క్రియలను ఈశ్వరార్పణము చేసినమీదట స్వార్థము, పరార్థము, పరమార్థము అన్నియు ఏకరూపమై పోవును. ఇంతవరకు "నీవు, నేను వేఱు" అనుకొనుచు వచ్చిన భేదబుద్ధిని తొలగించుకొని ఏకము కావలె. 'నీవు, నేను కలియుటవలన 'మనము' అగుచుము. ఇక 'మనము' 'అతడు' ఏకము కావలె. నేను మొదట ఈ సృష్టితోను, తదుపరి పరమాత్మతోను సామరస్యమును సాధించవలె. 'ఓం తత్సత్' మంత్రమునందు ఈ భావమే సూచింపబడినది.

పరమేశ్వరుని నామము లనంతములు. వ్యాసుడు వీనిని 'విష్ణు సహస్రనామములు'గ చేసెను. మనము కల్పించు నామములన్నియు ఆయనవే. మన హృదయములో స్ఫురించు నామముల కనురూపముగ మన మతనిని సృష్టిలో దర్శింప వలె. దర్శించినదాని కనుగుణముగ జీవితమును దిద్దుకొన వలె. దీనిని 'త్రిపద గాయత్రి' యని నేనందును. 'ఈశ్వరుడు దయామయుడు' అను దానిని ఉదాహరణగ తీసికొందము. అట్లు భావించి సాధనచేయుచు దయాసాగరుడగు పరమేశ్వరుని ఈ సృష్టిలో దర్శింతముగాక ! భగవంతుడు స్రష్ట-బిడ్డకును సేవనిమిత్తము తల్లినిచ్చినాడు. బ్రతుకుటకు గాలిని ప్రసాదించినాడు. ఈ విధముగ సృష్టిలోనున్న ఈశ్వరుని దయామయ విధానమును దర్శించి, మన జీవితములనుకూడ దయామయములుగ చేసికొందముగాక ! భగవద్గీతకాలమున ప్రసిద్ధినొందిన భగవన్నామమును గీత బోధించినది. అదే 'ఓమ్ తత్సత్' అనునది. 'ఓమ్' అనగా 'అవును పరమాత్ముడున్నాడు' అని యర్థము.

ఈ యిరువదవ శతాబ్దములోకూడ పరమాత్ముడున్నాడు.

"స ఏవ అద్య స ఉశ్వః" నేడున్నదియు అదే, నిన్న ఉండినదియు అదే, రేపుండునదియు అదే. అది స్థిరవస్తువు. సృష్టి స్థిరమైనది. నడుము బిగించి నేనుకూడ సాధనచేయుటకు సిద్ధముగ నున్నాను. నేను సాధకుడను, అతడు భగవానుడు. ఈ సృష్టి పూజాద్రవ్యము, పూజాసాధనము. ఇట్టి భావనతో

మన హృదయము నిండినప్పుడే 'ఓమ్' మనకు హృద్గత మైనట్లు. అత డున్నాడు, నే నున్నాను, నా సాధనకూడ ఉన్నది. ఇ ట్లీ ఓంకారభావము మనసులో నాటుకొని సాధనలో ప్రకటితము కావలె. సూర్యుని మన మెప్పుడు చూచినను అతడు కిరణములతో సైతము కనబడును. కిరణములనుండి విడివడి అత డుండలేడు. కిరణముల నతడు మరచి యుండడు. ఇట్లే ఎవ్వడును, ఏ పరిస్థితులలోను సాధనమువిడిచి యుండరాదు. ఇట్లు నిరంతర సాధన చేయుచున్నపుడే మనము 'ఓమ్' తో ఏకరూపమయినట్లు చెప్పనగును.

దీని తరువాతి విషయము 'సత్'. పరమేశ్వరుడు 'సత్'. అనగా 'శుభము', 'మంగళము'. ఈ భావన కలవాడవై భగవంతుని మంగళస్వరూపమును సృష్టిలో దర్శింపుము. ఉదాహరణకు కుండను నింపి పైకితీసినపుడు సిటిలో నేర్పడు గుంట ఒక్కటీ ణములో ఎట్లు పూడిపోవునో చూడుము. ఇ దెంత మంగళకరము! ఎంత హృదయరంజకము! నది తన గర్భములో గుంటలుండుట సహింపలేదు. గుంటలను నింపుటకు అది వరుగిడుచు వచ్చును.

"నదీ వేగేన శుధ్యతి"

ఈ సృష్టి యనెడు నది వేగముచే పరిశుద్ధమగుచున్నది. సృష్టియంతయు శుభకరము, మంగళకరము అయి యున్నది. మీరు చేయు కర్మలుకూడ అట్లే యుండునుగాక! పరమేశ్వరుని 'సత్' అను నామముతో మన యాత్మ ఏకరూపమగుటకు గాను మన పనులన్నియు నిర్మలములుగను, భక్తిమయములు

గను ఉండవలె. సోమరసమును 'పవిత్రము' (దర్భ) తో వడపోసినట్లే మనము చేయు కర్మలను, సాధనలను అన్నిటిని నిత్యపరిశీలనచేసి నిర్దుష్టములుగ చేసికొనవలె.

ఇక 'తత్' ఉన్నది. 'తత్' అనగా 'అది'. ఈ 'అది' ఈ సృష్టినుండి కొంత భిన్నము, నిర్లిప్తము అయినది. సారాంశ మేమనగా పరమాత్మ ఈ సృష్టినుండి భిన్నమైనది, అనగా నిర్లిప్తమైనది. సూర్యోదయము కాగానే కమలములు వికసించును, పక్షులెగురును, అంధకారము తొలగిపోవును. కాని సూర్యుడు దూరముననే యుండును. ఈ పనులన్నిటి నుండియు అతడు వేరుగ నున్నట్లే యుండును. మనము కర్మలను అనాసక్తితో నాచరించినప్పుడు అందు నిర్లిప్తత వచ్చును. అప్పుడు జీవితములో 'తత్' ప్రవేశించినట్లు గ్రహింపనగును.

ఇట్లు గీత 'ఓమ్ తత్సత్' అను వైదికమంత్రముతో మన సమస్తకర్మలను ఈశ్వరార్పణచేయు విధానమును బోధించుచున్నది. వెనుక తొమ్మిదవ అధ్యాయములో కర్మలన్నిటిని ఈశ్వరార్పణచేయు విషయము వచ్చినది. "యత్కరోషి యదశ్నాసి" అను శ్లోకములో చెప్పబడిన దిదియే! ఆ విషయమే మరల పదునేడవ అధ్యాయములో వివరింప బడినది. పరమేశ్వరున కర్పింపబడు క్రియలు సాత్వికమైనవి కావలె. అప్పుడే అవి ఈశ్వరుని కర్పింపబడగలవు. ఈ విషయ మిక్కడ ముఖ్యముగ చెప్పబడినది.

100

పాపమును హరించునది హరినామము

ఇదంతయు సరే! కాని 'ఓమ్ తత్సత్' అను మంత్రము పవిత్రాత్ములకే యైనచో ఇక పాపులగతియేమి? అను ప్రశ్న సహజముగ ఉదయించును. పాపులుకూడ ఉచ్చరింప యోగ్యమైన మంత్రమేదైన కలదా లేదా? పాపులను తరింపచేయగలశక్తికూడ 'ఓమ్ తత్సత్'లోనే యున్నది. ఈశ్వరుని ప్రతినామములోను అసత్యమునుండి సత్యము వైపునకు తీసికొనిపోగల శక్తికలదు. అది పాపమునుండి పుణ్యమునకు తీసికొనిపోగలదు. జీవితమును మెల్లమెల్లగా పరిశుద్ధపరుచుకొనవలె. పరమాత్మ తప్పక సాయముచేయును. నీ బలహీనావస్థలో అతడు నీకు సహకరించును.

పుణ్యమయమైనను అహంకారపూరితమగుజీవితమొక వైపునను, పాపమయమైనను వినమ్రజీవితము మరియొక వైపునను ఉంచి ఈరెంటిలో నేదోయొకటి కోరుకొనుమని ఎవరైనాతో అనినచో నేను నోటిమాటలతో నేమియు చెప్పలేకపోయినను హృదయములో మాత్రము ఇట్లనుకొందును. "ఏ పాపజీవితమువలన నాకు పరమేశ్వరస్మరణ కలుగునో అదే నాకు లభించునుగాక!" పుణ్యమయ జీవితమువలన పరమాత్మను మరచిపోవుస్థితి కలుగుచో ఏ పాపమయ జీవితమువలన ఆయన స్మృతి కలుగునో దానినే కోరుకొనుమని నా హృదయము ప్రబోధించుచుండును. పాపమయ జీవిత

మును నేను సమర్థించుచున్నానని దీని యర్థముకాదు. కాని పుణ్యముచేయుచున్నా ననుఅహంకారమును మించిన పాపము మరొకటిలేదు.

"కహీం యేసుజాన్‌పన్, రోక్‌నదే నారాయణ్"

అని తుకారాం అనెను. ఆ గొప్పతనముతో నిమిత్తములేదు. అంతకంటె పాపియై దుఃఖము ననుభవించుటయే మంచిది.

"జ్ఞానీ జో హైం బచ్చే।
ఉన్‌సేం మూం భీ దూర్‌రహే"

"నేనుజ్ఞానిని"అనుకొనుబిడ్డను తల్లికూడ దూరముగ నుంచును. కాని అజ్ఞానులైన బిడ్డలను తల్లి తన యొడిలోనికి తీసికొనును. నేను స్వావలంబియైన పుణాత్ముడను కాగోరను. పరమేశ్వరావలంబియైన పాపినగుటయే నా కిష్టము. పరమేశ్వరుని పవిత్రత నా పాపమును శమింపజేసి నన్ను రక్షింప గలదు. పాపములను నిరోధించుటకు మనము ప్రయత్నింతము గాక ! అవి నిరోధింపబడనిచో మనస్సు తహతహ పడును. హృదయము విలపించును. అప్పు డీశ్వరస్మృతి కలుగును. ఈశ్వరు డీ విలాసమును చూచుచునే యుండును. 'నేను పాపిని, కావున నీ ద్వారమునొద్దకు వచ్చితిని'అని యెలుగెత్తి కేకపెట్టుము. పుణ్యాత్ముని కీశ్వరుని స్మరించు అధికారము కలదు. ఏలయనగా అతడు పుణ్యాత్ముడు కాబట్టి. పాపికిని ఈశ్వరుని స్మరించు అధికార మున్నది. ఎట్లనగా అతడు పాపి కనుక.

గీతా ప్రవచనములు

పదునెనిమిదవ అధ్యాయము

ఉపసంహారము – ఫలత్యాగముయొక్క పరిపూర్తి – ఈశ్వర ప్రసాదము

101

అర్జునుని అంతిమ ప్రశ్న

సోదరులారా !

ఈశ్వరకృప వలన నేడు పదునెనిమిదవ అధ్యాయము నకు చేరుకొన్నారము. అనుక్షణమును మార్పు చెందుచుండు ఈ విశ్వములో ఏ సంకల్పమేని నెరవేరుట ఈశ్వరేచ్ఛపై ఆధారపడియుండును. ఇక చెఱసాలలో అడుగడుగునను అంతయు అనిశ్చితమే. ఇక్కడ ఏ పని ప్రారంభించినను దానిని ఇక్కడనే పూర్తిచేయగలమను నమ్మకము లేదు. మనము ప్రారంభించినప్పుడు ఈ గీత ఇక్కడ పూర్తికాగలదను నమ్మక మేమాత్రమును లేదు. కాని ఈశ్వరేచ్ఛవలన మనము చివరకు రాగలిగితిమి.

పదునాల్గవ అధ్యాయములో జీవితము – లేక – కర్మ సాత్వికమని, రాజసమని, తామసమని మూడుగ విభజింప బడినది. ఈ మూటిలో రాజసమును, తామసమును త్యజించి

సాత్వికమును గ్రహింపవలెననికూడ మనము చూచితిమి. తరువాత పదునేడవ అధ్యాయములో ఈ విషయమే మరియొక రీతిని చెప్పబడినది. అది యజ్ఞము, దానము, తపస్సు. ఒక్కమాటలో చెప్పవలెనన యజ్ఞమే జీవిత సారము. యజ్ఞమున కుపకరించు ఆహారాదికర్మలనుసాత్వికరూపమును, యజ్ఞరూపమును పొందించి గ్రహింపవలెనియు, యజ్ఞరూపము, సాత్వికము అయిన కర్మనే స్వీకరించుచు మిగిలిన కర్మ నెల్లను త్యజించుటయే ఉచితమనియు సూచనగా పదునేడవ అధ్యాయములో మనము గ్రహించితిమి. 'ఓం తత్సత్' మంత్రమును ఎందులకు నిరంతరమును స్మరింపవలెనో అది కూడ మనము తెలిసికొన్నారము. 'ఓం' అనగా సాతత్యము, 'తత్' అనగా నిర్లిప్తత, "సత్" అనగా సాత్వికత. మన సాధనలో సాతత్యము, నిర్లిప్తత, సాత్వికత ఉండవలె. అప్పుడే సాధన ఈశ్వరార్పణము కాగలదు. దీనినిబట్టి కొన్ని కర్మలు చేయవలసినవనియు, కొన్ని త్యజింపవలసినవనియు విశద మగుచున్నది.

గీతాబోధను పరిశీలించిచూచినచో కర్మత్యాగము చేయవలదని అందు అడుగడుగునను మనకు కానపచ్చును. గీత కర్మఫలత్యాగవిధానమును బోధించుచున్నది. కర్మను నిరంతరమును చేయుచుండవలెనని, ఫలమునుమాత్రము త్యజించుచుండవలెనని – గీతయం దెచ్చటచూచినను ఈ శిక్షణయే ఈయబడినది. ఇది యొకదృష్టి. కాని కొన్నికర్మలు చేయవలె, కొన్నికర్మలు త్యజింపవలె ననెడి దృష్టి మరియొకటి

కలదు. అందువలన చివరకు పదునెనిమిదవ అధ్యాయము మొదట అర్జును డిట్లు ప్రశ్నించును. "ఒకవైపున ఫలత్యాగ పూర్వకముగ కర్మలన్నిటిని చేయవలెనని, రెండవవైపున కొన్నికర్మలను విధిగా త్యజింపవలెనని, కొన్నిమాత్రమే చేయదగినవని యన్నప్పుడు ఈ రెంటికిని సామరస్యము కుదుర్చుటెట్లు?" సాధనమార్గమును స్పష్టముగా తెలిసికొనుటకును, ఫలత్యాగముయొక్క రహస్యమును గ్రహించుటకును ఈ ప్రశ్న అడుగబడినది. శాస్త్రమునుబట్టి సంన్యాస మనగా సర్వకర్మ పరిత్యాగము. ఫలత్యాగ మనగా కర్మఫలమును త్యజించుట. గీతలోని ఫలత్యాగమును సాధించుటకు ప్రతికర్మను త్యజించుట అవసరమా యనునదే ఇప్పుడు ప్రశ్న. ఫలత్యాగమను లక్ష్యమును చేరుటకు సంన్యాసము (సర్వకర్మత్యాగము) ఏమైన ఉపకరించునా? సంన్యాసముయొక్క హద్దులేవి? సంన్యాసము, ఫలత్యాగము- ఈ రెంటి హద్దు లెవ్వి? అవి యెంతవరకు? ఇదే అర్జునుని ప్రశ్న.

102

ఫలత్యాగము ఉత్కృష్టమైన ఒరపిడిరాయి

ఫలత్యాగము ఉత్కృష్ట వస్తువను విషయమును భగవంతుడు తన ప్రత్యుత్తరములో స్పష్టపరచినాడు. ఫలత్యాగ తత్త్వమును సర్వత్ర ప్రయోగింపవచ్చును. సర్వకర్మఫలత్యాగము, రాజస తామస కర్మల త్యాగము - ఈ రెంటిమధ్యను

వైరుధ్యము లేదు. ఫలత్యాగదృష్టితో చూచినచో కొన్ని కర్మలు వానికవే చేయరానివిగా స్పష్టమగును. ఫలత్యాగ పూర్వకముగ కర్మలను చేయవలె ననగా కొన్నికర్మలను వదలివేయవలెననియే అర్థము.

దీనినిగూర్చి కొంచెము లోతుగ విచారింతము. కామ్యకర్మలను (కోరికతోకూడిన కర్మలను) ఫలత్యాగ పూర్వకముగ చేయుమని యనినంతనే వానిపునాదియే సడలి పోవును. ఫలత్యాగముముందర కామ్య, నిషిద్ధకర్మలు నిలువనే నిలువవు. ఫలత్యాగపూర్వకముగచేయు కర్మలు కృత్రిమముగను, తాంత్రికముగను యంత్రమువలె నుండవు. ఏ కర్మలు చేయవలెను, ఏవి చేయరాదు – అను విషయము ఈయొరపిడిజాతిద్వారా సులభముగా తెలియును. గీత ఫలత్యాగపూర్వకమైనకర్మలు చేయుమనిమాత్రమే చెప్పు ననియు, ఏవి చేయవలెనో ఏవి మానవలెనో స్పష్టీకరించ లేదనియు కొందరందురు. ఇది ఆభాసము మాత్రమేకాని యథార్థముకాదు. ఎందులకన ఫలత్యాగపూర్వకముగ కర్మల నాచరింపుమని చెప్పుటలోనే ఏకర్మలు చేయవలసినవో, ఏవి చేయరానివో స్పష్టమగుచునేయున్నది. హింసాత్మకకర్మలు, అసత్యమయకర్మలు, చౌర్యమువంటి కర్మలు ఎన్నటికిని ఫల త్యాగపూర్వకముగ చేయబడవు. ఫలత్యాగమను ఒరపిడి జాతిపై ఒరసినంతనే ఈ కర్మలు గాలిలో నెగిరిపోవును. సూర్యకాంతి వ్యాపించినంతనే వస్తువులన్నియు ధగధగ ప్రకాశించును. అట్లని వానితోపాటు అంధకారముకూడ

ప్రకాశించునా? అదిమాత్రము అదృశ్యమైపోవును. నిషిద్ధ, కామ్య కర్మలగతికూడ ఇంతే. మనము సమస్త కర్మలను ఫలత్యాగమను ఒరపిడిరాతిపై ఒరసి చూడవలె. మనము చేయదలచిన కర్మలను అనాసక్తిపూర్వకముగ, లేశమాత్ర మేని ఫలాపేక్షలేకుండ చేయుట సాధ్యమగునా కాదా యని మొదటనే తేల్చుకొనవలెను. ఫలత్యాగమే కర్మాచరణకు ఒరపిడిరాయి. ఈ విధమైన పరీక్షలో కామ్యకర్మలు నిరా క్షేపణగా త్యాజ్యములగుచున్నవి. అట్టికర్మలను విడుచుటే ఉచితము. ఇక మిగులునవి శుద్ధ సాత్వికకర్మలు. వానిని అనాసక్తిపూర్వకముగను, అహంకార రహితముగను చేయ వలెను. కామ్యకర్మలను త్యజించుటకూడ కర్మయే యగును. ఫలత్యాగ మను కత్తెరను కామ్యకర్మలపైగూడ నడుపుము. కామ్యకర్మలను త్యజించుటకూడ సహజముగ జరుగవలెను.

ఇట్లు మూడువిషయములను మనము గమనించినా రము. మనము చేయు కర్మలన్నిటిని ఫలత్యాగపూర్వకముగ చేయువలె ననునది మొదటిది. రాజసతామసకర్మలు అనగా నిషిద్ధ, కామ్య కర్మలు ఫలత్యాగమను ఒరపిడిరాతిమీద ఒరసి చూచినంతనే వానియంతట నవే రాలిపోవును. ఇది రెండవది. ఈ విధముగ చేసిన త్యాగముపైకికూడ ఫలత్యాగ మను కత్తెరను పోనిచ్చి చూడుము. నే నింత త్యాగమును చేసితినని గర్వపడరాదు. ఇది మూడవది.

రాజసతామస కర్మలు ఎందువలన త్యాజ్యములు? అవి పరిశుద్ధములు కావుకనుక! పరిశుద్ధములు కానందున కర్త

యొక్క చిత్తముపై వాని సంస్కారము పడును. లోతుగ యోజించినమీదట సాత్వికకర్మలుకూడ దోషయుతములు కాగలవని తేలుచున్నది. కర్మలన్నిటిలోను ఏదోకొంత దోష ముండనేయుండును. నేద్య మను స్వధర్మమును చూడుడు. ఇది శుద్ధ సాత్వికక్రియ. కాని యజ్ఞమయమును స్వధర్మమును అగు ఈ నేద్యములోకూడ హింసయున్నది. దున్నుట మొద లగు పనులలో ఎన్నో జీవులు చచ్చుచుండును. నూతిచుట్టు నున్న మురికిగుంటలు బాగుచేయునప్పుడుకూడ చాల కృమి కీటకములు చచ్చిపోవును. ఉదయమున తలుపు తెరచినంతనే సూర్యరశ్మి లోపలికి ప్రవేశించును. అసంఖ్యాకములైన జీవా ణువులు నశించును. శుద్ధీకరణము (స్టెరలైజేషన్)లో నున్నది కృమినాశనమేకదా ! స్వధర్మరూపమైన సాత్వికకర్మకూడ దోషయుతమైనచో ఇక చేయవలసినదేమి యనునదే చివరకు మిగులుప్రశ్న.

మానవునిలో సద్గుణములింకను వికాసమును పొంద వలసియేయున్నవని నేను ముందే చెప్పియున్నాను. జ్ఞానము, భక్తి, నేవ, అహింస – వీనిలో మనమిప్పటికిపొందిన యను భవములు అతి స్వల్పములే. సంపూర్ణానుభవమును పొందితి మని చెప్పలేము. ప్రపంచము అనుభవములను పొందుదు పురోగమించుచుండును. నేద్యములో హింసయున్నదికనుక అహింసాపరులు ఆవృత్తిని చేయరాదని, వ్యాపారముచేయ వచ్చునని ఒక వాదము మధ్యయుగములో బయలుదేరెను. అన్నోత్పత్తి పాపమని, ధాన్యము విక్రయించుట పాపము

కాదని వారి మతము. కాని యీ విధముగ మనులను తప్పించు కొనుటలో మనకు శ్రేయస్సులేదు. మనుష్యులు కర్మల నాచ రించు విషయమున ఇట్లు వెనుక ముందాడుచున్నచో చివరకు ఆత్మనాశము తప్పదు. కర్మలనుండి తప్పించుకొను ఆలోచనలు పెరుగుచున్నకొలది కర్మభారము అధికమగుచుండును. ఒకడు ధాన్యపు వ్యాపారము చేయవలెనని మరియొకడు భూమిని దున్ని సేద్యముచేయవలదా? అప్పుడు సేద్యమువలన కలుగు హింసలో భేరగాడుమాత్రము భాగస్వామి కాడా? ప్రత్తి పండించుట పాపమైనచో ప్రత్తిని అమ్ముటకూడ పాపమే. ప్రత్తిని పండించుటలో దోషమున్నదని ఆ పనినే వదలుట అవివేకము. ఈ కర్మ వలదు, ఆకర్మవలదు, ఏకర్మనుచేయ రాదని సమస్త కర్మలను బహిష్కరించు దృష్టి గలవానికి నిక్కమగు ప్రేమభావము నశించును. అట్టివాడు మృతప్రాయు డగును. ఆకులు కోయుటవలన చెట్టు చావదుసరికదా క్రొత్త చిగురుపట్టి అది కడుంగడు శోభిల్లును. సాత్విక కర్మలు చేయుటలో వెనుక ముందాడుట ఆత్మను సంకుచితపరుచు కొనుటయే!

103

క్రియలనుండి విముక్తికి సరియగు మార్గము

క్రియ లన్నిటిలోను దోష మున్నచో అన్నిక్రియలను ఏల వదలివేయరాదు? అనునది తరువాతి ప్రశ్న. దీనికి

ప్రత్యుత్తర మిదివరకు ఒకసారి యీయబడియే యున్నది. "సర్వకర్మ త్యాగ"మను భావన చాల సుందరము ఆకర్షణీయము అయినది. కాని అసంఖ్యాకములైన ఈ కర్మల నన్నిటిని వదలుట యెట్లు? రాజసతామసకర్మలను వదలుట కున్న పద్ధతియే సాత్వికకర్మల వదలుటకుకూడ వర్తించునా? దోషయుతమగు సాత్విక కర్మలనుండి తప్పించుకొనుటయెట్లు? ఇందున్న చమత్కార మిది: "ఇంద్రాయతక్షకాయస్వాహా" అన్నట్లు మనుష్యుడు ప్రపంచమున మెలగ నారంభించినపుడు ఇంద్రుడమరుడగుటవలన చనిపోడు. తక్షకుడుకూడ చనిపోడు సరిగదా అతడు మరింత బలమును చేకూర్చుకొని సురక్షితుడగును. సాత్విక కర్మలలో పుణ్యమున్నదికాని కొంచెము దోషమును కలదు. కాని కొంచెము దోష ముండుటవలన ఆ దోషముతోపాటు పుణ్యమునుకూడ ఆహుతిచేయుదలచి నచో పుణ్యక్రియలు బలిష్ఠములు కాన నశించవు. దోషక్రియలు అవశ్యము వర్ధిల్లుచుండును. మిశ్రితము, వివేకహీనము అగు ఇట్టి త్యాగమువలన పుణ్యస్వరూపుడగు ఇంద్రుడు మరణించడు. దోషయుతుడగు తక్షకుడుకూడ చావదగియుండియు చనిపోడు. కాగా సాత్విక కర్మలను త్యజించు విధాన మెట్టిది? పిల్లి హింసచేయునని దానిని త్యజించినచో ఎలుకవలని హింస పెరిగిపోవును. పాములు హింసచేయునని వానిని నిర్మూలించినచో కోట్లకొలది జంతువులు పంటలను నాశనము చేయును. ఆహార ధాన్యములు నష్టమగుటవలన వేలకొలది జనులు చనిపోవుదురు. కనుక త్యాగము వివేకయుక్తముగ నుండవలెను.

"ఇస్ లడకేక్కో ధోలా!"* అని మచ్ఛీంద్రనాథుడు తన శిష్యుడగు గోరకనాథునితో అనెను. అప్పుడు గోరక నాథుడు కుట్టివాని కాళ్లను పట్టుకొని వానిని రాతిబండపై యుతికి దండెముపై ఆరవేసెను. "కుట్టివానిని శుభ్రపరచి తీసికొని వచ్చితివా?" యని మచ్ఛీంద్రనాథు డడిగెను. "ఆహా! ఉతికితెచ్చి ఆరవేసితి"నని గోరకనాథుడు జవా బిచ్చెను. పిల్లవానిని కడుగవలసిన దిట్లేనా! గుడ్డలను, మనుష్యులను శుభ్రపరచు పద్ధతి యొకటికాదు. ఈ రెండు పద్ధతులలోను చాల వ్యత్యాసమున్నది. ఇందువలననే రాజస, తామస కర్మలను త్యజించుటలోను, సాత్విక కర్మలను త్యజించుటలోను చాల వ్యత్యాసమున్నది. సాత్విక కర్మల త్యజించు పద్ధతి వేరు.

వివేకహీనులమై కర్మనాచరించుటవలన వ్యవహారము కొంత తారుమారు కాక తప్పదు.

త్యాగ్ సే భోగ్ ఉగే జో భీతర్
తబ్ హే దాతా క్యామై కరూఁ"

అని తుకారాం అనెను.

అల్పత్యాగము చేసినను అధికభోగము వచ్చి పైబడును. అందువలన ఆ చిన్న త్యాగముకూడ మిథ్యయైపోవును. అల్ప త్యాగము చేసినవానికిగూడ పెద్దపెద్ద ఇంద్రభవనములను కట్టించియిత్తుము. కాని ఈ భవనములకంటె ముందుండిన

*"స్తో" అను క్రియకు శుభ్రపరుచుట, ఉతుకుట అని రెండర్థములు కలవు.

గుడిసెయే మంచిది. అదే చాలును. కౌపీనముధరించి చుట్టు పట్టనున్నవారి సంపదను సేకరించుకొనుటకంటె చొక్కా, కోటు వేసికొని యుండుటయే మంచిది. ఇందుచేతనే సాత్వికకర్మలను త్యజించు పద్ధతియే వేరని భగవంతుడు చెప్పివాడు. సాత్వికకర్మలన్నిటిని చేయవలసియేయున్నాము. కాని వాని ఫలమును త్యజించవలెను. కొన్ని కర్మలు మూలములోనే త్యాజ్యములు. మరికొన్నిటిలో ఫలములనే త్యజింపవలయును. శరీరమున కేదైన మసి యంటినచో దానిని కడిగి శుభ్రపరుపవచ్చును. కాని మొదలు శరీరమురంగే నలుపైనచో దానికి తెలుపు పట్టించిన నేమిలాభము? ఆ నలుపురంగు నట్లేయుండనిమ్ము. దానివంక చూచుటెందులకు? అది యమంగళమని తలపకుము.

ఒకానొకడు తన యింటిలో నుండుట అమంగళమన్ని తోచి మరొక గ్రామమునకు వెళ్లిపోయెను. అదికూడ అతనికి అశుభముగనే కనబడినందున అరణ్యములోనికి పోయెను. అక్కడ అతడొక మామిడిచెట్టుక్రింద కూర్చుండియుండగా పక్షి యొకటి వాని తలమీద రెట్ట వేసెను. "ఈ యడవి కూడ అమంగళమే" అని తలంచి వాడు వెళ్లి నదిలో నిలబడెను. నదిలోకూడ పెద్దచేపలు చిన్నచేపలను తినుచుండుట చూచి అతడు చాల దుఃఖించెను. "అరే! ఏమిది? ఈ సృష్టియంతయు అమంగళమేనా? ఇక మరణమే తరణోపాయము" అని తలచి అతడు నీటినుండి బయటికివచ్చి చితిపేర్చి నిప్పు ముట్టించెను. ఒక సజ్జను డటుపోవుచు, "సోదరా! ఎందులకీ చనిపోవుప్రయత్నము?" అని యడిగెను. "ఈ సృష్టియంతయు

అమంగళము కనుక" అని యతడు జవాబిచ్చెను. అప్పు డా సజ్జను డిట్లనెను– "నీ యీ మురికి శరీరమును, అం దున్న క్రొవ్వుపదార్థమును అగ్నిపాలు చేసినచో ఎంత దుర్గంధము వ్యాపించును? మే మిం సమీపమునసే నివసించుచున్నాము. మే మేమి కావలెను? ఒక్క తలవెండ్రుక కాలినచో ఎంత దుర్గంధము బయలు దేరును? ఇక నీ శరీరములోని క్రొవ్వంతయు తగులబడినచో ఎంత దుర్గంధము వ్యాపించునో కొంచెము యోజింపుము". అప్పు డా మనుష్యుడు—"ఈ ప్రపంచములో బ్రతుకుట కవకాశము లేదు, మరణించుటకును లేదు. కాని ఇప్పు డేమి చేయవలె!" అని వివశుడై బదులు చెప్పెను.

తాత్పర్యమిది : అశుభమని చెప్పి మన మన్నిటిని బహిష్కరించినచో జీవితమే నడువదు. చిన్నపనులనుండి తప్పుకొనవలెనని నీవు తలచినచో మరికొన్ని పెద్దపనులు వచ్చి పైబడును. కర్మలను బాహిరముగ చేయనంతమా త్రమున అవి నిన్ను వదలిపోవు. సహజప్రాప్తమగు కర్మను త్రోసివేయుటలో తనశక్తిని వెచ్చించి ప్రవాహమున కెదురీదువాడు అలసి ఆ ప్రవాహముతోపాటు కొట్టుకొనిపోవును. ప్రవాహమున కనుకూలమగు క్రియలతోనే తాను తరించు ఉపాయమును మానవు డన్వేషించవలె. దీనివలన మానసిక బంధనములుతగ్గి చిత్తశుద్ధి పెరుగును. తరువాత మెల్లమెల్లగా క్రియలు వానియంతట నవే లుప్తములగును. కర్మలను త్యజింపకుండనే క్రియలు లుప్తములగును. కర్మలు వదలి పోవు; క్రియలుమాత్రము లోపించుము.

కర్మలకును క్రియలకును భేద మున్నది. ఉదాహరణకు ఒక చోట జరుగుచున్న గందరగోళమును ఆపవలెననుకొనుడు. సిపాయి యొకడు పెద్ద పెట్టున అరచుచు "అల్లరి చేయకుడు" అనును. ఆ గల్లంతును మాన్పుటకు బిగ్గరగ కేకవేయునట్టి తీవ్రకర్మను అతడు చేయవలసి వచ్చెను. ఆ పరిస్థితిలోనే మరి యొకడు వచ్చి ఏమియు మాటలాడక వ్రేలు చూపినంతనే ప్రజలు శాంతించిరనుకొనుడు. విశేషయోగ్యతగల మూడవ వాడు మరియొకడు అక్కడ ఊరక ఉన్నంతమాత్రముననే శాంతి యేర్పడిన దనుకొనుడు. మొదటివాడు తీవ్రమైన క్రియను చేయవలసివచ్చెను. రెండవవాని క్రియ అంతకంటె కొంతసౌమ్యముగ నుండెను.ఇక మూడవవాని క్రియ కేవలము సూక్ష్మము. ఇట్లు క్రియల స్వరూప మంతకంతకు తగ్గుచు వచ్చినది. కాని ప్రజలను శాంతిపరుచు కర్మను ముగ్గురును సమానముగనే యాచరించిరి. మనుష్యునిలో చిత్తశుద్ధి పెరిగినకొలది క్రియల తీవ్రత తగ్గుచుండును. తీవ్రమునుండి సౌమ్యము, సౌమ్యమునుండి సూక్ష్మము, సూక్ష్మముండి శూన్యము అగుచు పోవును. కర్మ యొక వస్తువు, క్రియ మరి యొకటి. కర్తకు ఇష్టతమమైనదే కర్మ. ఇదే కర్మకు నిర్వచనము. కర్మకు ప్రథమా ద్వితీయావిభక్తులు వాడినచో క్రియకు స్వతంత్ర క్రియాపదమును వాడవలసి యుండును.

కర్మకును క్రియకును ఉండు వ్యత్యాసమును గమనింపుడు. కోపము వచ్చినపుడు ఒకడు బిగ్గరగా అరచియు మరియొక డేమియు మాటలాడకయు తమ కోపమును

ప్రకటింతురు. జ్ఞాని, క్రియలను లేశమాత్రమును చేయుడు. కాని కర్మల ననంతముగ చేయుచుండును. తన అస్తిత్వ మాత్రముచేతనే లోకసంగ్రహము నపాశముగ చేయగలు గును. అట్టిజ్ఞానియొక్క ఉనికియే చాలును. చేయి, కాలు మొదలగు అవయవములతో నేమియు చేయకున్నను అతడు కర్మలను చేయుచునేయుండును. క్రియలు సూక్ష్మముగుచున్న కొలది కర్మ లధికముగ జరుగుచుండును. ఈ దృష్టిని పొడి గించి చిత్తపారిశుధ్యమును పూర్ణము గావించుకొన్నచో చివరకు క్రియలు శూన్యమై కర్మలుమాత్రము అనంతముగా జరుగుచుండునని చెప్పనగును. మొదట తీవ్రము, తరువాత తీవ్రమునుండి సౌమ్యము, సౌమ్యమునుండి సూక్ష్మము, సూక్ష్మమునుండి శూన్యము – ఇట్లు క్రమముగ క్రియా శూన్యత దానియంతట అదే ప్రాప్తమగును. కాని అప్పుడు కర్మ లనంతములుగ వానియంతట నవే జరుగుచుండును.

బాహ్యముగ కర్మలను దూరము చేసినందువలన అవి దూరముకావు. నిష్కామ బుద్ధితో కర్మలు చేయుచుపోగా మెల్లమెల్లగా వానివలన అనుభవము కలుగుచుండును. "మిథ్యాచారుడగు మతాధికారి" అనుపద్యమొకటి బ్రౌనింగు కవి వ్రాసెను. "మీరెందుల కింతగా అలంకారము చేసి కొందురు? ఈ పెద్ద అంగరకాయెందులకు? ఈ వేషమేమిటి? గంభీరమగు ఈ వాలకమెందులకు?" అని యొకడు మతాధి కారి నడిగెను. దాని కతడిట్లు జవాబిచ్చెను : "ఇదంతయు నే నెందులకు చేయుచున్నానో చెప్పెదను వినుము. ఈ నాట

కమును, ఈ యనుకరణను జరుపగా జరుపగా ఎప్పుడో ఒక ప్పుడు నాకు తెలియకుండగనే నాలో శ్రద్ధ ప్రవేశింపవచ్చు నని నా యాశ." కనుక క్రియలను నిష్కామముగ చేయు చుండవలె. రానురాను నిష్క్రియత్వముకూడ ప్రాప్తమగును.

104

సాధకునికి స్వధర్మమే పరిష్కార మార్గము

సారాంశ మేమనగా: రాజసకర్మలను పూర్తిగ వదలి వేయవలె, సాత్విక కర్మలను చేయుచుండవలెను. సహజ స్వాభావిక రూపమున ఎదుటికివచ్చు సాత్వికకర్మలు దోష యుతములైనప్పటికిని అవి త్యాజ్యములు కావను వివేకము మనలో నుండవలెను. దోషము లున్నచో ఉండనిండు. ఆ దోషములనుండి తప్పించుకొనగోరినచో అసంఖ్యాకము లైన ఇతరదోషములు వచ్చి పైబడును. చట్టిముక్కను ఉన్నట్లే యుండనిమ్ము. దానిని కోసి సుందరముగ చేయ యత్నించినచో, అది మరింత భయంకరమును వికృతమును కాగలదు. దానిని యథాస్థితముగానే ఉంచుట మంచిది. సాత్వికకర్మలు దోషయుతములైనప్పటికిని సహజప్రాప్తము లగుటచే వానిని వదలరాదు. వాని నాచరింపవలెను. కాని వాని ఫలమును మాత్రము వదలివేయవలెను.

మరియొకమాట చెప్పవలసియున్నది. సహజముగను, స్వాభావికముగను ప్రాప్తముకాని కర్మలు అవశ్యాచరణీయ

ములుగ నీకు కనిపించినను వానిని చేయరాదు. సహజముగ ప్రాప్తించిన కర్మలను మాత్రమే ఆచరింపుము. తొందరపడి పరుగులెత్తి ఇతర నూతన కర్మలను చేయవలె ననుజంజాటములో చిక్కుకొనకుము. ఎంత మంచివైనను పెనగులాడి చేయవలసిన కర్మలకు దూరముగ నుండుము. వాని మోహములో పడవలదు. సహజప్రాప్తమైన కర్మల ఫలమే త్యజింప బడగలదు. మానవుడు లోభమువలన 'ఈ కర్మ మంచిదే, ఆ కర్మయు మంచిదే' అని నలుదిశల పరుగిడుచో ఫలత్యాగ మెట్లు సంభవము? ఇందువలన జీవితమంతయు దుర్గతిపాలగును. ఫలాశచేతనే వాడు పరధర్మరూపమైన కర్మలను చేయగోరి ఫలమునుగూడకోల్పోవును. వానికి జీవితములో నెచ్చటను స్థిరత్వము లభింపదు. కర్మాసక్తి వాని మనస్సు నంటుకొని పోవును. సాత్వికకర్మల నాచరించెడుపట్లగూడ లోభము కలిగినచో ఆ లోభమునుకూడ దూరము చేయవలె. సమస్త సాత్వికకర్మలను చేయబూనినచో దానిలోకూడ రాజసము, తామసము వచ్చిపడును. అందువలన సాత్వికము, స్వాభావికము, సహజప్రాప్తము, స్వధర్మము అయిన కర్మలనే చేయుచుండుము.

స్వధర్మములో స్వదేశీయధర్మము, స్వజాతీయధర్మము, స్వకాలికధర్మము ఇమిడి యున్నవి. ఈ మూడును కలిసి స్వధర్మమగును. ఈ పని నా వృత్తికనుకూలమా, అనురూపమా, కర్తవ్యకర్మగా నాకు ప్రాప్తించినదా అను ప్రశ్నలను స్వధర్మమును నిశ్చయించుకొనువేళ ప్రతివ్యక్తియు ఎదుర్కొనవలసి యున్నది. నీలో "నీవు" అనునొక ప్రత్యేకత

యుండుట వలననే నీవు 'నీవు' అయితివి. ఇట్లే ప్రతి వ్యక్తి లోను తన ప్రత్యేక వ్యక్తిత్వ ముండును. మేక యొక్క వికాసము మేకయై యుండుటలోనే ఉన్నది. అది మేకగా నుండియే వికాసమును పొందవలెను. మేక తాను ఆవుగా కావలెనని కోరుకొనినచో అది సంభవ మగునా? తనకు సహజప్రాప్తమైన రూపమును, వృత్తిని మేక త్యజింపజాలదు. అట్లు కావలె నన్నచో ఈ శరీరమును వదలి తిరిగి అది గోవుగా జన్మించవలె. అది నూతనజన్మను పొంది నూతనధర్మమును స్వీకరింపవలె. కాని ఈ జన్మలో మాత్రము దానికి మేకగా నుండుటయే పవిత్రమైన ధర్మము. "ఎద్దు-కప్ప" కథ మనము విన్నదే కదా! కప్ప తన శరీరమును పెంచుకొనుటకు ఒక హద్దు కలదు. తాను ఎద్దంతకావలెనని ప్రయత్నించినచో అది చచ్చిపోవును. ఇంకొకరి రూపమును అనుకరించుట ఉచితము కాదు. ఇందువలననే పరధర్మము భయావహమని చెప్పబడినది.

స్వధర్మములో ఇంకను రెండుభాగములున్నవి. మార్పుచెందున దొకటి, మారనిది యొకటి. నేడు నే నేదై యున్నానో రేపు అది కాను. రేపేదో ఎల్లుండి అదికాను. నేను నిరంతరమును మార్పు చెందుచుందును. పైరుగుచుండుటయే బాల్యావస్థయొక్క స్వధర్మము. యౌవనములో కర్మశక్తి పుష్కలముగ నుండును. అందువలన తద్ద్వారా సమాజసేవ చేయుదును. ప్రౌఢావస్థలో నేను పొందిన జ్ఞానలాభము ఇతరులకు కూడ లభించును. ఇట్లు స్వధర్మములో నొక భాగము మార్పుచెందుచుండును. మరియొక భాగము ఏ మాత్రమును

మార్పుచెందదు. వీనిని శాస్త్రీయ పరిభాషలో వర్ణధర్మము, ఆశ్రమధర్మము అని యందుము. మూలనిది వర్ణధర్మము, మార్పుచెందునది ఆశ్రమధర్మము.

ఆశ్రమధర్మములుమారుట యనగా బ్రహ్మచర్యా వస్థనువదలి గృహస్థాశ్రమములో ప్రవేశించుట; గృహస్థాశ్రమమునుండి వానప్రస్థములోను, వానప్రస్థమునుండి సన్యాసములోను ప్రవేశించుట. ఇట్లు ఆశ్రమధర్మములు మారుచున్నను వర్ణధర్మములు మార్పుచెందనేరవు. మానవుడు తనకు నైసర్గికములగు హద్దులను దాటజాలడు. అట్టి ప్రయత్నమే కృత్రిమమైనది. నీది యనదగు వ్యక్తిత్వమును నీవు వదలలేవు. ఇదే వర్ణధర్మమునకు మూలాది. వర్ణధర్మముయొక్క భావన చాల మధురమైనది. అట్లని వర్ణధర్మమున కేమియు చలనము లేదా ? మేకలోని మేకతనము, గోవులోని గోవు తనమువంటిదేనా బ్రాహ్మణుని బ్రాహ్మణత్వము, క్షత్రియుని క్షత్రియత్వము ? అని కొందరు ప్రశ్నింతురు. వర్ణధర్మమింత గట్టిపారినది కాదు. కాని యిందలి స్వారస్యమును మనము గమనింపవలెను. సమాజవ్యవస్థా నిర్మాణమునకు వర్ణధర్మమును ప్రయోగించుపట్ల కొన్ని తగ్గింపులుండక తప్పదు. అట్టి తగ్గింపులను స్వీకరింపవలసియే యుండును. గీతకూడ వీనిని ఆమోదించును. ఈ రెండు విధములగు ధర్మములను మనము గుర్తింపవలెను. అవాంతరముగవచ్చు ఇతరధర్మములు ఎంత సుందరముగను, మోహజనకముగను భాసించినను వానిలో చిక్కుకొనరాదు.

105

ఫలత్యాగమువలన గల్గు ఫలితార్థముల సముదాయము

ఫలత్యాగముయొక్క భావనను విపులీకరిపంగా ఈ క్రింది ముఖ్యవిషయములు తేలుచున్నవి :

(౧) రాజసతామసకర్మల సంపూర్ణ త్యాగము.

(౨) ఆ త్యాగమువలన కలుగు ఫలమునుకూడ త్యజించుట; అనగా ఆ త్యాగమునుగూర్చిన అహంకారము కూడ లేకుండుట.

(3) సాత్వికకర్మలను త్యజింపకుండ వాని ఫలములనుమాత్రమే త్యజించుట.

(౪) సాత్వికకర్మలు దోషయుతములైనను వానిని ఫలత్యాగపూర్వకముగ ఆచరించుట.

(౫) ఫలత్యాగపూర్వకముగ ఆ సాత్విక కర్మలను నిరంతరమును ఆచరించుచుండుటవలన చిత్తశుద్ధి కలుగుచుండును. తీవ్రమునుండి సౌమ్యము, సౌమ్యమునుండి సూక్ష్మము, సూక్ష్మమునుండి శూన్యము – ఇట్లు క్రియలయొక్క స్వరూపము లుప్తమగుచుండును.

(౬) క్రియలు లుప్తమయినను లోకసంగ్రహ రూపమైన క్రియలు జరుగుచునే యుండును.

(౭) సహజప్రాప్తములగుసాత్వికకర్మలనే చేయవలెను. సహజప్రాప్తములు కానివి ఎంతమంచివైనను వానికిదూరముననే యుండవలె. అట్టి కర్మలయెడ మోహము ఉండరాదు.

(౮) సహజప్రాప్తమైన స్వధర్మముకూడ రెండు విధములుగ నుండును – మార్పు చెందునది, మార్పు చెందనిది. వర్ణధర్మము మార్పు చెందదు. కాని ఆశ్రమధర్మము మారుచుండును. మార్పుచెందు స్వధర్మము మారుచునే యుండవలె. దానివలన ప్రకృతి పరిశుద్ధమగుచుండును.

ప్రకృతిప్రవాహము నిరంతరమును సాగుచునే యుండవలె. నది ప్రవహింపనిచో దానినుండి దుర్గంధము బయలు దేరును. ఆశ్రమధర్మము యొక్క స్థితియు ఇంతే! మనుష్యునకు మొదట లభించునది కుటుంబము. అతడు తన వికాసము కొరకు తన్ను కుటుంబముయొక్క బంధనలతో బంధించుకొనును అతడిక్కడ వివిధములైనఅనుభవములనుపొందును. కాని అతడు కుటుంబియైన పిమ్మట కుటుంబమునందే చిక్కుకొని పోయినచో వినాశము నొందును. మొదట ధర్మయుత మైన కుటుంబ జీవనమే ఇప్పుడు అధర్మరూపమును పొందును. ఎందువలననగా ఇప్పుడా కుటుంబధర్మము బంధన కారణమైనది. మార్పుచెందెడు ధర్మమును ఆసక్తిచే వదలనియెడల దాని పరిణామము భయానక మగును. మంచిపనులయెడల కూడ ఆసక్తి పనికిరాదు. ఆసక్తివలన ఘోరమైన అనర్థము వాటిల్లును. తుయకీటాణువులు పొరపాటున నైనను ఊపిరితిత్తులలో ప్రవేశించినచో అవి లోపలినుండి జీవితమును తినివేయును. ఆ విధముననే ఆసక్తియను కీటాణువులుకూడ మన యజాగ్రత్తవలన సాత్విక కర్మలలో ప్రవేశించెనేని వానివలన స్వధర్మము క్రుళ్ళ నారంభించును. ఆ సాత్విక స్వధర్మములందు

గూడ రాజసతామస దుర్గంధము బయలుదేరును. అందు వలన మార్పు జెందు ఈ కుటుంబ స్వధర్మము సమయోచిత ముగ వదలిపోవలెను. రాష్ట్ర ధర్మమునకు గూడ ఇదే వర్తించును. రాష్ట్రధర్మమునందుగూడ ఆసక్తి పొడచూపి స్వరాష్ట్రహితమునే మనము కోరుకొన్నచో, అట్టి రాష్ట్రభక్తి చాల భయంకర రూపమును దాల్చును. దీనివలన ఆత్మవికాసము ఆగిపోవును. చిత్తమునందు ఆసక్తి స్థిరపడి జీవితము అధఃపతనము నొందును.

106

సాధనయొక్క తుదిమెట్టే సిద్ధి

సారాంశము : జీవితమును సఫలముచేసికొనదలచినచో ఫలత్యాగమను చింతామణిని చేపట్టుము. అది నీకు మార్గ దర్శకమగును. ఈ ఫలత్యాగ తత్త్వము తన హద్దులనుకూడ అదే సూచించును. మన మీ దీపపువెలుగులో నున్నందు వలన ఏ కర్మలు చేయవలెను, ఏవి మానవలెను, ఏవి యెప్పుడు మార్పుచేయవలె నను విషయము దానియంతట నదే మనకు విదితమగుచుండును. అప్పుడు మరియొక విషయ మును యోజింపవలసియున్నది. క్రియలు సంపూర్ణముగ లోపించెడు అంతిమ స్థితివిషయమై సాధకుడు యోజింపవలెనా లేదా ? క్రియలేమియు చేయకున్నను, జ్ఞానివలన అసంఖ్యా

కములగు కర్మలు జరుగుచుండును. కాన సాధకు డీ స్థితిని తన లక్ష్యమునందుంచుకొనవలెనా ?

అక్కరలేదు; ఇక్కడకూడ ఫలత్యాగ మను ఒరపిడి రాతినే ఉపయోగింపుము. కావలసిన వస్తువుపై మనదృష్టిని పెట్టుకొనకపోయినను మన కది లభించుచుండును. మానవ జీవితములోనున్న సౌందర్య మిదియే. మోక్షమే జీవితమునకు సర్వోత్కృష్టమైన ఫలము. మోక్షమన ఈ యకర్మావస్థను గూర్చికూడ మనకు లోభములేకుండుట. మనకు తెలియకుండగనే ఆ స్థితి దానియంతట నదే లభించును. సరిగా రెండుగంటల అయిదునిమిషములకు ఆకస్మికముగ వచ్చి పైబడు వస్తువుకాదు సంన్యాసము. అది యంత్రముపై తయారయి వచ్చు వస్తువుకాదు. నీ జీవితములో సంన్యాస మెట్లు వికాసమును పొందుచున్నదియుగూడ నీవు తెలిసికొనలేవు. కనుక మోక్షచింతను విడనాడుము.

"నీపై నాకు భక్తికుదిరిన చాలును. మోక్ష మను అంతిమఫలము నాకక్కరలేదు" అని భక్తు డెల్లపుడును భగవంతునితో ననుచుండును. ముక్తికూడ నొకవిధమైన భక్తియే. మోక్ష మొకరకమైన భోగమే. ఒకఫలమే. ఈ మోక్ష మను ఫలముపైకూడ ఫలత్యాగ మను కత్తెరను నడుపుము. ఇందువలన మోక్షము లభించకపోదు. కత్తెరయే విరిగిపోవును. ఫలము మరింత దృఢతరమగును. మోక్షమును గూర్చిన ఆశను వీడినంతనే, తెలియకుండ నీవు మోక్షము వైపునకు సాగిపోదువు. మోక్షమును తలపునకైన రానీయక

సాధనయందే నిమగ్నుడవు కమ్ము. అప్పుడు వెదకుకొనుచు మోక్షము నీ యెమటికివచ్చి నిలుచును. సాధకుడు తన సాధనలోనే తన్మయుడై యుండవలె.

"మా తే సంగోఽస్త్వకర్మణి"

అకర్మస్థితిని, అనగా మోక్షమునుగూర్చిన ఆసక్తిని పెట్టుకొనవలదని భగవంతుడు మొదటనే చెప్పియున్నాడు.

"అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" అని భగవానుడు ఇప్పుడు చివరకు తిరిగి చెప్పుచున్నాడు. "నేను మోక్షము నీయగల సమర్థుడను. దానిని గూర్చిన చింత నీకు వలదు. నీ సాధనను గూర్చి మాత్రమే జాగరూకుడవగుము".

మోక్షమును విస్మరించుటవలన సాధన ఉత్కృష్ట మగును. అప్పుడు మోక్షమే నిన్ను వరించి నీ చెంతకు వచ్చును. మోక్షమునెడల నిరపేక్షవృత్తి గల్గి తన సాధన యందే నిమగ్నుడగువాని కంఠమున మోక్షలక్ష్మి జయమాల వేయును.

సాధన తుదిమెట్టునకు చేరినచోట సిద్ధి చేతులుజోడించి ప్రత్యక్షమగును. ఇల్లు చేరవలసినవాడు ఏ చెట్టుక్రిందనో నిలిచి ఇల్లు, ఇల్లని జపముచేసిన ఇంటిని సమీపించడు సరికదా, అత డాయడవిలోనే యుండిపోవు దుస్థితి కలుగును. ఇంటిని స్మరించుకొనుచు మార్గమునందే విశ్రాంతి తీసికొన్నచో అంతిమ విశ్రాంతి స్థానము నతడు చేరనేరడు. విరామము

లేకుండ నడచిపోయినచో అంతలో ఇల్లు చేరగలడు. మోక్ష మునుగూర్చి ఊరక స్మరించుచుండుటచే మానవుని సాధనలో శిథిలత ప్రవేశించి మోక్షము దూరమైపోవును. మోక్షమును గూర్చి ఉపేక్ష వహించి నిరంతర సాధనలో నిమగ్నుడై యుండుటయే మోక్షమును దగ్గరకు తెచ్చుకొను ఉపాయము. అకర్మస్థితిని అనగా విశ్రాంతినిగూర్చిన లోభమునుమాత్రము పెట్టుకొనకుము. సాధనన్నప్రేమతో సాగించినవుడే మోక్షమున్నీ యొద్దకిటికి రాగలదు. 'ప్రత్యుత్తరము, ప్రత్యుత్తరము' అని కేకలుపెట్టినమాత్రమున ప్రశ్నకు సమాధానము రానేరదు. ప్రత్యుత్తర మిచ్చు పద్ధతి తెలిసినప్పుడే సరియగు జవాబు లభించగలదు. ప్రత్యుత్తరమిచ్చు పద్ధతిని అవగతము చేసి కొనుటలోనేసమాధానమిమిడియున్నది. సమాప్తికి పూర్వమే సమాప్తి యెట్లు సంభవము? విషయమును గ్రహించక పూర్వమే ప్రత్యుత్తరమెట్లు రాగలదు? సాధకావస్థలో సిద్ధావస్థ యెట్లు ప్రాప్తించును? నీటిలోతు ముకలు వేయు చునే, ఒడ్డెక్కిన తరువాత పొందు ఆనందమును గూర్చి ధ్యానము చేసినచో ప్రయోజన మేమున్నది? నీటిలోనున్న పుడు బారలుచేసి ఒడ్డునకుచేరు ప్రయత్నములోనే శక్తినెల్లను కడు శ్రద్ధతోవినియోగింపవలెను. మొదట సాధనను పూర్తి చేయుము. సముద్రమును లంఘించుము. తరువాత మోక్షము దానియంతట నదే తప్పక లభించును. ✓

107

సిద్ధపురుషునియొక్క త్రివిధ భూమిక

జ్ఞానియొక్క అంతిమావస్థలో క్రియలన్నియు లుప్తమై శూన్యరూపమును పొందును. అంతిమస్థితియందు క్రియలుండనేయుండవని దీనియర్థముకాదు. అతనిద్వారా క్రియలు జరుగుచును ఉండును, జరుగకయునుపోవును. ఈ యంతిమస్థితి అత్యంత రమణీయము, ఉదాత్తము. ఈ స్థితియం దేమి జరిగినను దానినిగూర్చిన చింత అతనికుండదు. జరుగునదంతయు శుభకరము, సుందరము అగును. ఇదిసాధనయొక్క తుదిమెట్టు. ఇక్కడసాధకుడు అన్నియు చేయుచునే ఏమియు చేయనివాడగును. సంహారము చేసినను చేసినవాడుకాడు. కల్యాణమును చేకూర్చియు చేకూర్చినవాడుకాడు.

ఈ మోక్షావస్థయే సాధకుని సాధనకు తుదిమెట్టు. సాధనకుతుదిమెట్టు అనగా సాధనయొక్కసహజావస్థ. అపుడు 'నేనేదో చేయుచున్నా' నను భావనకూడ ఉండదు. ఇది సాధనయొక్క నైతికస్థితియని నేనందును. సిద్ధావస్థ నైతికావస్థకాదు. చిన్నకుఱ్ఱవాడు సత్యము పలుకును. కాని యది నైతికకార్య మనబడదు. ఏలయన అసత్యమననేమో వాడెరుగనే యెరుగడు. అసత్యమననేమో తెలిసినతరువాత కూడ సత్యము పలికినచో అది నైతికకర్మ యగును. సిద్ధావస్థలో అసత్యములేనేలేదు. అక్కడనున్నది సత్యమొక్కటే. అందువలన అక్కడ నీతియను ప్రశ్నలేదు. నిషిద్ధవిషయములక్కడ నిలువనేలేవు, వినినిచ్చగింపనిమాటలు చెవికెక్కనే

యెక్కువు. చూడగోరని దృశ్యములను కన్ను చూడనే చూడదు. చేయదగిన పనులనే చేతులు చేయుచుండును. ఇందులకు ప్రయత్నింపవలసినపనియే యుండదు. చేయరాని పనులు వానియంతట నవే తొలగిపోవును. పనిగట్టుకొని వానిని వదలనక్కరలేదు. ఇదే నీతిశూన్యావస్థ. సాధనకు తుదిమెట్టయిన ఈ సహజావస్థ-లేక-అనైతికత - లేక - అతి నైతికతలోనే ఉత్కృష్టమగు నైతిక మహత్త్వమున్నది. నాకు స్ఫురించిన 'అతినైతికత'అను నీ శబ్దము చాల బాగుగా నున్నది. ఈ స్థితిని సత్త్వగుణాతీతమైన సాత్త్వికసాధన యని అనవచ్చును.

ఈ దశ నెట్లు వర్ణింపగలము? గ్రహణమునకుపూర్వము దాని ప్రభావము కనబడినట్లే మరణానంతరము లభించెడు మోక్షస్థితియొక్క నీడ దేహము రాలిపోకమునుపే గోచరింప నారంభించును. దేహధారిగ నుండగనే రానున్న మోక్షస్థితి యొక్క అనుభవము కలుగును. ఈ స్థితిని భాష వర్ణింప జాలదు. ఈ స్థితియందున్నవాడు ఎంత హింస చేసినను ఏమియు హింస చేసినవాడుకాడు. వాని క్రియలకు విలువ నెట్లు కట్టగలము ? అతనిద్వారా జరుగు పనులన్నియు సాత్త్వికకర్మలే. క్రియలన్నియు ఉడిగమైపోయిన పిమ్మటకూడ అతడు విశ్వకల్యాణమును చేకూర్చును. వీనిని మాటలతో నెట్లు వర్ణింపవలెనో తెలియుటలేదు.

ఈ యంతిమావస్థలో మూడుభావము లున్నవి. (౧) వామదేవుని దశ: 'ఈ విశ్వమం దున్న దంతయు నేనే'యని

అతడు భావోద్రేకముతో ప్రకటించెను. జ్ఞాని నిరహంకారుడుగ నుండును. అతనికి దేహాభిమాన మంతయు నశించును. క్రియలన్నియు లయమగును. ఇట్టి తరి అతనికి ఒక విధమగు భావావస్థ సంప్రాప్తమగును. ఆ స్థితి ఒక్క శరీరములో ఇముడ నేరదు. ఈ భావావస్థ క్రియావస్థకాదు. ఇది ప్రబలమగు భావనతో కూడిన యవస్థ. ఇది కొంతవరకు మన అనుభవ ములో నున్నదే. కుమారుని దోషములవలన తల్లి దుష్టయు, వాని సద్గుణములచేత గుణవతియు, వాని దుఃఖముల వలన దుఃఖవతియు, వాని సుఖమువలన సౌఖ్యవతియు అగుచున్నది. కాని తల్లియొక్క భావావస్థ తన సంతానమును మించిపోదు. బిడ్డలయొక్క దోషములను ఆమె తన దోషములుగ స్వీకరించును. అట్లే జ్ఞానికూడ భావనోత్కృష్టత వలన ప్రపంచము లోని దోషములన్నిటిని తనపై వేసికొనును.

జ్ఞాని త్రిలోకముల పాపములవలన తాను పాపిగను, పుణ్యములవలన పుణ్యవంతుడుగను అగుచుండును. అట్లయినను ఆ పాపపుణ్యము లతనిని స్పృశింపనేరవు. రుద్రసూత్రము నందు ఋషి—

"యవాశ్చమే, తిలాశ్చమే, గోధూమాశ్చమే"

అని యనును. "నాకు యవలనిమ్ము, నువ్వులనిమ్ము, గోధుమలనిమ్ము" ఇట్లడుగుచున్న ఋషియొక్క పొట్ట ఎంత పెద్ద దయియుండవలె! కాని యిట్లడుగు ఋషి మూడున్నర మూరల శరీరధారియేకాడు. అతని యాత్మ విశ్వాకారమును దాల్చి వెలుకుచున్నది. దీనిని వైదిక విశ్వాత్మభావమని

నే నందును. వేదములలో ఈ భావనకు చాల విశిష్టతకలదు. నరసీమెహతా యను గుజరాతి మహాపురుషుడు "భాపజీ పాపమే కవణ కీధా హశే, నామలేతా తారూం నిద్రా ఆవే" అని కీర్తించును. 'ఓ యీశ్వరా, నిన్ను కీర్తించు సమయ మునకూడ నిద్రవచ్చుపాటి పాపము నేనేమిచేసితిని ?' నిద్ర వచ్చినది నరసీమెహతాకా ? కాదు, శ్రోతలకు. కాని నరసీ మెహతా శ్రోతలతో ఏకరూపమై అట్లడిగెను. జ్ఞానియొక్క భావావస్థ యిట్లుండును. ఈ భావావస్థలో సకల పాపపుణ్య ములు ఆతనిద్వారా జరుగుచున్నట్లు గోచరించును. ఈ విష యమునే అతడుస్వానుభవముగ చెప్పుచుండును. "చేయరాని కార్యము లెన్నో చేసితిని, చేయుచున్నాను, చేయుదును" అని ఋషి యనలేదా ? ఈ భావావస్థ లభించినమీదట ఆత్మ పక్షివలె ఎగురనారంభించును. అది ఈ మృచ్ఛరీరమునుదాటి పైకిపోవును.

ఈ భావావస్థవలెనే జ్ఞానికొక క్రియావస్థకూడనున్నది. జ్ఞాని తన స్వభావమునుబట్టి ఏమి చేయును ? అతడు చేయు పనులన్నియు సాత్వికములే ! అతడు శరీరముచే బంధింపబడి యున్నను అతని శరీరము, ఇంద్రియములు అన్నియు సాత్వి కములయినవి. అందువలన అతడుచేయు క్రియలన్నియు సాత్వికములే ! వ్యవహారికముగ చూచినచో సాత్వికత యొక్క తుదిమెట్టు అతని అనుష్ఠానములో గోచరించును. కాని విశ్వాత్మ భావముతో చూచినచో త్రిభువనముల పాప పుణ్యములు అతడాచరించుచున్నట్లును, అట్లయ్యు నిర్లిప్త డయి యున్నట్లును కనబడును. ఏలయన ఆత్మను అంటు

కొనియున్న శరీరమును అతడు విదిల్చిపారవేసెను. క్షుద్ర దేహమునట్లు పారవేసిన మీదటనే అతడు విశ్వరూపమును దాల్చును.

జ్ఞానికి భావావస్థ క్రియావస్థ కాక జ్ఞానావస్థ యను మూడవస్థితికూడ కలదు. ఈస్థితిలో అతడు పాపమును సహింపలేడు. పుణ్యమును సహింపలేడు. రెంటిని విదిల్చి పారవేయును. విశ్వమునకెల్ల నిష్ముట్టించి తగులబెట్టుటకు సమర్థుడగును. ఏ యొకపనికిని బాధ్యత వహించుట కతడు సంసిద్ధుడుకాడు. దాని స్పర్శయే అతడు సహింపలేడు. జ్ఞాని యొక్క మోక్షదశలో అనగా సాధనయొక్క చరమస్థితిలో పైమూడు స్థితులును సంభవించును.

ఈ 'నిష్క్రియావస్థ, అనగా అంతిమదశ ఎట్లు ప్రాప్తించగలదు ? మనముచేయు కర్మలయొక్క కర్తృత్వ మును మనపై వేసికొనకుండుటను అభ్యసింపవలెను. "నేను కేవలము నిమిత్తమాత్రుడను, కర్మలయొక్క కర్తృత్వము నాదికాదు" అని మననము చేయుచుండుము. మొదట ఈ 'అకర్తృత్వ' వాదముయొక్క భూమికను నమ్రతతో గ్రహింపుము. కాని అంతమాత్రముచేత కర్తృత్వము సంపూర్ణముగ తొలగిపోవునని తలంపకుము. మెల్లమెల్లగ ఈ భావన వికాసమును పొందును. "నే నతితుచ్ఛ ప్రాణిని. నే నీశ్వరుని చేతిలోని ఆటవస్తువును. కొయ్యబొమ్మను. అతడు నన్నాడించుచున్నాడు." అను అనుభవమును మొదట పొందుము. అటుపిమ్మట చేయబడు కార్యములన్నియు శరీర

నుండుట చేతనే జరుగుచున్నవని భావింప ప్రయత్నింపుము. 'వానితో నా కేమియు నిమిత్తములేదు. ఆక్రియలన్నియు ఈ శవమునకు (బొందికి) సంబంధించినవి. కాని, నే నీశవమను కాను. నేను శివుడను' అని భావింపుము. దేహమును తొడు గుచే లేశమాత్రమును బంధింపబడకుము. ఇట్టి సాధన చేసిన మీదట దేహముతో నెట్టి సంబంధమును లేనిస్థితి జ్ఞానికి లభించును. ఆ దశయందు పై మూడవస్థలును అతనికి కలు గును. "త్రిలోకములలోని పాపపుణ్యములను నేను చేయు చున్నను వాని స్పర్శ లేశమాత్రమును నా కంటదు" అనెడు భావావస్థ మొదటిది. అత్యంత నిర్మలములు, ఆదర్శప్రాయ ములు నగు క్రియలు జరుగు క్రియావస్థ రెండవది. కర్మలను లేశమాత్రమును దగ్గరకు చేరనీయక వాని నన్నిటిని భస్మ మొనరించివేయుజ్ఞానావస్థమూడవది. ఈ మూడవస్థలద్వారా జ్ఞానిని వర్ణింపవచ్చును.

108

తుహీ....తుహీ....తుహీ....తుహీ
నీవే..... నీవే.... నీవే..... నీవే

భగవంతు డర్జునునితో ఇంతవరకు చెప్పి, "అర్జునా, నేను నీకు చెప్పినదంతయు శ్రద్ధతో వింటివికదా! ఇక బాగుగ యోజించి నీ కుచితమని తోచినరీతిని చేయుము" అనెను. ఈ విధముగ భగవంతుడు ఔదార్యముతో అర్జును

నకు స్వేచ్ఛ నొసగెను. భగవద్గీతలోని విశిష్టత ఇదియే. కాని భగవంతునికి మరల దయకలిగెను. అర్జునుని కీయబడిన ఇచ్ఛా స్వాతంత్ర్యమును భగవంతుడు తిరిగి తీసికొని యిట్లనెను. "అర్జునా! నీయిచ్ఛను, నీ సాధనను అన్నిటిని వదలి నీవు తదేక నిష్ఠతో నా శరణు పొందుము" ఇట్లు తన శరణు పొందుమని ప్రేరణనుకలిగించి భగవంతుడు తానిచ్చిన ఇచ్ఛాస్వాతంత్ర్యమును తిరిగి తీసికొనెను. దాని భావార్థ మిది. "నీ మనసునం దెట్టి స్వాతంత్ర్యేచ్ఛయును కలిగియుండ కుము. 'నా యిచ్ఛకాదు, అతని యిచ్ఛయే జరుగుగాక' అని యనుకొనుము. 'ఈ స్వాతంత్ర్యము నాకు అక్కరలేదు'అని నీకై నీవు అనుభవమునకు తెచ్చుకొనుము. 'నేను లేను; అంతయునీవే' అను స్థితిని పొందుము". మేక బ్రతికియుండగా 'మేఁ మేఁ మేఁ – అనగా – నేను, నేను, నేను అనును. కాని అది చనిపోయిన పిమ్మట దాని వెన్నెముకనుండి తీసిన నర మును దూదినేకు కమానునకు కట్టినప్పుడు అది 'తుహీ' తుహీ, తుహీ – తూహీ, తూహీ, తూహీ, అని పలుకునని దాదూకవి చెప్పెను. ఇప్పుడంతయు 'తూహీ, తూహీ, తూహీ' – నీవే! నీవే! నీవే!

భారతీ ప్రెస్, తెనాలి — 1955.

చర్చలు - ఉదాహరణములు

(ఇందలి ఆగబిక్ అంకెలు అధ్యాయములను, తెలుగంకెలు పుటలను సూచించును)

అ

అంధపంగు న్యాయము 14-౩౨౭
అంధశ్రద్ధపోయి దానిస్థానేఅంధ అశ్రద్ధ ప్రవేశింప రాదు 17-౪౩౨
అకర్మ 4-౭౦-౭౪,10-౨౦౯కర్మా చరణకుఆవశ్యమైనశక్తి 5-౮౯; కర్మతో నిండియుండు 5-౯౦
అక్రోటుచెట్టునాటుట-ఫలవాసన చిత్తమున కంటనంత బాగుగా కర్మ చేయుట 9-౧౮౭
అగ్నిమండుచున్నదనిన అర్థమేమి 8-౧౭౪
అగ్నిజ్వాలలు-సూర్యుడు-జీవాత్మ పరమాత్మ 10-౨౩౨
అజామిళుని కథ 8-౧౬౭
అజ్ఞానము-త్యంతవ్యము సోక్రటీసు 16-౩౮౭ పాపము భగవంతుడు 16-౩౮౭
అతిసైతికత-నీతిశూన్యావస్థ 18-౪౬౧
అద్దము-కర్మ మనస్వరూపమునుపట్టి చూపు అద్దమువంటిది 5-౭౮
అద్వైత భక్తుడు 12-౨౬౧
అనుమంత 13-౩౧౦
అపాత్రుడు - పవిత్ర భావనలచే పవిత్రుడు 9-౧౯౬
అభిషేకము-(శివునికి)మెల్లమెల్లగా చేయుము 8-౧౬౯-౭౦
అమావాస్యనాటిరాత్రి 15-౩౬౫
అమృత ధారయొక్క మాధుర్యమును గ్రహించినవానికి గులాబి మర్చత్తుపై ఆసక్తియుండదు 7-౧౪౦
అరటిపండ్లు - రంగువేసిన కొయ్య పండ్లు 7-౧౪౦ అమ్మిమిరెప కాయలు తినుట 2-౩౫
అర్ధనిమీలిత నేత్రములు-ఏకాగ్రత 6-౧౧౯
అర్థాపత్తి 7-౧౫౩
అర్జునుడు - శబ్దమునకే బుజువైన వాడని యర్థము 1-౧౫స్త్రీలు-దారిదోపిడి-ఆతని నిస్సహాయత (సగుణోపాసనయొక్క అవశ్యకము) 12-౨౮౧
ఆల్బరిఅపుటకు-సిపాయి సామాన్య యోగ్యతకలవాడు - విశేష యోగ్యతకలవాడు 18-౪౪౮
అశ్వత్థామ-పిండిపాలు 7-౧౪౪

అసలైన రైతు 2-38
అహింస-వసిష్ఠ విశ్వామిత్రుల ప్రయోగము 16-360 పరశురాముని ప్రయోగము16-387
అక్షరమును లావుగాదిద్దుమని చెప్పబడిన బాలుడు బలపమును అడ్డముగా త్రిప్పి దిద్దును. సాధనలయొక్క నిత్యనవీనత వలన సేవలో ఉత్సాహము పెరుగును 15-3ఓఓ

ఆ

ఆంగ్లకవి వర్డ్స్‌వర్త్ - కోయిల 10-338
ఆకలి గొన్నవారె రుద్రావతారములు 10-3౧౩
ఆకాశము-తాను చేయుచున్న పని తానే ఎరుగకుండుట 5-73
ఆకాశముయొక్క కృపయనగానేమి 8-౧౭౫
ఆత్మ-అఖండత్వము, దేహము క్షుద్రత్వము 2-33 ఇంద్రగోపము 11-3౪౭ జ్ఞానశక్తి మన అమూల్యమైన మూలధనము 6-౧౧౭ మాధుర్యము వలననే తీయనివస్తువులకు తీపి కలిగినది (హనుమంతుడు - ముత్యాలహారము) 6-౧33 పరీక్షణద్వారా చిత్తమాలిన్యమును కడిగివేయవలెను 4-ఓ3 అఖండ నదీప్రవాహము2-3౫ ముక్తానందము 2-30
ఆత్మవుసీవు-శరీరమవు నీవు. కాదు 2-3౪ నాశరహితమైన ఫలమేదో - ఆలోపలిసారమేదో అది నీవు 13-305
ఆత్మశక్తిని క్షుద్రవిషయములలో ఖర్చుపెట్టరాదు 6-౧౧౭
ఆత్మజ్ఞానములేనివాడు బాహ్యసాధనపై ఆధారపడియుండును 7-౧౪ఓ
ఆత్మజ్ఞానము కలుగనంతవరకు రజస్తమోగుణముల వలన ప్రమాదములకలదు 14-3౫౧
ఆనందము - పొడుము, చుట్ట, సిగరెట్టు-క్షణికము 7-౧౪3
ఆయుర్వేదములో కఫ, వాతపిత్తములు-ప్రకృతిలో సత్వ రజస్తమములు 14-3౨3
ఆర్తభక్తుడు 7-౧౫౨
ఆరింద్రియముల వాడు మంగళగ్రహమునుండి దిగిన చో 7-౧౪3
ఆశ్రమధర్మములు మారుచున్నను వర్ణధర్మములు మారవు 18-౪౫3
ఆసక్తి ఇంటిలోనున్నను అడవియందున్నను మనల నంటియే యుండును 5-2ఓ

ఇ

ఇంజనీరు రోడ్డుయొక్క యెత్తును కొలది కొలదిగ పెంచుచు మనలను ఎత్తై న శిఖరమునకు చేర్చును–రాజమార్గమయొక్క ప్రాశస్త్యము నిట్టిదే 9-౧౧౩
ఇంద్రగోపము-ఆత్మ 11-౩౪౭
ఇంద్రాయ తక్షకాయ స్వాహా 18-౪౪౪
ఇంద్రియములు మారకములా తారకములా?—సాధకుని దృష్టి 12-౩౬౪ చాపల్యము ఉండరాదు 6-౧౩౪ సాధన మాత్రములే! వానిని ఈశ్వరార్పణ చేయుము 9-౧౯౦ పరమేశ్వరుని కర్పించు పుష్పములు 12-౩౬౫

ఈ

ఈ దేహము నాకు సాధనమని నమ్మినపుడే నాలోసంస్కరణ రాగలదు ఉదా. రాట్నము 13-౩౯౫
ఈ మట్టిబొమ్మనుకూడ కొంచెము కాలనిమ్ము-విశ్వనాథ 15-౩౬౭
ఈసపు నీతికథలు 10-౩౩౫
"ఈ" సిద్ధాంతము 2-౩౭-౩౪
ఈశ్వరనామము ముందర పాపము నిలువజాలదు 9-౩౦౫
ఈశ్వరుడు త్రికాలములయందు, త్రిలోకములందు వ్యాపించుటయే బాగుగానున్నది 11-౩౪౪
ఈశ్వరున కర్పించుపనులు నాటిన గింజలవంటివి 9-౩౦౭
ఈశ్వరుని ఒకడు కర్మద్వారమునను, ఒకడు హృదయద్వారమునను, ఒకడు బుద్ధిద్వారమునను సమీపించును. 7-౧౫౩

ఉ

ఉత్తర ధ్రువము నన్వేషించుట .....జిజ్ఞాసువు 7-౧౫౩-3
ఉత్తరాయణమనగానేమి?8-౧౭౫
ఉత్కృష్ట బ్రహ్మచారివైనచో .....నీ ఆచార వ్యవహారములలోనే నీ బ్రహ్మచర్యమును చూపించుము..... చందన సుగంధమును వెద చల్లుము 3-౫౪
"ఉద్ధరేదాత్మనాత్మానమ్" 6-౧౧౧
ఉద్ధవుని భక్తి — కృష్ణుని తుది సలహా (సగుణమునుండి - నిర్గుణము వైపునకు) 12-౩౪౦
ఉపద్రష్ట 13-౩౦౯
ఉపవాసమనిన భగవంతుని సమీపమున కూర్చుండుట. భగవచ్చింతన చేయవలసిన సమయమున

భోజన పదార్థముల చింతన చేయు చుండినచో అది మహా భయంకర భోజన మగును 4-౬౭

"ఉపవాసము చేయునపుడు ఉపవాసముయొక్క బడలిక నీ ముఖములో కనబడరాదు. ..." ఏసుప్రభువు 15-౩౫౯

ఉప్పు కారమువలె నుండును... ఉప్పులోనున్న పరమాత్మయే కారములో కూడ నున్నాడు 11-౨౪౭

ఉపవస్సు 10-౨౧౯

ఋ

ఋషులు-ఉపవస్సువర్ణన 10-౨౧౯

ఋజువర్తనము, హరిపరాయణత్వము ఉన్నచోట విషాదము కూడ యోగమే 2-౧౭

ఎ

ఎద్దు - కప్ప 18-౪౫౨

ఎద్దు - - బండిని ఏగోతిలోనికో లాగి వేయుట - హృదయము లేని పనులవలన తుష్టియు, పుష్టియు లేదు 7-౧౪౦

ఎద్దు - విశ్వవ్యాప్త వృషభము - వామదేవుడు 9-౧౯౨

ఏ

ఏకాగ్రత - ఆలోచనా చక్రము - భావ్యచక్రము, అంతరిక చక్రము - మనశ్చక్రము యొక్క భ్రమణము (ఆగిపోవలె) 6-౧౧౭ సాయం సమయము మధురముగా నున్నచో ఆనాటి పనులన్నియు సఫలమైనట్లే ... 6-౧౩౦-౧

ఏకాగ్రత నిజమునకు ఆటవలె సహజమైన విషయము - చిత్త కల్లోలమే అసహజము 6-౧౩౦

ఏకనాథుడు 9-౧౯౬ మరణ మాసన్నమైన గృహస్థు 8-౧౬౦

ఏసుక్రీస్తు - బలిదానము - టాల్‌స్టాయి 3-౪౬-౪౭ దేహము నుండి ఆత్మను వేరుచేయుట 13-౩౧౭ ఈశ్వరరాజ్యమున ప్రవేశించుట కర్హులెవరు? 10-౨౧౭-౨ "ఉపవాసము చేసినట్లు బయటికి అగపడరాదు 15-౩౫౯

ఐ

ఐరోపాగాయకులు - వారిని వినోబా పరీక్షలో తప్పించుట 7-౧౪౪

ఒ

ఒకానొకడు ప్రపంచము అమంగళమని యెంచి చివరకు చనిపోవుటకు ప్రయత్నించుట... 18-౪౪౭

ఓ

ఓమ్ 17-౪౩౩

ఔ

ఔషధమువలెనే ఆహార నిద్రలు 6-౧౩౩

క

కథా – పురాణ్ – శ్రవణ్‌మేం మోతీనింద్ సదా ఆజాతీహై'': శూన్యాగ్రత, అనేకాగ్రత 6-౧౧౯

కన్యాదాత – వరుడు 9-౧౯౬

కబీరు–బట్టలనేత 9-౧౯౪ శరీర మను సుందరమైన దుప్పటిని 17-౪౧౩

కబూతర్ ఖానా – బొంబాయి 11-౨౪౯

కమలము – భారతీయ సంస్కృతి చిహ్నము (పవిత్రత, నిర్లిప్తత) 15-౩౫౬

కర్తవ్యనిష్ఠగలవాడు మోహగ్రస్తు డైనప్పుడు కూడ నగ్నరూప ములో కర్తవ్యచ్యుతుడగుటను సహింపలేడు 1-౮

కరెన్సీనోటు – వేయిరూపాయలు ఇమిడి యుండుట 5 – ౭౫

మొహరు 3–౪౭

కర్మ – ఈశ్వరుని ఆమోదముద్ర 17-౪౧౭, క్రియల వ్యర్థత్వ సము 18-౪౪౮; జ్ఞానమునకు నిప్పంటించు వత్తి 4-౬౯; యెడ లైతిక కర్తవ్యబుద్ధి 2-౩౩; నీవుద్రోధివి...'' 5-౭౮

కర్మకు బాహ్యఫలము లేహేతు – చిత్తశుద్ధి అత్యు 13-౨౯౧ సం కల్పించు పరమేశ్వరుడు 13-౩౧౪ తుషారకిమంగు 4-౬౮ కర్మను వికర్మతోచేసిన ..... ప్రేమలేని మనస్థితి – ఆకాశము వలె 5-౮౨ ఏదో దోషముండును 18-౪౪౨

కర్మయోగి – పనిచేయునది పట్టి కర్మాగారముగాక ఆధ్యాత్మిక శిక్షణాలయమగును 3-౫౬; సమాజమునకు ఆదర్శము 3-౫౬; సృష్టిలో 3-౫౨; పుట్టి పెరిగిన సమాజము 3-౫౪; మోసము నిర్మూలించు సాధకుడు 3-౫౭; ఉపాసన 3-౫౯; చిత్రకారుడు 2-౩౪; నైతు 2-౩౪; గోసేవ 3-౫౨; పర్వకుడు 3-౫౪; పరమేశ్వరుడు 3-౬౦

కర్మయోగి శ్రేష్ఠుడా? లేక కర్మ సంన్యాసి శ్రేష్ఠుడా? 5-౭౪

కర్మయోగము – వికర్మతాశపు చెవి 5-౮౨; కర్మసంన్యాసము 5-౭౫; కామక్రోధాదులు శత్రువులు 3-౬౧

కర్మతో అంతరిక భావము మిళిత మైన వుడు ఆకర్మయొక్క రూపమే మారిపోవును 4-౬౯
కఱువు కాలము - మెతుకు లు- ఆనందమునకు అంగలార్చు ప్రజలు 7-౧౪౨
కవులగానము - పక్షుల స్వాతంత్ర్యము 6-౧౨౬
కష్టము కలిగిన కంట నీరుపెట్టుదుము - కాని 10-౨౧౧
కల్యాణమార్గమున పోవువాని శ్రమ వ్యర్థము గాదు 6-౧౩౪
కాకి 10-౨౩౫; రాముని చౌల్యము 10-౨౩౫ క్రాన్మరు- ఆత్మత్యాగి 13-౩౦౫ కాని డబ్బు నది లో వేయుట
విమర్శ - సమాధానము 7-౧౫౦
కామక్రోధములు నశించిన ప్రపంచముగతి ఏమగునను కుశంక 16-౪౦౨
కార్తెల్-వీరపూజ 10-౨౩౬
కాలమేజల్లెడపట్టి చెడుగునుమంచినుండి వేరుచేయును 11-౨౫౦
కావ్యములో స్థూలవస్తువుల వర్ణన నూత్న వస్తువులద్వారా జరుగగా ధర్మగ్రంథములో నూత్న వస్తువులవర్ణన స్థూల వస్తువులద్వారా జరుగును 16-౩౮౩
కిట్టుమనుచెప్పలకు నూనెవేయుట చెప్పలపూజ 15-౩౭౧
కీటకమైనను (ఈశ్వరాభిముఖమగుచో)ఈశ్వరవిముఖులయిన పెద్దలకంటెనుగొప్పది 7-౧౪౯
క్రియావస్థ 18-౪౬౫
కుచేలుడు - అభిమంత్రితమైన పిడికెడు అటుకులు 3-౪౭
కుమ్మరి గోరా - మహాత్ముల పరీక్ష 3-౨౫
కుంతి - దూరస్థుడైన సూర్యుడు 10-౨౧౫
కృష్ణుడు- గోవర్ధనపూజ 9-౧౮౩; ఐతిహాసిక భ్రమ 1-౧౬; యుద్ధభూమిలో గుఱ్ఱములకు దాణాపెట్టుట - రాజనీతియములో ఎంగిలి విస్తళ్లు ఎత్తుట 3-౨౨-౬౦
కృష్ణార్పణమస్తుకథ 9-౧౯౮
కృష్ణార్పణము-సమర్పణ యోగము 10-౨౧౦
కొయ్యదుంగకాలి బూడిదయగుట 4-౬౯
కొడవలికి పదను పెట్టుట కొడవలిపూజ 15-౩౭౨
కొన్ని వస్తువులతో సన్నిహితత్వము పెంచుకొనవలె, కొన్నిటికి దూరముగానుండవలె-గురువు-తల్లి.పుష్పములు-నిప్ప 11-౨౫౧
కోరనివారికే రమదాసి 3-౪౬

కోయిల 10-౩౩౩
కోతులకన్నులు బ్రహ్మనేత్రములు 10-౩౩౦

ఖ

ఖలీఫా ఉమర్ - యుద్ధభూమి - నమాజు 6-౧౧౫
ఖాదీమాట భుజముపై వేసికొని తిరిగి అమ్ముకొనువాడు విసుగు పొందునాఁ పొందడు. ఎందుల కనిన..... 3-౫౩
ఖురాన్ షరీఫ్-భవిష్యత్తును గురించిన జ్ఞానము మనకీయకుండుట 11-౩౪౯

గ

గంగానది 10-౩౩౧
గంగాస్నానము - ఇద్దరు వ్యక్తులు వారి వారిభావనలు 3-౪౯
గాంధి-నిత్యనూత్ర యజ్ఞము 8-౧౬౯; "చరఖాను గూర్చిన ఆలోచనలను వదలి పరమాత్మ యందు లీనమగుటకు సిద్ధము కావలె"నను కొనుట 8-౧౭౫
గాడిద యరపు అశుభమను కొనుట 7-౧౪౩
గాలి 10-౩౩౨
గ్రామము ప్రక్క- శ్మశాన ముండుట వలన గ్రామము రమణీయము 15-౩౬౬
గీత మోహముమీదనే గదా ప్రవరణము 1-౧౦; నా ప్రాణ తత్త్వమే 1-౧; ఉపనిషత్తులకు ఉపనిషత్తు, ధర్మజ్ఞానమునకు నిఘంటువు 1-౪; పఠించునపుడు హరినామ స్మరణ చేయుచున్నానను భావన 9-౧౭౭; వికోపాకుగల సంబంధము 1-౧; జీవనోపకారియగు శాస్త్రము 13-౩౯౯
గీతాక్షీరములు - భగవానుడు-అర్జునుడు నిమిత్తమాత్రుడు 1-౪
గీతకు అర్జునుడు నిమిత్తమాత్రుడు-పాండురంగనికి పుండలీకుడు నిమిత్తమాత్రుడు 2-౧౭
గుంపును చెదరగొట్టుటకు కాళ్లపై తుపాకిపేల్చుట-సత్వగుణమును వశపరచుకొనుట 14-౩౪౪
గుఱ్ఱము - అరబ్బీవాడు 10-౩౩౩ నా మిత్రుడు 10-౩౩౪; సైకిలులో నేమున్నది 10-౩౩౪
గుఱ్ఱముపై కూర్చుండియు తన తలపై మూటను పెట్టుకొనుట 13-౩౧౫
గురుదక్షిణ - పువ్వు, ఆకు, పావలోళ్లు 3-౪౯
గుహ - అంధకారము - వెలుతురు ప్రవేశించుట 9-౩౦౪
గృహస్థ-విసుగుచెందిసంన్యాసము 1-౧౩

గృహస్థుడు-చూచినంతనేఎక్కడ ఏమున్నదో కనుగొనగల శక్తి 6-౧౨౩
గృహలక్ష్మి - వంటయిల్లు - యజ్ఞము 9-౧౯-౨
గోవు 10-౨౨-౩
గోపాలుడు గోక్షీరములు 17-౪౨౦

జ్ఞ

జ్ఞానదేవుడు-జ్ఞానేశ్వరి 13-౩౧౯ అంతిమసమాధి 9-౧౨౬; మరణమునుగూర్చి 2-౨౬; పూర్వజన్మలోని యలవాట్లు పట్టియాడ్చుచుండును 6-౧౩౪; మరి పండ్లకింక ఫలములేమిటని అడుగుట 2-౩౫; మరణము - ఆశ్చర్యము 8-౧౬౨
జ్ఞానాగ్ని 18-౪౬౪
జ్ఞాని-దర్శనులలో తన్ను పరీక్షించు పరమేశ్వరుని చూచును. 7-౧౫౪; కురూపుడు - సురూపుడు, రాజు, భిక్షుకుడు ... ... అన్నిటిలో పరమాత్మనుచూచుట 7-౧౫౩

చ

చంటిబిడ్డ నడుచుట - అన్నప్రాశన - తదుపరి సహజమై పోవును 5-౭౧
చండుల పక్షి - సూర్యునిసమీపించ బోవుట 6-౧౧౨
చంద్రునికృపయనగా నేమి? 8-౧౭౪
చమురు, వత్తి - ఈరెంటితో దీపము వెలుగదు... 4-౬౩
చట్టిముక్కు సుందరముగా చేయబోవుట 18-౪౫౦
"చరఖాను గూర్చిన ఆలోచనను వదలి..." గాంధి 8-౧౭౫
చాంగదేవుడు - తెల్లకాగితము - నివృత్తినాథుడు - ముక్తాబాయి జ్ఞానదేవ పాసష్టి 5-౧౦౭
చిత్తశుద్ధికి సాధనము కర్మ 3-౫౪
చిత్రకారుడు-ఒకరకపు కాగితమే ఒకరకపు కొంచెమే రకరకములైన చిత్రములు-హస్తకౌశలము 7-౧౩౬-౭
చిత్తైకాగ్రత 6: ౧౧౪-౧౧౫
చేపలు నీటిలోనే బ్రతుకగలవు పాలలో చనిపోవును 1-౧౨
చెప్పవాడు కృష్ణుడు; వినువాడు కృష్ణుడు, రచించువాడు కృష్ణుడు 1-౪
చెవులపైకూడ కావలియుంచుము కుక్క చెవులవంటి చెవులు మనకెందులకు 6-౧౨౩
చేసినమేలు వ్యర్థముగాపోదు - నీటమునిగినవానికి కట్టెపుల్లకూడ ఆధారమగును 8-౧౬౮
చైనామట్టిగోడ 17-౪౨౬

జ

జగద్రచనయొక్క రహస్యము-ఒక కాగితము-చిత్రకారుడు-ఏబది రెండక్షరములతో పలుగకము లైన భావములు - సీతారా వాయించువాడు 7-౧౩౬

జనకమహారాజు-సులభ9-౧౯౪-౫

జరిగిపోయిన విషయములను మరచుటయే హిందూముస్లిమ్ మైత్రికి ఏకైకమార్గము 11-౨౫౦

జాజలి-తులాధరుడు 3-౫౪

జిహ్వాచాపల్యములో ఆనందము .. త్యాగము, జిహ్వాను జయించుటలోనే ఆనందము 2-౨౯

జీవితమంతటిలోను ఆంత్య సమయమున స్మరణకు వచ్చిన చో ఫలము 8-౧౫౯

జీవితము - తెలుపు, నలుపు దారములతో నేయబడిన వస్త్రము వంటిది 1-3; రమణీయమెట్లు కాగలదు 9-౧౯౫; గాలిపడగకు కట్టిన దారము వలె ఈశ్వరునిచేతిలో నున్నది 8-౧౭3

జీవము - అజీవము 7-౧3౯

ఝ

"ఝినీ ఝినీ బినీ చదరియా" ఈశ్వరునికే ఈ వస్త్రమును నేయుచున్నానని - కబీరు 9-౧౯౪

ట

టాల్‌స్టాయి - ప్రాపంచిక మానవుల, మహాపురుషుల శ్రమను పోల్చుట 3-౪౬

టాల్‌స్టాయి-సిగరెట్టు నిషా విషయము 7-౧౪3

'టామీ' - మరణముమాట మరచిపోవుటకుగాను ఆటలుపాటలు 8-౧౬౨

త

తంత్రముతోపాటు మంత్రము కావలె (నూలు వడుకుపట్ల జపించవలసిన మంత్రము) 17-౪౧౯

తత్త్వజ్ఞాని - దీనములు 7-౧౪౧

తత్త్వనిష్ఠ - రాట్నము ... మాలశ్రీకాకుళం తెగుట 12-౨౬౬; బలీయమైన స్తంభము - దూదినేకు కమానుకు 12-౨౬౯

తత్ 17-౪3౪

తదర్థీయకర్మ 17-౪౧౪

తపస్సు 17-౪౧౨

తల్లి వ్రాసిన మూడు నాలుగు పంక్తుల వంకర టింకరలేఖ - మరిఒకడు వ్రాసిన కట్ట 3-౪౯

తల్లి- పిల్లల బొమ్మలాటలో భాగస్వామిని అగుట 3-౫౯; బిడ్డ

సేవ - ధ్యాంక్సు 5-ర 3; బిడ్డ సేవ - కాసల్య, రాముడు - యశోద, కృష్ణుడు - కవుల వర్ణన 9-౧౯౧; మృతి జెంది నపుడు బిడ్డకు మృత్యువు గోచ రించును 8-౧౬౪; ఇద్దరు పిల్లలు - వారి వియోగము - (సగుణ భక్తుడు - నిర్గుణ భక్తుడు ఎవ రెక్కువ) 12-౨౬౦; బిడ్డ పనిని మెచ్చుకొనుట 7-౧౪౬; పిల్లవానిని గుర్తింపజాలని కథ 2-౨౪

తల్లిపాలతో - శరీరము పోషింప బడినది; గీతా మాతయొక్క పాలతో నా హృదయము, బుద్ధి పోషింపబడుచున్నవి 1-౧

తలుపు బందులకు త్రుప్పు పట్ట కుండ నూనె వేయుట వాని పూజ 15-౩౭౨

తాటేటి ఉపమానము 2-౪3

తిలక్ - యోగసంన్యాసపరంపర 5-౯౯; గీత వ్యావహారిక జను లందరకు ఉపయోగపడునను వాదన 6-౧౧౦

త్రిపదగాయత్రి 17-౪3౨

తులాధరునికథ 3-౫౫; 9-౧౯౫

తుదిగడియ మధురమైనచో జీవిత మంతయు మధురమే 8-౧౫౯

తుకారాం 2-3౬; 3౯; 18-౪౪౫

పుండలీకుని గూర్చి 2-3౯;

ధర్మవ్యాధుని విషయమున 9-౧౯౬; "చింతాగయీసారీ ..." ఇక నాప్రయత్నము లేవియులేవు 5-౯౨-ప్రార్థన- "నరనారీ..." 7-౧౫౪

తులసి 3-౫౨

తులసీదాసు 9-౧౭౯

తెల్లఖాదీ-రంగుఖాదీ 5-౭౯

ద

దట్టమైన పొగమంచులో నున్న మనుష్యుడు...దూరములోనున్న మంచును త్రవేలితో చూపుట 14-3౪౧, 3౪౨

దరిద్రనారాయణునితో నిత్యమును మనలను కలుపుటకు మనము తీయుదారము సాయపడును 8-౧౬౯

దక్షిణ తడిపి ఈయవలెను 3-౪౯

దానము 17-౪౧౧

దుర్జనులలో తన్ను పరీక్షించు పరమేశ్వరుడు 7-౧౫౪

దూరస్థుడైన సూర్యుడు - కుంతి 10-౨౧౫

దృష్టినిబట్టియే సృష్టి-సమర్థ రామదాసు-రామాయణము - మాను మంతుడు 6-౧౨౬

దేవతలు-అమరమే రూపముగాగల వారు 5-౯2-౯౯

దేవునియెదుటికేగి కన్నీరు కార్చు భక్తులు 7-౧౪౭
దేహపంజరపు వెలుపలి గాలిని ఆత్మహింసకు సోకనిచ్చుట 2-౩౮
దేహబద్ధమైనఆత్మబయటికి వ్యాప్తమగును-జైలుగదిలోని ఖైది - జైలు ఆవరణలోనికి వచ్చుట 2-౩౦
దేహముస్త్రీముపంటిది 13-౩౦౩
దేహమునుండి ఆత్మను వేరు చేయుట - (ఏసుక్రీస్తు బలిదానము) 13-౩౧౭
దేహబుద్ధి 2-౩౨-౩౮
దేహోత్పత్తిలపృథక్కరణ 13-౩౯౦; శిక్షణ శాస్త్రములో ఉత్తమోత్తమసిద్ధాంతము 13-౩౯౪
దేహ సంబంధములు నింద్యములు-ఋనక నూకరాదులు వంద్యములు 2-౩౮
దేహాసక్తి 13-౩౯౮-౯; నిజమగు ప్రేమగాదు 2-౨౭
దైవసంపద 16-౩౮౫, ౩౮౬

ధ

ధర్మము సాధువుల కొరకే అని "నీపరిస్థితులను బట్టి నీకిది యుచితమే" యున్నట్లు సాధుపురుషులనుండి అంగీకార పత్రమును పొందగోరు ఆలోచన వదలి వేయుము ... 6-౧౧౩-3
ధర్మరాజు-కుక్క 7-౧౪౯; స్వర్గఫలత్యాగము 14-3౫౦
ధ్రువనక్షత్రము – కర్మతో వికర్మను జోడించిన మనస్సు 4-2౫
ధ్రువుడు-భగవదుపాసన 7-౧౪౮

న

"నకించిదపి చింతయేత్" మరిదేనిని గూర్చియు చింతన చేయకు" మని భగవంతుడనుచున్నాడు 6-౧౧౭
నగారా దృష్టాంతము- భగవల్లీలను తెలిసికొనుట 7-౧3౮
నది - కట్టల నడుమ బంధింపబడియుండుటలోనే స్వాతంత్ర్యము కలదు 17-౪౦౭; మీకు ఆక్సిజన్, హైడ్రోజనుల సంపుటియే 7-౧౫౧; లోతుగను, శాంతముగను ప్రవహించునపుడు వరదనీరును ఇముడ్చుకొనును - స్వధర్మము మానవుని బలమును శక్తిని ఇముడ్చుకొనును 14-3౪3
నదీ వేగేన శుధ్యతి 17-౪33
నదీ ప్రవాహము ... దుఃఖోపశమనము 6-౧౨౭

నదులను గోవులతో పోల్చుట 10-౩౩
నరసీమెహతా - నిద్ర 18-౪౬౩; హుండీకిధనమిచ్చుట 9-౧౯౬
నరుడు - నారాయణుడు 6-౧౩౧
నాగపూజ-వినోబాతల్లి 10-౩౨౭
నామదేవుడు - తీర్థయాత్రకై భగవంతుని అనుమతి కోరుట 7-౧౪౭; భగవంతునికి పాలు త్రాగించుట 13-౩౧౩
నాటిన గింజలు - పాతవేసిన గింజలు 9-౨౦౭
నారికేళము - బొండము - ఆకలి గొన్న నేను 9-౧౯౦
నాదబ్రహ్మకు పాడి వినిపించగల కళ సిద్ధింపకుండుటలో శోభ లేదు 2-౩౧
నాస్తికుడగుటకు - నిరాశచెందిన ... 8-౧౭౨
నావక్రింద నీరుండిన ... జీవిత నౌకకు అడుగున భక్తియను నీరున్న... 15-౩౫౯
నావకు చుక్కాని, తెడ్లు-రెండును కావలెను — ఆత్మను వేరు చేయుటకు వివేక నిగ్రహములు రెండును అవసరము 14-౩౨౨
నాలుక-గరిటె...రసజ్ఞానముండవలసినదే — సుఖదుఃఖములు మాత్రము ఉండరాదు 2-౭౭
న్యాయమూర్తి రానడే 8-౧౭౪
న్యాయాధికారి కథ 1-౯
నిత్యసూత్ర యజ్ఞము - విశిష్టత - గాంధిమహాత్ముడు 8-౧౭౯
నిద్ర 14-౩౨౯; రోగికి కాసంత పట్టిన...14-౩౪౬ ధ్యానమే 14-౩౨౯
నిద్రించుచున్న మనుష్యుడు - తలక్రిందకట్టి 13-౩౦౭
నిష్కామ ప్రాప్తి - పరధర్మము నుండి విముక్తి 4-౬౩
నిష్క్రియావస్థ 18-౪౬౪
నిర్ణయము లో స్వావలంబనమున్నది 12-౨౬౨
నీరు-పాలు-చేపలు 1-౧౭
నూలువడుకు సమయమున జపించవలసిన మంత్రము 17-౪౧౨
నూనె, వత్తి.....జ్యోతితోడైన ప్రకాశము - కర్మతో వికర్మ కలిసిన నిష్కామత్వము 4-౬౨
నెమలి 10-౩౧౧
నెపోలియన్ గణితశాస్త్రము - యుద్ధభూమి 6-౧౧౫
నేను శవమను గాను-శివుడను 18-౪౬౫
"నేను ఎవరికిని కుశల వార్తలు తెలిసికొనుటకు విశేషించి లేఖలు వ్రాయను" వినోబా 12-౨౭౩

ప

పండిన పండు- పెంక, శుష్కించిన శరీరము - నిష్ఫగల ఆత్మ 6-౧౧౬
పంచ్రెండవ అధ్యాయము - అమృతధార 12-౨౫౬
పంచ్రెండేండ్లకొకసారిప్రాయశ్చిత్తము, తపశ్చర్య అధ్యయనము 2-౨౪
పచ్చని ప్రకృతి - పిల్లల విశేచనములు 6-౧౩౦
పరమార్థమునుగూర్చిన ఆపోహలు 3-౬౦
పరమేశ్వరుడు –
మొదటిదశ - ఉపద్రష్ట 13-౩౦౯
రెండవదశ - అనుమంత ౩౧౦
మూడవదశ - భర్త ౩౧౧
నాల్గవదశ - భోక్త ౩౧౪
అయిదవదశ - మహేశ్వరుడు ౩౧౪
పరమేశ్వరుడు - ధర్మసంరక్షణకుగాని జనసంఖ్యనిలబెట్టుటకాదు 16-౪౦౩; ఒక్కడే నిద్రోపియైనవాడు 1-౨
పరమేశ్వరుని శుభశక్తి జలజల ప్రవహించునది ద్వారా ప్రకటితమగును 6-౧౨౭
పరశురాముడు- అహింసాప్రయోగము 16-౩౯౯
పర్వతము రాకున్న మనమ్మదు దానిని సమీపించుట 6-౧౧౧
పర్వతముమీద పడ్డనీరు - అన్ని దిశలను ప్రవహించిన లాభము లేదు 8-౧౭౦. ఒకదిశకే ప్రవహించిన దేశమునకు లాభము 14-౩౩౭
పర్వతయాత్రికుడు - మోహమును జయించి,శిఖరముచేరునుర్-౧౭౧
పరిశీలన యను కత్తెర 17-౪౨౩
పరులనుపీడింపకుండ స్వప్రయోజనముచే ధనికుడగువాడు అనవసరపు ఖర్చులు చేయడు - ఆత్మజ్ఞాన శక్తిని ముద్ద విషయములలో ఖర్చుపెట్టరాదు 6-౧౧౭-౮
పక్షి - ఎవరు ఎప్పుడు చంపుదురో అనుభవము 6-౧౨౭
పశులస్వాతంత్ర్యమునుగూర్చి కవుల గానము 6-౧౨౬
పాణిని - కోడిమూత 5-౮౫; వ్యాక్రమము 10-౨౨౬
పాము మాలిన్యము సహింపదు - అపరిశుద్ధుడైన బ్రాహ్మణుడు 10-౨౨౭
పాములు - సెయింట్ ఫ్రాన్సిస్ 10-౨౨౮

పాపపుణ్యములు విస్మరించుటకు మరణమే ఉపాయము 11-౩౫౦
పాత్రలను శుభ్రపరుచుట పాత్ర భూజ 15-౩౭౨
పిల్లలు - తమంత తాము బొమ్మలు గీయుటలోగల ఆనందము 1-౧౪; ఏకాగ్రత ఇంటిలో చదువు చెప్పుట 6-౧౧౪
పిల్లవాడు - నడుచుట, అన్నము తినుట, ఈదుట - అలవాటు మీద సమాజములు 5-౯౧; పుట్టుక-బాజాను వాయించుట 7-౧౪౩; కాలికిదెబ్బ-సంరక్షకుని ఆవేదన 13-౩౯౩; తప్పుచేయుట- చెంపదెబ్బతో పోవునా 13-౩౯౪
పిల్లపిపుమీద తల్లి చేతితో నిమురుటలోగల ప్రభావము ౪-౬౯
పిల్లవాడు కత్తెరతో వస్త్రమును కత్తిరించినట్లు దేవుడు మనము కత్తెరతో మనము విశ్వాత్మయను వస్త్రమును కత్తిరించుట 2-౩౫
పిల్లవాడు ఏడ్చిన ... మనశ్శాంతి యొక్క నిజమైన విలువ తెలుట 5-౨౭
పుండలీకుడు-ఇటికరాయి 2-౩౭
పృథ్విపైగల మానవజాతి యంతయు అంతరించిన భగవంతుడు తిరిగి మానవజాతిని ఏ మంగళగ్రహములోనో పుట్టింపగలడు 16-౪౦౪
పెదమాధవరావు పీప్సా అంత్యసమయము 9-౧౭౬
పెద్దపులి శరీరముమీద పనితనము చూపించిన భగవంతుడు మన శరీరముమీద మాత్రము కాలయము నన్ను చూపించి యుండెడి వాడు కాడా! 13-౩౦౦
పేడా, బర్ఫీ జీర్ణములు కావు - అచ్చమయినపాలు రుచింపవు 10-౩౧౫
పొగాకు - సంతోషము 7-౧౪౩
పోట్ట సంస్థ - నాలుక సంస్థ-నేనే రెండు సంస్థలకు అధిపతిని 17-౪౭౯
ప్రజాపతి "ద" 2-౧౯
ప్రకటన పత్రిక - ఇది చదువవలదు 5-౧౦౫
ప్రకృత కాలపు పుస్తక జ్ఞానము 4-౭౩
ప్రపత్తియోగము 10-౩౧౦
ప్రభాతే కరదర్శనమ్ 15-౩౭౭
ప్రసన్నుడయిన పరమేశ్వరుడు కర్మపై ప్రేమముద్రను వేసిన సౌందర్య మున్నన్నమగును 17-౪౧౭
ప్రాఫెసరు - గానుగయెద్దు శాస్త్రజ్ఞుడు 9-౩౧౫

ఫ

ఫకీరు - గ్రుచ్చుకొనిన బాణము 6-౧౧౫
ఫలత్యాగమునగల్గు ఫలితార్థము 18-౪౫౪
ఫలత్యాగమును ఒరపిడి రాయి 18-౪౪౦
ఫుట్ బాల్ - రజస్తమోగుణములు 14-౩౩౩
ఫ్రెంచి దార్శనికుడు పాస్కల్ - అతని గ్రంథము - మృత్యువుపై సమీక్ష 8-౧౩౧

బ

బంగారుపెట్టెకథ ౫-౨౨
బంధింపబడిన అవిధి ౫-౨౯
బడబడ మాటలాడుట- కోపము వచ్చినపుడు మౌనముగా నుండుట ౫-౯౧
బర్ఫీముక్క- కర్మ, భక్తి, జ్ఞానము ౧౬-౩౨౦
బరోడాగ్రంథాలయము- ఫ్రెంచి పుస్తకము ౪-౭౩
బాలకృష్ణుని చిన్నకోటిలో విశ్వమంతయు కనబడినది ... నీవు తీయు దారములో కూడ విశాల విశ్వము గోచరించును 17-౪౧౨
బాల్యావస్థ - పలకమీద వ్రాతవలె 8-౧౫౬
భాలుని మెచ్చుకొనుట, నిందించుట దేవదృష్టితోనే 13-౨౯౩
భావ్య కర్మల పారిశుధ్యమును మనః పారిశుధ్యమునుబట్టియు, మనః పారిశుధ్యమును భావ్య కర్మలనుబట్టియు పరీక్షించుకొనవలె 17-౪౧౭-౨
బింబ ప్రతిబింబ న్యాయము - వ్యక్తి-సమాజము 17-౪౩౩-౪
బిచ్చగాడు- విశ్వాత్మల్లి 9-౧౨౨
బిడ్డలు విద్యాభ్యాసము 10-౨౧౩
బిడ్డకు స్నానము - దేవునికిరుద్రాభిషేకము 9-౧౯౧
బుద్ధితో తెలిసికొనుట జ్ఞానము కాదు - శుద్ధ నోటిలో పెట్టుకొనుట భోజనము చేయుట కాదు 13-౩౧౨
బెత్తెడు లంగోటిలో సంసారము 5-౭౫
బొంబాయికి టిక్కట్టు కొని వైకుంఠానికి టిక్కట్టు - పుట్టుకతోనే మృత్యువునకు టిక్కట్టు 8-౧౩౧-౨
బోర్డింగులోని విద్యార్థులను లేపుట 9-౨౦౧

భ

భక్తి నీరువంటిది 7-౧౩౯
భక్తి, జ్ఞాన, కర్మలు - ముక్కాలి పీట 15-౩౫౮
భక్తి వృక్షము యొక్క శాఖోప శాఖలెవ్వి 7-౧౪౫-౬
భగవంతుని చేతిలోని ముగళి యగుట లోగల కష్టము 11-౩౫౪
భగవంతుని పాదములకు పాదరక్ష లగుట లోగల కష్టము 11-౩౫౪
భగవంతుని స్మరించు అచ్చాయి కుడుకూడ విశ్వవంద్యుడగును 7-౧౪౯
భగవంతుని పూజించి అతనికి సమర్పించిన నైవేద్యమును తిరిగి ప్రసాదముగ తీసికొందుము. ఈ ప్రసాదము అపూజయొక్క ఫలమా 3-౫౯
భరతభక్తి (నిర్ణయము) 12-౩౭౬
భర్తయైన పరమేశ్వరుడు 13-౬౧3
భారత భూమి బ్రహ్మవిద్యకు పుట్టినిల్లు ౬-౩౫
భారతీయులకు (ఇప్పటి) మృత్యువనిన ఒక పెను భూతము 7-౧౫౩
భిల్లుడైన వాల్మీకి-నారదుడు 9-౧౯౭
భూతకాల విస్మృతి - దుర్జనుడు సజ్జనుడుగా మారి, నాయొదుటికివచ్చినప్పుడు..... 11-౩౫౦
భూమిమీదినావ-"నీటిమీదినావ-జీవితమను నావకు అడుగునభక్తియను నీరుండవలె 15-౩౫౯
భేదబుద్ధి 17-౪౩౫-౬
భోక్తయగు పరమేశ్వరుడు 13-3౧౪

మ

మంగలి సోనా కథ 3-౫౫
మందబుద్ధియగు విద్యార్థి 8-౧౬౫
మచ్చీంద్రనాథుడు - గోరక్ నాథుడు - బాలకుని శుభ్ర పరుచుట 18-౪౪౫
మనము మృన్మయులము కాము - చిన్మయులము 1-౧౪
మనము మరణించలేదు - కనుక బ్రతికియున్నట్లు భావించుకొనుచున్నారము ... ఉత్సాహము నకు కరవు వచ్చినది 9-౧౯౫
మనుష్యుని బుద్ధి ... డొల్లగానే ఎట్లున్నది? మహాత్ముల జీవిత గ్రంథమే పఠింపదగినది 4-౭౪.
మరకత మాణిక్యములు పారవేయదగినవే 7-౧౫౦

మరణము- కూలియిచ్చి వీడ్పించుట 2-౩౬; పట్ల నిర్లక్ష్యము జ్ఞానదేవుని ఆశ్చర్యము 8-౧౬౨ సమయము పవిత్ర మగుటకు ఏమిచేయవలె? 6-౧౩౦ మరణ శయ్యపై నున్న తల్లి - పంకు టింకర కాలిబాట - మార్గ మును శత్రువుగా భావించు కుమారుడు మార్గమును మిత్రు డుగా భావించుకుమారుడు 12-౨౬౪
మలమూత్ర నాళికలు ప్రపహించు తరీకమా నీవు ! 2-౨౪
మహాత్ములు జీవిత్రగంథములోని "మా నవ్యాఖ్యానము"వినిచిన్న సంశయుండవగుము 4-౭౪
మహాభారతరామాయణములు మన రాష్ట్రీయ గ్రంథములు 1-౨
మహాభారత మొక బంగారుగని 1-3
మహాశక్తిపై విశ్వాసముంచి నిద్ర పోవు సింహము 13-౩౦౭
"మా తే సంగోఽస్త్వకర్మణి" 2-౪౦
మానవుడు - మాంసభక్షణ - విమర్శ 16-౩౯౪ నేటి వరకును...వానరునివలె కనబడు చున్నాడు ౪-౭3
మానవుల యిండ్లకు అనేక ద్వారములు పెట్టుకొందురు కాని పాపము లోనికిరాకుండ వారు పెట్టుకొనునది ఒక ద్వారమే 16-3౯౪
మానసిక భోజనము -నిద్ర 14-3౨౭
మామిడిచెట్టు తనఫలములను తానే తినను - భోగముకంటె త్యాగమే మధురము 14-3౫౦
మామిడిపండు తీపి కేవలము దానిలోనే లేదు. 6-౧3౨
మిడుతల దండువలె ఆనందమునకు అంగలార్చు ప్రజలు 7-౧౪౨
మిణుగురుపురుగు - గగ్గను 14-3౪౭
మితజీవనము 6-౧౨3
మిథ్యాచారుడగు మతాధికారి - పై వేమన 18-౪౪౯
ముందెప్పుడో పగ మనున్న దుండ గప్పుడే పగులనను భయము 2-౨౭
ముక్యాలహారము- హనుమంతుడు 6-౧33
ముసలమ్మ - నేతిగిన్నె - విన్యా 8-౧౬౬
మూర్తిపూజలోని రహస్యము 3-౪౭;11-౨౪౪;12-౨౭౧
మృత్యుభయము 2-౨౬
మృత్యువనినదీర్ఘనిద్ర 6-౧33-౪ ఇప్పటి భారతీయులకొక పెను భూతము 7-౧౫౨

మృత్యువు ఎట్టయెదుట కనబడు చుండగా మా న వు డు జేని బలము చూచుకొని పా ప ము చేయునుఁ? 8-౧౬౧
మృత్యువుపేరు భో జ న సమయ మున నెత్తుట 8-౧౬౧
మృత్యువును ముఖాముఖిని చూడ జాలము . ...అయినను చివర కది మన గొంతు పిసికి తీరును 8-౧౬౫
మృత్యువునకు టి కె ట్టు పుట్టుక తో నే 8-౧౬౧-౨
మృత్యుదర్శనమగుచున్నను టామా జీవించుట 8-౧౬౨
మృత్యుపాఠము - సో క్ర టీ సు ఉదాహారణము 8-౧౬౪
మె ట్రి క్ విద్యార్థి-భవిష్యత్తు 8-౧౬3
మేక బ్రతికి యున్నపుడు "మే, మే" చచ్చినతరువాత "తూ, తూ" 18-౪౬౬
మేకయొక్క జీవితము మేకయై యుండుటలోనే యున్నది 18-౪౫౨
మొండెములువేరు - తలలువేరు 14-3౨౭
మోక్షము పశువులకుకూడ 9-౧౨౪

య

యంత్రము వేగముగా తిరుగుచు తిరుగనట్లు క న బ డు ట - సంన్యాసిస్థితి - మహాపీరుడు - బుద్ధుడు - నివృత్తి నాథుడు 5-౧౦౨-3
యజ్ఞము - అర్థము 17-౪౦౯; సృష్టికి జరుగు హానిని తొల గించుటకు జరుగు సిర్మాణము 17-౪౧౧ - ల క్ష ణ ము లు 17-౪౧౬ - మాంసభక్షణ 16-3౯౫
యజ్ఞాగ్ని - 9-౧౯౨
యోగము అనగా కళ 2-3౧
యోగ సంన్యాస పరంపర-తిలక్ 5-౯౯

ర

రజస్తమోగుణములు - ఫుట్ బాల్ వలె మానవుడు 14-333; నశింపజేయ దగినవి 15-3౫౫
రజస్తమోగుణముల నాశనము - సత్వగుణమును గాయపరచుట లాంతరు గ్లాసు ఉపమానము 14-3౪౪
రజోగుణ ప్రధానుని ప ను లన్నియు చంచలములు-చిన్న పిల్లలు గోడుమలు పాతిపెట్టుట సన్మాన పత్రములు పొందవలె నని లాలసపడుట 14-333
రజోగుణము - అపారకర్మాసక్తి 14-33౪
రాజమార్గము 9-౧౨౧
రాజయోగము 9-౧౨౨

రాట్నమునకు నూలు వేయుట రాట్నపు పూజ 15-౩౭౧
రాట్నమునకు నూలు వేసినట్లు ఈ పొట్టకింత బొగ్గువేయవలె 2-౨౭
రామ వానరులమైత్రి 10-౨౩౦
రామాయణము – బల్లి-వి నో బా 7-౧౪౫; మధురమైన నీతి కావ్యము 1-౨
రామనామ జపము ఎన్నిసార్లు చేయుదురో తెలుపుడని వినోబా ప్రశ్నింపబడుట – రామనామము లెక్కపెట్టునది కాదు 5-౮౩
రామతీర్థుడు – సంస్కృతాభ్యాసము 7-౧౪౮
రాముడు – గాయపడిన కోతులు 4-౬౯; సరళాక్షరము వంటివాడు. రావణుడు సంయుక్తాక్షరమువంటివాడు 10-౨౧౪; వనవాసము – లక్ష్మణునివారించుట – లక్ష్మణుని జవాబు 12-౨౭౨
రాముని విరోధిభక్తుడు రావణుడు 10-౨౩౭
రాతికెదురుగరాయి 4-౬౪
రాయి – పందొమ్మిది దెబ్బలకు పగులక ఇరువదియవ దెబ్బకు పగిలిన, వెనుకటిదెబ్బలువ్యర్థమైనవా? ౪-౧౭౨
రాయియే పరమేశ్వరునిచిహ్నము గా నుండదగినది 12-౨౮౪
రాత్రివేళ దేవాలయములో భగవంతునినిద్రపుచ్చుట-శంకాశీలుని ప్రశ్న – జవాబు 9-౨౦౦
రావణకుంభకర్ణ విభీషణులు – రజస్తమస్సత్త్వ గుణములు 15-౩౫౫
రాక్షసుడు – భానిస – బెదరింపు 13-౩౦౪
రాక్షసులొకప్పుడు అంగుష్ఠమాత్రులు, మరియొకప్పుడు మహాకాయులు అయినట్లీ సంసారము కూడ తన రూపములను మార్చుచుండును 5-౭౬
రిడ్లే-లాటిమర్ త్యాగమూర్తులు 13-౩౦౫
రుక్మిణీమాత-తులసీదళము 3-౪౯
రుద్రాభిషేకము 8-౧౭౦
రుద్రావతారములు ఆకలిగొన్నవారే 10-౨౧౨
రొట్టె – నమస్కారము 7-౧౫౧
రోగి – దయాభావములేని సేవకుడు-ఆసేవ యిద్దరికిని బరువె 7-౧౪౦; 4-౬౭-౨ నియతముగా మందు త్రాగుట-ఒక రోజున సే మందంతయు త్రాగుట 8-౧౬౯

రేఖ-బిందువు-సాలగ్రామము 5-౯౫
రైతు-బాటసారి-దైవ స్వరూపము 9-౧౯౬

ల

లంగోటీ మమకారమునకు సర్వస్వము-కరెన్సీనోటులో వేయి రూపాయలు ఇమిడియున్నట్లే 5-౭౫
లక్ష్మణుడు - జెండా ఉదాహరణ 12-౨౭౪
లక్ష్మిని కూడబెట్టినటులనే క్షణమైన పోనీయక విద్యోపాసన 8-౧౬౭-౮
లక్ష్మీస్వయంవరము 3-౪౫
లోకసేవ... పరిశుద్ధమయిన భావన లేకపోవుట.....సేవ భయానక మగుట 4-౬౫
"లోతుగా నాటుము, కాని తడిపి నాటుము"... మణికట్టు లావు వెన్ను-కర్మ ఉత్కృష్టముగా నుండవలె - ఈశ్వర పరాయణత అనుతడి 3-౬౦

వ

వంగదేశస్థులు - చేపలు తినుట 17-౪౭౦
వంటపని-ప్రభుసేవ చేయుచున్నానను భావన 15-౩౫౭
వర్ణధర్మము 18-౪౫౩
వర్ష్మవర్తు - ఇంద్రధనుస్సు 7-౧౫౧
వర్తకుని స్వధర్మము 4-౬౭
వర్ష్మము- విశాలమైన అభిషేకపాత్ర 15-౩౬౭
వస్తు ప్రదర్శనశాల - రంగుఖాదిలోన ప్రవేశించి ఆకర్షింప బడుట 7-౧౪౯
వ్యక్తి - సమాజము 17-౪౭౬
వ్యక్తినిష్ఠ - సంఘనిష్ఠ - తత్త్వనిష్ఠ (శరణత్రయము) 12-౨౭౦
వ్యక్తినిష్ఠపోయితత్త్వనిష్ఠ యేర్పడవలెను. ఉ॥ రాట్నము - మాలత్రాడు తెగుట 12-౨౬౯
వ్యక్తిపోయినను తత్త్వమును బలిష్ఠమయిన స్తంభమువోల సంస్థ నిలువగలిగి యుండవలె. ఉ॥ దూదిసేకు కమాను 12-౨౬౯
వామదేవుని కథ 18-౪౬౧
వాల్మీకి ఆశ్రమము - గడ్డపుపులి - ఋషిబాలకులు 16-౩౯౬
వాసనా విమోచనయే మోక్షము 2-౪౦
వ్యాఘ్రము - పాణిని 10-౨౭౬
వ్యాపారస్థుడు - లాభనష్టములు తేల్చుకొనుట 8-౧౫౭
వ్యావహారికమును పరిశుద్ధపరచుటే పరమార్థము..... ఇందులకు ఏకాగ్రతఅవసరము 6-౧౧౪
వికర్మ 4-౬౩-౪; నిష్పరవ్య;

4-౬౮
కర్మయోగమునకు తాళ్ళపుచెవి 5-౮౩
వినోబా - సినిమా - గోనెపట్టా 7-౧౪౧; వైకం సత్యాగ్రహ యాత్ర- కాలడీగ్రామస్మరణ- శంకరాచార్యుల వలన కలిగిన మహోపకారము 12-౩౮౩; శ్మశానములో మేకు పాతుట 9-౩౦౪
"వివేక్ కేసాథ్ వైరాగ్యకాబల్" తుకారామ్ 14-౩౩౩
విశ్వమంతయు వ్యాపించిన పరమేశ్వరుడే - చిన్నమూర్తిలో కూడ - అమృతప్రబోట్టు- చిన్న ఫొటో-పెద్ద ఫొటో 11-౨౪౩
"వృక్షమునకు ఫలము పండు. మరి ఫలమునకింకను ఫలమేమిటి?" అని జ్ఞానదేవుని ప్రశ్న 2-౩౫
వెన్నంటివచ్చు మృత్యువు - లేడి స్థితి 8-౧౬౪
వేదములు 15 - ౩౭౯
వేదవృక్షమునకు గీత యను దివ్య మధురఫలము 9-౧౭౯
వేదము - నారికేళము - ఆకటితో నున్న మానవుడు..... హరి నామమే వేదముల సారము 9-౧౯౦
వైదిక విశ్వాత్మభావము - ఋషి యవలు, నువ్వులు, ఇమ్మని ప్రార్థించుట 18-౪౬౩
వైరాగ్యము విధ్వంసకారి-అభ్యాసము నిర్మాణకారి 6-౧౩౩

శ

శంకరాచార్యుడు - తన భాష్యములో-సర్వార్థసారము 11-౩౫౫
శబరి 9-౧౯౧
శరణత్రయము 12-౩౭౦
శరీరమను బరువు ఆత్మను క్రిందికి లాగుచుండును 14-౩౩౧
శరీరమునకు నీయవలసిన బాడుగ ... ఆహారము 2-౨౭
శరీరమువు నీవు కాదు - ఆత్మవు నీవు 13-౩౦౩
శరీరపు తూకమును పెంచుటకు ప్రయత్నము - గోడకుకొట్టిన పిడకలవలె 18-౨౯౯
శరీరమను ఈ ద్రొవ్వువత్తిని కాల్చివేసి తత్త్వజ్యోతినిప్రజ్వలింపజేయుటయే మాపని 13-౩౦౫
"శరీర శ్రమలో కాలమెందులకు వృథాపుచ్చవలె" అను సందేహము - "వృథాగా నిద్రయెందులకుపోవలె? భోజనము చేయుటలో సమయ మెందులకు పాడుచేసికొనవలె?" 14-౩౭౭
'శాంతాకారం భుజగశయనం' వేయిపడగలశేషునిపై పరుండి కూడ పరమేశ్వరుడుశాంతుడే 4-౭౫

శివలింగము- తెంపులేని అభిషేకము మానసికచింతనధార 4-౬౪
శివునికి మెల్లమెల్లగా అభిషేకము చేయవలె. ... రెండుబొక్కెనలు ఒకసారియే ఏల క్రుమ్మరించి రాదు? 8-౧౭౦
శిష్యులు హరిమూర్తులు. గురువు భగవత్స్వరూపుడు. 9-౨౦౨
శుక - జనకుల సంభాషణ 5-౯౯-౧౦౦; శుకుడు-పంచ దార బొమ్మలు భాగవతము వినిపించుట 5-౧౦౦-౧
శునక సూకరాదులు వంద్యములని, దేహసంబంధములు నింద్యములని మహాత్ములు చెప్పుదురు, 2-౨౮
శుక్ల కృష్ణగతి 8-౧౭౩
శూన్యాగ్రత-అనేకాగ్రత 6-౧౧౯

స

సంన్యాసము ఆకస్మికముగ వచ్చునది గాదు 18-౪౫౭
సంన్యాసముయొక్క రెండురూపములు ... మానవుని బుద్ధియు భావనాశక్తియు ఎగిరి యందుకొన్న మహోన్నత శిఖరము ఈ సంన్యాసకల్పనయే! నేటి వరకు మరెవ్వరు ఈయెత్తున కెగురలేక పోయిరి 5-౯౩
సంన్యాసి-గొల్లెపు ధ్వని 5-౭౯
సంసారమనెడు సముద్రమును దానికి దూరముగా నుండి దర్శించుటలోనే ఆనందమున్నది 16-౪౦౪-౫
సంసారి, కర్మయోగి - ఇరువురి పనులును ఒకరకముగనే కనిపించును కాని భావనలు భిన్నములుగనుండును 3-౫౧-౫౭
సంస్కార సంచయమే జీవితము 8-౧౫౫-౧౫౮
సంస్కార ధార నిరంతరముగా పడుచుండవలెను - శివునిపై అభిషేకమువలె 8-౧౬౯;౭౦
సంస్కారములు - కూడని మాట ఒక్కటి పలికినను కుసంస్కారము వచ్చిపడినదన్నమాట - పని ఊలియై జీవితమను శిలకు ఆకృతిదిద్దును-8-౧౬౮ -లక్ష్మిని కూడబెట్టినటులనే, ఒక్కతృణమైనను వ్యర్థముగ పోనీయక విద్యోపార్జనకు పూనుకొనవలె 8-౧౬౭-౮- అత్యుత్తమములైనవిఎట్టుకలుగుననివిచారణచేయవలె. కాని ఈచింత యెవరికున్నది? అదిలేకపోగా 8-౧౬౫
సంస్కారములను సంపద జీవిత మనువ్యాపారము 8-౧౫౭
సకామభక్తి 7-౧౪౬

సగుణనిర్గుణములు రెంటిరూపమును ఒకటే 12-౨౮౩
సగుణపూజ... లోక కల్యాణము నకు విరుద్ధము కాకుండుటయే 12-౨౬౬
సగుణభక్తి – లక్ష్మణుని ఉదాహరణ 12-౨౭౨-౩
సగుణోద్ధర్తుడు – నిర్గుణోద్ధర్తుడు 12-౨౬౩
సగుణములో అన్ని యింద్రియములకును పనియున్నది 5-౧౦౪; సత్ 17-౪౩౩
సత్యగుణము – లాంతరు – గ్లాసు వెలుతురువలన కన్నులు మిరుమిట్లు గొనకుండ కాగితము అడ్డుపెట్టుట 14-౩౪౪-ఇంటి మానిసిగామారవలె 14-౩౪౫
సత్యమైన విషయమును సమర్థించుటకు నెక్కువయుక్తిలోపము లేదు 13-౨౮౪
సద్భావనలు అను రెక్కలను విఱిచివేసికొనకుము 6-౧౧౨
సనాతన శబ్దములకు క్రొత్త యర్థములను కల్పించుట భావవిప్లవమునకు అహింసాత్మక సాధనము 2-౧౪
సమగ్రతాయోగము 12-౨౫౯
సమదృష్టియే శుద్ధదృష్టి– శుద్ధదృష్టి కలుగనిచో ఏకాగ్రతరాదేరదు 6-౧౩౫
సమర్థ రామదాసు– హనుమంతుడు 6-౧౩౬; బాలకునితో ఆడుకొనుట 10-౨౧౪
సమర్పణ యోగము – కృష్ణార్పణ యోగము 10-౨౧౧
సమాజము వాడుమారి పెరిగినచో ప్రజలు ఒకరినొకరు హత్య చేయ నారంభింతురు 16-౪౦౩
సముద్రగర్జన – సాత్త్వికాహారము 6-౧౭౯
సముద్రములో మునిగిపోవు వానికి చేజిక్కిన వంకరటింకర గొయ్యముక్క 14-౩౪౭
సరళాక్షరములు – సంయుక్తాక్షరములు – రాముడు – రావణుడు 10-౨౧౩; ౨౧౪
సహజ ధర్మము 5-౮౫
సహజ ప్రాప్తమైనసేవ 14-౩౪౭
"సాంఖ్యబుద్ధి"యను శబ్దము నకర్థము జీవితముయొక్క మూలభూత సిద్ధాంతములనెరుంగుటయని నాభావము 2-౧౪
సాంఖ్యబుద్ధి 2-౧౪
సాతత్యయోగము 10-౨౧౦
సాతత్య శిక్షణ 12-౨౫౪
సాత్వికకర్మలు చేయుటలో వెనుక ముందాడుట అత్మను సంకుచితపరుచుకొనుటయే 18-౪౪౩

సాధకులొక ప్రత్యేక జాతి. గృహస్థులొక ప్రత్యేకజాతి అని గీత ఒప్పుకొనదు 6-౧౧౦
సాధువు-ఇరువురు గృహస్థులు - మోక్షప్రాప్తికి మార్గములు 2-౩౮
సాధకుడు-తుదిమెట్టు 18-౪౬౦
సాధన తుదిమెట్టు చేరుటకు ... 18-౪౫౮
"సాలగ్రామములో పరమేశ్వరుడున్నాడని భావన చేయుడు' అని భక్తిశాస్త్రమనును 5-౯౬; ౯౭
స్వార్థమును పరమార్థమును వేరు చేయుట నేలయు నింగియు కలిసికొన్నట్లు తోచు తావున హద్దులు పెట్టి ... 17-౪౩౬
సింహము-బరోడాలో నాయను భవము 10-౩౩౫
సింహము-ఆంధ్రొకిల్సు 10-౩౩౫
సుధన్వుడు - సలసలకాగు నూనె పాత్ర 15-౩౫౯
సూత్రయజ్ఞము - విధియుక్తమైన అంతరిక సహయోగము 17-౪౧౬; నిత్యమును ఎందులకు జరుపవలెనో చెనికి చిమ్మాము 8-౧౬౯
సూర్యుని కృపయనసేమి 8-౧౭౪
సూర్యుడు 5-౯౩; 10-౩౩౦; అంధకారము 5-౮౪; జ్ఞానులకు ఆచార్యుడు 17-౪౦౭
సమ్మాన పత్రము - జవాబు; 14-౩౪౭
సూర్యుడు మండుచుండుట - మన శరీరములకు వలయు డిగ్రీల ఉష్ణము 17-౪౩
సూర్యకాంతి - అంధకారము పోవుట-నిషిద్ధకామ్య కర్మల గతికూడ 18-౪౪౦; ౪౪౧
సూర్యుని రెండు స్థితులు 5-౯౦
సూర్యనమస్కారములు - ఉపాసన కొరకు-వ్యాయామ ఫలము కలిగియే తీరును ౫-౨౧౦
సూర్యుని దర్శనమువలన ప్రాపంచిక వ్యవహారములు ప్రారంభమగును 5-౯౩
సృష్టి అద్దమువంటిది 9-౧౯౮
సృష్టియొక్కరూపము నదీప్రవాహము ... ఈ రూప మనునది చలనమే లేకపోయిన మరుగుంటయగును 15-౩౬౫
సృష్టియొక్కఅర్థమంతయు పంచేంద్రియముల కెట్లు తెలియును 7-౧౪౩
సేవకుడు (దయాభావములేని) రోగి... అహంకారము చిరచిరలాడుట 4-౬౭-౮
సైద్యములో హింస సైద్యము చేయరాదనుట 18-౪౪౩

సేవకుడైన నూర్యనారాయణుడు - నిద్రించు యజమానుడు 13-౩౧౨
సేవచేసి అలసిపోయిన సాధు జనులనిద్ర యోగమే ! 14-౩౨౯
సోక్రటీసు - అంత్యక్రియలెట్లు జరుపవలెనను ప్రశ్న 13-౩౦౬
సోక్రటీసు-చట్టముక్కు 14-౩౪౮
సోడా, సబ్బు, కుంకుడుకాయలు, జపము, తపము, ధ్యానము వంటివి భక్తి నీరు వంటిది 7-౦౩౯
సోమరితనము - దానివలన కలుగు నష్టములు - దానిని పోగొట్టు కొనుటకు ఉపాయము 14-౩౨౯
స్వధర్మము- కామధేనువు 2-౩౦
స్వధర్మమును తల్లితో పోల్చుట 2-౩౧
స్వధర్మాచరణ ... ఆత్మపరీక్షణ ...చిత్తమాలిన్యమును కడిగి పారవేయుట 4-౬౩
స్వధర్మమును తప్పించుకొని తిరుగుట తన్నుదానుకాదనుకొను ఆత్మఘాతుక కృత్యమువంటిది 2-౩౧
స్వయంతృప్తుడు 3-౫౭
స్వాభావికముగా జరుగుపనులలో అహంకారము పుట్టదు. హరిద్వారమునొద్ద గంగలో వేసిన గడ్డిపోచ కలకత్తా చేరుట; ఊపిరి పీల్చుట 14-౩౪౬
స్థితప్రజ్ఞుడు - ఇంద్రియములనెడి యెద్దులతో కర్మయోగమను క్షేత్రమును దున్నును 2-౪౨
స్థితప్రజ్ఞునికి ఉదాహరణముగా పుండరీకుని మూర్తి 2-౪౪
స్థితప్రజ్ఞలక్షణములు 2-౪౨; ౪౪
స్త్రీలకు వేదాధికారమున్నదా ? లేదా ? 9-౧౨౪-౨౫
స్త్రీలు-వ్రతములు 7-౧౪౭
"స్థూలమూర్ఖకోతజోనహీం" ఇటువంటి వ్యర్థప్రలాపములు కట్టిపెట్టు 6-౧౧౨

హ

హరికథలు, పురాణములు వినబోయిన-నిద్ర; నిద్రపోవలెనని - ఆలోచనలు 6-౧౧౯
హిందూస్థాన మనగా గాంధి, రవీంద్రనాథుడు మొదలగువారు 17-౪౨౭
హిమాలయ పర్వతమును చూడుమని మిత్రుడు వినోబాను కోరుట 6-౧౨౨
హృదయ మార్దవములోపించిన... స్వధర్మాచరణము నుండి నిష్కామత్వమను పుష్పములను,